KUMAR BOOKS

# తెలుగు తాత్త్వికులు

## (హిందూ - బౌద్ధ - జైనులు)




డా|| కోటంరాజు శివరామ కృష్ణారావు M.A.Ph.D.,

# తెలుగు తాత్త్వికులు

వెల : రూ. **150/-**

**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# నేపథ్యం

ఈ నాడు ఆంధ్రులు లేక తెలుగువారని గుర్తింపుపొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము తమ జన్మభూమిగా భావిస్తున్న జాతి ప్రాచీనత చరిత్రకందని రోజులనుండియే వర్ధిల్లుచున్నది. భారతదేశములోని అతి ప్రాచీన జాతులలో ఆంధ్రులొకరు.

వారి ప్రశంస మొట్టమొదటిసారిగా ఋగ్వేద సంబంధితమై సుమారు క్రీ.పూ. 800 సంవత్సరములనాటి ఐతరేయ బ్రాహ్మణములో కనిపిస్తుంది. శునశ్శేప హరిశ్చంద్ర విశ్వామిత్రుల వృత్తాంతములో :

**తానను వ్యాజహారాంతాన్వః**
**ప్రజాభక్షిష్ఠేతి తపితేంధ్రాః**
**పుండరాఃశబరాః పుళిందాః ముతిబాః**
**ఇత్యుదంత్వాబహవోభవన్తి**
**వైశ్వామిత్రాదస్యూనాంభూయిష్టాః**

*(ఐతరేయబ్రాహ్మణం 7-318)*

వారు పుళిందులు, ముతిబులు, శబరులు అను ఆటవిక జాతులు నివసించే, దక్షిణాపథములో నివసించేవారని తెలియజేసింది. అదేవిధంగా రామాయణములోని కిష్కింధకాండలో సీతాన్వేషణకు దక్షిణ దిక్కునకు పంపబడిన వానరులు ఏయే ప్రాంతములలో వెతకవలెనో సుగ్రీవుడు వారికి తెలియజేసెను.

**అన్వీక్షదండకారణ్యం**
**సపర్వతనదీగుహాం**
**నదీం గోదావరీం చైవ**
**సర్వమేవాను పశ్యత**
**తదైనాంధ్రాశ్చ పుండ్రౌశ్చ**
**చోళాన్ పాండ్యాశ్చకేరళాన్**
**అయోముఖశ్చగన్తవ్యః**
**సర్వతోధాతుమండితః**

ఆ తరువాత కాలమునకు చెందినదిగా భావించబడుతున్న మహాభారతము నందు సభాపర్వమున దక్షిణ దిగ్విజయయాత్రకై యాగాశ్వము వెంట సైన్యముతో బయలుదేరిన సహదేవుడు జయించిన రాజులలో ఆంధ్రులు కూడా కలరని

**పాండ్యాశ్చద్రవిడాంశ్చైవ**
**సహితాంశ్చోఢ్రకేరళైః**
**ఆంధ్రాం స్తలన నాంశ్చైవ**
**కళింగా నోష్ట్ర కర్ణికాన్**

ధర్మరాజు నిర్వర్తించున్న రాజసూయయాగమున ఆసీనులైయున్న రాజులలో ఆంధ్రరాజులున్నట్లుగా ఈ శ్లోకములో చెప్పటం జరిగింది.

**తథాంగ వంగౌసహపుండ్రకేళ**
**పాండ్యోఢ్రరాజౌసహబాంధ్ర కేణ.**

అదే పర్వములో ఆంధ్రులంటే విభిన్న తెగల సమూహముగా "ఆంధ్రాశ్చః బహువః" అని చెప్పటం కూడా జరిగింది. అయితే ఎక్కడా వారు నివసించే ప్రదేశము ఇదమిద్ధ మని చెప్పబడలేదు. వీరందరినీ వింధ్యపర్వత ప్రాంతములో నివసించిన అనార్య జాతులుగా పరిగణింపబడటం జరిగింది. సంచార జీవితము వదలి స్థిరనివాసులై, వ్యవసాయమును వృత్తిగా అవలంభించిన అనంతరం, వారు వింధ్యకు దక్షిణమున కొంత నిర్దిష్ట ప్రాంతమును తమదిగా భావించి సుమారుగా క్రీ.పూ. 700–800 కాలమున స్థిరపడటం జరిగిందని చారిత్రకుల అభిప్రాయం. పైన తెలిపిన ఆటవిక జాతులేకాక ములకులు, అసకులు (అశ్వకులు), మహిషసకులు, నాగులు, యక్షులు,

కళింగులు, తెలింగులు వంటి జాతులవారు కూడా ఈ ప్రాంతములలో సహజీవనము గడుపుతుండేవారు. వీరిలో అసకులు ములుకలు నేడు విదర్భగా పిలవబడుతున్న ప్రాంతమునకు సమీపంలో వసించేవారు. వీరందరూ కృష్ణ గోదావరీ నదుల మధ్య ప్రదేశమును తమ జన్మభూమిగా పరిగణించేవారు. కాలం గడుస్తున్న కొద్దీ వారు ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి పొందటంతోపాటు సాంస్కృతికంగా కూడా దగ్గరై నారు. మాట్లాడటంలో కొంత ప్రాంతీయ వైవిధ్యములున్నప్పటికీ ఒకే భాషను మాట్లాడే వారు. క్రీ.పూ. నాల్గవ శతాబ్దమునకు గ్రామ జీవితమువదలి మెల్లగా నగర నిర్మాణ ములు ప్రారంభించి, కోటవంటి భద్రతా ఏర్పాట్లుగల 30 నగరములు ఆంధ్రదేశంలో నిర్మించినట్లు మెగస్తనీసు వ్రాతలవల్ల మనకు తెలుస్తోంది. ఈ అభివృద్ధి ఒకరాత్రిలో వచ్చిందికాదు. అనేక సంవత్సరములకాలము వ్యావసాయకంగా, వాణిజ్య వ్యాపార ములపరంగా, చేతివృత్తులవంటి పారిశ్రామికాభివృద్ధి వలన సాధించిన ఆర్థికాభి వృద్ధి, పట్టణాభివృద్ధి మరియు నాగరికతాభివృద్ధి, సాంస్కృతిక పురోగమనము, సర్వతో ముఖాభివృద్ధిని పరస్పర సహకారం ద్వారా సాధించిన ఆ విభిన్న తెగల మధ్య అనుబంధాలు బలపడినాయి. వారి భూములు, వ్యాపార వాణిజ్యములు, గ్రామములు, నగరముల శాంతిభద్రతల పరిరక్షణకుగాను, ఒక రాజకీయ వ్యవస్థను నిర్మించు కొనుట జరిగింది. తత్ఫలితంగా ఏర్పడినట్టివే, మొగస్తనీసు తెలియజేసిన ప్రాకార ములతో రక్షణ కల్పించిన 30 నగరములు. ఈ నగరములు ఆయా తెగలవారి పరిపాలనా వ్యవస్థలకు కేంద్రస్థానములై ఉండవచ్చునని చరిత్రకారుల ఊహ.

నేటి నిజామాబాద్ ప్రాంతములో అసకులు, కరీంనగర్ ప్రాంతములో శబకులు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో మహిషకులు, అమరావతి చుట్టుప్రక్కల నాగులు, భట్టిప్రోలు పరిసరాలలో యక్షులు, ఉత్తరకోస్తాజిల్లాలలో కళింగులు మొద లైన తెగలవారు రాజ్య నిర్వహణ జరిపినట్లు ఇటీవల లభించిన నాణెములు, త్రవ్వ కముల ద్వారా బయలుపడిన వస్తువుల ఆధారంగా తెలియవచ్చింది. వీరందరూ ఆదిమతెగలకు చెందినవారు, అనార్యులు అయినప్పటికీ వీరు వింధ్యకావల గల ఆర్యావర్తములోని రాజ్యములతోనూ, ప్రజలతోను సన్నిహిత సంబంధాలేర్పరుచుకొని, వ్యాపార వాణిజ్యాభి వృద్ధికి, విజ్ఞాన సముపార్జనకు, ఉద్యోగముల నిమిత్తం, తరచూ రాకపోకలు జరుపుతుండేవారు. ఇందుకుగాను ఆంధ్రదేశమును మగధతో కలుపుతూ

రెండు ముఖ్యమైన రహదారులేర్పడినాయి. ఒకటి పశ్చిమదిశగా అసక, ములక, విదర్భ, మాళ్వల ద్వారా మగధకు చేరుతుంది. మరొకటి ధాన్యకటకము (అమరావతి–గుంటూరుజిల్లా) నుండి తూర్పువైపు వేంగి, కళింగము, కోసల దేశముల ద్వారా మగధకు చేరుతుంది. ఈ రహదారుల మీదుగా అధిక సంఖ్యలో ఆంధ్రులు ఆర్యావర్తములోని అనేక రాజ్యములలో ఉద్యోగస్తులుగా, సైనికులుగా నియమితులైనట్లు భాగవతమువంటి పురాణ సాహిత్యము ద్వారానూ, తమిళదేశములో సంగమ కాలములో ఉద్భవించిన "శిలప్పాదికారము" వంటి రచనల ద్వారానూ "మహావంశ" వంటి బౌద్ధగ్రంథముల ద్వారానూ, జాతకకథల ద్వారానూ, నయనసేనుని కన్నడ 'ధర్మామృత' వంటి జైన గ్రంథముల వల్ల విదితమగుచున్నది. ఈ రకంగా ఆర్యావర్తము లోని ప్రజలు ఆంధ్రదేశవాసుల మధ్య అనేక విషయములలో సత్సంబంధాలు ఏర్పడి సుసంపన్నమై, సుభిక్షమై, శాంతిభద్రతలతో మనుగడ సాగిస్తున్న ఆంధ్రదేశములోనికి ముందుగా వేద సంస్కృతికి చెందిన సనాతన ధర్మం ప్రవేశించింది. అగస్త్యమహర్షి వింధ్య పర్వతముల గర్వము నణచి దక్షిణదేశములోనికి ప్రవేశించి ఇచ్చటనే స్థిర నివాసమేర్పరుచుకున్నట్లు చెప్పే వృత్తాంతము, సనాతన ధర్మప్రచారకులుగా, ఉత్తర దేశమునుండి అనేకులు దక్షిణదేశమునకు, ముఖ్యముగా ఆంధ్రదేశములోని కృష్ణా గోదావరి తీరములలోనూ, పరిసర ప్రాంతములయందును ఆశ్రమములను నిర్మించు కొని గురుకులములనేర్పాటు చేసుకొని ఆర్షసంస్కృతీ విస్తృతికి కృషి చేసిన వైనమును తెలియజేస్తుంది.

సమాజమును వృత్తులను బట్టి బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణములుగా విభజించి, ప్రతి వర్ణమువారు సమాజశ్రేయస్సుకు, ప్రభుత్వ నిర్వహణకు నిర్వర్తించవలసిన కార్యములు, పాటించవలసిన ధర్మములు నిర్ణయించబడినవి. అదేవిధంగా ప్రతి వ్యక్తి జీవితకాలమును నాలుగు దశలుగా విభజించి, వాటిని బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసమని పేర్కొన్నారు. ప్రతి దశలోనూ వ్యక్తి కర్తవ్యము, నిర్వహించవలసిన వేదొక్తవిధులు, లౌకిక విషయములను విసర్జించి, ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నుడయే విధానము, ప్రాపంచిక విషయములందు విర క్తుడై, వైరాగ్యభావనతో సన్యసించటం వంటి చర్యలను విధిగా పాటించవలెనని నిర్ణయించటం, షోడశ సంస్కారములను (పదునారు సంస్కారములను), ప్రతివ్యక్తి

తనతల్లి గర్భమున ప్రవేశించి నప్పటి నుండీ, కాటిపై దేహము దగ్ధమైపోయేవరకు అనుసరించవలసిన కర్మాచరణముల ద్వారా వైదిక సంస్కృతి వ్యాప్తికి కృషిచేయటం ప్రారంభించారు. గురుకులములలో వేద వేదాంగములను బోధించి, పరిపూర్ణత పొందిన వారిని తెలుగుదేశము నలుమూలలకు పంపి, ఆదిమ తెగల వారిని తమకు వారసత్త్వంగా సంక్రమించిన ఆచార వ్యవహారములను వదలి, సనాతన ధర్మ స్వీకారము, ఆచరణ పాటించవలసినదిగా ప్రబోధింపచేశారు. ఆంధ్రదేశములోని తెగలలో చాలామంది సనాతన ధర్మమువైపు ఆకర్షితులై దానిని స్వీకరించి, వర్ణాశ్రమ పద్ధతిలో విభజింప బడిన సమాజమందు ఇమిడిపోయారు. నాగులు, యక్షులు వంటి కొన్ని తెగలవారు తమ పెద్దలు అనుసరించిన ఆచార వ్యవహారములను మత విశ్వాసములను వదులు కొనుటకు అయిష్టత ప్రదర్శించారు. వర్గపరంగా గమనిస్తే, వ్యవసాయ, వ్యాపార పరిశ్రమల ద్వారాను సంపన్నులైన, రైతులు, వర్తకులు చేతివృత్తులవారు తమ సంపదకు, పలుకుబడికి తగినట్లుగా సమాజములో, ఉన్నత స్థానము కల్పించక నాల్గవది, చివరిదైన శూద్రులుగా పరిగణించబడటం అవమాన కరంగా భావించి సనాతన ధర్మస్వీకారమును తిరస్కరించటం జరిగింది.

ఈ విధమైన సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు ఆంధ్రదేశములో కొనసాగు తున్న తరుణంలో జైన, బౌద్ధ ధర్మముల ప్రచారకులు ప్రవేశించుట జరిగింది. ఈ మూడు మతముల మధ్య ఆధిక్యతకోసం పోటీలు మొదలైనవి. మహాదేవుడనే బౌద్ధా చార్యుడు తెలుగువాడవటంచేత అమరావతి, నాగార్జునకొండ ప్రాంతములో నివాస మేర్పరచుకొని, బౌద్ధధర్మప్రచారము ప్రారంభించాడు. తమ మతములో వర్ణాశ్రమ ధర్మాలకు తావులేదనీ, బౌద్ధధర్మమును స్వీకరించిన వారందరూ సమానులే అని ప్రబోధించటం, అశోక చక్రవర్తి వంటివారు దేశమంతా బౌద్ధమత వ్యాప్తికొరకు అంగ, అర్ధబలములను సమకూర్చటం, అతిముఖ్యమైన, మరొక బలమైన కారణం. బౌద్ధులు తమ మతవ్యాప్తి శీఘ్రంగా జరుపవలెననే ఆకాంక్షతో భారత దేశములోని ఆదిమవాసుల మత విశ్వాసములను, ఆచార వ్యవహారములను ఆమోదించి, అవి తమ మత ధర్మములుగానే ప్రచారం చేసుకోవటం జరిగింది. అందువల్ల సనాతన ధర్మమును త్రోసిపుచ్చిన నాగులు, యక్షులు వంటి ఆదిమజాతులేకాక, ఇతర తెగలవారైన సంపన్న గృహస్థులు కూడా వేలాదిగా బౌద్ధమత స్వీకారము చేశారు. దక్షిణదేశంలో,

ఆంధ్రభూమి బౌద్ధమత ప్రచారమునకు కేంద్రమవుటయేకాక, బలపడి సుమారు 600 సంవత్సరములు అది ప్రజల ప్రభువుల మతంగా చలామణి అవటం జరిగింది. వ్యాప్తి చెందినకొలదీ, అంతఃకలహములు వృద్ధి చెంది ఆంధ్ర దేశములో అది 32 శాఖలుగా మారి క్షీణిస్తూనే, విశ్వవిఖ్యాతిపొందిన ఆచార్యులకు, వివిధ శాఖల యందు జన్మనిచ్చింది.

జైన ధర్మము, బౌద్ధము కంటే కొద్దికాలము ముందే ఆంధ్రదేశములో అడుగు పెట్టినప్పటికీ దాని వ్యాప్తిలో చురుకుదనం లోపించింది. అందుకు ముఖ్యమైన కారణం ఆ మతమునందలి క్లిష్టమైన నియమ నిబంధనలు. తమ మతమును స్వీక రించుటకు ప్రతివ్యక్తీ సన్యసించాలనీ, నగ్నంగా చరించాలనీ, జీవహింస చేయరాదనీ, స్త్రీలకు జైన ధర్మము స్వీకరించుటకు వీలులేదనేటువంటి, ఆచరణకు కష్టమైన విధానాలను ప్రబోధించటం. మరొక కారణం, అతి శీఘ్రంగా వ్యాప్తి చెందుతున్న బౌద్ధమతంతో తలపడటం నయనశేనుని "ధర్మామృత" అనే కన్నడ భాషాగ్రంథంలో జైన బౌద్ధమతముల మధ్య రేకెత్తిన సంఘర్షణలు వివరించటం జరిగింది. మగధ యందలి నందరాజులు, కళింగ చక్రవర్తి ఖారవీలుడు, ప్రతీపాలపురం (భట్టిప్రోలు) పరిపాలించిన ధనదుడు వంటి రాజులు, అనంతర కాలంలో వేంగీ చాళుక్యుల ప్రోత్సాహము న్నప్పటికినీ సామాన్యులకు క్లిష్టతరమైన మత నియమములు, బౌద్ధము నకు లభించిన జనాదరణ లభించక బలహీనపడిపోయింది. క్రీస్తుశకం ప్రారంభంలో జైనమతము రెండుగా చీలిపోయింది. క్లిష్టమై, ఆచరణయోగ్యంకాని విధానములను మతమునుండి తొలగించి, శ్వేతాంబర శాఖ ఏర్పడింది. వారు దిగంబరులుగా వుండక తెల్లని వస్త్రము ధరించేవారు. మూల సూత్రములకే కట్టుబడినవార్ని దిగంబరశాఖ అని పిలిచేవారు. ఈ శాఖల రెంటి మధ్య సమన్వయం, సహకారము కలిగించాలని మూడోశాఖ జన్మించింది. వార్ని యాపనీయులు అని పిలిచారు. ఈ మూడు శాఖలు ఆంధ్రదేశములో బౌద్ధమత క్షీణత అనంతరము, వ్యాప్తి చెందటానికి శాయశకులా కృషి చేసినప్పటికీ వైదికపరమైన సనాతన ధర్మము సంస్కరింపబడి హిందూ మతముగా మార్పుచెందటంతో బౌద్ధులుగా మారిన ప్రజాబాహుళ్యము ఆ మతమును తిరస్కరించి హిందువులుగా పరివర్తన చెందటం జరిగింది. అయినప్పటికీ హిందూ, బౌద్ధ, జైన మతములు మూడూ, ఆంధ్రదేశంలో ప్రధాన మతములుగా వర్ధిల్లాలనే

కోరికను వదులుకోలేదు. ఎంత చిన్న అవకాశమొచ్చినా, తమ ప్రయోజనములను సాధించవలెననే ప్రయత్నములను వీడలేదు.

సనాతన ధర్మావలంబకులు, వేదవేదాంగాలను అధ్యయనము చేయవలెనన్నా, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించవలెనన్నా, సంస్కృతభాషా పరిజ్ఞానం విధిగా సంపాదించుకోవాలి. ఆ కారణంగా ఆంధ్రదేశమునుండి కొందరు ఆర్యావర్తములలోని గురుకుల ఆశ్రమములలో విద్యనభ్యసించి తిరిగివచ్చి, అదేవిధమైన విద్యాబోధన, సనాతన ధర్మ ప్రచారమూ చేయుటకై, కృష్ణా గోదావరి తీర ప్రాంతములలో ఆశ్రమముల నేర్పరుచుకొని, వైదికవాఙ్మయమును బోధించి శిష్యులను తయారు చేసి వారిద్వారా, సనాతన ధర్మ ప్రచారము చేసేవారు. ఆ విధంగా వైదిక ధర్మవ్యాప్తి సుమారుగా క్రీ.పూ. 1000 నుండి క్రీ.పూ. 320 వరకు వింధ్యకు దక్షిణమున జరిగింది. ఆ ప్రాచీన కాలంలో తెలుగువారైన బోధాయనుడు, ఆపస్తంబుడు ఆర్యావర్తములోని విద్యాకేంద్రములలో వేద వేదాంగములను అభ్యసించి తిరిగి వచ్చి తెలుగుదేశములో ఆశ్రమములనేర్పాటు చేసుకొని, విస్తృతమై, నిర్ణీతమైన పద్ధతి లేక, కంఠస్థము చేయుటకు వీలుకానటువంటి వేదములలోని బ్రాహ్మణములను, సంక్షిప్తము చేసి, వాటికి సూత్ర రూపము కల్పించారు. ఇదేవిధంగా ఆ కాలములో ఋక్, యజుస్సాను వేదములకు సంబంధించిన బ్రాహ్మణములకు, భారతదేశపు వివిధ ప్రాంతములలో ఆశ్రమములేర్పరచుకొన్న వశిష్ఠుడు, గౌతముడు, సాంఖ్యాయనుడు, అశ్వలాయనుడు, హిరణ్యకేశి, భరద్వాజుడు, కాత్యాయనుడు, వంటి వేదవిదులు కూడా సూత్రరచన చేయటం జరిగింది. సూత్ర రచన యొక్క ఆంతర్యమును బాదరాయణ సూత్రములపై వాఖ్యానిస్తూ మాధవాచార్యులు ఈ విధంగా నిర్వచించారు.

**శ్లో॥ అల్పాక్షరం అసందిగ్ధం సారవదిశ్వతో ముఖమ్**
**అస్తోభమన వాద్యంచ సూత్రం సూత్ర విదోవిదుః**

ఆ శ్లోక తాత్పర్యమేమంటే అతికొద్ది అక్షరములను మాత్రమే ఉపయోగించి ఎటువంటి సందేహములకు తావులేకుండా విస్తృతమైన విషయమును తెలియజేయటం. ఈ ప్రక్రియ కేవలం వేద వాఙ్మయమునకే పరిమితం చేయక, యజ్ఞయాగాది క్రతువులలో నిర్మించవలసిన యజ్ఞకుండములు, వాటి సంఖ్య వంటి క్షేత్ర గణిత (Geometry) సంబంధమైన సులవసూత్రముల రచనకూడా జరిగింది. గ్రీకు

వేదాంతి, గణితశాస్త్రజ్ఞుడైన పైతాగరస్ ఈ సులవ సూత్రాధ్యయనము ద్వారా తన పేర ఒక సిద్ధాంతము రచించాడని ప్రతీతి. ఇవికాక వేదములలోని ఋక్కులకు అక్షరక్రమముగా ప్రతి ఋక్కులోనున్న అక్షరముల సంఖ్యను వివరిస్తూ వ్రాసిన సూత్రములకు అనుక్రమణికలు అనిపేరు. కేవలము వైదికవాఙ్మయము, ఆధ్యాత్మిక విషయములకే పరిమితము కాకుండా మానవ నిత్య జీవనమునకవసరమైన ఆరోగ్యము, విద్య, ఆర్థికశాస్త్రము, ఖగోళశాస్త్రము, వ్యవసాయము, వ్యాపారము, పశుపోషణ, కళలు. సామాజిక నియమములు, సంస్కారములు, న్యాయశాస్త్రము ఆదిగా గల అనేక లౌకిక విషయములపై కూడా సూత్ర రచన జరిగింది. భారతదేశములోని వివిధ గురుకులముల యందు ఈ సూత్ర రచన, బోధన జరుపబడి వేదార్థములను విశదీకరించుట, సూత్ర పఠనము ద్వారా వాటిని కంఠస్తము చేయటం జరిగేది. ఇట్టి విద్యా కేంద్రములను చరణములనేవారు. ఒక్కొక్క చరణమునందు, ఒక్కొక్క వేద విభాగము, దానికి సంబంధించిన బ్రాహ్మణముల సూత్రములు వల్లెవేయించుట ద్వారా, సనాతన ధర్మావంబలకులలో శాఖలేర్పడినాయి. ఉదాహరణకు బోధాయన సూత్రములను పాటిస్తూ వైదిక కర్మలను జరిపే వారిని బోధాయనీయులని, ఆపస్తంబ సూత్రములు పాటించే వారిని ఆపస్తంబీయులని పిలుస్తారు.

పైన తెలియజేసిన సూత్రకారులే కాక, ఇంకా ఎందరో సూత్ర రచన చేసినట్లు దాఖలాలున్నప్పటికీ అవి ఏవియు లభించలేదు. కాలగర్భంలో కలిసిపోయినవి. ఉదాహరణకు "మన్వసూత్రము"లనేవి ఇతర సూత్రగ్రంథములలో ప్రస్తావించబడినవి. కాని ఈనాడు మనకు లభ్యం కావటం లేదు. మనుధర్మశాస్త్రమని పిలవబడే ఈనాటి గ్రంథము, క్షిద్రమైన మన్వసూత్రములలో లభించిన కొన్ని సూత్రముల సంకలనముగా భావిస్తున్నారు. ఆ విధంగా ప్రాచీనకాలములో భాషకు "లిపి" లేనప్పుడూ, ఉన్నప్పుడు కూడా, వీటిని గ్రంథస్థము చేయకుండా కంఠస్తము చేయించి గురుశిష్యపరంపరగా బోధించి, సనాతన ధర్మప్రచారము ఆంధ్రదేశములోనే కాక, యావద్భారత ములోను చేయుట జరిగింది.

అశోక మౌర్యుని కాలములో బౌద్ధమతము యావద్భారతములోనూ, ఖండాతరములయందును రాజాదరణ వల్ల విస్తృతంగా వ్యాపించి, సనాతన ధర్మములను రూపుమాపివేయగల శక్తిని పుంజుకున్నది. వారి అనంతరము, ముందు మనవి

చేసినట్లు ఆ మతక్షీణత ప్రారంభమయినది. గుప్తరాజుల కాలమునాటికి రాజాదరణ పొందిన సనాతన ధర్మమును సంస్కరించి, పునర్వ్యవస్థీకరించి పునర్జీవనము చేయ వలననే దృఢసంకల్పముతో, సనాతన ధర్మమునందలి కఠిన నిబంధనలను సడలించి, యజ్ఞయాగాది క్రతువుల ప్రాధాన్యత, నిర్వహణకు గల ప్రాముఖ్యతను తగ్గించటం జరిగింది. బదులుగా వేదవ్యాస విరచితముగా ప్రఖ్యాతి గాంచిన అష్టాదశ పురాణ ములు మరియు ఉపపురాణములలో వర్ణింపబడిన దేవతామూర్తుల ఆరాధన ప్రవేశపెట్ట బడినది. పురాణములలో నిర్దేశింపబడిన ధర్మ, అర్థ, కామ, మోక్షముల సాధనకై దేవతారాధనతో పాటు నోములు, వ్రతములు, తీర్థయాత్రలు, దానధర్మాది కార్యక్రమ ములు వర్ణ వివక్షత లేకుండా నిర్వహించుట ప్రారంభమయినది. పురాణతత్త్వము ప్రతివ్యక్తి యొక్క ఉన్నతిని అతని సామర్థ్యము, సంక్షేమము, ఒడిదుడుకులు లేని ప్రశాంత జీవనము, ఆర్థిక మరియు తాత్త్వికాభివృద్ధి ద్వారా నైతికోన్నతమైన సమాజ స్థాపనే ఆశయముగా రూపొందించుట జరిగినది. పరాశర యాజ్ఞవల్క్యాది ఋషులు సంకలనము చేసిన స్మృతులు, పురాణేతిహాసములు మూలములుగా నిర్మించబడిన వ్యవస్థనే హిందూమతమని ఇతరులు నామకరణము చేయటం జరిగింది. కానీ నిజానికి అది మతముకాదు. మానవజీవన విధానమును నిర్దేశించిన ఒక సామాజిక, ఆధ్యాత్మిక సంస్కరణ. ఈ విధంగా పునర్నిర్మాణము చెందిన సనాతన ధర్మము, హైందవ మతముగా పిలువబడుతూ, నిర్దేశించిన నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే పాపము కలుగుతుందనీ, తద్వారా నరకమునకు చేరవలసి వస్తుందనీ, పాటిస్తే పుణ్యమును పొంది స్వర్గమునకు పోయి సకల సుఖములు అనుభవించెదరని ప్రజా బాహుళ్యమునకు ప్రబోధించింది.

కాలక్రమేణ పురాణ దేవతారాధకులు, తాము ఆరాధించు దేవుని లేక దేవత యొక్క వైశిష్ట్యమును, పూజా విధానములను, వర్ణిస్తూ అనేక విధములైన సిద్ధాంతము లను రూపొందించారు. వేదములలోని పాంచరాత్రమనే భాగమాధారంగా వైష్ణవ మతము, శైవాగమము, శాక్తేయము, గాణపత్యము, సౌరము, స్కాంధము మొదలైన ఆరు శాఖలేర్పడి షణ్మతములుగా పేరు గాంచినవి. తాత్త్వికచింతనను బట్టి అద్వై తము, విశిష్టాద్వైతము, ద్వైతము, శాక్త్యేయమువంటి శాఖలు ఏర్పడినవి. తదనం తరము వాటిలో ఉపశాఖలేర్పడినవి. ఈ విధంగా శాఖోపశాఖలైన భారతీయ తాత్త్విక

భావన, ఆయా శాఖాధిపతులు, అనుయాయిలచే భారతదేశములో ముఖ్యంగా తెలుగు నాట విస్తృత ప్రచారం పొందింది. శాఖలలో అంతర్విభేదాలున్నప్పటికినీ, బౌద్ధజైన మతములను నిర్వీర్యంగా మార్చి, ప్రజాబాహుళ్యమును తమ తమ శాఖలలో చేర్చు కొనవలెననే ప్రయత్నంలో వారికెట్టువంటి విభేదాలు లేవు. అయితే క్రీ.శ.10-12 శతాబ్దములనుండి శైవ, వైష్ణవ శాఖల మధ్య ఆధిక్యత కొరకై చేసిన ప్రచారము చాలాచోట్ల హింసకు దారితీసింది. కాకతీయులు శైవులయిన తరువాత జైనులపై దౌర్జన్యములు, హింస పెచ్చుపెరిగినవి. కృష్ణదేవరాయల అనంతరం పాలించిన రాజులు వీరవైష్ణవులై, శైవులను బాధపెట్టడం జరిగింది. ఆంధ్రదేశంలో ప్రసిద్ధిగాంచిన పలనాటి యుద్ధమునకు మతావేశము కూడా ఒక కారణము. ఈ రకమైన శాఖా ద్వేషములు, ఒక హిందూ మతమునకే పరిమితము కాక, బౌద్ధమతములోని శాఖల యందును, ముఖ్యముగా తేరవాదులకు, మహాయాన వాదులకు మధ్య ఈరకమైన వైషమ్యములు పెచ్చుపెరిగినవి. జైన శాఖలైన దిగంబర, శ్వేతాంబర, యాపనీయుల మధ్య కూడా సత్సంబంధాలు ఉండేవి కావు.

ఈ విధంగా శాఖోపశాఖలైన హిందూ, బౌద్ధ, జైన మతములకు చెంది, నమ్మిన తత్త్వసిద్ధాంతములను తమ రచనల ద్వారా ప్రచారము చేసిన మహనీయుల సంక్షిప్త జీవితగాధలు, వారు ప్రబోధించిన తాత్త్విక సిద్ధాంతములు, అందుపై వారు చేసిన రచనలు వంటి విషయములను, సాధ్యమైనంత సంగ్రహంగా ఈ పుస్తకములో వ్రాయడం జరిగింది. గ్రంధస్థము చేయబడినవారే కాక, మరెందరినో పూర్తి వివరము లభించక వదలివేయడమైనది.

ఈ గ్రంథములో తెలుగు తాత్త్వికులుగా పరిగణింపబడిన వారిలో తెలుగు దేశ ములో జన్మించి వలసపోయిన వారిని, ఇతరప్రాంతములనుండి వచ్చి ఇచటనే స్థిరపడిన వారిని కూడా, తెలుగు గడ్డపై జన్మించి తాము నమ్మిన ఆధ్యాత్మిక తత్త్వ ప్రచార మునకు పూనుకొనిన అసలు, సిసలు తెలుగువారితో కలిపి వేయటం జరిగింది.

సహృదయులైన, తెలుగు పాఠకులు ఈ రచనలను కూలంకషంగా చదివి, తెలుగుజాతి ప్రాచీనతను, ఔన్నత్యమును ఆధ్యాత్మిక చింతనాపటిమను, దాని అభి వృద్ధికి వారు చేసిన కృషిని, అది ఆస్తికమైనా నాస్తికమైనప్పటికిన్నీ గాఢంగా అవగాహన చేసుకొని, పాశ్చాత్య సంస్కృతీ, స్వభావములకు లోనుగాక, వారి బిడ్డలకు, ముందు తరములవారికీ తెలుగుజాతి సంస్కృతీ సౌరభములను వ్యాపింపచేయగలరని విశ్వసిస్తున్నాను.

# హిందూ తాత్త్వికులు

# బోధాయన ఋషి

వేదములలో నిర్దేశించిన యజ్ఞయాగాది క్రతువులు, కామ్యకర్మలు నిర్వహించ డానికి ప్రాచీన ఋషులు కొన్ని నిర్దిష్టమైన పద్ధతులను బోధించారు. సంహితలలో నిక్షిప్తమైన మంత్రార్థములను సక్రమంగా అర్థం చేసుకొని, వాటిలో వాడిన సాంకేతిక పదముల, అంతరార్థములను దోషరహితంగా గ్రహించి, లోపరహితముగా ఆయా కర్మకాండలను నిర్వర్తించుటకు రూపొందించబడిన వేద విభాగములే బ్రాహ్మణములు, సుదీర్ఘములు, గద్య రూపములైన బ్రాహ్మణ వాఙ్మయము క్లిష్టమై కంఠస్థము చేయుటకు జ్ఞప్తియందుంచు కొనుటకు, కష్టతరముగా నుండి వైదికమత వ్యాప్తి శీఘ్రంగా జరుగు టకు కొంత అవరోధముగా నుండుటచేత అందలి విషయములను క్రోడీకరించి, సూత్రరూపంలో సూక్ష్మీకరించవలసిన ఆవశ్యకత కలిగింది. ఈ విషయముపై వివరణ నేపథ్యమనే అధ్యాయములో పొందుపరచటం జరిగింది. అట్లు సూత్ర రచన, సంక లనము చేసిన మహనీయులలో బోధాయనుడు ప్రాచీనుడు.

భారతీయ తత్త్వవేత్తలే కాక, పాశ్చాత్య తత్త్వవేత్తలు కూడా సూత్రకారులలో ఆయన అగ్రగణ్యుడని ప్రశంసించారు. డాక్టర్ బుహ్లర్ అనే తాత్త్వికుడు, బోధాయనుని, మరియొక తెలుగు సూత్రకారుడైన ఆపస్తంబుని సూత్రములను క్షుణ్ణంగా అధ్యయ నము చేసి, వాటిని సవాఖ్యానంగా ఇంగ్లీషు భాషలోనికి అనువదించుట చేశాడు. ఆయన అంచనాల ప్రకారం వారిద్దరి మధ్యకాలము దశాబ్దములలో కాక, శతాబ్దము

లలో వుంటుందని చెప్పాడు. బోధాయనుడు సుమారు క్రీ.పూ. 600 సంవత్సరము నకు చెందినవాడుగానూ, ఆపస్తంబుడు క్రీ.పూ. 400–300 సంవత్సరములకు చెందిన వాడు గాను భావించ బడుతున్నది. అందువల్ల బోధాయనుడు ప్రాచీన సూత్రకారుల కోవకు చెందినవాడు. ప్రథముడు గౌతముడు కాగా, బోధాయనుడు సూత్రకారులలో ద్వితీయుడో, తృతీయుడో అయి వుండవచ్చును. బోధాయనుడు భారతదేశములో ఏ ప్రాంతమునకు చెందినవాడనే, అంశముపై చరిత్రకారులకు, తత్త్వవేత్తలకు ఏకాభిప్రాయము లేదు. అయినప్పటికినీ ఆయన సూత్రముల విశ్లేషణ ద్వారా ఆయన తెలుగు బ్రాహ్మణుడనీ గోదావరీ తీర వేంగి మండల వాసియని తెలుస్తున్నది. ఆయన కాలంలో కృష్ణానదీతీర ప్రాంతములోను, తూర్పున కళింగ దేశమువరకునూ హిందూ రాజ్యములున్నట్లు తెలుస్తున్నది. ఆనాడు ఆర్యావర్తములో నివసించెడివారు వింధ్యకు దక్షిణమున వసించు ప్రజలను అనార్యులుగానూ, ఆట వికులుగానూ నిరసించేవారు. ఆర్య సంస్కృతి దక్షిణ భారతమునందు వ్యాప్తి చెంద లేదు. ఆయన అనంతరమే ఆ సంస్కృతి ప్రవేశించటం జరిగినది. బోధాయనుడు తన సూత్రముల ద్వారా భారతావనిని నాగరికత, ఆర్ష సంస్కృతుల వ్యాప్తి నాధారంగా చేసుకొని మూడు భాగములుగా విభజించినాడు. ఆర్యావర్తమని పిలవబడే ప్రాంతము ఉత్తరమున హిమాలయముల నుండి దక్షిణమున వింధ్య పర్వతముల వరకున్నూ, పశ్చిమమున సరస్వతీ నది నుండి తూర్పున నేటి బీహారు రాష్ట్రము వరకు విస్తరిల్లి యున్నదనియూ, పాంచాలము (దక్షిణ పంజాబు)లోని కొన్ని భాగములు, సింధు, గుజరాత్ ప్రాంతములు, దక్షిణ భారతము, మాళవము (మాల్వా), అంగ (బీహారు తూర్పు ప్రాంతము), మగధ (బీహారు దక్షిణ ప్రాంతము)లను కలిపి ద్వితీయ భాగముగానూ, పంజాబులోని అరటులు, దక్షిణదేశమునందలి గిరిజన జాతులను, ఉత్తర, తూర్పు బెంగాలు ప్రాంతములను, ఓఢ్ర దేశమును, కలపి మూడవ భాగముగా విభజించెను. ద్వితీయ భాగమునందు నివసించు వారిని మిశ్రమ జాతులుగానూ, తృతీయ భాగములోనికి ఆర్యులెవ్వరూ వెళ్ళరాదని నిషేధించటం జరిగింది. ఈ నిషేధమును ఉల్లంఘించినవారు పునస్తోమము లేక సర్వప్రాయశ్చిత్తమనే కర్మల నాచరించుట ద్వారానే ఆర్యసంఘములో చేరుటకు అర్హులని తెలియ జేయబడింది.

అయినప్పటికిన్నీ బోధాయన ఋషి ఆర్యులకు నిషిద్ధమైన తృతీయ ప్రాంతము నకు చెందిన వాడవటం విశేషము. దక్షిణభారతములోని తెలుగుదేశమే ఆయన

నివాస స్థానమని చెప్పటానికి తగిన బలమైన ఆధారములు, ఆయన సూత్రముల యందే స్పష్టమైనవి. దక్షిణ భారతదేశం పాటిస్తున్న సమకాలీన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయములు, ఉత్తర భారతంలో ఆచరిస్తున్న వాటికి ఏ విధంగా విరుద్ధమైనవో తన సూత్రములలో వివరించటం జరిగింది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ భారతములలో ముఖ్యమైన ఐదు వైవిధ్యమైన ఆచారములను బోధాయనుడు విశదీకరించాడు.

**దక్షిణ భారతంలో**

1. ఉపనయన సంస్కారాదులను జరుపుకొనని వ్యక్తులతో సహపంక్తి భోజనం చేయటం. (ఈ ఆచారమును ఇప్పటికీ శ్రోత్రియ కుటుంబములు వ్యతిరేకిస్తున్నవి).
2. భార్యతో కలసి ఒకేసారి భుజించుట.
3. చద్దివి, పాశిపోయిన పదార్థములను తినుట.
4. మేనమామ కూతురును వివాహమాడుట.
5. మేనత్త (తండ్రి సోదరి) కూతురును వివాహమాడుట.

చివర తెలియజేసిన రెండు విధములైన వివాహములను నేటికీ తెలుగువారు, మహారాష్ట్రములోని దేశస్థ, కర్హాడ బ్రాహ్మణులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక ఉత్తర భారతంలో ఆచరణలోనున్న నిషిద్ధ వ్యవహారములు :

1. ఉన్ని సేకరణ వ్యాపారము
2. మత్తు పదార్థములను సేవించుట.
3. పై క్రింది దవడలయందు పళ్లు కలిగిన జంతువులు (గుఱ్ఱమువంటివి)తో వ్యాపారము చేయుట.
4. వినాశనకరములైన ఆయుధముల వ్యాపారము.
5. సముద్రయానము.

పైన తెలియజేసిన ఐదు అంశములలో సముద్ర ప్రయాణములను, తరువాత కాలములో హిందువులందరకీ నిషేధింపబడినది. ఇందుకు ముఖ్యకారణము భారతదేశపు ఇరుగుపొరుగు దేశములలో తలెత్తిన రాజకీయ, సాంఘిక, మతపరమైన మార్పులు, భారతీయ సాంఘిక, మత విశ్వాసములను ద్వేషించుట, నిర్మూలించుటకు

ప్రయత్నములు ప్రారంభమగుచుండుటచేత, అట్టి దేశములతో రాకపోకలు నిషేధింప బడినవి. తాము నివసించు ప్రాంతములలో పాటింపబడు ఆచార వ్యవహారములను, మత విశ్వాసములను త్రోసిపుచ్చువారిని పాపులుగా పరిగణించబడటం పరిపాటిగా మారింది.

బుహ్లర్ మహాశయుడు బోధాయన సూత్రములు ఇంగ్లీషు భాషలోనికి అనువదించుటకుగాను క్షుణ్ణంగా అధ్యయనము చేసిన పిమ్మట తన అభిప్రాయములను వ్యక్తం చేస్తూ, బోధాయన సూత్ర వ్రాతప్రతులలో మంచివి, దక్షిణ భారతదేశమునందే లభించినవి. ఆయన సూత్రములలో, తాను తెలుగు దేశమునకు చెందినవాడననీ, ఫలానా ప్రాంత వాసిననీ తెలియజేయునటువంటి అంశములు కానవస్తున్నవి. తరచుగా ఆయన సముద్ర ప్రయాణములను గురించీ, ఖండాతరములనుండి రేవులకు చేరిన వివిధ వస్తువులపై విధించు దిగుమతి సుంకములను గురించీ, వివరించిన విధానమును పరిశీలించుట వలన, ఆయన సముద్రతీర ప్రాంత నివాసియనీ ఖండాతరములతో వ్యాపారము జరుపు ప్రసిద్ధ వర్తక కేంద్రములో నివసించేవాడనీ అవగతమవుచున్నది. అంతేకాక నిర్దుష్టముగా ఆంధ్రుడని తెలియుటకు ఆపస్తంబునివలె, బోధాయనుడు కూడా తన సూత్ర రచనకు మూలంగా, ఆంధ్రప్రతిగా పరిగణింపబడు తైత్తరీయారణ్యకమునే ఉపయోగించుకొనుటవల్ల బోధాయనుడు తెలుగువాడు కాదేమోననే సంశయమునకు తావులేదని స్పష్టం చేశాడు. ఏమైనప్పటికీ ఈ అంశముపై మరికొంత పరిశోధన జరిగితే బాగుంటుంది.

సూత్రకారులెవరైనప్పటికీ, సూత్ర వాఙ్మయము ప్రధానంగా మూడు భాగములుగా విభజింపబడింది. బ్రాహ్మణములలో నిర్దేశించబడిన యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించుటకుగాను ఏర్పరచిన మంత్రభాగమును శ్రౌతసూత్రములని పిలుస్తారు. శ్రౌతమంటే పవిత్రత అని అర్థం. రెండవ భాగములో లౌకిక వ్యవహారములకు సంబంధించిన ప్రభుత్వ పరిపాలన విధానము, చట్టములు, న్యాయశాస్త్రము, స్థిర చరాస్తులపై పన్నులు, ఎగుమతి దిగుమతి సుంకములు, వారసత్వ విధానము. ఆస్తుల పంపకము, వ్యవసాయము, వ్యాపారములు, పరిశ్రమలు ఆదిగాగల అనేకానేక మానవ నిత్యజీవనమునకు సంబంధించిన విషయములపై రచింపబడిన సూత్రములు పొందుపరచబడినవి. ఈ భాగమును ధర్మసూత్రముని నామకరణము చేయబడింది.

ఈ ధర్మసూత్రములను ఆధారముగా చేసుకొని, వివిధ కాలములలో ఆనాటి సామాజిక, సాంస్కృతిక, మత విశ్వాసములకు అనుగుణంగా మానవ జీవితమును క్రమబద్ధీకరిస్తూ స్మృతులు రచింపబడినాయి. పరాశరుడు, మనువు, యాజ్ఞవల్క్యుడు వంటి పదునెనిమిది మహనీయులు పదునెనిమిది స్మృతులను రచించారు. బోధాయనుడు సూత్రములతో పాటు స్మృతులను రచించుట వలన ఆయన సూత్రకారునిగానే కాక, స్మృతికారునిగా కూడా ప్రసిద్ధిపొందినాడు. స్మృతులను ఆధారముగా చేసుకొని అనంతరకాలములో న్యాయశాస్త్రగ్రంథములు రచింపబడినాయి. యాజ్ఞవల్క్యస్మృతిని మూలముగా గ్రహించి విజ్ఞానేశ్వరుడు "మితాక్షర" అనే గ్రంథమును రచించాడు. జీమూతవాహనుడు "దయాభాగ" అనే న్యాయశాస్త్ర గ్రంథమును స్మృతుల ఆధారముగా రచించటం జరిగింది. అది కేవలము భారతదేశపు తూర్పు ప్రాంతమునందే అనుసరించబడుతున్నది. భారతదేశమునందలి న్యాయస్థానములు ఈనాటికీ కొద్దిగొప్ప మార్పులతో పైన తెలుపబడిన న్యాయశాస్త్ర గ్రంథములననుసరించియే హిందువుల మధ్య ఏర్పడు వ్యక్తిగత, స్థిర చరాస్తులు వివాదములను పరిష్కరించుచున్నవి.

శ్రౌత సూత్రములు, వ్యక్తిని ఆధ్యాత్మిక పథమునందు నడిపిస్తే, ధర్మసూత్రములు వ్యక్తిని ఒకమంచి పౌరుడుగా తీర్చిదిద్దే విధానములను బోధిస్తాయి. పై రెండు అంశములే కాక, వ్యక్తి, పుత్రునిగా, భర్తగా, తండ్రిగా, సోదరునిగా తన కుటుంబ సభ్యులపట్ల నిర్వహించవలసిన బాధ్యతలు మరెన్నో వున్నాయి. యజ్ఞయాగాది క్రతువుల వంటి భారీ కార్యములు కానప్పటికినీ, అతడు అనేక విధములైన కామ్యకర్మలు అంటే వ్రతములు నోములు తీర్థయాత్రలు దానధర్మములు వంటివీ, షోడశ సంస్కారములని పిలువబడే పుంసవనము, నామకరణము, ఉపనయనము, వివాహము, అంత్యేష్టి (మరణానంతరము చేయు కర్మకాండ) ఆబ్దికములువంటి అనేక శుభాశుభ కర్మకాండలు కూడా, తన కుటుంబ సభ్యులకై నిర్వర్తించవలసి వుంటుంది. ఇటువంటి కార్యముల నిర్వహణలో పఠించవలసిన మంత్రభాగమే గృహ్యసూత్రములని పిలవబడే తృతీయభాగము. ఈ మూడు భాగములను కలిపి ఒకే పేరుతో వ్యవహరించినప్పుడు, వాటిని "కల్పసూత్రము"లంటారు. వేదములకు అంగములుగా పరిగణింపబడు ఆరు శాస్త్రములలో ఈ కల్పము ఒకటి.

ఈ ఆధునిక యుగములోకూడా, ఆర్షసంస్కృతి, హైందవ మతాభిమానముగల భారతీయులందరూ పైన వివరించిన మూడు సూత్ర విభాగములలో, నిర్దేశించినట్లుగా తమ దైనందిన జీవితములను గడుపుతున్నారు.

వైదిక వాఙ్మయములో కల్పసూత్రములేకాక మరొక సారస్వత విభాగమున్నది. దానిని "అనుక్రమణిక" అంటారు. వేదములలోని ఋక్కుల ప్రారంభ పదములను అందుగల అక్షర సంఖ్యను, దానిని ప్రవచించిన ద్రష్ట (ఋషి) నామమునూ, అనుస రించిన ఛందస్సునూ, కీర్తించబడిన దేవతపేరును, అక్షరక్రమములో నాలుగు వేదము లకు కూర్చబడివాటి అధ్యయనము సులభసాధ్యముగా చేయునవి.

క్షేత్ర గణితమునాధారముగా చేసుకొని రచించబడిన మరో సూత్ర విభాగమును సులువ సూత్రములని పిలుస్తారు. యజ్ఞయాగాది క్రతువులవంటి కార్యములు నిర్వ హించునపుడు యజ్ఞకుండముల నిర్మాణమును ఈ సూత్రములు నిర్దేశించును. యజ్ఞ కుండములు ఉండవలసిన ఆకారము, వాటి కొలతలు కావలసిన వస్తు సముదాయము, ఋత్వికుల సంఖ్య వంటి అంశములు ఇందు పొందుపరచబడినవి. గ్రీకు వేదాంతి గణితశాస్త్రజ్ఞుడైన పైతాగరస్ తన సిద్ధాంతమును ఈ సూత్రముల అధ్యయనానంతరమే రూపకల్పన చేసినాడని ప్రతీతి.

బోధాయనుడు రచించిన, సంకలనము, చేసిన కల్పసూత్రముల యందు శ్రౌత ధర్మగృహ్యసూత్ర భాగములు మూడునూ కలవు. వీటికి రచయిత నామమును కలిపి బోధాయన సూత్రములని పిలుస్తారు. అదేవిధంగా రచయిత పేరుతో పిలువబడే సూత్రములు భారతదేశములో పదునెనిమిది విధములుగా వున్నవి. భారతదేశము నందు ఒక్కొక్క ప్రాంతమున, ఒక్కొక్క సూత్రముననుసరించి హిందువులు తమ ఐహిక ఆముష్మిక కార్యములను జరుపుకొంటారు. దక్షిణ దేశములో ఎక్కువగా ఆపస్తంబ సూత్రములు పాటించేవారున్నప్పటికీ, బోధాయన సూత్రములను అను సరించేవారు కూడా ఉన్నారు. వారిని బోధాయనీయులు అని వ్యవహరిస్తారు. బ్రాహ్మ ణుల శాఖలలో ఇది ఒక శాఖ. పైన చెప్పినట్లు పదునెనిమిది విధములైన సూత్రముల అధ్యయనమునకు, వ్యాప్తికి గురుకులములవంటి ఆశ్రమములు భారతదేశములోని వివిధ ప్రాంతములలో ఏర్పాటు చేయబడి, విద్యార్థులకు శాస్త్రయుక్తంగా సూత్రము లను కంఠస్తము చేయించేవారు. అట్టి గురుకులములకు చరణములు అని పేరు.

అధ్యయనము పూర్తిచేసి ప్రచారార్హత పొందిన విద్యార్థులు తమ శాఖకు సంబంధించిన సూత్రములను వ్యాప్తి చేస్తూ, ఆ శాఖానుయాయిలకు ఋత్వికులుగా ప్రవర్తించేవారు. ఏ శాఖకు చెందిన సూత్రములు అధ్యయనము చేసి, నిత్య జీవితంలో పాటిస్తున్నాడో ఆ వ్యక్తి మరొక శాఖకు మారటం కానీ, మరొక సూత్రాధ్యయనము చేయటంకానీ నిషేధింపబడినది.

బోధాయనుడు తన సూత్ర రచనానంతరము, వానిపై వ్యాఖ్యలు రచించటం జరిగింది. ఆయన సూత్రములలో ప్రస్ఫుటముగా కనిపించే విషయ పరిజ్ఞానము, బోధించిన తీరును. వేద వాఙ్మయముపై నిశితమైన వ్యాఖ్యలు వ్రాసిన భారతీయ విద్వాంసులేకాక, దానిని క్షుణ్ణముగా అధ్యయనము జరిపిన విదేశీ విద్వాంసులు సహితమూ ఎంతో ఘనంగా ప్రశంసించారు. వైదిక కర్మకాండలపై ప్రఖ్యాతమైన వ్యాఖ్యలు వ్రాసిన భవస్వామి, బోధాయనుడు యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణపై ప్రస్తావించిన అంశములు వాటిని వివరించిన విధానమును, ప్రశంసిస్తూ క్లిష్టమైన వైదిక కర్మలను నిర్వహించుటలో, ఏ విధమైన లోపములు వాటిల్లకుండా సజావుగా సాగిపోవుటకు ఆయన సూత్ర రచనా విధానము ఎంతో దోహదకారియని తెలియ జేస్తూ అందుకు తన కృతజ్ఞతాభివందనములు ప్రకటించెను. అదేవిధంగా క్రీ.శ. 14 వ శతాబ్దిలో వేదములకు భాష్యములు వ్రాసి, జగత్ప్రసిద్ధి పొందిన సాయణా చార్యులు బోధాయనుని సవాఖ్యానసహితములైన సూత్రములను మెచ్చుకుంటూ వాటిని వేదములను సాగరమును, నిరపాయంగా, సుఖంగా దాటుటకు అవసరమైన నావతో పోల్చుటం జరిగింది. హరదత్తుడను మరొక ప్రఖ్యాత వైదిక భాష్యకారుడు, బోధాయనుని శ్రౌతసూత్రములపై విస్తృతమైన వ్యాఖ్యానము రచించినట్లుగా, ఇతర గ్రంథములనుండి తెలియుచున్నది. ఆయన రచన లభ్యము కాలేదు. ప్రాచీన, అర్వా చీన వైదిక విద్వాంసుల ప్రశంసలను పరిశీలించినచో, బోధాయనుడు వేద సంహితుల యందు, బ్రాహ్మణములయందు, తాను రచించిన కల్ప సూత్రముల యందు, అపార మైన పాండిత్యపటిమ కలవాడని ద్యోతకమగుచున్నది. ఇతర సూత్రకారుల సూత్రముల కంటే బోధాయనుని శ్రౌతసూత్రములు ఎక్కువ అధికారికంగా ఆమోదించ బడినవి.

ఆయన వ్రాసిన ధర్మసూత్రములు నాలుగు అధ్యాయములుగా విభజింపబడినవి. కొన్ని భాగములు శ్లోకరూపములోనూ, మరికొన్ని వచన రూపములోను రచింప

బడినవి. ప్రతి అధ్యాయము ఎనిమిది నుండి పన్నెండు ఖండములుగా పునర్విభజన చేయబడినది. ఈ ఖండములనే స్మృతులని వ్యవహరిస్తారు. స్మృతి అంటే జనజీవన నియమావళి, దీనినిగురించి స్థూలంగా ముందు వివరించటం జరిగింది. ఈ సందర్భములో భారతీయులు గర్వపడదగిన విషయమేమంటే, ప్రపంచములో ఎక్కువ భాగము ఆటవిక అనాగరక సమాజ భూయిష్టమై వున్న అతి ప్రాచీన యుగమునందు, ఒక్క హైందవజాతి మాత్రమే నిర్దుష్టమైన సామాజిక, సాంస్కృతిక మతపరము లైన విధి విధానములను పాటించటం, వాటికొరకై నియమావళి రూపొందించటం జరిగింది. ఇందులో ఎటువంటి అతిశయోక్తి లేదు.

బోధాయనుని గృహ్యాసూత్రములు మూడు అధ్యాయములలో పొందుపరచ బడినవి. అయితే వీటికి మరో మూడు అధ్యాయములను అజ్ఞాత వ్యక్తులు జోడించి నట్లు వేదవిదులు అభిప్రాయము వ్యక్తం చేసినారు. మానవ జీవితములో గృహ్యాసూత్ర ముల ఆవశ్యకత ముందుగా వివరించటం జరిగింది. అంతేకాకుండా ఈ సూత్రముల ద్వారా ప్రతివ్యక్తి జీవితమును నాలుగు దశలుగా విభజించి ఆయా దశలలో ఆ వ్యక్తి పాటించవలసిన ధర్మములు, ఆచరించవలసిన విధులు తెలియజేయబడినవి. ప్రతిదశనూ 'ఆశ్రమమనీ' పాటించవలసిన విధులను, ఆశ్రమ ధర్మములనీ వ్యవహరిం చటం జరుగుతోంది. బాల్యంలో బ్రహ్మచర్యము పాటించి వేద వేదాంగాదులను అభ్యసించటం, వివాహమాడి గృహస్థుడై తల్లిదండ్రులను, గురువులను, అతిథి, అభ్యాగతులను తనచుట్టూ వున్న సమాజమును ఆదరించి, గౌరవించి వారి అవసర ములను తెలుసుకొని తీర్చటం, ధన సంపాదన ద్వారా కుటుంబమును పోషించి, వారి అభివృద్ధికి పాటుపడటం మొదలగు కార్యనిర్వహణ బాధ్యతను స్వీకరించి సక్రమంగా నిర్వర్తించవలెను. దీనిని గృహస్థాశ్రమము అని పిలుస్తారు. మూడవదైన వానప్రస్థాశ్రమములో గృహస్థాశ్రమ ధర్మములను వారసులకు అప్పజెప్పి తాను ఆధ్యాత్మిక చింతనా నిమగ్నుడై అడవులు, కొండలు వంటి ఏకాంత ప్రదేశములలో సమాజమునకు దూరంగా శేష జీవితమును గడపాలి. సన్యాశాశ్రమము తురీయమై నది, చివరది. ప్రాపంచిక విషయములను సర్వమూ త్యజించి కాషాయాంబరధారియై, భిక్షాన్నమును భుజిస్తూ, నిశ్చితమైన వసతి లేకుండా దేశములో పర్యటిస్తూ, తత్త్వ ప్రబోధము చేస్తూ శేషజీవితం గడపాలి. ఈ విధంగా హిందూ మతానుసారియైన

ప్రతివ్యక్తి తన జీవిత కాలమును గడపవలెనని గృహ్యాసూత్రములు నిర్దేశించినవి. హిందువుగా జన్మించిన ప్రతివ్యక్తీ వర్ణాశ్రమ ధర్మములను పాటించుటయే కాక తల్లి గర్భమున పిండ రూపములో ఉన్నప్పటినుండి పాంచభౌతికమైన శరీరము, అగ్నిలోదగ్ధమయ్యే వరకూ అనుసరించ వలసిన, పదునారు సంస్కారములను అనుభ వించవలెనని నిర్ణయించినవి. ప్రతిసంస్కారమునకు నిర్దిష్టములైన మంత్రములు, వాటికి అనుగుణంగా ఆచరించవలసిన క్రియలు గృహ్యాసూత్రములలో వివరింప బడినవి. యావద్భారతదేశంలోని హిందువులు, తమ వేదశాఖలకు సంబంధించిన సూత్ర ములలో తెలియచెప్పబడినట్లు, ఈనాటికినీ పదునారు సంస్కారములను ఆచరిస్తూ ఉన్నారు. అయితే ప్రాంతీయ భేదములు, సూత్రకారునిబట్టి సూత్రములలో ఏర్పడిన వైవిధ్యములు మినహాయిస్తే మిగిలిన విషయములలో చెప్పుకోదగిన తేడాలుండవు. అజ్ఞానమువలనగానీ, నిర్లక్ష్యము వల్లగానీ, తమ సూత్రశాఖకు సంబంధించిన విధి విధానములను పాటించ పోయినప్పటికినీ, బోధాయన గృహ్యా సూత్రములను అనుసరించి ఆచార వ్యవహారములను జరుపు వ్యక్తులను దురా చారులుగాను, పాపులుగానూ పరిగణింపక మన్నించవలెనని అన్ని శాఖలకు చెందిన వేదవిదులు ఏకగ్రీవంగా ఆమోదించినారు. దీనినిబట్టి బోధాయనునికీ, అతని సూత్రములకూ, ఎంతటి గౌరవనీయమైన, ఉన్నత స్థానమును వైదిక ధర్మము ఆపాదించినదో అర్థమవుతుంది. అదేవిధంగా వివాహాది షోడశ సంస్కారములు తమ తమ సూత్రశాఖలు నిర్దేశించి నట్లుగా నిర్వర్తిస్తేనే వాటికి గుర్తింపు లభించగలదని నిర్ణయించినవి. కానీ, దేశములోని వివిధ ప్రాంతములలో వైదిక సంస్కృతి ప్రవేశము నకు ముందునుండీ పాటిస్తున్న అనేక ఆచారములు, సాంప్రదాయములను పరిగణనలోనికి తీసుకున్న ఫలితంగా ఆయా ప్రాంత ములయందలి, సూత్రకారులు రచించిన గృహ్యాసూత్రములలో సంస్కార విధివిధానములలో వైవిధ్యం గోచరిస్తుంది. ముఖ్యంగా వివాహ విషయములో సూత్రకారులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. బోధాయనుడు ఎనిమిది విధములైన వివాహ ములకు అంగీకారము తెలియజేయగా గౌతముడు తన సూత్రములలో వాటిని సమర్థించాడు. మరొక తెలుగు సూత్రకారుడైన ఆపస్తం బుడు వ్యతిరేకించి, వసిష్ఠుడు నిర్ణయించిన ఆరు విధములైన వివాహములను అంగీక రించాడు. ఆ ఆరింటిలోనూ మూండింటికి మాత్రమే ప్రాధాన్యత కల్పించటం జరిగింది. బోధాయనుడు అనాదిగా తెలుగునాట జరుపుకొనుచున్న మేనరికపు వివాహములకు సమ్మతి తెలుపగా ఆపస్తం బుడు ఖండించాడు, నిషేధించాడు.

బోధాయనుడు కల్పసూత్రములు, వాటిపై వ్యాఖ్యలు స్మృతి రచనకే పరిమితము గాక, ఆగమమునందలి రుద్రార్చనకు, పూర్వాంగంగా “మహన్యాసమును రచించి నాడు. న్యాసమంటే ఉంచుట అని అర్థము. భక్తుడు ఏ దేవుని అర్చించతల చుకుంటే ఆ దేవుని తన శరీరములోని వివిధావయములపైకి ఆహ్వానించి ఉంచుట. “నారుద్రో రుద్రమర్చయేత్” అని ఆగమశాస్త్రము నిర్దేశించినట్లుగా రుద్రార్చనకు, ముందు రుద్రుని తన దేహము పైకి ఆవాహనము చేసుకొనుటయే మహన్యాసము. ఆ విధంగా మహన్యాసము శివార్చనకు నాంది.

రుద్రుడే కాక ఏ దేవుని, దేవతను ఆరాధించతలచుకున్నా అంగ, న్యాస, కర న్యాసముల ద్వారా ఆ దేవతను తమ శరీరముపైకాహ్వానించుకొని, తానుకూడా ఆ దేవతా స్వరూపముగా భావించుకొని అర్చనచేయటమనేది పూజా విధానములో సాంప్రదాయముగా ఈనాటికీ ఆచరింపబడుచున్నది.

సుమారుగా 2,500 సంవత్సరములకు పూర్వము తెలుగువాడిగా జన్మించి, అంత ప్రాచీన కాలములో వేదవాఙ్మయమును క్షుణ్ణంగా అధ్యయనము చేసి వేద ధర్మవ్యాప్తికొరకై సూత్రరచన జరిపి మిగిలిన సూత్రకారులందరికీ ఆదర్శప్రాయుడై వారిలో అగ్రగణ్యుడై, సనాతన ధర్మప్రవర్తకుడై, వైదిక వాఙ్మయమునకు మెరుగులు దిద్దిన మహనీయుడు, ఋషి, తెలుగువారికే కాక భారతీయులందరికీ ప్రాతఃస్మర ణీయుడు, చిరస్మరణీయుడు.

■ ■ ■

# ఆపస్తంబుడు

పవిత్రగోదావరీ, కృష్ణానదీజలములతో ఆంధ్ర జనపదము ఏ విధముగా పునీతము, సస్యశ్యామలమై అన్ని రంగములలోనూ దినదినాభివృద్ధిని పొందినదో అదే విధముగా వైదిక వాఙ్మయమునందు భాగమైన సూత్రసారస్వతము కూడా తెలుగువారైన బోధాయన ఆపస్తంబులయొక్క సూత్ర రచన, సంకలనముల ద్వారా, కాలానుగుణముగా అభివృద్ధి చెంది ప్రశస్తిని పొందినది. సూత్ర సారస్వతము ద్వారా ముఖ్యంగా ఆపస్తంబుని సూత్రములలో ఆనాటి దక్షిణభారతదేశములో వెలసిన హైందవ రాజ్యములను గురించి వివరించుట వలన నాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికపరములైన అనేక విషయములు మనకు అవగతమగుచున్నవి.

సూత్రరచన, సంకలనము చేయవలసిన ఆవశ్యకత, వాటి వ్యాప్తికి కారణ భూతము లైన సాంఘిక, మత పరిస్థితులను గురించి, బోధాయనమునకు సంబం ధించిన అధ్యాయములో వివరించబడినది, కాబట్టి చర్విత చరణముగా భావించబడి, ఈ వ్యాసమున వదలి వేయబడినది. బోధాయనుడు క్రీ.పూ. ఆరవ శతాబ్దమునకు చెందిన వాడుగా పరిగణింపబడగా ఆపస్తంబుడు క్రీ.పూ. ఐదు, మూడు శతాబ్దముల మధ్య జీవించినట్లుగా చరిత్రకారులు భావించటం జరిగింది. ముందు అధ్యాయములో తెలియజేసినట్లు బోధాయనుని ఆపస్తంబుని సూత్రములను క్షుణ్ణంగా అధ్యయనము చేసి వాటిని ఆంగ్లభాషలోనికి అనువదించిన డాక్టర్ బుహలర్ మహాశయుని అంచనా

ప్రకారం, పై ఇరువురు సూత్రకారుల మధ్యకాలము, దశాబ్దములలోకాక, శతాబ్దము లలో ఉండవచ్చునని భావన. ఆ విధమైన అంచనాలను అనుసరించి, భాషాపరంగా అపస్తంబుడు క్రీ.పూ. మూడవ శతాబ్దమునకు చెందినవాడై ఉండవచ్చునని నిర్ణయిం చటం జరిగింది. అయితే ఆయన సూత్రముల యందలి మరికొన్ని సామాజిక అంశముల నాధారంగా చేసుకొని, ఆయన క్రీ.పూ. ఐదవ శతాబ్దపువాడై కూడా ఉండవచ్చుననే మరో అభిప్రాయము కూడా వ్యక్తం చేయటం జరిగింది. డాక్టర్ పి.వి. కాణే అభిప్రాయం ప్రకారం, ఆపస్తంబుని సూత్ర రచనా కాలమును నిర్దిష్టంగా చెప్పవలసి వస్తే అది క్రీ.పూ. 450-350 మధ్య జరిగి ఉండవచ్చునని భావించారు. ఈ రకమైన అభిప్రాయ భేదములు ఉండటం వలన రాధాకృష్ణన్ పండితులు, పై విషయములపై వాఖ్యానిస్తూ, భారతదేశములో సూత్ర వాఙ్మయమునకు చెందిన అంతరార్ధ భావనలు, అప్పటికే వ్యాప్తిచెంది ఉండుట వలన సూత్ర రచనా కాలమును కానీ, సూత్రకారుల కాలమును గానీ, నిర్దుష్టంగా నిర్ణయించటం వీలుపడదన్నారు. ఇటీవలి కాలంలో ప్రసిద్ధ చరిత్రకారులు కీ.శే.శ్రీ హనుమంతరావుగారు ఆపస్తంబుని జీవితకాలము క్రీ.పూ. 500-400 మధ్యంతరముగా నిర్ణయించుట జరిగింది. ఈ సూత్రకారుని కాలానికి ఆంధ్రదేశంలో ఆర్య-అనార్య సంస్కృతుల సమ్మేళనము పూర్తియైనట్లు చెప్పవచ్చును.

ఆపస్తంబుడు మనదేశంలో ఏ ప్రాంతమునకు చెందినవాడనే విషయముపై దాదాపు అందరు తాత్త్వికులకూ చరిత్రకారులకు కూడా అతడు ఆంధ్రుడనే ఏకాబి ప్రాయము ఉన్నది. బుహ్లర్ మహాశయుని మాటలలో చెప్పాల్సి వస్తే, ఆపస్తంబుడు తెలుగుదేశములో, నివశిస్తూ సూత్రరచన, సంకలనములను చేయుటయేకాక, వాటి బహుళ వ్యాప్తికై కృషి చేసినాడు. ఆ కాలమందు ఆంధ్రభూమిని ఒక బలమైన రాజ వంశము పాలించుతూ ఉండేదనీ, అది గోదావరీ, కృష్ణానదుల మధ్యగల ప్రదేశమును ఏలుబడి గావించిందనీ, దాని రాజధాని కృష్ణానదీ తీరమునగల ప్రాచీన పట్టణము, అమరావతియని తెలియ చెప్పుచూ, ఆ విధంగా భావించుటకుగల కారణములను ఆ పాశ్చాత్య పండితుడు ఈ విధంగా వివరించుట జరిగింది.

1. ప్రథమంగా శ్రాద్ధకర్మలను నిర్వహించుటలో ఉత్తరాదివారికీ, దాక్షిణ్యాత్యులకు, మధ్య తేడాలున్నవి. ముఖ్యంగా పితృ దేవతలుగా ఆరాధించిన బ్రాహ్మణుల

దోసిటిలో నీరు పోయటం కేవలం ఔత్తరాహుల ఆచారమే. ఈ విషయమును ఎత్తి చూపటంవలన ఆపస్తంబుని దాక్షిణ్యాత్యునిగానే భావించవలెను.

2. బోధాయనుడు ఆపస్తంబుడు ఇద్దరూ తను సూత్రరచనకు ఆంధ్రప్రతిగా పరిగణింపబడే తైత్తరీయారణ్యకము"నే అనుసరించారు. సాధారణంగా వేద పండితులెవరూ తమ ప్రాంతములో ప్రజాదరణ పొందని గ్రంథమును, అధికారికంగా పరిగణించి అనుసరించరు. ఆ కారణంగా వారిద్దరూ ఆంధ్రులనే భావించుట జరిగింది.

3. ఆపస్తంబుని అనంతర కాలములో రచింపబడిన "మహార్ణవమనే" గ్రంథంలో ఆపస్తంబ సూత్ర సంప్రదాయము గోదావరి నదీ ముఖద్వార ప్రదేశములోనే స్థాపించబడి వ్యాప్తి చెందినట్లు తెలియజేయబడినది. ఆ గ్రంథమునందే ఆపస్తంబీయులు అనగా ఆపస్తంబ సూత్రములను పాటించువారు ఎక్కువగా నర్మదా నదికి దక్షిణముగా, ద్వీపకల్పము యొక్క ఆగ్నేయ ప్రాంతములో నివసిస్తున్నారని వ్రాయడం జరిగింది.

డాక్టర్ కాణే, డాక్టర్ బుహ్లర్‌లు ఇద్దరూ పై అంశములపై ఏకాభిప్రాయమును వ్యక్తం చేశారు. అంతేకాక ఆపస్తంబ సూత్రములలోని పెక్కు అంశములు తెలుగువారు ఈనాటికీ పాటిస్తున్న ఆచార వ్యవహారములలో కన్పిస్తాయి. కాబట్టి ఆపస్తంబుడు తెలుగు వాడేననేది నిర్వివాదాంశముగా భావించవచ్చును. అంతేకాక ఆయన సూత్రముల వ్యాప్తికై ఏర్పడిన గురుకులములు గోదావరీ, కృష్ణా నదుల ముఖద్వారా ప్రాంతములయందే ఉండుట విశేషము. ఈ సందర్భములో ఆపస్తంబ సూత్రములను తెలుగువారు మాత్రమే అనుసరిస్తున్నారన్న కాణేగారి అభిప్రాయము సరియైనది కాదనవచ్చును. ఈ సూత్రములను మహారాష్ట్రములోని, నాసిక్, పూణే, సతారా కొల్హాపూర్ జిల్లాలోనూ, గుజరాత్‌లోని అహమదాబాద్ ప్రాంతములోనూ, దక్కనులోని మరికొన్ని ప్రాంతములలో కూడా పాటిస్తున్నారు. క్రీ.పూ. 230 నుండి క్రీ.శ. 2వ శతాబ్దము వరకూ దక్షిణాదిని పాలించిన శాతవాహనుల సామ్రాజ్యములోని అనేక ప్రాంతములలోని బ్రాహ్మణులు ఆపస్తంబీయులే. వీరు కృష్ణయజుర్వేద శాఖకు చెందినవారు. అదేవిధంగా భారతదేశపు పశ్చిమ ప్రాంతము వారు సాంఖ్యాయన సూత్రములను పాటిస్తారు. తూర్పు ప్రాంతములవారు అశ్వలాయన సూత్రములను

అనుసరిస్తారు. ఈ విధంగా దేశములోని వివిధ ప్రాంతములలోని వివిధ సూత్రకారుల కల్పసూత్రములు, అనుసరణీయములుగా వున్నవి.

ఆపస్తంబుడు, కేవలమూ సూత్రకారుడేగాక, వైదికవాఙ్మయములో అంతర్భాగము లైన వేదాంగములు, దర్శనములు, ఉపనిషత్తులు పురాణములయందు కూడా నిష్ణాతుడు. వేదమంత్రపఠనమునకు స్వరకల్పనచేసిన మహామహుడు. ప్రాంతీయ భాషోచ్చారణ వలన ఏర్పడు వైవిధ్యములు (యాస) వేదోచ్చారణపై ప్రభావమును చూపక, యావద్భారత దేశమునందు, వాటి పఠనము, ఒకేవిధంగా ఉండటానికి ఆపస్తంబుని స్వరకల్పన ఎంతో దోహదము చేసింది. దేశమునందలి వివిధ ప్రాంతము లలో, వివిధ భాషలవారు, వేదోక్తమైన క్రతువులు, కర్మలు నిర్వహిస్తున్నప్పుడు, క్రియా విధానములలో, వైవిధ్యము లేకుండుటకూ, మంత్రార్థములను ఎవరికి వారు తమకు తోచినట్లుగా అన్వయించు కొనకుండానూ, అందరూ ఒకే విధమైన పద్ధతిలో, ఒకే రకమైన అవగాహనముతో, కార్యనిర్వహణ చేయాలనే, మహదాశయంతో ఆపస్తంబుడు క్లిష్టమైన స్వరకల్పనను చేపట్టి, ఆశయసిద్ధి పొందినాడు. అయితే ఈ విధంగా వేదమంత్రములను, వేదోక్తక్రియలను, క్రమబద్ధీకరించే ప్రయత్నంలో ఆయన ప్రాంతీయ ఆచార వ్యవహారములను స్థానికుల మనోభావములను విస్మరించలేదు. వాటికి అనుగుణంగానే మార్పులు, చేర్పులు ప్రవేశపెట్టి వేదమంత్రపఠనా విధాన మును, న్యాసములను, వైదిక క్రతువుల నిర్వహణనూ, క్రమబద్ధీకరించాడు. ఒకే క్రమపద్ధతిని నిర్దేశించటంవల్ల వేదమంత్రములు, తత్సంబంధమైన అనేక క్రతువులు ప్రాంతీయ పలుకుబడులకు లోనై కాలక్రమేణ ఛిన్నాభిన్నమై, ప్రాంతీయ ఆచారములు, సంప్రదాయములుగా మారి, వాటి పవిత్రతను, ఉనికినే కోల్పోయేటటువంటి ప్రమాదము నుండి వైదిక వాఙ్మయమును, కర్మలను ఆపస్తంబుడు ఎంతో శ్రమకోర్చి కాపాడినాడు. ఆ విధంగా బ్రాహ్మణములలోని వాఙ్మయ, క్రియా విశిష్టతలను పరిరక్షిం చటం జరిగింది. ఆపస్తంబుడు క్లిష్టమైన ఈ కార్యక్రమమును చేపట్టుటకు కారణము, ఆ కాలములో భారతదేశము నందు సర్వత్రా ముఖ్యంగా, ఆంధ్రభూమిలో వైదిక కర్మాచరణము అధికంగా వుండేదని భావించవచ్చు. సందేహములకు, చర్చలకు తావు ఇవ్వకుండా నిర్దిష్టమైన, దోషరహితమైన, ఒక క్రమపద్ధతిని విధించుట ద్వారా ఆపస్తంభుడు సనాతన ధర్మవ్యాప్తికి చేసిన సేవ ఎనలేనిది. ఇతర సూత్రకారుల

రచనలు సాక్షికంగా లభించగా, అదృష్టవశాత్తు ఆపస్తంబుని కల్పసూత్రములు పరిపూర్ణంగా లభించినై. ఆయన వ్రాసిన కల్పసూత్రములలోని శ్రౌత, ధర్మ, గృహ్యా సూత్రములనబడు మూడు భాగములు లభించుట వలన అందు నిర్దేశించిన విధంగా ఆచరించుట, ఈనాటి వరకూ జరుగుతున్నది. ఆయన కల్పసూత్రములలో 30 అధ్యాయములు ఉన్నాయి. వీటిని ప్రశ్నలని పిలుస్తారు. మొదటి నుండి ఇరువది నాలుగు ప్రశ్నల వరకూగల విభాగమును శ్రౌత సూత్రములంటారు. వీటిలో వైదిక కర్మల నిర్వహణను గురించి నిర్దేశించుట జరిగింది. ఇరువదియైదవ ప్రశ్నలో శ్రౌతసూత్రములపై వివరణ, వాఖ్యానము పొందుపరచబడినవి. ఇరువది ఆరు, ఇరువది ఏడు ప్రశ్నలను గృహ్యాసూత్రములని పిలుస్తారు. వీటిలో ఇంటియందే గృహస్థు జరుపుకొను, పుంసవనము నామకరణము వంటి షోడశ సంస్కారములకు సంబంధించిన విధి విధానములు నిర్దేశింపబడినవి. ఇరువది ఎనిమిది ఇరువది తొమ్మిది ప్రశ్నలయందు ధర్మ సూత్రములు ఉన్నవి. ఈ ధర్మ సూత్రములన్నీ మానవుని ఐహిక జీవనమునకు సంబంధించిన అనేక అంశములను ప్రస్తావించి వాటిపై ధర్మ నిర్ణయము వివరించబడినది. వ్యక్తి తనజీవిత కాలములో ఎన్నివిధములైన ఐహిక వ్యవహారములను నిర్వర్తిస్తాడో వాటన్నిటి పైన, సకారణంగా న్యాయ, ధర్మ నిర్ణయములను విశదీకరించటం జరిగింది. ముప్పదవది, చివరిదియైన ప్రశ్న, సులువ సూత్రములపై వ్రాయబడినది. సులువసూత్రములు అనగా యాగశాలలు, యజ్ఞ కుండములు, హోమకుండములు నిర్మాణమునకు పాటించవలసిన కొలతలు, ఆకారములు వంటి, అనేక క్షేత్రజ్ఞ గణిత వివరములు, ఏరకమైన యాగమునకు, యజ్ఞమునకు, హోమమునకు ఏవిధమైన వస్తువులను ఉపయోగించి కుండములను నిర్మించవలనో, వాటి కొలత వెట్లుండవలెనో ఏ దిశలందు వాటి నిర్మాణము జరుపవలెనో, ఏ ఆకారము కలిగియుండవలెనో, ఆదిగాగల అనేక విషయముల సంకలనమే సులువ సూత్రములు. డాక్టర్ తిబుత్ మహాశయుడు ఈసులువ సూత్రములను మొదటగా పాశ్చాత్య ప్రపంచమునకు తెలియజేశాడు. ఆవిధంగా మన పూర్వీకులు క్షేత్రగణిత విజ్ఞానమును ప్రపంచమునకు చాటిచెప్పుట జరిగింది. ఇందుమూలంగా భారతీయ సంస్కృతిని అధ్యయనము చేసిన ప్రఖ్యాత పండితుడు వాన్ షడ్డర్ వ్యక్తంచేసిన అభిప్రాయము ధృవీకరించబడినది. ఆయన సులువ సూత్రములపై

వాఖ్యానిస్తూ ప్రఖ్యాత గ్రీకు తాత్త్వికుడు, గణితశాస్త్రజ్ఞుడైన, పైథాగరస్ భారతీయ తత్త్వవేత్తల నుండి పునర్జన్మ సిద్ధాంతమును తెలుసుకొనటమేకాక, తన గణితశాస్త్ర ప్రజ్ఞాపాటవములను కూడ వృద్ధి పరచుకున్నాడని చెప్పాడు. గణితశాస్త్రములో అప్పటికీ ఇప్పటికీ కూడా భారతీయులు నిష్ణాతులు. ప్రాచీన కాలంలో హైందవ శాస్త్రజ్ఞుల నుండి, అరబ్బులు, వారివద్ద నుండి గ్రీకులు అనేక విధములైన గణిత సిద్ధాంతములను గ్రహించి, పాశ్చాత్య ప్రపంచంలో వ్యాప్తి చేశారనేది అందరూ ఆమోదించిన సత్యమేకదా!

ఆర్య. అనార్య సంస్కృతులను ఆపస్తంబుడు, తన సూత్రములలో అద్భుతంగా మేళవించాడు. స్థానిక, ప్రాంతీయ, ఆచార వ్యవహారములు, సాంప్రదాయములు, కట్టుబాట్లు, మతవిశ్వాసములు, వాటిని ఆచరించు విధానములను, వైదిక విధులతో అన్వయించి, వాటిని వేదవిహితములుగా  రూపొందించినాడు.

రాజ్య పాలకుల నుద్దేశించి ఆపస్తంబుడు, రాజధాని నగరమున దక్షిణ ముఖముగా రాజుల ఉపయోగమునకై పెద్ద సౌధమును నిర్మింపవలెననీ, అది నగర మధ్యమున ఉండవలెననీ, ఆ సౌధమునకు ముందు భాగమున ఒక పెద్ద కూటమును (Hall) నిర్మించి, దానిని ఆహ్వానితులకు, సన్మానితులకు వాసయోగ్యముగా ఉంచవలెననీ, నగర దక్షిణ శివారులో, ఒకింత దూరముగా సభాభవనమును ఏర్పాటుచేసి, ఆ భవనము యొక్క వాకిళ్లు ఉత్తర దక్షిణ దిశలలో ఉండేటట్లుగా నిర్మించి, తద్వారా సభాభవనములో ఉన్నతాధికారులు, సామాన్య ప్రజలతో కూడిన ప్రతినిధుల సభ నిర్వర్తించు కార్యక్రమాదులను చూచుటకు వీలుకల్పించవలెననీ. ఆ సభాప్రాంగణమున పవిత్రాగ్నులను వెలిగించి, వాటికి ఆహుతులను సమర్పిస్తూ, అవి ఆరిపోకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలనీ, రాజు, వసతి గృహసౌధము నందు, వేద పండితులకు సర్వ సౌఖ్యములను ఒనగూర్చి అతిథులందరకూ తలకొక గదిని కేటాయించి, ఆ గదులలో వారు సుఖముగా జీవించుటకు కావలసిన అన్ని సౌకర్యములను ఏర్పాటుచేసి, వారికిష్టమైన భోజ్య పదార్థములను, పానీయములను సమకూర్చవలెననీ, వారి ఆహ్లాదము కొరకు సంగీత నృత్యాది కళాకారులను సిద్ధముగా నుంచుటయేగాక, జూదమాడుకొనుటకై ఒక విశాలమైన బల్లను కూడా ఏర్పాటుచేయ వలెననీ, అతిథులూ నగరములోని సంపన్నులూ, తమ వద్ద నున్న చిత్ర, శిల్పకళాఖండము

లనూ, ఆయుధములను, ప్రదర్శించుటకు వీలైన ఏర్పాట్లు చేయవలెననీ రాజ్యము నందు అనేక విధములైన కళలు, విజ్ఞానశాస్త్రము, వేద వాఙ్మయాభివృద్ధికై రాజు, రాజ్యములోని సంపన్నులు కృషి చేయవలెనని నిర్దేశించటం జరిగింది.

ప్రజలను కాపాడవలసిన బాధ్యత రాజపాలకునదే. వారు అరణ్యవాసులైనా, గ్రామీణులైనా, నగరవాసులైనా, అడవి మృగములనుండి, దోపిడి దొంగలనుండి, ఇతర అసాంఘిక శక్తులనుండి, ఈతి బాధల నుండి రక్షిస్తూ, వారు శాంతియుతంగా ప్రశాంత జీవనమును సాగిస్తూ, వారి వారి నిత్యకృత్యములకు ఏ విధములైన ఆటంక ములు రాకుండా కాపాడుటయే రాజ ధర్మమని వివరించాడు.

ధర్మ సూత్రములు లేక సామాజిక చట్టముల విషయంలో ఆపస్తంబుడు తనకు పూర్వీకులైనా సూత్రకారులనే అనుసరించినాడని చెప్పవచ్చు. ఇందుకు ఎవరినీ తప్పు పట్టవలసిన పనిలేదు. ఎందుకనగా ఆనాటి సాంఘిక చట్టములలో, న్యాయ వ్యవస్థలో మనిషికీ, మనిషికీ మధ్య అసమానతను పాటించటం పరిపాటిగా ఉండేది. ఇది మన దేశములోనేకాక, ఆకాలపు నాగరిక ప్రపంచమంతటా, ఇటువంటి అస మానత చోటు చేసుకున్నది. ఆమాటకొస్తే ఈనాటి నాగరిక దేశాలలో కూడా దేవునిపేరుతోనో, మతము పేరుతోనో న్యాయ నిర్ణయము చేయటంలో అసమానతను పాటించటమేకాక, శిక్షా విధానములలో కూడా వైవిధ్యమును అమలుపరుస్తున్నారు. అందువల్ల ఈ విషయములో కేవలము ఆనాటి భారతీయ తాత్త్వికులనే తప్పు పట్టనవసరములేదు. సూత్రరచనాకాలము లయందు ఒకే తప్పు చేసిన బ్రాహ్మణునకు బ్రాహ్మణేతరునకు విధించే శిక్షలు వేరుగా వుండేవి. బ్రాహ్మణుడు ఒక ఘాతుక చర్యనుచేస్తే, రాజు ఆతని నుదురుపైన ఎఱ్ఱగా కాలిన లోహపు ముక్కతో ఇతడు నేరస్థుడనే ముద్రవేయించి, దేశ బహిష్కారమునకు ఆజ్ఞాపించే వాడు. అదే నేరమును బ్రాహ్మణేతరుడు చేస్తే నేరస్థునికి మరణశిక్ష విధించి ఆతని ఆస్తి, పాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేది. వ్యభిచారమును మొదటి నుండీ భారతీయులు నేరంగా పరిగణించేవారు. ఈ విషయములో కూడా అగ్రవర్ణములవారైన బ్రహ్మ, క్షత్రియ, వైశ్య కులస్థులకు, ఇతర కులస్థులకు విధించబడే శిక్షలలో వ్యత్యాసము కనబరిచేవారు. పై మూడు కులముల వారిలో వ్యభిచార నేరస్థులుగా నిర్ణయింపబడినవారికి దేశ బహిష్కరణ శిక్షను మాత్రమే విధించేవారు. అదే ఇతర కులములకు చెందినవారు,

నేరస్థువైతే, అందునా అగ్రకులస్త్రీతో వ్యభిచరిస్తే, వానికి మరణదండన అమలు చేసేవారు. అగ్రకులమునకు చెందిన పెద్ద మనిషిని, శూద్రుడు దుర్భాషలాడితే అతని నాలుకను కోశివేశేవారు. అయితే నేరము చేసిన శూద్రుని అంతస్థ అగ్రవర్ణునితో సమానమైన పక్షంలో, కేవలమూ కొన్ని కొరడా దెబ్బలు మాత్రమే శిక్షగా విధించేవారు. ఈవిధంగా బ్రాహ్మలు సృష్టించిన శిక్షా స్మృతులలోని వ్యత్యాసములపై శ్రీ రమేశచంద్ర దత్తుగారు వ్యాఖ్యానిస్తూ, అసమానతలుగల చట్టములను కల్పించుటలో బ్రాహ్మణుల ఉద్దేశ్యములో తమ కులాన్ని, అంగబలము, అర్ధబలము కలిగియున్న ఇతర కులస్థుల దౌర్జన్యముల నుండి కాపాడుకొనుటకూ, సమాజములో క్రమశిక్షణా రాహిత్యము ప్రబలము కాకుండా అడ్డుకొనుటకూ, భయపెట్టుటకు మాత్రమే, చేయబడినవి కానీ వాస్తవముగా ఏనాడూ వీటిని నిక్కచ్చిగా, విస్తృతంగా అమలుపరచలేదని అభిప్రాయపడ్డారు, జరిమానాలు విధించటంలో కూడా, బ్రాహ్మణేతరులు అగ్రవర్ణములమధ్య తారతమ్యతను పాటించేవారు. బ్రాహ్మణుడు, ఇతర అగ్రకులస్థులనుగానీ, చతుర్ధకులజులనుగానీ నిందిస్తే జరిమానా నామమాత్రంగా ఉండేది. అదే నేరము ఇతర కులస్థులు, బ్రాహ్మణుల పట్ల చేస్తే, తూలనాడితే, నేరస్తుని కులమును బట్టీ, తూలనాడినవాని కులమును బట్టి జరిమానా అధికంగా విధించబడేది. కొన్ని రకములైన దొంగతనములతో మరణదండనే శిక్ష. అటువంటి నేరములలో నేరస్థుడు తల విరబోసుకొని దుడ్డు కర్రను చేబట్టుకొని సభలోనున్న రాజు ఎదుట నిల్చి తన నేరమును ఒప్పుకోవాలి. అట్లు నేరమును అంగీకరించినవాని తలను రాజు తన ఖడ్గముతో ఖండించటమో లేక వాడి తలపై బలమైన ఆయుధముతో మోది వాడిని చంపటమో చేయాలి. ఆ విధంగా వాడిని చంపక జాలిదలచి వదలివేస్తే, వాడి నేరము వలన సంక్రమించే పాపము, రాజును చుట్టుకుంటుంది. గౌతముడనే సూత్ర కారుడు చేసిన పై చట్టముతో ఆపస్తంబుడు ఏకీభవించలేదు. శిక్షించటమూ, నిర్దోషిగా వదలి వేయటము రాజుకుగల ప్రత్యేకాధికారములు. ఆయన చర్యపై ప్రశ్నించే అధికారము ఎవరికీ లేదని నిర్ణయించాడు. చేసిన నేరము, మరణ దండనార్హమైతే ఆ నేరస్థుని తరఫున మతగురువు కానీ, యువరాజుకానీ, రాజ పురోహితుడుగానీ అతని విముక్తికై రాజసభలో వాదించవచ్చు. ఈ విధములైన వైవిధ్యములతో పొందుపరచబడిన, శిక్షాస్మృతులను భారతీయులు అనాదిగా పాటిస్తూ వచ్చారు.

ప్రభుత్వ నిర్వహణకూ, న్యాయ నిర్ణయమునకుగాను సామాజిక, పౌరుల హక్కులు, బాధ్యతలకు, సంబంధించిన విషయములను ఐదు విధములుగా వర్గీకరించారు.

1. వ్యవసాయము, పశుపోషణకు సంబంధించినవి.
2. ఆస్తికి
3. వడ్డీ వ్యాపారము
4. వారసత్వహక్కులు
5. ఆస్తి పంపకము.

వ్యవసాయము, పశుపోషణకు సంబంధించిన వివాదములపై, ఆపస్తంబుని న్యాయ నిర్ణయములు ఈ క్రింది విధంగా ఉన్నవి.

1. పొలమును కౌలుకు తీసుకొనిన వ్యక్తి వ్యవసాయము చేయక, బీడుగా మార్చి వేస్తే. ఆదాయములేకుండా చేస్తే, అట్టి వ్యక్తి భూస్వామికి నష్టపరిహారంగా ఆ పొలములో సక్రమ పద్ధతిలో వ్యవసాయము చేస్తే రాగల ధనమును నష్ట పరిహారంగా ఇవ్వవలెను.
2. పొలమును దున్నవలసినదిగా నియమింపబడిన సేవకుడు, ఆపనిని సక్రమంగా నిర్వహించకపోతే వానికి కొరడా దెబ్బల శిక్ష విధించవలెను.
3. పైన తెలిపిన శిక్షను పశువుల మందను విడచిపెట్టిన కాపరికి కూడా వేయవలెను.
4. పశువులు, గొఱ్ఱెలు, మేకలు సరియైన కాపరి అదుపులో లేకపోయినచో వాటిని ప్రభుత్వము స్వాధీనము చేసుకొనవచ్చు.
5. అదుపునందు లేని పశువులు పంట చేనులోబడి, పంటను తినినచో, ఆ నష్టమును పశువుల యజమాని భూస్వామికి నష్టపరిహారముగా చెల్లించవలెను. అదుపు తప్పిన పశువులను స్వాధీనపరచుకొనవచ్చునే కానీ, వాటికి ఏ విధమైన హాని చేయరాదు.
6. పశువుల కాపరికి ఒప్పగించిన పశువులుకానీ, గొఱ్ఱెలు, మేకల వంటి జీవులు ఆతని నిర్లక్ష్యము కారణముగా చనిపోయినచో, పశువులకాపరి వాటి విలువకు సరియగు ధనమును ఆసామికి చెల్లించవలెను.

7. ప్రభుత్వమునకు చెందిన అడవులలో గొడ్లు కనిపించినచో వాటిని అడవుల కాపరులు తోలుకొనివచ్చి వాటి యజమానిని తగు విధముగా మందలించి పశువులను వొప్పగించవలెను.

ఇక స్థిరచరాస్తుల విషయములో, వ్యక్తి ఆస్తిపాస్తులు ఎనిమిది రకములుగా విభజించబడినవి.

1. తండ్రి నుండి పొందిన వారసత్వపుటాస్తి - పిత్రార్జితము
2. వ్యక్తి తను సొంతముగా కొనిన ఆస్తి - స్వార్జితము
3. ఆతను తాకట్టు పెట్టుకొనినది.
4. కన్యాశుల్కముగా భార్యకు తన కుటుంబము వారిచ్చినది.
5. బహుమతిగా పొందినది.
6. వైదిక కర్మలను నిర్వహించుటవలన, దక్షిణగా పొందినది.
7. భాగస్తులు తిరిగి ఏకమగుట వలన పొందిన ఆస్తి.
8. జీతభృత్యములకు బదులుగా పొందినది.

ఆస్తి హక్కులపై వివాద మేర్పడినచో దిగువ చెప్పిన మూడు రకముల సాక్ష్యాధారము లను పరిగణనలోనికి తీసుకొనవలెను.

1. అధికారిక పత్రములు
2. సాక్షులు
3. స్వాధీనత

ఆస్తి ఏ కారణముల వలనైనా పది సంవత్సరములుగానీ అంతకుమించి గానీ ఆసామి స్వాధీనములో లేక ఇతరుల స్వాధీనములో ఉన్నచో, అట్టి ఆస్తిపై హక్కును యజమాని కోల్పోయి అది ఎవరి స్వాధీనములో ఉన్నదో అతడే దానికి హక్కుదారుడు అవుతాడు. అయితే ఈ నిర్ణయము చిన్నపిల్లలు, ఆడవారు, విధవలు, తాకట్టు పెట్ట బడిన ఆస్తులు, సరిహద్దులుగా వున్న భూములు, శ్రోత్రియ బ్రాహ్మణులకు చెందినవి, తనఖాపెట్టిన ఆస్తులకు వర్తించదు. ఆస్తిపై హక్కును వదలుకుంటే, సదరు ఆస్తి ప్రభుత్వమునకు చెందును. అదేవిధంగా వడ్డీ వ్యాపారస్తులకు, భూమిపై అప్పులిచ్చు వారు, నిర్వహించు వ్యాపారములు క్రమబద్ధీకరించుటకు కూడ సూత్రకారులు చట్టములను ఏర్పాటు చేసినారు. అయితే వీరి చట్టములలో వైవిధ్యములున్నవి.

ఉదాహరణకు ఆస్తులు తాకట్టు పెట్టుకొని ఇచ్చునటు వంటి ఋణములకు, తాకట్టు లేకుండా ఇచ్చు ఋణములకు సంబంధించిన వడ్డీల యందు వ్యత్యాసము ఉన్నది. పెద్దలు తీసుకున్న ఋణములను చెల్లించే బాధ్యత వారి వారసులపై ఉన్నది. అయితే ఆ ఋణములు, జూదమాడుటకు మాదక ద్రవ్యములకు, వ్యభిచారము వంటి నీతిబాహ్యమైన ఖర్చులకొరకై ఉండకూడదు. ఉన్నపక్షంలో ఆ అప్పులను చెల్లించ వలసిన బాధ్యత ఋణగ్రహీత పుత్రపౌత్రాదులకు ఉండదు.

ప్రాచీనమైన హైందవ జాతి చరిత్రలో వివాహము పవిత్రమైన సంస్కారము. దాని లక్ష్యము కేవలము వంశాభివృద్ధికై పుత్ర సంతానమును పొందటం. పుత్రుడు ఆస్తికి కేవలము వారసుడే కాక, ఆతడు కుటుంబ వ్యాప్తికి, గోత్రాభివృద్ధికి, అత్యంత అవసరమైన వ్యక్తి. పుత్రుడు తమ ఆత్మలను పున్నామనరకమునుండి కాపాడుతాడనే విశ్వాసము ఇప్పటికీ హిందువులలో గాఢంగా వున్నది. కాబట్టి పుత్రుణ్ణి కనటం ఒక బాధ్యతగా భావిస్తారు. స్వంత పుత్రుడు లేనివారికి, ఆస్తిపాస్తులకు వారసుడుగానే కాక, వారి వంశాభివృద్ధికి, సద్గతులు పొందడానికి అవసరమైన కార్యక్రమములు, స్వంత పుత్రుని వలనే నిర్వహించటానికి కావలసిన ప్రత్యామ్నాయ పుత్రుల జాబితాను పొందుపరచి యున్నారు. కానీ ఈ జాబితాపై సూత్రకారులు అందరికీ ఏకాభి ప్రాయము కొరవడింది. అంతేకాక ఈ జాబితాలోని కొంతమందిని ఆస్తులకు, కులవృత్తికి వారసులుగా నిర్ణయించి, మరికొంతమందికి ఎటువంటి హక్కులు లేకుండా, కేవలము కుటుంబ సభ్యులుగా మాత్రమే గుర్తించుట జరిగింది. గౌతముడు, వసిష్ఠుడు, బోధాయనుడు, కొద్ది కొద్ది మార్పులు, చేర్పులతో ప్రత్యామ్నాయ పుత్రుల జాబితాకు ఆమోదము తెలిపారు. గౌతముడు, వసిష్ఠుడు పన్నెండు రకముల వారిని పుత్రులుగా గుర్తించగా బోధాయనుడు వారి సంఖ్యను పదునాలుగుకు పెంచాడు. వీరిలో ఏడుగురికి మాత్రమే కొడుకులుగా గుర్తించి, ఆరుగురిని కేవలము కుటుంబ సభ్యులుగా ఆమోదించి మరొకనిని అనగా బ్రాహ్మణునకు, శూద్రస్త్రీకి కామోద్రేకము ద్వారా జన్మించినవానిని, పరస్వుడని చెప్పి కుటుంబ సభ్యత్వమునకుకూడా అనర్హుడని ప్రకటించాడు. ఈ సందర్భంలో గమనించవలసిన మరొక ముఖ్యాంశము ఏమిటంటే గౌతమవసిష్ఠుల జాబితాలోని, పన్నెండు రకములైన పుత్రులలో ఒక కన్యను కూడ చేర్చుట. అందుకు సంబంధించిన సూత్రములో ఒక వేదమంత్రమును ప్రమాణముగా

చూపి, ఈ చర్య వేదవిహితమని తెలియజేయడం. దానిని ఆధారముగా తీసుకొని, స్త్రీ, వివాహిత అయినప్పటికినీ, సోదరులులేని పక్షంలో, తాను పుట్టింటికి తిరిగివస్తే ఆమెను కొడుకు వలెనే పరిగణించవలెనని నిర్దేశించటం, ఈ రకమైన పరిగణన దేశవ్యాప్తంగా లేనప్పటికీ, రాజతరంగిణి పేరుతో కాశ్మీరరాజ చరిత్ర వ్రాసిన కల్హణుడు, ఆ దేశపురాజ వంశములో పుట్టింటికి తిరిగి వచ్చిన పుత్రికను పురుషుడిగా నామకరణముచేసి, పుత్రుడుగా ప్రకటించి, ఆతని హక్కులు, బాధ్యతలు, నిర్వహించ వలసిన విధులు, అప్పగించటం జరిపినట్లు వ్రాయటం జరిగింది. తమాషా ఏమంటే ఆంధ్రదేశంలో కూడా కాకతీయుల పరిపాలనా కాలంలో పుత్రసంతతిలేని గణపతిదేవుడు వివాహితయైన తన పుత్రిక రుద్రమదేవిని, రుద్రదేవుడని పేరు పెట్టి పట్టాభిషేకం జరిపించిన విషయము తెలుగువారికి సుపరిచితమేకదా! పురుష దుస్తులను ధరించి రుద్రమ కాకతీయ సామ్రాజ్యాధిపతిగా ఆంధ్రభూమిని క్రీ.శ. 1209–1296 వరకు పరిపాలించింది. బహుశా ఇటువంటి సంఘటనలు చరిత్రలో జరగటానికి పై సూత్రకారుల నిర్దేశమే కారణంగా భావించవచ్చునేమో!

కాలక్రమేణ పుత్రులను అనేక విధములుగా విభజించటం, కొందరిని చట్టబద్ధ మైన వారినిగానూ, మరికొందరిని అందుకు వ్యతిరేకముగానూ పరిగణించటం అనే ప్రక్రియను అడ్డుకొనటం జరిగింది. తీవ్రమైన వ్యతిరేక భావములు సామాన్యుల యందు కూడ ప్రదర్శితమవటం వల్లనే కాబోలు, ఆపస్తంబుడు తనకు ముందున్న సూత్రకారుల అభిప్రాయమును వ్యతిరేకించి, వారి కాలమందు వెల్లడించిన భావములు, ఆచరణలు, శతాబ్దముల అనంతరం, ఈ కలి కాలములో అనుసరించ దగినవి కావని స్పష్టంగా ప్రకటించాడు. అందుకుగాను తన స్వంతపద్ధతిలోనే అధికారికమైన పుత్రునిగా ఎవరిని గుర్తించవలెననే అంశముపై స్పష్టమైన నిర్ణయము చేశాడు. దాని ప్రకారము ఒకవ్యక్తి అవివాహితయైన స్త్రీని, తన కులమునకే చెందిన దానిని, యుక్తవయస్సులో నున్న కన్యను ఆర్షసాంప్రదాయమును అనుసరించి వివాహ మాడి పుత్ర సంతానమును పొందితే, అట్టి సంతానమే శాస్త్రబద్ధమైన పుత్రులుగా గుర్తింపుపొంది, తమ తండ్రి ఆస్తిపాస్తులను కులవృత్తిని అనుభవించుటకు అర్హులని తన సూత్రములలో విస్పష్టంగా తెలియజేశాడు. బహూకరింపబడిన లేక కొన్నటు వంటి బిడ్డలను స్వంత సంతానముగా గుర్తించుట కుదరదని చెప్పాడు. ఇంతేకాక

సంతాన ప్రాప్తికై తన భార్యను మరొక పురుషుని వద్దకు పంపే 'నియోగ' పద్ధతిని కూడా తీవ్రంగా ఖండించాడు. వివాహ సమయంలో వధూవరులు చేసే ప్రమాణము లను పాటించకపోయినచో, వారికి నరకము తథ్యమని చెప్పాడు. ఈనాడు హిందు వులు ఆపస్తంబసూత్రములను అనుసరిస్తూ తమ కడుపున పుట్టిన బిడ్డనుకానీ, లేదా శాస్త్రబద్ధంగా పెంపుడుచేసుకున్న వానిని మాత్రమే పుత్రుడుగా పరిగణించుట జరుగుతున్నది.

సూత్ర వాఙ్మయమునుబట్టి, ఆనాటికే వర్ణాశ్రమ ధర్మము బలంగా వ్రేళ్లు నాటు కొని ఉన్నట్లు తెలుస్తున్నది. అంతేకాక కేవలము నాలుగు కులములుగా విభజింప బడిన సమాజములో, అనేక కులములు వృత్తులను బట్టి ఏర్పడినై. ఈ విధంగా సమాజము అనేక కులములుగా విభజింపబడి ఛిన్నాభిన్నమైపోయే ప్రమాదమును గుర్తించిన సూత్రకారులు, క్రొత్తగా ఏర్పడిన కులములన్నీ ప్రారంభమందున్న నాలుగు వర్ణముల మధ్య జరిగిన, అంతర్వివాహముల ద్వారా ఏర్పడినవేకానీ, వేరుకావని నచ్చచెప్పటానికి ప్రయత్నించారు. ఆధునిక యుగమందలి సాంఘిక శాస్త్రజ్ఞులు, సూత్రకారుల వివరణలను ఊహాజనితములని కొట్టిపారవేశారు. సమాజములో కులముల సంఖ్య పెరగటానికి కారణం ఆర్య-అనార్య జాతుల మధ్య వృద్ధి చెందిన సాంఘిక, సాంస్కృతిక సంబంధములు, కాలానుగుణంగా సమాజమునకు కావలసిన అవసరములు తీర్చుటకై అనేకములైన క్రొత్త వృత్తులు ఏర్పడటం, అట్టి వృత్తులను చేపట్టిన వారు తమలో తాము సంబంధ బాంధవ్యాలను పెంచుకొనటం ద్వారా నూతన కులములు సమాజంలో చోటు చేసుకొన్నవని నిర్ధారించారు. ఒక్కొక్క వృత్తి చేశేవారు ఒక్కొక్క కులము పేరుతో సమాజములో గుర్తింపబడ్డారు. సాంఘిక భద్రత, ఐక్యత సాధించటానికి వారొక ప్రత్యేక కులముగా ఏర్పడటం జరిగిందని శాస్త్రజ్ఞుల వాదన. ఇటువంటి విధానములను హైందవ సమాజములో ప్రవేశపెట్టడం వలన, వర్ణాశ్రమ ధర్మమునందలి పవిత్రత లోపించి నేడు దాని ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఒక చదువురాని బ్రాహ్మణుడు మహావిద్వాంసుని పుత్రుడైనప్పటికీ అతనికి సంఘములో గౌరవమర్యాదలు లభించుటలేదు. అదే ఒక శూద్రుని కొడుకు మంచి విద్యావంతుడైతే, వర్ణాశ్రమ ధర్మములను ప్రక్కన బెట్టి సంఘం అతనిని గౌరవిస్తున్నది. అతడు ఉన్నత పదవులను, ధన సంపాదనను సాధించగలుగుతున్నాడు. సామాజిక

దృష్టిలో వచ్చిన ఈ మార్పువల్ల చాలా బ్రాహ్మణ కుటుంబములు చాలీ, చాలని ఆదాయమును తెచ్చే వేద విద్యనుకాదని, ధనము, ఉన్నత పదువులు, రాజకీయ ప్రాబల్యము, సమాజములో పలుకుబడిని పెంపొందించగలిగే ఇతర చదువులకు, వృత్తులకు ఎగబడటం జరిగింది. అదేవిధంగా శూద్రులు కూడా వ్యవసాయము, పశు పోషణ, చేతివృత్తులువంటి వారి కుల వృత్తులను విసర్జించి మెండైన ఆదాయము, ఉన్నత పదవులు లభించగల చదువులను, ఇతర వృత్తులను చేపడ్తున్నారు. వీటి ద్వారా అధికారము సమాజంలో పేరు ప్రఖ్యాతులు, పొందటానికి తపన పడుతున్నారు. చారిత్రకంగా పరిశీలిస్తే దాదాపుగా క్రీ.శ. ఏడవ శతాబ్దమునుండి ఆంధ్రదేశమును పరిపాలించిన రాజులందరూ చతుర్ధ కులజులే. గద్దెనెక్కిన అనంతరము తాము సూర్యవంశ చంద్రవశపు క్షత్రియులమని ప్రకటించుకున్నారు. త్వర త్వరగా మార్పు చెందిన, చెందుతున్న అనాటి, ఈనాటి సమాజములలో కూడా అధిక ఆదాయము, ఉన్నత పదవుల సముపార్జనే ధ్యేయంగా ఏర్పడింది. అవకాశము లభిస్తే చాలు వర్ణాశ్రమ ధర్మములను, కులవృత్తులను కాలతన్ని ధనార్జనే ప్రధాన లక్ష్యంగా ఈనాటి సమాజం పరుగులు తీస్తున్నది. ఈపరుగు పందెములు, అనంతమైన కాల ప్రవాహంలో కొనసాగుతూనే ఉంటవని భావించటానికి దృఢమైన కారణములు అనేకము వ్యక్తమగుచున్నవి. యథార్ధంగా వర్ణాశ్రమ ధర్మమును అతిక్రమించి ఏర్పడిన, కులములను కులములుగా పరిగణించకూడదు. అవి వృత్తి రీత్యా సంఘములో ఏర్పడిన విభాగములుగానే గుర్తింపబడాలి. ఈరకముగా ఏర్పడిన కులవిభజన శాశ్వతంగా కొనసాగటానికి కూడా అవకాశములు తక్కువ. దాదాపు ఉండవనే చెప్పవచ్చును. ఆ విధంగా భావించటానికి గల కారణము సమాజములో ఒకతరమువారికి, మరొక తరము వారిమధ్య అభిరుచులలో, వస్తున్నమార్పులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రపరిజ్ఞానము, శారీరక శ్రమలేకుండా యంత్రములచేతనే మానవ జీవితావసరములను ఉత్పత్తి చేసుకోగలగటం. ఇంకా తరతరముల మధ్య మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామములు, విలువలు. ఈవిధంగా అనునిత్యమూ అనేక విధములైన మార్పులు చెందు తున్న సామాజిక వ్యవస్థలో ప్రస్తుత కుల విభజనే శాశ్వతంగా మనగలుగుటకు అవకాశమే లేదు. క్రొత్తక్రొత్త వృత్తులు జనిస్తుంటే, వాటికి అనుగుణంగా పాత కులములస్థానే క్రొత్తకులములు ఏర్పడటం ఒక సహజ పరిణామంగా కొనసాగుతుంది.

ఆస్తుల పంపకాల విషయములోకూడ, సూత్రకారుల మధ్య ఏకాభిప్రాయంలేదు. తండ్రి ఆస్తిని పంచుకొనేటప్పుడు, పెద్ద కొడుకుకు కొంత ఎక్కువ భాగము ఇవ్వవలెనని ఆపస్తంబుడు మినహా మిగిలిన సూత్రకారులందరూ నిర్ణయించారు. ఈ విధంగా నిర్ణయించుటకుగల ముఖ్యకారణం, పుత్రుని ఆవశ్యకత. ముందు వివరించినట్లు పున్నామ నరకమునుండి కాపాడుటకు వంశాభివృద్ధికీ తనకు అపరకర్మలు నిర్వహించ టానికీ, తన పూర్వీకులు శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తిని పొందటానికి పుత్రుని అవసరం ఉన్నదనే భావన. అంతేకాక తండ్రి తదనంతరము, కుటుంబ బాధ్యతల నన్నిటిని నెత్తిన వేసుకుని, నిర్వర్తించ వలసిన విధికూడా జేష్టపుత్రునిపైనే ఉంటుంది. అందుచేత శాస్త్రము, తల్లి తండ్రులు కొడుకు పుట్టాలని గాఢంగా కోరుకుంటారు. అలా పుట్టిన జేష్ఠపుత్రుడు శారీరక సుఖమును అనుభవించటంవలన జనించిన వాడుగాక, ధర్మ బద్ధమైన జన్మనెత్తిన వాడుగా పరిగణింపబడతాడు. తరువాత కలిగిన పుత్రులందరూ కామోద్దీపనమువలన జన్మించినవారు గానే పరిగణింపబడతారు. కాబట్టి హైందవ కుటుంబ వ్యవస్థలో పెద్దకుమారునికి కొంత ప్రాధాన్యత, బాధ్యత ఆపాదించబడింది. వాటి నిర్వహణకుగాను, మిగిలిన కొడుకులకంటె జేష్ఠునికి స్థిర చరాస్తులలో కొంత ఎక్కువ భాగము ఇవ్వవలెనని నిర్ణయించబడింది. దీనిని జేష్ట భాగమని పిలుస్తారు. ఆపస్తంబుడు ఈ నిర్ణయమును త్రోసిపుచ్చాడు. ఏ వేద విభాగమును (తైత్తరీయసంహిత) ఆధారముగా చేసుకొని, తన పూర్వ సూత్రకారులు అటువంటి నిర్ణయము చేశారో, దానిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరము, ఆ వేద విభాగము కేవలము వాస్తవిక పరిస్థితులను వివరించిందే కానీ జేష్టభాగము ఇచ్చి తీరవలెనని నిర్దేశించలేదని ప్రక టించాడు. ఆ విధంగా తన పూర్వీకుల నిర్ణయమును కొట్టిపార వేసిన ఆపస్తంబుడు, తండ్రి ఆస్తులు, అప్పులు అందరు కొడుకులు సమానంగానే పంచుకోవాలని నిర్ధారిం చాడు. అంతేకాక తండ్రి ఆస్తిపాస్థులను విలాస జీవితం గడపటానికిగానీ, లేక ఇతర చెడుఅలవాట్ల కొరకైగానీ ఖర్చుచేసిన కొడుకు, జేష్ట పుత్రుడు అయినప్పటికిన్నీ, వాని వారసత్వపు హక్కును రద్దుచేసి, వాడికి రావలసిన వాటాను ఇవ్వకూడదని నిర్ణ యించాడు. తల్లి ఆస్తుల పంపకం విషయంలో ఆప స్తంబుడు మిగిలిన సూత్రకారుల నిర్ణయములతో ఏకిభవిస్తూ తల్లికి స్త్రీ ధనంగా సంక్రమించిన స్థిర, చరాస్తులను అవివాహితులైన ఆమె పుత్రికలకు చెందవలెనని నిర్ణయించాడు, ఈనాటికీ హిందూ కుటుంబములలో ఆస్తుల పంపకం ఇదేవిధంగా జరుగుతూ ఉండటం గమనార్హము.

అందరు సూత్రకారులు తమ గృహ సూత్రములలో, ఆనాటి సామాజిక వ్యవస్థ స్వరూప స్వభావములను, ఆచార వ్యవహారములను, ప్రతిఫలింపచేశారు. షోడశ సంస్కారములు అనగా బిడ్డ మాతృగర్భంలో ఉద్భవించినప్పటినుండి, తిరిగి ఆతని శరీరము పంచభూతములలో విలీనమైపోయే వరకు పవిత్రజీవనము సాగించుటకు కావలసిన కర్మకాండలను, ఇంటిలోనే జరుపుకొను ప్రక్రియల వంటివి. బిడ్డ తల్లి గర్భంలో ఉండగానే పుంసవనము, జన్మించిన తరువాత, నామకరణము, అనం తరము అన్నప్రాసన. అగ్రవర్ణములకు చెందిన వారికి అతిముఖ్యమైన ఉపనయన సంస్కారము. ఈ సంస్కారానంతరమే ఆశ్రమ ధర్మములలో, మొదటిదైన బ్రహ్మ చర్యాశ్రమ ప్రవేశార్హత లభిస్తుంది. యజ్ఞోపవీతధారణ, పవిత్ర గాయత్రి మంత్రమును తండ్రి తనయుని చెవులో ఉపదేశించ టమే ఈ కార్యములో ముఖ్యమైనవి. తద్వారా తండ్రి తనయునికి ప్రథమ గురువౌతాడు. ఇక్కడ నుండి బాలునికి వేదవిద్యాబోధన ప్రారంభమౌతుంది. ప్రాచీనకాలములో విద్యార్థులు అడవులలో నెలకొనివుండే ఆశ్రమ ములకువెళ్లేవారు. తరువాతి కాలమునందు దేవాలయములకు అనుబంధముగా రాజులు ఏర్పరచిన ఘటికలని పిలువబడిన వేదపాఠశాలలకూ, అగ్రహారముల యందు ఏర్పాటుచేసిన పాఠశాలలకు వెళ్లేవారు. వేదవిద్యార్థి బ్రహ్మచర్య ఆశ్రమ మునకు విధించిన నియమనిష్టలను తప్పక పాటించాలి. శిరోముండనము, శిఖ (పిలక) తప్పనిసరి. చన్నీటి స్నానము, నేలమీదనే పడుకోవటం ఎటువంటి ఆభరణ ములు, అలంకారములు లేకుండా ఉండటం, వంటి అనేక క్లిష్టమైన నియమములను బ్రహ్మచారి పాటించాలి. బ్రాహ్మీముహూర్తము (తెల్లవారుఝామున నాలుగు గంటల ప్రాంతము)లో లేచి, స్నాన సంధ్యాదులు ముగించి వేదాధ్యయనము చేసి, అపరాహ్ణ మున భుజమునకు జోలె తగిలించుకొని మధూకర వృత్తి (భిక్ష) ద్వారా తగుమాత్రము ఆహారమును సంపాదించుకొని ఏకభుక్తంతో తృప్తిచెందాలి. గురువు పాఠము చెప్పిన ప్పుడే నేర్చుకోవాలి. గురువుకు, గురుపత్నికి కావలసిన సమిధలు, పండ్లు, పూలు, గోవులకు గ్రాసము సమకూర్చుతూ ఉండాలి. ఈ విధంగా గురువు కుటుంబానికి, ఆశ్రమవాసుల అవసరములు తీర్చడంలో నిమగ్నమై ఉండాలి. తాను ఏవేదశాఖకు చెందినవాడో, ఆశాఖకు చెందిన వేదమును, అందలి శాఖలను, తత్సంబంధమైన బ్రాహ్మణములను, ఉపనిషత్తులను, షట్శాస్త్రములను, ధర్శన సాహిత్యమును, ఆగమ, పురాణ ఇతిహాసములవంటి సమస్త వైదిక వాఙ్మయ అధ్యయనానంతరము, విద్వత్

సదస్సులలో పాల్గొని ఉత్తీర్ణతను సాధించి, గురువు అనుమతితో గురుకులమును విడచిపెట్టాలి. అగ్రవర్ణములకు చెందిన బాలురందరికీ వారి వారి కులమునుబట్టి కొద్ది గొప్ప మార్పులతో జీవన విధానము వర్తిస్తుంది. క్షత్రియునికి శస్త్ర అస్త్రవిద్యలు యుద్ధవ్యూహములు, పరిపాలనా వ్యవహారములు, ఆదిగాగల క్షత్రియోచితమైన విద్యలు నేర్పేవారు. వైశ్యబాలురైతే వ్యాపార వాణిజ్యములలోని మెళకువలు, వ్యవసాయము, పశుపోషణ మొదలైన ఆర్థిక విషయములు నేర్పబడేవి. అయితే కులమునుబట్టి విద్య నేర్పటమనేది కొంతకాలమునకు మార్పు చెందింది. అందుకు ఉదాహరణ మహాభారతము నందలి ద్రోణాచార్యులు, కృపాచార్యులు. అశ్వత్థామ ఇంకా ముందు యుగములలో పరశురాముడువంటి వారు. బ్రాహ్మణులైననూ వీరందరూ క్షత్రి యోచితమైన విద్యలలో నిష్ణాతులైనారు. క్షత్రియుడైన విశ్వామిత్రుడు వేదవిద్యల నభ్యసించి బ్రహ్మర్షిగా మారిపోయాడు. ఇటువంటి సంఘటనలు అనేకం మనకు వేద వాఙ్మయములోనూ ఇతిహాస పురాణములోను కన్పిస్తవి. విద్యార్థి బహిర్ప్రపం చముతో ఎటువంటి సంబంధములు పెట్టుకొనటంకానీ, శారీరక, మానసికోద్రేకము కలిగించే పదార్థములను కానీ భజింపరాదు. తాను భిక్షగా తెచ్చుకొన్న ఆహారము రుచిగా లేదని విసర్జించరాదు. గురువు, ఆశ్రమవాసులు, ఇతరులు అనుగ్రహించిన భోజ్య పదార్థములను భగవంతుని ప్రసాదముగా భావించి భక్తి శ్రద్ధలతో ఆరగించ వలెను. గురు శుశ్రూషలోనూ విద్యాభ్యాసములోను, సుదీర్ఘమైన కాలమును, ఒక గురువు వద్దకానీ ఎక్కువ గురువుల వద్దకానీ, ఒకే ప్రదేశములోకానీ, అనేక ప్రదేశము లలో కానీ విద్యార్జనను పూర్తిచేసుకొనిన అనంతరము, యుక్తవయస్కుడై, పండితుడై ఇంటికి తిరిగి వచ్చిన వానిని స్నాతకుడు అనిపిలుస్తారు. వానికి వివాహయోగ్యత కలిగినట్లు. ఈనాడు వరునికి వివాహమునకు ముందు జరుపు స్నాతకము యొక్క ఆంతర్య మిదియే. అయితే అందరు స్నాతకులు వివాహము చేసుకొని గృహస్థ జీవ నము సాగించాలనే నియమేమిలేదు. ఇట్టి వారిలో కొందరు వారు చదువుకున్న గురుకులాశ్రమములలోనే ఉండి. గురువుకు సహాయంగా విద్యార్థులకు పాఠ్యబోధన చేస్తూ ఉండిపోతారు. మరికొందరు తామే స్వయంగా గురుకులములు స్థాపించుకొని విద్యాబోధన చేస్తారు. మరికొంతమంది సన్యాసాశ్రమ స్వీకారం కూడా చేసేవారు. అయితే ఆపస్తంబుడు మరి కొందరు సూత్రకారులు సన్యాసాశ్రమమును ఏవగించు

కొన్నారు. సన్యాసులు సమాజమునకు భారమవుటయేకాక సమాజ పురోభివృద్ధికి ఆటంకములని నిందించారు. సన్యాసి ఇచ్చు ఏవస్తువునుగానీ, పదార్ధమును గానీ స్వీకరించరాదని ఆంక్ష విధించారు.

సూత్రకారులందరూ పుట్టిన ప్రతి వ్యక్తీ తన జీవిత కాలమును నాలుగు ఆశ్రమ ములలో గడిపితీరాలన్నారు. అవి బ్రహ్మ చర్యము, గృహస్థ, వానప్రస్తము, చివరి ఆశ్రమమును సన్యాసముగా పేర్కొన్నారు. ఒక్కొక్క ఆశ్రమము నకు విధించిననియమ, నిబంధనలను, బాధ్యతలను తప్పక పాటించవలసినదేనని ప్రకటించారు. ఆపస్తం బుడు మరియు ఇతర సూత్రకారులు కూడా పైనాలుగు ఆశ్రమముల లోను, గృహ స్థాశ్రమము అత్యంత శ్రేష్ఠమైనదిగా తెలియచేశారు. గృహస్తుడైనవాడు కేవలము తన తల్లితండ్రుల, కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల పోషణాభారము, శ్రేయస్సును మాత్రమే కాక్షించకుండా, సమాజములోని బీదలను, అతిథి అభ్యాగతుల అవసరము లను తీర్చవలసిన బాధ్యత కలిగి ఉండాలని నిర్దేశించారు. గురువులయొక్క అతిథి అభ్యాగతులయొక్క, సమాజములోని బడుగువర్గాల యొక్క, సుఖజీవనానికి సంతోష మునకు, అవసరమైన వనరులన్నిటినీ, గృహస్థ చేకూర్చవలసిన నైతిక, సామాజిక బాధ్యతను గుర్తించి ప్రవర్తించాలని హెచ్చరించారు. అట్టి గృహస్తునకు సర్వ సంపదలు సర్వ సుఖములు ఆశించకుండానే వొనగూరుతవని బోధించారు. పైన వివరించిన బాధ్యతా నిర్వహణమేకాక, గృహస్తు ప్రతి నిత్యమూ ఇంటియందు నిర్వహించవలసిన కొన్ని పవిత్ర కర్మలున్నె. వాటిని రెండు రకములుగా విభజించారు. మొదటి వాటిని పాక యజ్ఞములు లేక గృహకర్మలు అంటారు. రెండవ వాటిని శ్రౌతకర్మలు అని పిలుస్తారు. ప్రథమ విభజనలో శ్రాద్ధకర్మముల వంటివి ఏడు విధములులైన కర్మలు వున్నవి. వీటిని ఒక ప్రత్యేక మాసమునందుగానీ, తిథినగానీ ఆచరిస్తారు. రెండవ విభాగానికి చెందిన శ్రౌతకర్మలలో ఏడువిధములైన హవిర్యజ్ఞములు, ఏడు విధములైన సోమయజ్ఞములు ఉన్నవి. ఈ విధంగా ప్రతిగృహస్థూ మొత్తం నలుబది విధములైన వైదిక కర్మలను ఆచరించవలసి వస్తుంది. వైదిక కర్మాచరణమేకాక, గృహస్థునకు ప్రధానమైనదీ, అతిముఖ్యమైనది నియమబద్ధమైన నైతిక ప్రవర్తన. సూత్రకారులు అందరూ శ్రౌతస్మార్త కర్మలను ఆచరించుట కంటె వ్యక్తి నైతిక, సామాజిక బాధ్యతలను సక్రమముగా నిర్వహించుటకే ప్రాధాన్యత నిచ్చినారు. తోటి

మానవులపట్లనే కాక పశు, పక్ష్యాదులను, వృక్షాదుల పట్లకూడా దయ, అనురాగము, ఆప్యాయతతో ప్రవర్తించవలెనని నిర్దేశించారు. క్రిమికీటకాదులకు కూడా హాని కలుగజేయరాదన్నారు. నైతిక విలువలను, సామాజిక బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తే అనుభవించవలసిన నరకయాతనలను కూడా విశదీకరించారు.

ఈ విధంగా సూత్రకారులు నిర్దేశించిన షోడశ సంస్కారములు, వాటికి అను బంధములైన వైదిక కర్మలు, నైతిక ప్రవర్తన, సామాజిక బాధ్యతలను నిశితంగా పరిశీలిస్తే మన పూర్వీకుల జీవనశైలి మనకు స్పష్టంగా అవగతమౌతుంది. దాదాపు వారు నిర్దేశించిన విధానములు సహస్రాబ్దములు గడచిపోయినా, సమాజము అనేక విధముల మార్పుచెందినా, పాశ్చాత్య నాగరికతా ప్రభావమువల్ల వైదిక సారస్వతముపై మనకుగల అభిప్రాయములు మారుతున్నప్పటికీ, హిందువులు ఆచరిస్తూనే ఉండటము, నిజంగా అభిలషణీయము, ప్రశంసనీయమైన విషయము.

వివాహ విధానములను సూత్రకారులందరూ వివిధ రీతులలో విశదీకరించి, వాటికి పలువిధములైన పేర్లను పెట్టారు. వివాహకాండలో చిన్న, పెద్ద క్రియలు అనేకం ఆచరించవలసి ఉంటుంది. అది ఒక సామూహిక క్రియాకలాపము. ప్రాంత మును బట్టి, కులమును బట్టి, ఆచరణ విధానములో మార్పులున్నవి. ఆ మార్పులను ప్రక్కనుంచితే వివాహకాండలోని మూల మంత్రములలో ఎటువంటి భేదములుండవు. దాదాపు యవద్భార తములోనూ ఒకే రకములైన మూల మంత్రములు, వాటిని అనుసంధించిన క్రియాకలా పములు జరుపబడుతూ వుంటవి.

వసిష్ఠుడు వివాహములను ఆరు విధములుగానూ, గౌతముడు, బోధాయనుడు ఎనిమిది విధములుగానూ తెలియజేశారు. ఆపస్తంబుడు, వసిష్ఠుడు చెప్పిన ఆరు విధములైన వివాహములనే అంగీకరించాడు. వసిష్టుడు “క్షాత్ర” వివాహమని పిలిస్తే దానిని ‘రాక్షస’వివాహమనీ, కన్యకు శుల్కము చెల్లించి కొనుక్కున్న వివాహపద్ధతిని మానుష్కమని వసిష్ఠుడు పేరిడితే, దానిని ”అసుర“ అని ఆపస్తంబుడు మార్పుచేశాడు. కేవలము నామకరణము నందు చేసిన పైరెండు మార్పులను మినహాయిస్తే, ఆపస్తంబుడు వసిష్ఠుడు నిర్ణయించిన ఆరు విధములైన వివాహములకు అంగీకారము తెలియజేశాడు. అయినప్పటికీ ఆపస్తంబుడు వివాహకాండ “బ్రహ్మదైవ” మరియు “ఆర్ష” సంప్రదాయములో జరుపు పద్ధతులకే ప్రాధాన్యతను ప్రకటించాడు. వసిష్ఠుడూ,

గౌతముడూ ఆపస్తంబుడూ ముగ్గురూ రక్తసంబంధీకులమధ్య, ఒకే గోత్రమునకు చెందినవారి మధ్య వివాహములను నిషేధించగా, బోధాయనుడు మేనత్త, మేన మామల బిడ్డల "మధ్య జరుపు వివాహములకు తన ఆమోదము తెలియజేశాడు. సూత్రకారులందరూ సగోత్రీకులమధ్య, ఒకే ఋషి సంతతిగా పరిగణింప బడు వారిమధ్య వివాహములను గట్టిగా నిషేధించారు.

బోధాయనుడు ఆడబిడ్డ ఇంకా నగ్నంగా తిరుగుతున్న వయస్సులోనే బీదవాడై నప్పటికీ. యోగ్యుడైనవానికిచ్చి వివాహము జరుపవలెనేగానీ, యుక్తవయస్సు వచ్చు వరకూ ఆమెను తండ్రి తన ఇంట ఉంచుకొనరాదని నిర్ణయించాడు. యుక్తవయస్సు రానప్పటికీ, తన కులమునకే చెందిన అందగాడైన యువకునితో కన్యకు వివాహము జరుపవలెనని మనువు శాసించాడు. గౌతముడు కూడా యుక్తవయస్సురాక ముందే కన్యకు వివాహము జరుపవలెనని నిర్ణయించాడు. సూత్రకారులందరూ ఏకగ్రీవంగా ఆమోదించిన విషయ మేమంటే, యుక్త వయస్సు వచ్చిన కన్య, మూడు బహిష్టులు గడచునంత కాలము, తన తండ్రి నిర్వర్తించవలసిన వివాహమునకై వేచియుండాలి. అనంతరము ఆమె స్వేచ్ఛగా తనకు నచ్చినవానితో వివాహము జరుపుకొనవచ్చును. విధవా వివాహములు ప్రాచీన కాలమునాటి ఆచారమే. సూత్రరచనా కాలము నాటికి అటువంటి వివాహములను పూర్తిగా నిషేధించక పోయినప్పటికీ, వాటి సంఖ్యను తగ్గించే ప్రయత్నములు జరిగినై. బాలవితంతువులు, బిడ్డలులేని విధవలు పునర్వి వాహములను ఆమోదించటం జరిగినది కానీ, పిల్లలున్నవారు, వయసు మళ్లినవారి విషయంలో పునర్వివాహములు అంగీకరింప బడలేదు. అట్లు వివాహితులైనవారిని సమాజములో చిన్నచూపు చూసేవారు. ఆధునిక యుగంలో, పునర్వివాహములను వ్యతిరేకించేవారిని సంఘ సంస్కరణవాదులు ద్వేషిస్తు న్నప్పటికీ, వారిఅభ్యుదయ వాదనలలో ముఖ్యమైన ఒక అంశమును విస్మరించటం జరుగుతోంది. పిల్లలున్న స్త్రీ పునర్వివాహము చేసుకుంటే ఆ తల్లికి బిడ్డలపై ప్రేమ తరిగిపోవచ్చు. అవిధంగా జరగకపోయినా, నూతన భర్త ఆమెను ఈ అంశముపై వ్యతిరేకించి ఒద్దింపులలో పెట్టవచ్చు. తల్లి తండ్రుల ప్రేమను, ఆప్యాయతను పొందని బిడ్డలు, అదుపు ఆజ్ఞలలో పెరగని బిడ్డలు, చెడుమార్గములు పట్టి బాలనేరస్తులుగా మారటం మనమీనాడు చూస్తున్నాం కదా ! అందువలన సంస్కరణాభిలాషులు, ప్రభుత్వమూకూడా విధవా

పునర్వివాహములను స్త్రీజనోద్ధరణకై ఏర్పరచిన ఆదర్శ విధానముగా పరిగణించక, పిల్లలుగల స్త్రీయొక్క వ్యక్తిగతములైన, కారణములను పరిస్థితులను, కూలంకషంగా విచారించి తగు నిర్ణయము తీసుకొన్నట్లయితే, ఆ తల్లుల పిల్లల భవిష్యత్తు నాశనం కాకుండా కాపాడవవచ్చు. అట్టి స్త్రీలు తమ మానసిక, శారీరక వాంఛలకంటె, ప్రథమ వివాహమువల్ల, జన్మించిన బిడ్డల యొక్క భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలుగల తల్లుల, వృద్ధ వనితలు, పునర్వివాహము లను సూత్రకారులు వ్యతిరేకించి నప్పటికీ, ప్రథమ వివాహము ద్వారా వారికి కలిగిన కొడుకులను, ద్వితీయ వివా హమునకు చెందిన కుటుంబసభ్యులుగా గుర్తింపు నీయవలెనని ఆదేశిస్తూ, వారికి వారసత్వపు హక్కును నిషేధించారు.

ఆపస్తంబుడు, ఇతర సూత్రకారులు, వ్యక్తి చనిపోగానే, తదనంతరము నిర్వ హించవలసిన అపరకర్మలు, ఇతర కార్యక్రమాల విషయంలో, సుస్పష్టమైన ఆదేశ ములను తమ సూత్రములలో పొందుపరచారు. అదేవిధంగా వ్యక్తిగత పారిశుద్ధ్య మునకు సంబంధించిన అనేక అంశములపై సూచనలు, ఆదేశములను, తమ సూత్రములలో చేర్చుటమేకాక వాటిని అతిక్రమించి, ప్రవర్తించేవారు తీవ్ర పరిణామములను ఎదుర్కొనవలసివస్తుందని హెచ్చరించారు.

ఇతర సూత్రకారులతో పోలిస్తే ఆపస్తంబునిలో గల కాలానుగుణమైన అభ్యుదయ భావములు, సంఘ సంస్కరణాభిలాష ఆయన సూత్రములద్వారా ద్యోతకమవుతోంది ఉదాహరణకు చతుర్థ కులజుల మత విశ్వాసములకు, వాటి ఆచరణా విధానాలకు, అలవాట్లకు, కట్టుబాట్లకు ఆపస్తంబుడు తగిన గుర్తింపు నివ్వటమేకాక. స్త్రీలకు నిషిద్ధమైన వేద పఠనము, వైదిక కర్మాచరణమును సడలించి, వీటిని నాలుగవ వేదమైన అథర్వణ వేదములో పొందుపరచేలాచేశాడు. ఆనాడు విస్తృత ప్రచారము లోనికి వస్తున్న పౌరాణిక సాహిత్యముపై ఆధిక్యతను, చతుర్థకులజులకు సంక్రమిం చేలా పాటుపడ్డాడు. అష్టాదశ పురాణములను శౌనకాది మహామునులకు నైమిశా రణ్యంలో వినిపించిన సూతుడు చతుర్థ కులజుడేకదా ! ఆంధ్రదేశమును పరిపాలిం చిన శాతవాహనచక్రవర్తులూ వారి అనంతరము రాజ్యమేలిన రాజుల శాసనములు పరిశీలిస్తే, ఆంధ్రదేశంలో యజ్ఞయాగాది వైదిక క్రతువులు అధికసంఖ్యలో జరుగు తుండేవని అవగతమౌతుంది. ఆ కాలములోనే బౌద్ధ, జైన మతముల ప్రాబల్య

మున్నప్పటికీ ఆంధ్రదేశములో వైదిక మత వ్యాప్తి విస్తారమైనదని గ్రహించవచ్చు. ఈ విధమైన శీఘ్రవ్యాప్తి కలగాపులగంగా ఉంది. ఆచరణకు కష్టసాధ్యముగా వున్న వేద విధులను ఒక క్రమపద్ధతిలో విభజించి, పరిపక్వమైన పద్ధతులను నిర్దేశించి మరికొన్ని విషయములలో శాస్త్రములలో విధించిన కఠిన నియమములను సడలించి, ఆపస్తంబుడు తన సూత్ర రచనల ద్వారా ఎనలేని సేవ చేశాడని శ్రీ B.S.L. హనుమంత రావుగారు అభిప్రాయమును వ్యక్తంచేశారు. ఈ అభిప్రాయంతో అందరూ ఏకీభవించ వలసినదే. ఆంధ్రదేశములోనూ, సుదూర ప్రాంతములలోను ఆపస్తంబీయులు ఉండుటయే ఇందుకు నిదర్శనం.

సూత్రకారులు వైదిక ధర్మ క్రమబద్ధీకరణకు, వ్యాప్తికి తమ సూత్రముల ద్వారా చేసిన సేవను కొనియాడుతూ శ్రీ రమేశ చంద్రదత్తు గారు "సంస్కృత సాహిత్యములో ప్రాచీన భారతనాగరికతా చరిత్ర" అనే ఆంగ్ల గ్రంథములో "ఇతిహాసయుగంలో అస్త వ్యస్తంగావున్న అన్ని విషయములను క్రమబద్ధంగా విభజించి, ఒక సక్రమ పద్ధతిలో వాటిని ఏర్పాటుచేశారు. సుదీర్ఘమైన అంశములను కుదించి సూత్ర రూపము లలోకి మార్చివేశారు. స్పష్టత, నిర్దిష్టత లోపించిన విషయములను సహేతుకంగా పరిశీలించి, లోపరహితముగా చేశారు. నేరములకు భూవివాదాలకు సంబంధించిన అనేక వివాదా స్పద విషయములపై చేయవలసిన న్యాయ నిర్ణయములను విద్వాంసులు పురోహితుల ఊహాగానములకు, వ్యక్తిగత అభిప్రాయములకు వదలివేయ కుండా, వాటికి ఒక నిర్దుష్టమైన, సహేతుకమైన పరిష్కారమార్గములను రూపొందించి, శిక్షాస్మృతులను చట్టములను తయారుచేశారు. వాటిని న్యాయనిర్ణేతలు తప్పక అనుసరించి అమలు పరచాలని ఆదేశించారు. అయినప్పటికీ, ఇతిహాసయుగంలో నామమాత్రంగా వున్న కులకట్టుబాట్లు, వీరి కాలములో కఠినములై అతిక్రమణకు అసాధ్యములైనవి. ఈ విధంగా హైందవ సమాజం తీవ్రమైన మార్పులు చెందినది" అని వాఖ్యానించారు.

ప్రపంచంలోని చాలాభాగము అజ్ఞానాంధకారములో మునిగియుండి, నాగరికత నెరుగని, కనీసం వస్త్రధారణ కూడా తెలియని ఆ ప్రాచీన కాలములో ఆపస్తంబుని వంటి, అభ్యుదయ సూత్ర రచయితలు, భారతీయ వైదిక విజ్ఞానమునకు మెరుగులు దిద్ది, భారతీయ సమాజమును నైతిక, ఆధ్యాత్మిక పథముపై పురోగమించుటకు మార్గదర్శకులగుట భారతీయులందరికీ ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణం.

# కుమారిలభట్టు

**"దృశ్యతే అనేన ఇతి దర్శనమ్"** దర్శనమనగా దేనివలన చూడబడునో అది దర్శనమని పిలువబడుతుంది. కౌటిల్యుడు తన అర్థశాస్త్రమున దర్శనమనగా సర్వ విద్యలకు ప్రదీపము, సర్వకర్మలకు ఉపాయము, సర్వధర్మములకు ఆశ్రయమని వివరించాడు.

దర్శన సాహిత్యము ముఖ్యంగా ఆస్తిక దర్శన సాహిత్యోత్పత్తి కారణములను వివరిస్తూ రాధాకృష్ణ పండితులు చెప్పినదేమంటే క్రీ.పూ. 5,6 శతాబ్దములయందు గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడువంటి నాస్థికులు వేదములు అపౌరు షేయ ములు కావనీ వాటిని ప్రమాణముగా స్వీకరించటం మూర్ఖమనీ నాస్థిక ధర్మప్రచారము నకు పూనుకున్నారు. ఆకారణంగా వారి ప్రబోధములను ఖండిస్తూ, వేదవాఙ్మయ మును విశ్లేషించి, సహేతుకంగా క్షుణ్ణంగా చర్చించి వానియందలి పరమ సత్యము లను వెలికితీసి ప్రజా బాహుళ్యమునందు ఏర్పడిన అపోహలను పూర్తిగా తొలగించి, తాము గుర్తించిన సత్యము లను ప్రచారము చేయుట ద్వారా వైదిక ధర్మములను, నాస్థికవాదులనుండి రక్షించుకొనుచూ ప్రాచీన ఋషులు తెలియజేసిన సనాతన ధర్మమును విస్తృతమైన, రీతిలో వ్యాప్తిచేయుటయే దర్శన సాహిత్యము యొక్క ముఖ్యోద్దేశము.

యదార్థంగా 'ధర్మనమ'నే పదమునకు సంస్కృత భాష ద్వారా విశదీకరించు భావమునకు, పాశ్చాత్య తాత్త్వికులు వారి అనుయాయులైన భారతీయ, తత్త్వవేత్తలు ఉపయోగించు సంప్రదాయము(School) లేక ప్రక్రియ(system)అను పదములు సమానార్థకములుకావు. దర్శనపదమునకు సంస్కృతమునందు బహులోతైన అర్థము పొందుపరచ బడినది. అది ఒకధర్మము, అది ఒకదృశ్యము. ఈ సందర్భములో ఆ వివరణపై మూడు ప్రశ్నలు ఉత్పన్నమౌతవి. ఒకటి అది ధర్మముకానీ, దృశ్యముకానీ అవి ఏమిటి ? వాటిని ఎవరుదర్శించారు? ఏవిధంగా దర్శించగలిగారు? దర్శించిన వారందరూ అనగా ద్రష్టలు అందరూ తాము దర్శించినది కేవలమూ సత్యమే కానీ మరొకటి కాదన్నారు. వారు సత్యమని నమ్మిన దానిని తలకొకరూ తలవొక పేరుతో పిలిచారు. చివరకు "ఏకంసత్‌విప్రః బహుధా వదంతి" అనే ఉపనిద్వాక్యము, ఈ అంశముపై వెలిబుచ్చిన భిన్నాభిప్రాయములకు స్వస్తిపలికింది. ఉన్న సత్యమొక్కటే, అయితే పండితులు దానిని పలు విధములుగా పిలుస్తారన్నదే అ వాక్యముయొక్క అర్థము. సత్యదర్శనము చేసిన మహనీయులలో కొందరు వేద ప్రామాణ్యతను అంగీకరించగా మరికొందరు తిరస్కరించారు. అందువలన దర్శనములు రెండు విధములైనవి. వేద ప్రామాణ్యత నంగీకరించినవి ఆస్తిక దర్శనములుకాగా తిరస్కరించినవి నాస్తిక దర్శనములుగా పేర్కొనబడినవి. అస్తికదర్శనములు ఆరు. అవి గౌతముని "న్యాయము" కణాదుని "వైశేషికము", కపిలుని "సాంఖ్య"ము, పతంజలి "యోగము". చివరిగా "మీమాంస". ఈ చివరి దర్శనము తిరిగి రెండుగా విభజింప బడినది. జైమిని పూర్వమీమాంస మరియు వేదవ్యాసుని వేదాంతము లేక ఉత్తర మీమాంస. గుర్తుంచుకొనవలసిన ముఖ్య విషయము ఏమంటే పైన పేర్కొనబడిన మహనీయులందరూ ఆయాదర్శన సృష్టికర్తలుకారు. వారు ఆయా దర్శనముల ప్రచారకులు మాత్రమే. న్యాయ వైశేషిక దర్శనములు నేరుగా భగవంతుని ఉనికిని ఆమోదించలేదు కానీ పరోక్షంగా అంగీకరించినవి. సాంఖ్యము, యోగము వేద ప్రామాణ్యతను, భగవద్భావనను సూటిగా తిరస్కరించినప్పటికీ, వాటియందు స్వతంత్రమైన తటస్థ భావమును పాటించినవి. మీమాంస మాత్రమే అధికంగా వేదవాఙ్మయముపై ఆధారపడింది. మీమాంసలో కూడా పూర్వ మీమాంస భగవద్భావనను వేదములనుండి గ్రహించినప్పటికీ ఆ భావనను వివరించటంగానీ, భగవంతుని

ఉనికిని స్పష్టంగా తెలియజేయటం కానీచేయలేదు. ద్వితీయభాగమైన ఉత్తర మీమాంస, సాధారణంగా వేదాంతమని పిలువబడుతూ భగవ ద్భావనను పూర్వ మీమాంసవలె వేదముల నుండి గ్రహించినప్పటికీ, భగవంతుని ఉనికిని సమర్థిస్తూ, అనుమాన ప్రమాణము ఆధారముగా ఆయనను బ్రహ్మము అని నామకరణం చేసింది. ఉపనిత్సాహిత్యము, వేదవ్యాసుని బ్రహ్మ సూత్రములు, ఈవేదాంత దర్శన వ్యాప్తికి ఎంతో దోహదము చేసినై. జ్ఞాన సముపార్జన ద్వారా సత్యదర్శనము సాధ్యమని ప్రబోధించినై ఆ కారణంగా పూర్వ మీమాంసను కర్మకాండ అనీ, ఉత్తర మీమాంసను జ్ఞానకాండ అని పిలుస్తారు. పూర్వ మీమాంస వైదిక కర్మాచరణకు ప్రాధాన్యతనిచ్చి భగవంతుని గురించి, మోక్షమును గురించి పట్టించుకొనలేదు. మరో విశేషమేమంటే ఇతర ఆస్తిక దర్శనములకు భిన్నంగా, బౌద్ధ ధర్మమునకు వ్యతిరేకంగా పూర్వ మీమాంస జగత్తు మిధ్యకాదు. వాస్తవమని అంగీకరించింది. ప్రపంచ జీవనము సత్యమేకానీ, స్వప్న సదృశ్యము కాదన్నది.

మీమాంసయను పదమునకు జిజ్ఞాసయని అర్థము. వేదోక్తమైన ధర్మ నిర్ణయము నకు వేద వాక్యములను వివేచించుట, నిశ్చయించుట, వ్యవస్థీకరించుట, చేయునది మీమాంస దర్శనము. ఆ కారణంగా ఆధ్యాత్మిక సదస్సులకు నాందీ ప్రస్తావనగా "అధాతో బ్రహ్మ జిజ్ఞాసా" అను మంగళ వాక్యమును పలికి సదస్సును ప్రారంభించుట సాంప్రదాయమైనది. అనగా వేద విదులైన సదస్యులు, వైదిక విషయములపై క్షుణ్ణమైన విశ్లేషణ జరిపి, చర్చించి, సరియగు ఆమోదయోగ్యమైన నిర్ణయములు తీసుకొనవల ెనని భావము. మీమాసం వేదములలోని సంహితలు లేక మంత్ర భాగమునకంటే, బ్రాహ్మణములు అని పిలిచే కర్మ భాగమునకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. వేదోక్తమైన యజ్ఞ యాగాదిక్రతువులను ఏ విధంగా నిర్వహించాలి, ఏయే మంత్రములను పఠిం చాలి. ఏ ఆహుతులను అగ్ని కుండములలో సమర్పించాలి. ఏ దేవతలను ఆహ్వానిం చాలి వంటి కర్మకాండకు సంబంధించిన అనేకానేక విషయములను నిర్దేశిస్తూ, సూత్రములలో ఇచ్చిన వివరణలను గురించి ఒక క్రమపద్ధతిలో దోషరహితంగా, సందేహములకు తావివ్వకుండా, మార్గదర్శకంగా ఉపయోగపడు దర్శనము మీమాంస. సమకాలీనమైన సాంప్రదాయమును అలవాట్లపై, మీమాంస దర్శనము నందు జరిగిన చర్చలను ఆధారముగా తీసుకొని దర్శనముల రచనా కాలమును

క్రీ.పూ. 600–200 సంవత్సరముల మధ్యలో జరిగి ఉండవచ్చునని చరిత్రకారుల ఊహ. దర్శనములలోని సూత్రములను, ఆయా దర్శనాచార్యులు శిష్యులకు కంఠస్థము చేయించెడివారు. విద్యార్థులు ఆ సూత్రములను జ్ఞప్తియందు ఉంచుకొనుటకే ప్రాధాన్యత నొసగెడివారు. ఇందుకు కారణము, ఆనాటికి లిపి లేక పోవుటగాని, లేదా గ్రంథస్తము చేసినందువల్ల, అనర్హుల చేతిలోబడి వాటి పవిత్రతను కోల్పోవచ్చుననెడి భయము కానీ, లేదంటే వ్యావహారిక విషయములవలె, గ్రంథస్థముచేసే సాంప్రదాయము ఆనాడు లేకపోవుటగానీ, అయి ఉండవచ్చును. బ్రాహ్మణములకు సంబంధించి, బోధాయన ఆపస్తంబుడు సూత్రములవలె దర్శనములలోని సూత్రములు కూడా, అతి సంగ్రహములుగా ఉండుటవల్ల వాఖ్యానములు లేనిచో అర్థమగుట కష్టము. ఆ కారణంగా కాలాంతరములో, ఆయా దర్శనములలో నిష్ణాతులైనవారు వాటిపై విస్తృతమైన వాఖ్యలను రచించటంజరిగింది. ఈ వాఖ్యానములు గ్రంథస్తము చేయబడినై. తద్వారా దర్శన సారస్వతము అత్యధికముగా పెంపొందుతూ దాదాపు క్రీ.శ. 16వ శతాబ్దమువరకు వాఖ్యాన రచనలు కొనసాగుతూ వుండేవి. ఆధునిక యుగంలో కూడా ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నదంటే ఆశ్చర్యపడనవసరము లేదు.

శ్రీ రమేశచంద్రదత్తుగారి అభిప్రాయంలో మీమాంస సిద్ధాంతములు, హిందువుల సంకుచిత భావనలకు ప్రతినిధులు, విద్వాంసులు, సామాన్యులు కూడా నాస్తిక సిద్ధాంతములపై మోజుపడుతున్న రోజులలో, సనాతన ధర్మమును దాని జన్మ భూమిలో కనుమరుగు కాకుండా కాపాడుటకు, మీమాంసవాదులు తీవ్రకృషి సలిపారు. పూర్వ ఉత్తర మీమాంసల మధ్య తీవ్రమైన భేదములున్నప్పటికీ, బౌద్ధ జైన మతముల ప్రాబల్యమును ఎదుర్కొనుటలో మీమాంసవాదులు కలసికట్టుగానూ, విడివిడిగానూ పోరాటం చేశారు. అనేక సందర్భములలో వ్యతిరేకతను విడిగానే ప్రదర్శించారు. పూర్వ మీమాంసకు ధర్మాచరణమే ప్రధానాంశము. ప్రపంచము వాస్తవమని, ఆత్మలు అనేకమని, అవి అనంతములు, విశ్వవ్యాప్తములని ప్రబోధిస్తూ, వైదికకర్మలను ఆచరించేవారు చివరకు చేరేటటువంటి స్వర్గమును గురించి గొప్పగా వర్ణిస్తారు. అయితే ఉత్తర మీమాంస, లేక వేదాంతమని పిలవబడే సిద్ధాంతములు పరిమితమైన వివేచన, వేద ప్రామాణ్యతను అధికారమును ఆమోదించుటవంటి భావనలతో మిళితమై ఉంటాయి. వేదాంత దర్శనము ఈ జగత్తు సర్వమూ మిథ్యయని

అభివర్ణించి, వ్యక్తి తనలోని జీవాత్మను (ప్రత్యగాత్మ) పరమాత్మయైన బ్రహ్మముతో ఐక్యత సాధించి మోక్షప్రాప్తి పొందుటకు అనవరతమూ కృషి చేయవలెనని ప్రబోధిస్తుంది. అయితే, ఒకే దర్శన విభాగములైన పూర్వ, ఉత్తర మీమాంసల మధ్యగల వైషమ్యము ఎంత తీవ్రతరమైనదంటే, అద్వైత వేదాంత ప్రచారకుడైన విద్యారణ్యుడు పూర్వమీమాంసను అనుసరించేవారిని, ఒక చిన్న పురుగుతో పోల్చి, ఆ పురుగు ప్రమాదభరితమైన సుడిగుండములుగల ఒక ప్రవాహములో పడి, ఒక్కొక్క గుండము నుండి తప్పించుకొని బయటపడుటకు, శాయశక్తులా కష్టపడి, చివరకు ఏ విధంగా మృత్యువాతపడుతుందో, అదేవిధమైన గతి మీమాంసకునికి కూడా పడుతుందని అభిశంసనము చేశాడు. పైన చెప్పిన ఉదాహరణ ద్వారా విద్యారణ్యుడు పరోక్షంగా పుట్టుక 'చావు' అనే సుడిగుండముల నుండి తప్పించుకొనుటకై పూర్వ మీమాంసను అనుసరించి వేదములలో చెప్పిన యజ్ఞయాగాది క్రతువులను, తమ విద్యుక్త ధర్మ ముగా భావించి నిర్వహించే కర్మిష్టులకు కూడా నదీ ప్రవాహములో పడిన కీటకము గతియే లభిస్తుందనీ, గతిని మార్చుకొనవలెనంటే, ఉపనిషత్తులయందు ప్రబోధించ బడిన బ్రహ్మజ్ఞానమును సంపాదించుకొనక తప్పదని వివరించాడు. వైదిక కర్మాచరణ మును నిరసిస్తూ, బ్రహ్మమును తెలుసుకొనగలిగిన జ్ఞానమును సంపాదిం చవలెనని గట్టిగా బోధించినాడు. వారి సైద్ధాంతిక వైషమ్యములమాట ప్రక్కన ఉంచితే, పూర్వ మీమాంసాచార్యుడైన కుమారిలభట్టు, వేదాంతాచార్యుడైన ఆదిశంకరులు తమ తమ అనుచరులతో కూడి, నాస్తికమతములైన బౌద్ధ, జైనముల అంతుచూసే వరకూ పోరాడినారు. వారి తార్కికప్రతిభతో, సామాన్య ప్రజలను ఆకర్షించి, నాస్తిక మతము లనుండి దూరముచేయగలిగినారు.

**పూర్వ మీమాంస యొక్క ప్రధానాశయములు రెండు.**

1. వేదముల అధికారతను కాపాడుతూ, వేదార్థములను విశదీకరించుట.
2. వేదములలోని కర్మ భాగములైన బ్రాహ్మణములలో నిర్దేశించిన యజ్ఞ, యాగాదులు, ఇతర క్రతువులను విధి నిర్వహణముగా భావించి ఆచరించుట. పూర్వ మీమాంస యందు, కర్మాచరణమునకు మించినదేమియును లేదు. భగవదారాధన కూడా ద్వితీయశ్రేణికి చెందిన క్రియగానే పరిగణింపబడును. వైదిక కర్మలనాచరించునపుడు ఏ ఏ దేవతలకు హవిస్సులు (అగ్నియందు

విడచునేయి) నివేదింపబడుతాయో, ఆయా దేవతల కంటే ఆ సందర్భములో పఠించు మంత్రములకే ఆధిక్యత ఎక్కువ. ఆ దేవతలందరూ మంత్రాధీనులే. మంత్రము వినా వారికి మరొక ఉనికి లేదు. వారు మంత్రభాగములలోనివారే కానీ, స్వతంత్రప్రతిపత్తి లేదు. కర్మాచరణమునకు ఆపాదించిన ప్రాధాన్యతను బట్టి, పూర్వమీమాంసను "కర్మ మీమాంస" అని కూడా వ్యవహరిస్తారు. కర్మాచరణము ద్వారామంత్రబద్ధులైన దేవతలను లోబరుచుకొనవచ్చునని వీరి విశ్వాసం.

**దైవాధీనం జగత్సర్వం**
**మంత్రాధీనంతు దైవతమ్**
**తన్మంత్రం బ్రాహ్మణాధీనం**
**బ్రాహ్మణో మమ దేవతా**

అందువలననే బ్రాహ్మణులకు భూసురులనే పేరు కూడా ఏర్పడింది. ఈ దర్శనములోని ప్రాధాన్యత కర్మలనాచరించుటయందేగానీ, అందువల్ల లభించు ఫలమునకు లేదు.

పూర్వ మీమాంసకారులు, తమ సిద్ధాంత వైశిష్ట్యాన్ని ప్రచారము చేయుటకై ఒక కథను చెబుతుంటారు. ఇది తైత్తరీయ బ్రాహ్మణంలో ఉంది. భరద్వాజుడనే ఋషి మూడువందల సంవత్సరముల సుదీర్ఘ జీవితకాలములో ఋగ్, యజు స్సామ వేదములను క్షుణ్ణంగా అధ్యయనము చేయుటయేగాక, వాటిలో నిర్దేశించిన వైదిక కర్మలను కూడా ఆచరిస్తూ ఉండేవాడు. శరీరము కృశించి మంచంపట్టాడు. ఒకనాడు ఇంద్రుడు ప్రత్యక్షమై, భరద్వాజ! నీ ఆయుర్దాయమును మరికొంతకాలము పొడిగిస్తే నీవు ఏమి చేయదలచుకున్నావని ప్రశ్నించాడు. జవాబుగా ఋషి తానింతకాలము ఏం చేశాడో దానినే కొనసాగిస్తానని చెప్పాడు. ఇంద్రుడు నవ్వి అతనికి మూడు పర్వతములను చూపి, అవియే "త్రయీ" అని వ్యవహరించే ఋగ్, యజు స్సామ వేదములని తెలియజేశాడు. అనంతరం ఒక్కొక్క పర్వతము ముందు ఒక్కొక్క ధూళికుప్పను ఏర్పాటు చేసి ఓ ఋషీ! ఆ పర్వతములు, అనంతమైన వేద విజ్ఞానమునకు ప్రతినిధులు ఆ దూళికుప్పలు నీ మూడు వందల సంవత్సర జీవితకాలములో నీవు సంపాదించుకొనిన జ్ఞానము. చూచినావు కదా! పర్వతమువలె మహోన్నతమైన వేద విజ్ఞానముతో పోలిస్తే నీవార్జించిన జ్ఞానమేపాటిది ? కాబట్టి నిరర్థకంగా, ఆయుర్దా

యమును వృధా చేసుకొనక, పవిత్రుడైన అగ్నిదేవుని ఆరాధించ వలెనని తెల్పి వెళ్ళినాడట భరద్వాజుడు ఇంద్రుని బోధలను అనుసరించి, అతి స్వల్ప కాలములోనే వేద జ్ఞానము, సర్వమునూ, సముపార్జించుకొని, అనతి కాలములో అనంత తత్త్వ మును పొందగలిగాడట.

పూర్వమీమాంసకు పునాదులు జైమిని సూత్రములు, జైమిని క్రీ.పూ. 400–200 సంవత్సరముల మధ్య కాలములో జీవించినట్లు అంచనా. సూత్రకారుడైన ఈ జైమిని, వేదవ్యాసుని శిష్యుడైన జైమిని భారతరచయిత ఒక రౌనోకాదో ఇద మిత్థంగా చెప్పటం కుదరదు. జైమిని సూత్రములు ప్రధానంగా రెండు భాగములు. వాటిలో మొత్తం పన్నెండు ఉపన్యాసములున్నై. తిరిగి వాటిని అరువది అధ్యాయ ములుగా విభజించారు. మొదటి అధ్యాయమునందు విద్యుక్త కర్మలను తెలియజేశారు. ఇవి తప్పక ఆచరించవలెనని ఆజ్ఞాపించుట జరిగింది. రెండు, మూడు నాలుగు ఉపన్యాసములలో కర్మలు ఎన్ని విధములు వాటిలో ప్రధానకర్మలేవి, వాటికి అను గుణమైన గుణకర్మలేవి, ఆ కర్మలనాచరించ వలసిన కారణములు ఏవి ఆదిగాగల విషయములు విశదీకరించబడినవి. ఐదవ ఉపన్యాసమునందు కర్మలలో వేటికి ప్రాధాన్యతను ఇచ్చి, ఆచరించాలో చెప్పి, ఆరవ ఉపన్యాసములో అట్టి కర్మాచరణము నకు కావలసిన అర్హతలను తెలియజేయుట జరిగింది. దీనితో మొదటి భాగము పూర్తవుతుంది. ద్వితీయ భాగము ఏడవ ఉపన్యాసము పరోక్ష జ్ఞానముతో ప్రారంభమై, ఎనిమిదవ ఉపన్యాసమునందు కూడా కొనసాగుతుంది. తొమ్మిదవ ఉపన్యాసములో అనుమాన ప్రమాణము ద్వారా పొందగలిగిన మార్పుల వివరములను తెలియ చెప్పటం జరిగింది. పదవ ఉపన్యాసములో ముందు చెప్పిన ఉపన్యాసములలోని విషయములలో మినహాయింపులు చెప్పబడినై. పదునొకండవ ఉపన్యాసము నందు వేదోక్తకర్మల నాచరించుటవలన, ఒనగూడు సత్ఫలితములను గురించి వివరణ ఉన్నది. పండ్రెడవది చివరిదైన ఉపన్యాసములోచేపట్టిన కర్మాచరణములు, విజయ వంతంగా సమాప్తము చెందుటకుగాను చేయు కృషిని ఏ విధంగా సమన్వయ పరచవలెనో వివరించబడినది. ప్రధాన అంశములతో పాటు, వాటికి సంబంధించిన అనేక ఇతర అంశములపై కూడా వివరణ ఇవ్వటం జరిగింది. జైమిని సూత్రములు వేదములు అపౌరుషేయములు అనే సత్యమును నిస్సందేహంగా ప్రకటించినవి.

అందువలన వాటియొక్క ప్రామాణ్యతను ఎవరూ శంకించరాదు. ప్రశ్నించరాదు. విశ్వమానవ కళ్యాణమే ధ్యేయంగా, మానవతా దృక్పథానికి ఆశ్రయమైన నిత్య, సత్య, శబ్దరాశియే వేదము. వేద వాఙ్మయము ప్రధానంగా రెండు భాగములు. స్తోత్ర రూపములోనున్న దానిని మంత్ర భాగమనీ ఆ మంత్రముల వివరణను చెప్పుచూ యజ్ఞయాగాది క్రతువులలోనూ, ఇతర వైదిక కర్మలలో, వాటి వినియోగ మును వాఖ్యానిస్తూ, నిరూపిస్తూ, ఏర్పడిన భాగమునకు, బ్రాహ్మణములని పిలుస్తారు. సంహితలు గాయత్రాది ఛందోబద్ధమైన 'ఋక్'రూపములలో వుంటే, బ్రాహ్మణములు ఎక్కువగా గద్య మయములుగా రూపొందించబడినవి. ఆ ఋక్‌లను స్వరబద్ధంగా గానం చేసేదే సామవేదం. యజ్ఞయాగాదిక్రతువులు ఇతర వైదిక కర్మలలో పఠించేది యజస్సు. బ్రాహ్మణ భాగమునందు, హోమ కుండముల నిర్మాణములో ఉపయోగించ వలసిన వస్తువులు వాటి ఆకారములు, కొలతలు, అలకరించవలసిన తీరు తెన్నులు అగ్నిని ప్రతిష్టించుట, అహవనీయము, గార్హపత్యము, దక్షిణాగ్ని అని పిలువబడు మూడు అగ్నులను, ఒక క్రమపద్ధతిలో నిర్దిష్ట దిశలయందు ఏర్పాటు చేయుట. ఆ క్రతువుకు సంబంధించిన కార్యకలాపములు నిర్వహించుటకు, ఎంతమంది ఋత్విక్కులు అవసరం, వారు హోమ కుండమునకు ఏయే దిశల కూర్చోవాలి, ఆ యజ్ఞ యాగాదుల స్వరూప స్వభావములు, నిర్వహించే విధానము చదువవలసిన మంత్రాలు, మొదలైన ఎన్నో వివరములు తెలియజేయబడినై. మంత్రపఠనము చేస్తూ హోమ కుండములలో ప్రజ్వరిల్లుతున్న పవిత్రాగ్నులకు ఇచ్చే ఆహుతులను "హవిస్సు" అంటారు. ఇవి ఆవుపాలు, నేయి, పెరుగు, బియ్యపు రొట్టెలు ఆదిగాగల అనేక పదార్థములను యజ్ఞపురుషునికి ఆహుతి చేస్తారు. మంత్రములను స్వరయుక్తంగా వల్లిస్తూ కొందరు సోమరసమును తయారుచేస్తారు. అనంతరం పవిత్రాగ్నులకు నివేదనచేసి యజ్ఞపురుషుని ప్రసాదంగా వాటిని స్వీకరిస్తారు. ఇటువంటి యజ్ఞయా గాది క్రతువులను గురించీ, ఇండ్లలోనూ, ఇతర నిర్దిష్ట ప్రదేశములలోను నిర్వహించే, అనేకానేక కర్మకాండలపై ఏర్పడు సందేహములను చర్చించటం. విశ్లేషించటం, వివరణలనీయటం. వంటి ప్రక్రియలను పూర్వమీమాంస తెలియజేస్తుంది. ప్రతి అనుమానము, సందేహము, భయమువంటి అనేక అంశములపై తార్కికమైన నేర్పుతే చర్చించటమేకాక ఏ కర్మ యొక్క ప్రాధాన్యత ఏమిటి? ఎందుకు ఆచరించాలి ? ఏ విధంగా నిర్వహించాలి ? అనే విషయములపై సమగ్రమైన వివరణలను పూర్వ

మీమాంస ఇస్తుంది. జైమిని తన సూత్రముల ద్వారా, జన్మించిన ప్రతి వ్యక్తియొక్క ప్రాథమిక బాధ్యత వేదోక్తములైన విధులనాచరించుటయేనని నొక్కి చెప్పాడు. జైమిని తన సూత్ర రచనా ప్రారంభమునందే విధులు, లేక కర్మల స్వరూప, స్వభావములను విశదీకరించాడు. ఇదే విషయము నాధారముగా చేసుకొని విస్తృతమైన సూత్ర రచన చేశాడు. తన విద్యుక్త ధర్మమును అధ్యయనముచేసి నిర్వర్తించవలసిన అవసరము, లేక కారణమును తెలుసుకోవాలని తన సూత్రములలో పేర్కొనటం జరిగింది. ఈ అంశమును చెప్పిన అనంతరం తన రచనను ప్రారంభించినాడు. విధి నిర్వహణ లేక కర్మాచరణ అనే అంశముపై జైమిని చేసిన వాఖ్యానమేమంటే బ్రాహ్మణములలో నిర్దేశింపబడిన కర్మలను, లోహరహితముగా ఆచరించటమే తప్ప మరొకటేదీ కాదన్నాడు. తద్వారా వేదవాఙ్మయము నందు పొందుపరచిన అనేక ఇతర విషయములను త్రోసిపుచ్చటం, లేక వాటి ప్రాధాన్యతను తగ్గించటం జరిగింది. ఇందువల్ల జైమిని దృష్టిలో వేదములు కేవలము కర్మాచరణమునకు ఉపాంగములు మాత్రమేనని భావించినట్లనిపిస్తుంది. ఈ అంశముపై డాక్టరు బెనర్జియా తన గ్రంథము "డైలాగ్సు ఇన్ హిందూ ఫిలాసఫీ", అనే ఆంగ్ల గ్రంథములో వాఖ్యానిస్తూ, "దీనిని బట్టి జైమినికి విధినిర్వహణమే ప్రధానం కానీ, అది చెందవలసిన వారిని గురించిన ధ్యాసలేదన్నమాట" అన్నారు. వ్యాఖ్యానమును కొనసాగిస్తూ "అనంతమైన వేదరాశిని జైమిని కేవలం ఒక శబ్దంగా ఒక అక్షరంగానే పరిగణించినాడు కానీ, ఆ అనంతతత్త్వమును ప్రవచించిన లేక ప్రదర్శించిన ప్రజ్ఞానమును గురించి పేర్కొనలేదు. వేద ప్రాముఖ్యతను ఎంతగానో పొగిడి, వాటియందు నిర్దేశించబడిన కర్మలను తప్పక ఆచరించి తీరవలెనని ఎంతో ప్రోద్బలము చేశాడు". ఉత్తర మీమాంస లేక వేదాంత దర్శనములో ప్రబోధింపబడిన బ్రహ్మభావనను గురించి కానీ, విశ్వాత్మ స్వరూపమును (పరమాత్మ) గురించి కానీ ఎక్కడా ప్రస్తావన చేయలేదు. హిందూ మతములోని ఇతర శాఖలు ఆత్మ, పరమాత్మల ఐక్యతపై ఎన్నో విధములుగా వివరణ లిచ్చి, ఆత్మ సాక్షాత్కారమును సాధించవలెనని ప్రచారము చేయుచుండగా, పూర్వమీ మాంస ఆ అంశముపై స్తబ్దత పాటించుట గమనార్హం. అయితే మీమాంసను క్షుణ్ణంగా అధ్యయనము చేస్తే, ఆ దర్శనము, జీవునిలోని ఆత్మకు, ఇంద్రియ జ్ఞానము నకు, మనస్సుకు, బుద్ధికి మధ్య వ్యత్యాసమును తెలియజేస్తున్నదని మనకు అవగాహన

కల్గుతుంది. వాటిని గుణములులేక లక్షణములుగా పరిగణించి, వేదములు నిర్దేశించిన విధములుగా వాటిని ఉపయోగించుకొనుట ద్వారా జీవుడు తన జీవితాంతమున స్వర్గమును పొందుటకు అవకాశమున్నట్లు తెలియపరుస్తుంది. అయితే ఈ స్వర్గమని చెప్పబడేదేమిటి ? ఎక్కడుంటుందనే అంశమును జైమినిగానీ, ఆయన అనుయాయులుగానీ స్పష్టంగా తెలియజేయలేదు. అయితే తరువాతికాలములో మీమాంసవాదులు కొందరు స్వర్గమును గురించి వివరించుటకు ప్రయత్నించారు. అట్టివారి వివరణలను బట్టి అది ప్రశాంతికి నిలయమనీ, సుఖసౌఖ్యాదుల కాలవాలమనీ, ఎటువంటి బాధలకు తావులేదనీ, ఏ విధమైన క్లేశముఎన్నడూ మనస్సును బాధించదనీ అర్థమౌతుంది. వేదమునుండి ఉద్భవించిన దర్శనమైనప్పటి కినీ, పూర్వమీమాంస, జీవాత్మ, పరమాత్మ, బ్రహ్మము, పారమార్థిక సత్యములనే అంశముల ప్రస్తావనే చేయపోవటం ఒక విశేషంగా భావించవచ్చు. ఈ కారణంగా ఆదిశంకరులు మరియు ఇతర వేదాంతులు ఈ దర్శనమును నాస్తిక ధర్మమని ఎగతాళి చేశారు. ఆదిశంకరులు భగవంతుని ఈ విధమైన తాత్త్వికచింతన ద్వారా తెలుసుకొనుట సాధ్యముకాదని ప్రవచించారు. అయితే కుమారిలభట్టు తన "శ్లోక వార్తిక"మనే గ్రంథంలో (శ్లో.సం.10) శంకరులు చెప్పిన దానిని ఖండిస్తూ తానీ దర్శనమును సనాతనత్వమునకు సామీప్యంగా తెచ్చుటకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు.

జైమిని సూత్రములపై వాఖ్యానమును శబరస్వామి రచించాడు. జైమిని సూత్రములపై రచించిన వాఖ్యానములయందు ఇదే మొదటిది. దీనినే "శబరభాష్యమ"ని పిలుస్తారు. పూర్వమీమాంసపై తరువాతి కాలములో వెలువడిన వాఖ్యలకన్నిటికీ, ఈశబర భాష్యమే మూలము. శబరస్వామి ఏ కాలము వాడో, ఏ ప్రాంతమునకు చెందినవాడో ఖచ్చితంగా తెలియదు. విక్రమాదిత్యుని సమకాలీనుడు కావచ్చుని ఒక భావన. ఈ విక్రమాదిత్యుడే విక్రమశకము "సంవత్" శకములకు మూల పురుషుడు కాబట్టి, శబరస్వామి క్రీ.పూ. 57 సంవత్సర ప్రాంతమున చెందినవాడై ఉండవచ్చునని ఊహ. ఈతడు చాతుర్వర్ణ స్త్రీలను వివాహమాడి సంతాన ప్రాప్తి పొందినట్లుగానూ, వారు విక్రమాదిత్యుడు, భర్తృహరి, హరిచంద్ర మరియు అమరలుగా చెప్పారు. సంస్కృతకవి విద్యాపతి శబరస్వామి విక్రమాదిత్యుని గురువని చెప్పాడు. కాబట్టి శబరస్వామి ఉజ్జయినీ వాసిగా భావించబడుతున్నాడు. కానీ,

ఆయన భాష్యములోని కొన్ని అంశములను పరిశీలిస్తే ఆయన ఉత్తర కాశ్మీరమునకు చెందినవాడుగా బహుశా ప్రముఖ ప్రాచీన విద్యాకేంద్రమైన తక్షశిలవాసిగా భావించవచ్చును. మరికొన్ని ఆధారములను పరిశీలిస్తే శబరస్వామికి ముందే భర్తృమిత్ర, భావదాస, హరి, ఉపవర్ష అనేవారు జైమిని సూత్రములపై వ్యాఖ్యలు రచించినట్లు తెలుస్తున్నది. కానీ, వారి గ్రంథములేవీ లభ్యము కాకపోవటంతో శబరభాష్యమే అనంతర కాలములో రచింపబడిన ఇతర భాష్యములకు ఆధార భూతమైనది. శబర భాష్యముపై ప్రథమంగా వెలువడిన భాష్యములు రెండు. మొదటిది గురు అనే నామముకల ప్రభాకరమిశ్రునిది. రెండవది కుమారిల కుమారిలభట్టు లేక భట్టు అని పిలవబడే కుమారిలభట్టుది. మొదటి భాష్యమును "గురు మతమ' 'నీ రెండవ దానిని "భట్టమత" మనీ వ్యవహరిస్తారు. ఈ రెండు కాక మరొక మతము కూడా ఉన్నది. దానిని "మిశ్రమత"మనీ దాని రచయితయైన మురారి మిశ్రుని పేరుతో పిలుస్తారు. అయితే ఈ మూడవ మతము మొదట చెప్పిన రెండు మతములవలె ప్రఖ్యాతిగాంచలేదు.

శబరస్వామి, ప్రాభాకరమిశ్ర, కుమారిలభట్టు ముగ్గురూ ఎవరికివారు, జైమిని సూత్రములపై విస్తృతమైన వ్యాఖ్యలు వ్రాశారు. వారి భావజాలమునకు అనుగుణంగా ప్రచార కేంద్రములను ఏర్పాటుచేసుకొన్నారు. పండితులలో ప్రభాకర మిశ్రుడు మందువాడా లేక కుమారిలభట్టా అనే అంశముపై భేదాభిప్రాయములున్నాయి. వీటిపై అనేకములైన కథలు కూడా ప్రచారములోవున్నై. వాటిలో ఒకదాని ప్రకారం ప్రభాకర, మురారి మిశ్రులు, ఇద్దరూ కుమారిలభట్టు యొక్క శిష్యులని తెలుస్తుంది. ప్రభాకర మిశ్ర చిన్నతనంనుండీ, మంచి తెలివితేటలు, స్వతంత్రంగా నిర్ణయములు తీసుకొను సామర్థ్యం, చదువులో కూడా మంచి ప్రజ్ఞాపాటవములు కలిగి వుండే వాడట. ఒకసారి గురు, శిష్యుల మధ్య, వ్యక్తి మరణానంతరము జరుపవలసిన అపరకర్మల విషయంలో భేదాభిప్రాయములు వచ్చినవట. ఇద్దరూ ఆ విషయముపై ఎంత చర్చ జరిపినట్పటికీ, ఎవరి అభిప్రాయమునకు వారు కట్టుబడి ఉండటం జరిగిందట. ప్రభాకర మిశ్రపై విజయం సాధించవలెననే పట్టుదలతో కుమారిలుడు ఒక వ్యూహం పన్నాడట. దాని ననుసరించి కుమారిల భట్టు చనిపోయినట్లు నటిం చాడట. దుఃఖపూరితులైన గురుకుల వాసులందరూ, శవంలాపడిఉన్న వానిచుట్టూ

చేరి, అంత్యక్రియలు ఏవిధంగా జరిపించవలననే విషయముపై వారిలో వారు చర్చించు కుంటున్నారట. ఆ సందర్భములో సమీపములో నిలబడిన ప్రభాకర మిశ్రవద్దకు వెళ్ళి మీ నిర్ణయమేమిటని అడిగారట. ప్రభాకర మిశ్ర అంత్యక్రియల నిర్వహణ విషయములో గురువుగారి అభిప్రాయమే సరైనదనీ, తాను కేవలం వాదనకొరకే తన అభిప్రాయమును వ్యతిరేకంగా చెప్పాననీ అన్నాడట. ప్రభాకరుని మాటలు విన్న కుమారిలుడు దిగ్గున లేచి కూర్చుని ప్రభాకరుని నేను జయించాను ! జయించానని కేకలు వేయటం ప్రారంభించాడట. ప్రభాకరుడు వెంటనే నీవు బ్రతికి ఉండగా కాదు కదా! అని బదులిచ్చాడట. ప్రభాకర మిశ్రునికి కుమారిలభట్టుకు మధ్యగల వైషమ్యములపై అనేక గాధలు, శేషుడు వ్రాసిన 'సర్వ సిద్ధాంతరహస్య' అనే గ్రంథములో పొందుపరచ బడినవి ప్రొఫెసర్ కీత్, ఇంకా కొంతమంది పండి తులు కూడా ప్రభాకర మిశ్ర క్రీ.శ. 500-600 మధ్య కాలములో జీవించి వుంటా డనీ, కేరళలోని ఉత్తర తిరువనంతపుర వాసియనీ, కుమారిలభట్టు క్రీ.శ. 700 సంవత్సర ప్రాంతమువాడనీ, భావిస్తున్నారు. వారిద్దరూ సమకాలీనులనే భావనకు, వారు మీమాంసపై వ్రాసిన వాఖ్యలలో కానీ, బౌద్ధ గ్రంథములైన "తత్త్వసంగ్రహ" వంటి గ్రంథములలో కానీ, ఆధారములు లభించుటలేదు. కుమారిలభట్టు తన గ్రంథములలో ప్రభాకర మిశ్రను విమర్శించుట ఉన్నదికానీ, ప్రభాకరుడు కుమారిలుని విమర్శించినట్లు ఎక్కడా కనబడుటలేదు. క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దమునకు చెందిన శాంతరక్షకుడనే బౌద్ధ రచయిత తనముందు తరమునకు చెందిన కుమారిల భట్టును విమర్శించుట జరిపాడు కానీ ప్రభాకరుని గురించి వ్రాయలేదు. ఈ విధంగా సైద్ధాంతికపరంగానూ, సాహిత్యపరంగానూ వారిద్దరూ సమకాలీనులని భావించుటకు తగిన బలమైన ఆధారములు లభ్యంకాలేదు. ఆ కారణంగా కొంతమంది పాశ్చాత్య, భారతీయ విద్వాంసుల భావన తప్పుగా అనిపిస్తుంది. ఏమైనప్పటికీ ఈ విషయముపై చివర నిర్ణయము తీసుకోబడనట్లుగానే భావించాలి. పరిశోధన జరపాలి.

ప్రభాకరమిశ్ర "శబరభాష్యము"పై రెండు విధములైన భాష్యములు వ్రాశాడు. సంక్షిప్తంగా వ్రాసిన దానిని "లఘ్వి" లేక వివరణ అని పిలుస్తారు. విస్తృతంగా వ్రాసిన భాష్యమును 'బృహతి' లేక నిబంధన అంటారు. సంక్షిప్తంగా వ్రాసిన భాష్యము ఇప్పుడు లభించటంలేదు. బృహతి మాత్రమే లభిస్తున్నది. అందులో ప్రభాకరమిశ్ర

యొక్క సహజ పాండిత్యము అద్భుతమైన వివరణాత్మకత, ద్వందతర్కచాతుర్యమూ స్పష్టంగా కనిపిస్తాయి. రచనా శైలి సులభంగానూ, సహజ సౌందర్యవంతముగానూ ఉంటుంది.

పూర్వ మీమాంస దర్శనమున దిగ్దంతులైన ముగ్గురు మహనీయులలో కుమారిల భట్టొకరు. భట్టు మతము లేక భట్టు శాఖను పూర్వ మీమాంసయందు స్థాపించినాడు. క్రీ.శ. 8వ శతాబ్దములో ఈయన జీవించియున్నట్లు తెలుస్తున్నది. ఆయన ఏ ప్రాంతమునకు చెందినవాడు, ఏ కాలపువాడనే విషయముపై భేదాభిప్రాయములు ఉన్నాయి. శ్రీ నీలకంఠ శాస్త్రిగారు "హిస్టరీ ఆఫ్ సౌత్ ఇండియా" అనే తమ గ్రంథంలో "ఆంధ్రోత్కళనాం సంయోగ, పవిత్ర జయమంగళగ్రామే తస్మిన్ మహానద్యాం భట్టుకార కుమారక" అనే వాక్యము నాధారముగాజేసికొని ఆయనను ఆంధ్రుడని నిర్ణయించారు. శ్రీ పి.యస్.శాస్త్రిగారు ఇందుకు ఆమోదము తెలియజేశారు. అయితే రాధాకృష్ణ పండితులు, ఆంగ్లుడైన ఎలియట్ వ్రాసిన హిందూమతము–బౌద్ధమతమనే గ్రంథము నందలి వ్రాతను ఆధారముగా చేసుకొని, కుమారిలభట్టు బీహారు దేశపు బ్రాహ్మణుడని తెలిపియున్నారు. బౌద్ధమతమును విడచి హిందూమతము పుచ్చుకున్నట్లు చెప్పారు. అలహాబాద్ విశ్వవిద్యాలయమునకు చెందిన శ్రీ ఉమేశమిశ్ర, ఆనందగిరి వ్రాసిన "శంకర దిగ్విజయము అనే గ్రంథమును అనుసరించి ముఖ్యంగా "ఉదక దేశమనే అందలి పద ప్రయోగమును బట్టీ, ఉత్తర బీహారులో నెలకొనియున్న నలంద మొదలైన బౌద్ధమత ప్రచార కేంద్రములను పరిగణనలోనికి తీసుకొని కుమారిలభట్టును మిథిలకు చెందిన మైథలీ బ్రాహ్మణుడని నిర్ణయించారు. ఆ నిర్ణయమును నమ్మటానికి అవకాశం కల్పించే మరొక కారణం. భట్ట సాంప్రదాయములో ప్రముఖునిగా పేరుపడిన మండనమిశ్రుడుకూడా మిథిలకు చెందినవాడేనని ఆనందగిరి మధ్వా చార్యుల రచనలద్వారాతెలుస్తున్నది. శ్రీకేశవమీనన్ "ఆదిశంకరులు– వారి మనస్త త్త్వము" అనే ఆంగ్ల గ్రంథము యొక్క అనుబంధములో కుమారిలభట్టు ఆస్సాముకు చెందిన బ్రాహ్మణుడనీ, బౌద్ధారామముల యందు శిక్షణపొందినాడనీ వ్రాశారు. పై రచయితలేకాక, మరికొన్ని టిబెట్టు గ్రంథములలోకూడా కుమారిలభట్టు ఏ ప్రాంతము నకు చెందినవాడనే విషయముపై పరిపరివిధములైన అభిప్రాయములను వ్యక్తంచేయుట జరిగింది. కుమారిలభట్టు, అతని ప్రత్యర్థి, మేనల్లుడైన ప్రసిద్ధ బౌద్ధ

తార్కికుడు ధర్మకీర్తిలమధ్య హిందూ, బౌద్ధమతముల ఔన్నత్యముపై జరిగిన వాదోపవాదములలో, అనేకసార్లు ఒకరిపై ఒకరు విజయం సాధించటం, ఓడిపోవటం జరుగుతుండేవని టిబెట్టు భాషలో రచింపబడిన గ్రంథముల ద్వారా తెలుస్తుంది. మరికొన్ని గ్రంథములలో ధర్మకీర్తి కుమారిలభట్టుతో  కలసి నివశించి, వైదిక ధర్మమునకు ఆయువుపట్టైన కొన్నిరహస్యములను సేకరించి వాటినే ఆయుధములుగా నుపయోగించి పెక్కు వైదిక మత ప్రచారకులను బహిరంగ చర్చలలో ఓడించినట్లు తెలియచేస్తున్నాయి. కుమారిల భట్టుకూడా ఓడినట్లు చెపుతున్నాయి. అదేవిధంగా కుమారిల భట్టును గురించి కూడా తెలిపిన ఉదంతములు ఉన్నాయి. ఈతడు రహస్యంగా బౌద్ధ విహారములలో వుండి, బౌద్ధగురువుల అనుపానులన్నీ గ్రహించి, వారిని. వారి అనుయాయులను, చివరకు తన గురువును కూడా వాగ్వివాదములలో ఓడించినట్లు తెలియచేస్తున్నాయి. ఇందులో కొంత నిజముండటానికి అవకాశం కనిపిస్తుంది. ఎందువలనంటే ఆదిశంకరులకంటే కుమారిలభట్టుకు బౌద్ధమతపు లోతుపాతు లపై మంచి అవగాహన ఉన్నది. శ్రీ కేశవమీనన్ గారి కథనము కొంత భిన్నముగా నున్నది. వారు చెప్పినదాని ప్రకారము కుమారిలభట్టు బౌద్ధాచార్యుల వద్ద విద్యనభ్యసించినప్పటికీ,  అపౌరుషేయములైన వేదములపై విశ్వాసమూ, వాటి ఆధిక్యత, వాటి ప్రమాణములపై అతనికి అచంచలమైన, గాఢమైన భక్తి విశ్వాసములు ఉండేవట. ఆయన మనసును మరొక మత సిద్ధాంతముల వైపు మళ్ళించుట సాధ్యము కాదన్నారు. వేద విమర్శను వేద నిందను, చివరకు అతని గురువు చేసినా సహించేవాడు కాడట.

ఆ కారణంగా సహాధ్యాయులైన బౌద్ధ విద్యార్థులు ఆతనిని, బౌద్ధ సన్యాసిగా నటిస్తున్న హిందువుగా భావించి, కుమారిలభట్టుపై హత్యాప్రయత్నములు కూడా జరిపారట. దైవికంగా మృత్యువాతనుండి తప్పించుకొనిన చాకచక్యమునకు సుధన్వుడనే రాజు ముగ్ధుడై బౌద్ధ ధర్మమును విడచి హైందవుడై కుమారిలభట్టు అనుచరుడై, బౌద్ధ మతస్తులు జరుపు మతచర్చలలో పాల్గొంటూ, బౌద్ధులను హిందువులుగా మార్చెడి కార్యక్రమములో కుమారిలునకు కుడి భుజముగా ప్రవర్తించాడు. రాజైన సుదన్వుడే కుమారిలభట్టుకు రాజపోషకుడు. ఈ విధంగా యావద్భారతం లోనూ మత మార్పిడిని చేపట్టి, కుమారిలభట్టు సనాతన ధర్మ సంరక్షకుడుగా కీర్తి

గడించాడు. అటువంటి ఉద్యమములో భాగంగా బౌద్ధ మతమునకు ఆయువుపట్టుగా, పెంపుడు తల్లిగా, మారిన ఆంధ్రదేశములో ప్రవేశించి, ఇచటనే స్థిరపడిపోయి ఉండుటకు కూడా అవకాశము లేకపో లేదు. ఆ కారణంగా అతడు ఆంధ్రునిగా పరిగణింపబడి ఉండవచ్చును.

అయితే కుమారిలభట్టుకు సంబంధించి ప్రచారములో నున్న కథలన్నిటిలోనూ, ఒక సంఘటనపై వాటిలో ఏకీభావము కనిపిస్తున్నది. అదేమంటే కుమారిలభట్టు తాను చేసిన రెండు పాపకార్యములకుగాను త్రివేణీసంగమమైన ప్రయాగలో ఆత్మాహుతి చేసుకొన వలెననే నిర్ణయము. ఆయన ఆచరించిన పాపకార్యములలో మొదటిది. బౌద్ధాచార్యుడైన తన గురువును, తానే అగ్నిని జ్వలింపచేసి అందు దగ్ధమైపోయేటట్లు శిక్షించటం, రెండవది– వేదములు అపౌరుషేయములు, వైదిక కర్మాచరణముల ద్వారానే మోక్షప్రాప్తి కలుగుతుందనే విశ్వాసము దృఢీకరింపజేయటానికి, భగవంతుని ఉనికిని తృణీకరించటం, మాధవాచార్యుల శంకర విజయము ద్వారా కుమారిలభట్టు ఆత్మాహుతి చెందుచున్న సమయంలోనే ఆదిశంకరులు ఆయనను కలిసి తిరిగి మిమ్ములను సాధారణస్థితికి తీసుకురావటానికి అంగీకరించవలసినదిగా ప్రార్థించినారట. కానీ కుమారిల భట్టు శంకరుని అభ్యర్థనను తిరస్కరించి, భట్ట సాంప్రదాయముపై తన శిష్యుడైన మండన మిశ్రునితో చర్చించవలసిన దని చెప్పాడట. శంకర, మండనమిశ్రుల మధ్య చర్చ జరగటం, మండన మిశ్రుని భార్య ఉభయభారతి న్యాయనిర్ణేతగా వ్యవహరించటం, వాదనలో మండనమిశ్రుడు వోడిపోయి సన్యాసమును స్వీకరించుట. ఆదిశంకరులు ఆయనకు సురేశ్వరా చార్యులనే దీక్షానామము నిచ్చి శృంగేరిపీఠాధిపతిగా నియమించటం వంటి వృత్తాంతము ఆధ్యాత్మికులకు తెలిసిన విషయములే కావున పునశ్చరణ మనావశ్యకమని వదలిపెట్టబడినది. అటువంటి అనేక కథలలో వాస్తము ఎంత ఉన్నప్పటికీ, నిశ్చితమైన విషయమేమంటే బౌద్ధమతమునందలి లోతుపాతులు కుమారిలునకు తెలిసినంతగా ఆదిశంకరులకు తెలియవు. వారి ఉభయుల రచనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ సత్యం వ్యక్తమవుతుంది. కుమారిలుని స్థానము భారతీయ ఆధ్యాత్మిక చింతనయందు ముఖ్యముగా తాత్త్వికతర్కమునందు అద్వితీయమైనది. తారానాథుని "భారతీయ బౌద్ధ చరిత్ర (History of Indian Buddism) వంటి ఆంగ్ల గ్రంథములను బట్టి

కుమారిలభట్టు గృహస్థుడనియూ, విస్తారమైన వ్యవసాయ భూములు కలవాడనీ, అనేక స్త్రీపురుష కూలీలు ఆయన పొలములలో పనిచేశారని తెలుస్తుంది. ఆయనకు జయమిశ్ర అనేపేరు గల కొడుకుండేవాడని కూడా విదితము అవుతుంది.

ముందుగా చెప్పినట్లు ఆయన ఎంతకాలము జీవించారనే విషయములో అనేక భిన్నాభిప్రాయములు వున్నాయి. టిబెట్టు బౌద్ధ సన్యాసియైన తారానాధుని రచలను బట్టి, కుమారిలభట్టు టిబెట్టు రాజైన సాన్ ఇసమ్‌గంపాకు సమకాలీనుడని తెలుస్తుంది. ఆ రాజు క్రీ.శ. ఏడవ శతాబ్దములో టిబెట్టును పరిపాలించినాడు. ఆ అంచనాను బట్టి కుమారిలుని మేనల్లుడూ ప్రతిద్వంద్వీ, ప్రముఖ బౌద్ధ తార్కికుడూ అయిన ధర్మకీర్తి జీవితకాలముతో సరిపోతుంది. ధర్మకీర్తి క్రీ.శ. 635 సం॥ చెందినవాడుగా నిర్ణయించబడినది. మరొక విషయమేమంటే ప్రముఖ సంస్కృత కవియైన భవభూతి (క్రీ.శ.620–680) తాను కుమారిలభట్టు శిష్యుడనని చెప్పుకున్నాడు. పై కారణములను పరిగణనలోనికి తీసుకొని కొందరు విద్వాంసులు కుమారిలభట్టు క్రీ.శ.580–650 సం॥ మధ్యకాలములో జీవించియుండవచ్చునని నిర్ణయించినారు. ప్రొఫెసర్ శ్రీ కుప్పుస్వామిశాస్త్రి వారి అభిప్రాయము ప్రకారం–భట్టు క్రీ.శ. 600–660 సం॥ మధ్య జీవించినారని తన గ్రంథము "బ్రహ్మసిద్ధి"కి వ్రాసిన ఉపోద్ఘాతములో తెల్పినారు. డా॥ గంగానాధ్ ఝా ఈతనిని ప్రభాకర మిశ్రాకంటే పిన్నవాడని తెలియజేశారు. ప్రభాకరమిశ్ర జీవితకాలము క్రీ.శ. 600–650గా నిర్ణయించబడినది. పైన ఉదహరించిన విద్వాంసుల అభిప్రాయములను అనుసరించి కుమారిలభట్టు ఆదిశంకరుల కంటే వయసులో పెద్దవాడనీ, క్రీ.శ. ఏడవ శతాబ్దపు ఉత్తర భాగములో జీవించియుండవచ్చునని భావించవచ్చును.

బౌద్ధ, జైనమతాచార్యులతోనే కాక, హిందూమతమునందలి ఇతర శాఖలకు చెందిన విద్వాంసులతో సహితము, అనేక సదస్సులలో పాల్గొంటూ, యావద్భారతమునందు పర్యటించి, వారిని తన వాక్పటిమ, తర్కశాస్త్ర నిపుణతతో ఓడించినాడు. ముఖ్యంగా, బౌద్ధులు ఆయన ప్రథమ ప్రతిద్వంద్యులుగా పరిగణింపబడినారు. అందువల్ల బౌద్ధులు ఆయనను ఏవగించుకొనేవారు. మాయావదియైనవాడు చివరకు వేదాంతమును కూడా నాస్తికమతముగా నిర్ణయిస్తాడని విమర్శించేవారు. ఇందుకు కారణం కుమారిలభట్టు అద్వైతమునేకాక, సాంఖ్యము, యోగము, పాంచరాత్రము,

పాశుపతశాఖలను కూడా నాస్తిక శాఖలుగానూ, వేద విహితములుగానూ నిర్ణయిం చుట. ఆయనకుగల ద్వంద్వ తర్క ప్రజ్ఞా పాటవమునూ, బహుశాస్త్ర పాండిత్యమునూ, నేర్పుతో, అద్భుతంగా వినియోగించుకొని ప్రత్యర్థులను పరాజయముపాలు చేసేవాడు. ఉద్దండులైన బౌద్ధ తర్కపండితులు న్యాయ ప్రయోగ విధానము ద్వారా, వేదమతమును ఖండిస్తూ, బౌద్ధమత ప్రచారము జరుపుతుండేవారు. కుమారిలభట్టు అటువంటి ఆచార్యులను తనవాదనతోఎదుర్కొని వారిని గడ్డిగరిపించే వాడు. వాదనలయందు వారు ప్రయోగించిన కిటుకులను తిరిగి వారిపైననే ఉపయోగించి వారిచేత దాసోహ మనిపించుకొనేవాడు. వైదిక ధర్మోద్ధరణగావిస్తూ, బౌద్ధ ధర్మమును తీవ్రంగా ఖండిం చేవాడు. బౌద్ధమతమంటే ఆయనకు గల ద్వేషభావమెంతటిదంటే హిందూ రాజులను బౌద్ధమతస్తులను నశింపచేయమని కోరుతూ వారిని చంపమనీ ప్రోత్సహించే వాడట.

హిందూమతమునందలి ఇతర ఆస్తిక దర్శనములకంటెనూ, పూర్వమీమాంస మొక్కటే వేదములలో చెప్పబడిన మంత్రములు, కర్మాచరణములకు తగినట్లుగా ఉన్నదని ప్రచారము చేస్తూ తన భావజాలమును గ్రంథస్థము చేస్తూ శబర భాష్యమును ఆధారముగా మూడు, ఉద్గ్రంథములను రచించాడు. ఈ మూడు గ్రంథములున్నూ, శబర భాష్యము నందలి ఒక్కొక్క భాగముపై వాఖ్యానమును కలిగియున్నవి. ఆ మూడు గ్రంథముల పేర్లు 1. శ్లోకమాధ్యమిక టీక వార్తిక; 2. తంత్రవార్తిక; 3. తుపిటక. పై మూడు గ్రంథములే కాక “బృహతి” అనే మరోగ్రంథరచన కూడా చేసినట్లు శ్రీపార్థసారధి మిశ్ర చెప్పారు. అందుకు ప్రమాణము, శ్లోక వార్తికలోని ఐదవ సూత్రమునందలి తొమ్మిదవ శ్లోకముపై కుమారిల భట్టు వ్రాసిన టీక. కృష్ణదేవుడు తన “తంత్రచూడామణి” గ్రంథములో కూడ, పై రెండు టీకలను ఉదహరిస్తూ తంత్రవార్తికను “తంత్రటీక” యని కూడ అంటారని తెలిపినాడు. “బృహత్‌టీక”యొక్క సంక్షిప్త రూపమే తంత్రవార్తిక లేక తంత్రటీక. కుమారిల భట్టుయొక్క పై గ్రంథములోని ఉదాహరణములు కొన్ని భట్టి కావ్యములోనూ, కాళిదాసుని శాకుంతలము లోనూ కనిపిస్తవి. ఈ గ్రంథములనే కాక కుమారిలుడు “మానవ కల్ప సూత్రములు” అనుమనువు రచన పై కూడా వాఖ్యను వ్రాసినట్టున్నూ, దాని నకలును ఇండియా ఆఫీసు లైబ్రరరీ లండనువారు క్రీ.శ. 1867లో థియోడార్ గోల్డ్ స్టకర్ వారి ఆధ్వర్యంలో ప్రకటించునట్లుగా తెలుస్తోంది.

కుమారిలభట్టు పూర్వమీమాంసదర్శనము స్థాపించిన భట్టశాఖ లేక భట్ట మతము అనే సాంప్రదాయముపై ప్రప్రథమముగా విస్తృతమైన వివరణను సమకూర్చినవాడు మండన మిశ్రుడు. ఈయన కుమారిలుని తంత్ర వార్తికపైవ్రాసిన వాఖ్యానము ద్వారా వివరణ ఇచ్చుట జరిగింది. మండనమిశ్రుడు కుమారిలభట్టు బావమరిదిగా పరిగణించ బడుటతో బాటు, పూర్వమీమాంసపై అనేక గ్రంథములను రచించిన తాత్త్వికునిగా కూడ గుర్తింపు పొందినాడు. ఆయన వ్రాసిన "మీమాంసా అనుక్రమణి" అనే గ్రంథము యావత్తూ సూత్ర భాష్యముపైన, ప్రఖ్యాతిచెందిన సంకలన గ్రంథముగా గుర్తింపు పొందినది. ఆదిశంకరులచే ఓటమిపాలై అద్వైతమత˘స్వీకారముచేసిన అనంతరము అద్వైత సాంప్ర దాయముపై "బ్రహ్మసిద్ధి" అనే పేరుతో వ్రాసిన వ్యాస రాజము సుప్రసిద్ధమైనది. అనంతరకాలములో అనేకమంది భట్ట సాంప్రదాయపు ఉత్కృష్టతను విశదీకరిస్తూ అనేక వ్యాఖ్యలు వ్రాయటంజరిగింది. కుమారిలభట్టు రచనలయొక్క సంక్షిప్త పరిశీలన క్రింద పొందుపరచడమైనది.

**1. శ్లోకవార్తిక :** శ్లోకరూపమున రచించబడిన వాఖ్యానము. శబరి భాష్యమునందలి మొదటి పాదమును తర్కపాదమని వ్యవహరిస్తారు. ఇది శబరభాష్యమునందలి మొదటి అధ్యాయము. ఇందలి పాదములు, పూర్వమీమాంస దర్శనములో పొందు పరచిన ఆధ్యాత్మిక విషయములను గురించి వివరిస్తూ, బౌద్ధుల ఆధ్యాత్మిక దృక్పథ మును తీవ్రంగా నిరసిస్తుంది.

**2. తంత్రవార్తిక :** కుమారిలుని రెండవ గ్రంథముగా భావించబడు ఈ రచనలో ఎక్కువ భాగము గద్యము. శబర భాష్యమునందలి మొదటి అధ్యాయములోని, ద్వితీయ పాదము నుండి ప్రారంభమై, మూడవ అధ్యాయము చివరి వరకూ, ఈ గ్రంథములో వాఖ్యానించటం జరిగింది. అద్వితీయమైన ఈ గ్రంథము ద్వారా రచ యిత తనకుగల పాండిత్య ప్రకర్షను ప్రదర్శించుటతోపాటు, ఇతర ఆధ్యాత్మిక సాంప్రదాయములను గురించి తనకుగల విస్తృత మైన జ్ఞానమును విశదీకరించుట జరిగినది. పై కారణములవలన దీనిని ఆయన రచనలలో ఉత్కృష్ట గ్రంథముగా పరిగణింపబడుతోంది. (magnumopius)

**3. తుపిటీక :** ఈ మూడవ గ్రంథము శబరభాష్యముపై భట్టు వ్రాసిన వాఖ్యానములో చివరిభాగము. ఇది చాలా క్లుప్తంగా, ఎక్కువ వివరములు లేకుండానూ, ఆయన

ఇతర రచనలతో పోలిస్తే, వివిధ అంశములపై విస్తృతమైన ఆయన దృక్పథమును, మొదటి రెండు రచనల కోవకే వ్యక్తం చేయలేదు.

పై మూడు గ్రంథములయందు ముఖ్యాంశములపై కుమారిలభట్టు వ్యక్తం చేసిన అభిప్రాయములను పరిశీలిద్దాం.

**శ్లోకవార్తిక :**

**1. ఆత్మనిశ్రేయసము (విముక్తి) లేక మోక్షము :**

శబర భాష్యములో ఆత్మముక్తి ప్రస్తావన లేనేలేదు. ప్రభాకర మిశ్రకూడా ఈ విషయము ప్రస్తావించలేదు. కాబట్టి ఆత్మ విముక్తి చెందటం, మోక్ష సాధన అనే అంశములను పూర్వ మీమాంసలో ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన కీర్తి కుమారిలునికే దక్కింది. ఆత్మజ్ఞానమును తెలుసుకొనినవారికి పూర్వకర్మల ఫలితములు నశించి పోతవి. అందువల్ల అనుభవించవలసిన కర్మ ఫలములు మిగిలివుండవు. ఆ కారణంగా, ఆత్మ శరీరమునకు బంధింపబడియుండదు. కర్మఫలము ననుభవించుటకు, పుట్టుక–చావు అనే జనన–మరణ చక్రమునుండి ఆత్మకు విముక్తి కలుగుతుంది. ఆత్మ విముక్తిని కోరుకొనేవారు, ఒకానొక ఫలితమును ఆశించి చేసేటటువంటి కామ్యకర్మలనుగానీ, వేదములలోను ధర్మ శాస్త్రములలోనూ, నిషేధింపబడిన నిషిద్ధకర్మలను కానీ ఆచరించరాదు. వేదములలోనూ, శాస్త్రముల లోనూ విధిగా ఆచరించవలసినదిగా నిర్దేశించిన సంధ్యావందనము, అగ్నికార్యము, వ్రతములవంటి నిత్య, నైమిత్తిక కర్మలను ఆచరించవలసినదే. ఇవి ఆచరించుటవలన వచ్చే ప్రతిఫలమేమీ ఉండక పోవచ్చును కానీ ఆచరించకపోవటం వలన పాపమువస్తుంది. కుమారిలభట్టు నిర్వచించిన ప్రకారం మోక్షమంటే శరీరము నశించిన అనంతరము అందుండి విముక్తి పొందిన ఆత్మ తిరిగి ఏ శరీరమునందూ బంధింప పడకపోవటమే. అదే మోక్షము. అటువంటి మోక్షసాధన కేవలము జ్ఞానము ద్వారా లభింపదు. పూర్వజన్మ కర్మ ఫలితముల నుండి జ్ఞానమొక్కటే జీవుని కాపాడలేదు. ఉద్ధరించలేదు. వేదములు కూడా ఆత్మ విముక్తిని గురించిన జ్ఞానమును మాత్రమే ఇవ్వగలవు. కుమారిలభట్టు తెల్పిన ఈ సిద్ధాంతము "జ్ఞానాదేవతు కైవల్యం" అను అద్వైతము ప్రభోదనకు విరుద్ధము. అయినప్పటికిని కుమారిలభట్టు తన ద్వితీయ గ్రంథమైన తంత్రవార్తికయందు, దేవతారాధనము ద్వారానూ, జపతపాదుల ద్వారాను, పొందిన జ్ఞానము మోక్షదాయకమని తెలియచేశాడు.

**2. ఆత్మ :** వేదములయందు నిర్దేశింపడిన కర్మలనాచరించు వారు స్వర్గమునకు చేరుదురని వేదములయందు ప్రకటింపబడినది. అయితే వేదప్రామాణ్యతను, వేదముల ఆధిక్యతను ఆమోదింపనివారు ప్రశ్నించేదేమంటే, వైదిక కర్మాచరణముల ద్వారా దేహము పునీతము అయినప్పటికినీ, మరణానంతరము అగ్నిచే దగ్ధము చేయబడుతుంది కదా, మరి స్వర్గము ఏ విధంగా చేరుతుంది ? చేరలేదు. కాబట్టి వేదముచెప్పేది పచ్చి అబద్ధము. ఈ విధమైన ప్రశ్నకు జవాబుగా వేదవిదులు చెప్పేదేమంటే స్వర్గమునకు చేరునది అతని భౌతికకాయము కాదు. ఆ శరీరమును ఆవాసముగా చేసుకొనిన జీవాత్మ, ఏ వస్తువు అనంతరకాలమునందు జ్ఞాపకశక్తిని కలిగి వుంటుందో, ఏ వస్తువుకు గుర్తించగలిగిన జ్ఞానముంటుందో, ఏ వస్తువు ఒక వ్యక్తి వలనగానీ, ఒక పదార్థము వలనగానీ, అనుభూతిని పొందుతుందో, దానినే ఆత్మ అని పిలుస్తారు. ఆస్తిక దర్శనములన్నీ ఈ విధమైన భావనను అనేక రకములుగా వివరిస్తూ, ఎన్నెన్నో గ్రంథములను పెంపొందిచుటయేకాక, ఆయా భావనలను బట్టి అనేక శాఖలుగా సాంప్రదాయములుగా హిందూమతములో వెలసినవి. కుమారిలభట్టు ఆత్మ అది వసించు దేహము రెండూ వేరువేరని ప్రకటించాడు. అది దేహ భాగములైన ఇంద్రియములూ, మనస్సు కంటే భిన్నమైనదనీ చెప్పాడు. అది శాశ్వత మైనది, నాశములేనిది, కార్యాచరణమును నిర్వహించునది. అట్టి కార్యముల వలన కలుగు ఫలితములు అనుభూతులకు ప్రతినిధి. అది సర్వవ్యాపి. వ్యక్తి నిర్వహించు శుభాశుభకర్మలకు సాక్షీ భూతమై ఉంటుంది. అది శుద్ధ చైతన్యము. దేశకాలములకు అతీతము, స్వయం ప్రకాశము తనంతట తానే కోరిన స్వరూపమును దాల్చగలదు.

**3. మనస్సు, ఇంద్రియములు, దేహము :** కుమారిలుడు తన "శాస్త్రదీపిక"యనే గ్రంథములో మనస్సును దేహాంతర్గత జ్ఞానేంద్రియములుగా వర్గీకరించినాడు. జ్ఞానేంద్రియములను రెండు విధములుగా విభజించినాడు. బహిర్గతములు, అంతర్గతములు. బహిరింద్రియములను అవి నిర్వహించు కార్యములను బట్టి తిరిగి ఐదు విధములని తెలియజేశాడు. అవి శ్రోత్రము (చెవులు) త్వక్కు (చర్మము) నయనము (కళ్ళు), జిహ్వ (నాలుక) మరియు ఘ్రాణము (గాలిపీల్చుట) ఇవి వరుసగా, వినుట, స్పర్శ చూచుట, రుచి, వాసన అనే ఐదు విధములైన కార్యములను నిర్వహిస్తూ వుంటవి. అంతరింద్రయము ఒక్కటే. అది మనస్సు. కుమారిలభట్టు చెప్పిన దానిని బట్టి

మనస్సు పంచభూతములైన భూమి, నీరు, వెలుతురు, గాలి, ఆకాశములలో ఏదో ఒకటి కావచ్చును. లేదా, వాటితో ఎటువంటి సంబంధములేనిదై కూడా ఉండ వచ్చును. అయితే ఒక ముఖ్య విషయమేమంటే, మనసును పనిచేయించ గలిగేది, ఆత్మ ఒక్కటే. ఇతర ఇంద్రియములేవీ కావు. ఆ కారణంగా అది అంతరేంద్రియ ముగా పరిగణింపబడినది.

ఇక సూక్ష్మశరీరమంటే జ్ఞానేంద్రియములు ఐదు, కర్మేంద్రియములు ఐదు (వాక్కు, చేతులు, పాదములు, గుదము, ఉపస్థ) పంచ ప్రాణములు (ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము)మనస్సు బుద్ధి ఈ పదిహేడింటినీకలిపి సూక్ష్మ శరీరము అంటారు. దీనినే లింగశరీరమని కూడా పిలుస్తారు. స్థూల శరీర మనబడే ఈ దేహము మరణించగానే అందలి జీవుని (ఆత్మ) తీసుకొని వెళ్ళిపోయి, ఆ జీవుడు తిరిగి మరో శరీరంలో జన్మనెత్తగానే ఇది అదృశ్యమవుతుంది. కాబట్టి దీనిని ఊహాజనితమైనదిగా భావించవలెనని, తన వివరణకు ప్రమాణముగా వింధ్యరాశిని అనే ప్రాచీన తాత్త్వికుని భావనను ఉదహరించాడు.

**4. భగవంతుడు :** శబరస్వామి తన భాష్యంలో భగవంతుని ఉనికిని తిరస్కరించాడు. కారణమేమనగా వేదములు అపౌరుషేయములనీ, ఎవరూ వాటిని సృష్టించలేదనే దృఢ నమ్మకమే పూర్వ మీమాంసకు పునాది రాయికాబట్టి అదే విధంగా మాట (శబ్దము) దాని అర్థము స్వతసిద్ధములు. ఇవి కూడా సృష్టికర్త ఒకడున్నాడనే భావనను తిరస్కరిస్తవి. ప్రభాకరమిశ్ర సృష్టికర్త అస్థిత్వమును కాదన్నాడు. కుమారిలభట్టు మరో అడుగు ముందుకు వేసి, శబ్దార్థముల మధ్య ఉన్నదనే సంబంధమును పూర్తిగా తిరస్కరించి, సృష్టికర్త ఉనికినేగాక, ధర్మము, అధర్మములను, వాటి ఆచరణ పద్ధతు లను కూడా నిరశించాడు. శబ్దములను, వాటి అర్థములను త్రోసిపుచ్చుటయేకాక, వాటి మధ్యగల అనుబంధమును కూడా కాదన్నాడు. చివరకు వేదముల వాస్తవి కతనూ, సర్వవ్యాప్తుడైన భగవంతుని అస్థిత్వమునే సత్యము కాదని శంకించాడు. అంతే కాక భగవంతుడనే వాడు ఈ సృష్టి చేయక ముందు ఎటువంటి పరిస్థితు లుండేవి ? ఆ పరిస్థితులలో సృష్టి కర్తను గుర్తించి, మానవులకు ఆయనను గురించి తెలియజేసిన వ్యక్తి ఎవరు ? సృష్టి కర్తకు తాను సృష్టి చేయవలననే స్పందన ఏ విధంగా కలిగింది? శరీరము పంచ భూతాత్మక మైనపుడు పంచ భూతముల సృష్టి

జరుగకముందు, సృష్టికర్త శరీరమును ఎట్లేర్పరచినాడు ? శరీరము లేకపోతే సృష్టి చేయవలె ననెడి కోర్కె ఎలా కలిగింది ? ఈ విధమైన అనేక ప్రశ్నలను భగవంతుని అస్థిత్వముపై కుమారిలభట్టు వేసి, వీటన్నిటికినీ సమాధానములు లభించనప్పుడు ఈ విశ్వ సృష్టికి కారకుడు దేవుడేననటం సబబుకాదని తేల్చి చెప్పాడు. సృష్టించడమనే పని ఆయనయొక్క లీల అనో, లేక ఆట అనో, లేక కోర్కెయనో భావించి, ఆయన దయా సముద్రుడని, ప్రశంసిస్తే, మరి ఆయనకు ఈ సృష్టిసర్వమునూ లయింపచేయ వలెననే కోర్కె ఎందుకు కలుగుతుంది ? ఇట్టి ప్రశ్నలపై జరిపిన చర్చల సారాంశ మును కుమారిల భట్టు తన "శ్లోక వార్తికము"లో పొందుపరచినాడు. ఇక్కడ తమాషా ఏమంటే దేవుని అస్తిత్వమును అనేక విధములుగా శంకించి, విమర్శించిన కుమారి లుడు, తన గ్రంథ ప్రారంభాన్ని శివస్తోత్రముతో మొదలుపెట్టాడు. భావనకు ఆచరణకు మధ్యగల వైరుధ్యమును సమర్థిస్తూ "న్యాయరత్నాకర"మనే గ్రంథంలో స్తోత్రము చేయటంవల్ల విశ్వవ్యాప్తమైన పరమాత్మ ఉన్నాడనీ, ఆయన సర్వజీవులయందు ప్రత్య గాత్మగా భాసిస్తాడనీ తాను విశ్వసిస్తున్నట్లుగా భావించరాదని వివరణ ఇవ్వటం జరిగింది.

**5. కాలము :** కుమారిలుడు కాలము అనంతము, శాశ్వతమూ సర్వవ్యాప్తమనే వర్ణించాడు.

**6. ప్రపంచ వాస్తవికత :** మీమాంసకారులు, అద్వైతులవలే కాక, ఈ ప్రపంచము సర్వమూ, వాస్తవమని అంగీకరిస్తారు. ఈ అంశముపై హిందూ, బౌద్ధ, జైనమత శాఖలు విశ్వసిస్తున్న భావవాదము (Idealism)ను మీమాంసకులు ఖండించారు. కుమారిలభట్టు తన శ్లోక వార్తికము నందలి రెండు అధ్యాయములలో సంజ్ఞానము (Cognition) సర్వమూ బాహ్య ప్రపంచమునందు ఎటువంటి ఆధారములేకుండా జనించినదనే వాదననూ ఖండిస్తూ విస్తృతమైన వివరణను రచించాడు. సంజ్ఞానము నకు బాహ్య ప్రపంచమునందు ఆధారము కలదనే సత్యమును ఇంతవరకూ ఎవరూ కాదనలేదు. ఏ విధముగానైతే, స్వప్న భావనలు అబద్ధమని ఎవరూ అనలేదో, అదే విధంగా పైన తెల్పిన సత్యమును కూడా ఎవరూ కాదనలేదు. ఏదైనా ఒక తప్పు చేసినచో దానికి బాహ్య ప్రపంచమే ఆధారము, కారణ భూతము అవుతుంది. కాబట్టి బౌద్ధులు అద్వైతులు, ప్రచారంచేసే "జగన్మిథ్య" అనే మాయావాదము సరియైనదికాదని కుమారిలభట్టు ఖండించాడు. పైపెచ్చు వారి భాషా చమత్కృతిని అవహేళన చేస్తూ, "వాసనలు" వంటి అర్థంలేని పదజాలమును ఉపయోగిస్తారు అని తెలియజేశాడు.

**7. స్వర్గము :** "స్వర్గకామోయజేవప్నిః" అని వేదం చెబుతున్నది. అయితే స్వర్గం అంటే ఏమిటి ? దాని రూపురేఖలెలా వుంటవి ? అంటే స్వర్గమనేది సుఖసంతోషము లతో విలసిల్లేటటువంటి ప్రదేశము. అన్ని విధములైన బాధలనుండి విముక్తి పొందేటటువంటి స్థలము. ప్రకరణ పంచికలో చెప్పినట్లు పురుషులందరూ కోరు కొనేటటువంటి చోటు ఆత్మ పరిపూర్ణమైన, సుగుణములు పొంది విలసిల్లుధామము.

**8. జాతి, సామాన్య, వర్ణ, వివిధ జీవుల సమ్మేళనం :** న్యాయసూత్రకారులు జాతి, ఆకృతుల మధ్య ఏర్పరచిన భేదమును మీమాంసకారులు త్రోసిపుచ్చారు. శబరస్వామి ప్రభాకర మిశ్రకూడా జాతి, ఆకృతి సామాన్య అనే అంశములన్నీ, ఒకే సామ్యత కలిగినవని ప్రకటించారు. కుమారిల భట్టు శ్లోకవార్తిక ప్రారంభములోనే పైన చెప్పిన పదములన్నీ సమానార్థకములని చెప్పాడు. ఉదాహరణకు గాను ఆవును, అడవిని అంటే ఒకే వస్తువును, సమూహమును తీసుకొని, ఆవు అంటే ప్రపంచములోనున్న అన్ని ఆవులకు అనువర్తిస్తుందనీ, అడవి అంటే అన్ని జాతులకు చెందిన వృక్షములకూ అనువర్తి స్తుందనీ ఈ అనువర్తనములో ఆకారములనుబట్టిగానీ పరిమాణమును బట్టి గానీ, రంగు, ఆదిగాగల ఇతర విభేదాలను గానీ, పరిగణనలోనికి తీసుకొనవలసిన అవసరము లేదని చెప్పాడు. అందువలన విశ్వజనీనత, లేకసార్వత్రికత అనేది ఒక్కటేననీ, వ్యక్తిపరంగా చూచినందువల్లనే, మనకు అనేకత్వ భావన కలుగుతోందనీ వివరించాడు. అదేవిధంగా వ్యక్తులు అధికంగా ఉన్నప్పటికిన్నీ వారందరినీ సామూ హికంగా పరిగణించుటయే విశ్వజనీనత యని తెలియజేశాడు.

**9. ప్రమాణములు, ప్రామాణిక జ్ఞానము :**

పూర్వమీమాంసదర్శనమును క్షుణ్ణంగా అధ్యయనము చేయవలెనంటే, జ్ఞానము యొక్క స్వాభావిక లక్షణము తప్పక అవగతముచేసుకోవాలి. ఆ కారణముగా ఈ దర్శనమును జ్ఞాన ప్రబోధకమని ప్రకటించుట జరిగింది. కర్తవ్యము లేక ధర్మమును గురించి బోధించుటయే ఈ దర్శనము యొక్క లక్షణము. శ్లోకవార్తికములో కుమారి లభట్టు చతుర్విధములైన వైవిధ్య, దృక్పథముల వివరణానంతరము, జ్ఞానము యొక్క ప్రామాణికత, కారణము యొక్క దక్షతమీద, ఆ మాటలు చెప్పిన వ్యక్తిపైగల నమ్మక మును బట్టీ, అతని సామర్థ్యమును బట్టీ ఉంటుందన్నాడు. వేదములకు రచయిత ఎవరూ లేరు కాబట్టి, జ్ఞానమునకు వాటిని మూలములుగా పరిగణించుట సరియైనది

కాదేమోననే శంకతో కర్తవ్యము, ధర్మమునకు సంబంధించిన జ్ఞానార్జనకు అవి అనర్థ్వములుగా భావించబడినవి. అన్ని విధములైన పరిజ్ఞానము అంతర్గతంగా ప్రామాణికత కలిగి ఉన్నప్పటికీ, బహిర్గతంగా అప్రమాణకతను ఆపాదిస్తున్నారు. చివరకు తేల్చినదేమంటే, జ్ఞానము, సర్వేసర్వత్రా ప్రామాణికమైనదే. కాదనవలెనంటే దాని మూలమునందుగల లోపమును ఎత్తిచూప వలసిందే. అప్పుడు మాత్రమే జ్ఞానము తన ప్రామాణికతను కోల్పోతుంది.

**10. వివిధ విధములైన ప్రామాణిక పరిజ్ఞానములు – దృశ్యములు :** మీమాంసకారులు అందరూ ఒక్క ప్రభాకర మిశ్రను మినహాయించి జ్ఞానసంపదను, ఆరు విధములుగా విభజించినారు. దానిని "ప్రమాణషట్కమని" పిలుస్తారు. ప్రభాకర మిశ్రుడు దానిని ఐదు రకములుగానే విభజించాడు. ఆరు విధములైన ప్రమాణములేవంటే 1. ప్రత్యక్ష ప్రమాణము స్వానుభవముతో చూచుట లేక గ్రహించుట 2. అనుమాన ప్రమాణము 3. ఉపమానము పొగను చూసి అచట నిప్పు ఉండునని ఊహించుట. 3. ఒక వస్తువునుబోలు మరొక వస్తువును చూచి మొదటి వస్తు ఇటులనే ఉండునని ఊహించుట 4. శబ్ద ప్రమాణము చూడని వస్తువును, ఇతరులు వర్ణించగా తెలుసుకొనుట (వేదములు) 5. అర్థాపత్తి : కంటికి కనబడిన పరిస్థితులను బట్టి ఒక నిర్ణయమునకు వచ్చుట. ఉదా : లావుగానున్న వ్యక్తిని చూచి వీడు తిండిపోతని భావించుట. 6. అనుపమ లబ్ధి : ఒక వస్తువును మొదట ఒక ప్రదేశమున గుర్తించి అంతరము అది ఆ ప్రదేశమునందు లేదని గ్రహించుట. ఉదా : బల్లపైనుంచిన గడియారము అక్కడ లేకపోతే, దానిలేమి మాత్రమే గుర్తించబడు చున్నదికానీ, శూన్యతను కాదు.

శబరభాష్యానుసారంగా ఒక వస్తువునకు, మన ఇంద్రియములకు మధ్య సంయోగమేర్పడినపుడు ఆ వస్తువును మనము గుర్తించగలము. దీనిని ఇంద్రియజ్ఞానమని పిలుస్తారు. కొన్ని పరిస్థితులయందు అట్టి జ్ఞానము లోపభూయిష్టమగుటకు ఆస్కారము కలదు. చీకటిలో తాడు సర్పమువలె కనిపించుట. చీకటియను పరిస్థితి లేకుండినచో జ్ఞాన లోపమేర్పడెదికాదు. అది అసత్యమైయుండెడికాదు. ప్రభాకరమిశ్ర ప్రత్యక్షముగా దర్శించి పొందిన జ్ఞానమును ప్రత్యక్షబోధనము లేక ప్రత్యక్ష జ్ఞానమని వివరించినాడు. ఈ విషయముపై కుమారిలుడు ప్రభాకరుని అభిప్రాయముతో ఏకీభవించినాడు. ఇది సామాన్యజ్ఞానముగా పరిగణించి, ప్రమాణముల జోలికి,

వాటి ఫలితముల జోలికి పోలేదు. కుమారిలుని అభిప్రాయములో సుఖదుఃఖాదులు, ఇంద్రియానుభవముల ద్వారా అంతరింద్రియమైన మనస్సు గ్రహించి, వాటి అనుభవములను వ్యక్తపరుస్తుంది. అయితే యోగసాధన ద్వారా సంపాదించే ఆ జ్ఞానము, అంతర్బుద్ధి జనితము కాబట్టి అనుమానించే అవకాశము ఏర్పడుతుంది.

**11. శాస్త్రజ్ఞానము :** శాస్త్రములయందు నిర్దేశింపబడిన అంశములు కూడా జ్ఞాన సముపార్జనకు సాధకములే. ఇవి ఇంద్రియముల జ్ఞానమునకు అతీతములు. ధర్మము, అధర్మము, సత్యము, అసత్యము, దయ, కరుణాదిగాగల అంశములు సర్వమూ శబ్ద జ్ఞానమున కంటే ప్రాచీనమైనవి. శబరభాష్యమునందు శబ్దమునకుగానీ, శ్రుతి ద్వారా పొందు జ్ఞానమునకు గానీ, ఏ విధమైన నిర్వచనమూ వివరణ ఇవ్వలేదు. కేవలము శాస్త్ర విహితమైన నిర్దేశములకే ప్రాధాన్యత కల్పించాడు. అందువలన శబ్దమనే పదానికి ఇచట వేదోక్తము లేక శాస్త్రోక్తము అని గ్రహించవలెను. అర్థమంటే ధర్మార్థమని తెలుసుకోవాలి. ధర్మార్థములే సర్వశాస్త్రములయందలి విషయములకు మూలములు అని కుమారిలభట్టు తన అభిప్రాయమును శోకవార్తికమునందు వివరించినాడు.

**12. వేదవాఙ్మయము పరిపూర్ణత :** "వేదో ఉ ఖిల ధర్మమూలమ్". ధర్మమును గురించిన జ్ఞానము పొందుటకు నమ్మదగిన ఆధారము వేదములే. నిత్య, సత్య, శబ్దరాశియైన వేదము రెండు భాగములుగా ఉన్నది. మంత్ర భాగమునకు సంహితలనీ, వాఖ్యాన రూపంగా కర్మాచరణమును విశదీకరించే భాగాన్ని బ్రాహ్మణములనీ పిలుస్తున్నారు. అయితే శబర భాష్యములో, వేదములలో ఉటంకించిన మంత్రములు, బ్రాహ్మణములు అన్నీ విశ్వసింప తగినవేనా ? లేక విశ్వసించుటకొరకై వాటిలోనుండి కొన్నిటిని మాత్రమే గ్రహించవలెనా? యనెడు సంశయము వెలిబుచ్చుట జరిగింది. ప్రశ్నకు జవాబు ఇచ్చేముందు మనము తెలుసుకొనవలసిన ఒక ముఖ్య విషయమున్నది. అదేమంటే మీమాంసకారులందరికీ, ఆస్తికవాదులైన ఇతర శాఖలవారికి కూడా మంత్రమంటే ఏమిటి? అనే అంశముపై ఏకాభిప్రాయము లేదు. అనంతరకాలములో ఆధ్యాత్మిక రచనలు చేసినవారు మంత్రమును యజ్ఞములయందు హవిస్సులు సమర్పించు ఒక కర్మగా నిర్వచించారు. ఈ నిర్వచనమును అందరూ ఆమోదించ లేదు. కారణమేమంటే యజ్ఞ యాగాది క్రతువులు ఆచరించునప్పుడు, యజ్ఞ కుండములయందు హవిస్సులు సమర్పించుటయేకాక ఇతర కర్మాచరణము కూడా అధికముగానే ఉంటుంది. అందువలన మీమాంస తార్కికుల మంత్రమనగా, యజ్ఞయా

గాది క్రతు నిర్వహణయందు వాటి స్వరూపమును మాత్రమే ప్రత్యేకంగా ఉచ్చరించే శబ్దములే మంత్రములని చెప్పారు. కర్మాచరణము లేకుండానూ, ఆచరణ నిర్వహణను ఆజ్ఞాపించ కుండానూ, కేవలమూ ప్రతిపాదనకు మాత్రమే మంత్రములు పరిమితమైన వని భావించవచ్చు. అట్టి స్తోత్రపరమైన భాగములనే సంహితలు లేక మంత్రములు అని పిలుస్తారు. ఈరకమైన నిర్వచనము ఉదాహరణకేగానీ అన్ని మంత్రములు ఒకే విధంగానే ఉంటాయని అనుకొనకూడదు. కొన్ని మంత్రములు ప్రతి పాదనలుగానే ఉండవు. ఈ విషయములో కుమారిలభట్టు తంత్రకార్తికములో చెప్పిన దేమంటే మంత్ర పదమునకు పైన తెలియజేసిన అర్థము కేవలము సంక్షిప్తత కొరకేకాక, వేద విద్యార్థుల లోనూ, ఆచార్యులలోనూ, ఇతర వేదవిదులు, ఆధ్యాత్మికుల చేతను ఎక్కువగా వాడుక లోనున్నది కాబట్టి ఆ పదము ఉపయోగించబడినదని చెప్పాడు. మంత్రములు నాలుగు విధములుగా విభజింపబడినవి. అవి ఋక్ సామ యజుస్సు అథర్వణ వేదములని పిలుస్తారు. వీటిలో మొదటి మూడు వేదములను కలిపి "త్రయి" అని పిలుస్తారు. మంత్ర భాగమును సంహితలని, క్రతు నిర్వహణ భాగమును బ్రాహ్మణములనీ, చెప్పి, ఈ రెంటి మధ్య నిర్దిష్టమైన విభజన చేశారు. శబర భాష్య ములో మంత్రములు, విధులు కావనీ, ప్రతిపాదనలు మాత్రమేననీ, యజ్ఞయాగాది క్రతువులనాచరించు సమయములో వాటి స్వరూపములను ప్రతిపాదించి, స్వరూపములను స్మరించి స్తోత్రించి, కీర్తించుచూ, యాజ్ఞికులు ఉచ్చరించే శబ్దములే మంత్రము లనీ, జైమిని న్యాయ సూత్రము (2.1.7) ఆధారముగా చేసుకొని వాఖ్యానించటం జరిగింది. అదే భాష్యంలో "అశిర" మొదలైన పరమూడు విధములైన మంత్రములు శబరస్వామిచే పేర్కొనబడినవి.

కుమారిలభట్టు ఈ విషయంలో వ్యతిరేకించాడు. మంత్రములు బ్రాహ్మణములు రెండూ సమానమైన ఆదేశవిధులేనన్నాడు. ఆదేశవిధి రహితమైన మంత్రము, మంత్రమే కాదనీ, ఆ విధంగా నిరూపించలేమని స్పష్టంగా చెప్పాడు. ఆయన వాదన ఏమంటే బ్రాహ్మణములలో ఒక క్రియాపదము కామ్య, కర్మ విధిని ఆదేశించినప్పుడు, అదే పదము మంత్ర భాగమునందు ఆదేశించు విధి ఎందుకు కాదని ? ప్రశ్న.

**తంత్రవార్తిక :**

**1. స్మృతులు, సంప్రదాయములు ధర్మజ్ఞాన సంపాదనకు గల ఇతర ఆధారములు :**

జైమిని సూత్ర రచనాకాలమునకు, వేదములు ప్రాచీనములై విధి నిర్వహణకు

కావలసిన సంపూర్ణ జ్ఞానమును ప్రసాదించగల స్థితియందు లేనట్లుగా తోచుచు చున్నది. అప్పటివరకూ వేదములను, కర్మ నిర్దేష్టలుగానూ, కర్తవ్యధర్మమును, నాచరిం చుటలో ఏది చేయవచ్చును ఏది చేయరాదు అను విచక్షణా జ్ఞానమునందించు ఒకే ఆధారముగా పరిగణింపబడుచుండెడివి. ఎప్పుడైతే అవి పైన తెలిపిన సందర్భ మునకు ఉచితమగు జ్ఞానమును సంపూర్తిగా వొనగూర్చలేకపోయినవో మానవ జీవనసరళిని, నిబద్ధీక రించుటకు కావలసిన పరిజ్ఞానమును ప్రత్యామ్నాయముల ద్వారా గ్రహించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. మనువు, యాజ్ఞ్యవల్క్యుడు, పరాశరుడు వంటి ఋషి పుంగవులు “స్మృతులు” అనే పేరుతో వేదములకు అను బంధములుగా రచించి, తమ పేర్లను గుర్తింపు కొరకై స్మృతి అనే పదమునకు ముందుగా ఏర్పాటు చేసుకున్నారు. అందువల్ల స్మృతికర్త ఎవరు అనే విషయం సులభంగా అర్థమవుతుంది. ఉదాహరణకు మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి వగైరా. ఆవిధముగా రచించపడిన మొత్తం స్మృతులు పదునెనిమిది. ఇతిహాసములు, పురాణములు, శ్రౌత, ధర్మ గృహ్యా సూత్రముల (కల్పసూత్రములు)తో సమానముగా ఈ స్మృతులు కూడా జ్ఞానమునకు మూలాధారములుగా పరిగణింపబడుచున్నవి. అయితే కుమారిలభట్టు అట్టి పరిగణను వ్యతిరేకించాడు. అందుకు చూపిన కారణమేమంటే ఇతిహాసములు, పురాణములు, స్మృతులవంటివి, బ్రాహ్మణముల యందలి కొన్ని భాగములకే పరిమితమగుటయే కాక, దేశమునందలి కొన్ని ప్రాంతముల లోనే అనుసరించబడుచున్నవి. అందువల్ల వాటికి విశ్వజనీనత కానీ, ఒకే విధమైన అన్వయముకానీ లేవు. తంత్రవార్తికయందు కుమారిలభట్టు వేదాంగములైన శిక్ష, వ్యాకరణము, ఛంధస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పముఅని పిలవబడే ఆరు శాస్త్రములకు కూడా స్మృతులతో సమానమైన ప్రతిపత్తి కలవని నిర్ధారించాడు. అవన్నీ వేదములనుండే ప్రామాణ్యతను పొందగలిగినవవుట చేత, భిన్నత్వము నాపాదించరాదు అన్నాడు. స్మృతుల యొక్క అధికారమును, ప్రామాణ్యతను, కొన్ని నిబంధనలకు జత కల్పి ఆమోదించాడు. ఏయే సందర్భములలో స్మృతులు, శ్రుతులలో నిర్దేశించబడిన కర్మాచరణమును విభేదించినవో ఆ విషయ ములయందు శ్రుతులనే ప్రమాణముగా గ్రహించి ఆచరించవలెనని చెప్పాడు. కుమారిల భట్టు, తంత్ర వార్తిక ప్రారంభములో ఒక ముఖ్య విషయమును గూడా తెలియజేశాడు. గుణవంతులు, పెద్దలు ఆచరించునదంతా ధర్మమని అనుసరించ రాదు. తన అభిప్రాయమును సమర్థించుకుంటూ ఇతిహాసములనుండి పురాణముల

నుండి కొన్ని ఉదాహరణలనిస్తూ మాన్యులైనవారు వైదిక నియమావళి ఉల్లంఘిస్తూ పాపములుగా పరిగణింపతగిన కర్మలను ఏ విధంగా నాచరించారో, వివరంగా తెలియజేశాడు. ఈ విషయముపై తంత్రవార్తికమందు కుమారిలభట్టు అతికుతూహల మును కలిగించే విధంగా విశదీకరించాడు. మాన్యులుగా పరిగణింపబడువారు ధర్మ విరుద్ధంగా అత్యంత సాహసోపేతంగా, ఆచరించిన పాపకార్యములు అనేకము ఉన్నవని చెప్పుచూ ప్రజాపతి ఇంద్రుడు, వసిష్ఠుడు విశ్వామిత్రుడు యధిష్ఠురుడు. కృష్ణద్వైపాయనుడు (వేదవ్యాసుడు) భీష్ముడు, ధృతరాష్ట్రుడు వాసుదేవుడు అర్జునుడు వంటి అనేకమంది మహానుభావులను పేర్కొనినాడు. గతంలోనేకాక, సమకాలీన సమాజములో కూడా ఇటువంటి వ్యక్తులున్నారని గట్టిగా చెప్పాడు. ఆయా వ్యక్తులు ఆచరించిన కార్యములను వివరముగా వర్ణించి, ఏ పరిస్థితులలోనూ వారాచరించిన కార్యములు ధర్మబద్ధములు కావని తేల్చి చెప్పాడు. అవి అనుసరణీయములు కానేకావ న్నాడు. ఎవరి నడవడి బాగుంటుందో వారిని గుణవంతులనీ, మంచివారనీ, పెద్దలనీ గౌరవిస్తాము; వారి నడత మంచిదని శ్లాఘిస్తాము. ఆ విధముగా వారి నడత, మంచి తనము పరస్పరాధీనముగా వుంటుంది. తద్వారా మనకు వొరిగేదేమీ వుండదు. కుమారిలభట్టు, మనువుచెప్పిన మంచి వారి ఆచరణలు కూడా ధర్మమునకు ప్రమాణములేనన్న సూక్తిని వ్యతిరేకించాడు.

**ధర్మాచరణములు :** ఇవి మూడు భాగములుగా విభజింపబడినవి. అవి ప్రాథమిక అప్రాధాన (Secondary) లేక గౌణము, ఉపకర్మలు, వీటియందు వైవిధ్యమున్న వైవిధ్యము లేని కర్మలేవి అని తెలుసుకోవాలి. కుమారిలుడు అందుకుగాను, ఒక సూచన చేశాడు. రెండు కర్మలను రెండు పేర్లతో పిలిస్తే అవి వైవిద్యకర్మలుగానూ, లేకపోతే ఒకే కర్మగానూ పరిగణించాలన్నాడు. అపూర్వ (ఇంతకుముందు లేనిది)ను గానీ, అదృష్టమునుగానీ ఇచ్చేటటువంటి వైదిక కర్మలను, పైన వివరించిన మూడు విభాగములుగా వర్గీకరించాలి. ప్రాథమిక కర్మ లేక ప్రధాన కర్మ నేరుగా అపూర్వను ప్రాప్తిస్తుంది, మిగిలిన రెండు వర్గములకు చెందిన కర్మలను గుణకర్మలని పిలుస్తారు. ఇవి ప్రధాన కర్మకు, అంగములుగా వ్యవహరిస్తే ఉదాహరణకు దర్శనపూర్ణమాసమనే క్రతువులో ఆహుతులకు బియ్యపు రొట్టెను తయారుచేయటానికి వడ్లు దంచి, ఊకను, చిట్టును తొలగించి బియ్యమును శుభ్రంచేస్తారు. అంతమాత్రముచేత అపూర్వ

లభించదు. ఆ రొట్టెను ఆహుతిగా ప్రధాన కర్మయందు యజ్ఞకుండమున పవిత్రాగ్నికి సమర్పించినప్పుడు మాత్రమే అపూర్వ లభ్యమవుతుంది. ఈ విధములైన కర్మలనన్నిటినీ వైదిక శాఖల సాంప్రదాయములను బట్టి విభజన, పునర్విభజనలు కావించారు. పురుషార్థకర్మలనీ, క్రత్వార్థ కర్మలనీ వాటిని పునర్విభజన చేసి, ప్రధాన కర్మలనీ, గుణకర్మలనీ, వ్యవహరిస్తారు. మరొక విభజన ప్రకారం అంగి, అంగ కర్మలన్నారు. ఇంకొక ఆసక్తికరమైన విభజన ప్రకారం, నాలుగు విధములైన కర్మలను తెల్పినారు. అవి నిత్యకర్మ, నైమిత్తిక కర్మ, కామ్యకర్మ, నిషిద్ధకర్మలంటారు. స్నానసంధ్యా వందనముల వంటివి నిత్యకర్మములు. పూర్ణిమ అమావాస్య ఇతర పర్వదినములలో ఆచరించే కర్మలు నైమిత్తిక కర్మలు. ఏదో కోరికను సాధించుటకుగాను నిర్వహించునవి కామ్య కర్మలు. వేదములయందు, ఇతర శాస్త్రముల యందు నిషేధింపబడిన కర్మలే నిషిద్ధ కర్మలు. ఇవి చేస్తే పాపం వస్తుంది. చేయకపోతే పుణ్యము రాదు.

మానవుడు చేయు కర్మలఫలితము నాశ్రయించి అదృష్టంకానీ, అపూర్వంగానీ లభిస్తుంది. ఇది నాలుగు విధములుగా ఉంటుంది.

1. ఫలాపూర్వం (ఫలా అదృష్టం)
2. సముదాయాపూర్వం (సముదాయదృష్టం)
3. ఉత్పత్త్యాపూర్వం (ఉత్పత్తి అదృష్టం)
4. అంగాపూర్వం (అంగ అదృష్టం)

మానవుని అదృష్టమునకు, దురదృష్టమునకూ కారణము అతడు ఆచరించేటటు వంటి సుకృత-దుష్కృతకర్మలేననీ, వాటిని అనుసరించే ఫలితములు ఉంటవనీ, మీమాంసా దర్శనం దృఢంగా తెలియచేస్తుంది.

**వైదిక కర్మలను స్త్రీలు, శూద్రులు ఆచరించవచ్చునా ?**

ఈ అంశము కుమారిలభట్టు జీవితకాలములోవలెనే, ఈనాడు వివాదాస్పదముగానే ఉన్నది. యజ్ఞకర్త ప్రక్కనే ఆతని భార్య యజ్ఞ నిర్వహణ సమయంలో తప్పక ఉండి తీరాలి. ఆమె భర్తకు సహాయము చేయటంతోపాటు, తనంతట తానుగా కొన్ని క్రియలు ఆచరించ వలసి ఉంటుంది. బ్రాహ్మణములలో ఈ విషయములు నిర్దిష్టంగా చెప్పబడినవి. ఏ సూత్రములలోనూ, స్త్రీ, వేదాధ్యయనము చేయగూడదని,

వైదిక కర్మల నాచరించ కూడదనే నిషేధములు లేవు. అయితే స్త్రీ పురుషుల మధ్య పై విషయములను గురించి, కొన్ని వ్యత్యాసములను కల్పించినారు. ఇందుకు కారణము, ఆరోజులలో స్త్రీలు సాధారణంగా విద్యావంతులుకారు. వైదిక కర్మలను చేపట్టే పురుషులందరూ విద్యాధికులుగానే ఉండేవారు. జ్ఞానసంపన్నులు. ఆ కారణంగా స్త్రీలు వేదమంత్రోచ్చారణ స్వరయుక్తంగా శ్రుతి యుక్తంగా పఠించటం కష్టసాధ్యమైన అంశముగా భావించి, వారిని వైదిక కర్మాచరణముకు దూరంగా ఉంచటం జరిగింది.

శూద్రులకు వైదిక కర్మాచరణము నిషిద్ధమే కాని వారికి కొన్ని ప్రత్యేక కర్మలు నిర్దేశింపబడినాయి. రధకారులు (రథములు మొదలైన వస్తువులు చేయువారు) నిషాదులు (గిరిజనులు) వాటిని ఆచరించవచ్చును. ఏ జాతికి, ఏ కులమునకు చెందినవారైనా సరే. ధనహీనులు, శారీరక, మానసిక లోపములు కలవారు, వైదిక కర్మాచరణమునకు అనర్హులు. తన గోత్రమును, ప్రవర (ఋషి సాంప్రదాయము)ను చెప్పలేని వ్యక్తి బ్రాహ్మణుడైనా అనర్హుడే. క్రతునిర్వహణ సమయమందు ఏ దేవత నుద్దేశించి మంత్ర పఠనము జరుగుతున్నదో, వాటి క్రియానుసంధానము సక్రమము గాలేకపోయినా. లోపభూయిష్టమైనా ఆ ఆచరించు కార్యము వ్యర్థమై పునఃప్రారంభము చేయవలసి ఉంటుంది. దానములు, దక్షణలు బ్రాహ్మణులకు ఎలా ఇవ్వవలెనో, క్రతువులు నిర్వహించిన యాజ్ఞికులకు జరుపవలసిన సన్మానములు ఏ విధమైనవిగా ఉండవలెనో, తెలియ జేయుటయేకాక ఆ కార్యక్రమములన్నిటినీ, క్రతువు పూర్తియైన వెంటనే నిర్వహించవలెనని శాసించుటకూడా జరిగింది. వేదవాఙ్మయమునందు ఉపయోగించిన సాంకేతిక పదజాలమునకు వివరణ ఇవ్వడంతోపాటు, స్వరబద్ధంగా ఉచ్చరించే పద్ధతి కూడ విశదీకరించబడింది. ఉదాహరణకు, విశ్వజిత్ యాగములో యజ్ఞకర్త తన స్థిర, చరాస్తులు, ఇతర సంపదలనూ, తన సర్వస్వమునూ దానము చేయవలసి ఉంటుంది. కానీ, సర్వస్వము అనే పదమును అతని తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, ఇతర రక్తసంబంధీకులైన బంధువులు అన్నదమ్ములు, చెల్లెళ్ళు, సేవకులను మినహాయించి భూములు, తోటలు, భవనములు, కొయ్య సామానులు, ధనమూ, బంగారము, నగలు, ఆవులు వంటి వాటినే దానము చేయవలెనని వాఖ్యా నించారు. అదే విధంగా వేదము అపారమైన ధనమును దానము చేయవలెనంటే, అధికముగా ధనమును దానము చేయవలెననీ, ఆ ధనము సుమారుగా ఒక వేయి

బంగారు నాణెలములకు మించి ఉండవలెననీ యజ్ఞ కర్త సిరిసంపదలనాధారముగా నిర్ణయించవలెనని అర్థం చేసుకోవాలన్నారు. ఒక క్రతువును వేయి సంవత్సరములు నిర్వహించవలెనని వేదము చెబితే దానిని వేయిరోజులని తెలుసుకోవాలి. ఎందుకంటే, వేయి సంవత్సరములు ఏ మానవుడూ జీవించలేడు కదా ! ఇంతేకాక సకల దైవ కార్యములు ఉత్తరాయణ పుణ్యకాలమునందు (జనవరి 14 నుండి జూలై 15 వ తేదీ ప్రాంతము) శుక్లపక్షమునందు నిర్వహించవలెననీ, పితృదేవతలకు అపరకర్మలు, దక్షణాయమునందు (జూలై 15వ తేదీ ప్రాంతమునుండి జనవరి 14వ తేదీ వరకు) బహుళ లేక కృష్ణపక్షము నందు ఆచరించవలెనని చెప్పారు. సాధారణంగా క్రతువులయందు గొఱ్ఱెను బలిచేస్తారు (యజ్ఞపశువు).

మీమాంసయందలి విషయము సాధారణముగా ధర్మమును గురించి తెలియ జేయటమే. అంటే వ్యక్తి తన జీవితకాలమునందు ఆచరించవలసిన విధులు, కర్మలను గురించి సమగ్రంగా తెలియజేయుటయే. కానీ ఈ పదమును వివిధార్థములలో కూడా ఉపయోగించటం జరుగుతున్నది. యోగము, హోమము వంటి వాటికి కూడా పై పదమును అనువర్తింపచేస్తున్నారు. ఉదాహరణకు శాంతి హోమము, దానము, స్నానము ధ్యానము, జపము తపము అనే క్రియలు కూడా ధర్మములేనని పేర్లు పెడ్తున్నారు అయితే మీమాంసాదర్శనపరంగా విశ్లేషిస్తే ఈ పదము యోగ, దాన, హోమాదులకు మాత్రమే వర్తిస్తుంది.

మీమాంసకారులు యజ్ఞ యాగాది క్రతువులను ఏ దేవతనుద్దేశించి నిర్వహించ దలచుకున్నారో, ఆ దేవత కేవలము ఊహాజనితుడు, నిమిత్తమాత్రుడే. ఆ దేవతకు సంబంధించిన మంత్రములు చదివి, ఆహుతులు సమర్పించిన తరువాతనే దేవతకు వాస్తవికత, శక్తి లభిస్తాయి. ఆ విధంగా దేవత మంత్రమునకు లోబడి, ఆహుతులకు కట్టుబడి, తన అస్థిత్వమును నిలుపుకొంటుందేకానీ, స్వతంత్రమైన ఉనికి ఉండదు. ముందు వివరించినట్లు "మంత్రాధీనం దైవతమ్" దేవుని గానీ, దేవతను గానీ, కేవలము స్తోత్రించుటవలన, ఆహ్వానించుటవలన ఆ క్రతువుపూర్తికాదు. మంత్ర పఠనము, హవిస్సుల సమర్పణానంతరమే, ఆ క్రతువు పరిపూర్ణమై ఆహ్వానితుడైన దేవత శక్తివంతమై ఇష్ట కామ్యసిద్ధి అనుగ్రహిస్తుంది. యజ్ఞకర్త వాంఛలను బట్టి, సమర్పించు ఆహుతులను బట్టి, క్రతువులను మూడు విధములుగా విభజించారు. అవి

**1. ఇష్టి :** తాను వాంఛించిన కార్య సాధనకై చేసేటటువంటి క్రతువు. పుత్రకామేష్టి హవిర్యజ్ఞము ఇష్టులనబడుతున్నవి.

**2. పాకయజ్ఞములు :** సంవత్సరకాలమునందు ఒక ప్రత్యేక దినమునగానీ, పక్షమున గానీ, మాసమందుగానీ నిర్వహించబడు కర్మలు పాక యజ్ఞములు లేక పంచ మహాయజ్ఞములు పాకయాగములు అని కూడా పిలుస్తారు. అవి దేవయజ్ఞము (దేవతల తృప్తికొరకు అగ్నియందు హవిస్సులతో హోమము చేయుట 2. పితృయజ్ఞము (పితృదేవతల తృప్తికొరకై స్వధాకారయుతముగా తర్పణాదులు నిర్వహించి బ్రాహ్మ ణులకు భోజనము పెట్టుట) 3. భూతయజ్ఞము (బహిర్దేశమున భూతతృప్తికై అన్నము మొదలగు వానిని బలియిచ్చుట. కాకి పిండమువంటిది) 4. మనుష్యయజ్ఞము (శక్తికొలది బ్రాహ్మణులకు అతిథులకు అభ్యాగతులకు భోజనము పెట్టుట) 5. బ్రహ్మయజ్ఞము (ఓఙుక్కునుగానీ, ఒక యజుర్వేద మంత్రమును గానీ ఒక సామవేద మంత్రమునుగానీ ప్రతినిత్యమూ అభ్యసించుట) శ్రాద్ధ కర్మలు కూడా ఈ జాతికి చెందినవే.

**3. సోమయాగములు :** అగ్నిస్తోమము, వాజపేయము వంటి విశ్వకల్యాణమునకు సోమరసమును ఆహుతులుగా సమర్పిస్తూ చేయు క్రతువులు. తంత్రవార్తికమందు కుమారిల భట్టు భారతీయేతర భాషలనుండి అనేక పదములను ఉపయోగించాడు. అందువలన కుమారిలుడు ఉత్తర, దక్షిణభారతములో మాట్లాడే భాషలేకాక, దేశాంత రములందు మాట్లాడు భాషలయందు కూడా విద్వత్తు కలిగియున్నాడని స్పష్టమౌ తున్నది. ఒక ముఖ్య విషయమేమంటే "ఆంధ్ర" అనుపదమును వాడరాదనీ "ద్రవిడ" అనే పదమునే వాడవలెననీ నిర్దేశించాడు.

తనకు పూర్వకాలమందున్న బోధాయనుడు, ఆపస్తంబుడు వంటి సూత్రకారులు తెలియజేసిన విధంగానే, కుమారిలభట్టు కూడా ఉత్తర, దక్షిణ భారతదేశములలో నివసించు బ్రాహ్మణుల వివరములు, శాఖలు, అలవాట్లు, సాంప్రదాయములు, సామాజిక కట్టుబాట్ల వంటి అనేక విషయములను తెలియజేశాడు. అదేవిధంగా, వారు అనుసరించు చెడుఅలవాట్లను కూడా ఎత్తిచూపాడు. ఉదాహరణగా బంధువులు స్నేహితులు ఇతర అతిథి అభ్యాగతులు భుజించగా మిగిలిన పదార్థములను గృహయజమాని, కుటుంబ సభ్యులు భుజించటం, భోజనానంతరం నోటిని సరిగా

పరిశుభ్రం చేసుకోకపోవటం, అన్ని కులముల వారూ ముట్టుకొనిన తమలపాకులు, వక్కలను తాంబూలముగా సేవించటం, చాకలి గాడిద మూపుపై తెచ్చిన వస్త్రములను ధరించటం, చెడ్డవ్యక్తులు పాపుల మధ్య మసలటం వంటి అనేక కార్యములను తెలియజేశాడు.

**తుపిట్టీక :**

శబరభాష్యముపై కుమారిలభట్టు వ్రాసిన వాఖ్యయందు ఇది చివరి భాగము. ముందు వివరించిన గ్రంథములతో పోలిస్తే, ఇది చిన్నది. దీనిని "లఘున్యాయసుధ" అనికూడా పిలుస్తారు. దర్శనపరంగా విచారిస్తే "తుపిటీక" అంత ముఖ్యమైనది కాదు, అయినప్పటికినీ, అనేకమంది విద్వాంసులు, తత్త్వవేత్తలు, వాఖ్యానములు వ్రాయ టానికి ప్రేరణ కల్పించింది.

కుమారిలభట్టు తన రచనలను సులభశైలిలో రచించాడు. తమ ప్రత్యర్థుల వాదనలను ఖండిచేటప్పుడు ఉపయోగించు తర్కము, ఎంతో నచ్చచెప్పేదిగా ఉంటుంది. ప్రత్యర్థులు కాదనటానికి అవకాశములేనట్లుగా ఉంటుంది. ఆయన భావనాపటిమ సహజమై, వైదికవాఙ్మయము కర్మకాండలను అన్వయించు విధానము అత్యంత ప్రశంస నీయముగా ఉంటుంది. క్లిష్టమైన అనేక విషయములు సులభ గ్రాహ్యములు అగుటకుగాను, కుమారిలభట్టు, నూతన ప్రక్రియలను చేపట్టి, అభ్యం తరకరమైన వాఖ్యలను, తప్పుగా అన్వయించిన బౌద్ధుల వాదనలు ఖండించి విజ యము సాధించినాడు. సనాతన ధర్మమునకు కుమారిలభట్టు చేసిన సేవ విశిష్టము, చిరస్మరణీయము. రాజస్థాన్‌లోని అప్పటి ఆల్వారురాజ్యములో లభించిన ఒక వ్రాత ప్రతిని బట్టి, కుమారిలభట్టు "శ్లోక వార్తిక" రచనను పూర్తిచేయకుండానే దివంగతు డైనట్లూ భోన్‌స్లే వంశమునకు చెందిన ఛత్రపతి శివాజీ మహారాజు (ఛత్రపతి శివాజీ మనుమడు) విశ్వేశ్వరుడనే నామాంతరము గల గంగాభట్టు (భట్టినారాయణుని మునిమనుమడు) చేత ఆ గ్రంథమును పూర్తి చేయించినట్లు. దానికి "శివార్కో దయము" అని నామకరణము చేసినట్లు తెలుస్తున్నది. శ్లోకవార్తి కముపై మొదటి వాఖ్యానమును రచించినది ఉంబేకభట్టు అని తెలుస్తుంది. ఆ భాష్యమునకు 'తల పర్యటీక" అని పేరు. ఈ గ్రంథము కూడ అసంపూర్ణముగా వదలి వేయటం వల్ల

కుమారిలభట్టు పుత్రుడైన జయమంగళుడు దానిని పూర్తిచేసినట్లు చెబుతారు. కుమారిలభట్టునకు అనేకమంది శిష్యులు, అనుయాయులు ఉన్నప్పటికీ, భట్ట సాంప్ర దాయము పాటించేవారు అనేకులు ఉన్నప్పటికీ, ఆయన రచనలపై బహుకొద్దిమంది మాత్రమే వాఖ్యలు రచించుట జరిగింది. ఒకవేళ ఎక్కువగా రచింపబడి వుంటే, చాలా గ్రంథములు ఖిలమైపోయి వుండవచ్చు.

మీమాంస దర్శనమున, భట్టు సాంప్రదాయమును నెలకొల్పి, మోక్షభావనను అందు ప్రవేశపెట్టుటయేకాక, కుమారిలభట్టు చేపట్టిన మరొక ముఖ్యప్రక్రియ పంచా యతారాధన. ఆనాడు హిందూమతము నందు స్థిరమైన, స్థానమును పొందిన, ఐదుగురు దేవతలను, ప్రధానముగా పరిగణించి, పూజించే విధానము ఆచరణీయమై ఉండేది. ఆ అయిదు గురుదేవతలు శివుడు (శైవము) విష్ణువు (వైష్ణవము) అంబిక (శాక్తేయము) సూర్యుడు) (సౌరము), గణపతి (గాణాపత్యము). ఒక్కొక్కశాఖకు చెందినవారు. ఒక్కొక్క దేవుని ఆరాధించటమే కాక, ఎవరికి వారు తమ దేవుడే గొప్పంటే తమ దేవుడే గొప్పని పెద్ద ఎత్తున వివాదములు పెంచుకొని, ప్రత్యర్థులను హింసించుటకు కూడా వెనుదీసేవారు కాదు. ఆ విధమైన మతమౌఢ్యము నెలకొన్న రోజులలో మీమాంస దర్శన సిద్ధాంతములకు వ్యతిరేకమైనప్పటికినీ, కుమారిలభట్టు. స్వతంత్రించి పంచాయతన పూజా విధానమును, పూర్వ మీమాంసలో ప్రవేశపెట్టాడు. సిద్ధాంతములకంటే ఆనాటి ప్రజాబాహుళ్యముయొక్క మనోభావములకు అను గుణంగా, వారి మానసిక, ఆధ్యాత్మిక సంతృప్తికై ఈ విధానమును ప్రవేశపెట్టటం జరిగింది. ఈ విధానముద్వారా అద్వైత లేక స్మార్త సాంప్రదాయములతోనూ, సనాతన మరియు అధునాతన సాంప్రదాయములైన కర్మ, భక్తి మార్గముల మధ్యనూ సమ న్వయీకరణము జరిగింది. తద్వారా కుమారిలభట్టు మోక్షమార్గములైన కర్మ, జ్ఞాన, భక్తి విధానముల మధ్య సయోధ్యతను, సహజీవనమునకు బాటవేశాడు. ఈ పంచా యతన ఆరాధనా విధానము ప్రవేశపెట్టడంవల్ల అన్ని సంప్రదాయములకు చెందిన వారికి సంతృప్తి కలుగటంతో పాటు, వారి మధ్య వైషమ్యములు సమసిపోయినవి.

శ్లోక వార్తికములోని పరిచయ భాగము (10వ శ్లోకము) నందు 'కుమారిలభట్టు' ప్రజాబాహుళ్యమునందు పూర్వమీమాంస ఆమోదయోగ్యముకానిదిగానూ,

సనాతనత్వమునకు వ్యతిరేకిగానూ, భౌతికవాదముగానూ, పరిగణింపబడు తున్నం దువల్ల, ఈ సిద్ధాంతము సనాతన ధర్మములోని భాగమేనని నచ్చచెప్పే ప్రయత్నము చేశానని వ్రాశాడు. అయితే ఆధునికయుగంలో పూర్వమీమాంస కాలము చెల్లి పోయిన, మూఢాచారముగా, ఆచరణయోగ్యము ఆమోదయోగ్యముకాని సిద్ధాంత ముగా పాశ్చాత్య భావములను జీర్ణించుకున్న భారతీయులచే పరిగణింపబడుతున్నది. చదువుకున్నవారిలో కూడా చాలామందికి దర్శనసాహిత్యముపై అవగాహనా లోపము వల్ల, పూర్వ మీమాంసపట్ల అనాదరణ ఏర్పడింది. ఈనాడు భారతీయ తత్త్వశాస్త్ర మంటే వేదాంతమేననీ మరొకటి లేదని వారిభావన. ఈ రెండు ప్రత్యామ్నాయ పదములుగా మారినవి. ఇందువలన ఇతర తత్త్వశాస్త్రములన్నీ మరుగున పడుతున్నవి. పూర్వ మీమాంస నిరాదరణకు అతిముఖ్యమైన మరో కారణము వేదములు, బ్రాహ్మణ ములయందు నిర్దేశించినట్లు అత్యధిక శ్రమ, కాలము, ధనమును వెచ్చించి, ఈ కాలములో కర్మ కాండలను నిర్వహించుట సాధ్యంకాకపోవుట, వేగము, సంక్షిప్తతతో, పనులు జరుపుట, ఈ అధునాతన యుగంలో పరిపాటైంది. ఈ కారణములవల్ల పూర్వ మీమాంసానుసరణము కష్టసాధ్య మైనది.

విధి నిర్వహణము, లేక ధర్మాచరణమనేవి ఈ అధునాతన యుగంలో తిరోధాన ప్రక్రియగా భావింపబడుతున్నది. యథార్థానికి పూర్వ మీమాంస సిద్ధాంతము ఊహా జనిత మైనదికాదు. ప్రపంచములోని ప్రతి వ్యక్తీ తన విధిని తాను నిర్వర్తించి ఆ కర్మఫలమును అనుభవించి తీరవలెనని ఘంటాపథంగా ప్రబోధిస్తున్నది. అగోచరమైన ఏదో శక్తిపై ఆధారపడకుండా, సహాయము ఆశించకుండా, ప్రతివ్యక్తి తన కాళ్ళపై తాను నిలబడి తన పనిని తాను చేసుకొని, అందువల్ల లభించిన మంచి, చెడు ఫలితములను అనుభవించి తీరవలెననే సందేశమును పూర్వ మీమాంస స్పష్టంగా తెలియజేస్తున్నది. ఈ విధమైన సందేశము, దేశకాలాతీత మైనది, కాబట్టి మానవాళి తప్పక పాటించవలసినదే. శ్రమను "ఒక ఆరాధనగా" భావించవలెనని ఆచరించ వలెనని చెప్పెడి ఉత్కృష్ట సిద్ధాంతమే పూర్వ మీమాంస.

ఈ సందర్భములో డాక్టరు కోల్ బ్రూక్ చేసిన వ్యాఖ్యానముతో ఈ వ్యాసము ముగింపు జరుగుతుంది. మీమాంస తర్కములో ఇమిడియున్నదే న్యాయశాస్త్రము.

ప్రతి అంశము విశ్లేషింపబడి, సాధారణమైన సిద్ధాంతములను అనుసరించి, నిర్ణయిం చబడుతుంది. ఒకే క్రమపద్ధతిలో పొందికగా అమర్చబడినదే న్యాయ సిద్ధాంతము. అదే సత్యము. అటువంటి సత్యశోధన, సత్యస్థాపనకై ప్రయత్నించిన తత్త్వమే, పూర్వ మీమాంస. ఇందుకుగాను తెలుగువాడైన కుమారిలభట్టు చేసిన కృషి చిరస్మర ణీయము. సర్వదా వందనీయము.

■ ■ ■

# నింబార్కుడు

భక్తి వేదాంతమున విశిష్టాద్వైత శాఖ స్థాపకుడైన శ్రీమద్రామానుజులవారి, అనంతరము జన్మించిన ఆచార్యులలో ప్రథముడు నింబార్కాచార్యులవారు. ప్రొఫెసర్ భండార్కర్ తెలియజేసిన విషయమునుబట్టి నింబార్కుడు క్రీ.శ.1162లో దివంగతులైనారు. అంటే శ్రీరామానుజుల తరువాత 25 సంవత్సరములకు పరమపదము పొందినారు. నింబార్కుడు భాగవతపురాణశాఖకు చెందినవారు అయినప్పటికినీ శ్రీరామానుజులను విశిష్టాద్వైత ప్రవచన విషయములపై విమర్శించాడు. బహుశా 12వ శతాబ్దము పూర్వభాగంలో జన్మించి, ఆ శతాబ్దపు చివరి భాగమువరకూ జీవించినట్లు అంచనా. ద్వైతశాఖ స్థాపకులైన మధ్వాచార్యులవారు నింబార్కుని అనంతరము జీవించినారు.

నింబార్కుడు తెలుగు దంపతులైన శ్రీ జగన్నాధము శ్రీమతి సరస్వతులకు జన్మించినాడు. ఆయన స్వగ్రామమైన నింబాపూర్‌ను అనుసరించి ఆయనకు నింబార్కుడు అని నామకరణం చేశారట. ప్రస్తుతము ఆ గ్రామము నాయుడుపట్టణం అనే పేరుతో కర్నాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో ఉంది. అయితే ఆయన పేరుకు సంబంధించిన మరొక గాధ కూడా ప్రచారంలో ఉన్నది. ఆ గాధనుబట్టి ఆయన అసలు పేరు నియమానంద అనీ గృహస్థ ధర్మమునసరించి ఆయన ఒకరోజు ఒక యతిని తన ఇంట ఆతిథ్యము స్వీకరించమని కోరగా ఆ యతి అంగీకరించి, స్నానార్థమై దగ్గరలో నున్న నదికి వెళ్ళి ఎంతకాలమునకు తిరిగిరాకపోవటం వల్ల

నియమానందుడు ఎంతో ఆందోళనకు గురియైనాడట. సూర్యాస్తమయమైన తరువాత యతులు భిక్షను స్వీకరించరాదని నియమము. ఆ కారణంగా తాను సకాలములో యతికి భిక్షనీయలేననే భయమేర్పడి, పాపఫలము సంక్రమిస్తుందనీ, కాపాడమని విష్ణువును ప్రార్థించాడట. విష్ణువు ఆయన మొరనాలకించి, తన సుదర్శన చక్రమును సూర్యునికి భూమికి మధ్యన ఉంచినాడట. అందువల్ల సూర్యునివలే ప్రకాశిస్తున్న సుదర్శన చక్రకాంతులు, క్రింద ఉన్న ఒక నింబవృక్షము (వేపచెట్టు) పై ప్రతిఫలించినవట. స్నానానంతరము తిరిగి వచ్చిన యతి సూర్యాస్థమయం కాలేదను భ్రమకులోనై నియమానందుని భిక్షను స్వీకరించాడట. అనంతరము తాను దర్శించినది యథార్థము కాదని ఒక దివ్యాద్భుతమని గ్రహించి, నియమానందుని భక్తి శ్రద్ధలను ప్రశంసించి ఆయనకు నింబార్కుడని పేరు పెట్టినాడట. అంటే నింబవృక్షముపైనున్న సూర్యుడు అని.

నింబార్కుడు గొప్ప శ్రీకృష్ణ భక్తుడు.ఆయన తన జీవితకాలంలో ఎక్కువ భాగము, మధుర బృందావనములలో గడిపినాడట. ఆ కారణంగా ఆయనవ్యక్తిగత జీవిత వివరములు ఎక్కువగా తెలియవు.

పూర్వకాలంలో చాలామంది తత్త్వవేత్తలవలెనే నింబార్కుడు కూడా తన తాత్త్విక సిద్ధాంతములకు బ్రహ్మసూత్రములను, భాగవత పురాణములనే ఆధారముగా తీసుకున్నాడు. ఆ గ్రంథములపై నింబార్కునికి పూర్వమున్న వ్యాఖ్యలు సుదీర్ఘములు, దుర్గ్రాహ్యములుగా ఉండేవి. అందువలన వాటిని సంక్షిప్తము, సులభగ్రాహ్యము, సరళముగా చేయవలెననెడి తలంపుతో నింబార్కుడు కొనసాగుతున్న భాష్యరచనా విధానమును మార్చివేశాడు. ఆనాటి భాష్య రచనా పద్ధతి ప్రకారం ముందుగా ఎదుటి వారి వాదనను పూర్వపక్షము చేయటం (కాదనటం) అనంతరము తమ వాదనను ప్రతిపాదించి, దానిని శాస్త్ర విషయములను ఉటంకించి సమర్థించుకొనటం జరిగేది. ఇందుకు భిన్నమైన ఆయన రచన "వేదాంతపారుజాత సౌరభమే" ఒక చక్కని ఉదాహరణ. బ్రహ్మసూత్రములపై వ్రాసిన భాష్యమే ఆ గ్రంథము. ఆయన వ్రాసిన మరొక సరళ భాష్య గ్రంథము "దశశ్లోకి". కేవలము పదిశ్లోకములలో, సులభంగా అర్థమయేటట్లుగా, ఆయన తాత్త్విక సిద్ధాంతములను విశదీకరించాడు. ఆయన భగవద్గీతపై కూడా భాష్య రచన చేసినట్లుగా తెలుస్తున్నది కానీ అది లభించలేదు. ఆయన ప్రవచనములపై శిష్యులు రచించిన వ్యాఖ్యలు పెక్కు లభ్యమవుతున్నవి.

నింబార్కుని తత్త్వసిద్ధాంతమునకు "ద్వైతాద్వైతమ"ని పేరు. దానిని "పారుజాత సౌరభమని" కూడా పిలుస్తారు. స్థూలంగా చెప్పాలంటే, ఈ సిద్ధాంతము "ద్వైతంలో అద్వైత" మనవచ్చును. ఇది పూర్తిగా క్రొత్త సిద్ధాంతమని చెప్పుటకు వీలుపడదు. భాస్కరాచార్యులవారి "భేదా అభేద" అనే తాత్త్విక సిద్ధాంతమును కొద్ది మార్పులు చేర్పులతో నింబార్కులు పునఃసృష్టి చేశారు.

తనకు పూర్వమున్న వేదాంతులు ప్రవచించినట్లుగానే, నింబార్కుడు కూడా బ్రహ్మము నిరపేక్షము, శాశ్వతమన్నాడు. బహుముఖమైన ఈ విశాల విశ్వములోనున్న జీవులూ, జగత్తు. సర్వమూ ప్రత్యక్ష స్వరూపములైన బ్రహ్మయొక్క అంశములేనన్నాడు. అవి అన్నీ ఆయనయందే స్థితమై, ఆయన ప్రభవముచే మనుగడ సాగిస్తున్నవని చెప్పాడు. సృష్టిసర్వమూ, బహుముఖమైన గుణములు కలిగియుండగా వాటన్నిటికీ మూలము ఒక్కటే ఎలా అవుతుందనేది ప్రశ్న. లౌకిక దృష్టితో పరిశీలించినపుడు, భిన్నత్వముతో కూడియున్న సర్వసృష్టి, ఆయన దివ్యత్వము నుండే జనించినదని జవాబు. సృష్టిలో వైవిధ్యముగా కనబడునవన్నీ ఆయన యందే సుసమ్మేళనంగా కలిసి జీవిస్తూవుంటవి. నింబార్కుడు తన సహజీవన సిద్ధాంతములో, వైవిధ్యత కలవి, వైవిధ్యతలేని వాటిని గురించి సులభంగా అర్థమయ్యే విధంగా వివరించాడు. బ్రహ్మము జగత్తు వేరుకావని, సర్వసృష్టి జీవాత్మలతో సహా బ్రహ్మమునందే మనుగడ సాగిస్తున్నవని, వాటికి వేరు ఉపాధిలేదని తెలియజేశారు. అయితే బ్రహ్మము జగత్తుకాదనీ, ఆయనకు స్వతఃసిద్ధమైన ఉనికి ఉన్నదనీ, సర్వ వ్యాపకత్త్వమూ, సర్వాంతర్యామిత్వము, సర్వజ్ఞత్వము వంటి గుణములు కలిగి ఉంటాడనీ, ఆ గుణగణాదులు సృష్టిలో మరెవ్వరికీ ఉండవని చెప్పాడు. ఆయన సృష్టి, స్థితి లయ ములు చేయగల సర్వశక్తిమంతుడు. ఆ కారణంగా సృష్టిలోని చరాచర జీవులకు, బ్రహ్మమునకు ప్రకృతి సిద్ధమైన విభిన్నత్వము ఉంటుందనీ, అయినప్పటికీ అవి యన్నియూ ఆయనయందే ఏకత్వమునుపొంది జీవిస్తవనీ, ఆయన కాక, మరో ఉపాధి వాటికి లేదని వాఖ్యానించారు. ఈ సిద్ధాంత ప్రతిపాదన వలన నింబార్కుని భేదాభేద సిద్ధాంతము శ్రీరామానుజులవారి "అపృధక్ సిద్ధి" లేక అవిభాజ్యము, పరస్పరము ఇచ్చిపుచ్చుకొనని సిద్ధాంతమునకు కించిత్తు మార్పు మాత్రమేనని తాత్త్వి కులు చెబుతారు. సృష్టికర్తయైన బ్రహ్మము ఏ విధంగా తన సృష్టి యందు అంతర్భాగ

మవుతాడనే ప్రశ్నకు సమాధానంగా నింబార్కుడు, బ్రహ్మము యొక్క సర్వజ్ఞత్వము, సర్వాంతర్యామిత్వము వలన తన సృష్టియందే, తాను అంతర్లీనమై ఉంటాడని చెప్పాడు. ఆయన సృష్టిలోని ఏ స్వరూపమునైనా దాల్చగల శక్తిమంతుడు. ఆ కారణముగా బ్రహ్మమే కార్యము, కారణముకూడా అయి ఉన్నాడు. సృష్టి చేయునపుడు ఆయన తన శక్తి వ్యాపింపచేసి, దానిని లయము చేయవలసిన సమయమునందు ఉపసంహరించుకుంటాడు. నింబార్కుడు ఆత్మను పరమాత్మగానూ, దేహమును లౌకిక మైన ప్రపంచముగానూ విశ్వసించినాడు. ఆయనకు గల దృఢమైన విశ్వాసమేమంటే, బ్రహ్మమునందు ఏకత్వ, భిన్నత్వములు రెండూ ఉంటవని, ఆ కారణముగా, ఆయన తన వేదాంతమును "ద్వైతాద్వైత" సిద్ధాంతమని నామకరణము చేసి, రామానుజుల వారి "విశిష్టాద్వైతము కంటే వేరైనదని ప్రకటించారు. అంతేకాక, జీవాత్మ ప్రకృతి, బ్రహ్మము యొక్క లక్షణములు అనే వాదనను ఖండించి, అవి కేవలము ద్రవ్యములు, లేక పదార్థములని చెప్పాడు. అవి నిజంగా బ్రహ్మము యొక్క గుణములు లేక లక్షణములే అయినట్లయితే, అవి మనకు పారమార్థిక జ్ఞానమును ఇవ్వగలగాలి. కానీ అవి ఇవ్వటంలేదు కదా? పైపెచ్చు భగవంతునికి శుభాశుభగుణములు కల వానినిగా, అంటే లౌకిక ప్రపంచము, కర్మచేత బంధింపబడిన జీవులు కలవానిగా పరిగణించుట జరుగుతున్నది. దోషరహితము, స్వచ్ఛము, నిర్దుష్టము, సంపూర్ణమైన భగవంతుని యందు పైన చెప్పిన శుభాశుభలక్షణములు ఆరోపించుట వ్యతిరేక భావనవుతుంది. అందువల్ల భగవంతుని దోషరహితుడు, సర్వశుభలక్షణ సంపన్నుని గానే భావించితీరాలి. ఆయన గుణములలోగానీ, లక్షణములలోగానీ, పాపపూరితమైన లౌకికజగత్తు, కర్మబద్ధులైన జీవులు ఉండుటకు ఆస్కారమే లేదు. ఆ కారణంగా నింబార్కుడు రామానుజులవారి విశిష్టాద్వైత సిద్ధాంతమును వ్యతిరేకిస్తూ అది ద్వైత సిద్ధాంతమేనని ప్రవచించాడు.

నింబార్కుడు అనంతమైన శాశ్వతత్వమును రెండుగా విభజించాడు. అందొకటి స్వతంత్రము మరొకటి పరతంత్రము. స్వతంత్రం భగవంతుడు, పరతంత్రములైనవి చేతనత్వము అచేతనత్వము. చేతనత్వము కలిగియున్నవాడు జీవుడు. అచేతనత్వము తిరిగి మూడు రకములు. అవి అపరాకృతము లేక అధిప్రాకృతికము, కాలము, ప్రకృతి. భగవంతుని యొక్క గుణగణములను బట్టి ఆయనకు అనేక విధములైన పేర్లు వచ్చినవి. "యానినామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః" (విష్ణు సహస్ర

నామము). ఆయన దివ్యశక్తిసంపన్నుడు భారతీయ తాత్త్విక చింతనయందు ఇది ఒక విశిష్ట భావన. ఎందుకంటే ఇతర మతములన్నీ భగవంతుని ఒకే పేరుతో పిలుస్తాయి. ఆయన క్లేశములకు, దోషములకు అతీతుడు. అజ్ఞానము, అహంకారము, బంధము, అసూయ, ద్వేషము మృత్యుభయమువంటి దోషగుణములు ఆయన నంటవు. ఆయన సత్య సంకల్పుడు. ఆయన సంకల్పించిన కార్యములు సర్వదా పరిపూర్ణసిద్ధిని పొందగలవు. వాస్తవములగుట తప్పదు. ఆయన నిర్గుణుడు. ప్రాకృత ములైన గుణములు మూడు విధములు. అవి సత్త్వ, రజస్తమో గుణములు. శుద్ధ సత్త్వగుణములు ఏవనగా ప్రసన్నత, స్వాత్మానుభవము, పరమ ప్రశాంతి. నిత్య సంతోషము, ప్రహర్షము (పరమాత్మ సాక్షాత్కారము వలన గలిగిన నిరతశియా నందము) పరమాత్మనిష్ఠ. రజోగుణములనగా కామము, క్రోధము, లోభము, మోహము, డంభము, అసూయ, అహంకారము. ఈర్ష మత్సరమను భయానక ప్రవృత్తులు తమో గుణములు. కూటస్తుడు (అంతరాత్మ) లేడనుకొనుట, దేహమునే ఆత్మగా నమ్మట గురువులు పెద్దల ఉపదేశములను శంకించుట భగవంతుడు అట్టి గుణ ప్రభావములకు అతీతుడు. దివ్య గుణ స్వరూపుడు. అతడు సృష్టి, స్థితి, లయకారుడు. జీవులను సంసార బంధమునుండి విముక్తి ప్రసాదించగలడు. ఆయన విలక్షణములైన ఆరు గుణములను తన సృష్టియందు ప్రదర్శించినాడు. అవి ఏవనగా : 1. జ్ఞానము, 2. శక్తి, 3. బలము, 4. ఐశ్వర్యము, 5. వీర్యము, 6. తేజస్సు. నింబార్కుని బోధనలను అనుసరించి భగవంతుడు అనంతరూపుడు. ఆ రూపములు స్వకీయమైన ఆనందము వలన ఏర్పడినవి. భగవంతుని దివ్యత్వమునకు జ్ఞానము, ఆనందము, అనంతత్త్వము మూల కారణములైయున్నవి. పరమోత్కృష్టమైన సౌందర్యము యవ్వనాకర్షణము, మధురత్వము, సౌగంధ్యము, స్నిగ్ధత్వము, మృదు త్వము, కోమలత్వముల స్వరూపమే భగవంతుడు, పైన వివరించిన గుణములన్నీ మూలమునందు ఆయనకు భిన్నమైనవి కానప్పటికినీ, ఆయనకు సరూపకములు మాత్రము కావు. ఆ విధంగా భిన్నత్వమూ, అభిన్నత్వము రెండున్నూ, ఆయనకూ, ఆయన గుణములు లేక లక్షణములకూ మధ్య విదితమగుచున్నది.

నింబార్కుని వచనముల ప్రకారము భగవంతుని అనంతరూపమే రాధాకృష్ణులు. రాధ ప్రేమయందలి శక్తికాగా, కృష్ణుడు ప్రేమాధినాధుడు. వారిద్దరూ విడదీయ

జాలనివారు. వైకుంఠము వారి నివాసము. అది ప్రకృతి ప్రభావమునకు అందనిది. వైకుంఠము స్వయం ప్రకాశమైన దివ్యకాంతితో నిర్మితము. ఆ వైకుంఠమునందు స్వామిని, జయ విజయులను ద్వారపాలకులు, విష్వక్సేనుడు అను సేనానాయకుడు, వాహనమైన గరుత్మంతుడు, ఆసనమైన ఆదిశేషుడను బహు శిరస్సులుగల పెద్ద సర్పము సేవించుచుండగా, తన నాలుగు హస్తములయందు శంఖము, సుదర్శన చక్రము, గద, శార్ఙ్గము ధరించి, కిరీటధారియై, చెవులకు ఆభరణములను ధరించి, కౌస్తుభమను ఆభరణము మెడనుండి వ్రేలాడుచూ, హృదయమధ్యమున ప్రకాశించు చుండగా, సౌరభమును వెదజల్లు పూవులతోనూ, తులసిదళములతోనూ కూడిన “వనమాల” యనెడి పూదండను అలంకరించుకొని, పీతాంబరమనెడి పసుపుపచ్చని పట్టు వస్త్రమును కట్టుకొనియుంటాడు. పైన వర్ణింపబడిన వస్తువులన్నియూ స్వయం ప్రకాశములు. ద్రవ్యములు కావు. ఆయన భక్తులు అట్టి మూర్తిని ధ్యానించవలసి వుంటుంది. వివిధ అవతారములయందు ఆయన వివిధ స్వరూపములు దాల్చి యున్నాడు. వాటిని “వ్యూహము”లని పిలుస్తారు. వ్యూహములు అన్నవి సృష్టిని క్రమబద్ధీకరించుటకై, వివిధ దశలలో ఉత్పన్నమై ఆరాధనీయములైనవి. ప్రధానమైన వ్యూహములు నాలుగు. అవి : వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ. ఇందు వాసుదేవుడు సర్వోత్తముడైన క్షేతజ్ఞుడు (నేర్పరి), సంకర్షణుడు, సర్వసృష్టియందు జీవాత్మగా వ్యాపించి యుంటాడు. ప్రద్యుమ్నుడు సర్వ జీవులకు మనస్సు. అనిరుద్ధుడు కార్యకారణ సంబంధమును నియంత్రిస్తూ వుంటాడు. ఆయననుండియే ఈ చరాచరసృష్టి సర్వమూ ఉత్పన్నమవుతుంది.

ధర్మోద్ధరణమునకు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకు భగవంతుడు తనకు తానుగా అవతారములు దాలుస్తాడు. ఇవి మూడు విధములు. మొదటిది గుణావతారము. ఈ అవతారమునందు పరమాత్మ, ప్రకృతి గుణాత్మకములైన సత్వ, రజ స్తమోగుణ ములయందు ప్రభవించి, అవసరమును బట్టి, తన ఇష్టానుసారముగా సృష్టి స్థితి లయ కార్యములను నిర్వహిస్తాడు. రెండవ విధములైన అవతారములను పురుషావ తారములని పిలుస్తారు. ఈ అవతారములు ప్రకృతియొక్క వృద్ధిని, క్రమబద్ధీకరించు టకై అవతరించవలసి వస్తుంది. ఈ స్థితిలో ఆయన సాగరశయనుడై విశ్రమిస్తుం టాడు. మూడవ తరగతికి చెందిన అవతారములను లీలావతారములంటారు. వీటిని

తిరిగి నాలుగు విధములుగా విభజించుట జరిగినది. వాటికి ఆవేశావతారములు; శక్త్యేయానవతారములు, స్వరూపావతారములు, పూర్ణావతారములు అనిపేర్లు. సోదాహరణముగా చెప్పవలసివస్తే నరనారాయణులు మొదటి తరగతికి, పరశురామ సనత్కుమార నారదాదులు రెండవ తరగతికి, మత్స్య కూర్మ వరాహములు మూడవ తరగతికి, నృసింహ, రామ, కృష్ణావ తారములు నాల్గవ తరగతికి చెందుతవి. ఈ విధముగా నింబార్కుని సిద్ధాంత ప్రకారం భగవంతుడు అనేక అవతారముల మూర్తి. మరియు అన్ని విధములైన శుభలక్షణముల ఆకృతి.

ద్వైతాద్వైత సిద్ధాంతమునను సరించి జీవునకు బ్రహ్మమునకు భిన్నత్వముతోపాటు సరూపత్వము కూడా ఉన్నది. జీవుడు మంచివి, చెడ్డవైన కర్మల నాచరించుచూ వాటి సత్ఫలితములను, దుష్ఫలితములను అనుభవిస్తూ ఉంటాడు. "భేదాభేధ" సిద్ధాంతరీత్యా, జీవుని అనేక విధములుగా వర్ణించుట జరిగినది. జీవుడు బ్రహ్మము కంటే వేరైనవాడు. కారణమేమనగా జీవుడు సృష్టింపబడినవాడు. ఆధారపడినవాడు మరియు బ్రహ్మముచే నియంత్రించబడువాడు. ఆ సందర్భములోదే జీవుడు వేరుకాదని చెప్పటానికి కారణం, బ్రహ్మమునందే ఉనికిని కలిగియుండి, ఆయన స్వభామును పాలుపంచుకుంటూ ఉండటం. నింబార్కుని సిద్ధాంతమును అనుసరించి జీవునికి జన్మలేదు. మృత్యువూ లేదు. అది శాశ్వతము. శరీరములో "నేను" అని చెప్పుకొనేది జీవుడే. జీవుడు స్వతంత్రుడే కానీ, భగవంతుని నిర్ణయమునకు కట్టుబడి ఉంటాడు. అతడు క్రియాశీలుడుగానూ, లేక కేవలమూ సాక్షీభూతుడుగానూ ప్రవర్తించగలడు. అతని పూర్వజన్మ కర్మల ఫలితమును అనుసరించి, భగవదాజ్ఞాను సారముగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

నింబార్కుడు ఒక క్రమపద్ధతిలో, జీవుల వర్గీకరణమును ఆమోదించినాడు. నిత్యముక్తులనబడు జీవులు భగవదనుగ్రహముతో ముక్తులై శాశ్వతముగా ఆయన సేవలయందు నిమగ్నులై ఉంటారు. రెండవ వర్గము వారిని "ముక్తులు" అని పిలుస్తారు. వీరు కూడా భగవదనుగ్రహప్రాప్తులై, భగవత్సేవయందలి ఆనందమును ఇంకా అనుభవించవలెననే ఆకాంక్షతో ఆయన సేవయందే నిమగ్నమై ఉంటారు. వారిలో కొందరు పొందిన ఆనందముతో సంతృప్తులై ఆత్మల స్థితిని పొందుతారు. తృతీయ వర్గమునకు చెందినవారిని "బద్ధులు" అంటారు. వారు మోక్షప్రాప్తిని కోరుతుంటారు. చివరి వర్గము వారు "నిత్యబద్ధులు". వీరు శాశ్వతముగా సంసారబంధమున చిక్కు

కొని, ప్రాపంచిక విషయలోలురై ఉంటారు. వీరు సర్వదా చెడ్డపనులు చేస్తూ, జీవిత ములో నైతిక విలువలను పాటించరు. భగవద్భక్తిని గురించి గానీ, మోక్షప్రాప్తిని గురించికానీ ఏనాడూ ఆలోచించరు. ముముక్షువులైన వారు సర్వదా భగవదాను గ్రహమును కాంక్షిస్తూ, మోక్షప్రాప్తికై ఆరాటపడుతూ ఉంటారు. అటువంటివారు, వారి వారి కర్మ ఫలములననుసరించి, పుట్టుతూ, చనిపోతూ, అనేక జన్మలనెత్తి ఎప్పుడో ఒకప్పుడు తమ గమ్యమైన ముక్తిని పొందగలుగుతారు. కొందరు మంచి కర్మలను చేసినప్పటికీ మోక్షప్రాప్తికి అవసరమైన అర్హత పొందలేనివారిని, భగవదాం శగల ఇతర దేవతలు, ఆదిత్యలోకమునకు తీసుకువెళ్తారు. అట్టి జీవులు తమ శుభ కర్మల ఫలముననుభవించిన అనంతరము, భూమిపై జన్మించి, తిరిగి మోక్షప్రాప్తికై పాటుపడుతుంటారు. మోక్షమునకు అర్హులైన జీవులు కాంతి పథమున ప్రయాణము చేసి బ్రహ్మలోకమును చేరుతారు. ఈ ప్రయాణములో వారు పదునొకండు లోకముల ద్వారా పయనించి విష్ణులోకమును చేరుతారు. అప్పటికి జీవునకు పురుషోత్తముని స్సానిధ్యము, వైభవమువలన, తానుకూడా దైవాంశసంభూతడననీ, తనలోని ప్రకృతిసిద్ధము లైన చిన్న చిన్న వైవిధ్యములను పరమాత్మ తొలగించి వేశాడనీ గ్రహిస్తాడు. అట్టి జీవులు దుఃఖపూరితమైన జగత్తులోనికి తిరిగి రావటంకానీ, జన్మమృత్యుబంధములో చిక్కుకొనుట కానీ జరుగదు. ఆ జీవుడు భగవాదనుగ్రహ మునూ దివ్యానందమును అనుభవిస్తూ ముక్తి పొందుతాడు. నింబార్కుని సిద్ధాంత ములో జీవన్ముక్తి తావులేదు. అద్వైత సిద్ధాంతము ప్రబోధించిన, జీవించియుండగానే ముక్తిని అనుభవించవచ్చుననెడి భావన వ్యతిరేకించ బడినది. ముక్తి అనునునది జీవుడు తన ప్రారబ్ధ కర్మ ఫలితమును పరిపూర్ణముగా అనుభవించిన అనంతరమే కలుగును. నింబార్కుని తాత్త్విక చింతననుసరించి ముక్తి యనగా, నది సముద్రము లతోకలసి తనరూపము ఉనికిని పోగొట్టుకున్న విధంగా కాక, సూర్యుడు ఆయన కిరణములవలె నిరపేక్ష వైవిధ్యము లేకయుండుటయే. అంటే జీవుడు బంధ విముక్తు డగు సమయమునందు, తాను భగవంతునియందు ఉనప్పటికినీ, తాను వేరనెడు సత్యమును గ్రహించగలుగుతాడు.

పరాధీనము, చేతనత్వము, కొరవడి వాస్తవికత కలిగిన మూడు వస్తువులుపైన చెప్పినట్లు అపరాకృతము, కాలము మరియు ప్రకృతి (భౌతిక ప్రకృతి) ఈ మూడున్నూ

సత్త్వరజస్తమో గుణములకు చెందినవి. వీనిని నిత్య విభూతి లేక పరమపదము లేక విష్ణు పదము ఆదిగా గలనామములతో వైష్ణవులు పిలుస్తారు. కన్నులు మిరుమిట్లుగొల్పు తేజోవంతమైన ఆ అద్భుత కాంతికి ఏ అడ్డూ ఉండదు సరికదా ! దానిని ఇతర దేవీ దేవతలు చూచుటకు కూడా కష్టసాధ్యంగా ఉంటుంది. భగవంతుని ఇష్టానుసారముగా, అది అనేక విధములైన పరిమాణములను, ఆకృతులను పొందుతుంటుంది. భగవంతుని సన్నిధియందు గల ముక్తులైన జీవులు, ఇతర వస్తువులన్నీ పైన వివరించిన పదార్థముల వల్ల ఏర్పడినవే. కాలము కూడా తన ప్రభావమును వాటిపై చూపలేదు, అంటే అవి నాశరహితములు అయినవి అన్నమాట.

కాలము ఆది, అంతము రెండూ లేనిది. ప్రత్యక్షముగా చూడబడుచున్నవీ, పరోక్షముగా భావింపబడుచున్న సర్వమూ, కాలప్రభావమునకు లోనైయున్నవే. వర్తమానము, గతము, భవిష్యత్, ముందు, త్వరితముయని ఉపయోగించు పదజాలము సర్వమూ, కాలము యొక్క వివిధ దశలలోని మార్పులు మాత్రమే. సృష్టిస్థితిలయములు కూడా కాలబద్ధములే. ఆ విధముగా ప్రకృతిజన్యములైనవన్నీ, కాలముచే నియంత్రిప బడుతున్నవి. పురుషోత్తము డొక్కడే కాలమును నియంత్రించ గలిగినవాడు. జగత్తువలె కాలమునకంతము, నాశనము లేదు. ప్రళయమునందు కూడ కాలము చరించుచూనే యుండును, సూర్య చలనమును బట్టి, కాల విభాగము జరుపబడుచున్నప్పటికినీ, వాస్తవముగా కాలము విభాజ్యముకాదు. చేతన రహితములైన పై మూటిలోనూ ప్రకృతి చివరది. దీనిని అనేక వేదాంతులు అనేక విధములుగా పిలుస్తున్నారు. మాయయనీ, తమస్సనీ, అవ్యక్తమనీ, శక్తియనీ, దీనికి అనేక నామాంతరములున్నై. పైన చెప్పిన సత్త్వరజస్తమోగుణముల ప్రభావము ప్రకృతిపై ఉంటుంది. జగన్నాటక సూత్రధారియైన ఆ భగవంతుని చేతులో ప్రకృతి ఒక పదార్థముగా ఉంటుంది. నింబార్కుని తత్త్వమునందు ప్రకృతి బ్రహ్మమునకు సారూప్యత కలిగి ఉంటుంది. విరుద్ధముగానూ ఉంటుంది. భగవదాంశముగానుండి పరిపూర్ణముగా, ఆయనపై ఆధారపడి ఉంటుంది. సాలెపురుగూ దాని గూడువలె, ప్రకృతి సృష్టికార్యమునందు, భగవంతునితో వేరుగా ఉంటుంది. ప్రకృతిమార్పులు చెందుతూ ఉంటుంది. కానీ ఆ మార్పులు దానికే పరిమితమై, భగవంతుని ప్రభావితము చేయలేవు. ఆయన సర్వాధిక్యతను, ఉనికిని దిగజార్చలేవు. ఆయన సర్వశక్తిమంతుడగుటచే తన

సంకల్పము చేతనే ప్రతిదానియందు మార్పులు, చేర్పులు, సృష్టి, లయములు జరుప గలడు. ప్రకృతి, సృష్టి చేయగలదు. అదేవిధంగా నశింపచేయనూ గలదు. భగవంతుని వలె ప్రకృతి కూడా శాశ్వతమైనది. త్రిగుణాత్మకమై, భగవత్సంకల్పము వలన ఏర్పడిన ప్రకృతి త్రిగుణములయొక్క పరిణామములలో మార్పుచేయటం ద్వారా జగత్తును ఆయన ఇష్టానుసారము సృష్టిస్తుంది. జగత్తులో మనకు కనిపించే సర్వ చరాచర జీవకోటి సత్య, రజస్తమోగుణముల పరిమాణములలో జరుగు మార్పులను అనుస రించి, అనేక విధములైన ఆకారములుగా గోచరిస్తవి. ప్రళయకాలమునందు ఆ శక్తిని ఉపసంహరించుట వలన, అవి కనుమరుగైపోతవి.

భేదాభేద సిద్ధాంతమునందు జీవునకు బంధుత్వము ఏర్పడుటకూ అందుండి విముక్తి చెందుటకు, భగవంతుడే మూలకారకుడు. అవిద్య జీవుని బందీగా చేస్తుంది. ఇది అనంతమైన కర్మఫలమువంటిది. కర్మ భగవత్సంకల్పమునను సరించి, జీవుని యొక్క సంచిత, ప్రారబ్ద కర్మలయందలి శుభాశుభములతో జీవుని బంధించి ఉంచుతుంది. అవిద్య జీవుని, తానెవరో తెలిసికొనలేని స్థితియందుంచి, తాను ఈశ్వరాంశసంభూతుడననే జ్ఞానమును జీవుడు మరచే విధంగా చేస్తుంది. దాని వలన జీవుడు, దేహమే తానను భ్రమలోపడి అహంకారపూరితుడై సంసారచక్రములో దిగ్బంధితుడవుతున్నాడు. ప్రకృతి సృష్టించిన దేహము, మనస్సులతో సారూప్యత నూహించుకొని, పాపభూయిష్టమైన అనేక కర్మల నాచరించి, అహంకారముచే, భయంకరమైన చావు పుట్టుకల చక్రములో, ఇరుక్కొని పోయి, అంతములోని ఆ చక్రభ్రమణములో తిరుగుతూ ఉంటాడు. అతని రాగద్వేషాలు, కామక్రోధములు, లోభమోహాదులు, అహంకార, మమకారాల వంటి అరిషడ్వర్గములు, పాపులతో స్నేహ సంబంధములు, పుణ్యపురుషులను అంటరానివారిగా పరిగణించి దూరంగా మనుగడ సాగించటం, వంటి చర్యల ద్వారా, అతనిని తాత్త్విక పదమువైపు చూడ నీయవు, నడవనీయవు. అందుకు భిన్నంగా పుణ్యపురుషుల సాన్నిహిత్యమూ శాస్త్రపఠనమూ, ప్రాపంచిక వ్యవహారములయందు విరాగత్వమూ, అతని జీవితము నకు, క్రొత్త మార్గమును నిర్దేశించి, అతనిని పుణ్యకార్యముల వైపు మళ్ళించి అంతి మంగా అతను, తన దుష్కృత కర్మల ప్రభావమునుండి బయటపడుటకు, తగు సహాయము చేయగలుగుతవి. భగవదనుగ్రహమువల్ల చావు పుట్టుకల చక్రము నుండి బయటపడి ముక్తిమార్గముపై పయనిస్తాడు.

నింబార్కుని ఆధ్యాత్మిక తత్త్వము నందు మోక్షమును పొందుటకు రెండు మార్గములు చెప్పబడినవి. ఒకటి జ్ఞానమార్గము. దీనికి ధ్యానము ప్రధాన సాధన. ఈ మార్గము వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములు అధ్యయనము చేయుట, ధ్యాన సాధనమున నేర్పు కలవారికి మాత్రమే అనుసరణీయము. ఈ మార్గమును అనుసరించిన సాధకుడు తనలోని ఆత్మను తెలుసుకొని ఆ యాత్మయే బ్రహ్మాంశయనీ, తాను బ్రహ్మాంశ సంభూతుడననీ, ఈశరీరము ఆత్మకాదనీ, భిన్నమైనదనీ తెలుసుకొని, అంతర్యామియై పరమాత్మ స్వరూపమైన తనయందలి ఆత్మసాక్షాత్కారమునకై సాధన చేయాల్సి ఉంటుంది. ఇటువంటి జ్ఞానికి సిద్ధి కలుగుటయే ముక్తి. ఆ విధంగా ముక్తి అనేది జీవులకు క్రొత్తగా లభించునటువంటిది కాదు. ముక్తి యనునది జీవులు తమ మూల స్వభావమును, తిరిగి గ్రహించగలుగుటయే. సూర్యచంద్రాదులు గ్రహణ విముక్తులైనట్లు, కారుమేఘములు సూర్యుని కప్పివేసి కదలిపోయినట్లుగా జీవుడు అజ్ఞానాంధకారము నుండి జ్ఞానసాధనతో వెలికి వచ్చి, ఆత్మసాక్షాత్కారమును పొందుటయే ముక్తి. తన స్వాభావికతను, తాను తెలిసికొనుటయే ముక్తి. అట్టి ఆత్మజ్ఞానమును పొందిన సాధకుడు బ్రహ్మానందమును అనుభవించుచూ, భగవత్సానిధ్యమును పొందుతాడు.

రెండవది భక్తిమార్గము భగవంతునియందు అచంచలమైన భక్తి భావన కలిగియుండుట. వేదాదులు, ఉపనిషత్తులు, శాస్త్రములు ఆదిగాగల ఆధ్యాత్మిక గ్రంథ పఠనము చేయలేనివారు, జ్ఞానమార్గమునందు వివరించినట్లు ఆత్మజ్ఞానము పొందగల సాధన నెరుగనివారూ, సులభమైన భక్తిమార్గమును అనుసరించవలసి ఉంటుంది. భక్తి అంటే త్రికరణశుద్ధిగా భగవంతుని ఆరాధించుట మరియు శరణు జొచ్చుట. భక్తి మార్గమును అనుసరించదలచిన సాధకుడు లేక భక్తుడు ముందుగా నిశ్చలమైన మనస్సుతో దైవమునందు దృఢ విశ్వాసంతో, సర్వోత్తమమైన జీవిత లక్ష్యము భగవత్సాన్నిధ్యమేననీ, ఈ సంసార సాగరమునుండీ, సంచిత, ప్రారబ్ధకర్మ ఫలములనుండీ, తన్నుద్ధరించి కాపాడగల సర్వశక్తిమంతు డొక్కడేయని విశ్వసించవలెను. భక్తి రెండు విధములైనది. ఒకటి ప్రాథమికము, మరొకటి అంత్యము. భక్తి భావనను గురించిన ఉపదేశములు ఉపనిషత్తులయందు, పురాణములయందు ముఖ్యముగా భాగవతము నందు నిక్షిప్తమై ఉన్నవి. "కర్మణ్యేవాధికారమస్తే మా ఫలేషు కదాచిన" యని కృష్ణభగవానుడు భగవద్గీతయందు అర్జునునకు ఉపదేశించినట్లు, ప్రతి వ్యక్తీ ఫలాపేక్ష

లేకుండా, రాగ ద్వేషాలకు అతీతంగా తనవిధులను తానుని ర్వహించవలెను. తన కర్మలను తాను ఆచరించవలెను. అట్టి కర్మాచరణముల యొక్క మంచి చెడుల నిర్ణ యమును భగవంతుని తుది తీర్పుకు వదలివేయాలి. తీర్థయాత్రలు, దానధర్మములు, పూజలు, వ్రతములు, భగవన్నామ సంకీర్తన, పురాణములు, రామాయణ, మహాభార తాది ఇతిహాస పఠనమూ, పుణ్య పురుషుల సాంగత్యమూ, ఆధ్యాత్మిక బోధనలను వినుట, ప్రచారము చేయుట ఆదిగాగల భక్తి కార్యక్రమ నిర్వహణ, వ్యక్తిని భక్తి యొక్క పరాకాష్టకు చేరుస్తుంది. భక్తియొక్క చరమదశ, భగవంతుని యెడల ఏకో న్ముఖమై, దృఢమైన మోహావేశమును పొందుటయే. నిరంతర భక్తిసాధన, జీవునిలో దివ్యగుణములను సృష్టించును. భక్తిభావము నందలి మరో ముఖ్యాంశము ఆత్మ శరణాగతి. రామానుజులు దానిని "ప్రపత్తి" అన్నారు. ఈ విధానము నందు భక్తుడు తన జీవిత సర్వస్వమునూ, తన ఆత్మతో సహా భగవంతుని కర్పించి "భగవద్గీత"లో బోధించినట్లు "అన్యధా శరణంనాస్తి త్వమేవ శరణం మమ" అని పరమాత్మను వేడుకొనుట వలన ఆ స్వామి అనుగ్రహం లభిస్తుంది. భక్తుడు ఎప్పుడైతే భక్తియందు పరిపూర్ణతను సర్వోత్కృష్టదశను చేరి శరణాగతుడౌతాడో, అప్పుడాతనికి బహిర్ప్ర పంచమునందలి ప్రతి వస్తువునందు పరమాత్మయే గోచరిస్తాడు. అతను ఆచరించే టటువంటి ప్రతి కార్యము దైవ సంకల్పమని విశ్వసిస్తాడు. సుఖదుఃఖాదులను రెంటినీ సమానముగా పరిగణిస్తాడు. భగవద్గీతలో చెప్పినట్లాతడు "సమదర్శి" ఔతాడు.

భక్తి మార్గమునకు అంత్యము మోక్షప్రాప్తి. దీనినే సాయుజ్యమని కూడా అంటారు. ఇది పరమాత్మయందు ఐక్యము చెందుటకాదు. ఆయన సాన్నిధ్యమున వసించి ఆయనయందలి కొన్ని దివ్యాంశములను పొందుట. జీవుడు ఎల్లప్పుడూ భగవంతునిలోని అంశమే. మోక్షప్రాప్తికూడా రెండు విధములైనది. ఒకటి శీఘ్రప్రాప్తి మరొకటి క్రమేణా లభించునది. శీఘ్రప్రాప్తియందు జీవుడు తన దేహమును విసర్జించి దివ్యత్వమును పొందుతాడు. క్రమముగా లభించు ముక్తియందు జీవుని అవిద్య, అజ్ఞానము క్రమముగా నశించి అంచలంచలుగా మోక్షప్రాప్తిని పొందుతారు. ఈ మార్గము నాలుగు విధములు : సామీప్యమనగా భగవసాన్నిధ్యమునకు చేరువలో నుండుట. సారూప్యమనగా ఆయన దివ్యావతారమును పొందుట, సాలోక్యమనగా ఆయన సన్నిధ్ధియందే నివసించుట, నాల్గవది, చివరిదైన సాయుజ్యమంటే జీవుడు

తన అస్థిత్వమును కోల్పోకుండా ఆయనతో ఏకమగుట. ఏకత్వమనగా ఆయనతో అత్యంత సాన్నిహిత్యముతో మెలగుట. పరిపూర్ణమైనశరణాగతుడై దైవము నాధారముగా చేసుకొనుట. పారతంత్ర్యమును అనుభవించుట అది భగవసాన్నిధ్యము నందు అనుభవించెడి వర్ణింపనలవికాని ఆనందము అదే సచ్చిదానందము. అట్టి జీవుడు భగవంతునితో సమానమైన ఆధిక్యతను పొంది, ఒక్క సృష్టికార్యమును మినహాయించి భగవంతుడు చేయగల సర్వకార్యములూ నిర్వహించ గల శక్తిమంతుడు అవుతాడు. నింబార్కుడు ఈ విధంగా తన భేదాభేదములు లేక "వేదాంత పారుజాత సౌరభమనెడి" తాత్త్విక సిద్ధాంతం ప్రబోధించినాడు. ఈయన సిద్ధాంతము ఆదిశంకరుల అద్వైత, శ్రీరామానుజుల "విశిష్టాద్వైత సిద్ధాంతములకు, మధ్యే మార్గముగా అవగతమౌతున్నది. క్రీ.శ. 1162 సంవత్సరమునందు పరమపద ప్రాప్తి పొందెను.

■ ■ ■

# బసవేశ్వరుడు

క్రీ.శ. 12వ శతాబ్దంలో హిందూమతమునందు వ్రేళ్లూనిన వర్ణాశ్రమ ధర్మమును సమూలంగా నాశనంచేసి, కులప్రసక్తిలేని సమాజ స్థాపనకూ, బహు దేవతారాధనను నిర్మూలించి ఏకేశ్వరోపాసనగా, శివారాధనను వ్యాప్తి చేయవలెననెడి దృఢసంకల్పముతో విప్లవాత్మక దృక్పథంతో, వీరశైవమత ప్రచారమును చేబట్టి, కొంతవరకు కృతకృత్యుడై, తను నమ్మిన సిద్ధాంతము కొరకై, అసువులు బాసిన, సంఘ సంస్కర్త వీరశైవ శిరోమణి బసవేశ్వరుడు.

శ్రీ కోట వేంకటాచలం (బెజవాడ) గారు వ్రాసిన "ఆంధ్రుల పుట్టు పూర్వోత్త రములు" అనే గ్రంథములో బసవేశ్వరుని తల్లితండ్రులు, ఆంధ్ర నియోగి బ్రాహ్మణు లనీ, ఇంటి పేరు బండారువారనీ తెలియజేశారు. తండ్రిపేరు మండగేయ మాదిరాజు, తల్లిపేరు మాదాంబ, వీరిని కమ్మ బ్రాహ్మణులు అని కూడా అనేవారట. కారణం వీరు కర్మ రాష్ట్రము లేక కమ్మరాష్ట్రమని పిలువబడిన, కృష్ణా, గుంటూరు జిల్లా ప్రాంతములకు చెందిన వారవటంవలన. వీరు క్రీ.శ. 12వ శతాబ్దంలో ప్రస్తుత కర్ణాటక రాష్ట్రములోని బిజాపూరు జిల్లా యందలి హింగుళేశ్వరము అనే గ్రామమునకు వలసవెళ్ళి అక్కడనే అగ్రహారమును పొంది స్థిరపడిపోయారు. ఆ గ్రామములోనే బసవేశ్వరుడు జన్మించాడు. ఆ రోజులలో వేద వేదాంగాధ్యయనపరులు, పురాణేతి హాసములు, జ్యోతిష్యాది షట్శాస్త్ర పండితులు, కవులు తమ ప్రతిభను దేశమంతటా

చాటి, గుర్తింపు పొందవలెననీ, పాలకుల ద్వారా సన్మానములతోపాటు ధన ధాన్యా దులను, వాహనములను, వ్యవసాయ భూములను, విరాళములుగా పొంద వలననే ఆకాంక్షతో ఇతర రాజ్యములలోనికి, ఇతర ప్రాంతములకూ వలసవెళ్ళటం పరిపాటి. ముఖ్యంగా ద్రవిడ, కర్ణాటక రాజ్యములలో విద్యకు మంచిఆదరణ, గౌరవం లభిస్తుండేవి. ఆ కారణంగానే బసవేశ్వరుని తల్లితండ్రులు, మరికొంతమంది ఆంధ్ర బ్రాహ్మణులు వెంటరాగా, కర్ణాటక దేశంలోనికి వచ్చి స్థిరపడినారు.

బసవేశ్వరుని జన్మ వృత్తాంతమును బట్టి, మాదిరాజుకు చాలా కాలముగా సంతానము కలుగకపోవుటవల్ల, ఆయన కులపెద్దలను సంప్రదించాడట. వారు "వృషభ వ్రతము"ను ఆచరిస్తే, నందీశ్వరుని అనుగ్రహంవల్ల సంతానప్రాప్తి కలుగు తుందని చెప్పగా, ఆయన వ్రతమునాచరించి మగబిడ్డనుపొంది, ఆయన, నందీశ్వరుని దయవల్ల జన్మించి నాడు కాబట్టి బసవేశ్వరుడని నామకరణంచేశాడట. బసవేశ్వరు నికి, మంచి అందముతోపాటు, పూవుకు వాసనవలె ఏక సంతాగ్రాహిత్వము కూడా అబ్బినదట. తామున్న అగ్రహారమునందు సదావేదపఠనము, యజ్ఞయాగాది క్రతు వులు నిర్వహించ బడుచుండుటచేత, బాల్యంలోనే, బసవేశ్వరునకు అనేక స్తోత్రములు, సూక్తముల వంటివి కేవలం వినటం ద్వారానే కంఠస్తము చేసినాడట. మాదిరాజు తన పుత్రుని తెలివితేటలకు మురిసి, బాలునికి త్వరగా ఉపనయన సంస్కారము జరిపి వేదాధ్యయనమందు ప్రవేశపెట్ట వలెననే తలంపు కలిగింది. గాయత్రీ మంత్రో పాసనద్వారా తన కొడుకు వేదవేదాంగాది విద్యలను అభ్యసించి, వైదిక ధర్మముపై ఆధిక్యతనూ, తనకు వారసునిగా, తమ అగ్రహారమునకు, స్థానపతిగానూ కావాలని ఎంతో కుతూహలం చెందుతుండేవాడు. తానొకటి తలుస్తే దైవమొకటి తలుస్తాడనే సామెతగా బసవేశ్వరుడు విద్యలయందు మేధావి మాత్రమేకాక, తన చుట్టూ ఉన్న సమాజములోని పరిస్థితులను కూడా నిశితంగా పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ, ఆకళింపు చేసుకొనేవాడు. నెమ్మది, నెమ్మదిగా తాను ఎదుగుతూ, మతాచారములను, కర్మ కాండనూ, ఇతర వర్ణములవారిపై బ్రాహ్మణుల ఆధిపత్యాన్నీ, సమాజములోని అట్ట డుగు వర్గాలవారూ, దళితులూ అనుభవిస్తున్న దుర్భర జీవితాన్నీ, వితంతువులు పడుతున్న బాధలనూ, సమాజమును పట్టిపీడిస్తున్నటువంటి ఎన్నో రకములైన, జాడ్యములను అవగతము చేసుకున్నాడు. వయసుతోపాటు ఆతని అవగాహనా

శక్తి కూడా పెరుగుతూ, సంఘములోని అగ్రవర్ణములవారు విలాస జీవితం గడుపుతుంటే, దళితులు, ఇతర కులస్థులు ఎందుకు దుర్భరమైన, నికృష్ట జీవితం అనుభవించవలసివస్తున్నదో అవగాహనము చేసుకోగలిగాడు. వారు నిత్యమూ అగ్రకులజులు తమపై జరుపు అత్యాచారములను మౌనంగా, తమ మనుగడకై సహిస్తూ కాలం గడుపుతున్న వైనమును గమనించిన బసవేశ్వరుడు మానసికంగా చలించిపోయాడు. తరచుగా దయనీయమైన సంఘటనలను చూడటం వల్ల, ఆయన మనసు పరివర్తనము చెందింది. సమాజమును కులములుగా విభజించటం, వేదాధ్యయనమనీ, యజ్ఞయాగాది క్రతువులనీ, అనేక విధములైన కార్యక్రమములను ప్రవేశపెట్టడం ద్వారా బ్రాహ్మణులు, సమాజముపై తమ ఆధిపత్యమును కొనసాగించుకుంటున్నారనీ దృఢంగా విశ్వసించిన బసవేశ్వరుడు, సమాజమును, కులవివక్షత నుండీ, చెడు సాంప్రదాయముల నుండీ ఉద్ధరించవలెనంటే, ముందుగా వాటికి కారణభూతములైన శాస్త్రములను ధ్వంసము చేయాలి. పురాణములు, ఇతిహాసముల వంటి, ప్రాచీన గ్రంథముల వలన హిందూమతములో ఆరాధ్య దైవములుగా స్థానము ఏర్పరుచుకొని పూజలు అందుకుంటూ, శాఖాపరంగా మత విభజనకు కారకులైన ఆ దేవతా సమూహములను అన్నింటినీ తొలగద్రోసి, ఏకేశ్వరోపాసనను, కుల, వర్గ, శాఖా వివక్షతలులేని సమసమాజ స్థాపనను ప్రారంభించవలెనని నిశ్చయించాడు. ఏకేశ్వరోపాసనంటే, ఒక్క శివుని మాత్రమే పూజించవలెనని భావన. శివుడంటే బసవేశ్వరుని భావనలో దేవాలయములో, నాలుగు గోడలమధ్య బంధింపబడిన, స్థాణువైన శివలింగముకాదు. ప్రతి వ్యక్తి యొక్క హృదయాంతరాళములో చైతన్య రూపుడై, స్వయంప్రకాశకుడైన జీవుడు. అతడే దేవుడు. అతడే శివుడు. వేదములను, శాస్త్రములను కంఠోపాఠము చేయటం, యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించుట కంటే, నీతిబద్ధమైన ప్రవర్తన ఉత్తమమైనదని చెప్పాడు. ఈ రకమైన మనోభావములు కలిగిన ఒక పూమొగ్గ వికశించుట ప్రారంభించింది. మతసంస్కరణ, సంఘసంస్కరణలే ధ్యేయంగా ఒక విప్లవకారుడు బసవేశ్వరుని హృదయంలో జన్మించాడు. సంస్కరణాభిలాషియైన బసవేశ్వరుడు సాంప్రదాయకంగా తనకు ఉపనయన సంస్కారమును తండ్రి జరుపవలెనని ప్రయత్నిస్తే ఎదురు తిరిగి, తిరస్కరించాడు. అగ్రహారపు పెద్దగా, స్థానాపతిగా, అందరకూ మార్గ దర్శకుడుగా, ఆదర్శ పురుషుడుగా జీవిస్తున్న మాది

రాజకు, బసవని ప్రవర్తన ఒక ప్రతిష్ఠాత్మక సమస్యగా తయారయింది. కానీ బసవనికి తన అభిప్రాయమును స్పష్టంగా వ్యక్తము చేయుటకు మంచి అవకాశం లభించి నట్లయింది. బ్రాహ్మణులపట్ల, వైదిక ధర్మము పట్ల, తనకుగల ఏ హ్యాతను, ద్వేషమును, తండ్రికి సుస్పష్టంగా తెలియచేశాడు. ఉపనయన సంస్కారమును చేయించుకొని జంధ్యమును వేసుకొని, గాయత్రీ మంత్ర జపము చేయుటవల్ల, సమాజములోని చెడు తొలగిపోదని ప్రకటించాడు. తన వాదనకు బలం చేకూర్చుకొనుటకు గాను, వేటకాడనై భక్త కన్నప్ప, కరికాళ చోళులుని కాలంలో పాకీపనిచేసిన మేదర చెన్నయ్య, అంటరానివాడైన "సిరియాళుడు" మరింకెందరో బలహీన వర్గములకు, దళిత కులము నకు చెందిన చోళ దేశస్థులు, బ్రాహ్మణులవలె ఎటువంటి సంస్కారములు పొంద కుండా, కేవలము శివభక్తి వల్లనే, ముక్తి చెందిన కథలను వినిపించాడు. తమిళ దేశమునందు ఆ విధంగా ముక్తి పొందినవారి జీవిత చరిత్రలు, అవలంబించిన భక్తి మార్గములు, బసవేశ్వరుని ఎంతగానో ఆకర్షించి, వైదిక ధర్మమును, తండ్రి అభ్యర్థనను కాదనేటట్లుగా చేసినై. వయస్సులో చిన్నవాడవటంచేత, మానసిక పరిపక్వత కొరవ డటంచేత, బసవేశ్వరునికి, ఆతను ఆశిస్తున్న సంఘసంస్కరణను గురించి, స్పష్టమైన అవగాహనము లేకపోయినప్పటికినీ, ఆ వయసులో సంఘ సంస్కరణ చేయ వలెననే దృఢసంకల్పము ఆ కాలములోగానీ, అనంతరకాలములోగానీ మత సంస్కరణ మును చేపట్టిన, వారెవ్వరిలోనూ గోచరించలేదంటే అతిశయోక్తి కాదు. ఆ పిన్న వయసులోనే సంఘ సంస్కరణాభిలాష, పూర్ణిమనాటి సముద్రపు కెరటాలవలె ఉవ్వెత్తుగా ప్రదర్శితమైనది. తండ్రియైన మాదిరాజ, అగ్రహారమునందలి బ్రాహ్మణులు, ఇతర అగ్రవర్ణములవారు, బసవేశ్వరుడు ఉపనయన సంస్కారమునకు ఎందుకు విముఖుడో తెలియపరుస్తూ చేసిన వాదనువిని, నిరాశ చెందారు. తండ్రి తన తోటి అగ్రహారీకులతో కలసి బసవేశ్వరుని మనసు మార్చవలెనని చాకచక్యంగా, అనేక విధములైన ప్రయత్నములు చేసినప్పటికినీ, బసవేశ్వరుని సంకల్పము చలించలేదు సరికదా ఆతడు మరొకసారి తన నిర్ణయమును దృఢంగా తెలియజేస్తూ వైదిక ధర్మమునందు తనకు విశ్వాసము లేదనీ, అది భక్తి మార్గమునకు వ్యతిరేకమనీ వారితో వాదించాడు. శివసాయుజ్యము పొందుటకు గల ఒకే ఒక మార్గము భక్తియే. వైదిక ధర్మము బోధించు, కర్మమార్గము, క్రతువులను ఆచరించుటవంటి విధానములు

శివసాయుజ్యము పొందుటకు పనికిరావని గట్టిగా వాదించిన బసవేశ్వరుడు, ఇంకా ఆ విషయముపై, తనమీద వత్తిడిచేస్తే, ఇల్లు వదలి పారిపోతానని తండ్రిని బెద రించాడు. ఎంతో నిరాశకు గురైనప్పటికినీ, మాదిరాజ తన ప్రయత్నములు విరమించ దలచ లేదు. ఏదోవిధంగా తల్లి ప్రేమతో, బసవేశ్వరుని మనసు మార్చవలసినదని భార్యకు చెప్పాడు. ఎన్నో రోజులు తన ప్రేమను ప్రదర్శిస్తూ, బ్రతిమాలుతూ, బెదరిస్తూ, చిట్టచివరకు తల్లి ఉపనయన సంస్కారము చేయించుకొనుటకు బసవేశ్వరుని ఒప్పిం చింది. ఎంతో విరక్తితో బసవన్న ఉపనయనము చేయించుకొనుటకు ఒప్పుకొనటం, వెంటనే ఆ సంస్కారమును జరుపుట జరిగినై, మాదిరాజకు అగ్రహారము నందలి తోటి బ్రాహ్మణుల మధ్యన అవమానముపాలు కాకుండా తప్పించుకొనినప్పటికీ, హృదయములోని బాధ తొలగలేదు. బసవేశ్వరుడు, తాను ధరించిన జందెమును, తన శరీరమును చుట్టుకొనిన పాముకవలె భావించసాగాడు. అనంతరము అతనిని మేళతాళాలతో వేదాధ్యయనమునకు గాను గురువు వద్దకు పంపారు. బసవేశ్వరుడు తన అమోఘమైన ప్రజ్ఞతో, జ్ఞాపకశక్తితో వేదములు, వేదాంగములు, షడ్దర్శనములు, వేదాంతము, సాహిత్యము, సంగీతము, శివుని రహస్యముగా ఆరాధించు విధానమును తెల్పు "హర రహస్య" ఆగమాది గ్రంథములనన్నిటినీ, ఆయా శాస్త్రములయందు నిష్ణాతులైన గురువుల వద్ద శీఘ్రకాలములో అభ్యసించి, అధ్యయనమును పూర్తి చేశాడు. పిన్నవయసులోనే, తాను అనేక శాస్త్రములలో సంపాదించు కున్నటువంటి పాండిత్యము, అనంతర కాలములో వీరశైవమత వ్యాప్తికొరకై రచించిన వచనముల లోనూ, జనబాహుళ్యమును ఉద్దేశించి చేసిన ప్రబోధనలలోనూ, చక్కగా ఉప యోగించుకొనటం జరిగింది. వేదములను కంఠస్తముచేసేవారిని హేళన చేస్తూ బసవేశ్వరుడు, తమ మూపుపై మోసుకు వెళుతున్న వస్త్రముల విలువను ఎరుగని గాడిదలతో పోల్చాడు. వేదములు భక్తి మార్గ ప్రబోధకములే గానీ, యజ్ఞయాగాది క్రతు నిర్వహణలు కాదని చెప్పాడు. అనాది నుండి సాంప్రదాయకంగా పెద్దలు బోధించే టటువంటి కర్మ సిద్ధాంతము కేవలమూ, ఒక చమత్కారమని చెప్పాడు. బసవేశ్వరుని జ్ఞాన తృష్ణ, గురువుల వద్ద సంప్రదాయానుసారం నేర్చుకొనిన విద్యలతో తృప్తి చెందినప్పటికీ, ఆతని దృఢ సంకల్పమైన సామాజిక, మతసంస్కరణాభిలాషలు మాత్రం కదలిక లేకుండా నిలిచినాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ బ్రహ్మచారిగా తాను నిత్యమూ ఆచరించవలసిన విధులపట్ల, నైమిత్తిక కర్మలపట్ల, బసవనికి, నిర్లక్ష్యత వృద్ధి చెందసాగింది. ఆ కారణంగా తండ్రీ, కొడుకుల మధ్య వైదిక విధుల నిర్వహణ విషయంలో మనస్పర్ధలు, తగాదాలు ఎక్కువవటం మొదలైంది. అగ్రహారము నందలి బ్రాహ్మణులు, బడుగు వర్గములవారినీ, అంటరానివారినీ హీనంగా చూడటం, వారిపట్ల అమానుషంగా ప్రవర్తించటం సహించలేని బసవేశ్వరుడు, బాధితులకు అండగా అసమ్మతి ప్రదర్శనలను నిర్వహించేవాడు. బ్రాహ్మణులు పాటిస్తున్న ఆచార, వ్యవహారములు, కొన్ని సంప్రదాయములనూ బహిరంగంగా విమర్శించేవాడు. అటువంటి ఆచరణలు, వేదవిరుద్ధములనీ, వివేచనా రహితములనీ ప్రచారము చేసేవాడు.

సమాజంలో అనాదిగా పాటిస్తున్న ఆచార వ్యవహారములను, సంప్రదాయములను అతి హీనంగా విమర్శించటంపట్ల, తన కులస్థులేగాక ఇతర అగ్రవర్ణముల వారికి కూడా బసవన్నపట్ల ఆగ్రహము కలిగింది. రానురానూ బసవన్నకూ ఇతర అగ్రకులముల వారి మధ్య ఏర్పడిన వైషమ్యములు పెచ్చుపెరిగి, సమన్వయమునకు అసాధ్యమైనవి. బసవేశ్వరుడు తన తోటి కులస్థులపట్ల ప్రదర్శిస్తున్న ద్వేషభావమూ; ఇతర కులస్థులను, తమ సామాజిక, మతపరమైన హక్కులకై పోరాడమని ప్రోత్సహించటమూ, అగ్రహారము లోనివారు సహించలేని పరిస్థితులను సృష్టించినై. అతడు తన తల్లితండ్రులకూ, తన కులస్థులకే గాక, ఇతర అగ్రవర్ణముల వారికి కూడా మనస్తాపము కలిగించాడు. తల్లితండ్రులు అనుభవిస్తున్న మనోవ్యధను కించిత్తుకూడా ఆతను పట్టించుకోలేదు. రాజీధోరణిని పాటించుటకూ మొండిగా కాదనేవాడు. చిరకాలంగా కొనసాగుతున్న ఈ దుర్భర పరిస్థితులనుండి, తన జీవితపరమార్ధంగా భావిస్తున్న సంఘ సంస్కరణను నిర్వర్తించ వలెనంటే, బసవేశ్వరునకు, తన తల్లితండ్రులను, తన తోటి వారిని తను పుట్టిన ఊరును విడచి వెళ్ళిపోవుట మినహా మరో మార్గము కనిపించలేదు. అప్పటికి బసవని వయస్సు పదహారేండ్లు. మరికొద్దికాలమునకే, ఆయన తల్లితండ్రులు మనోవ్యధతో చనిపోయారు. అతనిని చూచుకొనటానికి వృద్ధురాలైన నాయనమ్మ వినాఎవరూ లేరు. అగ్రహారములలోని బ్రాహ్మణులు అతనిని తిరుగుబాటుదారునిగా ప్రకటించి, కులమునుండి వెలివేశారు. వైదిక ధర్మములు, సాంప్రదాయములపైన ఆతడు చేస్తున్న తీవ్ర విమర్శలకు

అగ్రహారోపేతులైన, అగ్రహారీకులు, తల్లితండ్రులను కోల్పోగానే బసవనిపై కొరడాలు ఝుళింపసాగారు. ద్వేషభావంతో వారు బసవనికి కలిగిన, దీనావస్థను చూచి జాలి పడకపోగా, తీవ్రమైన పదజాలంతో ఆయనను దూషించసాగారు. వాటినన్నిటినీ భరించలేని బసవేశ్వరుడు గ్రామం వదలి వెళ్ళాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. తనకూ, తన బ్రాహ్మణత్వమునకూ మధ్య బాంధవ్యముగా ఉన్న యజ్ఞోపవీతమును త్రుంచి పారవేశాడు. తద్వారా తన గతజీవితమునకు చరమ గీతంపాడాడు. ఆ విధంగా గతంతో తెగతెంపులు చేసుకొనటం ద్వారా తాను, సుదీర్ఘకాలంగా అభిలషి స్తున్న సంఘ సంస్కరణ ఉద్యమమునకు నాంది పలికాడు. తాను నమ్మిన ఆశయము లను ప్రచారము చేయగల స్వాతంత్ర్యమును సంపాదించుకున్నాడు. ఇటువంటి చర్యల ద్వారా అగ్రవర్ణముల ఆగ్రహమునకు గురియైన బసవేశ్వరుణ్ణి, తాను పుట్టిన ఊరును విడచి పారిపోయేటట్లు ఒత్తిడి చేశారు. బసవేశ్వరుడు అక్కగారైన అక్క నాగమ్మను వెంటబెట్టుకొని అగ్రహారమును విడచి, కప్పడి సంగమేశ్వరము లేక కూడలి సంగమమనే మాలప్రభ, కృష్ణానదుల సంగమ స్థలివద్ద బిజాపూర్ జిల్లాలోగల గ్రామమును చేరుకున్నాడు. ఆ గ్రామములో ఒక శివాలయం ఉన్నది. ఆ దేవుని పేరు కూడలి సంగమేశ్వరుడు. ఆ గ్రామము శివభక్తులకు, యతులకు, హిందువు లందరికీ తీర్థ స్థలము. ఆ కాలంలో ఆయన ప్రఖ్యాతి పొందిన దేవుడు. చిన్నతనము నుంచి సంగమేశ్వరుని మహిమలను విన్న బసవన్నకూ ఆయనను దర్శించాలానీ, ఆరాధించవలననే కుతూహలముండేది. బసవేశ్వరుడు ఆ గ్రామము చేరకముందే ఆయన యొక్క శివభక్తిని గురించి ఆ గ్రామ ప్రజలు వినియుండుటచేత మేళతాళము లతో ఆయనను ఆహ్వానించి, ఎంతో గౌరవ మర్యాదలను ప్రదర్శించారు. గ్రామ ప్రవేశం చేసిన బసవన్న, భావోద్రేకమునకులోనై, అత్యంత భక్తి ప్రపత్తులతో, ఆనం దము ముఖములో తాండవిస్తుండగా, కండ్లనుండి ఆనందభాష్పములు చెక్కిళ్ళపై జారుతుండగా, చేతులుజోడించి, శివస్తోత్రములను ఆశువుగా చదువుతూ దేవాలయము లోనికి ప్రవేశించి సంగమేశ్వరుని దర్శించుకున్నాడు. "త్వమేవ మాతాశ్చ, పితాత్వ మేవ.....త్వమేవ సర్వం మమదేవదేవ" అని కీర్తిస్తూ, స్వామీ! నీ అనుగ్రహము కొరకు ఈ ప్రపంచంలోని అన్నింటినీ త్యజిస్తాను. ఈ పాపపు ప్రపంచము నుండి పారిపోయివచ్చి నీ శరణు కోరుతున్నాను. నీ పాదముల చెంత ఆశ్రయము ఇమ్ము

తం(డ్రీ! అని ఆర్తితో మొరపెట్టుకున్నాడు. తన జీవితమును పగిలిన నావతో పోల్చు కొని, చిట్ట చివరకు గమ్యస్థాన మైన భగవంతుని పాదసన్నిధికి చేరినందుకు సంతోషం వ్యక్తం చేశాడు. ఆయన పాదముల చెంత తనకు దుఃఖోపశమనము చేయమని ప్రార్థించాడు.

క్రీ.శ. పదిహేనవ శతాబ్దికి చెందిన ఓరుగల్లు వద్దగల పాలకుర్తిగ్రామ వాసి యైన పాలకుర్తి సోమనాథుడనే ఆరాధ్య బ్రాహ్మణుడు ద్విపద ఛందస్సులో వ్రాసిన బసవేశ్వరుని జీవిత చరిత్ర "బసవ పురాణము"ను బట్టి, బసవన్న భక్తిని మెచ్చి, కూడలి సంగమేశ్వరుడు ప్రత్యక్షమై, ఆయన శివభక్తిని ప్రశంసించి, దృఢమైన విశ్వాసంతో, తాను నమ్మిన మార్గము ననే పురోగమించవలసినదని ప్రోత్సహించి నాడట. తన మతమును జన బాహుళ్యములో విస్తృతంగా ప్రచారముచేసి, వారికి ముక్తి కలుగునట్లు చేయవలసినదని శివుడు బసవేశ్వరుని ఆజ్ఞాపించినాడట. తనకు ప్రబల శత్రువైనప్పటికీ, శివభక్తుని స్నేహితునిగా భావించి, గౌరవించవలెనని ఆదేశించినాడట. శివారాధన చేయనటువంటి అన్యులతో, బసవేశ్వరుడు ఎటువంటి సంబంధములు పెట్టుకొనగూడదని శాసించాడట. ప్రతి జంగమునూ, శివ స్వరూ పముగానూ, చలనముగల శివునిగా ఆరాధించవలెనని నిర్దేశించినాడట.

కూడలి సంగమేశ్వర దేవాలయమునకు స్థానాపతియైన, ఈశాన్య గురు దేవాలయ ప్రాంగణములోనే నివసించేవాడు. ఆయన ఒకనాడు బసవేశ్వరుడు, శివునిపైగల భక్తిని ప్రదర్శించుట చూచి ముగ్ధుడై, బసవన్న పడిన కష్టములను విచారించి, ఓదార్చి, దేవాలయ ప్రాంగణములోనే నివసించుచూ, తాను చేయగల సేవలను భగవంతుడైన శివునికి చేయవలసినదని కోరాడు. బసవేశ్వరుడు ఎంతో సంతోషముతో స్థానపతి కోరికను అంగీకరించి, కృతజ్ఞతలు తెల్పుకున్నాడు. శివార్చ నకు నిత్యమూ కావలసిన సంభారములను సమకూర్చు బాధ్యతను స్వీకరించి, త్రికరణశుద్ధిగ భగవత్సేవలో నిమగ్నుడైనాడు. దేవాలయమే అతని జీవిత సర్వస్వమె నది. కూడలి సంగమేశ్వరుని కీర్తిస్తూ ఆశువుగా, అనేక కీర్తనలను ప్రతిరోజూ దేవా లయమునందు గానము చేసెడివాడువాడు. వాటికి "వచనములు" అని పేరు. ఆ వచనరచనలు చంపూ ఛందస్సులో, యక్షగానములలోని, కథాక్రమములవలె నుండి, చివర పాదమున సంగమేశ్వరుని కీర్తిస్తూ ముగుస్తుంది. అటువంటి వచనములను

1400కు పైగా బసవేశ్వరుడు కూర్చినట్లున్నూ, ప్రాచీన తాళపత్ర గ్రంథ పరిశీలన, పరిశోధన వల్ల ప్రతి సంవత్సరమూ మరిన్ని క్రొత్త రచనలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ రచనలలో బసవేశ్వరుడు తన స్వామియైన సంగమేశ్వరుని ప్రార్థించుట, అర్థించుట, విలపించుట, బెదరించుట, హేళన చేయుట, ప్రేమానురాగాలను ప్రదర్శించుట వంటి అనేక విధములైన భావ పరంపరను, స్వామి తనముందు నిల్చుని వింటున్నట్లుగా భావించి ప్రదర్శించెడివాడు, తాదాత్మ్యత చెందేవాడు. బసవేశ్వరుని భక్తి భావ ప్రదర్శనలను నిత్యమూ తిలకించిన స్థానాపతీ, ఆ గ్రామ ప్రజలూ ఎంతో ఆనందభరితులై, ఆయన భక్తిని ఎంతో మెచ్చుకుంటూ, ఎక్కువ సంఖ్యలో బసవేశ్వరుని చుట్టూ చేరి, ఆయన సంకీర్తనలుగా పాడుతున్న వచనములను, అన్నింటినీ తమకు కూడా నేర్పవలసిందని ప్రార్థించారు. బసవేశ్వరుడు వారి కోరికను మన్నించి, వారికి అనేక వచనములు నేర్పటముతోపాటు, నిత్యమూ భజన కార్యక్రమమును కూడా ఏర్పాటు చేసేవాడు. బసవని పేరు ప్రఖ్యాతులు నలుదిశలా వ్యాపించినై. ఆయన ప్రవచనములు వినటానికీ, భజనలలో పాల్గొనటానికి, అశేష ప్రజానీకం రావటం ప్రారంభించారు. పర్వ దినములలో భక్తులు అధిక సంఖ్యలో భజన కార్యక్రమముల లోనూ, శివారాధన కార్యక్రమములలోనూ, పాల్గొని మిన్నుముట్టేట్లు సంకీర్తనములు చేసేవారు. ఆ విధంగా వీరశైవమునకు కాబోయే ప్రవక్త, మధ్యయుగములో హిందూ సమాజ సంస్కరణకు నడుము బిగించిన మహనీయుని, ధ్యేయ సాధనకు మార్గము సుగమమైనది.

తన ప్రవచనములు వినటానికీ, తన మత విశ్వాసములను అనుసరించుటకూ, గ్రామగ్రామాన పెద్ద సంఖ్యలలో ప్రజలు ముందుకు రావటం గమనించిన, బసవేశ్వరునిలో ఆత్మవిశ్వాసం పెల్లుబికి, భక్తి మార్గముపై ఆయనకున్న విశ్వాసము మరింత బలపడింది. మొదట్లో తాను సంగమేశ్వరుని సేవలుచేస్తూ, అదే గ్రామంలో స్థిరపడిపోవాలని వాంఛించినవాడు, తానొక గొప్ప మతప్రవక్త, సంఘసంస్కర్త కావాలనే ఆకాంక్ష ద్విగుణీ కృతంకాగా, మనసు మార్చుకొని, ఆ గ్రామమును వదలిపెట్టి వేశాడు. బసవని ఈ నిర్ణయమునకు కారణంగా ప్రచారములో ఉన్న గాధ ఏమంటే, కూడలి సంగమేశ్వరుడు కలలో కన్పించి బసవన్నను మంగళవేధి అనే గ్రామమునకు వెళ్ళవలసినదిగా ఆజ్ఞాపించాడని, మంగళవేది అనే నగరము, ప్రస్తుతము మహా

రాష్ట్రములోని షోలాపూర్ జిల్లాలో ఉన్నది. ఆ కాలములో, ఆ నగరము కల్యాణి చాళుక్యుల, సామంతుడు, కాలచూరి వంశస్థుడైన, బిజ్జిలుడనే రాజుయొక్క ముఖ్యపట్టణం. అతడు మహామండలేశ్వరుడైన తన తండ్రికి వారసుడుగా తాను ఆ పదవిని అలంకరించాడు.

కల్యాణి చాళుక్య ప్రభువైన మూడవ తైలపుడు వయసులో చిన్నవాడు, పరిపాలన వ్యవహారముల యందు అనుభవము లేనివాడు అవటంచేత, బిజ్జిలుడు, అతనిని నామమాత్రపు ప్రభువుగాచేసి, తాను అధికారమును చలాయిస్తూ, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొని, నమ్మకద్రోహమాచరించి, క్రీ.శ. 1162లో తైలపుని రాజ్య భ్రష్టునిచేసి సింహాసనము తాను ఆక్రమించాడు.

బిజ్జలుడు మహామండలేశ్వర పదవిలో ఉన్నప్పుడే, బసవేశ్వరుడు మంగళవేధికి చేరాడు. కేవలము శివభక్తుడే గాక, గణితశాస్త్రములలో ముఖ్యంగా ఆదాయ వ్యయములకు సంబంధించిన లెక్కలలో ప్రవీణుడు. ఈ విషయముపై ప్రచారములో నున్న ఒక కథ ప్రకారం, మంగళవేధికి వచ్చిన బసవేశ్వరుడు నేరుగా బిజ్జలుని కోశాగారంలోకి వెళ్ళాడట. ఆ సందర్భములో అక్కడున్న జమాఖర్చులు వ్రాసే గుమాస్తాలు, బొక్కసాధికారులు, లెక్కలను సరిచూసుకుంటున్నారట. అప్పుడు కోశాగార ముఖ్యాధికారి, తన గుమాస్తాలతో వచ్చి జమాఖర్చుల లెక్కలను, తనిఖీచేయగా, జమాఖర్చులలో తేడాతోపాటు, ధనంలో పెద్ద మొత్తంలోటు కనిపించిందట. ఎంతో మంది, ఎంతకాలము, తిరిగితిరిగి లెక్కలను పరిశీలించినప్పటికీ తప్పు ఎక్కడ ఉన్నదో కనుగొనలేకపోయారట. దానితో లెక్క సరిగా లేకపోవుటకు, ధనలోటునకూ, రాజదండన తప్పదని అధికారులు భయపడుతున్నారట. సమీపములో నిలబడి వారి చర్యలను జాగ్రత్తగా గమనిస్తున్న బసవేశ్వరుడు, కల్పించుకొని, లెక్కలను స్వయముగా తనిఖీచేసి, తప్పును కనిపెట్టి వారికి చూపాడట. లెక్కలు సరిపోవటంతో, అక్కడనే ఉన్న కోశాధికారియైన సిద్ధదండనాధుడు బసవని తెలివితేటలకు సంతోషించి, ఆయనను గురించి వివరములు అడిగాడట. వివరములు తెలుసుకొనిన అనంతరము బసవన్న తమ బంధువేనని గ్రహించి, వెంటనే ఆయనను ఆదాయ, వ్యయ లెక్కలకు సంబంధించిన అధికారిగా నియమించాడట. బసవేశ్వరుడు తన

ప్రజ్ఞాపాటవములను, శారీరక శ్రమను ఉపయోగించి, అనతి కాలములోనే సిద్ధదండనాథునియొక్క అభిమానమును, విశ్వాసమును పొందగలిగాడు. రాజునకు కూడా బసవేశ్వరుని తెలివి తేటలు, పనియందుగల శ్రద్ధాసక్తులు నచ్చటం వల్ల, ఆయనఅభిమానముకూడా పొందగలిగినాడు. కాలక్రమేణ బసవేశ్వరుడు ధనవంతుడైనాడు. ధనముతో పాటు, రాజాభిమానము, అధికారము, పలుకుబడి, సర్వసుఖములు ఒనగూడినవి. అట్లేర్పడిన సిరిసంపదలను, బసవన్న తన సహ చరులు, అనుయాయిలతోనూ, పేదవారితోనూ, పంచుకోవాలని సంకల్పించాడు. ఇంతలో బంధువు కోశాధికారియైన సిద్ధదండ నాథుడు కాలంచేశాడు. ఆ పదవికి ఖాళీ ఏర్పడటంవల్ల, బసవేశ్వరునిపై అభిమానమును పెంచుకున్న బిజ్జలుడు ఆ పదవిలో బసవన్నను నియమించి, దండ నాయకుడనే బిరుదుతో సత్కరించాడు.

పదవోన్నతిని అంగీకరించుటకు ముందుగా బసవేశ్వరుడు షరతులు విధించాడనీ, ఆ ప్రకారం బిజ్జలుడు, తన జైనమతమును విడనాడి శివభక్తుడగుటకు సమ్మతించవలెనని బసవపురాణం తెలియజేస్తున్నది. అయితే ఆ షరతులను బిజ్జలుడు అంగీకరించిందీ, లేనిదీ స్పష్టంగా తెలియలేదు. ఏమైనప్పటికీ బసవేశ్వరుడు మంచి యౌవన ప్రాయంలో పదౌన్నత్యమునూ, అధికారమును, సిరిసంపదలను పొందగలిగి నాడు. సిద్ధదండనాథుని మరణానంతరం ఆయన కుమార్తెలైన గంగాదేవినీ, మాయా దేవీ లేక నీలలోచని అని పిలువబడే ఇద్దరినీ బసవన్న వివాహము చేసికొన్నాడు.

జైన సాహిత్యంలో, బసవేశ్వరుడు తన రెండవ సహోదరియైన పద్మావతిని బిజ్జలునికిచ్చి వివాహము చేయుటద్వారా, తన బాంధవ్యమును బలపరచుకున్నట్లు తెలుస్తుంది. బసవన్న బాల్యంలో తాను సన్యాసిగా జీవితం గడపవలెనని ఉద్దేశించి నప్పటికీ, వివాహవయస్సు వచ్చేటప్పటికి, మానసిక పరిపక్వతను పొంది, మొదట్లో ఉన్న ఉద్దేశ్యమును మార్చుకున్నాడు. మరో కారణంకూడా ఉండి ఉండవచ్చును. అదేమంటే జైనులు, బౌద్ధులు కూడా సన్యాస స్వీకరణ ద్వారానే, జన్మరాహిత్యమును పొందగలమనే బోధనను, వ్యతిరేకించుటయే. తన వివాహానంతరము కూర్చిన కొన్ని వచనములలో వైవాహిక వ్యవస్థను ప్రశంసించటం జరిగింది. అంతేకాక శారీరక వాంఛలను అణచి పెట్టడంవల్ల జీవితంలో అనేక రకములైన సమస్యలకు దారి తీయగలవని హెచ్చరించాడు.

బసవేశ్వరుని వైవాహిక జీవితము ఎంతో హాయిగా గడిచేది. అతని భార్యలు ఇద్దరూ చదువుకున్న సంస్కారవంతులు. అతని ప్రయత్నములు అన్నింటిలోనూ పరిపూర్ణమైన సహకారములు అందించేవారు. ఆయన భార్యలు ఇద్దరూ, సహోదరి అక్కనాగమ్మ కలిసి, ఇంటి వ్యవహారములు అన్నింటినీ చక్కదిద్దేవారు. ఆయన ఇల్లు మతపరమైన, కార్యాచరణలకు కేంద్రబిందువై, ఎల్లవేళల వచ్చిపోయే, అతిథి అభ్యాగతులతో, శివభక్తు లతో, తేనెతుట్టెవలె సందడిగా ఉండేది. ఈ అవకాశమును ఉపయోగించుకొని బసవేశ్వరుడు శైవములో, నూతన సిద్ధాంతంగా వీరశైవ ప్రచారము ప్రారంభించాడు. వీరశైవమనే పదమునకు భాషారీత్యా అర్థము వీరావేశంతో శివుని ఆరాధించుట.

సందర్భము వచ్చింది కనుక ఇక్కడ శైవమతమును గురించి, అందలి శాఖలను గురించి, వాటిని ప్రచారముచేసిన శైవాచార్యులను గురించి ముఖ్యంగా ఆంధ్ర దేశములో తెలుగువారైన శివగురువులను గురించి కొంత చెప్పవలసివచ్చింది. ప్రపంచములోని అత్యంత ప్రాచీనమైన మతములలో శైవము మొదటిది. చరిత్రకందని రోజులలోనే, శైవము తూర్పు ఐరోపా ఖండములోనూ, పశ్చిమ, మధ్య దక్షిణ ఆసియా దేశములలోనూ వ్యాపించి, అనుసరించబడినదని చెప్పటానికి ఆయా దేశములలోని, చారిత్రక అవశేషములే సాక్షులు. సింధూనదీ లోయలోని త్రవ్వకాలలో అనేక జంతువుల మధ్యన, లింగాకారపు అవశేషములు లభించినవి. ఆయనను పశుపతి అని గుర్తించారు. శివ నామములలో ఆ పేరొకటి. అయితే వేదములలో మనము ఈనాడు లింగమును శివుడనీ, శంకరుడనీ పిలుస్తున్న పేర్లు లేవు. వేదములలో ఆయనను రుద్రుడనే పిలిచారు. ఋగ్ వేదములోని వంశీయ మండలమునందు, శివుని రుద్రుడని స్తుతిస్తూ ఆయన ఉనికిని స్థిరపరచినారు. అభిషేక సమయములో పఠించు మహాన్యాసము, నమక చమకములే వేదములయందలి రుద్రసంహితలు. వేదముల యందలి రుద్రమంత్రములు, వివిధవిధములైన పూజా విధానము లను ఆధారంగా చేసుకొని, శైవమతమునందు అనేక శాఖలు ఏర్పడినై. వీటికి తగినట్లు ఆగమ శాఖలు ఉద్భవించినై. శైవమునందు ముఖ్యంగా గుర్తింపు పొందిన శాఖలు పాశుపతులు, కాలాముఖులు, కాపాలికులు, లకులీయులు తరువాతి కాలములో తంత్ర విద్యలుకూడా ప్రవేశపెట్టబడినై. ఆయాశాఖల ఆచార్యులు ప్రచారమునకై క్రీ.శ.

ఒకటవ శతాబ్దములో ఆంధ్రదేశములోనికి, చాళుక్యుల పరిపాలనా కాలంలో ప్రవేశించినట్లు తెలుస్తున్నది. అయితే శివలింగ పూజ ఆంధ్రదేశము నందు ఇతఃపూర్వమే, శాతవాహన పరిపాలనకు ముందుగానే, ఆంధ్ర జనపదవాసులైన నాగులు, యక్షులు వంటి ఆదివాసులచే జరుపబడుచుండేదని చెప్పుటకు సాక్ష్యంగా చిత్తూరు జిల్లాలోని క్రీ.పూ. 200 సంవత్సరములకు చెందినదిగా భావింపబడుతున్న గుడిమల్లము గ్రామములో నెలకొనియున్న శివలింగము. అంతేకాక శాతవాహన రాజులలో కొంత మందికి శివపరమైన, శివస్కందుడు, శివశ్రీ వంటి పేర్లు ఉండుట కూడా, శివపూజ అనాదిగా ఆంధ్ర దేశమున జరిగేదని గట్టిగా చెప్పటానికి ముఖ్య ఆధారములు. కాపాలికశాఖకు చెందిన శైవులు, శివుని వామాచార పద్ధతిలో, భైరవునిగాను, శక్తిని భైరవిగాను ఆరాధించేవారు. ఇతర శాఖలవారు దక్షిణాచార పద్ధతిలో వేదహితమైన, ఆగమశాస్త్రాను సారము ఆరాధించేవారు. లౌలీలక, కాలముఖ శాఖలు ఆంధ్ర దేశములో మిక్కిలి ప్రాచుర్యత పొంది, ఆ శాఖలకు చెందిన ఆచార్యులు, స్థానాపతులై, రాజులచేతను సంపన్నులచేతను సత్కారములు పొంది శివపురములని పిలువబడిన అగ్రహారములను సంపాదించారు.

శైవ సిద్ధాంతము (శివభక్తి మార్గము) నాధారముగా చేసుకొని ద్రవిడ దేశంలో (తమిళనాడు) 63 నయనార్ల ప్రచారమువల్ల ఆ దేశములో శైవము చాలా అభివృద్ధి చెందింది. అందుకు తగినట్లు తమిళ దేశములోని చోళరాజులు, వారితో బాంధవ్యము గల తూర్పు చాళుక్యులు (ఆంధ్ర దేశములోని వేంగీ చాళుక్యులు) సాంఘిక, రాజకీయ ఒత్తిడులకు లోనై, పై రెండు దేశములలోనూ శైవమత వ్యాప్తిని ప్రోత్సహించారు.

శివతత్త్వమును వివరిస్తూ 28 శైవాగమములు వెలువడినవి. "సుఖాగమమ' 'నే ఆగమము, శైవులను వారి వారి కులములను బట్టే, ఆచార వ్యవహారములను బట్టీ విభజించినది. కులములను అనుసరించి చేసిన విభజన ప్రకారము అనాది శైవులనీ, ఆదిశైవులనీ, మహాశైవులనే పేర్లతో మొత్తం ఏడు విధములుగా విభజించుట జరిగింది. సాంప్రదాయములను అనుసరించి సామాన్య శైవమనీ, మిశ్ర శైవమనీ, శుద్ధ శైవమనీ, వీర శైవమనీ నాలుగు విధములుగా విభజింపబడినది. వీర శైవము తిరిగి మూడు ఉప శాఖలుగా విభజింపబడినది. అవి సామాన్య వీరశైవము, విశేష వీర శైవము, నిర్జన వీర శైవము.

సామాన్య వీరశైవారాధకుడు, ముఖమున దేహముపైన విభూతిని ధరించి, రుద్రాక్షమాలను మెడయందు, శిరసుచుట్టూ ధరించి గురువు బోధించిన ప్రకారము శివార్చన చేస్తాడు. విశేష వీరశైవుడు భావోద్రేకంతో తన ఆత్మయే లింగముగా విశ్వసించి, అత్యంత భక్తి శ్రద్ధలతో వీరమాహేశ్వరుని అర్చిస్తాడు. తన అరచేతియందు శివలింగము నుంచుకుని షోడశోపచార పూజ చేస్తాడు. అనంతరము దానిని చిన్న పేటికలో నుంచుకొని తన మెడకు తగిలించుకుంటాడు. పగటిపూట మూడుసార్లు రాత్రివేళ మూడుసార్లు శివార్చన చేస్తాడు. దానిని షట్కాలపూజ అంటారు. తన గోత్రము శివగోత్రమని చెప్పుకుంటాడు. పార్వతీ, పరమేశ్వరులే తన తల్లితండ్రులని చెప్తాడు. ప్రతి నిత్యమూ ఇద్దరు, ముగ్గురు జంగములకైనా ఆతిథ్యమునిచ్చి, అనంతరము శివ ప్రసాదమును తానుభుజిస్తాడు. తనను, తన కుటుంబాన్నీ సిరి సంపదలనూ, తన సర్వస్వమునూ శివుని కొరకై, తన గురువు కొరకై, తాను నమ్మిన వీరశైవమతమునకై, త్యాగము చేయటానికి సిద్ధపడతాడు. ఏ కారణము వలనైనా, తాను ధరించిన లింగమును పోగొట్టుకున్నట్లయితే శుద్ధ శైవంలోవలే వేరే మరొక లింగమును కట్టుకొనటానికి వీలులేదు. కారణం పోగొట్టు కొనిన లింగము ప్రాణ లింగము. దీక్షానంతరము, గురువుచేత ఈయబడినది కాబట్టి, దీక్ష ఎవరికీ రెండు సార్లు ఇవ్వటం నిషిద్ధం. అటువంటి క్లిష్టమైన ఆచారములను పాటించ వలసి ఉన్నది కాబట్టి దానిని విశేష వీరశైమమన్నారు. నిర్భవ వీరశైవము ఒక విధమైన సన్యాసమువలె ఉంటుంది. ఈ శాఖయందలి శివభక్తుడు కేశములను బారుగా పెంచి, జడలు కట్టిన ఆ కేశములను నడినెత్తిన ఒక చుట్టుగా ధరిస్తాడు. ఒడలనిండా బూడిద పూసుకుంటాడు. గోచీ మాత్రమే ధరిస్తాడు. చేతులలో దండము, కమండలము పట్టుకొని సంచరిస్తాడు. అతడు భయరహితుడు, అరిషడ్వర్గములకు అతీతుడు, మౌనంగా అన్ని ప్రాణులపట్ల దయగలిగి ప్రవర్తిస్తాడు. అతడొక యోగి. యోగీశ్వరుడు శివుడు. జంగమయుడైన మాహేశ్వరుడు. శివుని షోడశోప చారములతో పూజిస్తాడు. తన ఆహారము కొరకై బిచ్చమెత్తుతాడు. తను తినగా మిగిలినది ఇతరులకు పంచిపెట్టితీరాలి. శివజ్ఞానము, శివభక్తి, శివముద్ర, శివవ్రత, శివ లింగార్చన కలిగి ఉండవలె. వీర శైవమును శక్తి విశిష్టాద్వైతమని కూడా పిలుస్తారు. జీవుడు శక్తికి అనుసారిగా ఉంటాడు. శక్తి సర్వదా శివునితో ఐక్యత చెంది ఉంటుంది.

ఆ విధంగా జీవుడు, శక్తి తోనూ శక్తి శివునితోనూ అనుసంధింపబడి ఉండుటవలన వీరశైవమునకు శక్తి విశిష్టాద్వైతమనే పేరు ఏర్పడింది.

వీరశైవులు శివార్చనా విధానమును బట్టి, ఆచార వ్యవహారములలో పాటించు ప్రాంతీయ భేదములను బట్టి; వీరశైవసిద్ధాంతములోని సూత్రములను అన్వయించుటలో ఏర్పడిన విభేదములను అనుసరించి; ఆరువర్గములుగా విభజింపబడినారు. వీరి శివార్చనా విధానమును "స్థలి" అని పిలుస్తారు. అంటే పరమశివ బ్రహ్మమని అర్థం. దీనిని తిరిగి ఆరు విధములుగా విభజించారు. గ్రంథ విస్తరణ భీతిచేత, విస్తృతమైన వివరణలను నిల్పివేసి, క్లుప్తంగా చెప్పాలంటే వీరశైవము, భక్తి శ్రద్ధలతో శివుని అర్చించవలెననీ, ఆతడే ముక్తిప్రదాతయని బోధిస్తుంది. శివలింగమును సర్వకాల సర్వావస్థలయందు తన దేహముపై నుంచుకుని, శివాగమములలో నిర్దేశించినట్లు, శివారాధన చేస్తూ ఉండాలి. మెడకు వ్రేలాడుతున్న పేటికను బట్టి వీరశైవుని తేలికగానే గుర్తించవచ్చు.

వీరశైవము ఆంధ్రదేశములో ప్రవేశించేనాటికి, అంటే క్రీ.శ. 11,12 శతాబ్దముల కాలంనాటికి బౌద్ధ, జైన మతముల ప్రాబల్యము సన్నగిల్లింది. ఆనాటి వరకూ మహోన్నత స్థితిని అనుభవించిన పై రెండు నాస్థిక మతములపట్ల అనేక సామాజిక మత, రాజకీయ కారణములవల్ల ప్రజలకూ, తదనుగుణంగా రాజులకూ, ఏవగింపు కలిగి, ఆస్థికత్వమువైపు పరుగులు తీయటం ప్రారంభించారు. ఆ పరిస్థితులను అవకాశముగా తీసుకొని, వివిధ శాఖలకు చెందిన శివాచార్యులు, ఆంధ్ర దేశములో విస్తృతంగా పర్యటించి, అవకాశము దొరకినచోటెల్లా పీఠములు లేక మఠములు స్థాపించి, ఆవేశపూరితమైన ప్రవచనములతో, ప్రజలను, నాస్థిక మతములను, వైదిక సంప్రదాయములను కూడ వదలి, శైవమతస్థులు కావలసిందని ప్రబోధించారు. ఆ విధమైన మతప్రచారము జరుగుతున్న తరుణంలో ఆంధ్ర దేశములోనికి వీరశైవము ప్రవేశించింది. బసవేశ్వరుడే ఈ మతస్థాపకుడని కొందరంటే; కాదు, ఆయన కేవలమూ ఆ మతమును, పునరోద్ధరణ చేశాడని కొందరంటారు. ఇతఃపూర్వమే ఆచరణలో ఉండి. మరుగుపడిన ఆచార వ్యవహారములను, పూజా విధానమును, ఇతర సంప్రదాయములనూ, కాలానుగుణంగా మార్చి వాటినన్నిటినీ క్రమబద్ధీకరించాడని చెప్పారు. శైవాగమములు ఏవీ వీరశైవమత స్థాపన ఎప్పుడు జరిగిందో,

ఇదమిద్ధంగా చెప్పలేదు. ఏ ఒక్క వ్యక్తీ, ఆ శైవ శాఖను నిర్దిష్టమైన సంవత్సరమునందు స్థాపించలేదనీ, శివుని పంచముఖములనుండి జన్మించిన పంచాచార్యులు, వివిధ యుగములయందు, వీరశైవమత వ్యాప్తి చేశారనీ ఆ శాఖీయులలో కొందరంటారు. శైవాగమములలో, ఆ ఆచార్యుల పేర్లు. వారు ఏ ఏ యుగములలో జన్మించి, శైవ మత ప్రచారము చేశారో, ఆ వివరములు పొందుపరచబడినై. వారిలో ఆంధ్ర దేశ ములో జన్మించి, వీరశైవమత ప్రచారము చేసిన ప్రముఖులు 12 మంది.

వారిని 1. సిద్ధత్రయము; 2. పండిత త్రయము; 3. ఆచార్య త్రయము; 4. ఆరాధ్య త్రయమని పిలుస్తారు.

1. **సిద్ధ త్రయము :** రేవణసిద్ధ, మరుసిద్ధ, ఏకోరామసిద్ధ.
2. **పండిత త్రయము :** శ్రీపతి పండిత, మల్లిఖార్జున పండిత, శివలెంక మంచన పండితుడు.
3. **ఆచార్య త్రయము :** నీలకంఠాచార్యులు, హరదత్తాచార్యులు, ముదిగొండ వీరభద్రాచార్యులు.
4. **ఆరాధ్య త్రయము :** ఉద్భటారాధ్య వేమనారాధ్య, విశ్వారాధ్య. వీరందరూ వేంగి దేశములో, తూర్పు చాళుక్యుల పరిపాలనా కాలంలో తమ మఠములను స్థాపించి, వీరశైవమత ప్రచారమును కొనసాగించినారు. శైవాగమములలో వీరికి అతిప్రాచీనత, అంటగట్టినప్పటికీ, చారిత్రాత్మకంగా వారు అంత ప్రాచీనులు కారు. ఉదాహరణకు రేవణ, చంద్రమౌళీశ్వర లింగమును క్రీ.శ. 1330 వ సంవత్సరమున విద్యారణ్యులకు ఇచ్చినట్లు అది శృంగేరి పీఠము నందు ప్రతిష్ఠింపబడినట్లు, "కేలడినృపవిజయమనే" గ్రంథము ద్వారా తెలు స్తున్నది. అదే విధంగా మల్లిఖార్జున పండితారాధ్యుడు ద్రాక్షారామము (తూ.గో. జిల్లా)లో జన్మించినట్లు. బసవేశ్వరునికి సమకాలీనుడని చరిత్రతెలియ జేస్తున్నది.

పైన వివరించిన, నేపథ్యమును పరిశీలిస్తే, బసవేశ్వరుడు వీరశైవమత స్థాపకుడుగా కాక, ఆ మతమును పునరుద్ధరించి, క్రమబద్ధీకరించి, ఆవేశపూరితమైన ప్రవచనముల ద్వారా ప్రజాబాహుళ్యములో ముఖ్యంగా బడుగువర్గాలలో విస్తృతంగా ప్రచారముచేసినవాని గానే భావించవలసి ఉంటుంది. ఆయన జీవిత కాలములోనే వీరశైవము, కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర దేశములందు బాగా ప్రేళ్లూనుకుంది. మత వ్యాప్తిలో తాను చేపట్టిన విధానము ఎటువంటిదైననూ, ధ్యేయ సాధనమునకే

ప్రాధాన్యతనిచ్చాడు. చతురోపాయములను ఉపయోగించి, ఆయన వీరశైవవ్యాప్తికి అత్యంతమైన కృషి సల్పాడు.

బసవని అనుచరులను “లింగాయతులు” అని పిలుస్తారు. ఆంధ్ర దేశములో వారిని జంగములు, లింగబలిజెలని కూడా అంటారు. వారు ఎల్లప్పుడూ లింగమును ధరించి ఉంటారు కాబట్టి వారికి ఆ పేర్లు ఏర్పడినవి. వారు చనిపోతే వారి మెడకు వ్రేలాడు లింగమును వారి నోటిలో కానీ, దోసిలిలోగానీ ఉంచి, కూర్చోబెట్టి సమాధి చేస్తారు. అంటే శివలింగము, వారి దేహము, విడదీయరాని అనుబంధమును కలిగి ఉండవలెనని ఆచారము.

బసవపురాణంలో సాక్షాత్తూ శివుడే దిగివచ్చి, బసవేశ్వరుడు పుట్టిన వెంటనే, ఆయన మెడలో లింగమును కట్టినట్లునూ, అందువల్ల మొట్టమొదటి లింగాయుతుడు ఆయనయే అయినట్లు చెప్పబడింది. లింగధారులందరూ తన సోదరులని బసవన్న ప్రకటించాడు. అదే పురాణంలో బసవేశ్వరుడు, తన సిరిసంపదలను వీరశైవమతస్థుల కొరకై, ఎన్ని విధములుగా విరివిగా ఖర్చుపెట్టినది వివరంగా వర్ణించబడింది. అంట రాని వారి పాదములను బహిరంగంగా కడిగి, తద్వారా మానవులందరూ, సమాను లేనని తాను బోధించటం, కేవలము మాటలకే పరిమితం కాదనీ, ఆచరణ యోగ్య మనీ, తన అనుయాయులు అందరూ, తనను అనుకరించి, ఆచరించి తీరాలని గట్టిగా చెప్పేవాడు. భక్తి మార్గము యొక్క ప్రాశస్త్యాన్ని, శివార్చన యొక్క ఔన్నత్యమును వివరిస్తూ, ఎన్నో సభలలో ప్రవచనములు చేసేవాడు. ఇతర సాంప్రదాయముల కంటే శివభక్తి, శివార్చనలు, విశిష్టమైనవని ప్రబోధించేవాడు. తరచుగా తన ఉప న్యాసములలో, కేవలము భక్తి మాత్రమే ఆరాధకునికి, ఆరాధ్యమునకు మధ్య సమాన మైన, అంతస్థును లభింపజేస్తుందని చెప్పేవాడు. యోగసాధన చేసేవాడు.

వీరశైవము, తన అనుయాయులను దీక్షనిచ్చిన గురువును పూజించమని బోధిస్తుంది. దీక్షాకాలములో కట్టినటువంటి లింగమును ప్రాణలింగమని పిలుస్తారు. అదేవిధంగా జంగములను నడయాడే శివునిగా భావించి, వాడవాడలా తిరుగుతూ, శివ భక్తిని ప్రచారము చేస్తారు కనుక, వారిని కూడా అర్చించవలెనని చెప్తుతుంది. అటువంటి జంగములు, భగవంతునికంటె అధికులుగా భావించవలెనని నిర్దేశిస్తుంది.

వీరశైవ మతము, దేవాలయము నందు స్థాణువుగా ఉన్న శివుని పూజించుట కంటె, జంగమును ఆరాధించటం ఎన్నిరెట్లో మెరుగని తరచూ బోధిస్తుంది. ముక్తి మార్గములైన భక్తి, జ్ఞాన, వైరాగ్యములు మూటిలోనూ, వీరశైవము భక్తికే అత్యంత ప్రాధాన్యతనిస్తుంది.

వీరశైవమత వ్యాప్తికి అహర్నిశలూ, తన సర్వస్వమునూ ధారపోస్తూ కార్యాచరణలో నిమగ్నుడైన బసవేశ్వరుని కీర్తి దశదిశలూ వ్యాపించింది. ఆయనను వీరశైవ మతోద్ధారకునిగా ప్రశంసిస్తూ, రాత్రింబవళ్ళు, తండోపతండాలుగా వీరశైవులు ఆయన భవనమునకు వచ్చేవారు. ఆయన నివాసమును "మహామని" గొప్ప నివాసమని వర్ణించేవారు. కాలముతో నిమిత్తములేకుండా, వారు ఏ వేళ, ఎంత మంది వచ్చినప్పటికీ, వారికి సర్వ సౌఖ్యములు కలుగజేసి, వారి ఇష్ట లింగారాధనకు ఎటువంటి ఆటంకము కలుగనీయక, రుచికరమైన పదార్థములతో వారికి విందు చేసేవారు. బసవేశ్వరుడు చేతులు జోడించి, తనను పొగడవద్దనీ, ముఖస్తుతివల్ల మనిషిలో అహంకారము పెరుగు తుందనీ, వినయంగా మనవి చేసేవాడు. బసవనికి తోడుగా ఆయన ఇద్దరు భార్యలూ, సోదరి కూడా అతిథులకు అన్ని సౌకర్యములు కలుగచేస్తూ తోడ్పడేవారు. రాత్రులందు బసవేశ్వరుడు, శివుని స్తోత్రములను భక్తితో పఠిస్తూ, శివ సంకీర్తనలను పాడేవాడు. ప్రతి రాత్రినీ మహాశివ రాత్రిగానే భావించి, శివుని పూజలు జరిపేవాడు. వీరశైవమతా చారములను, శివపూజా విధానమును, సులభముగా, అంటరానివారు కూడా శివార్చన చేయగలిగేటట్టు మార్పు చేశాడు. బసవన్న నిర్వహించు అన్ని కార్యక్రమములలోనూ, ఇతరులతోపాటు, అంటరాని వారు కూడా సమాన హోదాలో పాల్గొనమని ప్రోత్సహించేవాడు. తన అనుచరులలోని ప్రతి వ్యక్తి యొక్క శారీరక, మానసిక అవసరములను గుర్తించి తీర్చేవాడు. ఇందు వలన వేలాది స్త్రీ, పురుషులు బసవన్న అనుయాయులైనారు. వారిలో ఎక్కువమంది రైతులు, సాలెవారు, కమ్మరులు, కుమ్మరులు, వడ్రంగులు, బెస్తలు, చాకళ్ళు, మంగళ్ళు, వేటగాళ్ళ వంటి శ్రామిక వర్గీయులుండేవారు. ఇంతకుముందు హిందూమతము నందలి కులవివక్షత, బ్రాహ్మణాధిక్యత, కారణంగా దానినివిడచి బౌద్ధ, జైన మతములను ఆశ్రయించినవారు కూడా వీరశైవ మతానుయాయులైనారు. ఇందుకు కారణం మతముపై విశ్వాసము కంటే సామాజిక కారణములు ముఖ్యమైనవి. అంత

వరకూ పాటించని, కులవివక్షతను, తమ మనుగడకొరకై ఆ మతములు ప్రవేశపెట్టుట జరిగింది. ఇందుకు కారణము ఆ రెండు మతములూ, రాజాదరణనూ, ఆర్థిక సంక్షోభముల వలన ధనికుల వద్ద నుండి భూరి విరాళములను కోల్పోయినవి. వజ్రయాన బౌద్ధశాఖ ఆ మతమును అప్రతిష్టపాలు చేయుటయే కాక సామాన్యుల మనసులలో ఆ శాఖలోని భిక్షువులు, భిక్షుణిల ప్రవర్తనపట్ల, అసహ్యమును, ఆగ్రహ మును కల్పించినవి. ఎప్పుడైతే, ఆ నాస్తిక మతములు తాము ఆశించిన సమసమాజ స్థాపనకు దూరమై, నైతిక పతనమును చెందినవో, హిందూ మతమును వదలి, పేరా శతో ఆ మతములలో చేరిన వారంతా, నిరాశులై, కుల వివక్షతను పాటించమని ఘంటా పథంగా ప్రచారముచేస్తున్న వీరశైవములోనికి తండోపతండాలుగా వచ్చి చేరారు.

బసవేశ్వరుడు వీరశైవ మత వ్యాప్తిలో తలమునకలై ఉన్న తరుణంలో బిజ్జి లుడు రాజద్రోహము ఆచరించి క్రీ.శ. 1162లో కల్యాణి చాళుక్యుల సింహాసనమును కైవసం చేసుకొని, వారి రాజధానియైన కళ్యాణ పట్టణము చేరాడు. బసవేశ్వరుడు ఈ రాజకీయ పరిణామముపై శ్రద్ధ చూపక, తన మతవ్యాప్తికై చేపట్టిన కార్యాచరణము నందు నిమగ్నుడైనాడు. కానీ ఏనాడు భండారిగా (ముఖ్య కోశాధికారిగా) తన విధులను నిర్లక్ష్యము చేసేవాడుకాదు. రాజుతోపాటు తన కార్యాలయము కూడా కళ్యాణ పట్టణమునకు మార్చబడటం వల్ల తానుకూడా, తన నివాసమును అక్కడకు మార్చుకున్నాడు. ఈ మార్పువల్ల బసవేశ్వరునికి, తన మత ప్రచారమునకు అవకాశ ములు అధికమైనవి. కళ్యాణ పట్టణము ఆ కాలములో పెద్దనగరము. జనసమర్దంతో ఎల్లప్పుడూ కిటకిటలాడు తుండేది. అన్ని కులములవారూ, అన్ని వృత్తులవారూ, ఆ నగరంలో ఉండేవారు. పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారములు జోరుగా సాగు తుండేవి. సంగీతము, సాహిత్యము, హస్త కళలకూకాణాచి. అటువంటి మహానగర మునకు బసవేశ్వరుడు బిజ్జలునితో తరలి వచ్చాడు.

ఆనాటి శాసనములను పరిశీలిస్తే, బిజ్జలుడు మంచి యుద్ధ నిపుణుడు, పరిపాలనా దక్షుడని తెలుస్తుంది. అతడు జైన మతస్థుడైనప్పటికినీ, శైవులలోని కాలముఖ శాఖ వారికి, భూరి విరాళములు ఇచ్చినట్లుగా శాసనములు తెలియ జేస్తున్నవి. అన్ని మతములను సమభావంగా చూసేవాడట. బసవేశ్వరుడు మనస్సులో బిజ్జలుని రాజద్రోహమును అసహ్యించుకున్నప్పటికీ, అతడు భవి (వీరశైవుడు

కానివాడు) అయినప్పటికినీ, తన ఉద్యోగ ధర్మమును మామూలుగానే నిర్వర్తిస్తూ ఉండేవాడు. బసవని అనుయాయులలో కొందరు, వీరశైవ సిద్ధాంతములకు వ్యతిరేకంగా, భవియైన బిజ్జలుని సేవచేయటంపై ఆయనను ప్రశ్నించారు. బసవేశ్వరుడు ఒక వచనంలో వారికి జవాబిస్తూ, తాను చేస్తున్న సేవ తన కొరకు కాదనీ, తన మతము కొరకూ, సమాజము కొరకేననీ తెలియజేశాడు. కేవలము అది ధన సంపాదనకు ఒక మార్గము మాత్రమేనని చెప్పాడు. సంపాదించిన సిరిసంపదలను వీరశైవ మత వ్యాప్తి ద్వారా, సమసమాజ నిర్మాణమునకు ఖర్చు చేస్తానని చెప్పేవాడు. బిజ్జలుడు ఏనాడూ బసవుని నైతిక ప్రవర్తననుగానీ, ఆయన విశ్వాస పాత్రతనుగానీ శంకించలేదు. అయితే బసవేశ్వరుని అనుయాయిలలో కొందరు అత్యోత్సాహంతో తమ వ్యక్తిత్వమును, ఆత్మగౌరవమును, తమకు నూతనంగా లభించిన అగ్రవర్ణములతో సమానమైన హోదాను, ప్రదర్శించవలెననే కోర్కెలతో అగ్రకులజులను అగౌరవపరచడం, వారిని అవహేళన చేయడం, వారితో చెడుగా ప్రవర్తించడం చేసేవారు. మాచయ్య అనే చాకలి అగ్రకులజుల బట్టలు ఉతకడం మానివేశాడు. కారణం వారు భవులవటమే (వీరశైవులు కానివారు). శివనాగయ్య అని దండోరా వేసేటటువంటి దళితుడు, ఆ పని మానివేశాడు. ఇటువంటి సంఘటనలనెన్నింటినో బసవపురాణం వివరంగా తెలియ జేసింది. ఆ గ్రంథములోని, ఏడవ అధ్యాయంలో బసవేశ్వరుడు, ఎన్ని విధములుగా లింగ ధారణ చేసిన అంటరానివారికి మర్యాదలు జరిపేవాడో, వివరించటం జరిగింది. ఈ విధమైన ఆగడాలను సహించలేని కొందరు అగ్రకులజులు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, అధికారులు, బసవని అనుచరుల, అకృత్యములను బిజ్జలునికి నివేదించి, అవన్నీ బసవనికి తెలిసే అతని ప్రోత్సాహంతో జరుగుతున్నవని చెప్పారు. బసవపురాణంలో వారు చేసిన నేరారోపణలు వివరంగా తెలియజేయబడినవి.

నేరారోపణ చేసిన వారిలో ఒకరు కాశప్పయ్య. ఇతడు వనవాసి ప్రభువు. మరొకడు బరమరస. ఇతను కాశప్పయ్య క్రింద అధికారీ. బిజ్జలుని అల్లుడు. వీరశైవమత ప్రచారానికి, రాజు కోశాగారములోని ధనమును, తప్పుడు లెక్కలు చూపించుతూ, వినియోగిస్తున్నాడని నేరము ఆరోపించారు. విచారణ కొరకు రాజసభకు రావలసినదిగా బసవేశ్వరునికి ఆదేశములు పంపబడినవి. అతడు పల్లకిలో ఒక

అంటరానివానితో కూర్చుని రాజ సభకు వచ్చాడు. పల్లకీదిగి తన దేహముపైనున్న శాలువను నేల మీద పరచి, అంటరాని వానితో పాటు, తాను కూడ దానిమీద కూర్చున్నాడు. ఈ విధంగా రాజసభలో అనుసరించ వలసిన మర్యాదలను అతిక్ర మించినందుకు, బిజ్జలునికి కోపము వచ్చింది. ఈ అమర్యాద ప్రవర్తనవల్ల భగవాదా గ్రహమునకు గురికాక తప్పదని బసవని హెచ్చరించాడు. జవాబుగా బసవేశ్వరుడు అంటరానివారు కూడా బ్రాహ్మణుల కంటే ఉత్తములేనని కొన్ని కథలను వినిపించాడు. కుల విభజనను సమాజములో బ్రాహ్మణులే సృష్టించారన్నాడు. కేవలము సంఘములో వారి ఆధిక్యతను నిలుపుకొనుటకే ఈ సంప్రదాయము ప్రవేశపెట్టబడిందని తెలియజేశాడు. బహిరంగంగా వర్ణాశ్రమ ధర్మమును విమర్శించి నిరసించటం, బ్రాహ్మణులు కుక్కలకంటే హీనులని నిందించటం సభా మర్యాదలను అతిక్రమిం చటం, సభలోని ఇతర మతస్థులకు, అగ్రకులజులకు, బిజ్జలునికీ ఆగ్రహావేశములను ద్విగుణీకృతం చేశాయి. బసవపురాణంలో బసవేశ్వరుడు ఆయన అనుయాయులు వీరశైవమతావేశంతో విచక్షణారాహిత్యంగా ప్రవర్తించి, భవులపట్ల జరిపిన అత్యాచారములు వివరంగా తెలియ జేయబడినవి. బసవేశ్వరుడు వారిని మందలించి, క్రమశిక్షణలో ఉంచవలసినది పోయి, వారి అత్యాచారములను సమర్థించేవాడు. ప్రతి దినమూ బసవని అనుచరులపై నేరారోపణలు కొల్లలుగా రాజసభకు చేరుతూ ఉండేవి. ఇందువల్ల బిజ్జలునికి బసవనికి మధ్య వైషమ్యం అధికమైనది. తరచుగా వారిద్దరి మధ్య అనేక విషయములపై వాదోపవాదములు జరిగేవి. బసవేశ్వరుని క్రమశిక్షణారాహిత్య, అహంకార ప్రవర్తన, అంటరానివారిని వెంటవేసుకొని వీరశైవ మత ప్రచారము, సహపంక్తి భోజనములు చేయటం, ప్రభుత్వ నిర్వహణలో, తన పదవికిగల ప్రముఖ స్థానమూ, తన అంతస్తూ, బాధ్యతలు, రాచమర్యాదలను కాల దన్ని, రాజ్యము అల్లకల్లోలమగు విధంగా ప్రవర్తించుట పట్ల, బిజ్జలుడూ, ఆతడు రాజగుటకు తోడ్పడిన ప్రభువులూ, మంత్రులూ, సైన్యాధికారులూ, అగ్రకులజుల వారూ సహించలేకపోయారు. వారందరూ ముక్తకంఠముతో బసవేశ్వరుని ఆ పదవి నుండి తొలగించి, శిక్షించవలెనని బిజ్జలుని హెచ్చరించారు. అతనినీ, అతని వెంట మతప్రచారము చేస్తూ, అరాజకమును ప్రేరేపిస్తున్న అనుచరులనూ, మతమునూ అణచివేయవలసినదని ఆందోళనను చేపట్టారు. తీవ్రమైన ఆరోపణలను, బసవని ప్రవర్తనపై తరచుగా రాజుకు మనవి చేసేవారు. బసవేశ్వరుడు అనేక సందర్భములలో

రాజుపట్ల తాను కోల్పోయిన గౌరవమర్యాదలను వివరిస్తూ వచనములు రచించాడు. ఈ విధంగా రాజుకూ, రాజ్య కోశాధికారికీ మధ్య ఉండవలసిన సత్సంబంధములు మృగ్యమై, వాటి స్థానమున విపరీతమైన ద్వేషము పెరిగింది. ఒకరు, మరొకరికి ఏ విధంగా కీడు చేయాలనే సంకల్పమూ, ఆత్రుతా ఇనుమడించి, అవకాశము కొరకు ఎదురు చూస్తున్న తరుణంలో, అటువంటి అవకాశము బసవన్న ఇంటి తలుపుతట్టింది.

ఏ విధంగానంటే కల్యాణ పట్టణంలో జగదేవుడనే అధికారి ఉండేవాడు. అతడు బసవేశ్వరుడంటే తీవ్రమైన అభిమానము కలవాడు. ఒకసారి అతడు బసవేశ్వ రుని, ఆయన అనుచరులను, మరికొంత మంది బ్రాహ్మణులను కూడా తన ఇంటికి విందుకు ఆహ్వానించాడు. బ్రాహ్మణులు విందుకు ఆహ్వానింపబడినారని తెలిసి, బసవేశ్వరుడు తాను విందుకు రానన్నాడు. ఇది తెలుసుకొనిన జగదేవుడు, బసవనికి అనేక విధములుగా క్షమాపణలను చెప్పి, ఆయన పట్ల తనకున్న భక్తి, విశ్వాసములను ప్రకటించి, శాంతింప జేయవలెననెడి ఉద్దేశ్యంతో, బసవని శత్రువు, ఎవరైనా సరే, వానిని మట్టుబెట్టుటకు తాను సిద్ధమని ప్రతిజ్ఞ చేశాడు. ఇది ఇలా ఉండగా, అదే పట్టణంలో అల్లయ్య, మాధవయ్య అనే ఇద్దరు బసవని అనుయాయులు ఉండేవారు. అల్లయ్య అంటరానివాడు. మాధవయ్య బ్రాహ్మణుడు. ఈతడు తన కుమార్తె వివాహ మును అల్లయ్య కొడుకుతో జరుపవలెనని నిర్ణయించినాడు. బసవేశ్వరుడు తన అంగీకారమును తెలియజేశాడు. అయితే నగరములోని అగ్రకులజులు, ఈ కులాం తర వివాహముపై ఆగ్రహముచెంది, బిజ్జలునికి ఫిర్యాదుచేశారు. రాజు ఈ వివాహము జరుపరాదని ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞ తిరస్కరించబడి వివాహము జరుపబడినది. కోపోద్రిక్తంతో బిజ్జలుడు, అల్లయ్య, మాధవయ్యల కనుగుడ్లు పీకివేయవలసినదని శిక్షవేశాడు. శిక్ష అమలుజరిపి వారి కనుగుడ్లు పీకివేశారు. నగరంలోని వీరశైవులు రాజుపై తిరుగుబాటుచేశారు. రాజు తమను హింసించి అణగద్రొక్క వలెననే సంకల్ప ముతో ఉన్నాడని వారు నిర్ణయించుకున్నారు. బిజ్జలుడు బ్రతికివుంటే తమకూ, తమ వీరశైవమతానికి రక్షణఉండదని భావించి, వారంతా సమావేశమై, జగదేవుని ఆహ్వానించారు. వీరశైవమతమునకు శత్రువు బిజ్జలుడేననీ, కాబట్టి ఆ శత్రువును చంపి తన ప్రతిజ్ఞను నిర్వర్తించమని కోరారు. జగదేవుడు అంగీకరించాడు, కానీ ఆచరించలేదు. ఈ విషయము తెలిసిన ఆతని తల్లి ప్రతిజ్ఞాపాలన చేయనంతవరకూ,

అతనిని కుక్కకంటే హీనంగా పరిగణిస్తానని హెచ్చరించింది. పిడికెడు మెతుకులు నేలపై విదల్చి, వాటిని తినమని కొడుకును ఆజ్ఞాపించింది. ఆకలిగొన్న జగదేవుడు కుక్క వలెనే, నేలమీద పడిఉన్న మెతుకులను తిన్నాడు. ఇంతలో బసవని అనుచరులైన మొల్లె, బొమ్మ అనే ఇద్దరు వ్యక్తులు, హత్యా ప్రయత్నంలో జగదేవునికి సహాయపడ టానికై వచ్చారు. అది సాయంకాలము. బిజ్జలుడు రాజసభలో ఆశీనుడై ప్రజలు సమర్పించు వినతి పత్రములను తీసుకుంటూ వారు చేస్తున్న విన్నపములను వింటూ ఉన్నాడు. ఆ సమయంలో జగదేవుడు తన అనుచరులతో సభలో ప్రవేశించి, ఒక్క ఉదుటున బిజ్జలుని పైబడి అతనిని సంహరించాడు. ఈ హత్య క్రీ.శ. 1168వ సంవత్సరములో జరిగింది. వెంటనే అప్రమత్తులైన రాజు అంగరక్షకులు, హంతకు లను పట్టుకొని అక్కడికక్కడే చంపివేశారు. ఈ హత్య రాజ్యంలో అరాజకమునకు దారితీసింది. అయితే పారంపర్యంగా వినవస్తున్న సమాచారమును బట్టి, బిజ్జలుడు తన కుమారుడైన రాయమురారి సోమదేవుని రాజుగా ప్రకటించి క్రీ.శ. 1176వ సంవత్సరము జులై నెల పందొమ్మిదవ తేదీన కుమారుని సింహాసనాధీశుని చేసిన అనంతరం కొద్దిరోజులకే హత్య చేయబడినాడని తెలుస్తుంది. ముందుగానే వ్యూహ రచన చేసుకున్న బసవేశ్వరుడు తన ప్రాణరక్షణార్థం, నమ్మకమైన కొద్దిమంది అను చరులనూ రాజు సైన్యంలో తన కనుకూలురైన కొంతమంది సైనికులు వెంటరాగా కప్పడి సంగమేశ్వర గ్రామానికి పారిపోయాడు. ఆ విధంగా పారిపోతున్న వారి రక్షణకై, మేనల్లుడైన చెన్న బసవేశ్వరుడు కొంతమంది అనుచరుల సహాయంతో, తరుముకుంటూ వస్తున్న రాజ సైనికులను ఎదుర్కొని వారిని తరిమికొట్టాడు. బసవేశ్వ రుడు ఆయన వెంటనున్న వారు పలాయితులుగా సంగమేశ్వరం చేరారు. ఆ ప్రదేశము నకు చేరిన బసవేశ్వరునికి కొన్ని దశాబ్దములకు పూర్వం, ఇదే గ్రామంలో తాను పొందిన గౌరవ మర్యాదలు, సంపాదించు కొన్న కీర్తి ప్రతిష్టలూ, కులరహిత సమ సమాజ స్థాపనే తన ధ్యేయంగా భావించి, దళితులను బడుగువర్గముల వారిలో, తన ఆదర్శ సిద్ధాంతములను ప్రచారముచేసి వారి జీవితములకు క్రొత్త వెలుగును ప్రసాదించుటకు చేసిన ప్రయత్నములన్నీ, ఒకొటొకటిగా ఆయన మనః ఫలకముపై రూపుదాల్చినవి. ప్రశాంతమైన ఆ గ్రామ వాతావరణము, తన మధురాను భూతులు, కూడలి సంగమేశ్వరుని సన్నిధి, వ్యధతో నిండిన బసవేశ్వరుని మనసుకు కొంత ఊరట కలిగించినవి. తనకు అంత్యకాలము దాపురించినదని తెలుసుకున్నాడు.

తన జీవిత ధ్యేయంగా, తాను సాధించాలనుకొన్నది సాధించినట్లుగా తృప్తిచెందాడు. కొరవగా ఉన్న దానిని తన అనుచరులు సాధించగలరని విశ్వసించాడు. సంతృప్తి చెందిన మనస్కుడై బసవేశ్వరుడు పవిత్రములైన మాలప్రభా, కృష్ణానదుల సంగమస్థానమైన కూడలి సంగమేశ్వ రములో తుదిశ్వాస విడిచాడు.

బసవపురాణమునందలి వర్ణననుబట్టి, అశ్రుధారలు చెక్కిళ్ళపైనుండి జాలు వారుతుండగా, భక్తి భావోద్రేకపూరితుడై, సంగమేశ్వరుని ఆలయ ప్రవేశము చేసిన బసవేశ్వరుడు, స్వామిని, తనను ఐక్యము చేసుకొనవలసినదిగా ప్రార్థించాడట. ఆయన మొరాలించిన సంగమేశ్వరుడు లింగమునుండి వెడలి బసవేశ్వరుని ఆలిం గనము చేసుకున్నాడట. వెనువెంటనే బసవేశ్వరుడు సంగమేశ్వరునిలో లీనమైనాడట. సంఘ సంస్కరణాభిలాషి వీరశైవ ప్రవక్త ఆ విధంగా క్రీ.శ. 1167–1168 మధ్య శివసాయుజ్యం పొందినాడు. జైనుల కన్నడ భాషా గ్రంథమైన “బిజ్జలచరిత్ర” మరో విధంగా తెలియ జేస్తుంది. దాని ప్రకారం, బిజ్జలుని హత్యానంతరం ఆయన పుత్రుడైన రాయమురారి సోమేశ్వరుడు లేక సోమదేవుడు ఎట్టి పరిస్థితులలోనూ బసవేశ్వరునీ, అతని అనుచరులను పట్టుకొని, అక్కడికక్కడే చంపివేయవలెనని ఆజ్ఞాపించాడట. ఈ వార్త తెలియగానే తన ప్రాణరక్షణార్థమై బసవేశ్వరుడు పారిపోయాడట. అయిన ప్పటికీ సైన్యము అతనిని వెంబడించి పట్టుకొనే ప్రయత్నము చేయగా, తప్పించు కొనుటకు దారి దొరకని బసవేశ్వరుడు, సమీపమునగల లోతైన బావిలోనికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడట. జైనుల సమాచారమును బట్టి బసవేశ్వరుని శరీరము సమాధి చేయబడలేదు. ఇది బసవన్న బోధించిన వీరశైవ సంప్రదాయమునకు విరుద్ధము. ఆయన మేనల్లుడైన, చెన్నబసవేశ్వరుడు, మేనమామ మరణానంతరము రాజుకు లొంగిపోయాడట. బసవేశ్వరుడు రాజు కోశాగారము నుండి వీరశైవ మత ప్రచారమునకు వినియోగించిన ధనమును తిరిగి చెల్లించాడట. రాజు అతనిని క్షమించి, ప్రభుత్వ పదవి యందు నియోగించాడట.

బసవేశ్వరునకు బాల్యంలోనే మతముపట్ల, సమాజము పట్ల ఏహ్యతా భావ ములు కలిగి, వయసుతోపాటు వృద్ధిచెంది, చివరకు తిరుగుబాటుదారునిగా, మార్చుటకు ఆనాటి మత, సాంఘిక పరిస్థితులే ముఖ్య కారణమని చెప్పవచ్చును. సమాజములో బలంగా వ్రేళ్ళూనిన కులతత్త్వమూ, హీనకులజులు, అంటరానివారు

అనుభవిస్తున్న దుర్భర జీవన విధానము, అగ్రవర్ణములవారి ఆధిపత్యమూ, నిశితంగా పరిశీలించిన బసవనిలో విప్లవాత్మకమైన ఆలోచనలు కలగటం సహజమేనని పిస్తుంది. సమాజమును కులరహితము, వర్గ రహితముగా మార్చి, అందరికీ అన్ని విషయములలోనూ సమానమైన ప్రతిపత్తిని కల్పిస్తానని, బసవన్న చేసిన ప్రవచన ములు, అందుకు తగిన కార్యక్రమములను చేపట్టటం, బడుగు వర్గములవారికి, నిశిరాత్రియందు, కాంతిపుంజమువలె తమ బ్రతుకులపై ఆశ, నూతనోత్తేజమును కలిగించినవి. బసవని తమమార్గదర్శకుడుగానమ్మి, అతని సంస్కరణోద్య మములో బాగస్వాములైనారు. అచిర కాలములోనే ఆ ఉద్యమము ఊపందుకొని, వరద నీటిలా వ్యాప్తి చెందింది. బసవని ప్రవచనములు సర్వదా అర్థవంతములై సులభంగా, విద్యా విహీనులైన వారికి అవగతములై, వారిని నమ్మించి, ఉద్యమములోనికి ఆకర్షించేవి. సామాన్య ప్రజానీకము తేలికగా అర్థం చేసుకొనుటకు వీలుగా, వ్యావహారిక మైన గ్రామీణ భాషలో ప్రసంగించేవాడు. ఎప్పుడైతే ఆయన ప్రారంభించిన ఉద్యమము, మహాజ్వాలగా వృద్ధి చెందిందో, ఒక సామాజిక విప్లవస్ఫూర్తిని పొందినదో, అప్పటి వరకూ విలాస జీవితములను అనుభవిస్తూ సాంఘిక, మత విషయములపై ఆధిక్య తను ప్రదర్శిస్తున్న ఉన్నత కులస్తులకూ, ధనిక వర్గములవారిలో భయాందోళనలు మొదలైనవి. ఏ విధంగానైనా బసవని ఉద్యమమును ఎదుర్కొని అణచివేయవలెనని ప్రయత్నించారు. కానీ కృత కృత్యులు కాలేకపోయారు. బసవేశ్వరుని భావనలో మతమంటే కులవివక్షతకానీ, అధిక ఖర్చులతో కూడిన కర్మాచరణముగానీ ఉండ గూడదు. ఆ భావనకు రూపకల్పనే ఆయన బోధించిన ఏకేశ్వరోపాసన, అదే సులభ మైన భక్తిమార్గంలో శివుని ఆరాధించుట. సామాన్య ప్రజల యందు భగవంతునిపట్ల గల నమ్మకమును, తమ స్వార్థ ప్రయోజనములకై బ్రాహ్మణులు, హిందూ మతము నందు అనేక నామములుగల దేవులను, దేవతలను సృష్టించారని బసవన్న దృఢ విశ్వాసం. బసవేశ్వరుని దృష్టిలో మతమనేది ఒక జీవన విధానమనీ, నైతికమైన జీవన పద్ధతియే దానికి ఆధారమనీ, కర్మాచరణములతోనూ, తీర్థయాత్రలతోనూ కూడిన సాలెపురుగుగూడు వంటిది కాకూడదనీ ప్రవచించేవాడు. ఆయన వచనము లలో ఈ సత్యమును చెప్తూ, పరిశుద్ధమైన నైతిక జీవనము భగవంతుని చేరుటకు సరియైన మరియు ఏకైక మార్గమనేవాడు. బసవేశ్వరుని ప్రవచనములు విన్న బీదలు, బడుగు వర్గములవారు తమకు కూడా అగ్రకులజులకు వలెనే భగవసాన్నిధ్యమును

చేరగల అవకాశము, అర్హత ఉన్నవని తెలుసుకొని ఎంతో ఆనందించేవారు. కేవలమూ బీదా, బిక్కియే కాకుండా ఉన్నత వర్గములకు చెందిన వారు కూడా, బసవేశ్వరుని ప్రవచనములకు మోహితులై, ఆయన ఉద్యమములో చేరారు. వారిలో కొందరు ఇంకా తమ పాత సాంప్రదాయములను అనుసరిస్తూ ఆటవికుల దేవతలను, గ్రామ దేవతలను రహస్యంగా ఆరాధిస్తుండేవారు. అటువంటివారిని బసవన్న మందలిస్తూ, కేవలము శివుని మాత్రమే పూజించవలసినదని ఒత్తిడి చేసేవాడు.

వీరశైవమతానుయాయులకు, కుటుంబ జీవితములో కొన్ని నూతన సమస్యలు ఏర్పడినై, కొన్ని సందర్భములలో, భార్యో లేక భర్తో వీరశైవమతము పుచ్చుకొని, మాంసాహారము తినకపోవటం, మద్యము, భంగు వంటి పదార్థములను సేవించక పోవటం వంటిచర్యలను మత సిద్ధాంతములను అనుసరించి పాటించేవారు. భార్యో, భర్తో కుటుంబములో ఏ ఒక్కరో ఇటువంటి నియమములను పాటించుట వలన, మరొకరు పాటించకపోవటం వలన, కుటుంబములో, తిండి విషయములోనో, పూజా విషయములోనో, లేక కుటుంబమువారు ఇంటిలో ఆచరించవలసిన కర్మ కాండల సందర్భములయందో భార్యా, భర్తల మధ్య కుటుంబములోని ఇతర సభ్యుల మధ్య వైషమ్యములు ఏర్పడేవి. వాటి బారినుండి తప్పించుకొనటానికి కొందరు వీరశైవమతస్థులు రహస్యంగా తమ సాంప్రదాయ పద్ధతులను కొనసాగించేవారు. బసవేశ్వరుని మేనల్లుడైన చెన్నబసవేశ్వరుడు, ఈ రకమైన ఆత్మ వంచనా విధానము లను గర్హిస్తూ, మద్య, మాంసభోజనములేగాక, వీరశైవులు కానివారితో స్నేహ సంబంధములనూ, వీరశైవమత సిద్ధాంతములకు విరుద్ధములైన అన్ని చర్యలనూ ఆచరించరాదని; కఠినంగా నిషేధాజ్ఞలు జారీచేశాడు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారు కుక్క, పిల్లి, పందివంటి హీన జంతువులుగా పరిగణింప బడతారని హెచ్చరిం చాడు. వీరశైవులు, తమ మతస్థులు కాని వారితో సహపంక్తి భోజనము లను, వివాహములను నిషేధించాడు. ఇందువలన ఆయన తెలిసో, తెలియకో హిందువు లలో మరొక కొత్త కులమునకు సృష్టి కర్త అయినాడు. వీరశైవుడు కాని, ఏ గురువైనా ఇచ్చిన ఇష్ట లింగమును స్వీకరించరాదు. ధరించరాదన్నాడు. అటువంటి సందర్భము లలో తీసుకున్న లింగమును తిరిగి ఇచ్చి వీరశైవగురువుని వద్ద నుండియే, మరొక లింగమును తీసుకోవాలన్నాడు. బసవేశ్వరుని మతస్థులలో, అగ్రవర్ణములకు చెందిన

వారిలో కొందరు, బసవేశ్వరుని నిషేధాజ్ఞలను త్రోసిపుచ్చారు. ఇతర మతస్థులతో సహపంక్తి భోజనములు చేసేవారు. దిగువ కులములకు చెందినవారిని, అంటరాని వారిని దూరంగా ఉంచి, కుల వివక్షతను పాటించేవారు. వారితో ఎటువంటి సంబంధ, బాంధవ్యములు పెట్టుకొనే వారు కాదు. ఈ విధమైన తప్పులు బసవేశ్వరుని దృష్టికిరాగానే, ఆయన వారిని తీవ్రంగా మందలించి, వ్యక్తి ఏ కులమునకు చెందిన వాడైనప్పటికీ, ఒక్కసారి లింగధారణ చేసుకున్న తరువాత, ఆ వ్యక్తిని అగ్ర కులముల వారు, తమతో సమానంగా గౌరవించవలెనని హెచ్చరించాడు.

ఆ కాలంలో గ్రామమునకు సంబంధించిన అన్ని వ్యవహారములకూ, దేవా లయములే కేంద్రంగా ఉండేవి. ఒకప్పుడు ఆంధ్ర, కర్ణాటక దేశములలో బాగా వ్యాప్తి చెందియున్న పాశుపత శైవశాఖకు చెందిన గురువులు, గ్రామ ప్రజలకు శివదీక్షని ఇవ్వటం, దేవాలయములలో పూజాదికములు, ఆగమశాస్త్రముల ప్రకారం జరుగు తున్నవోలేవో పర్యవేక్షించుతూ ఉండేవారు. రాజులు, ధనవంతులు, సామాన్య ప్రజలు ఇచ్చిన విరాళముల సహాయముతో దేవాలయముల నిర్మాణము, వాటి నిర్వహణ జరుపుతూ ఉండేవారు. శివగురువులు వాటి రక్షకులై, ఆదాయవ్యయములపై అజ మాయిషీ చేస్తూ, అవి సక్రమంగా నిర్వహించేటట్లు చర్యలు తీసుకుంటూ ఉండేవారు. వారు ఎన్నడూ సాంప్రదాయములను అతిక్రమించి క్రింది కులములవారిని, అంట రానివారిని దేవాలయములలోనికి రానిచ్చేవారుకాదు. అందువల్ల బసవేశ్వరుడు దేవాలయ వ్యవస్థ కేవలమూ ధనికులకు, అగ్రవర్ణములవారికి, సంకుచిత బుద్ధి కలిగిన వారికే పరిమిత మైనదని విమర్శించేవాడు. అత్యంత జుగుప్సతో, వీరశైవు లెవ్వరూ దేవాలయ నిర్మాణము చేయుటకానీ, దేవాలయము నందు ప్రతిష్టింపబడిన దేవుని, పూజించుటగానీ చేయరాదని నిషేధించాడు. అయితే ఇచట గమనార్హమైన విషయమేమంటే, తన నిషేధాజ్ఞలను తానే ఉల్లంఘిస్తూ, కూడలి సంగమేశ్వరుని దేవస్థానము నందు వీరశైవమతస్థాపనకు ముందూ, కల్యాణ పట్టణము నుండి పారిపోయివచ్చి చనిపోయేముందు మరొకసారీ, సంగమేశ్వరుని దేవాలయమునందే ఆరాధించాడు. దేవాలయమూ, దానిలోని విగ్రహము, స్థావరములు (కదలనివి) కాబట్టి వాటికి నాశనము తప్పదని ప్రకటించాడు. స్థిరముగానున్నదే దైనాసరే నశిస్తుందనీ, కదలికగలిగిన దానికి నాశనములేదని ఆయన ఒక వచనములో

తెలియ జేశాడు. మానవ దేహము చలనము కలిగినది కాబట్టి, జంగమమైన శివ భక్తుని, కదులుతున్న దేవాలయముగానూ, దేవునిగానూ పూజించవలెనని ప్రబోధించాడు. అతనిలో పెరుగుదల, జీవము ఉన్నవి కాబట్టి, ఆతనిని నాశరహితునిగా భావించి, పూజించమని చెప్పాడు. తమ దేహములనే, దేవాలయములుగా మలచుకొనవలసిన దని తన అనుయాయులను కోరాడు. బసవేశ్వరుడు పైన వివరించిన నిషేధములను వీరశైవులకు వర్తింపజేయడం వెనుక ఒక రహస్యాలోచన ఉంది. అదేమంటే బసవేశ్వరుని శిష్యులలో అత్యధికులు అంటరాని వారు. వారికి దేవాలయ ప్రవేశము నిషిద్ధము. పోనీ, వారు తమ కొరకు ప్రత్యేకముగా దేవాలయములను నిర్మించుకొనగలరా అంటే వారికి ఆర్థిక స్తోమత లేదు. ఈ విధమైన మతము, ధనము, ముడిపడియున్న సమస్యకు సరియైన పరిష్కార మార్గము, దేవాలయమునూ, అందలి దేవుని బహిష్కరించటమేనని నిర్ణయిం చుకుని, నిషేధాజ్ఞలను విధించాడు. అట్టివారికి శివుని పూజించిన తృప్తి లభించటానికి జంగమములను పూజించమనీ, వారిని ఆరాధించుట, దేవాలయమునందలి శివారాధ నము కంటే శ్రేష్ఠమనీ చెప్పాడు. ఈ విధానము ద్వారా సామాజికముగా సున్నితమైన, అంటరానివారికి ఆలయ ప్రవేశముపై గల నిషేధమును నీరుగార్చాడు. అంతేకాక పై విధానమువల్ల దేవాలయములే కేంద్రములుగా వ్యాప్తిపొందుతున్న పాశుపతశాఖకు అడ్డుకట్టవేయగలిగాడు. ఈవిధంగా బసవేశ్వరుని దేవాలయ బహిష్కరణ విధానము ఇన్ని రహస్య ప్రయోజనములు కలిగి ఉన్నది.

దేవాలయ బహిష్కరణయే కాక, వీరశైవులు తీర్థయాత్రలకు వెళ్ళవలసిన అవసరం లేదన్నాడు. ఎందుకంటే వీరశైవుని దేహమే భగవంతుని నివాసము కనుక ఈవిధమైన ఆజ్ఞల వెనుకకూడా ఆర్థికమైన కారణములు ఉన్నాయి. బీదవారైన తన అనుచరులు, ఆ కాలములో కష్టభూయిష్టమైన ప్రయాణములు చేయుటకు కావలసిన ఆర్థిక, శారీరక శక్తియుక్తులు లేనివారు కావటమే;ముట్టుకుంటే మైలపడిపోతా మనటం, ముహూర్త నిర్ణయమునకై జ్యోతిషులను సంప్రదించటంవంటి, అగ్రకులజులు పాటించే ఆచారము లను తీవ్రంగా హేళన చేయుటయే కాక నిశితంగా ఖండించాడు. ఏ రోజున, ఏ సమయములో భగవంతుని స్మరిస్తారో ఆ సమయమే ఏ కార్యమునకైనా అత్యంత శుభప్రద మయినదని తెలియజేశాడు. సమాజములోని కులవిభజననూ, అంటరానితనమును, పరుషమైన పదజాలంతో నిందించేవాడు. ఒక వ్యక్తియొక్క

కులమును, ఆతడు చేసేవృత్తిని బట్టి నిర్ణయించాలేకానీ పుట్టుకను బట్టి కాదన్నాడు. వేదపఠనమును మానివేసిన బ్రాహ్మణుని బ్రాహ్మణునిగా పరిగణింపకూడదన్నాడు. చెప్పులు కుట్టు వృత్తిని మానివేసిన వ్యక్తి మాదిగ కాదన్నాడు. ప్రపంచములోని అందరు వ్యక్తులూ తల్లి గర్భము నుండి ఒకే మార్గము ద్వారా వచ్చిన వారేకానీ కొందరు ముక్కునుండీ, కొందరు చెవులనుండి రాలేదు కదా, అటువంటప్పుడు ఈ లోకంలో బ్రాహ్మణులు ఎవరు ? అంటరానివారెవరని ప్రశ్నించాడు. ఆయన చివరగా వ్రాసిన వచనముల ద్వారా ఆయన కుల వివక్షత ఖండనయందు ఏ స్థితికి చేరాడంటే, తాను, తన తండ్రి వద్ద పనిచేసిన చెన్నయ్య అనే అంటరానివానికి జన్మించినానని చెప్పుకున్నాడు. ఆయన ముందు ఎవరూ ఆయన కులమునుగానీ, తల్లి తండ్రుల పేర్లను గానీ ప్రస్తావిస్తే, ఆగ్రహము చెందేవాడు. తన మతములోనికి లక్షలాది దిగువ కులములవారిని అంటరానివారిని ఆకర్షించి, తద్వారా సమాజమును విభజి స్తున్న కులవివక్షతను, కులతత్త్వమును సమూలంగా నాశనము చేయవలెననే దృఢ సంకల్పము కలిగిఉండేవాడు. ఆ విధంగా ఆకర్షించుటకొరకై, హీనకులజుడు ఎవరైనా తన ఉద్యమ ములోచేరితే, ఆ వ్యక్తినేకాక, అతని వెంటవచ్చిన ఆయన కుక్కనుకూడా, ఊరేగింపుగా తీసుకువచ్చి, పూలదండలు వేసి కాళ్ళు కడిగి ఘనమైన సన్మానము చేస్తానని బహిరంగంగా ప్రకటించాడు. బిక్షాటనమును బసవేశ్వరుడు నిషేధించాడు. ఆయన “కాయక” అనే నూతన సిద్ధాంతము ద్వారా ప్రతివ్యక్తీ కాయకష్టము చేసుకొని జీవించాలని చెప్పాడు. సమాజము నకు ఏ ఒక్కరూ బరువు కాకూడదన్నాడు. ప్రతి వ్యక్తి చేసే వృత్తీ, ఆతడు జీవించుటకే పరిమితం కాకుండా, భగవత్సాక్షాత్కారమును కలుగజేయునదిగా ఉండాలి అన్నాడు. ప్రపంచములో ఉన్నత, వృత్తులనీ హీనవృత్తుల నేవి లేవన్నాడు. బసవేశ్వరుడు తనను తాను సంఘసేవకుడుగానూ, కాపలాదారు గానూ, పాకీవానిగానూ వర్ణించుకున్నాడు. సమాజంలో స్త్రీలను వేరుగా భావించుట తగదన్నాడు. వారు చదువుకొని విద్యావంతులై; ధనార్జనాపరులై, సమాజ కార్య క్రమములోనూ, మతపరమైన కార్యములలోనూ మగవారి వలెనే పాల్గొనవలసినదని ప్రబోధించాడు. స్త్రీల యొక్క సాహిత్య కార్యక్రమములను ప్రోత్సహించేవాడు. ఆయన ఇద్దరు భార్యలతోపాటు, ఆయన అక్కగారు, ముప్పైమంది ఇతర స్త్రీలుకూడ, అనేక వచనములను లిఖించారు. విధవావివాహములను కూడా ఆయన ప్రోత్సహించాడు.

స్థూలంగా చెప్పవలెనంటే, బసవేశ్వరుడు ప్రబోధించిన సిద్ధాంతములన్నీ, జాతి, కుల, లింగ, ధనిక, పేదలనే వివక్షతలులేని, సమసమాజ స్థాపనయే ధ్యేయంగా కలిగి ఉన్నవి. శాఖా వైషమ్యములు, బహుదేవతారాధనలు లేకుండా, ఏకేశ్వరోపాస నగా శివుని పూజిస్తూ, నీతిబాహ్యమైన కార్యములాచరించక, నైతిక ప్రవర్తనే పరమా ర్థంగా భావించి చరించునటువంటి సమసమాజము, సర్వమానవ కళ్యాణమే, సాంఘిక ప్రయోజనముగా భావించి పురోగమించగలిగిన వ్యవస్థ. జీవన యానములో, ఇతర విషయములకంటే, మానవతావిలువలనే ఉత్కృష్టమైనవిగా భావించి, పాటించగలిగిన సర్వోత్కృష్టమైన సమాజ నిర్మాణమే ఆదర్శములుగా ఆయన ప్రవచనములు రూపొం దింపబడినవి వీరశైవమను పేరుతో ఆయన చేపట్టిన ఉద్యమము ఆ విధములైన ఆదర్శములను సాధించుటకై విప్లవాత్మకమైన ధోరణిలో కొనసాగింది. తన జీవిత కాలమునందే, తన సంస్కరణల ద్వారా, తాను ఆశించిన ఫలితములను పొందవలె ననే ఆత్రుతతో, ఆవేశపూరితమైన పట్టుదలతో, తన ఉద్యమమును సాంఘిక తిరుగు బాటుగా రూపొందించాడు. ప్రతి నిత్యమూ, వేలాది ప్రజలను ముఖ్యముగా అంటరాని వారిని, హీన కులజులను “అనుభవ మంటపమను” వేదిక వద్ద సమావేశపరచి, గ్రామీణ భాషలో, సులభశైలిలో తాను రచించిన వచనములను వారికి వినిపించి, వారిని కూడా శివునియందు తమకుగల భక్తినీ, వీరశైవులుగా వారు అనుభవించు చున్న ఆనందమునూ, అనుభూతులనూ, వచనములుగా రచించి, ప్రకటించమని ప్రోత్సహించేవాడు.

బసవేశ్వరుడు కులవ్యవస్థను ముఖ్యంగా తాను జన్మించిన బ్రాహ్మణ కుల మును నిందించే సందర్భాలలో అసభ్య పదజాలమును ప్రయోగించేవాడు. అయితే ఆ విధమైన భాషణ ఆయన వీరశైవమతము యొక్క ఔన్నత్యమును ప్రకటించుటకు గానీ, వేదములను, వైదిక కర్మలను ఖండించుటకు గానీ వాడవలసిన అవసరములేనే లేదు. నిశితముగా పరిశీలిస్తే తాను ప్రచారము చేస్తున్న వీరశైవము నూతన మతమేమీ కాదు. వేదములలో చెప్పబడిన శైవమే దానికి మూలము. అందుండి గ్రహించిన, విషయమునకు కొన్ని మార్పులు, చేర్పులను చేసి వీరశైవ సిద్ధాంతమును సృష్టించుట జరిగింది. అంతేకాక ఇతర మతస్థులనూ, అగ్ర వర్ణములవారినీ, ముఖ్యంగా బ్రాహ్మ ణులపట్ల తనకుగల ఏహ్యతా భావమును ప్రకటించు సందర్భములలో వాడిన

అశ్లీలభాష, బహుశా చరిత్రలో ఎక్కడా, ఏ సంస్కర్తా ఇతరులను విమర్శించుటలో వాడినట్లు దాఖలాలు కన్పించవు. పరాయి దేశస్థులైన మతస్థులు కూడా, అన్యమతస్థులను, అంత నీచాతి నీచంగా ఖండించలేదు. బసవేశ్వరుని అధికారిక జీవిత చరిత్రగా పరిగణింపబడుచున్న పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలో, అన్యమతస్థులను, ఏ విధమైన అవమానములకు, బాధలకు గురిచేశారో, ఆ సంఘటనలన్నీ వివరంగా వర్ణించబడినవి. కొన్ని సందర్భములలో బసవేశ్వరునిపట్ల తమ విశ్వాసమును ప్రదర్శించుట కొరకూ, నూతన మతముపట్ల తమ భక్తిని ప్రకటించుట కొరకు, ఇతర మతస్థులను శారీరకమైన హింసలకు కూడా బసవేశ్వరుని అనుచరులు గురిచేశేవారు.

బసవేశ్వరుని మరణానంతరము ఆయన అనుచరులు అన్య మతస్థులందు ఎంతో వైషమ్యము ప్రదర్శించేవారు. మతావేశపరులై తమ ఆత్మ గౌరవమును సాధించుటకనీ, నిలుపుకొనుటకనీ, కుంటిసాకులు చెప్పి, బ్రాహ్మణులనే కాక, ఇతర కులస్థులను కూడా అవమానించటం, హింసించటం ప్రారంభించారు. బసవ పురాణములో ఈ రకమైన అనేక సంఘటనలు వర్ణింపబడినవి. బౌద్ధ విహారములనూ, జైనవసదులపై దాడిచేసి క్రమపద్ధతిలో పాడుచేసి, వాటిలో కొన్నింటిని శివాలయములుగా కూడ మార్పు చేసినారు.

వీరశైవమతస్థులపై కూడా జంగములు పెత్తనం చెలాయించేవారు. జంగము ఈశ్వరుని కంటె గొప్పవాడని బసవేశ్వరుడు చెప్పాడు కాబట్టి, తమ కొర్కెలను అన్నింటినీ తీర్చవలెనని, బలవంతము చేసేవారు. వారి శిష్యులను అడ్డగోలుగా దోపిడీ చేసేవారు. వీరిలో మిండజంగమములు అనే మరో శాఖవారు ఉండేవారు. "మిండ" అంటే తెలుగులో రంకుమొగుడని అర్థం. వారు పెండ్లిచేసుకునేవారు కాదు. బసవేశ్వరుడు శారీరక వాంఛలను బలవంతంగా అణచుకొనవద్దని చెప్పాడు. కాబట్టి, వారు తమ లైంగిక సుఖమును శివదాసీలు లేక బసివిలనబడేవారి వలన పొందేవారు. రానురాను వారు తమ శిష్యుల భార్యలను కోరి, తమ లైంగిక వాంఛలను తీర్చుకొనేవారు. ఈ విధంగా వారి శాఖను వీరశైవమును కూడా అపఖ్యాతిపాలుచేశారు. పైన తెలియజేసిన బసివిలను కన్యలను, వీరశైవులైన తల్లితండ్రులు, శివసేవకై దేవాలయముల వద్ద శివార్పణం చేసేవారు. అట్టివారు దేవాలయములయందు సేవలు చేస్తూ, గ్రామ ప్రజల దయాదాక్షిణ్యములపై బ్రతకవలెనని సాంప్రదాయము.

కానీ సమాజమునందలి చెడు ప్రవర్తకులు, వారి ద్వారా లైంగిక వాంఛలను సఫలం చేసుకొనేవారు. ఈ రకంగా బసవేశ్వరుడు ప్రవచించిన అనేక సూక్తులకు విపరీతార్థములను కల్పించి, తమ స్వార్థ ప్రయోజనములు సాధించుకొనటంద్వారా, ఆయన శిష్యులు, వీరశైవమతమునే అప్రతిష్టపాలు చేశారు. బసవ పురాణములో చెప్పిన ప్రకారం, దోపిడీలు, హత్యలు వంటి తీవ్రమైన నేరములు వీరశైవ మతాభివృద్ధికి ఆచరిస్తే, అటువంటి పాపులను, తనకు సేవ చేసినందుకుగాను శివుడు క్షమించి, అనుగ్రహిస్తాడని ప్రచారం చేసేవారు. వీరశైవమతస్తులైన బ్రాహ్మణులను "ఆరాధ్యులు" అని పిలిచేవారు. ఆరాధ్యుడు అంటే పూజింపదగినవాడని అర్థం. హిందూ మతములోని ఇతర శాఖలు వారిని చాలా గౌరవించేవారు, కాని వీరశైవ మతాను యాయిలు. వారిని తమ మతము నందు అంటరానివారికంటె కూడా హీనంగా పరిగణించే వారు. అందుకు వారు తెలియజేసే కారణమేమంటే, బసవని ప్రవచనముల ప్రకారం, ఒకేదేవుని పూజించాలి. ఆ ఒక్క దేవుడు లింగరూపమున ఉన్న శివుడు. కానీ ఆరాధ్య బ్రాహ్మణులు శివార్చనతోపాటు, యజ్ఞోపవీత ధారణచేసి, గాయత్రీమంత్ర జపం ద్వారా సూర్యుని కూడా ఆరాధిస్తారు కనుక వారు గౌరవించుటకు అనర్హులుగా పరిగణింపబడినారు. వీరశైవ మతస్థులైన జంగమాలలో అన్ని కులములవారూ ఉండేవారు. కానీ ఆరాధ్యులు అందరూ బ్రాహ్మణులే. వారు వేదాధికారమును, వాటి ప్రామాణ్యతనూ, వర్ణాశ్రమ ధర్మమును అంగీకరించి పాటించేవారు, కల్ప సూత్రములలో నిర్దేశించిన విధంగా అన్ని సంస్కారములను, విధులను ఆచరిస్తారు. అంత్య కర్మలు, శ్రాద్ధ కర్మలయందు మాత్రమే ఇతర శాఖకు చెందిన ముఖ్యంగా స్మార్తులతో విభేదిస్తారు.

బసవేశ్వరుడు బ్రాహ్మణులన్నా, వర్ణాశ్రమ ధర్మమన్నా ఎంతగా ఏవగించుకున్నప్పటికీ, వారికి తన మతములో ప్రవేశము కల్పించుటకు ముఖ్య కారణము, తన యందూ, తన మతముపట్ల అగ్రవర్ణముల వారి ఆగ్రహమును తగ్గించుటకూ, బ్రాహ్మణు లలో ఏ కొద్దిమందినైనా తన మతము నందు చేర్చుకుంటే కాలక్రమాన, అధిక సంఖ్యలో వారు వైదికమతమును విసర్జించి తన మతమును స్వీకరిస్తారనే ఆకాంక్ష. అయితే బసవని ఆశలు నిరాశలే అయినవి. పాల్కురికి సోమనాథుని వంటి ఏ కొద్దిమంది బ్రాహ్మణులను మించి, వైదిక మతమును, సాంప్రదాయములను వదలి అధిక సంఖ్యలో బ్రాహ్మణులు వీరశైవమతస్థులుగా మారలేదు. మల్లిఖార్జున

పండితారాధ్యుడనే వీరశైవ మతావలంబియైన, సమకాలీన బ్రాహ్మణుని, బసవే శ్వరుడు, వైదిక విధులను, యజ్ఞోపవీతాన్ని, గాయత్రీ మంత్ర జపాన్ని విసర్జించ వలసినదని కోరగా, ఆ బ్రాహ్మణుడు ఎంతో వినయంగా “భక్తి మీద వలపు బ్రాహ్మం బుతో పొత్తు బాయలేను నేను బసవలింగ” అని సమాధానమిచ్చాడట. తన ప్రస్తుత విధానమునే కొనసాగించుటకు అనుమతి కోరాడట.

బసవేశ్వరుడు లింగైక్యముచెంది దాదాపు 800 సంవత్సరములు గడచినప్ప టికీ, కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్రములయందు, దేశములోని ఇతర ప్రాంతములలోను నివసిస్తున్న లక్షలాది అనుయాయిల మనస్సులలో ఆయన స్మృతి, ప్రవచనములు నిత్య నూతనంగానూ, ఆచరణయోగ్యముగానూ, అనుసరణీయములుగానూ విశ్వ సించబడుచున్నవి. ఈ ఆధునిక యుగంలోకూడా, ఏవైనా ఇబ్బందులు, కష్ట, నష్ట ములు ఏర్పడినప్పుడు బసవేశ్వరుని నామస్మరణ చేసేవారు అనేకులున్నారు. బసవేశ్వరుడు కూడా ఈ లోకములోనికి అరుదెంచిన, ఇతర ప్రవక్తలవలెనే, తానూ ఒక ప్రవక్త అయితే, ఆయన తన భావములను అమలుపరచుటకు, తగని కాలము నందు అంటే ముందుగానే జన్మించాడు. బసవేశ్వరుడు తన జీవన సర్వస్వమునూ, ఆత్మపారిశుధ్ధ్యతకూ, సమాజము నందలి మూఢవిశ్వాసములను తొలగించుటకు మనిషికీ, మనిషికీ మధ్య, మత, సాంఘిక పరములైన భేదాలను, అంతరములను నిర్మూలించుటకు, నైతిక ప్రవర్తనకు కట్టుబడిన సంఘ నిర్మాణమునకూ, విగ్రహారాధ నను మాన్పించటానికీ, ఏకేశ్వరోపాసనే ప్రాతిపదికగాగల మతసృష్టికీ, మానవుని శివస్వరూపునిగా భావించి, నడయాడు జంగములను శివునిగా అర్చించగల నూతన సమాజ నిర్మాణమునకు ధారపోశాడు. అయినప్పటికినీ ఆయన ఆదర్శములన్నీ కాలమనే ఎడారిలోని ఎండమావులవలె అందకుండా పోయినై. ఆనాటి సాంఘిక, మత పరిస్థితులే అందుకు కారణమని చెప్పవచ్చు. బసవనికి ముందు, తరువాత జన్మించి తరించిన, ఇతర ప్రవక్తలవలెనే, ఆయనకూడా తన ఆదర్శసాధనమునందు విఫలుడైనాడు. అయితే సమాజము మాత్రము అనంతమైన కాలపరిధిలో ఎన్ని సంస్కరణోద్యమములు జన్మించినా, నశించినా, తనకు ఏమీ పట్టనట్టుగా విభేదాలతో, వైషమ్యాలతో, దయాదాక్షిణ్యాలను, పాపపుణ్యములను పట్టించుకోకుండా సాగి పోతూనే ఉన్నది.

■ ■ ■

# మల్లికార్జున పండితారాధ్యుడు

ఆంధ్ర దేశమున వీరశైవ మతవ్యాప్తిని అగ్రవర్ణములలో చేపట్టిన వారిలో 12 మంది ప్రసిద్ధులు. వీరిలో పండిత త్రయమని పేరుగాంచినవారు శ్రీ పతిపండితా రాధ్యులు, శివలెంకమంచన పండితారాధ్యులు, మల్లికార్జున పండితారాధ్యులు. వీరు ముప్వురునూ బ్రాహ్మణులు. ఆంధ్రదేశమున వీరిని ఆరాధ్య బ్రాహ్మణులు అని పిలుస్తారు. వీర శైవమతో ద్ధారకుడైన బసవేశ్వరుడు, వేదములను, వైదిక ధర్మములను, కర్మాచరణములను, కులవ్యవస్థను, బ్రాహ్మణులను నిరసించి, హేళన చేసినప్పటికినీ, ఆ మతావలంబులైన ఆరాధ్య బ్రాహ్మణులు ముప్వురూ వీరశైవము, వేదొక్తమైనదియే యనెడి గుర్తింపునకు కృషి చేసినారు. శివుడొక్కడే దైవమని, శివారాధన మాత్రమే ఆచరించినప్పటికినీ, వీరు వేదోక్తములైన షోడశ సంస్కారములను విడచివేయక, ఉపవీతమును ధరించి, గాయత్రి మంత్రమును త్రి కాలములయందు జపిస్తూ, వైదిక కర్మలను ఆచరిస్తూ, ఇటు వీరశైవమునకు, అటు వైదిక ధర్మమునకు మధ్యవారధి వంటివారు.

పై ముప్వురిలో మొదటివారైన శ్రీపతి పండితారాధ్యులవారు క్రీ.శ. 11వ శతాబ్దమునకు చెందినవారు. శ్రీశైలము జన్మస్థలము. తండ్రి మల్లికార్జునుడు, తల్లి

భ్రమరాంబ. ఈయన అనంతభూపాలుడనెడి రాజునకు గురువు. వీరు ఎక్కువ కాలము బెజవాడయందే నివసించిరి. వీరిని గురించి అనేక గాధలు ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్నవి. పాల్కురికి సోమనాధుడు "పండితారాధ్య చరిత్ర" యందలి దీక్షాప్రకరణంలో శ్రీపతి పండితుడు లోకానుసారియైన త్రిలోచనుడు అంటే పరమశివునిగా కీర్తించాడు. శ్రీపతి పండితుడు లోకోపారిగా కీర్తిగడించాడు. శైవ సాహిత్యంలో ఆయన కరుణా పారీణతకు, సంబంధించిన అనేక సంఘటనలు వర్ణింపబడినవి, ఒకసారి బెజవాడలో రోగగ్రస్థుడై కదలలేని స్థితిలో ఉన్న కడజాతివాని ఇంటికి, బంధువులు, శిష్యులు, ఇతర బ్రాహ్మణులు వారించుచున్ననూ వెళ్ళి వాని రోగ విముక్తుని చేశాడట. ఒకసారి ఆయన వద్ద దీక్షగొని, ప్రాణ లింగమును ధరించిన శిష్యుడు, కృష్ణానదిలో స్నానము చేస్తుండగా, మెడలోని తాడు తెగి లింగము నీటిలో పడిపోయినదట. ఆ శిష్యుడు తల్లడిల్లి, శ్రీపతి పండితుల వద్దకువచ్చి జరిగిన విషయము తెలియజేశాడట. ఆయన శిష్యుని ఊరడించి, మరొక లింగమును ఇస్తామని చెప్పారట కానీ, శిష్యుడు తనకు నీట మునిగిన లింగమే కావలెనని పట్టుబట్టాడట. అంతట శ్రీపతులు తమ తపశ్శక్తి వినియోగించి లింగము పడిపోయిన ప్రదేశములో ప్రవాహమునుచీల్చి కోల్పోయిన ప్రాణలింగమును తిరిగి లభించు నటుల చేశారట.

పశ్చిమ చాళుక్య ప్రభువైన, అనంతపాలుడు కొండపల్లి రాజధానిగా పరిపాలి స్తున్న కాలంలో, ఆయన గురువైన శ్రీపతి పండితులపై ప్రత్యర్థులు అనేక ఆరోపణలు చేసి, గురుత్వమునకు ఆయన తగడని చెప్పారట. రాజు తన గురువుపై వచ్చిన అభియోగములు విచారణకై సభనేర్పాటు చేయగా, ఆ సభలో శ్రీపతి పండితులు, అభియోగము చేసిన వారిని ఉద్దేశించి, శివుడొక్కడే దేవుడని నమ్మిన శివారాధకు లందరూ సమానులే. అసమానత్వం పాటించుట మహాపాపము. సంకుచిత భావ ములు, సమాజ విచ్ఛిన్నతకు దారితీస్తాయి. భేదభావములు తగవని మందలించారట. శ్రీపతుల ప్రసంగము విన్న అనంత భూపాలుడు సంతృప్తిచెంది, ఆయనను నిర్దోషిగా నిర్ణయించి ఫిర్యాదులు చేసిన వారిని మందలించారట. అయినప్పటికీ శ్రీపతి పండి తులయందు ద్వేషభావన విడలేని ప్రత్యర్థులు ఆయనను కులమునుండి వెలివేశారట. సంఘ బహిష్కరణకు గురియైన శ్రీపతులు అనేక ఇబ్బందులకు గురియైనారట. చివరకు ఎవరూ నిప్పుకూడా ఇవ్వలేదట. ఇటువంటి మాత్సర్యపూరితులకు

జ్ఞానోదయము కలుగచేయవలెననెడి సత్సంకల్పంతో, శ్రీపతి పండితులు తన మంత్ర శక్తితో అగ్నిని సృష్టించి, నిప్పుకణికలను తన ఉత్తరీయములో మూట కట్టి ఒక జమ్మిచెట్టు కొమ్మకు వ్రేలాడదీసి, ఊరిలో ఎవరైనా ఈ నిప్పుల మూటను కొమ్మనుండి దింపితేగానీ, ఊరులో ఎవరింట్లోను నిప్పురాజదని ఆంక్ష విధించారట. దానితో ఎవరింట్లోనూ వంట చేసుకొనుటకు పొయ్యిలో నిప్పురాజలేదు. అగ్ని కార్యమునకు హోమగుండంలో అగ్నిజ్వలించలేదు. రోజులు గడుస్తున్నకొలదీ సంఘ బహిష్కరణ చేసిన వారు, అనేక విధములైన అగచాట్లు అనుభవించ సాగారు. చివరకు బాధలకు తాళలేక ప్రభువైన అనంతభూపాలుని వద్ద మొరబెట్టుకున్నారట. ఆ విషయము తెలుసుకొనిన రాజు, కొండపల్లి నుండి స్వయముగా శ్రీపతి పండితులవద్దకు వచ్చి, అపచారము నొనర్చిన ప్రజల పక్షమున తాను క్షమాపణ చెప్పుకున్నాడట. అగ్నిపై విధించిన ఆంక్షలను ఉపసంహరించమని వేడుకొన్నాడట. కరుణాసముద్రుడని పేరు గాంచిన శ్రీపతి పండితుడు వారిని క్షమించి, చెట్టు కొమ్మకు కట్టిన, నిప్పుల మూటను క్రిందకు దించినాడట. వెంటనే ఇంటింటా అగ్నిహోత్రుడు ప్రజ్వలించినాడట. అంతటి శక్తి వంతుడైన శ్రీపతి పండితులు, ముందు మనవి చేసినట్లు అనంతపాలయ్యకు జ్ఞానగురువు. వీరి బోధనలనువిని జైనుడైన ఆ రాజు శైవుడైనాడట. జైనునిగా ఉన్నప్పుడు ఆ రాజు చేబ్రోలు (గుంటూరు జిల్లా)లోని అనంత జైనాలయమును నిర్మించినాడట. శ్రీపతి పండితుల కాలమునందే శైవుడైన ఆ రాజు కొల్లూరు (గుంటూరు జిల్లా) లోని నరేంద్రేశ్వర జైనాలయమును, శివాలయముగా మార్చి అనంత భోగేశ్వరాలయమని పేరుపెట్టినారట. తెనాలి (గుంటూరు జిల్లా) కైఫీయతు ప్రకారం, ఆ గ్రామములోని ఒక జైన వసదిని శివాలయముగామార్చి, దానికి రామలింగేశ్వరస్వామి దేవాలయమని నామకరణము చేసినారట. కొన్ని సంవత్సర ముల క్రితం, ఆ దేవాలయ ఆవరణములో, త్రవ్వకపు పనులు జరుపుచుండగా మహావీరుని విగ్రహం బయటపడింది. పాలుకురికి సోమనాథుడు “పండితారాధ్య చరిత్ర”మనే మల్లికార్జున పండితారాధ్య జీవితచరిత్రగల గ్రంథములో జైనులకు, శైవులకు మధ్య జరిగిన అనేక సంఘర్షణలను వివరంగా వర్ణించినాడు. వాదనలలో ఓడిపోయిన జైనులు, వీరశైవ మత స్వీకారమైనా చేయాలి లేదా ప్రాణములైనా కోల్పోవలెనేగానీ మరో గత్యంతరం ఉండేది కాదు. అదే గ్రంథములో దేవర దాశయ్యనే వీరశైవమత అతివాది. పొట్ల చెరువులో (నేటి పట్టాన్ చెరువు – మెదక్‌జిల్లా) 500

జైన వసదులను నాశనంచేసి, ఆ ప్రదేశములలో శివాలయలములను నిర్మించినట్లు వ్రాయటం జరిగింది. ఆ దేవునికి ఉత్తరేశ్వరుడని నామకరణం చేశారట. ఆ నాటికి జైనము పూర్తిగా బలహీనమై, మతసంబంధమైన అనేక విషయములలో హిందూ పద్ధతులను అనుకరించసాగింది. తమ ఉనికిని నిలుపుకొనుటకు, జైనులు కుల వివక్షతను కూడా పాటించినారు. జైన మతములో తమకు అగ్ర వర్గములతో సమాన ప్రతిపత్తి లభిస్తుందన్న ఆశతో ఆ మతమునందు పూర్తి అవగాహనలేక చేరిన హీన కులస్థులు, అంటరానివారు, నిరాశులై, కులవివక్షతలేని సమసమాజస్థాపనే, ఆదర్శమని ప్రచారము చేసిన, వీరశైవమతములోనికి గుంపులు గుంపులుగా ప్రవేశించారు. ఆ విధంగా వీరశైవము, నాస్తిక మతములైన జైన, బౌద్ధ మతముల ప్రాబల్యముపై దెబ్బతీసి, తన అనుచరగణములను వృద్ధి చేసుకున్నది. వైదిక ధర్మము, బ్రాహ్మణాధిక్యతకై సృష్టింప బడినదనీ, కుల వివక్షతను పాటిస్తున్నదనీ, విమర్శించి, ఆ ధర్మముపట్ల ప్రజాబాహుళ్యంలో ఏహ్యతా భావమును సృష్టించి, ఆంధ్రదేశమంతటా తమ ప్రాబల్యమును పెంచుకొనిన నాస్తిక మతములు, చివరకు వీరశైవమత ధాటికి తాళలేకపోయినవి. క్రీ.శ. 12వ శతాబ్ద ఆరంభములో, కాకతీయ గణపతి దేవ చక్రవర్తితో ప్రారంభమై, ఆ తరువాత విజయనగర ప్రభువులు, వారిసామంతులచేత ఆదరింపబడిన శైవము, జైన, బౌద్ధ మతములను రెంటినీ ఆంధ్రదేశము నుండి తరిమివేసిందని చెప్పవచ్చు. అటువంటి మతపరిస్థితులు ఆంధ్రదేశము అంతటా వ్యాపించియున్న కాలంలో పండితత్రయము జన్మించి, వీరశైవ మతమునకు అనుబంధమైన ఆరాధ్య శైవ ప్రచారము చేపట్టారు.

శ్రీపతి పండితుల తరువాత రెండవ వారైన శివలెంక మంచన పండితులు శ్రీకాళహస్తి నివాసులు. సాంఖ్యాయనస గోత్రీకులు. వీరి తాతగారు సోమన శంభుడు. వీరు గౌడ దేశమందలి గోళకీ మఠమునకు కూడా అధిపతులు. వీరుకూడా క్రీ.శ. 11వ శతాబ్దికి చెందినవారని నానుడి. ఈ విషయముపై ఇంకనూ పరిశోధన అవసరము.

పండిత త్రయమునందు చివరివాడూ వయసులో చిన్నవాడు మల్లికార్జున పండితా రాధ్యుడు. బసవేశ్వరునికి సమకాలీనుడు. వీరిద్దరూ శివాంశ సంభూతులని వారి అనుయాయుల విశ్వాసము. బసవేశ్వరుడు శివుని వాహనమైన నందీశ్వరుని అవతారమేననీ నాస్తికమతములను నిర్మూలించి తన ఆరాధనను వ్యాప్తిచేయ వలసిన

దని నిర్దేశించి, శివుడే స్వయంగా వారిద్దరినీ పంపినాడని వీరశైవుల దృఢ నమ్మకం. పండితారాధ్యుడు తనను కూడా శివుడే ఈ లోకమునకు బ్రాహ్మణునిగా పంపి, బసవేశ్వరుని ఉద్యమమునకు సాయము చేయమని ఆదేశించినాడని చెప్పుకున్నాడు. శివునిలోగల ఉత్కృష్ట గుణసంపద నంతటినీ తనలో ఇమిడ్చి, ఆయన ప్రతినిధిగా తనను ఈ లోకములోనికి పంపినాడని ప్రకటించుకున్నాడు. బసవేశ్వరుడు, ఉద్రేక పూరితంగా తనదైన శైలిలో వేదములను, వర్ణాశ్రమ ధర్మమును, వైదిక కర్మలను, లింగభేదమును ఖండిస్తూ తన వీరశైవమత వ్యాప్తికి ప్రచారము చేపట్టగా, మల్లికార్జున పండితారాధ్యుడు, లేక పండితయ్య వేదముల ప్రామాణ్యతను, వేదోక్తమైన సంస్కార ములను, వర్ణాశ్రమ ధర్మమునూ ధిక్కరించక, కల్ప సూత్రములయందు నిర్దేశింప బడిన, అన్ని విధులనూ ప్రతివారూ నిర్వహించవలెనని ప్రచారము చేశాడు. ఒక్క అంత్యక్రియలు, శ్రాద్ధకర్మల విషయములో, ఆయన ధర్మ సూత్రములను అనుసరిం చక, శైవాగమములో నిర్ణయించిన విధంగా జరుపవలెనని ఆదేశించినాడు.

**శ్లో॥ అపసవ్యం, తిలాన్, ధర్భాన్, న అగ్ని కర్మాచ, న పారణం**
**వికిరమ్, అర్ఘ్య పాద్యంచ, శైవాన్, సప్త విసర్జయేత్**

సూత్రములు, స్మృతులను అనుసరించి శ్రాద్ధమును పితృయజ్ఞ మంటారు. వాటియందు నిర్దేశింపబడిన పంచ యజ్ఞములలో శ్రాద్ధము ముఖ్యమైనది. ప్రతి హిందువూ, ముఖ్యముగా బ్రాహ్మణుడు తన తల్లిదండ్రులు చనిపోయిన దినమున, ఈ పితృయజ్ఞము లేక శ్రాద్ధకర్మమును ఆచరించి తీరవలసినదే. ఈ కర్మను ఆచరించు నప్పుడు యజ్ఞోపవీతమును అపసవ్యముగా (కుడి భుజముమీద) వేసుకొని, తిలలు (నల్లనువ్వులు), దర్భలతో తర్పణమూ, అగ్నిని ప్రజ్వలించి ఆహుతులు, సమర్పించుట (అగ్ని కార్యము), పారణ అనగా పితృ పితామహ ప్రపితామహాదులకు ఆహారముగా నివేదించు పిండములు, పాద్యము (నీరు)తో పితృదేవతా స్వరూపులైన బ్రాహ్మణుల కాళ్ళు కడుగుటవంటి క్రియలను, ఆరాధ్య శైవము నిషేధించినది. వారు పితృ యజ్ఞమును "ఆరాధన" అంటారు. పితృ దేవతల స్వరూపులుగా భావించి బ్రాహ్మణు లను స్మార్తులు "భోక్తలని" పిలిస్తే, శైవులు వారిని "మాహేశ్వరు"లంటారు. మరణా నంతరము జీవుడు మహేశ్వరునిలో ఐక్యము చెందును కనుక, వారికి వేరు ఉనికి లేదు. కాబట్టి ఆనాడు మాహేశ్వరుని ఆరాధించినచో పితృదేవతలను ఆరాధించినట్లే

నని వారిమతం. అందువల్ల అశుభ చిహ్నాములైన, నల్ల నువ్వులు, దర్భలు వంటివి వాడరాదని వారి సిద్ధాంతము. స్మార్తులు (స్మృతుల ననుసరించు వారు) శ్రాద్ధమును, తమ పూర్వీకుల సంస్మరణదినంగా భావించి, తమ పితృ పితామహ ప్రపితా మహులు, వసు, రుద్ర, ఆదిత్య రూపములలో ఉంటారనీ, భోక్తలు(భుజించువారు) అనబడు బ్రాహ్మణులను అర్చించి, వారికి సంతృప్తిగా భోజనము నివేదించుట ద్వారా తమ పూర్వీకులకు భోజ్య పదార్థములను అందచేసినట్లుగా నమ్ముతారు. అంతేకాక అన్న ముతో మూడు పిండములనుచేసి, వాటిని ఆవుకు తినిపించుటగానీ, అగ్నిలో ఆహూతి చేయుటగానీ, నీటిలో నిమజ్జనము చేయుట గానీ ఆచరించుటవలన తమ పితృదేవతలకు అవి చెందుతవని విశ్వసిస్తారు. పైన వివరించిన వైవిధ్యములు, పితృ దేవతారాధనలో స్మార్త బ్రాహ్మణులకు, ఆరాధ్య శైవులకు ఉండగా, వీరికి బసవేశ్వరుని మతాను యాయులతో కూడా, ఆచారముల యందు విభేదములున్నవి. యజ్ఞోపవీత ధారణ, గాయత్రీమంత్ర జపము, ఆరాధ్య శైవులు ఆచరిస్తారు. జంగ ములు వాటిని నిరశిస్తారు. అందువల్లవారు ఆరాధ్యులను 'భవు'లన్నారు. ద్వేషించారు. ఆరాధ్యులు, గాయత్రీ మంత్రము నందలి 'భర్గ' శబ్దమునకు సూర్యుడుకాదనీ శివుడనీ అర్థము చెప్పినప్పటికీ, జంగములు ఆమోదించలేదు. బసవేశ్వరుడు, మల్లికార్జున పండితుని యజ్ఞోపవీతమును తన వలెనే విసర్జించ వలసినదనీ, గాయత్రి మంత్రము జపించవలదనీ కోరాడట. కానీ పండితయ్య అందుకు అంగీకరించక, సున్నితంగా "భక్తిమీద వలపు, బ్రాహ్మ్యంబుతో పొత్తు, బాయలేను నేను బసవలింగ" అని బసవని కోరికను త్రోసిపుచ్చినాడని నానుడి.

ఆరాధ్య బ్రాహ్మణులు గాయత్రీ మంత్ర జపముతో పాటు "పంచాక్షరీ మంత్ర జపము కూడా చేస్తారు. షడాక్షరీ మంత్రమును జపించరు. జంగములు ఇందుకు ఆక్షేపణ తెలియజేస్తూ, ఆరాధ్య బ్రాహ్మణుని ముఖంచూసినా పాపమని నిందిస్తారు. జంగములు, ఇతర లింగధారులు, శివలింగమును ధరించిన తమ దేహములకు మించిన పవిత్ర తీర్థములు ఎక్కడా లేవంటారు. కానీ ఆరాధ్య బ్రాహ్మణులు స్మార్తులవలె తీర్థ యాత్రలకు వెళ్లటం, దేవాలయములందలి శివలింగములను సేవించటం, ఇతర పవిత్ర ప్రదేశములను దర్శించటం వంటి కార్యక్రమములు ఆచరిస్తారు. జంగముల వలె, ఇతర మతములను విడచివచ్చిన వారిని ఆరాధ్యులు తమ శాఖలోనికి తీసు

కొనరు. అయితే కొంతమంది బ్రాహ్మణులు, మల్లికార్జున పండితారాధ్యులు వ్రాసిన "శివతత్త్వసారము"అను గ్రంథములోని బోధనల ప్రభావంతో యజ్ఞోపవీతాన్నీ, సంధ్యా వందనము, గాయత్రీ జపమువంటి వాటిని విసర్జించి, బసవని వీరశైవ సాంప్రదాయంలోని జంగములతో కలసిపోయారు. అట్టివారిలో ప్రముఖుడు పాల్కురికి సోమ నాథుడు. తానేకాక తనతోటి బ్రాహ్మణీకమును కూడా తనను అనుసరించమని ప్రోద్బలం చేశాడు.

వీరశైవులకూ, ఆరాధ్యశైవులకు చాలా విషయములలో ముఖ్యంగా ఆచార వ్యవహారములలో పోలికలు వున్నవి. ఇరుశాఖలకు చెందినవారు లింగధారణ చేస్తారు. శివారాధనచేస్తారు. ముక్తి మార్గములైన భక్తి, జ్ఞాన, వైరాగ్యములలో, భక్తికే అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. నాస్థిక మతములైన జైన, బౌద్ధ, చార్వాకాది మతముల పట్ల విపరీతమైన ద్వేష భావన కలిగిఉంటారు. అంతేకాక హిందూమతము నందలి ఇతర శాఖలయందు, సంప్రదాయములయందు కూడా ద్వేషభావము చూపు తారు. వారికిగల ద్వేష ప్రవృత్తి పరాకాష్ట నందుకొని, హింసకుకూడా దారితీసిన సంఘటనలు ఎన్నో ఉన్నవి.

సోమనాథుని పండితా రాధ్య చరిత్ర ప్రకారమూ సాంప్రదాయకముగా కూడా, మల్లికార్జున పండితుడు క్రీ.శ.1100వ సంవత్సరమున జన్మించినట్లు తెలియుచున్నది. తండ్రియైన భీమపండితుడు, ద్రాక్షారామము (తూ.గో.జిల్లా)లోని భీమేశ్వరాలయము నందు అర్చకుడు. తల్లి గౌరాంబ. వారు ఋగ్వేద శాఖీయులు. గౌతమ గోత్రజులు. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వారు కాశ్యపస గోత్రీయులుగా అభిప్రాయపడ్డారు. వారు పుత్ర సంతానమునకై శ్రీశైలమల్లి కార్జునుని సేవించినారట. వారి సేవలు ఫలించి వారికి పుత్రుడు కలిగినాడట. వానికి శ్రీశైలస్వామియైన మల్లికార్జునుని పేరు పెట్టారట. బాల్యమునందే ఉపనయన సంస్కార మునుచేసి, వేదములు, శైవ ఆగమములు మొదలైన వైదిక, శైవ సిద్ధాంతములందు ప్రావీణ్యతను పొందుటకై, గురువైన ఆరాధ్యదేవునికి ఒప్పగించారట. ఆరాధ్యదేవుడు గోదావరి ఎడమ గట్టునగల కోటిపల్లి గ్రామవాసి. ఆయన శిష్యుని మంచి విద్యావంతునిగా తీర్చిదిద్ది, తండ్రికి వారసునిగా ద్రాక్షారామ భీమేశ్వర ఆలయమునందు అర్చకత్వము నిర్వహించగల సమర్థునిగా తయారుచేశాడట. ఆరాధ్యదేవుడు నిర్దేశించినట్లుగా పండితయ్య

ఆలయమునకు సంబంధించిన అన్ని విధులను సక్రమంగా నిర్వహించసాగాడు. ఒకనాడు స్మార్తశాఖకు చెందిన బ్రాహ్మణ యువకులు, మల్లికార్జునుని మెడనుండి వ్రేలాడుతున్న శిలింగమునూ, శివాభిషేకా నంతరము, అభిషేక జలమును తీర్థముగా సేవించటం గమనించి, స్మార్త సాంప్రదాయమునకే చెందిన మల్లికార్జునుడు, ఆ సాంప్రదాయమునకు విరుద్ధమైన పనులు చేస్తున్నందుకుగాను హేళనచేశారట. అప్పటికే శైవాగమములయందు పాండిత్యమును సంపాదించిన మల్లికార్జునుడు ఆ బ్రాహ్మణ యువకులకు విభూతియొక్క పవిత్రతను గురించీ, రుద్రాక్షల మహిమ గురించీ, శివునికి నైవేద్యముగా పెట్టిన తీర్థ ప్రసాదములను సేవించుటలోగల ఔచిత్యమును గురించీ సుదీర్ఘమైన ప్రవచన రూపములో సంహితలను (వేద మంత్ర ములు) స్మృతులను, పురాణములను, ఇతర పవిత్ర గ్రంథముల నుండి ప్రమాణము లను ఉటంకిస్తూ, విశదీకరించాడట. ఆయన జవాబు వినిన ఆ యువకులు ఆయన పాండిత్యమునకు ఆశ్చర్యచకితులైనారు. ఆ విధంగా బాల్యంలోనే మల్లికార్జున పండితుడు, వీరశైవము వేద సమ్మతమైన సిద్ధాంతమనే గుర్తింపును పొంద గలిగినాడు. ఆయన వైష్ణవమునకు మూలమైన పాంచరాత్రాగమము, వేద బాహ్యమైన నాస్తిక సిద్ధాంతమనీ, స్మృతులనుండి, ఆగమములనుండి, ప్రమాణములను ఉదహరించి తెలియజేశాడు. అద్వైత మతావలంబులను, బుద్ధి హీనులుగానూ, పాషండులుగానూ, లోకాయత మతస్తులకు సమానులుగానూ వర్ణించాడు. లోకాయత మతము నాస్తిక మతములలో నొకటి. జైన, బౌద్ధ, చార్వాక మతములు, వేద బాహ్యములనీ, నాస్తిక మతములనీ ప్రచారము చేస్తూ, వాటిపై తనకుగల పగను బహిరంగంగా ప్రకటించే వాడు. ఆయన రచించిన "శివ తత్త్వసారమ"నే గ్రంథము నందు ఇతర మతములపట్ల హీనమైన విమర్శలు కురిపించి, వీరశైవ మాహేశ్వరుల ప్రవర్తనా విధానము, ఏవిధమైన సక్రమపద్ధతిలో ఉండవలెనో నిర్దుష్టమైన నియమముల ద్వారా తెలియ పరచినాడు. తానా విధముగానే జీవితాంతము వరకూ ప్రవర్తించాడు. పండితయ్య సమావేశములకు శ్రద్ధగావచ్చి, ఆయన ప్రవచనములకు ముగ్ధులైన వారిలో ముఖ్యులు ఇద్దరు. ఒకరు పోరండ్ల సూరసానియనెడి వేశ్య. మరొకరు బెలిదేవి వేమనారాధ్య. పండితారాధ్య చరిత్రలో శూరసాని చరిత్ర విపులంగా వ్రాయబడింది. వీర శైవుడైన ఒక అంటరానివాడు, జంగముగా తిరుగుతూ, శూరసాని కోరికపై శివార్చన చేయ

టానికి తరచుగా ఆమె ఇంటికి వచ్చేవాడు. అది గమనించిన కొందరు బ్రాహ్మణులు శూరసాని వర్ణ సంకరమును ప్రేరేపిస్తున్నదని రాజుకు ఫిర్యాదు చేశారు. వారంతా కలిసి మూకుమ్మడిగా ఆమె ఇంటికి వెళ్ళి సంఘము నుండి వెలివేస్తామని బెదరించారు. అందుకు ఆమె భయపడక పోగా, వారి అహంకారము నకు మందలించి, శివరూపుడైన జంగమును పదేపదే అంటరాని వాడు అని నిందించుటను గర్హించింది. అనంతరం వారికి శివుడే అంటరానివాడుగా మారిన ఉదంతమును చెప్పింది. పండితయ్య అనుచరుడైన బలదేవి వేమనారాధ్యని మనుమలు పాల్కురికి సోమ నాథునకు అతని సహచరులకు విద్యాబోధన చేశారు. పండితయ్య వీరశైవమును స్వీకరించిన ప్రారంభదినాలలో, కులవివక్షతలేని సమాజ స్థాపనకు ప్రచారము చేసినట్లు అతని ప్రవచనములను బట్టి, రచనలను బట్టి తెలుస్తోంది. కొంతకాలము తరువాత, మనసు మార్చుకొని కులవ్యవస్థను సమర్థించాడు. ఆయన శివతత్త్వ సారములో అంటారనివాడైనా లింగధారణ చేయగానే బ్రాహ్మణుడు అవుతాడని వ్రాశాడు.

మల్లికార్జున పండితుడు కూడా బసవని వలె రాజాదరణనూ, రాజుకొలువులో ఉన్నతమైన పదవినీ సంపాదించి, తద్వారా బసవనివలె తన సిద్ధాంత ప్రచారము చేయవలె నని ఉవ్విళ్లూరినాడు. కొండంత ఆశతో వేంగీచాళుక్యుల సామంతుడైన, వెలనాటి చోడుడైన రెండవ రాజేంద్రచోడుని రాజధానియైన ధనదుపురము (చందవోలు గుంటూరు జిల్లా)కు వచ్చాడు. ఆ పట్టణములోని శివాలయమును వసతిగా చేసుకొని, పట్టణములోను, శివారు ప్రాంతములలోనూ వీరశైవ సిద్ధాంత ప్రచారమును తీవ్రంగా ఆరంభించాడు. ఆయన కీర్తి ప్రతిష్ఠలు అచిర కాలములోనే ఆ ప్రాంతమంతా వ్యాప్తిచెంది, ఆయన ప్రవచనములు వినటానికి తండోపతండము లుగా ప్రజలు వచ్చి ముగ్ధులై; తమకు శివదీక్ష నివ్వమని ప్రాధేయపడేవారు. రాజు ఆస్థాన గురువు బుద్ధపాదాచార్యుడు అనతి దూరములో నున్న బుద్ధపుర విహారములో నివసించేవాడు. బుద్ధపురమే నేటి బాపట్ల తాలూకాలోని బుద్ధాం అనే గ్రామమని భావించవచ్చు. పండితయ్య వీరశైవమత వ్యాప్తికి చేపట్టిన కార్యక్రమములపై రాజుకు ఫిర్యాదు చేశాడు. రాజు ఆంతరంగికులతో సంప్రదించి తన సమక్షంలో ఉన్నత ఉద్యోగులు, పండితులు, సామాన్య ప్రజలతో కూడిన సదస్సును ఏర్పాటుచేసి, ఆ సదస్సులో బౌద్ధాచార్యుడు, పండితయ్య తమ వాదనలు వినిపించి చర్చించవలెనని

ఆదేశించినాడు. బౌద్ధాచార్యుడు ఆ సదస్సులో పండితయ్యను ఓడించి, ప్రజలలో వ్యాప్తిచెందుతున్న ఆయన ప్రభావమును అడ్డగించి తుడిచి వేయవచ్చునని ఆశించి తన సమ్మతిని రాజుకు తెలియజేశాడు. అటువంటి ఆలోచనే కలిగియున్న పండితయ్య కూడా సంతోషంగా తన అంగీకారమును తెలియజేశాడు. రాజు సమక్షములో సభ ప్రారంభమైనది. పండితయ్యను ముందుగా చర్చ ప్రారంభించవలసినదని కోరారు. పండితయ్య తన పాండిత్యప్రకర్షనూ, వాదనా పటిమనూ, జలపాతము వంటి అనర్గళ వాగ్ధాటినీ ప్రదర్శించి శైవ సిద్ధాంతము యొక్క ఔన్నత్యమును సభాసదులు ఆశ్చర్య చకితులవునట్లుగా ప్రసంగించాడు. అంతటితో తృప్తిచెందక తన ప్రత్యర్థులను మరింత అవమానించవలెనని తలంపుతో కాబోలు, ఈ సభలో ఎవరైనాసరే శివునికి మించిన దైవమున్నాడని ఋజువు చేసినచో, తానే స్వయముగా తన తలను నరుకుకొని, అగ్నిజ్వాలయందు ఆహుతి అవుతానని సవాలు చేశాడు. తన ప్రత్యర్థులు చేయలేక పోతే వారి శిరస్సులను తన పాదములతో తన్నుతానని చెప్పాడు. అంతటితో ఆగక, "రుద్రమహిమ" అను గ్రంథమును ఆశువుగా కూర్చి పఠించాడు. సభలో బౌద్ధాచార్యునితో సహా ఎవ్వరూ పండితయ్య సవాలును ఎదుర్కొనుటకు సిద్ధపడలేదు. విజయ గర్వంతో, ఆనందంగా పండితయ్య తన శిష్యులు, అనుయాయులు వెంటరాగా తన బసకుచేరాడు. సోమనాథుడు పండితారాధ్యచరిత్రలో మల్లికార్జున పండితుడు అతని పరివారమూ, ఎంత వైభవముగా దేశము అంతటా పర్యటించేవారో విశదంగా వర్ణించాడు. శిష్యులు, పండితులు, సామాన్య ప్రజలు, సూక్త పఠనము, స్తోత్రములు, శివ సంకీర్తనలు ఉచ్ఛైస్వరముతో పఠిస్తూ వెంటరాగా, శంఖములు, కాహళములు, భేరీల మ్రోత మిన్నుముట్టుచుండగా, చక్రవర్తి తరలివెళ్లుతున్నట్లు మల్లికార్జున పండితుడు ఊరేగింపుగా గ్రామముల గుండా సాగిపోతూ ఉండేవాడట.

వాదనలో ఓడిన బుద్ధ పాదాచార్యుడు, బౌద్ధులైన కొందరు ప్రభువులు, ఉన్నత ఉద్యోగులు, ప్రజలు, ఓటమికి చాలా సంతాపము చెందారు. ఈ వివాదము ఇంతటితో సద్దుమణగలేదు. పండితయ్య పరివారములోని కొందరుతీవ్రవాదులు చర్చా సమయములో, బౌద్ధాచార్యుడు, అతని శిష్యులు శివనిందను జరిపేరని ఆగ్రహ పూరితులై, పగసాధించ వలెననే నిర్ణయం తీసుకున్నారు. బౌద్ధాచార్యులకూ ఆయన శిష్యగణమునకు తగిన బుద్ధి చెప్పకపోయినచో, తమ గురువైన పండితారాధ్యులకూ,

వారు ప్రబోధిస్తున్న వీరశైవ మతమునకు ద్రోహముచేసినవారము అవుతామనే దృఢవిశ్వాసంతో వారిలోవారు సంప్ర దించుకుని నిర్ణయించిన కార్యమును, రేమయ్య, దేవయ్య అనే ఇద్దరు శిష్యులకు అప్పగించారు. బౌద్ధాచార్యుడు నిత్యమూ చైత్యము నందు ప్రతిష్ఠించిన బుద్ధ విగ్రహమును పూజించుటకు వెళ్లటం అలవాటు. పండి తయ్య శిష్యులు ఇద్దరూ ముందుగా చైత్యములో ప్రవేశించి దాక్కున్నారు. బౌద్ధా చార్యుడు ప్రవేశించి, విగ్రహమునకు సాష్టాంగ నమస్కారము చేయుచుండగా, దాగిన వారిద్దరూ అతని తలను నరికి పారిపోయారు. ఈ హత్య సంగతి రాజుకు తెలియగానే కోపోద్రిక్తుడై, పండితయ్యను పిలిపించి, పిరికితనముతో దారుణంగా జరుపబడిన హత్యను గురించి ప్రశ్నించాడు. పండితయ్య హత్య తన ఎరుకతోనే జరిగిందని ఒప్పుకొని అందుకు తానే బాధ్యుడనని నేరము అంగీకరించాడు. రాజు శిక్షగా పండితయ్య కనుగ్రుడ్లు పీకివేయవలసినదిగా ఆజ్ఞాపించాడు. ఆత్మాభిమానియైన పండితయ్య తన నెవరూ తాకరాదని హెచ్చరించి, తన కండ్లను తానే పీకివేసు కున్నాడు. నౌకర్లు తెచ్చిన పళ్లెములో వాటినుంచాడు. ప్రచారములోఉన్న కథను బట్టి, అందరికీ ఆశ్చర్యం కలిగించే విధంగా మరో జతకండ్లు పీకిన వాటి స్థానంలో ఏర్పడినై. ఈ విధంగా రెండు పర్యాయములు జరుగగా, అనుమానితుడై రాజు తన నౌకరులను కండ్లు పీకమని ఆజ్ఞాపించాడట. ఆ ప్రకారము నౌకర్లు కండ్లు పీకివేయగా, పండితయ్య గ్రుడ్డివాడైనాడు. బాధతో కోపంతో, పండితయ్య ధనదుపురము భూకంపమువల్లనూ, ఉప్పెనవల్లనూ సర్వనాశన మవుగాక అని శపించాడు. శాపవార్త విన్న ప్రజలు పట్టణం ఖాళీచేసి పరుగులు తీశారు. పట్టణం పాడుపడిపోయింది. పండితయ్య శాపమువల్లనేగానీ, లేక ప్రకృతి వైపరీత్యముల వల్లనేగానీ, ధనదుపురం నశించి, చందవోలు గ్రామంగా మారిపోయింది. ఈ సంఘటన రాజకుటుంబము లోనూ, రాజోద్యోగులలోనూ మానసిక స్పర్ధలకూ, అంతః కలహములకూ దారి తీసింది. రాజు తన భార్యా, బిడ్డల, మంత్రుల, దండనాధుల మరియు ఇతర ఉద్యోగులపట్ల విరక్తిచెంది ఏకాంతవాసము చేయుట ప్రారంభించాడు. ఒక రాత్రి ఆయన కలగన్నాడు. కలలో మానవుల పుర్రెలనుహారంగా వేసుకున్న మానవ కంకాళ మొకటి నిద్రపోతున్న ఆయన గుండెలపై దూకి, కొంతకాలము పైశాచిక నృత్యంచేసి, అనంతరము త్రిశూలముతో ఆయన గుండెను పొడిచింది. ఈ కలవచ్చిన కొంత

కాలమునకు, రాజు నిజంగానే వ్యాధి గ్రస్తుడైనాడు, ప్రొత్తికడుపులో పుట్టిన వ్రణ బాధను చాలా కాలము అనుభవించాడు. ఎందరో జైనవైద్యులు, బౌద్ధాచార్యులు వైద్యము చేసినప్పటికీ వ్యాధి నయముకాలేదు. దీర్ఘకాలము బాధను అనుభవించి రాజేంద్ర చోడుడు చనిపోయాడు. అతని కుమారులు కలహించుకొని రాజ్య నాశనము చేశారు.

అవమానముపాలై, గ్రుడ్డివాడైన పండితయ్య ధనదుపురము విడచి, అమరావతి చేరి, అమరేశ్వర స్వామిని పూజించాడు. అంతట ఆయన కోల్పోయిన రెండు కళ్లేకాక, శివునికివలె నుదుట మూడవ కన్నుకూడా ఏర్పడిందని నానుడి. అక్కడ నుండి బసవేశ్వరునికి సందేశము పంపుతూ, తామిద్దరూ ప్రచారము చేయుచున్న నూతన మత సిద్ధాంతములను గురించీ, ఆంధ్ర, కర్ణాటక దేశములందు, సమకాలీన సామాజిక మత, రాజకీయ పరిస్థితులను గురించి చర్చించుటకుగాను, కాల నిర్ణయము చేయవలసినదిగా కోరాడట. బసవేశ్వరుడు ఆ సందేశమునకు సంతసించి, వార్తాహరులను సత్కరించి, వారి ద్వారా కొంత విభూతిని పంపి, పండితయ్యకు వీరశైవదీక్షనిచ్చినట్లు తెలియజేశాడు. ఆ విభూతిని దేహముపై, అలముకొనిన పండితయ్యకు అనర్గళమైన కన్నడభాషాపాండిత్యము చేకూరింది. వెనువెంటనే తన ఇష్టదైవమైన శివునిపై ఆశువుగా పద్యము చెప్పాడు. అనంతరము బసవేశ్వరుడు పండితయ్యకు సందేశములు పంపుతూ, ఆయనను వేదాధ్యయనమూ, వైదిక ధర్మమూ, కులాచారములను వదలి వీరశైవ సిద్ధాంతములను నిర్దుష్టంగా పాటించ వలసినదిగా కోరాడట. ఈ సందర్భముపై ముందు వివరించినట్లు పండితయ్య బసవని కోరికను అంగీకరించక, బసవని మనుషులను త్రిప్పి పంపాడు. అమరావతి నుండి పండితయ్య మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న పానగల్లుకు చేరాడు. ఆ నగరము తెలుగు చోడులలోని మరొక శాఖకు చెందిన ఉదయ చోడుని రాజధాని. ఈ నగరమునుండి బసవేశ్వరుని నివాసమైన కళ్యాణ పట్టణముచేరి బసవేశ్వరుని కలసి, తను చిరకాలముగా వాంఛిస్తున్న, సిద్ధాంత సారూప్యత గలిగిన వీరశైవ, ఆరాధ్య శైవముల మధ్య మరింత సహకారమును సాధించి విభేదములను విస్మరించి ఉభయులూ ఒకటిగా శైవమత వ్యాప్తిని విస్తృతపరచ వలననెడి భావమును యథార్థము చేయవలెనని దృఢ సంకల్పమేర్పడినది. కానీ పండితయ్యకు గలిగిన అనుభవము, అందుకు పూర్తిగా విరుద్ధమైనది. అందుకు ఆయన వ్యక్తిత్వమే కారణము. మితిమీరిన ఆత్మాభిమానమూ,

అహంకార ప్రవర్తన, పరుష వాక్కులతో కూడిన సంభాషణవంటి దుర్గుణముల వలన ఆయన రాజు ఆగ్రహమునకు గురియైనాడు. పానగల్లును శపించి, కళ్యాణ పట్టణమునకు ప్రయాణమైనాడు ఆయన వాణిపురము (ప్రస్తుతం వనపర్తి) చేరగానే, బసవని మరణమూ, ఆ రాజ్యములో తలెత్తిన అరాజక పరిస్థితులను గురించి సమాచారము అందినది. ఎంతో నిరాశకు గురియైన పండితయ్య మనసు మార్చుకొని శ్రీశైలము వెళ్లుటకు సంకల్పించాడు. కానీ వార్థక్యము తోనూ గ్రుడ్డి తనముతోనూ నిరాశతో నిండిన ఆయన దేహము సహకరించలేదు. అతి కష్టముతో శ్రీశైల సమీ పమునగల వెల్లటూరు అను గ్రామము చేరగలిగినాడు. అప్పటికి ఆయనకు అంత్య కాలము సమీపిస్తున్నదనే స్పృహ కలిగింది. దానితో ఆయన తన ప్రయాణమును విరమించి తనవెంట వస్తున్న శిష్యులను ప్రయాణమును కొనసాగించ వలసినదనీ, శ్రీశైలము వెళ్లి, మహాశివరాత్రి వరకూ అచటనే ఉండి, ఆ పర్వదినమున తన తరఫున శివార్చనచేసి రావలసినదిగా కోరాడు. అదేవిధంగా శిష్యుడైన దోనయ్య, ఆచరించి తిరిగి వెల్లటూరు వచ్చాడు. వచ్చిన కొద్ది రోజులకే మల్లికార్జున పండితారాధ్యుడు శివసాయుజ్యము పొందినాడు.

అయితే క్రీ.శ. 1811 ఏప్రియల్ మొదటి తేదీనాడు, చందవోలు కైఫీయత్‌లో జన బాహుళ్యము చెప్పుకొను సమాచారము ఆధారంగా నమోదు చేయడిన దానిని బట్టి పండితయ్య తూర్పుదేశంలో (శ్రీకాకుళము నుండి గోదావరినది వరకు) వానస వంశములో జన్మించాడు. ఆతడు గొప్ప శివభక్తుడు. పిన్నవయసులోనే శివారాధనకు సంబంధించిన కార్యక్రమములలో శాస్త్రీయమైన శిక్షణ పొందినాడు. ఆయన శ్రీ శైలమువెళ్తూ చందవోలు నగరము రావటం తటస్థించింది. ఆ నగరములోని పందీ శ్వర మహాదేవుడని పిలవబడే శివాలయములోని ముఖ మంటపములో ఆయన మకాంపెట్టాడు. ఆ నగరమునకు అధిపతికొండ పడమటి బుద్ధరాజు. ఆయన గురువు బుద్ధ పాదాచార్యుడు. బుద్ధపాదాచార్యుడు బౌద్ధ ధర్మములో నిష్ణాతుడు, గొప్ప బుద్ధ భక్తుడు. నగరములోనికి పండితయ్యరాక తెలుసుకొని, ఆయన కీర్తి ప్రతిష్ఠలను, శైవమత ప్రచారమును, గురించి ముందుగావిని యుండుట చేత, ఈర్ష్యాపరులైన బుద్ధ పాదాచార్యుడూ, అతనిశిష్యులూ ఒక ఉపాయమును ఆలోచించినారు. దానిని అనుసరించి ఒక సదస్సును ఏర్పాటుచేసి, ఆ సభయందు జరుపు వాగ్వివాదములో

పండితయ్యని ఓడించి, నగరమునుండి తరిమివేయవలెనని సంకల్పించారు. ఈ సదస్సును గురించి సోమనాధుడు, పండితారాధ్య చరిత్రతో విమర్శచేస్తూ అది పండిత సదస్సు కాదనిన్నీ, బుద్ధ రాజు బంధువులు, బౌద్ధ భిక్షువులు, కొందరు రాజ ఉద్యోగులు, విద్యా విహీనులైన సామాన్య ప్రజలతో ఏర్పడినదనీ, వారందరి, సమావేశమునకు కారణము తెలియజేయకుండా దండోరా వేసి పిలిపించిన, నకిలీ సదస్సనీ తెలియజేశాడు. ఆ విషయము తెలుసుకొనిన పండితయ్య ఆ సభలో ప్రవేశించి హేళనగా నవ్వాడట, వాస్తవ మేమైనప్పటికినీ, కైఫీయత్‌లోని సమాచార మును బట్టి, పండితయ్య శివానుగ్రహముతో పొందిన మానవాతీతశక్తులను ఉప యోగించి ప్రత్యర్థులను వాదనలో చిత్తుగా ఓడించాడట. ఈఅవకాశమును ఉపయో గించుకొని, జైన, బౌద్ధ, చార్వాక మతములను నిందిస్తూ, ఆ మతస్థులు పాషండులనీ, నాస్థికులనీ తీవ్రంగా ఖండించాడు. ఆ సభలో పాల్గొన్న బుద్ధ పాదార్యుడు, ఆయన శిష్యులూ, ఇతర బౌద్ధ మతాభిమానులూ వారి ఓటమిని మర్యాదగా అంగీకరించక, పండితయ్య విజయమునకు కారణము ఆయన శివభక్తియేయని తలంచి, శివా రాధనకు ఆటంకము కల్పించుట ద్వారా ఆయన ఏకాగ్రతకు భంగము కల్పించవలె ననే దురుద్దేశం'తో వారి అనుచరులలో ఒకడైన బిజ్జు' అనే వానిని పండితయ్య బసకువెళ్ళి ఆయన నిత్యమూ పూజా కార్యక్రమములో ఉపయోగించు నక్షత్ర హారతిని దొంగిలించి తెమ్మని పంపారు. బిజ్జ ఆ వస్తువును దొంగిలించడం పండితయ్య శిష్యులలో ఒకడు చూసి బుద్ధవాడకేసి పారిపోతున్న దొంగను వెంటతరిమి పట్టుకొని ఉద్రేకంతో చంపివేశారు. ఈ విషయము తమ గురువైన పండితయ్యకు తెలియ జేయక, దొంగిలించిన నక్షత్ర హారతిని యధాస్థానంలో ఉంచారు. బౌద్ధులలో కొందరు ఈ హత్య వెనుక పండితయ్య హస్తముండి తీరుతుందని భావించారు. ఈ సంఘటన విషయమై పండితయ్యకు చెప్పకుండా కుట్రచేసి ఒక మనిషిని హత్యచేస్తే ఏమి శిక్ష వేయాలా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యము నెరుగని ఆయన నేరస్థుని గ్రుడ్లు పీకివేయుటయే శిక్ష అని చెప్పాడు. అప్పుడు ప్రత్యర్థులు, పండితయ్యకు, విషయమును తెలియజేసి నేరస్థుడు తమ శిష్యుడేనని తెలియపరచారు. పండితయ్య తన తొందర పాటుకు విచారపడి, రాజు తనకు విధించబోవు శిక్షను తలచుకొని రాజభటుల చేతులలో శిక్షింపబడుటకు మారుగా, తనకు తానే ఆ శిక్షను అనుభవించవలెనని

సంకల్పించి, లింగోద్భవ స్వామియైన శివ లింగమునకు ఎదురుగా కూర్చుని తన కనుగ్రుడ్లను తానే నిర్భయంగా పీకివేసినాడు. ప్రసన్నుడైన శివుడు పండితయ్య భక్తికిమెచ్చి, అతనికి నేత్రములను ఇచ్చాడు. తన శివభక్తినీ, మానవాతీత శక్తులను అందరి ముందు ప్రదర్శింపవలెననే ఉత్సాహంతో పండితయ్య మరొకసారి, కను గ్రుడ్లను పీకివేసుకున్నాడు. శివుడు తిరిగి ఆయనకు నేత్రదానము చేశాడు. మూడవ సారి పండితయ్య కనుగుడ్లను పీకివేసిన అనంతరము, ఆయనకు తిరిగి దృష్టి రాలేదు. ఆయన శాశ్వతంగా గ్రుడ్డివాడైనాడు. ఆగ్రహోద్రేకుడైన పండితయ్య, రాజును, ప్రజలను, నగరమునూ శపిస్తూ, ఈ నగరములోని నీరు శివార్చనకు పనికిరాదనీ, నగరము నశించిపోతుందనీ, రాజధానిగా ఉండతగదనీ, మోసగాళ్లైన నగరములోని బౌద్ధులు నశించిపోతారనీ శాపంపెట్టాడు. చందవోలు నగరమును, వదలి గ్రుడ్డివాడైన పండితయ్య, ఆతని పరివారమూ, దక్షిణదిశగా ప్రయాణించి గోకర్ణ క్షేత్రమునకు చేరారు. గోకర్ణేశ్వరుని దయవల్ల పండితయ్యకు దృష్టి లభించింది. అక్కడ నుండి శ్రీశైలమునకు తన ప్రయాణము కొనసాగించాడు. పండితయ్య చందవోలును వదలి వెళ్ళగానే, ఆ నగరములోని బౌద్ధులూ, బుద్ధవాడ నశించి పోయినవి. చందవోలు నగరము శాశ్వతముగా తన పూర్వ వైభవమునూ, ప్రాముఖ్యతను పోగొట్టుకున్నది. అయితే ఆ విధంగా జరగటం పండితయ్య శాపమువలన అవునో కాదో తెలియదు కానీ, చారిత్రక సత్యమేమంటే, బుద్ధవాడ నాశనముచెంది, బుద్దాం అనే పేరుతో ఒక చిన్న గ్రామముగా మార్పుచెందింది. ఈనాటికీ బౌద్ధమతావ శేషములు ఆ గ్రామములో కనబడుతున్నవి. ఇసుక తిన్నెల క్రింద ఇంకెన్ని మరుగుపడి యున్నవో తెలియదు. చందవోలు, కుగ్రామమై, ఇప్పుడొక పంచాయితీ గ్రామంగా మిగిలి ఉన్నది.

కైఫీయత్‌లో వ్రాసిపెట్టిన విషయములు ప్రజాబాహుళ్యమునందు ప్రచారములో ఉండి, పౌరాణిక మహిమలతో కూడి ఉన్నప్పటికినీ వాటిని కట్టు కథలుగానూ, చారిత్రాత్మకంగా అసత్యములనీ అనటం సమంజసము కాదు. కైఫీయత్‌లోని సమాచారము నమ్మదగిన వ్యక్తులు, తమ తరువాతి తరములవారికి తెలియజేసిన వాస్తవములపై ఆధారపడి వ్రాయ బడింది. మహిమలను గురించిన అంశములను అసలు సమాచారము నుండి వేరుచేస్తే మిగిలిన విషయమంతయూ, చారిత్రిక విషయములతో గూడినదనీ, వాస్తవములని నమ్మ వచ్చును. పండితయ్యకు విధించిన

శిక్ష రాజైన రాజేంద్ర చోడుడే ఆజ్ఞాపించాడా లేక ఆయన బావమరది బుద్ధరాజు విధించినదా లేక ఆత్మాభిమానియైన పండితయ్యే స్వయముగా అమలుచేసుకున్నాడా అనే తర్జన భర్జనలను ప్రక్కనుంచితే పండితయ్య శిష్యులు తమ గురువుకు తెలియజేసో, తెలియ చేయకుండానో బిజ్జును హత్య చేసినందుకు గాను, శిక్షగా పండితయ్య కనులు పీకివేయటము వాస్తవము. ఈ సంఘటనపై కొందరు పండితులు అభిప్రాయ పడినట్లు రాజకీయంగానూ, భౌగోళికంగానూ, ముఖ్యమైన స్థానము నాక్రమించిన అతివిశాలమైన తెలుగుచోడుల రాజ్యమునందు బుద్ధపాదాచార్యునీ బౌద్ధమత ప్రాబల్యమును నశింపచేయుటకుగాను, పండితయ్య, ఆయన అనుచరులు విచక్షణా జ్ఞానమును కోల్పోయి, బౌద్ధమత స్థానములో వీరశైవముని వ్యాప్తి చేయవలెననే, ఈర్ష్యాపూరితమైన ఆత్రుతతో, హత్యలవంటి దురాగతములకు పాల్పడినారనీ, వారికి మతము పట్లగల మూఢ విశ్వాసమూ, అంతకు మించిన అహంకార ప్రవృత్తివల్ల రాజ్యమునందు శాంతి భద్రతలకు ప్రమాదమేర్పడే పరిస్థితులు తల ఎత్తడంతో వాటి సంరక్షణకై రాజు తన అధికారమును వినియోగించవలసి రావటం జరిగి ఉండవచ్చు. లేదా రాజు బావమరది, సర్వసేనాధిపతి, మహామండలేశ్వరుడైన బుద్ధరాజు పేరుకు తగినట్లు బౌద్ధుడై ఉండి బుద్ధ పాదాచార్యుని శిష్యుడు కావటంవలన నేర విచారణలో కల్పించుకొని పండితయ్యకు గ్రుడ్లు పీకివేసేటటువంటి శిక్షను వేయించి ఉండవచ్చు. అతను బ్రాహ్మణుడు కనుక ప్రాణముతీసే శిక్షనుండి తప్పించుకొని ఉండవచ్చు. మల్లికార్జున పండితుడు కూడా బసవేశ్వరునివలె, అధికారపదవిని సంపాదించి, వెలనాటి చోళ రాజ్యమును తన గుప్పిటనుంచు కొనవలెనని ఆశించాడు. బసవేశ్వరుడు అదే సమయములో, కర్ణాటకలోని కాలచూరి రాజ్యములో వీరశైవమును పెద్ద ఎత్తున ప్రచారము చేస్తున్నట్లుగానే, తాను కూడా ఆంధ్ర దేశములో ఆరాధ్య శైవమును వ్యాపించవలెనని తలపోశాడు. కానీ ఆయన కన్న కలలన్నీ కల్లలైనవి. అతని ప్రవర్తన కారణంగా, ప్రాణ రక్షణకు పారిపోవలసి వచ్చింది. వేగంగా ప్రయాణమును కొనసాగించి తెలుగు చోడుల రాజైన ఉదయ చోడుని రాజధాని పానగల్లు చేరాడు. రాజు, పండితయ్య తన రాజ్యములో ప్రవేసించినాడని తెలియగానే తన మంత్రియైన పింగళగోవింద ప్రధానిని పండితయ్యనూ, ఆయన పరివారమును, రాచమర్యాదలతో ఆహ్వానించి, సర్వసౌఖ్యములు గలిగిన వసతినీ, అతిథులకు కావ

లసిన అన్ని సౌకర్యములు ఒనగూర్చుట తగినంతమంది నౌకరులనూ ఏర్పాటు చేయవలసినదిగా ఆదేశించాడు. ఆ విధంగా నియమింపబడిన సేవకులలో ధవళేశన మ్మయ్య ఒకడు. అతను రాజుకు ఆంతరంగిక సేవకుడు. అతనిని రాజు పండితయ్య సేవకై ప్రత్యేకంగా నియమించినాడు. కొద్ది కాలము గడవగానే నమ్మయ్య పండితయ్య ప్రభావమునకు లోనై ఆయన శిష్యుడై నాడు. అప్పటినుండి రాజుకు నిర్వర్తించవలసిన విధులను నిర్లక్ష్యము చేయడం ఆరంభించాడు. రాజు ఒకనాడు నమ్మయ్యను పిలి పించి అతని ప్రవర్తనలో కలిగిన మార్పుపై ప్రశ్నించాడు. నమ్మయ్య మొండిగా తన దేహము రాజుదే కానీ, తన ఆత్మ ఆయనది కాదని జవాబిచ్చాడు. రాచమర్యాద నతిక్రమించి సమాధానము చెప్పి, నమ్మయ్య వెంటనే రాజ సన్నిధి వదలి వెళ్లాడు. తన దురుసు ప్రవర్తనవల్ల ఏమి జరుగుతుందో ఊహించిన నమ్మయ్య దగ్గరలో ఉన్న శివాలయపు గోపురమునెక్కి దూకి చనిపోయాడు. రాజు నమ్మయ్య దుష్ప్రవర్తనకు పండితయ్యయే బాధ్యుడని ఊహించి, పండితయ్యను తీవ్రంగా మందలించాడు. పండితారాధ్య చరిత్రలో అది కేవలము ఊహకాదు. యథార్థమేనని వ్రాశారు. రాజు పండితయ్యకు రాజ్య బహిష్కరణ శిక్ష విధించాడు. పండితయ్య మరొకసారి తన ప్రాణములు కాపాడుకొనుటకు పరుగెత్తవలసి వచ్చింది. ముసలితనము, బలహీనత, గుడ్డితనమువల్ల తానాశించినట్లు సుదూరములోనున్న కళ్యాణ పట్టణము వెళ్ళి బసవేశ్వరుని కలవగల అవకాశములు సన్నగిల్లినవని గ్రహించాడు. అదే సమయంలో బసవేశ్వరుడు మరణించిన సమాచారము కూడా తెలిసింది. ఆ కారణంగా ఆయన కళ్యాణపట్టణ ప్రయాణమును రద్దుచేసుకొని శ్రీశైల ప్రయాణమునకు సంకల్పించాడు. తరువాత జరిగిన విషయము ఇంతకు ముందే తెలియచేయుట జరిగింది కదా !

పండితయ్యలో అలౌకిక శక్తులు ఉన్నవనటం నమ్మశక్యంకాని విషయం. ఆయన జీవిత చరిత్రను వ్రాసిన సోమనాధుడు, ఆయనను చారిత్రక వ్యక్తిగాకాక, పురాణ పురుషునిగా మార్చాడు. పండితయ్యకూ, బసవనికీ ఒక ప్రక్క వారికి పాల్కురికి సోమనాధునికీ మరోప్రక్క, కాలము నందలి అంతరము, కేవలము ఒక తరము, అనగా షుమారు 30 సంవత్సరములు మాత్రమే. సోమనాధుని వ్రాతల ప్రకారము తన బసవపురాణ, పండితారాధ్య రచనలకు కావలసిన వివరములను పండితయ్య శిష్యుడైన కరస్థలి సోమనాధయ్యనడిగి తెలుసుకొన్నానని వ్రాశాడు. పైగా సోమ

నాథుడు పండితయ్య పెద్దకుమారుడైన కేదారయ్య పండితునికి సమకాలీనుడు కావటమేకాక, పండితయ్య సంతానము నందలి మరికొందరికి, మనుమలకు కూడా సహచరుడే. అయినప్పటికీ, మతము పట్లగల మూఢ విశ్వాసంతో పండితయ్య జీవిత చరిత్రను, చారిత్రాత్మకంగా చిత్రించక మానవాతీత మహిమలతో నింపివేశాడు. సోమనాథుడు క్రీ.శ. 13వ శతాబ్ది ప్రారంభమునకు చెందిన వాడవటంచేత, చందవోలు, పానగల్లు రాజధానులుగా విస్తరించిన తెలుగు చోడుల రాజ్యములు పతనమవటం, అనుమకొండకు చెందిన కాకతీయ రాజులు ఆక్రమించుట పూర్తిగా తెలుసును. ఈ రాజకీయ పరిణామములను అన్నిటినీ, సోమనాథుడు, పండితయ్య శాపఫలితములని తన రచనలో వర్ణించినాడు. పుట్టకురుపు వ్యాధితో చనిపోయిన రాజేంద్ర చోడుని మరణముకూడా, పండితయ్య శాపమాహాత్మ్యమేనని అభివర్ణించాడు. గమనార్హమైన మరో విషయమేమంటే, సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో చెప్పినట్లు రెండవ రాజేంద్ర చోడుడుగానీ, అతని బావమరది, సర్వసేనాపతి, మహామండలేశ్వరుడైన బుద్ధరాజుగానీ, బౌద్ధులుకారు. వారు శివారాధకులని శాసనముల ద్వారా తెలుస్తున్నది. ఆ పరిస్థితులలో పండితయ్య వారి రాజ్యమునకు వెళ్లుటకు కారణము ఏమిటి ? సోమనాథుడు చెప్పినట్లు కేవలము బౌద్ధమత నిర్మూలన వీరశైవమత వ్యాప్తికే అని అనుకోవటం సబబుకాదు. చందోవోలు రావటమునందు ఆయన ఉద్దేశ్యము లోతైనదీ, అతిముఖ్యమైనది. పండితయ్యకు కర్ణాట దేశములో ఉద్ధృతంగా వీరశైవమత ప్రచారమునూ వ్యాప్తినీ, చేపట్టిన బసవేశ్వరునితో సన్నిహిత సంబంధము ఏర్పడింది. బిజ్జలుని కోశాధికారిగా, ఉన్నత పదవిని నిర్వహిస్తూ, వీరశైవమత వ్యాప్తికి ఎన్నో కార్యక్రమముల నిర్వహణలో ధనమునూ, పలుకుబడినీ వినియోగించుట తెలుసుకొని ముగ్ధుడై, తానుకూడ ఉత్తరమున వంశధారానది నుండి దక్షిణమున శ్రీకాళహస్తి వరకూ తూర్పు సముద్రము నుండి పడమర చోళవాడి (నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాలు)వరకూ వ్యాపించియున్న సామ్రాజ్యమును, నామమాత్రపు సామంతులుగా వ్యవహరిస్తూ, సువిశాలమైన ఆ సామ్రాజ్యమును పరిపాలిస్తున్న తెలుగు చోడుల ప్రాపకము సంపాదించి పదవిని, అధికారమును హస్తగతంచేసుకొని, ఆరాధ్య శైవమత వ్యాప్తి చేయవలెననెడి గంపెడు ఆశతోనే పండితయ్య చందవోలు రావటం జరిగి ఉంటుంది. కానీ ఆయన గ్రహించని సత్యము

ఏమంటే ఆంధ్ర దేశమునందలి సామాజిక, మత పరిస్థితులకూ, కర్ణాటకలోని పరిస్థితులకూ మధ్యనున్న తీవ్ర వ్యత్యాసం. ఆ కారణంగా నిరాశపూరితుడై గుడ్డివాడై వార్థక్యంలో క్రీ.శ. 1168–1170ల మధ్య తనువు చాలించాడు. బహుశా ఆయన సంకల్పమునకు శివుడే అడ్డుతగిలి ఉండవచ్చు. బౌద్ధ జైన మతస్థులనే గాక, అద్వైతులను, మీమాంసకారులను, సాంఖ్యులను, హిందూ మతమునందలి ఇతర శాఖలు వారినీ పండితయ్య తీవ్ర విమర్శలకు గురిచేశాడు. మల్లికార్జున పండితారాధ్యుని జీవితధ్యేయము, ఆయన తాత్త్విక చింతన, భక్తిని, వైదిక ధర్మముతో అనుసంధానము చేయుట. ఆ కారణముగానే శివుని ఇష్టలింగమూర్తిగా ఆరాధిస్తూనే, యజ్ఞోపవీత ధారణ, గాయత్రీ మంత్రజపము కొనసాగించవలసినదని ప్రవచించేవాడు. కుల తత్త్వమును పాటించుటలో శ్రద్ధ వహించనప్పటికీ, వర్ణాశ్రమ ధర్మానుసరణము కావించాడు. బసవనివలెనే లింగమును ధరించిన దళితుడు బ్రాహ్మణునితో సమానమని బోధించాడు. బ్రాహ్మణుడు శివార్చన నిర్వహిస్తే, పూవుకు తావి అబ్బినట్లని వర్ణించాడు. ఈ విధంగా పండితయ్య శైవమును, స్మార్తమునకు అతి సమీపంగా తీసుకురాగలిగినాడు.

కాలక్రమేణ, ఆరాధ్య బ్రాహ్మణులు, లోపాయికారిగా వీరశైవ సాంప్రదాయములను పాటిస్తూ, బహిరంగంగా స్మార్త సిద్ధాంతములను అనుసరించుచూ, స్మార్తులతో వివాహాది సంబంధ బాంధవ్యములను కూడా ఏర్పరచుకుంటున్నారు. ఇతర కులములకు చెందిన వీరశైవులతో భోజన, భాజనాదులను మానివేశారు. ఆ విధంగా వారు కొన్ని విషయములలో లింగధారులుగాను, మరికొన్నిటిలో స్మార్త బ్రాహ్మణులుగాను వ్యవహరిస్తున్నారు. ఆరాధ్యత్రయము లేక పండితత్రయముగా పిలవబడే శ్రీపతి, మంచన, మల్లికార్జున పండితారాధ్యులు ముష్వరూ, వారి కాలమునాటికి చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న జైన, బౌద్ధ మతములకు చావుదెబ్బలు కొట్టారు. ఆంధ్ర దేశములో ఉన్నత వర్గములలోనూ, సామాన్య ప్రజలలోనూ, ఆ రెండు మతములకుగల ప్రాబల్యమును పూర్తిగా తుడిచివేశారు. పండితయ్యకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతములలో అనేక మంది శిష్యులు ఉండేవారు. వీరశైవము కానీ, ఆరాధ్య శైవముకానీ, కర్ణాటక రాష్ట్రములో చూపినంత ప్రభావమును, ఆంధ్రదేశములోని హిందూ సమాజముపై చూపలేకపోయింది.

ముగింపుగా మనవి చేసేదేమంటే బసవేశ్వరుడు, మల్లికార్జున పండితుడూ బ్రాహ్మణులుగా పుట్టారు. ఇద్దరూ ఏకేశ్వరోపాసనా విధానంగా శివుడొక్కడే దైవమనే సిద్ధాంతమును ప్రచారంచేశారు. హిందూ మతమునుండి, హైందవ సమాజమునుండి కుల వ్యవస్థను తొలగించవలెననీ, లౌకిక, ఆధ్యాత్మిక కార్యక్రమములు అన్నిటిలోనూ, అందరకూ సమానత్వమును కల్పించవలెనని కృషి చేశారు. అయితే బసవేశ్వరుడు తీవ్రవాదిగామారి వేదములను, బ్రాహ్మణులను నిందించడంవల్ల, అగ్రవర్ణముల వారినీ సమాజములో పలుకుబడి గలిగిన పెద్దలనూ, తానుచేపట్టిన సాంఘిక, మత సంస్క రణ ఉద్యమమునకు దూరము చేసుకున్నారు. పండితయ్యకూడా ప్రారంభదశలో బసవని అడుగు జాడలలో నడవవలెనని ప్రయత్నించి, తప్పు తెలుసుకొని, కుల వ్యవస్థ తోనూ వేదాధికారముతోనూ రాజీపడి, తద్వారా అగ్రవర్ణములవారిని తన ఆరాధ్య శైవము లోనికి ఆకర్షించాడు. ఆవిధంగా వీరశైవమత వ్యాప్తిలో బసవేశ్వరుడు, తీవ్రవాది గానూ, మల్లికార్జున పండితారాధ్యులు మితవాదిగానూ, ఉదార స్వభావుడుగాను పరిగణింపబడినారు.

■ ■ ■

# శ్రీ భారతీ తీర్థులు

వైదికధర్మ ప్రవర్తకులు, రక్షకులు, ప్రచారకులైన శ్రీ భారతీతీర్థులు, వారి సహోదరులు శ్రీ విద్యారణ్యుల చరిత్రల గురించి తెలుసుకొనుటకు ముందుగా ఆనాటి దక్షిణ భారతము నందలి రాజకీయ, మత పరిస్థితులను ఆకళింపుచేసుకొనుట చాలా అవసరము. అప్పుడే ఆ ఇరువురూ హైందవజాతి మనుగడకూ, సనాతన ధర్మపరిరక్షణకూ చేసిన కృషీ, దాని ఫలితములు మనకు అవగతమౌతవి.

ఉత్తర భారతమును ఆక్రమించుకొని, ఢిల్లీని రాజధానిగా ఏర్పరచుకున్న ముస్లిం సుల్తానులందరూ, దక్షిణ భారతముపై దండయాత్రలు చేసి, ఇందున్న హైందవ రాజ్యములనూ, మతమునూ, నాశనము చేయవలెనని దృఢ సంకల్పులై యున్నారు. అల్లా ఉద్దీన్‌ఖిల్జీ క్రీ.శ. 1315లో రెండవసారి దండయాత్రచేసి యాదవుల దేవగిరి రాజ్యమును తన సామ్రాజ్యములో కలుపుకున్నాడు. క్రీ.శ. 1323లో మహమద్ బిన్ తుగ్లక్, కాకతీయ సామ్రాజ్యమును జయించి, ప్రతాపరుద్రుని బంధించి, ఆ రాజ్యమును తన సామ్రాజ్యములో కలుపుకున్నాడు. ఇంతకు ముందుగానే ద్వార సముద్రము నందలి హోయసాలులు, మధుర పాండ్య రాజులు, కంపిలి రాజ్యము, మాలికాఫర్ దండయాత్రలకు లొంగిపోయి, స్వాతంత్ర్య మును కోల్పోయి, తురుష్క రాజ ప్రతినిధులుగా రాజ్యపాలన చేస్తూ ఉన్నారు.

ఈ విధంగా దక్షిణ భారతము నందలి హిందూ రాజ్యములు, ఒకదాని తదుపరి మరొకటి, అస్తమించగా, హిందువుల ధన, మాన, ప్రాణరక్షణ చేయగల రక్షకులే కరువై పోయినారు. వారి సరదారులు, సైన్యముచేయు అరాజకములకు హిందు మతమే అంతరించిపోవు చెడు కాలము దాపురించిందని ప్రభువులు, ప్రజలు, మతాధిపతులు దిక్కుతోచని దుర్భర పరిస్థితులకులోనై, ధన, మాన, ప్రాణాదులకు రక్షణలేక, హిందూ ధర్మమునకు మూలములైన దేవాలయములను ధ్వంసం చేస్తూ, గోవులను, బ్రాహ్మణులను కిరాతక ప్రవృత్తితో నరికి, చంపివేస్తుంటే, హిందూ ధర్మమును, దాని చిహ్నములను క్రూకటి వ్రేళ్లతో పెకలించి వేయవలెననెడి రాక్షస మనస్తత్వంతో, అమానుషమైన ఘోర కృత్యములు ఆచరిస్తున్న ముస్లిం సరదారులను వారి సైనికులను ఎదుర్కొనే ధైర్యములేక రాత్రింబవల్లు  అంధకార బంధురమై చరిస్తూ ఉంటే, చావలేక, బ్రతుకుట చేతగాని స్థితిలో ప్రాణములు అరచేత పట్టుకొని సామాన్యులు జీవిస్తూ ఉండేవారు. అది దక్షిణ భారతంలో అంధకార యుగం. అప్పటికే దేవగిరి యాదవ రాజ్యమునూ, ఓరుగల్లు కాకతీయ రాజ్యమునూ పొట్టన బెట్టుకొన్న ఢిల్లీ సుల్తానులు, దక్షిణాదిన ఇంకా మిగిలియున్న రాజ్యములను కూడా జయించ వలెననే కాంక్షతో, మహమద్ బిన్ తుగ్లక్, దేవగిరియందే మకాంవేసి, కర్ణాటకలోని కంపిలి, ద్వారసముద్రరాజ్యములపై దండయాత్రచేసి, యుద్ధగతిని పర్యవేక్షిస్తూ ఉన్నాడు.

అనంతరము పతనములైన కంపిలి రాజ్యమునూ, ఇతర ఆక్రమిత ప్రాంతముల లోనూ, పాలకులుగా తన ప్రతినిధులను నియమించి, యుద్ధ ఖైదీలలో ప్రముఖులు అనుకొనిన వారికి సంకెళ్లువేసి, తన వెంట క్రీ.శ. 1329లో ఢిల్లీ తీసుకువెళ్లాడు. ఆ విధంగా బందీలై ఢిల్లీ చేరిన వారిలో సంగమ వంశమునకు చెందిన సోదరులు ఇద్దరు ఉన్నారు. వారు మొదట కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రుని సైన్యములో ఉండే వారు. ఆ రాజ్యమును క్రీ.శ. 1323లో తురుష్కులు ఆక్రమించిన అనంతరం, ఖడ్గజీవులైన వారిద్దరూ, తమ జన్మభూమియైన కర్ణాటకమునకువచ్చి, కంపిలి రాజైన మూడవ బల్లాలుని సైన్యముతో చేరినారు. కంపిలి రాజ్యమును ఆక్రమించిన తుగ్లక్, ఈ ఇరువురు సోదరులను బందీలుగాచేసి, డిల్లీ తీసుకువెళ్లి వారి బలపరాక్రమము లను మెచ్చుకొని, భయపెట్టి, బలవంతముచేసి, ఇస్లాం మతస్తులుగా మార్చి వారిని తన సైన్యమునందు చేర్చుకొనినాడు.

దక్షిణ భారతమునందు ఢిల్లీ సుల్తాను ప్రతినిధులూ, ముస్లిం సర్దారులూ, సైన్యము లతో జరుపు దారుణ కృత్యములను భరించలేక సామాన్య ప్రజలలో కూడా ముస్లింల యెడ తీవ్రమైన వ్యతిరేక భావము,ప్రతీకార వాంఛ పెల్లుబక సాగినది. ఈ రాక్షస జాతిని తమ దేశమునుండి తరిమివేస్తేనేకానీ, తమ మానప్రాణములకు, తమ హిందూ ధర్మమునకు మనుగడ లేదన్న సత్యమును గ్రహించి, వారంతా ఒక సుసంఘటిత శక్తిగా ఆవిర్భవించారు. ఫలితంగా స్వాతంత్ర్యోద్యమ సమితి ఏర్పడింది. కాకతీయ ప్రతాపరుద్రుని సేనాపతులలో హతశేషులైన ఆరేటి అన్నమంత్రి, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనాయుడు, మహాసామంతులు, మాండలికులు అయిన ముసునూరి ప్రోలయ నాయకుడు, కొప్పుల ప్రోలయ నాయకుడు, కొండవీటి ప్రోలయ వేమారెడ్డి, మంచికొండ గణపతి నాయకుడు, ఆదిగా గల మహాయోధులు, తమ సైన్యములను ఉద్యమమునకలపి, స్వాతంత్ర్యోద్యమ సమితికి సైన్య సహాయమును అందించారు, ముసునూరి ప్రోలయ నాయకుడు ముస్లిములను తరిమి వేయుటకుగాను సమితి అధ్యక్షుడుగా ఎన్నుకొనబడి, యుద్ధ వ్యూహరచన దండయాత్రలకు సారథ్యము వహించి, తన తోటి ప్రభువులు, సైన్యము, ప్రజల సహకారంతో ముందుగా తీరాంధ్ర దేశమును, అనంతరము పశ్చిమాంధ్రము (రాయలసీమ) చివరగా ఉత్తరాంధ్రమును (తెలంగాణ) రెండు దశాబ్దముల కాలములో విముక్తిని సాధించారు.

హిందూ ధర్మోద్ధరణమే ప్రధానాంశముగా పోరు సల్పుతున్న స్వాతంత్రోద్యమ సమితి సేనలధాటికి తట్టుకొనలేక పోయిన, కంపిలిలోని సుల్తాను ప్రతినిధి ఉద్యమ మును అణచివేసి, శాంతి స్థాపన చేయుటకుగానూ, ఈ ప్రాంతమునకు చెందిన యోధులను పంపవలసినదిగా సందేశము పంపాడు. ఆ సందేశము నందుకొనిన, సుల్తాను తన మంత్రులతో ఆలోచించి, ఇస్లాం మతమును స్వీకరించి, తనకు విధేయు లుగా సైన్యమునందు పని చేయుచున్న మల్లిక్ మగ్బూల్ (అసలు పేరు గన్న యసా హిణి ప్రతాపరుద్రుని సేనాపతులలో అగ్రగణ్యుడు)ను ఓరుగల్లుకు, ఆనెగొందికి చెందిన సంగమ సోదరులు హక్క (హరిహర) బక్క సోదరులను కంపిలికి. పంపుటకు నిర్ణయించి, హిందూ జాతీయోద్య మమును అణచివేసి, సుల్తాను పాలనను సుస్థిరము చేయవలసినది ఆజ్ఞాపించి, వారు తనకు విశ్వాస పాత్రులై" ఉండగలమని ప్రమాణ ములు చేయించి, కొంత సైన్యముతో పంపినాడు. 72 మంది నాయకుల, ఆధ్వర్య

మున విజయమో, వీరస్వర్గమో ధ్యేయంగా ప్రాణాలకు, తెగించి పోరాడుతున్న సైన్యములను, నాయకులు మరింతగా ఉత్సాహపరచేవారు. భీకరమైన పలు పోరాటముల అనంతరము, సంగమ సోదరులు వారివెంటవచ్చిన సుల్తాను సైన్యము చిత్తుగా ఓడింపబడినారు. దక్షిణ భారతములో ఉవ్వెత్తుగా కదలివస్తున్న హిందువుల స్వాతంత్రోద్యమము, ఇస్లాం మతముపట్ల, ముస్లిముల పట్ల హిందువులలో ఏర్పడిన ద్వేష భావమూ, పగతీర్చుకొనవలననే పట్టుదల, సనాతన ధర్మ పునరుర్ధరణచేసి తీరాలనే వారి ధృఢ సంకల్పమును స్వయంగా ఆకళింపు చేసుకొనిన, సంగమ సోదరులు, తాము చేసిన తప్పును తెలుసుకున్నారు. సుల్తాను తరఫున తమ వారైన హిందువులపై కత్తి నెత్తడము ఘోరమైన అపరాధముగా భావించారు. తమవారు, పరాయిజాతివారి పరిపాలనలో అనుభవిస్తున్న అష్టకష్టాలకు ఎంతో బాధపడ్డారు. తాము, తమ వారితో కలసిపోయి, నాయకులు, ప్రజలు, మతాధిపతులు ఉమ్మడిగా వాంఛిస్తున్న హైందవ రాజ్య స్థాపనలో తామెందుకు పాలు పంచుకొనరాదని తమకు తామే ప్రశ్నించు కున్నారు. కానీ వారు సుల్తాన్ కల్పించిన ప్రాణభయంతో, ఇస్లాం మతమును స్వీకరించి ఆయనకు విశ్వాసపాత్రులుగా, ఆయన సైన్యమునకు అధికారులుగా స్వాతంత్ర్యోద్యమమును అణచివేచి, ముస్లిం పాలనను తిరిగి స్థాపించుటకు రావటంచేత, ఉద్యమ నాయకులు, ప్రజలు, తమ పరివర్తనను నమ్మటంలేదని, తమ మాటలను క్రొత్త ఎత్తు గడలుగా భావించుచున్నారని గ్రహించారు.

దక్షిణ భారతమునందు రాజకీయ, మత పరిస్థితులు, పై విధంగా అల్లకల్లోలమై యుండగా, ఓరుగల్లు ప్రాంతము నుండి ఇద్దరు యువకులు, ముస్లిములు ఆక్రమించిన తమ రాజ్యములో ఉండలేక, తమ వేదాధ్యయమునకు, వైదిక కర్మాచరణమునకు అనుకూలమైన, ప్రశాంతమైన ప్రదేశమును వెదకుచూ దక్షిణదేశమునకు చేరారు. వారిద్దరూ గురువంశ కావ్య (శృంగేరీ పీఠాధిపతుల పరంపరను తెలియజేయు గ్రంథము)ను అనుసరించి వేద వేదాంగములయందునూ, సర్వశాస్త్రముల యందునూ విద్వాంసులు. సనాతన ధర్మ ప్రవర్తకులు. "విద్యారణ్యకాల జ్ఞానము"ను అనుసరించి, వారిద్దరిలో పిన్నవాడు ముందుగా క్రీ.శ. 1229-1333 సంవత్సరముల ప్రాంతమున శ్రీ శృంగేరీ పీఠాధిపతులు అయిన శ్రీ విద్యాశంకర తీర్థులవారిని కలసినాడు. ఆచార్యులవారు వచ్చిన పిల్లవాని తల్లి, తండ్రులనుగురించి, వంశమును గురించి,

విద్యార్హతలను గురించి, విచారించిన అనంతరము మఠమునందు ఉండుటకు అనుమతించారు. కొంతకాలము గడచినతరువాత, ఆ పిల్లవాడు తనకు దీక్షను ప్రసాదించమని ఆచార్యుని వేడుకున్నాడు. ఆతని కోరికను మన్నించిన ఆచార్యులవారు, సన్యాసదీక్షను అనుగ్రహించి దీక్షానామముగా భారతీ కృష్ణతీర్థులని పేరు పెట్టారు. వారే భారతీతీర్థులుగా, ఆధ్యాత్మిక రంగమున విఖ్యాతి గాంచినారు.

అనంతర కాలమున, అన్నగారు తమ్ముని వెదుకుతూ శృంగేరిని చేరి తమ్ముని చూచారు. అప్పటికే ఆయన సన్యాశాశ్రమ స్వీకారం జరిగిపోయింది. తాను కూడా సన్యసించవలెనని తలంచి శ్రీ విద్యాశంకరులను అనుగ్రహించవలసినదిగా ప్రార్థించారు. ఆయన ప్రార్థనను మన్నించి క్రీ.శ. 1331లో వారికి సన్యాస దీక్ష అనుగ్రహించబడినది. విద్యారణ్యులని దీక్షానామము లభించినది. విద్యారణ్యులు వయసులో భారతీతీర్థులకంటె పెద్దవారై నప్పటికినీ, పీఠాధిపతుల క్రమములో, వారు క్రిందివారుగానే పరిగణింపబడి నారు. సన్యసించిన తరువాత కొంత కాలమునకు విద్యారణ్యులు తీర్థయాత్రలకు వెళ్ళారు. శ్రీ విద్యా శంకరులు ఆ సోదరులు ఇద్దరియందు, ఆధ్యాత్మిక శక్తిని అభివృద్ధిపరచుటకు కావలసిన అన్ని లక్షణములేగాక, శృంగేరి మఠాదర్శమైన సనాతన ధర్మ వ్యాప్తికీ, అద్వైత సిద్ధాంత ప్రచారమునకూ కావలసిన నేర్పు, ఓర్పు వంటి సుగుణములు గూడ పుష్కలంగా ఉన్నవని గ్రహించారు. వారికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉన్నదని విశ్వసించారు. విద్యారణ్యులు తమ ఉత్తరదేశ తీర్థయాత్రలు ముగించుకొని తిరిగివచ్చి, హంపీ క్షేత్రమునగల శ్రీ విరూపాక్షస్వామి వారి ఆలయమునకు సమీపమునఉన్న మాతంగ పర్వతముపై అశ్రమము ఏర్పరచారు. ఆ ఆశ్రమమునందు వశిస్తూ తపమాచరించారు. ఈ తరుణంలో అగమ్య గోచరులైన సంగమ సోదరులు ఇద్దరూ, శృంగేరీ పీఠమును గురించీ, సనాతన మతోద్ధరణకై జరుగుతున్న కృషిగురించీతెలుసుకొని, మార్గదర్శకత్వమునకు శ్రీ విద్యారణ్యులవద్ద చేరి తమ దీనావస్థను వినిపించి, వారిని భవిష్యత్ కార్యక్రమమును నిర్దేశించమని ప్రార్థించారు. వారి జీవిత చరిత్రలను, వారిలోని నైరాశ్యభావనను సానుభూతితో విని గ్రహించిన శ్రీ విద్యారణ్యులు, వారి ప్రస్తుత స్థితికి జాలిపడినవారై, తాము సంకల్పించిన హైందవ మతాభ్యున్నతికి, వీరు తోడ్పడగలరని భావించి తగు సహాయము చేయగలనని చెప్పి తమ గురువులైన శ్రీ విద్యాశంకరులకుకూడా విషయములను వివరించి,

వారి శుభ సంకల్పమునకు ఆశీర్వాదములు పొందవలసినదని శ్రీ విద్యాశంకరుల వద్దకు పంపిరి. సోదరులు ఇద్దరూ వారిని దర్శించి వారి కథను వినిపించి, హిందూ మతోద్ధరణకుగాను, హైందవ సామ్రాజ్య నిర్మాణమునకు సంకల్పించినామనీ, ఆ మహత్కార్యమునకు కావలసిన సహాయ సహకారములను అందించి, హిందువులలో తమ నాయకత్వముపై విశ్వాసము పెంపొందునట్లుగా తగుకార్యాచరణమును నిర్దేశించవలసినదని ప్రార్థించారు.

శ్రీ విద్యాశంకర తీర్థులు కడు సమర్థులైన శృంగేరి పీఠాధిపతులు. వారి మనసునందు కూడా ఇటువంటి ఆలోచనలే మెదులుతున్నవి. వెదుకబోయిన తీగ కాలికి చుట్టు కున్నట్లు, తమ ఆశయములను కార్యరూపము నీయగల సమర్థులకై వెతుకుచున్న యతీంద్రులకు సంగమ సోదరులతో పరిచయము ఎంతో ఆనందమును కలుగజేసింది. సోదరుల అభ్యర్థన మేరకు వారిని హిందూ మతములోనికి పరివర్తనము చేయించి, వారికి తన సంకల్పమును వివరించి, సంకల్ప సాధనకు చేపట్టవలసిన కార్యక్రమములను విశదపరచి శ్రీ శారదాదేవి మందిరమునకు తోడ్కొని పోయి, ఆతల్లి సమక్షమున హిందూ ధర్మోద్ధరణకూ, పరిరక్షణకూ, తమ ప్రాణములను సహితమూ త్యాగముచేసి కృషి చేసెదమని ప్రమాణము చేయించిరి. అనంతరము వారికి కావలసిన సహాయ, సహకారములను శ్రీ విద్యారణ్యులు చేకూర్చెదరని చెప్పి పంపిరి. సంగమ సోదరులు మహానందభరితులై యతీంద్రులు తమకు అప్పగించిన కార్యము, దైవదత్తముగా భావించి, శ్రమకోర్చి, హిందూ రాజ్య నిర్మాణము చేయగలిగిరి.

విద్యాతీర్థులవారు తాము విదేహముక్తిని పొందు కాలము ఆసన్నమయినదని గ్రహించి, శృంగేరిపీఠాధిపత్యమును అలంకరించిన భారతీ తీర్థులను పిలిపించి, శృంగేరీ మఠమునకు అతి సమీపములో ప్రవహించు పవిత్ర తుంగానదీ ఉత్తర తీరమున, తాము సజీవ సమాధి చెందుటకుగాను, ఒక నేలమాళిగను త్రవ్వించవలసినదిగా ఆదేశించారు. తత్ప్రకారము కార్యము పూర్తి చేయబడినది. క్రీ.శ. 1333లో అసంఖ్యాకులైన వారి శిష్యులు, ప్రజలు, వేదమంత్రములను, శివ స్తోత్రములను పఠించుచూ, భజనలు చేయుచు, జయజయ ధ్వనులు చేయుచుండగా, స్వామి నేలమాళిగనందు ప్రవేశించి, యోగముద్రను ధరించి, పద్మాసనాశీనులై,

నేల మాళిగ ప్రవేశ ద్వారమును మూసివేయవలసినదిగా ఆదేశించారు. మూసిన తలుపులను 12 సంవత్సరముల వరకూ తెరవరాదని ఆంక్షలను విధించారు. విద్యా తీర్థులు మహాసమాధిగ్రస్తులైన కొంతకాలమునకు, భారతీతీర్థులు ఉత్తర దేశ యాత్రలకు పయనించారు. భారతీ తీర్థులు తీర్థయాత్రలు సేవిస్తున్న తరుణంలో కొంతమంది ఔత్సాహిక శిష్యులు, గురువు ఆజ్ఞలను ఉల్లంఘించి, నేలమాళిగ తలుపులను తెరచినారు. వారికి గురువుల భౌతిక అవశేషములు ఏవీ కన్పించలేదు. భారతీ తీర్థులు తిరిగి వచ్చిన అనంతరము ఈ విషయమును తెలుసుకొని ఖిన్నులైనారు. విద్యాతీర్థులు, వారికి కలలోకనుపించి, వారి సమాధిపై శివలింగ స్థాపన చేయవలసి నదని చెప్పారు. అదే విధంగా శివలింగ స్థాపనచేసి, ఆ లింగముపై క్రీ.శ. 1338లో గొప్ప దేవాలయము నిర్మించినారు. దానిపేరు విద్యాశంకర దేవాలయము. ఈనాటికీ చూడ వచ్చును. ఆదిశంకరులు తమ అద్వైత సిద్ధాంతమున నిర్దేశించినట్లుగా, షణ్మతములకు సంబంధించిన దేవతామూర్తులను ఆ దేవాలయమునందు ప్రతిష్ఠించినారు. ఈ విధంగా శివుడు విష్ణువు, శక్తి, సూర్యుడు, గణపతి, కుమారస్వాములను ఏక కాలమునందు ఆరాధించు సంకీర్ణ పద్ధతి, లేక ఉపాసన ద్వారా యోగము, జ్ఞానము, ఈశ్వరుడు సమ్మిళితమై భక్తులను అద్వితీయ బ్రహ్మసాక్షాత్కారమును ప్రాప్తింప చేయగలరని నమ్మకము.

హిందూమత స్వీకారానంతరము హరిహర, బుక్కసోదరులు,సైన్యమును కూడగట్టుకొని శృంగేరీ పీఠాధిపతుల ఆశీస్సులతోనూ, ఇతర హిందూ ప్రముఖుల సహాయ సహ కారములతోనూ, ముస్లిం నవాబుల ఆక్రమణ యందుగల భూభాగములను జయించి ఆనెగొందిని రాజధానిగా చేసికొని వారుభయులు, సంయుక్త రాజ్య పాలన ఆరంభించారు. ఆ రాజ్యమునకు ప్రభువు శ్రీ విరూపాక్షుడు. ఆ సోదరులు ఇరువురూ ఆ మహాదేవుని ప్రతినిధులుగా రాజ్యపాలన నిర్వహించుట ప్రారంభించారు.

శ్రీ విద్యాతీర్థుల సమాధిపై నిర్మింపబడిన దేవాలయ కుంభాభిషేకమునకు గాను మాధవమంత్రి ద్వారా అనేక కానుకలనేకాక భూదానములను కూడా జరిపించారు.

అనంతరము వారి రాజ్యస్థాపనకూ, వ్యాప్తికీ, వారి విజయ పరంపరల జ్ఞాపకార్థమూ, అందుకు కారణ భూతులైన శృంగేరి పీఠాధిపతుల దర్శనార్థమూ సకుటుంబీకులై, బంధు మిత్రపరివార సమేతముగా శృంగేరి పీఠమునకు వచ్చి, కానుకలు అర్పించి శ్రీ భారతీ తీర్థుల వారి ఆశీస్సులను అర్థించారు.

శ్రీ భారతీతీర్థుల వారు సంగమసోదరులూ, వారిపరివారమూ, హైందవ ధర్మము పట్ల, శృంగేరీ శ్రీ శారదా పీఠము పట్ల కనబరచిన భక్తి శ్రద్ధలకు సంతోషించి మంగళా శాసనములను చేసిన పిదప బుక్కరాయలకు తమ శ్రీముఖమునందజేశారు. ఆ శ్రీముఖము నందు వారణాశిలో నున్న శ్రీ విద్యారణ్యులను సత్వరమే తిరిగి రావలసినదిగా కోరారు. బుక్కరాయని ఉద్యోగుల ద్వారా శ్రీ ముఖమునందుకొనిన శ్రీ విద్యారణ్యులు తిరిగివచ్చి మాతంగ పర్వతముపై గల ఆశ్రమమునకు చేరుకు న్నారు. ఆ తరువాత కొంత కాలమునకు, శ్రీ విరూపాక్షాలయమునకు సమీపములో, ప్రత్యేకముగా తన ఉపయోగార్థము మరొక ఆశ్రమమును ఏర్పాటు చేసుకున్నారు.

బుక్కరాయలు శ్రీ విద్యారణ్యులను శృంగేరి తీసుకు వెళ్ళటానికి స్వయంగా వచ్చారు. ఇద్దరూకలసి శృంగేరిచేరారు.

క్రీ.శ. 1375లో భారతీతీర్థులు, శ్రీ విద్యారణ్యులను తమ తదనంతరము పీఠాధి పతులుగా నియమించి క్రీ.శ. 1377లో విదేహముక్తి పొందారు. శ్రీ భారతీ తీర్థుల వారు ఎటువంటి నూతన ఆధ్యాత్మిక సిద్ధాంతములను ప్రతిపాదించక పోయి నప్పటికినీ, విద్యారణ్యులతో కలసి అద్వైత వేదాంతాభివృద్ధికీ, వ్యాప్తికీ చేసిన సేవ గణనీయమైనది. వారి సాహిత్య, ఆధ్యాత్మిక రచనలు వాటికి అవే సాటి.

'అధికరణ రత్నమాల"లేక "వైయాసిక రత్నమాల" అని పిలవబడే శ్రీ భారతీ తీర్థులవారి గ్రంథము, బ్రహ్మ సూత్రముల అధికరణములకు ఛందోబద్ధమైన సంగ్రహము. దీనిలో వారు సిద్దాంతములను పూర్వపక్షముచేసి (త్రోసిపుచ్చి) వారి సిద్ధాంతములను ప్రతిపాదించిరి. ఆ గ్రంథముపై వారే ఒక భాష్యమును గూడా వ్రాశారు. కొంతమంది విద్వాంసులు ఆ భాష్యము విద్యారణ్యుల రచనగా భావించి నప్పటికినీ, 16వ శతాబ్దము నందు అద్వైత పండితుడైన శ్రీ అప్పయ దీక్షితులవారు ఆ భాష్యము, భారతీతీర్థులవారి రచనయేనని నిర్ణయించారు. శ్రీ భారతీ తీర్థులు శ్రీ విద్యారణ్యులు సంయుక్తంగా, అనేక రచనలు చేసి ఉండటంచేత ఏ రచనలు ఎవరివని నిర్దుష్టంగా నిర్ణయించుటకు వీలుకాదు. వారు పూర్వ మీమాంసపై కుమారిలభట్టు, ప్రభాకరమిశ్ర వ్రాసిన వ్యాఖ్యాదులను, బౌద్ధ, జైన, చార్వాక మత గ్రంథములను, వారి తర్క చాతుర్యమును విమర్శిస్తూ, గ్రంథ రచనలు కావించారు.

అద్వైత వేదాంతముయొక్క ఔన్నత్యమును, ప్రాశస్త్యమును విశదీకరిస్తూ విద్యారణ్యుల తోకలసి అనేక రచనలు చేశారు. వేదాంత పంచదశికి తాత్పర్యదీపిక యనెడి వ్యాఖ్యను వ్రాసిన రామకృష్ణ పండితులు ఈ విధంగా వారిని ప్రస్తుతించారు.

**శ్లో॥ సత్వాశ్రీ భారతీతీర్థ, విద్యారణ్య మునీశ్వరౌ**
**ప్రత్యాక్ తత్త్వ వివేకస్య, క్రియతే పదదీపికా**
**తృప్తి దీపాఖ్యం ప్రకరణం, ఆరభమాణః శ్రీ భారతీ**
**తీర్థ గురుః తస్య శ్రుతి వ్యాఖ్యాన రూపత్యాత్ శ్రుతిం అదౌ పఠతి.**

విజయనగర రాజ్య మేలిన సంగమ వంశీయులేగాక, ఇతర వంశీయులు చేసిన దానశాసనములలో, కూడా శృంగేరీ పీఠాధిపతులను శ్రీ భారతీతీర్థ, శ్రీ విద్యారణ్యులు సనాతన ధర్మోద్ధరణకూ, పరిరక్షణకూ, హైందవ సామ్రాజ్య స్థాపనకూ చేసిన కృషిని కీర్తిస్తూ లిఖించారు. శ్రీభారతీతీర్థులవారి ప్రవచనములు, సరళమై, అర్థభరితమై, తర్కసిద్ధమై, హిమాలయముల నుండి క్రిందకు ఉరుకుతున్న గంగా ఝరివలె అనర్గళమై ఉంటవి.

■ ■ ■

# శ్రీ విద్యారణ్యులు

“శ్రీ విద్యారణ్యులు” అనేది ఎంత అందమైన పేరు ? ఎంతో భావగర్భితమై, ఆధ్యాత్మిక జ్ఞానమును నింపుకొనియున్న పేరు. విద్యారణ్యులంటే, తత్త్వజ్ఞాన సంపన్న మైన మహారణ్యము. అడవిలో ఏ విధంగా అనేక రకములైన వృక్షములుంటవో, అదే విధంగా నిగమాగమాది అనేక శాస్త్రములయందు పాండిత్యము గలవాడని భావము. వారి పేరును శ్రీ విద్యారణ్యులు అని పిలిస్తే వారు శ్రీ విద్యోపాసకులు. ఆ విద్యయందు నిష్ణాతులు అని అర్థం వస్తుంది. శ్రీ విద్య అంటే శ్రీ చక్రములో ఆసీనయై, యోగిగణములచే సేవింప బడుతున్న ఆదిపరాశక్తిని అర్చించుట. ఆది శంకరులు ఆమెను ‘శ్రీ విద్యాశివ వామభాగ నిలయా’ అని కీర్తించారు : శివుని వామభాగములో వసిస్తుంది. లేదా శివుని వామభాగమే ‘శివా’యని పిలవబడే శక్తి స్వరూపిణి శ్రీ విద్య. వేదములయందును ఆగమములయందు నిర్దేశించిన విధాన మును అనుసరించి ఆమెను అర్చించు విధానమే శ్రీ విద్య. శృంగేరి పీఠ అధిష్టాన దేవత శ్రీ శారదాదేవి. ఆదిశంకరులు దక్షిణ భారతమున వైదిక ధర్మ పరిరక్షణనూ, అద్వైత మతవ్యాప్తినీ, శ్రీ శృంగేరీ పీఠాధిపతులకు ఒప్పచెప్పారు. ఆదిశంకరులతో వాదనకు దిగిన మండన మిశ్రుడు ఓడిపోయి సన్యాసమును స్వీకరించి, ఆదిశంకరుల శిష్యుడైనాడు. ఆయనకు శంకరులు సురేశ్వరాచార్యులనే దీక్షానామము ఇచ్చి,

మొట్టమొదటి శృంగేరి పీఠాధిపతిగా నియమించారు. మండనమిశ్రుని భార్య ఉభయ భారతి ఆవిడయే శ్రీ శారద. ఆదిశంకరులు ఒక శిలపైన శ్రీ చక్రమును నిర్మించి, దానిపై శ్రీ శారదాదేవిని ప్రతిష్టచేసినారట. శ్రీ సురేశ్వరుల అనంతరము కొందరు పీఠాధిపతులు, ఉత్తరాధికారులు అయినప్పటికి క్రీ.శ. 14వ శతాబ్దమునందు శ్రీ విద్యాతీర్థులు పీఠాధిపతులు అగు వరకూ మఠాభివృద్ధి జరుగలేదు. వారి అనంతరము పీఠాధిపతులైన శ్రీ భారతీ తీర్థులవారూ, శ్రీ విద్యారణ్యులవారూ విజయనగర రాజుల సహాయ, సహ కారములతో మఠాభివృద్ధిని జరిపారు. అందమైన దేవాలయములను, ముఖ్యముగా శ్రీ విద్యాతీర్థులవారి సమాధిపై విశాలమైన శివాలయమును, శ్రీ శారదా దేవికి బహుసుందర దేవాలయములను నిర్మించి, శిలా విగ్రహముస్థానే, స్వర్ణ విగ్రహమును ప్రతిష్ఠించారు.

మరొక ముఖ్యమైన విషయము ఏమంటే, హరిహర, బుక్కరాయల కొలువులో మంత్రిగా ఉన్న మాధవుడే, సన్యసించి విద్యారణ్యుడని దీక్షా నామమును స్వీకరించాడనే ఆధారరహితమైన వాదన ప్రచారములో ఉన్నది. అంతేగాక ఆనాటి సమకాలీన ఆధ్యాత్మిక సాహిత్యంలో వెలువడిన గ్రంథములు అన్నిటికీ విద్యారణ్యులే కర్తయని ప్రచారము చేయటం జరిగింది. సరియైన కాల నిర్ణయము చేయకుండా, శాసనముల పరిశోధనకానీ, సమకాలీన సాహిత్య పరిశీలనకానీ చేయకుండానే, మాధవుని పేరుంటే చాలు, అది విద్యారణ్యుల రచనయే అని నిర్ణయించుట జరిగినది. ఈ ప్రచారమునకు ఏ విధమైన ఆధారములు లేవు. మాధవుడు క్రీ.శ. 1331 లో సన్యసించి విద్యారణ్యులను దీక్షా నామమును గ్రహించినారని కొందరు చరిత్రకారులు, పండితులు చెప్పటం జరిగింది. సాహిత్యపరంగా విచారిస్తే క్రీ.శ. 15వ శతాబ్దిలో ఉండిన నరసింహ పండితుడు రచించిన “శ్రౌత స్మార్త క్రియా ప్రయోగ పారిజాతమ’ ’ను గ్రంథములో “కాల నిర్ణయము” అనే గ్రంథమును శ్రీ విద్యారణ్యులు వ్రాసినట్లు పేర్కొన్నాడు. “శ్రీ విద్యారణ్య మునీంద్రైః కాల నిర్ణయప్రకార ప్రతిపాద్యతే” అని ఉండగా ఆ గ్రంథము పేరును ‘కాలమాధవీయమని’మార్చి, విద్యారణ్యులు మాధవుడు ఒక్కరేనని ప్రచారము చేసినారు. వారి వాదనను సమర్థించుకొనుటకై ఆయన లౌకికగ్రంథములను మాధవుడనే పేరుతోనూ, పారమార్థిక గ్రంథములను విద్యారణ్య నామముతోనూ రచించుటవలన ఈ వివాదమునకు అవకాశము ఏర్పడినట్లు క్రీ.శే.

శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు, తమ 'శ్రీ మాధవ విద్యారణ్య స్వామి చరిత్ర' గ్రంథములో తెలియచేశారు. ఇంకా అనేకమంది, తమ రచనలలో మాధవుడు విద్యారణ్యులు ఒకరేనని వ్రాసి, సరియైన ఆధారములు చూపలేకపోయారు. అదే విధంగా మరికొందరు చరిత్రకారులు, పండితులు, వారొకరుకాదు. వేరువేరు వ్యక్తులని నిరూపించ ప్రయత్నించారు. శ్రీ కె.ఆర్.వెంకటరామన్ గారు తమ గ్రంథమైన "Age of Vidya- ranya"లో మాధవుడు క్రీ.శ. 1370లో సన్యసించినట్లున్నూ, హరిహర, బుక్కరాయలు ఉభయులూ విద్యారణ్యుల సందర్శనార్థము క్రీ.శ. 1334-35 వచ్చునప్పటికే వారు సన్యాసిగా నున్నట్లునూ, క్రీ.శ. 1336లో మొదటి హరిహర రాయలు పట్టాభిషేక సందర్భమున, కొందరు బ్రాహ్మణులకు భూదానము చేయుచూ వ్రాయించినట్టి నెల్లూరు జిల్లాలోని కావలూరులో దొరకిన శాసనములోనూ, అదే సందర్భమున వ్రాయించిన మరొక శాసనము కోలారు జిల్లా బాగేపల్లి తాలూకా బెస్తరహళ్ళిలోనూ లభించినవి. వాటిలో "విద్యారణ్యం యతి మభజత శ్రీమహేశానమన్యం" అని విద్యారణ్యులను "యతి" అని ప్రస్తావించబడినది. బుక్కరాయుని అనంతరము, సింహాసనమును అధిష్టించిన రెండవహరిహరుని పట్టాభిషేక సందర్భమున కూడ రాయలవారు విద్యారణ్యులు తమ తండ్రులకు, విజయనగర రాజ్యస్థాపనకు, చేసిన సహాయమును ప్రశంసిస్తూ, వారిని యతీంద్రులుగానే కీర్తించుట జరిగినది కానీ, గృహస్థుగా వర్ణించలేదు. నూనిజ్, ఫరిష్టా బుఖానన్, వంటి విదేశీ చరిత్రకారులు కూడా హరిహర, బుక్క సోదరులు ఒక సన్యాసి ప్రభావమునకు లోనైనారని వ్రాశారే కానీ మరొక విధంగా వ్రాయలేదు. గ్రంథ విస్తరణ భయంతో ఈ అంశమును ముగించుటకు ముందుగా మరొకముఖ్యమైన విషయమును ప్రస్తావన చేయవలసి వస్తుంది. ప్రఖ్యాత వేదభాష్యకారుడైన సాయణాచార్యునికి అన్నగారైన మాధవుడే నిజంగా విద్యారణ్యుడైనచో, ఆయన వ్రాసిన గ్రంథములుగా చెప్పబడుచున్న వాటిని, తమ్ముడైన సాయణునితో కలసి వ్రాయక శ్రీ భారతీతీర్థులతో కలసి ఎందుకు వ్రాయవలసి వచ్చింది ? ఈ ప్రశ్నకు సమాధానము విద్యారణ్యుడు, మాధవుడూ ఒకరు కాదు. ఆయన సాయణాచార్యులు అన్నగారు కాదు. పూర్వాశ్రమములలో శ్రీ భారతీతీర్థ, శ్రీ విద్యారణ్యులు అన్నదమ్ములు, ఆ కారణంగా వారు సంయుక్తంగా గ్రంథరచన చేసి ఉంటారని స్పష్టమౌతున్నది.

ప్రచారములో ఉన్న గాధనుబట్టి వీరశైవాచార్యులలో ప్రముఖుడైన శ్రీ రేవణ సిద్ధ లేక శ్రీ రేవణాచార్యుడు సంగమ సోదరులకు కలలో కన్పించి, వారికి మార్గ నిర్దేశమునకు గాను విరూపాక్ష స్వామి దేవాలయము సమీపమునగల మాతంగ పర్వతముపై తపస్సు చేస్తున్న విద్యారణ్య యతీంద్రులను కలుసుకొనమని ఆదేశిం చారట. వీరశైవ సాహిత్యములో వ్రాయబడిన మరో అంశమేమంటే రేవణాచార్యుల వారు శ్రీ విద్యారణ్యులకు చంద్రమౌళీశ్వర లింగమును ప్రదానము చేశారని, శృంగేరీలో ఆరాధింపబడుతున్న లింగము వారిచ్చినదేనని తెలుస్తున్నది. “గురువంశ కావ్యము” ఆదిగాగల ఆనాటి గ్రంథములలో హరిహర, బుక్క సోదరులు సహాయము నర్థిస్తూ విద్యారణ్యునిదర్శించి నప్పటికే వారు సన్యాసులుగా ఉన్నారని తెలియజేస్తు న్నవి. “శివతత్త్వ రత్నాకరమనే” గ్రంథముకూడా, అదే విషయమును నిర్ధారించినది. ఈ విధంగా సాహిత్యపరంగా పరిశీలించినప్పటికీ, విద్యారణ్యులు సన్యాస స్వీకారము చేసి, విదేహముక్తులయే వరకూ అంటే క్రీ.శ. 1331–1386 వారు సన్యాసిగానే జీవితము గడిపినారు. కానీ ఏనాడు గృహస్థాశ్రమములో లేరని ధృడపడుచున్నది.

సంగమ సోదరులు మొదటి రాజధాని గుత్తి (అనంతపూరు జిల్లా). ఆనెగొందికి మార్చి అనంతరము సాయణాచార్యుల అన్నగారైన మాధవుడు సంగమ సోదరులకు మంత్రిగానూ, కులగురువుగా మాత్రమే వ్యవహరించినట్లు తెలుస్తున్నది.

విద్యారణ్యులకు సంబంధించిన మరో రెండు ముఖ్యమైన వివాదాంశములు ఏవనగా ఆయన సంగమ సోదరులను తిరిగి హిందూ మతములోనికి మార్చిన ఉదంతము మరియు విజయనగర రాజ్యస్థాపన, అభివృద్ధిని గురించినవి. పై రెండు అంశములను గురించి కొందరు చరిత్రకారులు, అది కేవలము కల్పితములనీ, విద్యారణ్యులకు ఎటువంటి ప్రమేయములేని విషయములనీ, వారి గ్రంథములలో వ్రాశారు. విజయ నగర రాజ్యస్థాపన విద్యారణ్యుల ప్రోద్బలంతో హిందూ ధర్మరక్షణకై జరిగినదనే విషయం కేవలము, మత అభిమానంతో చెప్పిన కట్టుకథ అన్నారు. వారి వాదనకు ఆధారముగా బుక్కరాయల కోడలు, కంపన రాయల భార్యయైన, గంగాదేవి క్రీ.శ. 1355–56 అనగా, ఆ సంఘటన అనంతరం సుమారు 50 సంవత్సరములకు వ్రాసిన “మధురా విజయమ”ను అసంపూర్ణ సంస్కృతకావ్యములో, ముస్లిం సైన్యములు చేసిన దారుణ కృత్యములను తాను స్వయముగా చూసి, వర్ణిస్తూ ఆ

భయంకర స్థితి నుండి, పవిత్ర మధురై నగరమును కాపాడిన వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసింది. కానీ ఆ పేర్లవో అతిముఖ్యుడని భావించబడే విద్యారణ్యుల పేరు లేకపోవటంవలన విజయనగర రాజ్యస్థాపనయందు వారికి ఎటువంటి ప్రాముఖ్యత లేదని నిర్ణయించారు. అదే విధంగా సంగమ సోదరుల మత మార్పిడి విషయము కూడా కల్పితమని చెప్పి, ఆ కథను బలహీనులైన సంగమవంశ రాజులు తమ రాజకీయ ప్రయోజనములకై ప్రచారంచేసి ఉంటారన్నారు. ఇందుకు శృంగేరి మఠాధిపతులు ప్రోత్సహించారని వ్రాశారు. అయితే పైన వివరించిన అభిప్రాయములు, రాబర్టు స్వెల్ వంటి విదేశీ చరిత్రకారుల అభిపా్రయములకు వ్యతిరేకముగా ఉన్నవి. స్వెల్ తన ప్రఖ్యాత చారిత్రక గ్రంథము "A Forgotten Empire" లో విజయనగర రాజ్య స్థాపనకు ఏడు కారణములను వివరించాడు. అందులో ముఖ్యమైనవి ముస్లిం పరిపాలకులకు వ్యతిరేకంగా జరిపిన హిందూ స్వాతంత్ర్యోద్యమము, సంగమ సోదరుల పరాజయము, శ్రీ విద్యారణ్యులను కలవటం, వారు నిర్దేశించిన విధానమును అనుసరించి విజయనగర రాజ్య స్థాపన, క్రీ.శ. 1336 లో తుంగభద్రా తీరమున విద్యానగరము లేక విజయనగరము రాజధానిగా నిర్మించుకొనటం వంటి అనేక అంశములు వివరముగా తెలియజేయబడినవి. వీరేకాక మరికొంతమంది ముస్లిం చరిత్రకారులుకూడా విజయనగర రాజ్యస్థాపన, మరియు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమములలో విద్యారణ్యుల ప్రముఖ పాత్రను వర్ణించటం జరిగింది. నిస్వార్థంగా వారు వ్రాసిన వ్రాతలలోని విషయములను శంకించ వలసిన పని ఏమున్నది ? అందువలన విద్యారణ్యులను కించపరుస్తూ వ్రాసిన వ్రాతలు సత్య దూరములుగా భావించవచ్చు. ఈ విధంగా విద్యారణ్యుల వ్యక్తిగత జీవితము అనేక వివాదాంశములతో కూడుకున్నది.

తమ్ముని వెతుక్కుంటూ ఓరుగల్లు నుండి బయలుదేరిన విద్యారణ్యులు (వారి పూర్వాశ్రమము నామము తెలియదు) శృంగేరి చేరటం, శ్రీ విద్యా శంకరులనుండి సన్యాస దీక్షను పొంది, దీక్షానామమును విద్యారణ్యులని నిర్ణయించటం శ్రీ భారతీ తీర్థులకు సంబంధించిన అధ్యాయములో తెలియజేయబడినదిగాన చర్విత చర్వణముగా భావించి, తదుపరి విషయములను తెలియజేసెదము.

సన్యాస స్వీకారానంతరం విద్యారణ్యులు కాశీక్షేత్రమునకు తీర్థయాత్రగా వెళ్లారు. ఆ యాత్రలో వింధ్య సానువులలోని, దుర్గమారణ్యములో శ్రింగిణి అనే బ్రహ్మరాక్షసుడు

కలసి, ఆయనను వారణాసి వరకు సాగనంపినాడట. ఆ పవిత్ర క్షేత్రంలో వేదవ్యాసుడు దర్శనమిచ్చి, బదరికాశ్రమమునకు వెళ్ళవలసినదిగా ఆదేశించాడట. విద్యారణ్యులకు బదరికాశ్రమమునందు వ్యాసుడు, శ్రీ విద్యను ఉపదేశించినాడని ఒక గాథ ప్రచారములో ఉన్నది. యాత్ర ముగించుకుని వచ్చిన విద్యారణ్యులు, విరూపాక్ష దేవాలయము సమీపములోని, మాతంగ పర్వతముపై తమ ఆశ్రమమును ఏర్పాటు చేసుకుని తపమాచరించసాగారు. ఆ తరుణంలో సంగమ సోదరులేగాక, ఆనెగొందికి చెందిన మాయణ కుమారులు, మాధవుడు, లేక మాధవాచార్యులు, తమ్ముడు సాయణాచార్యులు, విద్యారణ్యుల దర్శనమునకు రావటం జరిగింది. ఇంతకు పూర్వము వారిద్దరూ ఓరుగల్లునందు ప్రతాపరుద్రుని కొలువులో ఉండేవారు. కాకతీయ రాజ్య పతనానంతరము వారు ఆనెగొందిచేరి, విజయనగర ప్రభువుల కొలువులో చేరినారు. తన దర్శనార్థమై విచ్చేసిన ఆ సోదరులకు, వేదవేదాంగాది శాస్త్రములలోగల పాండిత్య ప్రకర్షకు సంతసించి, తాము అప్పటికే చేపట్టిన వేదములకు భాష్యములు వ్రాయు కార్యక్రమమును వారికి ఒప్పగించినారట. ఆ కాలంలో మాధవుడు బుక్కరాయలకు కులగురువుగా వ్యవహరిస్తున్నారు. విద్యారణ్యులు తమ ఆధ్యాత్మిక సాధనకు అవరోధమును కలిగిస్తున్న రచనా వ్యాసంగము సర్వమునూ, బుక్కరాయలవారి అనుమతితో, మాధవ, సాయణులకుఒప్పగించారు. ఆ విధంగా విద్యా రణ్యులచే ఆరంభింపబడిన వేదభాష్య రచన సాయణాచార్యులచే పూర్తి చేయబడి, ఆయనకు అనంతమైన కీర్తి ప్రతిష్టలను సంపాదించిపెట్టింది.

శృంగేరి పీఠాధిపతుల ఆశీర్వాదబలంతో అప్పటికే హరిహర, బుక్క సోదరులు, మూడవ బల్లాలుని ఓడించి, కంపిలి రాజ్యమును కైవసము చేసుకొని ఆనెగొంది రాజధానిగా, దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి హిందూ సామ్రాజ్యమైన విజయ నగర మహాసామ్రాజ్యమునకు పునాదులు వేశారు. విద్యారణ్యుల ప్రతి ఆదేశమునూ, హరిహర బుక్క రాయలు ఆచరించి సత్ఫలితములు పొందేవారు.

క్రీ.శ. 1326వ సంవత్సరము ఏప్రియల్ నెల 18వ తేదీన హరిహర రాయలను రాజుగా ప్రకటించి, విరూపాక్ష దేవాలయము నందు ఆ స్వామి సన్నిధిలో పట్టాభిషిక్తుని చేశారు. ఆ సందర్భమును పురస్కరించుకొని వ్రాయబడిన తామ్ర శాసనములో, కండ్లకు కట్టినట్లు, ఆ సన్నివేశమును వర్ణిస్తూ, హరిహరుడు విద్యారణ్యుల ఆదేశాను

సారము సింహాసనాశీనుడై, విద్య లేక విద్యానగరమని పిలువబడు సువిశాలమైన, ఆ నగరమునకు తగినట్లు షోడశ మహాదానములు చేయుటయే కాక, తమ గురువుల యందుగల భక్తి, శ్రద్ధలకు, తార్కాణంగా ఆ నగరమునకు "విద్యారణ్యపురి" యని నామకరణము జరిగినది. శ్రీశైల మల్లికార్జునస్వామి సేవకై చిరవారిపల్లి అనే గ్రామము దానమీయబడినది. రాజాజ్ఞ ప్రకారము ఈ శాసనము శాసనాచార్య నాగదేవునిచే రచింపబడినది అని ముగింపబడినది. రాజ లాంఛనములు అన్నిటినీ తమ గురువైన విద్యారణ్యులవారి పాదముల చెంతనుంచగా లాంఛనముగా వాటిని స్వీకరించి తిరిగి, రాజైన హరిహరునకు ఇచ్చి, రాజ్యమును ధర్మబద్ధముగా విరూపాక్ష స్వామి వారి ప్రతినిధిగా పాలనచేయమని ఆదేశించి, హరిహరరాయలకు శ్రీమద్ రాజాధి రాజ; రాజ పరమేశ్వర; "అపరిమిత ప్రతాపవీర"; "నరపతి" అను బిరుదులు ప్రదానము చేశారు. రాజు శృంగేరి జగద్గురువులను "కర్ణాటక సింహాసన స్థాపనా చార్య" అని గౌరవప్రదమైన బిరుదు ప్రదానముచేశారు. ఆనెగొంది, చిన్నపట్టణము గాన, భవిష్యత్‌లో నిర్మింపబోవు మహా సామ్రాజ్యమునకు రాజధానిగా నుండతగదని భావించి, శ్రీ విద్యారణ్యుల ఆజ్ఞానుసారము, నూతన మహా నగరమును నిర్మించుటకు గాను శ్రీ విద్యకు స్థానమైన శ్రీ చక్రమును పోలిన ఆకారములో మహానగర నిర్మాణము ప్రారంభించి, తమ రక్షక గురువులైన శ్రీ విద్యారణ్యుల పేర శ్రీ విద్యానగరమని నామకరణ చేయగా ఆ నగరము అనంతరకాలమున విజయనగరమని పిలువబడి ప్రసిద్ధి గాంచింది. అయినప్పటికినీ, శాసన సాక్ష్యమును త్రోసిపుచ్చి, విద్యారణ్యులు విజయనగర సామ్రాజ్య స్థాపనకుచేసిన కృషి శూన్యమని వాదించటం ఆశ్చర్యం కలిగించక మానదు. క్రీ.శ. 1336లో నిర్మించిన ఈ మహానగరము హిందూ ధర్మోద్ధరణకు, నడుంకట్టిన విజయనగర ప్రభువుల రాజధానిగానేకాక, ముస్లిం నవాబుల పాలనలో క్రూర హింసలకు గురియై, పారిపోయి వచ్చిన అనేక హిందూ, ముస్లిమ్ జాతీయులకు కూడా ఆశ్రయము ఇచ్చింది. హరిహర, బుక్కసోదరులు, క్రమముగా తమ రాజ్య విస్తరణను గావించి, తుంగభద్రా పరీవాహిక ప్రదేశమునూ, కొంకణ దేశములో కొంత భాగమునూ, మలబారుతీర ప్రాంతములను తమ ఏలుబడి లోకి తెచ్చుకున్నారు. అన్నదమ్ములు ఇద్దరూ తమ పరిపాలనను శ్రీ విరూపాక్షుని ప్రతినిధులుగా, భృత్యులుగానే జరిపినారుగానీ రాజ బిరుదులను ఉపయోగించు

కొనలేదు. ముస్లిం చరిత్రకారులు, సంగమ సోదరులు కాపయ నాయకుని నాయకత్వంలో దక్షిణ భారతము నుండి ముస్లిముల పాలన అంతము చేయ తలపెట్టిన ఉద్యమములో పాల్గొన్నట్లుగా వ్రాశారు. ఈ రకమైన వ్రాతలకు శాసనా ధారములు కూడా కన్పించుచున్నవి. అందువల్ల సంగమ సోదరుల రాజ్యస్థాపన హిందూ ధర్మోద్ధరణకు, హిందువుల ధన, మాన, ప్రాణాదుల రక్షణకే గానీ, రాజభోగములను అనుభవించవలెననే స్వార్థ చింతనతో కాదని ఋజువగుచున్నది. అయినప్పటికినీ, వారు మతావేశ పరులుగాక, రాజ్యములోని, అన్ని మతముల వారితో సమభావముతో వర్తించేవారు. ఆవిధమైన ధర్మపరిపాలన నిర్వహించుటలో శ్రీవిద్యారణ్యుల పాత్ర కూడా ఆ శాసనములయందు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇన్ని విధములైన సాక్ష్యాధారములు ఉన్నప్పటికీ కొందరు చరిత్రకారులు శ్రీ విద్యారణ్యులు వ్యక్తిత్వాన్ని, రాజనీతిజ్ఞతను కించ పరచుట బాధాకరమైన విషయము.

హరిహరుని పట్టాభిషేకానంతరము విద్యారణ్యులు వారణాసి వెళ్లి అచట తమ కొరకూ, తమ శిష్యుల కొరకూ ఆశ్రమములను ఏర్పాటు చేశారు. శ్రీ విద్యాతీర్థుల వారు విదేహముక్తి పొందిన అనంతరము శ్రీ భారతీ తీర్థులు, శృంగేరీ పీఠాధిపత్యము వహించి, విద్యారణ్యులను తిరిగి రావలసినదిగా బుక్కరాయలవారి ద్వారా వర్తమానము పంపటం, అదే ప్రకారం విద్యారణ్యులు, బుక్కరాయలతోపాటు శృంగేరి రావటం జరిగింది. ఆ శుభ సందర్భమును పురస్కరించుకొని బుక్కరాయలు, తమ గురువుల ఆశయసిద్ధి నెరవేరుటకు కావలసిన ధనముకొరకు ఒక అగ్రహారమును, పీఠమునకు దానముచేసి, శాసనమును విడుదలచేశారు. క్రీ.శ.1375లో శ్రీ భారతీ తీర్థులు విదేహముక్తి పొందుటకు ముందు శ్రీ విద్యారణ్యులను పీఠాధిపతులుగా నియమించారు. బుక్కరాయలు క్రీ.శ. 1379లో అస్తమించిన తరువాత ఆయన కుమారుడు, రెండవ హరిహరుని పేరుతో సింహాసనము అధిష్ఠించాడు. రెండవ హరిహరుడే విజయనగర రాజులలో మొట్టమొదటి పర్యాయము "మహారాజాధిరాజ" అను రాజ బిరుదును ధరించిన వాడు. పట్టాభిషేక సందర్భమున రెండవ హరిహరుడు శ్రీ విద్యారణ్యులను శృంగేరినుండి రాచమర్యాదలతో సగౌరవంగా ఆహ్వానించి, రాజలాంఛనములైన ధవళ ఛత్రము (తెల్లని గొడుగు), శంఖము, తాళములు, భేరీలు, కాగడాలు, చీనాంబరములు, పల్లకీ, బంగారు సింహాసనము, మణులు పొదిగిన

పాముకోళ్ళు ఆదిగాగల సమస్త వస్తుసముదాయమునూ, విద్యారణ్యుల పాదముల చెంత ఉంచినారు. విద్యారణ్యులు వాటిని స్వీకరించినట్లుగా తాకి అనంతరము తమ గురువులైన విద్యాశంకరుల జ్ఞాపకార్థము వాటిని శృంగేరీ మఠమునకు సమర్పించారు. ఆహూతులైన మహారాజుకు, రాజ బంధువులకు, ఇతర ప్రభువులకు, ఉన్నత ఉద్యోగులకు శ్రీ విద్యోపాసనా దీక్షనొసంగినారు. శ్రీ విద్యారణ్యులు తమ అమోఘ తపఃశక్తితో, ప్రజ్ఞానముతో, జగద్గురువుగా, శృంగేరీ పీఠాధిపతిగా, మహావిష్ణువు వరాహరూపమున భూమిని ఉద్ధరించినట్లు, విజయనగర ప్రభువుల సహాయ సహకారములతో సనాతన ధర్మపునరుద్ధరణచేసి వ్యాప్తిచేశారు. అదే సమయమందు విజయనగర ప్రభువులకు రాజ్యపాలనయందు మార్గదర్శకునిగా తమ రాజనీతిజ్ఞతను ప్రదర్శించి ధర్మబద్ధమైన పరిపాలన కొనసాగునట్లు నిర్దేశించారు.

శృంగేరీ పీఠాధిపతులైన విద్యారణ్యుల బిరుదావళి ఈ విధంగా ఉండేది. శ్రీ పరమహంస పరివ్రాజకాచార్య, పద వాక్య ప్రమాణ పారావార పారీణ, అష్టాంగ యోగ నిష్ఠా తపశ్చక్రవర్తి, అనాద్యవిచ్ఛిన్న, శ్రీ శంకరాచార్య గురుపరంపరాప్రాప్త షడ్దర్శన స్థాపనాచార్య వాఖ్యాన సింహాసనాధీశ్వర, సకల నిగమాగమ సారహృదయ, సాంఖ్యత్రయ ప్రతిపాదక, వైదిక మార్గప్రవర్తక, సర్వతంత్ర, స్వతంత్రాదిరాజధానీ, విద్యానగర మహారాజధానీ, కర్ణాటక సింహాసన ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ మద్రాజాధిరాజగురు, భూమండలాచార్య, ఋష్యశృంగ పురాధీశ్వర, తుంగభద్రా తీరవాసీ, శ్రీ మద్విద్యా శంకర పద్మారాధక శ్రీ జగద్గురు విద్యారణ్య స్వామి".

రెండవ హరిహరుని మరణానంతరము ఆయన కుమారుడు విరూపాక్షరాయలు సింహాసనము నధిష్టించి విద్యారణ్యుల స్తుతిస్తూ శ్రీ రంగము నందలి రంగనాథాలయ కుడ్యముపై ఈ విధంగా శాసనమును వేయించాడు.

**శో॥ యతి గణాగ్ర గణ్యం । ఆధ్యాత్మ విద్యానిధి ధ్యాయ మానమోకసం !**
**అపరిమిత శంకరాచార్యం । పరమహంస పరివ్రాజకాచార్యం,**
**ఆచార్యమాత్మనో విద్యారణ్యే యతీంద్రం,**
**అసాధ్య భక్త్యా సాష్టాంగం, అభ్యవందిష్ట.**

విద్యారణ్యులు నిర్యాణానంతరము కూడా, తమ రాజ్యస్థాపకులు, రాజ గురువులు శృంగేరీ పీఠాధిపతులైన విద్యారణ్యులకు, తమ భక్తిపూర్వక కృతజ్ఞతలను

తెలియజేస్తూ విజయ నగరమును పరిపాలించిన తుళువ, అరవీటి వంశ రాజులు కూడా ఈ విధమైన శాసనములను వ్రాయించారు.

**విద్యారణి సంమిధానాం, జ్యోతిర్యం అనువర్తతే ।**
**యత్త మా సేవతే, తస్మాత్ విద్యారణ్య ఇతిర్యేతే ॥**
**విద్యాతీర్థ జుషం, ప్రశస్త జనుషం, విద్యాధిక శ్రేయనం**
**భారత్యాచ నిషేవితం, ప్రకటితా శేషాగమ ప్రక్రియం,**
**శ్రీ విద్యానగరీ విహార రసికం, విద్యా వినోద ప్రియం**
**విద్యారణ్యముపాస్మహే, హరి హర శ్రేయః ప్రదం సతతం**

ఇన్ని శాసన ఆధారములు ఉన్నప్పటికినీ, విద్యారణ్యుల పేరు గంగాదేవి ప్రశంసించినవారి పట్టికలోలేదని, విజయనగర సామ్రాజ్య స్థాపనయందు ఆయన ప్రమేయము లేదనటం హాస్యాస్పదము కాదా !

విద్యారణ్యులు క్రీ.శ. 1386 హంపీ క్షేత్రమున విదేహముక్తిని పొందారు. ఆ విషయము తెలిసిన రెండవ హరిహరుడు హంపీ క్షేత్రమునకువచ్చి తమ గురువుల స్మారకార్థం అగ్రహారమును దానముచేసి దానికి “విద్యారణ్య పురమ”ని పేరు పెట్టారు. ఆ అగ్రహారము నుండి వచ్చు ఆదాయములో కొంత భాగము శ్రీ భారతీ తీర్థులవారి సమాధిపై నిర్మించిన శ్రీ భారతీరామనాథ స్వామి వారి దేవాలయమునకు, మిగిలినది శ్రీ విద్యారణ్యుల వారి స్మారకార్థం, వారి సమాధిపై నిర్మింపబడిన శ్రీ విద్యావిశ్వేశ్వర స్వామివారి దేవస్థానమునకు చెందునట్లుగా శాసనము వేయించాడు.

శ్రీ భారతీ తీర్థులు, శ్రీ విద్యారణ్యులు సంయుక్తంగా లేక ఒకరికొకరు సహాయంగా, అనేక ఆధ్యాత్మిక గ్రంథములను, అద్వైత సిద్ధాంతమును వివరించు గ్రంథముల రచన చేశారు. అందువల్ల ఇదమిద్ధంగా ఎవరు ఏ గ్రంథమును వ్రాశారని చెప్పడం కష్టమైన పని అయినప్పటికినీ కొందరు విద్వాంసులు రచన శైలిని బట్టి, విద్యారణ్యులు వ్రాసిన గ్రంథములను గుర్తింప కలిగినారు. డాక్టరు శ్రీ పి. శ్రీరామమూర్తి గారు "Contribution of Andhra to Sanskrit Literature" (సంస్కృత సాహిత్యమునకు ఆంధ్రుల సేవ), అనే తమ పరిశోధక గ్రంథములో, కేవలము విద్యారణ్యకృతములుగా తొమ్మిది గ్రంథములను గుర్తించినారు. అవి (1) అనుభూతి ప్రకాశిక; (2) అపరోక్షానుభూతి

దీపిక; (3) జీవన్ముక్తి వివేక; (4) దృగ్ దృశ్య వివేక; (5) దేవ్యాపరాధ స్తోత్రము; (6) వేదాంతపంచదశి; (7) వివరణ ప్రమేయ సంగ్రహ; (8) వైయాసిక న్యాయ మాలా విస్తరము లేక అధికరణ రత్నమాల; (9) సంగీతసార.

విద్యారణ్యుల రచనలుగా గుర్తింపబడిన పై తొమ్మిది గ్రంథములలోనూ వారు వివరించిన ఆధ్యాత్మిక, అద్వైత తత్త్వములను గురించి, సంగ్రహ వివరణ ఈ క్రింద ఇవ్వబడింది.

**1. అనుభూతి ప్రకాశిక :**

ఇది పన్నెండు ఉపనిషత్తుల సారమును, ఇరువది అధ్యాయములుగా శ్లోక రూపములో వ్రాయబడినది. ఇది తమ గురువులైన విద్యాతీర్థుల ఆదేశానుసారము వ్రాయ బడినదిగా తెలుస్తున్నది. ప్రతి అధ్యాయము చివరన శ్రీ విద్యాతీర్థ గురుస్తుతితో పాటు, గద్యరూపములో "ఇతి శ్రీ విద్యారణ్యమునికృతే, అనుభూతి ప్రకాశే, ఐతరేప నిషద్వివరణో నామ ప్రథమోధ్యాయః" అని ప్రతి అధ్యాయము చివరనూ ఉపనిషత్తు పేరునూ, అధ్యాయపు సంఖ్యను తెలియజేస్తూ వ్రాయబడినది. ఈ గ్రంథము రెండు భాగములుగా విభజింపబడి మొదటి ఏడు అధ్యాయములు "చతుర్వేద విద్యాప్రకాశమ" నీ మిగిలిన పదమూడు అధ్యాయములూ "అనుభూతి ప్రకాశ" మనీ పిలవబడుచున్నవి.

**2. అపరోక్షానుభూతి దీపిక :**

ఆదిశంకరులు వ్రాసిన "అపరోక్షానుభూతి"యను అద్వైత గ్రంథమునకు ఇది వ్యాఖ్యానము.

**3. జీవన్ముక్తి వివేకము :**

ఇది ఐదు అధ్యాయముల గ్రంథము. మొదటి అధ్యాయము జీవన్ముక్తి ప్రమాణము. రెండవది వాసనాక్షయము. మూడవది మనోనాశము. నాల్గవది స్వరూపసిద్ధి ప్రయోజనము. ఐదవదీ చివరదీ విద్యత్ సన్యాసము. విద్యారణ్యులు, సాధకుడు జీవించి యుండగానే ముక్తి పొందవచ్చునని ప్రబోధించారు. కానీ దీనిని ద్వైత, విశిష్టాద్వైత మరియు ఇతర శాఖలవారు అంగీకరించలేదు. విద్యారణ్యులు ముక్తి సాధనకు సన్యాశాశ్రమ స్వీకారము అవసరమని చెప్పారు. యోగ జ్ఞానమువలన తత్త్వ జ్ఞానము, వాసనాక్షయము, మనోనాశనము ఏక కాలమందే లభించి, జీవన్ముక్తు డౌతాడని చెప్పారు. "యోగశ్చిత్త వృత్తి నిరోధః" అని పతంజలి సూత్రము.

**4. దృగ్ దృశ్య వివేకము :**

ఇది నలుబది ఆరు శ్లోకములు మాత్రమేగల చిన్ని పుస్తకము. దీనికి వ్యాఖ్యానము వ్రాసిన బ్రహ్మానంద భారతి ఇది భారతీ తీర్థులవారి రచనగా భావించారు. మరో వ్యాఖ్యాన రచయిత శ్రీ విశ్వేశ్వరులు ఇది విద్యారణ్యుని రచనగా పేర్కొన్నారు. అప్పయ్య దీక్షితులు ఇది ఉభయుల రచనయని నిర్ణయించారు. కాబట్టి ఈ అభిప్రాయ భేదము లను తొలగించుట వీలుకానిపని.

ఈ గ్రంథములో విద్యారణ్యులు లోకమునందలి ప్రతి వస్తువుకు ఐదు గుణములు ఉంటవనిన్నీ, వాటిలో మొదటి మూడు గుణములు ఉనికి, ప్రకాశము, సౌందర్యము. మిగిలిన రెండు స్వరూపము, నామము. మొదటి మూడు గుణములు బ్రహ్మము నుండి సంక్రమించినవి. చివరి రెండు గుణములు పరిమితమైన జగత్తుకు సంబంధించినవి. ఉదాహరణకు ఆకాశమును తీసుకుంటే దీనికున్న ప్రత్యేకత అనంతత్త్వము. సాధారణ పరిస్థితులయందు, దానికి ఉనికి, ప్రకాశము, సౌందర్యమను మూడు గుణములను కలిగి ఉంటుంది. కానీ దాని స్వరూపము నిత్యముకాదు. కారణం దానికి శూన్యముతో గల సంబంధము. మాయనుండి అది రూపమును పొందినది కాబట్టి, ఒకే రూప మును కలిగి యుండలేదు. మార్పు సహజము. అయితే మొదటి మూడు గుణములు సత్యము, నిత్యమైన బ్రహ్మ పదార్థము నుండి సంక్రమించినవి కనుక వాటికి మార్పు, నాశనము ఉండదు.

**5. దేవ్యాపరాధ స్తోత్రము :**

ఇది పన్నెండు శ్లోకములతో కూడియున్న దేవీ స్తోత్రము. శ్రీ విద్యాస్వరూపిణియైన జగన్మాతను ఉద్దేశించినది. దీనిని ఆదిశంకరులు వ్రాసినారనే ప్రవాదమున్నది. కానీ ఈ స్తోత్రమునందలి ఐదవ శ్లోకములోని ప్రథమ పాదమునందు 'మయా పంచా శత్‌రధిక మపనీ తేతువయసి" అనగా రచయిత ఎనుబది ఐదు సంవత్సరము లకు మించి జీవించి యున్నట్లు చెప్పుకున్నాడు. ఆదిశంకరులు తమ 32వ ఏటనే విదేహ ముక్తి పొందగా, ఎనుబది ఐదు ఏండ్ల వయసు కలవానినని చెప్పుట అప హాస్యము కదా! అందువలన ఈ స్తోత్ర రచన విద్యారణ్యుల వారిదేనని పండితులు నిర్ణయించారు.

**6. వేదాంత పంచదశి :**

విద్యారణ్యులు అద్వైత వేదాంత తత్త్వముపై వ్రాసిన పదిహేను ప్రకరణములు

గల గ్రంథము. వారి అన్ని గ్రంథముల కంటే మిక్కిలి ప్రాచుర్యము పొందిన గ్రంథరాజము. కానీ, ఇది వారి ఒక్కరి రచనయే కాదని శ్రీ భారతీ తీర్థులతో కలసి వ్రాసినట్లు ఆధారములు ఉన్నవి. ఈ గ్రంథములోని నాల్గవ, ఐదవ, ఇరువది రెండవ అధ్యాయముల చివర రచించబడిన గద్యమునందు "ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ భారతీ తీర్థ విద్యారణ్యముని వర్యకింకరేణ, శ్రీ రామకృష్ణా విదుషా విరచితా పదపీఠికా" అని పంచ దశిపై వ్యాఖ్యానమును రచించిన విద్యారణ్యుని శిష్యులైన రామకృష్ణ పండితులు వ్రాశారు. కాబట్టి ఇది నమ్మదగిన విషయమన వచ్చును. అప్పయ్యదీక్షితులవారు తమ "సిద్ధాంత వేశమంజరి" యందు, గ్రంథ రచయిత భారతీ తీర్థులని నిర్ణయించారు. నిశ్చలానందుడు తన "వృత్తి ప్రభాకరము" నందు ఇది విద్యారణ్యుల రచనగా పేర్కొన్నారు. ఈ గ్రంథమునందు శంకరానందు డను గురుస్తోత్రము కలదు. శంకరానందులవారు విద్యాతీర్థుల వారి శిష్యులు విద్యా రణ్యులకు గురువు. అందువలననే వేదాంత పంచదశియందు వారిని ఈ విధంగా స్మరించారు.

**శ్లో॥ నమః శంకరానంద గురు పాదాంబుజ జన్మనే**
**సవిలాస మహామోహ గ్రాహిగ్రాసైక కర్మణే**

మహా మోహమను మొసలిని కబళించగల శంకరానంద గురువుల పాద పద్మములకు నమస్కారము.

శ్రీ డి.వి.గుండప్పగారు పరిశోధనను అనుసరించి మొదటి పంచకమైన దీప పంచకములోని ఐదు ప్రకరణములను శ్రీ భారతీ తీర్థులవారు రచించినట్లున్నూ, మిగిలిన రెండు పంచకములైన వివేకపంచకము, ఆనంద పంచకములలోని మొత్తం పది ప్రకరణములును శ్రీ విద్యారణ్యులు రచించినట్లుగా నిర్ణయించారు.

ఆది శంకరులు మోక్షసాధనకు భక్తి, జ్ఞాన, వైరాగ్యములనెడి మూడు మార్గము లను తమ వివేకచూడామణి యందు వివరించి

**శ్లో॥ నయోగేన, నసాంఖ్యేన, న కర్మణానోన విద్యయా ।**
**బ్రహ్మాత్మైకత్వ బోధేన మోక్షః సిద్ధతి నాన్యథా ॥**

బ్రహ్మము ఆత్మ తత్త్వజ్ఞానము వలననే మోక్ష ప్రాప్తియగును. ఇంతకంటె

అన్యసాధన లేదని తెలియజేశారు. ఈ విషయంలో విద్యారణ్యులు శంకరులతో విభేదించి "జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"; "జ్ఞానీచ విశిష్యతే" శ్రుతి వాక్యముల నాధారముగా "జ్ఞానా దేవతు కైవల్యమ్' అని ఆత్మ జ్ఞానము దక్క, ఇతర ఉపాయముల వలన మోక్షప్రాప్తి లేదు అని చెప్పి భక్తి, కర్మ మార్గములను మోక్షప్రాప్తి సాధనములు కావని త్రోసిపుచ్చారు. కర్మాచరణము ద్వారా మోక్షప్రాప్తి విషయమున అవహేళన చేస్తూ, అట్టి వానిని సుడి గుండముగల నదిలో బడి బయటకు రావలెనని ప్రయత్నించి అసువులుబాయు పురుగుతో పోల్చారు. ఈ విషయము కుమారిలభట్టు చరిత్ర యందు వివరింపబడినది.

భక్తి విషయంలో విద్యారణ్యుల అభిప్రాయము ప్రకారము, ఐహిక వాంఛల నుండి విముక్తిని పొంది, మనసు ఏకాగ్రతను సాధించుటకు గాను పూజా పునస్కారములు ఉపయోగపడతాయనీ, అందువలననే బ్రహ్మమును తెలుసుకొనుటకు, ఉపాసన ఒక మార్గముగా శాస్త్రములలో నిర్దేశించబడినదనీ అంతకుమించిన ప్రయోజనము లేదని వారు వేదాంతపంచదశి (అధ్యా : 7, శ్లో :104–105) నందు అభిప్రాయము వ్యక్తము చేసినారు.

**7. వివరణ ప్రమేయ సంగ్రహము :**

ఈ గ్రంథమునందు 11 వర్ణకములు ఉన్నవి (అధ్యాయములు). గ్రంథారంభము శంకరానందుల స్తుతితో మొదలై శ్రీ విద్యాతీర్థ గురుస్తుతితో ముగుస్తుంది. ఆది శంకరులు రచించిన "చతస్సూత్రి"కి వారి శిష్యులలో ఒకరైన పద్మపాదాచార్యులవారు 'పంచ పాదికా'యను వ్యాఖ్యానమును వ్రాశారు ప్రకాశత్ములను మరొకరు 'వివరణ' వ్యాఖ్యానమును వ్రాసినారు. ఈ రెంటి సారమును గ్రహించి, విద్యారణ్యులు ఈ వివరణ గ్రంథమును వ్రాయుట జరిగినది. కొన్ని వ్రాతప్రతులలో ఈ గ్రంథము శ్రీ భారతీతీర్థుల, శ్రీ విద్యారణ్యుల సంయుక్త రచనగా పేర్కొంటున్నాయి కానీ, విజయనగర రాజుల నాటి సంస్కృత గ్రంథముల పట్టికయందు ఇది విద్యారణ్యుల కృతిగానే చూపబడినది. అప్పయ్య దీక్షితులవారు దీనిని భారతీ తీర్థులగ్రంథమేనని నిర్ణయించారు.

శంకరుల అనంతరము అద్వైత వేదాంతములో రెండు చీలికలు ఏర్పడినవి. ఒకదానిని "భామతి"యని మరొక దానిని "వివరణయని" పిలుస్తారు. రెండవ సాంప్రదాయమునకు మూల గ్రంథమే వివరణ ప్రమేయ సంగ్రహము.

**8. వైయాశిక్య న్యాయమాల లేక అధికరణ రత్నమాల :**

ఇది వేదవ్యాసుల బ్రహ్మసూత్రములకు శ్లోకరూపములో ఇవ్వబడిన వివరణ గ్రంథము. గ్రంథములో రచయిత పేరు లేదు. కానీ అందలి శ్లోకములకు, శ్రీ భారతీ తీర్థుల వారు గద్యములో వ్రాసిన వ్యాఖ్యానము ఉన్నది. గ్రంథారంభమున శ్రీ విద్యా తీర్థులను ప్రార్థిస్తూ గురుస్తుతి ఉన్నది. "శుక్తి వివృత్తి" లేక "వ్యాస వృతి" రచయిత రంగనాథుడు ఇది విద్యారణ్య కృతమన్నాడు. దీని రచయిత ఇదమిద్ధంగా ఎవరని చెప్పుటకు వీలుకాదు.

ఈ గ్రంథమునందలి ప్రతి అధికరణ విషయమునకునూ పూర్వపక్ష సిద్ధాంత ములు (Negation) రెండు శ్లోకములలో చెప్పబడినవి.

ఇందు జైమినీ న్యాయమాలా పీఠికలోని కొన్ని శ్లోకములు చేర్చబడినవి.

**9. సంగీత సార :**

అప్పయ దీక్షితుల వారి తమ్ముని కొడుకైన గోవింద దీక్షితుల వారు రచించిన "సంగీత సుధ" అనే గ్రంథములో, ఈ సంగీత సార గ్రంథము ఉటంకించబడినది. ఇది విద్యారణ్యులకృతియని తెలియజేశారు. "సంగీత సారం సమవేక్ష్య విద్యారణ్యాభిచ శ్రీ చరణ ప్రణీతమ్" అని విద్యారణ్యుని కృతిగా పేర్కొన్నారు.

ఈ గ్రంథము లభ్యముకాలేదు. అయినప్పటికినీ గోవింద దీక్షితులవారి రచనను అనుసరించి, శ్రీ విద్యారణ్యులు అద్వైత తత్త్వ జ్ఞానులేకాక, గొప్ప సంగీత విద్వాం సులని కూడా తెలుస్తున్నది. వీరు పదిహేను మేళకర్తలను, 50 జన్యరాగాలను పేర్కొన్నట్లుగా గోవింద దీక్షితులు తమ రచనలో తెలియజేశారు. గాయకులకు ఉండ వలసిన లక్షణములు కూడా విద్యారణ్యులు తమ సంగీతసార గ్రంథములో వివరించినారట.

పై గ్రంథములే కాక విద్యారణ్యులు ఆదిశంకరులు బృహదార్యకోపనిషత్తుపై వ్రాసిన భాష్యమునకు, శ్రీ సురేశ్వరాచార్యులు వార్తికము (Treatise) వ్రాశారు. కానీ, ఇది జటిలమైన భాషలో నుండుటచే, సులభ గ్రాహ్యము కాదు. ఆ కారణంగానేనేమో విద్యారణ్యులు సులభశైలిలో వ్యాఖ్యానము రచించారు. అదేవిధంగా ఐతరేయోపనిషత్ పైననూ, నృసింహ ఉత్తరతాపనీయ "ఉపనిషద్దీపికా" అను అధర్వ వేదమునకు చెందిన ఉపనిషత్తుపై కూడా వ్యాఖ్యలు వ్రాసియున్నారు.

ఈ విధంగా విద్యారణ్యులవారు దక్షిణ భారతదేశమున వైదిక మతోద్ధరణకు, పరిరక్షణకు, వ్యాప్తికి, కారణభూతమైన విజయనగర సామ్రాజ్య స్థాపనకూ అభివృద్ధికీ ఎంతో కృషిసల్పుటయేకాక, ఆదిశంకరుల అనంతర కాలములో, అద్వైత వేదాంత వ్యాప్తికి శృంగేరీ శ్రీశారదా పీఠాధిపతులుగా, జగద్గురువులుగా అమోఘమైన సేవ చేశారు. వారు స్వయముగా జీవన్ముక్తులు అగుటవల్ల, అద్వైత సిద్ధాంతముపై గానీ, ఆధ్యాత్మిక తత్త్వముపైన గానీ, వారు పలికిన ప్రతిమాటా, ప్రతివాక్యము, స్వానుభవ ముతో ఉచ్చరించినదిగా భావించవలెను విశ్వసించవలెను.

అద్వైత వేదాంతమును గురించి వారు చేసిన రచనలు వాచస్పతి మిశ్ర ఏర్పాటు చేసిన "భామతి" సాంప్రదాయమునకూ, పద్మపాదులవారి వివరణ సాంప్రదాయము నకు ఉభయతారకంగా ఉన్నవి. అద్వైత సిద్ధాంతముపై రచింపబడిన ఇతరుల రచనలతో పోలిస్తే, విద్యారణ్యులవారి రచనలు స్పష్టంగా, సరళ శైలిలో, సులభంగా అర్థము కాగలవు.

అద్వైత వేదాంతము యొక్క ఔన్నత్యమునకు తార్కాణమే ఈనాడు తూర్పు, పశ్చిమ దేశాలవారు ఈ సిద్ధాంతము వైపు ఆకర్షితులవటం. వర్తమాన కాలంలో వేదాంతమంటే అద్వైతమనే భావిస్తున్నారు. ఈ రెండు పర్యాయపదములుగా మారినవి.

■ ■ ■

# సాయణాచార్యులు

మాధవాచార్యులు, సాయణాచార్యులు, భోగనాధుడు మువ్వురూ మాయణ శ్రీమతుల పుత్రులు. వీరికి ఒక చెల్లెలు. ఆమె పేరు సింగల లేక సింగాంబిక. కాకతీయ సామ్రాజ్య పతనానంతరము, మాయణ భార్యాబిడ్డలను వెంటపెట్టుకొని కర్ణాటక రాష్ట్రములోని ఆనెగొందికి వచ్చాడు. సంగమ సోదరులు ఆనెగొంది రాజధానిగా స్థాపించిన, హిందూ రాజ్యము నందు ప్రభుత్వ ఉద్యోగులుగా మాధవుడు, సాయణులు నియమితులు అయ్యారు. మాధవుడు, కులగురువుగా హరిహర, బుక్కరాయల ఆస్థానమునందు పనిచేస్తూ, ప్రభుత్వ కార్యకలాపములనుగూడా పర్యవేక్షించేవాడు. వీరు భారద్వాజస గోత్రులు. భోధాయన సూత్రులు, కృష్ణయజుశాఖీయులైన తెలుగు బ్రాహ్మణులు.

సాయణాచార్యులు క్రీ.శ. 1315లో జన్మించి క్రీ.శ. 1387 వరకూ జీవించారు. ఈయన కూడా అన్నగారితో పాటు బుక్కరాయని కొలువులో పనిచేసేవాడు.

మాధవ, సాయణులు తరచుగా రాచకార్యముల మీద, సత్సంగము, తత్త్వజ్ఞానార్జన నిమిత్తము, శ్రీ శృంగేరి శారదాపీఠమునకు వెళ్ళి శ్రీ విద్యారణ్యుల దర్శనం చేసుకొనేవారు. ఆ సోదరుల వేద, వేదాంగములు, ఉపనిషత్తులు, ఆదిగాగల వైదిక వాఙ్మయ పాండిత్య ప్రకర్షకు ముగ్ధులైన శ్రీ విద్యారణ్యులు, తామారంభించిన వేద

భాష్య రచనలనూ, ధాతువృత్తినీ, వారికి అప్పగించి, పూర్తి చేయవలసినదిగా కోరి నారట. ఇది కొందరు పండితుల అభిప్రాయమేగానీ, తగిన ఆధారములు లేవు. ఇందుకు భిన్నంగా వేదభాష్యములలోని ప్రతి అధ్యాయము, ప్రతి అనువాకము, ప్రతికాండ చివరన వ్రాసిన గద్యములో "ఇతి సాయణాచార్యవిరచితే, మాధవీయ వేదార్థ ప్రకాశే" యనియూ, ధాతువృత్తి అంత్యమునగల గద్యములో "తేనమాయణ పుత్రేణ, సాయణేన మనీషిణా, ఆర్వయయా, మాధవీ యేయా, ధాతువృత్తి విరచ్యతే" యని వ్రాయబడినదే కానీ, ఎచ్చటనూ విద్యారణ్యుని ప్రస్థావనే లేదు. సాయణుడు వేదభాష్య రచనలను బుక్కరాయల వారి ఆదేశానుసారం చేపట్టినట్లు తైత్తరీయ సంహిత భాష్యమునందు ఈ విధంగా తెలియజేయబడింది.

**శ్లో॥ తత్కటా క్షేణ తద్రూపం దధత్ బుక్కమహీపతిః**
**అన్వశాత్ మాధవాచార్యం, వేదార్థ స్య ప్రకాశే ॥**
**సప్రాహ నృపతింరాజన్, సాయణార్యోమమానుజః**
**సర్వం వేత్త్యే వేదానాం వాఖ్యాతృ త్యే నియుజ్యతామ్ ॥**
**ఇత్యుక్తే మాధవార్యేణ వీరబుక్క మహీపతిః**
**అన్వశాత్సాయణాచార్యం, వేదార్థ ప్రకాశనే**

వైదిక ధర్మ పునరుద్ధరణకు నడుంకట్టిన బుక్కరాయలవారు, వేదములను అర్థము, తెలుసుకొని అధ్యయనము చేయించవలెననెడి కోరికతో, తమకు మంత్రులు, వేదవేదాంగవిదుడు, పూర్వమీమాంస దర్శనమున నిష్ణాతుడైన మాధవాచార్యుల వారిని "వేదార్థ ప్రకాశిక" అను వేదముల భాష్యరచనలను చేయవలసినదని కోరగా, ఆయన తన తమ్ముడైన సాయణాచార్యుడు అందుకు తగినవాడనీ, ఆ కార్యమును అతనికి ఒప్పగించ వలసినదనీ మనవి చేశారట. తత్ఫలితంగా బుక్కరాయలవారు, ఆ పవిత్ర కార్యమునకు సాయణాచార్యులను నియమించారట. ఆ విధంగా తన అన్నగారి సిఫార్సు ద్వారా, తనకు దొరకిన వేదభాష్య రచనల అంత్యమునందు తన అన్నగారిని గద్యమున కీర్తిస్తూ తెలియ జేసినాడు. శ్రీ విద్యారణ్యుల ప్రస్తావన లేకపోవుటకు కారణము, వారి ప్రమేయము లేకపోవుటయేయని భావించవచ్చును. 'ధాతువృద్ధి' యను గ్రంథము సంస్కృత భాషలోని క్రియా పదములను క్రమబద్ధీక రించుచూ, వ్రాయబడిన వ్యాఖ్య.

సాయణాచార్యులు, బుక్కరాయలవారి అన్నగారైన కంపరాయలు, నెల్లూరి సీమను రాజప్రతినిధిగా పరిపాలించిన కాలములోనూ, అనంతరము రెండవ హరి హరరాయల వద్దనూ, క్రీ.శ. 1387లో తాము దివంగతులగు వరకూ, అమాత్యులుగా వ్యవహరించారు. వేద భాష్యముల వ్యాప్తికి, విస్తృతమైన కృషిచేశారు. ఇందుకుగానూ వారు దేశమంతటా పర్యటించారు. వారి కృషిని ప్రశంసిస్తూ కాంచీపురములోని శ్రీ వరదరాజ స్వామివారి దేవాలయమునందలి అభిషేక మంటపమున శాసనము వేయబడినది. ఆ శాసనమున వ్రాసిన శ్లోకములను, సాయణాచార్యుని ఆ దేవాలయ ప్రాంగణమున ఏర్పాటుచేసిన పండిత సదస్సుకు ఆహ్వానించునప్పుడుగానీ, వేదా సత్కరించునపుడుగానీ, పఠించి యుండవచ్చును. వేదములకు భాష్య రచన వారొక్కరే చేయలేదు. ఎక్కువగావారు సంకలనము, సంపాదకత్వము నిర్వహించినట్లు తెలుస్తు న్నది. వేదభాష్య రచనకుగాను దేశములోని వివిధ ప్రాంతముల నుండి వేదవిదులను రప్పించి ఒక సమితిగా ఏర్పాటు చేశారు. శ్రీ భారతీతీర్థులు ఈ మహత్కార్యంలో, సాయణాచార్యులకు సహాయము చేయుటకై, నూట ఇరువదిమంది పండితులను పంపించినారు. అనంతరము వారందరినీ భూ దానములతో సత్కరించినారు. అట్టి విద్వాంసుల పట్టికయందుగల నారాయణ వాజపాయి, పండరిదీక్షిత, నరహరి సోమయాజి, సాయణులకు విశేష సహాయమునందించిన వారిలో ముఖ్యులు. వారి మువ్వురిలో మొదటివారిని "మంత్రసిద్ధి" యను బిరుదుతోనూ, మిగిలిన ఇరువురినీ "పెద్ద విద్యా వల్లభ" యను బిరుదములతోనూ సత్కరించుట జరిగింది. ఈనాటికిని, వారి వారసులకు శృంగేరిపీఠమునందు విశిష్ట గౌరవమర్యాదలు అందజేస్తారు.

సాయణాచార్యులు సంహితలు (వేదమంత్రముల) పై వ్రాసిన వ్యాఖ్యానములు ఈ క్రమములో ఉన్నవి. 1.తైత్తరీయ సంహిత – కృష్ణ యజుర్వేదమునకు సంబంధిం చినది; 2. ఋగ్వేద సంహిత; 3. సామవేద సంహిత; 4. కణ్వ సంహిత – శుక్ల యజుర్వేదమునకు సంబంధించినది; 5. అథర్వణ వేదసంహిత మొదటి నాలుగు వ్యాఖ్యలు బుక్కరాయల కాలమునందునూ, చివరిది రెండవ హరిహరుని కాలము లోనూ రచింపబడినది.

ఇవికాక బ్రాహ్మణములు, ఆరణ్యకములపై ఈ క్రమములో వ్యాఖ్యలు వ్రాయ బడినవి. 1. తైత్తరీయబ్రాహ్మణ; 2. తైత్తరీయారణ్యక; 3.ఐతరేయ బ్రాహ్మణ;

4.ఐతరీయ అరణ్యక; 5. తాండ్య బ్రాహ్మణ లేక పంచవింశ; 6. సద్వింశబ్రాహ్మణ; 7. సమవిధాన బ్రాహ్మణ; 8. ఆర్షేయ బ్రాహ్మణ; 9. దేవతాధ్యాయ బ్రాహ్మణ; 10. ఉపనిషత్ బ్రాహ్మణ; 11. సంహితోపనిషద్ బ్రాహ్మణ; 12. షడ్వింశ బ్రాహ్మణ; 13. శపథ బ్రాహ్మణ – ఋగ్వేదమునకు సంబంధించినది.

పై వ్యాఖ్యానములలో శతపథ బ్రాహ్మణము పైననూ, మరికొన్ని ఇతర రచనలనూ మినహాయించి, మిగిలినవి అన్నింటినీ బుక్క భూపతి కాలము నందే రచింప బడినవి.

వేద, బ్రాహ్మణ, ఆరణ్యకములపై సాయణుడు వ్రాసిన వ్యాఖ్యలు విశ్వ విఖ్యాతిని పొంది, అధికారిక వ్యాఖ్యలుగా పరిగణింపబడుచున్నవి.

సాయణుని, ఈ క్రింది రచనలుకూడా ఆయన పాండిత్య ప్రకర్ష గీటురాళ్ళు !

**1. సుభాషిత సుధానిధి :**

ఇది అముద్రిత గ్రంథము. వ్రాతప్రతులయందు, నాలుగు పురుషార్థములైన ధర్మార్థ కామ మోక్షములలో, ధర్మార్థములకు సంబంధించిన రెండు పర్వములు మాత్రమే లభించినవి.

**శ్లో॥ వీర శ్రీ కంపరా జోస్తి విదుపాం.....నిధి**
**యత్కీర్తి కామినీ హస్తే, బ్రహ్మాండం కందుకాయతీ**

ఆ గ్రంథ పీఠిక యందలి శ్లోకమును బట్టి, ఉదయగిరి (నెల్లూరు సీమ) రాజధానిగా కంపరాయలు పరిపాలించు కాలమున, ఆయన ప్రేరణచే జనసామాన్యమును ఉద్దేశించి వ్రాయబడిన గ్రంథము కంపన రాజాస్థానమునందు చదివి వినిపించ బడినది.

**2. యజ్ఞ తంత్ర సుధానిధి :**

యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణ విధానమును విశదీకరించు గ్రంథము. రెండవ హరిహరుని కాలమున వ్రాసినట్లుగా గ్రంథాంతమునగల గద్యమును బట్టి తెలుస్తున్నది. "ఇతి శ్రీమద్రాజాధిరాజ, రాజపరమేశ్వర, వీరహరిహరరాయ, సకల సామ్రాజ్య ధురంధరస్య, వైదిక మార్గ స్థాపనాచార్యస్య, శ్రీ సాయణాచార్యస్య కృతౌ యజ్ఞతంత్ర సుధానిధీ", వ్రాతప్రతి జీర్ణావస్థలోనున్నది. భోధాయన, అశ్వ లాయన సూత్రములనా ధారముగా రచింపబడిన గ్రంథము.

**3. ప్రాయశ్చిత్త సుధానిధి లేక కర్మవిపాకము :**

ఆచరించిన నానాపాపములనుండి విముక్తికై చేయవలసిన ప్రాయశ్చిత్తములను వివరించెడి గ్రంథము. పీఠికయందు :

**శ్లో॥ తస్య మంత్రి శిరోరత్నమస్తి మాయణ సాయణః**
**తేన మాయణ పుత్రేణ, సాయణేన మనీషిణా**
**గ్రంథః కర్మవిపాక్యాః క్రియతే కరుణావతా.........**

అను శ్లోకార్థమును అనుసరించి, సంగమ రాజేంద్రుని మంత్రి, శిరోమణి, మాయణ పుత్రుడైన, సాయణ పండితుడు ఈ గ్రంథము రచించెను. అయితే ఈ గ్రంథమునకు "కర్మవిపాకము" అని నామకరణము చేయుటవలన కలతకు దారి తీయు అవకాశముకలదు. ఇదే పేరుతో మూడు గ్రంథములు ఉన్నవి. ఒకటి మాంధాత, రెండవది భట్ట విశ్వేశ్వరుడు, మూడవది మాధవభట్టు రచించినారు. అయితే సాయణ గ్రంథమునకు, ఇతరుల రచనలకు ఎట్టి సంబంధములేదు.

**4. ఆయుర్వేద సుధానిధి :**

అలంకార సుధానిధియను గ్రంథమునందు సాయణుడు దీనిని తన స్వంత రచనగా పేర్కొనినాడు. వైద్యశాస్త్రముపై ఈ గ్రంథము రచింపబడినది. అనంతర కాలమున వైద్యశాస్త్రముపైననే, శ్రీశైలనాథుడు వ్రాసిన "ప్రశ్నోత్తరమాల" యను గ్రంథమున, పై గ్రంథము తన పూర్వీకుడైన ఏకామ్రనాథుడు వ్రాసినట్లు తెలియజేశాడు.

**శ్లో॥ ఏకామ్రనాథో యత్తాతః సాయణామాత్యచోదితః**
**సమగ్రహీత్, సుబోదార్థం, ఆయుర్వేద సుధానిధిం ॥**

సాయణాచార్యుల ప్రేరణవలన, ఆయుర్వేద సుధానిధియను గ్రంథము, సులువుగా అర్థము చేసుకొనుటకు గాను, సంగ్రహముచేసి వ్రాసినట్లు ఏకామ్రనాథుడుపై శ్లోకమునందు తెలియజేశాడు.

**5. మాధవీయ ధాతువృత్తి :**

దీని పేరును బట్టి ఈ గ్రంథము సాయణుని అన్నగారైన మాధవాచార్యుల రచనగా భావించబడుతున్నప్పటికినీ, ఇది రెండవ సంగముని కాలమున, సాయణా చార్యుల చేతనే రచింపబడినట్లు ఆ గ్రంథ పీఠికను బట్టి తెలుస్తున్నది.

**శ్లో॥ తేన మాయణ పుత్రేణ, సాయణేన మనీషిణా**
**ఆఖ్యయా మాధవీయేయం, ధాతువృత్తి ద్విరచ్యతే ॥**

ఈ గ్రంథము సాయణుల రచనయే అయినప్పటికినీ, ఇతరులు కూడా కొన్ని భాగములను రచించినట్లు ఆ గ్రంథము ద్వారా తెలుస్తున్నది. ఈ గ్రంథముపై షుమారు పదిమంది పండితులు వ్యాఖ్యలు వ్రాసినట్లుగా తెలుస్తున్నది. అయితే ధాతువృత్తికే ప్రాముఖ్యత కలదు. క్రీ.పూ. ఆరవశతాబ్దికి చెందిన పాణిని, సంస్కృత భాషలోని అష్టాద్యాయిలో (వ్యాకరణ గ్రంథము) 1944 ధాతువులను, (శబ్దోత్పత్తులు) పది గణములుగా విభజించినాడు. ఆ విభజనపై వ్రాసిన విస్తృత వ్యాఖ్యానమే ఈ ధాతు వృత్తి "సిద్ధాంత కౌముది" యను మరొక గ్రంథము, వ్యాప్తిలోనికి వచ్చునంత వరకూ ఈ గ్రంథమే విశేష ప్రచారమును పొందినది.

**6. అలంకార సుధానిధి :**

సాయణుని రచనలకెల్ల అలంకారప్రాయమైనది. కానీ అముద్రితము లభించు చున్న వ్రాత పతులు వేటిలోనూ ఆరంభములేదు. కన్నడ ప్రతిలో మాత్రము ముగింపు కలదు. కావ్యరచనపై, ఛందస్సుపై వ్రాసిన ఈ గ్రంథము, కారికలు, లక్ష్య శ్లోకములు, వృత్తియను మూడు విభాగములు కలిగియున్నది. లక్ష్యశ్లోకములు (Illustrations) సాయణుని ప్రశంసించునట్టివి కొందరు పండితులు దీనిని సాయణుని తమ్ముడైన భోగనాధుని రచనగా భావిస్తున్నారు ఇందులోని కొన్ని శ్లోకములు భోగనాధుని 'ఉదాహరణమాల' యనెడి గ్రంథము నుండి స్వీకరింపబడినవి. కాబట్టి వారికి గలిగిన సందేహము సహజమే, కానీ గ్రంథాంతమునగల గద్య ఈ విధంగా ఉన్నది."ఇతి శ్రీమత్ పూర్వ పశ్చిమ దక్షిణోత్తర సముద్రాధిపతి, బుక్కరాజ ప్రథమదేశిక, మాధవా చార్యా నుజన్మనః, శ్రీ మత్సంగమ రాజ సకల రాజధురంధరస్య, సకల విద్యానిధాన భూతస్య, భోగనాధాగ్ర జన్మనః, సాయణామాత్యస్య కృతౌ, అలంకారసుధానిధౌ కావ్యమార్గ ప్రతిష్ఠాపనా నామ ప్రథమోన్మేషః". కాబట్టి ఇది సాయణుల రచననగానే విశ్వసించవచ్చును.

ఈ గ్రంథములో సాయణులు, ఆనందవర్ధనుని అనుసరించి, పద్య లక్షణములను చర్చించారు. మహీభట్టుని అభిప్రాయములను విమర్శించారు. పద్యము యొక్క మూడు గుణములనూ ఆధ్యాత్మికపరంగా సత్త్వ రజస్తమో గుణములతో పోల్చారు. "కవిం కవీనాం, ముపమశ్రవస్తమం".....

ప్రథమోన్మేషము నందు కవి, కావ్యము, కావ్యోత్పత్తి, కావ్య భేధములు వివరించ బడగా, ద్వితీయమునందు శబ్దశక్తులు - రస స్వరూపము - ధ్వని విశేషములు తృతీయమునందు శబ్దాలంకారములు-అర్థాలంకారములు-గుణదోషాదులు వివరింపబడినవి. సాహిత్య విశేషములనే కాక, ఈ గ్రంథము ద్వారా పెక్కు చారిత్రక విశేషములు గూడా తెలుసుకొనవచ్చును.

**7. పురుషార్థ సుధానిధి :**

ఇదికూడ అముద్రిత గ్రంథమే. సాయణుడు ఉదయగిరి నుండి, బుక్కరాయని మంత్రిగా విజయనగరము చేరిన అనంతరము వ్రాయబడిన మొదటి గ్రంథముగా పరిగణింపబడుచున్నది. ధర్మార్థకామ మోక్షములు అనెడి చతుర్విధ పురుషార్థములపై, పురాణముల నుండి, ఇతిహాసములనుండి, గ్రహించిన సంఘటనలు, శ్లోకములతో కూడిన గ్రంథము బుక్కరాయల కోరికపై రచింపబడినది.

భోగనాథుడు సాయణుని తమ్ముడు. యువరాజైన సంగముని అమాత్యుడుగా పనిచేసినాడు. తన అన్నలఖ్యాతిని కీర్తిస్తూ భోగనాథుడు తన పెద్ద అన్నగారైన మాధవాచార్యులను, సంకల్పశుద్ధిగల మనస్సుతోనూ, చిన్న అన్న సాయణుని విచక్షణా జ్ఞానము కలిగిన బుద్ధితోనూ పోల్చాడు.

సాయణాచార్యులకు ఇద్దరు పుత్రులు. వారిలో మాయణ 'సర్వదర్శన సంగ్రహ' కర్త. ఈ గ్రంథములో ఆయన వైష్ణవాచార్యుడైన వేదాంత దేశికుని, జయతీర్థులు (మధ్వా చార్యులు) వారి ప్రవచనములను ఉటంకించాడు.

ప్రొఫెసర్ విల్సన్ పండితుడు, ఋగ్వేదమునందలి ప్రథమాష్టకమును అనువాదం చేస్తూ, సాయణాచార్యులను గురించి వ్యాఖ్యానిస్తూ ఆయన (సాయణుడు) కుగల మూల గ్రంథ జ్ఞానము, నిశ్చయముగా ఇతర పాశ్చాత్య పండితుల జ్ఞానముకంటే విశిష్ట మైనది. అది తాను స్వయముగా అధ్యయనముచేసి గ్రహించినదైననూ, కావ చ్చును, లేదా సహాయకుల ద్వారా పొందినదైననూ కావచ్చును. సాంప్రదాయ పద్ధతిలో, పూర్వకాలము నుండీ అధ్యయనము చేయుటయే ఇందుకు కారణమని తెలియజేశారు.

ప్రొఫెసర్ మాక్సుముల్లర్కూడ తాను వేదసంహితలకు వ్రాసిన పీఠికలో, సాయణాచార్యుని ప్రశంసిస్తూ, "సాయణాచార్యులవారి వేదభాష్య జ్ఞానమును

తెలుసుకొనక, వేదభాష వైదిక మతమును గురించి తెలుసుకొనుట కష్టసాధ్యమనీ, దానిని సులభతరం చేసిన ఆ మహానుభావునకు మనమెంతో ఋణపడినామని వ్రాశాడు. అయితే ప్రొఫెసర్ రామ్. జె. మోయిర్, ప్రొఫెసర్ గ్రాస్‌మాన్ వంటి పాశ్చాత్య పండితులు, సాయణుని భాష్యములు వేద హృదయమును వ్యక్తపరచలేదని విమర్శిం చారు. ఈ విమర్శకు భారతీయ పండితులెవరూ సమాధానము ఇచ్చినట్లు కానరాదు. ఇందుకు సమాధానము మరొక పాశ్చాత్య పండితుడైన గోల్డ్ స్టక్కర్ పండితుడు ఇచ్చాడు. "జ్ఞానులైన భాష్యకారులపట్ల గౌరవంలేని వారికి, ద్రష్టలైన మునీశ్వరుల భావములు ఎట్లా అర్థమౌతావని? ప్రశ్నించాడు. ఇ.బి. కౌవెల్, గ్రిఫిత్ పండితులుకూడ సాయణుని ప్రశంసిస్తూ, వేదములను అర్థం చేసుకొనుటకు, ఆయనయే ప్రథమ మార్గదర్శియన్నారు.

ఈనాడు సాయణుని వేద భాష్యములను అధ్యయనము చేయకుండా ఎంత పండితుడైనా, వేదార్థములను వివరించి, అన్వయించి, చెప్పగలగటం కష్టము.

మహా విద్వాంసుడు, వేదభాష్యకర్త, పరిపాలనావేత్త, ధర్మాచార్యుడైన సాయణా చార్యులవారు, తెలుగువారి వైదిక వాఙ్మయ ప్రకర్షము, రాజనీతిజ్ఞతను విశ్వవిఖ్యాత మొనరించిన మహనీయుడు. సాయణాచార్యులు క్రీ.శ. 1387 సంవత్సరమున దివంగతులు అయిరి.

■ ■ ■

# శ్రీ వల్లభాచార్యులు

భాగవత సాంప్రదాయములోని భక్తి వేదాంత శాఖను అనుసరించినవే ద్వైతము, విశిష్టాద్వైతము. అదే శాఖయందు మరొక సంప్రదాయమును సృష్టించి, ప్రచారము చేసిన మహనీయుడే శ్రీ వల్లభాచార్యులవారు (క్రీ.శ. 1478-1532). విశిష్టాద్వైత ప్రచారకుడైన శ్రీరామానుజులు (క్రీ.శ.1017-1137), శ్రీ నింబార్కుడు (క్రీ.శ. 13వ శతాబ్దం), మాధవాచార్యులు, శ్రీ వల్లభులకంటే ముందువారు. పైన పేర్కొన బడిన ముగ్గురు ఆచార్యులూ భాగవత సాంప్రదాయమున క్రొత్త శాఖలను నెలకొల్పి నారు. అదేవిధంగా, శ్రీ వల్లభులు కూడా "శుద్ధాద్వైతమనెడి" నూతనశాఖకు సృష్టికర్తలు. వీరు బెంగాలు దేశమున ప్రసిద్ధ వైష్ణవ సంప్రదాయ ప్రచారకుడైన శ్రీ చైతన్య మహాప్రభువు (క్రీ.శ. 1485-1533) లేక గౌరాంగ ప్రభువుకు సమకాలీనులు.

శ్రీ వల్లభులు తెలుగువారు. వీరి తల్లితండ్రులు లక్ష్మణభట్టు మరియు శ్రీ రేణుకమ్మ (లేక) ఎల్లమ్మ. వీరు కాకరపాడు (కడపజిల్లా) వాస్తవ్యులు. శ్రీ వైష్ణవ సాంప్రదాయమునకు చెందినవారు. ఎల్లమ్మ తండ్రిగారు విజయనగరము (హంపీ విజయ నగరము) లోని దేవాలయము నందు అర్చకులు. విజయనగర ప్రభువుల కొలువునందు మంచి పలుకుబడి కలిగినవాడు. లక్ష్మణభట్టు వేద వేదాంగాదులు

క్షుణ్ణముగా అధ్యయనము చేసిన విద్వాంసుడు. సదాచార సంపన్నుడు. ఆయన తన భార్యను వెంటబెట్టుకొని కాశీ క్షేత్రమున నివాసము ఏర్పరచుకున్నాడు. ఆనాడు కాశీక్షేత్రము ఒక పుణ్యస్థలియేగాక, వైదిక ధర్మము నందలి వివిధ శాఖలకు చెందిన ఉద్దండ పండితులకు ఆవాసము. క్రీ.శ. 1479లో కాశీపట్టణముపై ముస్లింల దండయాత్ర జరుగనున్నదనివిని అనేకమంది హిందువులు నగరం వదలిపెట్టి పారి పోయారు. అట్లా పారిపోయినవారిలో లక్ష్మణభట్టు దంపతులొకరు. ప్రాణ భయంతో, తమ ఊరికి పారిపోతున్న రేణుకకు పురిటి నొప్పులు వచ్చి, చంపారన్ ప్రాంతంలో (నేటి చత్తీస్‌గఢ్‌లోని రాయపూరు ప్రాంతము) మగబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డకు శ్రీ వల్లభుడని నామకరణం చేశారు. లక్ష్మణభట్టు బాలింతరాలైన తన భార్య పూర్తిగా ఆరోగ్యవంతురాలు అగుటకుగాను అక్కడే కొంతకాలము నివసించాడు. వారు వినిన విధంగా కాశీక్షేత్రముపై ముసల్మానుల దాడి జరుగలేదు. అందువలన, ఆయన తన మనసు మార్చుకొని కుటుంబముతో తిరిగి కాశీ చేరారు. ముస్లింల దండయాత్ర భయంతో, పారిపోతుండుట వల్ల రేణుకమ్మ నెలలు నిండకుండానే ప్రసవించుట జరిగింది. శ్రీ వల్లభులు నెలల తక్కువ బిడ్డడుగా జన్మించాడు. భగవదనుగ్రహంవల్ల ఆయన జీవించ గలిగాడు. బాల్యంలో శ్రీ వల్లభుడు అద్భుతమైన తెలివితేటలు ప్రదర్శించేవారు. ఆ కారణంగా, ఆయన అసాధారణ శక్తిమంతుడైన బాలునిగా గుర్తింపు పొందేరు. ఏడు సంవత్సరములు రాగానే ఉపనయనముచేసి శ్రీ వల్లభుని, విష్ణుచిత్తుడను గురువు వద్దకు విద్యాభ్యాసమునకై పంపారు. తన అద్భుతమైన బుద్ధి నైపుణ్యంతో శ్రీ వల్లభుడు, వేద వేదాంగములను, షట్చాస్త్రములను, భాగవత పురాణము, భగవద్గీత ఆదిగాగల అనేక పవిత్ర గ్రంథాధ్యయనమును పూర్తిచేశారు. శ్రీ వల్లభుడు పదునొకండేళ్ళ వాడుగా ఉండగానే, ఆయన తండ్రి కాలం చేశారు.

అంత పిన్నవయసులోనే శ్రీ వల్లభుడు, భారతదేశమునందలి పవిత్ర స్థలముల దర్శనార్థము బయలుదేరారు. ఆ విధంగా ఆయన జీవితములో మూడు సార్లు పర్యటించారు. దాదాపు పన్నెండు సంవత్సరములు తీర్థయాత్రలలో గడిపినారు. తీర్థయాత్రలు ఆచరిస్తున్న సమయంలో ఘోటక బ్రహ్మచర్యమును పాటించారు. కొన్ని తీర్థయాత్రలకు తనతో పాటు తల్లి ఇతర బంధువర్గము కూడా రావటం సంభవించింది.

ఆయన ప్రథమ తీర్థయాత్రకు దక్షిణ భారతదేశములోని పవిత్ర ప్రదేశాలను మాత్రమే ఎన్నుకున్నారు, దర్శించారు. ఆ సమయంలో ముస్లింల దండయాత్రలతో ఉత్తర భారతం అల్లకల్లోలంగా ఉన్నది. మొదటగా తన బంధువుల ఇళ్ళకు వెళ్ళి అనంతరం విజయనగరం చేరారు. తాతగారు మరణించిన కారణంగా వారసత్వంగా అర్చకత్వమును నిర్వహిస్తున్న మేనమామ, ఆహ్వానించుట వలన విజయనగరము వెళ్ళవలసి వచ్చింది. శ్రీ వల్లభులు ఆ నగరము చేరిన కొద్దికాలానికే, విజయనగర ప్రభువులలో అత్యుత్తముడు, పరాక్రమశీలి, స్వయంగా పండితుడు, కళాపోషకుడైన శ్రీకృష్ణదేవరాయలవారు సింహాసనాశీలవటం తటస్థించింది. ఆ రోజులలో ఆది శంకరుల అనుయాయులైన అద్వైతులకూ, మధ్వాచార్యుల అనుయాయులైన మధ్వు లకూ మధ్య తరచూ శాఖాపరమైన వివాదములు చెలరేగుతుండేవి. ఉభయ శాఖలకు చెందిన ఉద్దండ పండితులు వాదోపవాదములలో పాల్గొనేవారు. పన్నెండేళ్ళ వయ సులో వున్న శ్రీ వల్లభులు ఎంతో ఆసక్తితో ఆ చర్చలను వింటూ, అవకాశం దొరికితే పాల్గొనేవారు. ఒకసారి ఒక అద్వైతునితో జరిగిన చర్చలో విజయుడై, సభాసదులం దరిచేత, పిన్న వయసులోనే ప్రదర్శించిన పాండిత్య ప్రకర్షకూ, వాదనా పటిమకూ ఎంతగానో శ్లాఘింపబడటం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరము లన్నీ శ్రీకృష్ణదేవరాయల వారి చెవిన బడటం తటస్థించింది. రాయలు వైష్ణవమతాభి మాని అవడంవల్ల, శ్రీ వైష్ణవులు కొందరు, బాలుని విద్వత్తుకూ, దిగ్విజయమునకూ, వైష్ణవ సాంప్రదాయమునకు సంపాదించి పెట్టిన కీర్తికి గుర్తింపుగా, రాయలవారి స్వహస్తములతో శ్రీ వల్లభులకు కనకాభిషేకము చేయవలసినదిగా విన్నవించినారట. వారి విన్నపమును మన్నించి, రాయలవారు కనకాభిషేకమును గావించి, వారికి ఆచార్య పదవినిచ్చి సత్కరించారు. సత్కార్యము జరిగిన కాలము పండిత లోకమున వివాదాస్పదమైనది.

విజయనగరము నందు గడపిన రెండు, మూడు సంవత్సరముల కాలంలో, ఆయన విష్ణుస్వామి వద్దనూ, మాధవులవద్దనూ వైష్ణవ తత్త్వమును గురించి విస్తృ తమైన అవగాహనను ఏర్పరచుకున్నారు. మాధవుని ద్వైత సిద్ధాంతమును అంగీక రించలేదు. అయినప్పటికినీ, మధ్వాచార్యుల శిష్యుడైన మాధవేంద్రయోగి, ఆదేశాను సారము, వేదవ్యాసుల రచనయైన భాగవత పురాణ అధ్యయనమును గావించారు.

అధ్యయనానంతరము, అందలి విషయములకు ముగ్ధుడై ఆ స్ఫూర్తితో భాగవత పురాణము యొక్క ఉత్కృష్టతను తమ భారతదేశ పర్యటనలో గ్రామ, గ్రామమున చాటిచెప్పారు.

శ్రీ వల్లభులు తన తల్లిని, తనపై ఆధారపడియున్న ఇతర బంధు మిత్రులను తన మేనమామకు ఒప్పగించి రెండవసారి తీర్థయాత్రలకు బయలుదేరారు. ఈ తీర్థయాత్ర ఆయన జీవితంలో అతిముఖ్యమైనది. కొందరు నమ్మకమైన అనుయాయులు వెంటరాగా, ఆయన దేవాలయముగల ప్రతి గ్రామమునూ, ప్రతి తీర్థమునూ దర్శించారు. దక్షిణ భారతము నందలి ప్రతినదిలోనూ, పుష్కరుణులలోనూ స్నానము చేశారు. ఈ విధంగా చాలా సంవత్సరములు ఆయన యాత్రలను కొనసాగించారు. ఉత్తర భారతముకల్లోల పరిస్థితులలో మునిగి వుండుటవల్ల, ఆయన ఆ ప్రాంతమునకు వెళ్ళలేదు.

ఈ పర్యటనలో ఆయన జీవితములోకెల్ల అతి ముఖ్యమైన సంఘటన చోటు చేసుకున్నది. తూర్పు కనుమలోని దుర్గమారణ్యంలో కౌండిన్య ఋషి ఆశ్రమముగా పిలువ బడే స్థలమునకు ఆయన వెళ్ళటం. ఈ స్థలంలోనే శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో నిష్ణాతుడైన విష్ణుస్వామికి కౌండిన్య మహర్షి జ్ఞానబోధ చేశాడట. ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం శ్రీ వల్లభుడు ఆ స్థలమును దర్శించగానే, కౌండిన్య మహర్షి ప్రత్యక్షమై శాండిల్య మహర్షిని గురించీ, ఆయన యొక్క భక్తి సూత్రములను గురించీ వివరించి చెప్పాడట. నారదుడు, శాండిల్యుడు, భక్తి వేదాంతమునందు ప్రామాణీకులుగా పరిగణింపబడుచున్నారు. తన దక్షిణ భారత పర్యటనలో ఎందరో అద్వైతులను, ద్వైతులను, విశిష్టాద్వైతులను కూడా కలుసుకొనుట జరిగింది. శ్రీ వల్లభుడు శంకరుని అద్వైత వాదమునకు తీవ్ర వ్యతిరేకి అయినప్పటికినీ వారితో జరిపిన చర్చలలో ఎన్నడూ, దుర్భాషలాడటం చేయలేదు. పగ, ద్వేషములను ప్రదర్శించలేదు. దక్షిణాది పర్యటనను పూర్తిచేసుకొని, తల్లితోనూ, బంధు మిత్రులతోనూ కొంత కాలము గడపటానికి విజయనగరం చేరారు. విశ్రాంతి అనంతరం, దేశమందలి పశ్చిమ ప్రాంతానికి యాత్రలకై వెళ్ళారు. పాండురంగ విఠలుని దేవాలయము గల పండరీపురమును దర్శించారు. మహారాష్ట్రములోని ఇతర తీర్థస్థలము లైన త్రయంబకము, నాసిక్ ఆదిగాగల గోదావరీతీర పవిత్ర స్థలములను దర్శించి,

అనంతరము నర్మదా నదీ తీరములోని మాల్వా ప్రాంతమునగల తీర్థ ప్రదేశములను కూడా చూసి, భక్తి వేదాంతమునకు మూల స్థానమైన మధురా నగరము చేరారు. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళే వరకూ బాలుడుగా తన లీలలను ప్రదర్శించిన దివ్యస్థలి. ఆయన పాదస్పర్శచే పవిత్రమైన భూమి. శ్రీవల్లభుడు ఆ ప్రదేశమునందలి ప్రతి అణువూ పరమ పవిత్రమైనదిగా భావించి, పూజించి, తన హృదయమునకు హత్తు కున్నారు. ఈ ప్రదేశమును వ్రజభూమి అనికూడా పిలుస్తారు. ఆ పవిత్ర స్థలమునందు వశించిన కాలములో, ఆయన శ్రీకృష్ణునితో సంభాషించినట్లు విశ్వసించారు. సాంప్రదాయకంగా వినవచ్చే విషయములను బట్టి, ఆయనకు క్రీ.శ. 1492 శ్రీకృష్ణుని వద్ద నుండి, తనను స్వతంత్రముగా ఒకనూతన సాంప్ర దాయమును స్థాపించవలసి నదిగా ఆదేశము లభించిందనీ, ఆ ఆదేశానుసారమే దైవానుగ్రహ మతము లేక పుష్టి మార్గమనే క్రొత్త మత సాంప్రదాయమునకు నాంది పలికారని తెలుస్తున్నది. కొంత కాలము వ్రజ భూమిలో గడిపిన అనంతరము, ఆయన ఇంకా ఉత్తరదిశకు ప్రయాణించి, కురుక్షేత్రము, హరిద్వారము, ఋషీకేశము, గంగోత్రి, కేదారనాధ్ వంటి హిమాలయ పర్వతసానువులలోగల అనేక దివ్య క్షేత్రములను సందర్శించారు.

అనంతరం తూర్పు దిశగా పయనించి ప్రయాగ, గయ, కాశీ నుండి గంగా సాగరము (బంగాళాఖాతము) వరకు వెళ్ళి, దక్షిణమునకు మరలి పూరీలోని జగన్నాథా లయము చేరి ఆపై తన తల్లి నివసిస్తున్న అగ్రహారమునకు చేరారు. అప్పటికి కాలినడకన, గత తొమ్మిది సంవత్సరములుగా చేస్తున్న దేశాటనము ముగిసింది.

తల్లితో పాటు ఒక సంవత్సరకాలము అగ్రహారములో గడిపిన అనంతరము శ్రీ వల్లభుడు రెండవతూరి దేశమంతటా ఉన్న దివ్య క్షేత్ర దర్శనమునకు బయలు దేరారు. మొదటగా విజయనగరము చేరి కొద్ది కాలము నివసించి, తదుపరి పండరీ క్షేత్రమును రెండవసారి దర్శించారు. ఇచ్చట శ్రీ వల్లభునకు గృహస్థాశ్రమ స్వీకారము చేయవలసినదిగా దివ్య సందేశము లభించినది. ఇంత కాలమూ, ఆయన భక్తి వేదాంత తాత్త్వికునిగా, ప్రచారకునిగా కాలం గడిపినారు. వివాహము చేసుకొన వలెననే ఆలోచనే ఆయనకు కలుగలేదు. ఆయన తోటి వేదాంతులు, సన్యాసులుగా చరిస్తూ వుంటే, బహుశా ఆయనకు వైవాహితుడు కావాలనే భావన కలుగక పోవటంలో ఆశ్చర్యమేమున్నది ? ఈ సంఘటన ఆయన జీవితములోనూ, ఆయన

ప్రతిపాదించిన నూతన సంప్రదాయములోనూ, ఒక మలుపుగా పరిణమించింది. వివిధ మతశాఖలకు చెందిన అనేకమంది ఆచార్యులు సన్యాసా శ్రమము స్వీకరించి యుండగా, శ్రీ వల్లభుడు గృహస్థాశ్రమ స్వీకారం చేయడం ఒక విశేషంగా భావించ వచ్చు. గుజరాత్‌లోనూ, హిమాలయములలోనూ, వ్రజ భూమిలోనూగల అనేక పుణ్య క్షేత్రములను దర్శించిన అనంతరం శ్రీ వల్లభుడు వారణాసికి తిరిగి వచ్చారు. ఆశ్చర్యమేమంటే, దేవదత్తుడనే ఒక బ్రాహ్మణుడు, మహాలక్ష్మి అనే తన కూతురును శ్రీ వల్లభునికిచ్చి వివాహము చేయుటకుగాను, ఆయన రాకకై ఎదురు చూస్తూ ఉన్నాడు. క్రీ.శ. 1500 ప్రాంతములో తన తల్లి అనుమతినిపొంది, శ్రీ వల్లభుడు, మహాలక్ష్మిని వివాహమాడారు. కొంత కాలమునకు ఇద్దరు పుత్రులు కలిగారు. వారు గోకులనాథుడు, విఠలనాథుడు. వీరిద్దరిలో విఠలనాథుడు, తండ్రి మరణా నంతరం ఆయన ఏర్పాటుచేసిన నూతన సాంప్రదాయమును క్రమబద్ధీకరించి, వ్యాప్తి చెందటానికి చాలా కృషి చేశారు.

క్రీ.శ. 1500–1552 మధ్యకాలంలో శ్రీ వల్లభులు గోకులమునందు ఉండగా, నూతన సంప్రదాయస్థాపన చేయవలసినదిగా మరొకతూరి దివ్య సందేశము అందింది. నూతన సంప్రదాయ స్థాపనావశ్యకతకు కారణం మానవులలో ఆధ్యాత్మిక భావనలు, ఆచరణలు దాదాపు శూన్యస్థితికి చేరుకొనడం, వారు శక్తిహీనులుగా మారుట, ఆ కారణంగా వారి పునరుజ్జీవనమునకు గల అవకాశములు క్షీణించుట, వారిని ఉద్ధరించవలెనన్నా, సాయుజ్యమును అనుగ్రహించవలెనన్నా వారికి భగవదానుగ్రహ ప్రాప్తి కలిగించవలెను. భగవదానుగ్రహమును పొందుటకుగల ఏకైక మార్గము, శరణాగతి. అట్టి శరణాగతికి శ్రీ వల్లభులు దివ్యాదేశమునకు అనుగుణముగా ఏర్పరచిన, నూతన సాంప్రదాయమొక్కటే మార్గము. పతితులైన మానవాళిని, బాధితులైన మానవులను ఉద్ధరించి సక్రమమైన మార్గమున ప్రవేశపెట్టు టకుగాను భగవంతుడు శ్రీ వల్లభులను తన ప్రతినిధిగా నియమించా రనే ప్రచారము కూడా జరిగింది. ఈ పునరుద్ధరణ కార్యక్రమమునకు 'బ్రహ్మ సంబంధము'అని నామకరణం చేశారు. ఆ పదమునకు బ్రహ్మముతో కలిగిన బాంధవ్యము అని అర్థము. శ్రీ వల్లభులు హైందవ మతములోని అనేక శాఖల, సాంప్రదాయ గ్రంథము లను, అధ్యయనము చేసినప్పటికినీ, తత్సంబంధితులైన గురువులతో సంప్రదించి నప్పటికినీ, ఎవరినీ తన గురువుగా స్వీకరించలేదు. అందుకు కారణము బహుశా

తనతోనే ఆరంభమగు ఒక అపూర్వ ఆధ్యాత్మిక సంప్రదాయమును స్థాపించవలెననే కోరిక కావచ్చును. అయితే ఆయన స్థాపించిన సాంప్రదాయమునకు మూలము అద్వైత, విశిష్టాద్వైతముల యందలి ప్రాథమిక సూత్రముల కలయిక. జ్ఞాన, భక్తి సంప్రదాయముల మేలుకలయిక శ్రీ వల్లభుని సంప్రదాయమును ప్రప్రథమంగా స్వీకరించినవారు శ్రీ దామోదరదాసు. ఆయన శ్రీ వల్లభుని చిరకాల సహచరుడు, అనుచరుడు. "శ్రీ కృష్ణ శరణంమమ" అనెడి మంత్రోపదేశము ద్వారా ఆయన శ్రీ వల్లభ సాంప్రదాయము నందు ప్రథమ శిష్యుడైనాడు.

అదే సమయములో శ్రీ వల్లభునికి వినూత్నమైన మరొక అనుభూతి కలిగినది, గోకులమునందలి ఒక గుహలో గోవర్ధన పర్వతమును తన చిటికెన వ్రేలుపై నిల్పి గోవర్ధన ధారియైన శ్రీకృష్ణుని దివ్య విగ్రహమొకటి లభించింది. మాధవేంద్ర సూరి యనెడి మరొక శ్రీకృష్ణ భక్తుడు పాలు, వెన్నలను ఆ విగ్రహమునకు నైవేద్యంగా సమర్పించి నప్పటికీ ఆ మూర్తి వాటిని స్వీకరించలేదు. అనంతరం శ్రీ వల్లభుడు స్వయంగా నివేదిస్తేనే అవి స్వీకరింపబడినవి. ఈ తిరస్కరణకు కారణం శ్రీ కృష్ణుడు శ్రీ వల్లభుని చేతుల మీదుగానే నారగించవలెననే కోర్కెగలిగి ఉండటమేనని గ్రహించారు. అదేవిధంగా శ్రీ వల్లభులు పాలు, వెన్నలను శ్రీకృష్ణులకు స్వహస్థములతో అందించుట వారు ఆరగించుట జరిగిందన్నమాట. శ్రీ వల్లభుని సాంప్రదాయమున ఈ సంఘటనను "ప్రకాత్స" అని పిలుస్తారు. తదనంతరం ఆ విగ్రహముపై ఒక చిన్నగుడిని నిర్మించుట జరిగింది. షోడశోప చారములతో నిత్యపూజలు ప్రారంభ మైనవి. తరువాత కొంతకాలమునకు శ్రీ వల్లభుల శిష్యులలో పూర్ణమల్ అను ధని కుడు శ్రీ కృష్ణాదేశాను సారము, ఒక పెద్ద దేవాలయమును నిర్మించాడు. ఆ దేవాలయ నిర్మాణమునకు చాలాకాలం పట్టింది. శ్రీ వల్లభుడు దేవాలయములో నిత్యమూ పూజాది కములు నిర్వహించుటకుగాను, అర్చకులను నియమించుట జరిగింది. దేవాలయము లను ధ్వంసము చేయుటను చేపట్టిన ముస్లింల బారినుండి, విగ్రహ మును రక్షించుట కొరకై గోకులమునుండి ఆ ప్రతిమ రాజస్థానములోని ఉదయపూర్ సమీపమునకల నాథ్ ద్వారకకు తరలించబడినది. ఇప్పుడు ఆ ప్రతిమను శ్రీనాథ్‌జీ అని పిలుస్తున్నారు. వల్లభాచార్యుల శిష్యుల హృదయములలో హిందూ మతము నందలి ఇతర దేవుళ్ళు దేవతలకంటె శ్రీనాథజీ అత్యున్నత స్థానమునాక్రమించి పూజింపబడుచున్నాడు.

శ్రీ వల్లభుల ద్వితీయతీర్థయాత్ర ఆయన వివాహముతో ముగిసింది. తల్లి, భార్య, ఇతర బంధువర్గంతో ఒక ఏడాదిపాటు కాలం గడిపిన ఆచార్యులు మూడవ పర్యాయము తీర్థయాత్రలకు ఉపక్రమించి నాలుగు సంవత్సరముల అనంతరం పూర్తి చేశారు. ఇంతకు పూర్వము దర్శించిన పవిత్రస్థలములనే తిరిగి దర్శించారు. అయితే ఈ పర్యటనను తీర్థయాత్రగా కాక, తన నూతన సాంప్రదాయ ప్రచారమునకు వినియోగించారు. తనకు భగవంతుని దివ్య సందేశము ద్వారా అనుగ్రహింపబడిన పుష్టి మార్గమని పిలిచే నూతన సాంప్రదాయము యొక్క ఔన్నత్యమును గురించి, పెద్దపెద్ద సమావేశములలో సామాన్య ప్రజలకూ, ఇతర సాంప్రదాయములను పాటించు పండితవర్యులకూ బోధించుటే కాక వారితో సుదీర్ఘ చర్చలను జరిపేవారు. ఆయన జరుపు చర్చలు ఎల్లప్పుడూ నియమబద్ధమై, కలతలకు కలహాలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణములో నిర్వహించ బడేవి. దేశములోని వివిధ ప్రదేశములలో ఆయన మకాంచేసి, అక్కడి ప్రజలకు బ్రహ్మ సంబంధ సాంప్రదాయమును గురించి వివరించి, శ్రీకృష్ణ మంత్రమును ఉపదేశించి, పుష్టి మార్గముద్వారా జీవుడు ఈ పాపపంకిలమైన లోకమునుండి ఉద్ధరింపబడి భగవంతుని పరిపూర్ణంగా శరణుజొచ్చెడి మార్గమును నిర్దేశించేవారు. ఆయన ప్రవచనములు అన్నిటికీ భాగవత పురాణమే మూలము. వారి అభిప్రాయంలో ఆ పవిత్ర గ్రంథములో అన్ని మతముల, అన్ని ఆధ్యాత్మిక తత్త్వములయొక్క సారము నిండియున్నది. పుష్టి మార్గ ప్రచార నిమిత్తం భాగవతమును అనర్ఘళంగా ఏడు రోజులపాటు పఠించి, ఎన్నో ప్రదేశములలో లెక్కకు మించిన భాగవత సప్తాహములను నిర్వర్తించారు. దేశములోని మిగిలిన ప్రాంతములకంటె, గుజరాత్‌లో ఆయన బోధనలకు మిక్కిలి స్పందన లభించింది. ఇందుకు కారణము ఇంతకుపూర్వమే ఈ ప్రాంతంలో శ్రీ నరసింహ మెహతా అనే భక్తుడు శ్రీ వైష్ణవ సాంప్రదాయమును విస్తృతంగా ప్రచారంచేసి ఉండటం, ఆయన రాధాకృష్ణుల శృంగార భక్తి ప్రధానంగా అనేక కీర్తనలను రచించి వాడవాడలా సంకీర్తన జరుపుతూ తిరిగేవారు. క్రీ.శ. 14వ శతాబ్దిలో తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని ఉద్దేశించి శృంగార భక్తిని, ప్రపత్తి (శరణాగతి) ని మేళవించి రచించిన పదములవలె, శ్రీ నరసింహ మెహతా కీర్తనలకుకూడా గుజరాత్‌లో మంచి ఆదరణ లభించింది. గాంధీజీకి ఇష్టమైన 'వైష్ణవ జనతో' అనే గీతము మెహతా రచనయే, గుజరాత్ ప్రజలకు రాధాకృష్ణుల శృంగార చేష్టలనాధారంగా ప్రబోధించ

బడిన మధుర భక్తి లేక శృంగార భక్తిభావన ఎంతో ఆకర్షణీయమైనది. ఆ విధంగా భక్తిభావనలతో పరిపక్వమైన వారి మనస్సులపై బ్రహ్మ సంబంధ సాంప్రదాయము ద్వారా శ్రీకృష్ణుని యెడల, వ్యక్తిగతమైన పూజ్య భావములనెడి విత్తనములను జల్లి, శ్రీ వల్లభులు అధిక పంటను పండించ గలిగారు. అశేష ప్రజలు ఆయన నూతన సాంప్రదాయములో సభ్యులైనారు. అంతేకాక, మీరాబాయి యొక్క భక్తి కీర్తనలతో, శ్రీకృష్ణ భక్తితత్త్వమును జీర్ణించుకున్న రాజస్థానములో శ్రీ వల్లభుని పుష్టిమార్గ తత్త్వము సులువుగా వ్యాపించింది. ముస్లింల దురాక్రమణకు గురియై ధన, మాన, ప్రాణాదులపై ఆశ వదలుకొని అవమాన భారంతో కృంగిపోయి వున్న రాజస్థానీయుల మనసులకు శ్రీ వల్లభుని సాంప్రదాయము ఎంతో ఊరట కలిగించింది. శ్రీ వల్లభుల అనంతరం, ఆయన పుత్రుడు విఠలనాథుని ఆచార్యత్వంలో శ్రీ వల్లభ సాంప్రదాయము రాజాస్థానములో మరింతగా వ్యాప్తి చెందింది. ముందు వివరించినట్లు, విఠలనాథుని కాలములోనే గోకులమునుండి గోవర్ధనుని విగ్రహము, నతద్వారకకు తరలించబడి, శ్రీనాథ్‌జీ అనే నామముతో పూజించబడుట జరిగింది. ఆ విగ్రహమునకు జరుపు పూజలు, సేవలు, ఆగమ శాస్త్రములను అనుసరించక, శ్రీ వల్లభుడు నిర్దేశించిన ప్రకారం, ఒక చక్రవర్తిని పూజించినట్లు, అన్ని విధములైన రాజ లాంఛనములతో, రాజోపచారములతో ఎంతో వైభవంగా అర్చిస్తారు. శ్రీనాథ్‌జీ మందిరములను హిందూసాంప్రదాయ పద్ధతిని అనుసరించి దేవాలయములని పిలువక "హవేలీ" లని వ్యవహరిస్తారు. వాటిని మహారాజుల నివాసములవలె అలంకరిస్తారు.

శ్రీ వల్లభుని జీవితంలో ముఖ్యమైన మరొక సంఘటన వంగ దేశంలో శ్రీ వైష్ణవ ప్రచారకుడైన చైతన్య మహాప్రభువు లేక గౌరాంగ ప్రభువుతో సమావేశము జరుపుట. తన తీర్థయాత్రలోనూ, తదనంతరము కూడా వారిద్దరూ కలుసుకొనుట జరిగినట్లుగా తెలుస్తున్నది కానీ ఎప్పుడు ఎక్కడ కలుసుకున్నారనే విషయం ఇదమిత్థంగా తెలియదు. ఆపైన ఎవరి అనుచరులు వారి వారి గురువుల గొప్పదనమును చాటుకొనటం కోసం, ఈ అంశమును వివాదాస్పదంగా మార్చారు. ఏది ఏమైనప్పటికినీ వారిద్దరూ గంగాసాగర్ (బెంగాల్) లోనూ, అనంతరం బృందావనంలోనూ, గోకులములోనూ, కలుసుకున్నట్లు జన వాక్యము. ఆ ప్రదేశములు రెండూ, ఇద్దరు ఆచార్యులకూ పరమ పవిత్రమైన స్థలములే కదా ! శ్రీకృష్ణుని పాదస్పర్శచే పునీతమైన

దివ్య క్షేత్రములే కదా ! వారిద్దరూ శ్రీకృష్ణుని అవతారమును పూర్ణావతారంగానూ, భక్తి సాంప్రదాయమునకు భాగవత పురాణమును మూల గ్రంథముగానూ పరిగణి స్తారు. ఈ అంశములపై వారిద్దరూ ఏకాభిప్రాయము కలిగి ఉన్నప్పటికీ, కృష్ణభక్తిని ప్రచారము చేయుటలో, ప్రబోధించుటలో వారి దృక్పథములు వేరైనవి. శ్రీ వల్లభా చార్యులు జ్ఞాని, మంచి వక్త, ప్రవచన సందర్భమున భావోద్రేకము పొందకుండా, భాగవత పురాణము యొక్క విశిష్టతనూ, శ్రీకృష్ణుని రాజ వైభవముతో పూజించుట లోనూ గల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రశాంతంగా ప్రబోధించి, వినేవారి మనసులను ఆకట్టుకొనేవారు. చైతన్యులు ఇందుకు విరుద్ధంగా, రాధాకృష్ణుల ప్రేమ తత్త్వమును సంకీర్తనచేస్తూ నాట్యంచేసేవాడు. వారి మధుర భక్తిపై ప్రవచనములు చేస్తూ, రాధతో కలసి ఉన్న శ్రీకృష్ణుని పూజించవలసినదని ప్రచారము చేస్తూ, అశేష ప్రజానీకాన్ని ఆకర్షించేవారు. శ్రీ వల్లభుడు, రాధకు ప్రాముఖ్యతను ఇవ్వక, శ్రీకృష్ణుని బాలకృష్ణునిగా ఆరాధించమని బోధించేవారు. శ్రీ చైతన్యులు తమ సాంప్రదాయ ప్రచారమునకుగాను, సంకీర్తనలు, నాట్యమును అవలంబిస్తే శ్రీ వల్లభుడు తన సాంప్రదాయ ప్రచారమునకు జ్ఞాన మార్గమును అనుసరించి, భక్తియుతమైన వ్యాఖ్యలు వ్రాయడం, ఇతర సాంప్ర దాయములకు చెందిన ఆచార్యులతో చర్చా కార్యక్రమములో పాల్గొని వారి తాత్త్విక శాఖలకంటే, తాను స్థాపించిన సాంప్రదాయము ఉత్తమమైనదని నిర్ధారించే ప్రయ త్నములు చేసేవారు. శ్రీ చైతన్యులు భార్యాబిడ్డలను వదలిపెట్టి సన్యాసియై ప్రచా రమును చేపట్టగా, శ్రీ వల్లభుడు తన జీవితాంతము వరకూ గృహస్థుగానే ఉండి, ఆధ్యాత్మిక ప్రచారము చేశారు. చైతన్య ప్రభువు దేశములోని తూర్పు ప్రాంతములను, రాధాకృష్ణుల మధుర భక్తితో ముంచి వేయగా, శ్రీ వల్లభుడు పశ్చిమ ప్రాంతములైన రాజస్థాన్, గుజరాత్ ప్రాంతములలో తన సాంప్రదాయమును వ్యాప్తి చేశారు. తన మూడవ తీర్థయాత్రను ముగించుకొని నాలుగు సంవత్సరముల అనంతరం శ్రీ వల్లభుడు తిరిగి వారణాశి చేరారు. అక్కడే తన తల్లి భార్యా బిడ్డలతో స్థిరనివాసము ఏర్పరచుకున్నారు.

వారణాశిలో తరచూ ఇతర సాంప్రదాయములకూ, శాఖలకు చెందిన ఆచార్యు లతో తాత్త్వికచర్చలు జరుపుతూండేవారు. ముఖ్యంగా అద్వైతులతో ఎక్కువగా చర్చించేవారు. అద్వైతమంటే ఆయనకు మిక్కిలి అయిష్టత ఉండేది. కారణం ఆ సిద్ధాంతమునకు మూలములైన బ్రహ్మము, మాయ అనే భావనలు.

శ్రీ వల్లభుని సాంప్రదాయము మాయ. ఉనికిని తిరస్కరించింది. బ్రహ్మమొక్కడే శుద్ధాద్వైత సిద్ధాంతమునందు సత్యము. మాయకు స్థానమే లేదు. ప్రచారములో నున్న విషయములను బట్టి ఆయన అనేకమంది అద్వైతులను చర్చలలో ఓడించి, తన సాంప్రదాయమును స్వీకరించునట్లు చేశారట. ఆయన పుత్రులు పెద్దవారైనారు. ఆయనకు వారణాశిలో ప్రబలిన సాంఘిక, మత పరిస్థితులు నచ్చలేదు. ఆ కారణంగా ఆయన నివాస స్థానమును 'అదల్' అనే ఒక చిన్న కుగ్రామమునకు మార్చుకున్నారు. ఈ గ్రామము గంగా, యమునల సంగమ ప్రదేశంలో ప్రయాగ (అలహాబాద్) సమీపముగా ఉన్నది. లక్ష్మి, కృష్ణ, రుద్ర అనే మూడు రకములైన తులసి మొక్కలు ఆ ప్రాంతములో విస్తృతంగా మొలచి ఉండుటచేత, అతి పవిత్రంగా భావించబడినది. తన కుటుంబ సభ్యులతోనూ, ముఖ్యులైన మరికొందరు శిష్యులతోనూ శ్రీ వల్లభుడు ఆ గ్రామములో నివాసమేర్పరచుకుని, తన జీవితములోని చివర ఇరువది సంవత్సర ములు ఆ గ్రామంలో గడిపారు. ఆ కాలములో భాగవత పురాణమును, ఇతర పవిత్ర గ్రంథములను తీవ్రంగా అధ్యయనము చేశారు. భాగవత ధర్మ ప్రచారమునకై అప్పుడప్పుడూ ఇతర పవిత్ర స్థలములలో నిర్వహించబడిన సమావేశములలో ప్రసం గించుటకు వెళ్ళేవారు. బహుశా ఆ రోజులలోనే ఎక్కువగా ఆధ్యాత్మిక రచనలూ, వ్యాఖ్యాన గ్రంథములు రచించుట జరిగి ఉండవచ్చు. సమాజములో ఎంతో గౌరవనీయమైన స్థితిలో ఉన్నప్పటికీ, ఎంతో వినయ శీలత, ఉదారబుద్ధి కలిగి ఉండేవారు. హైందవ మతమునందు క్రొత్త సాంప్రదాయ సృష్టికర్త అయినప్పటికినీ, ఎన్నడూ ఆయన తనకుతాను ఆచార్యునిగా పిలుచుకొనలేదు. దేశమంతటా అనేకమంది శిష్యులను కలిగిఉండి శాస్త్ర గ్రంథములపై అనేక వ్యాఖ్యా నములనూ, స్వయంగా అనేక ఆధ్యాత్మిక గ్రంథనములు రచించినప్పటికి ఆయన నిగర్వి పరమ భాగవతోత్తముడుగా ప్రవర్తించేవాడు. తనకు తాను వల్లభ దీక్షితులనని పిలుచు కునేవారు. ఆయన దివంగతులైన అనంతరమే ఆయన శిష్యులు ఆయనను ఆచార్యు లని సంబోధించారు. దురదృష్ట విషయమేమంటే, వల్లభాచార్యులు ముఖ్య రచనలైన బ్రహ్మ సూత్రములపై భాష్యమునూ, భాగవత పురాణ వ్యాఖ్యానమునూ పూర్తి చేయలేదు. తీరుబాటు దొరకకపోవుటవలన కావచ్చును. కొన్ని చిన్న చిన్న గ్రంథ రచనలు చేయగలిగారు. "అణుభాష్యమ" నే పేరుతో బాదరాయణుని బ్రహ్మ సూత్రము లపై మూడింట రెండు వంతులు భాష్యము వ్రాశారు. అందులో, తన నూతన

సాంప్రదాయమునకు చెందిన సిద్ధాంతములను పొందుపరచ బడినవి. "సుబోధిని" అనే పేరుతో సులభ గ్రాహ్యంగా, భాగవత పురాణముపై వ్యాఖ్యానము వ్రాశారు. భాగవత పురాణమునకు, ఉపనిషత్తులతోనూ, బ్రహ్మసూత్రములతోనూ, ఇతర వైదిక గ్రంథములతోనూ, భగవద్గీతతోనూ, సమాన ప్రతిపత్తిని కలిగించిన ప్రప్రథమ ఆచా ర్యుడు శ్రీ వల్లభుడే. ఆయన అనంతరం భక్తి సాంప్రదాయమునకు చెందిన అనేక మంది ఆచార్యులు వల్లభుని అడుగుజాడలలో నడచి వేదాంతమునకు వాటిని మూల గ్రంథములుగాపరిగణించారు. దేశములోని వివిధప్రాంతములలో తన నూతన సాంప్ర దాయమైన పుష్టి మార్గవ్యాప్తికిగాను భాగవత సప్తాహములను తన జీవిత ధ్యేయంగా పాటించి నిర్వహించారు. తన మూడవ తీర్థయాత్రలో పూరీజగన్నాథము నుండి తిరిగి వస్తూ, గంగా సాగరము (బెంగాలు) లో మకాం వేసినప్పుడు భాగవత పురాణముపై వ్యాఖ్యా నమును చేపట్టారు. మూడవ స్కంధము పూర్తి చేసేసరికి, తనకుసృష్టికర్తనుండి తిరిగి రావలసినదని సందేశము వచ్చినట్లు భావించారు. తన అంత్యకాలము సమీపిస్తున్న దని తెలుసుకొని, మిగిలిన స్కంధములను వదలి, పదవ స్కంధమును పూర్తిచేసి పదకొండవ స్కంధవచన ప్రారంభించారు. తిరిగి రెండవసారి భగవంతుని పిలుపు వచ్చినట్లు విశ్వసించారు. ఆ కారణంగా పదకొండవ స్కంధ రచన ఆగిపోయింది. జీవిత చరమాంకములో చేపట్టిన రచనలను కాలవ్యవధి లోపించి ఆయన పూర్తి చేయలేకపోయినారు. అయినప్పటికీ పూర్వ మీమాంసకు మూలాధారములైన జైమిని సూత్రములపై వ్యాఖ్యను కారికను రచించారు. మరికొన్ని చిన్న పుస్తకములను కూడ రచించుట జరిగింది. వీటిలో కొన్ని కేవలమూ రెండు శ్లోకములు మాత్రమే కలిగి ఉన్నవి. ఆ పుస్తకములను సంకలనముచేసి "షోడశ గ్రంథములు" అనే పేరుతో ప్రచురించుట జరిగింది. ఆ చిన్ని పుస్తకములలో మానవ జీవన విధానమునకు సంబంధించిన నైతిక విలువలు, మంచి వ్యక్తిత్వము, నడత ఆదిగాగల అనేక విషయ ములను నిర్దేశించుట జరిగినది. ఆయన రచించిన మరొక ముఖ్య గ్రంథము 'తత్వార్థ దీపనిబంధం'ఆ గ్రంథములో తన నూతన సాంప్రదాయమునకు చెందిన ఆధ్యాత్మిక విధానము, ఆదర్శ ప్రాయమైన ప్రవర్తన వంటి అంశములను వివరించారు. దాదా పుగా ఆయన పదునాలుగు చిన్న, పెద్ద గ్రంథములను సంస్కృతభాషలోనూ మరికొన్ని టిని ప్రాంతీయ భాషయైన వ్రజభాషలో విద్యావిహీనులైన తన అనుయాయులు సులభంగా అర్థము చేసుకొనుటకు వీలుగా వ్రాయటం జరిగింది.

శ్రీ వల్లభాచార్యులు ఏబది మూడు ఏండ్లు జీవించి క్రీ.శ. 1351లో దివంగతులైనారు. ఆయన మృతికి ఒక సంవత్సర కాలము ముందు వరకూ, ఆయన భార్యా బిడ్డలూ బంధువులతో గృహస్థుగానే జీవించారు. ఈ విధంగా జీవించటం తన నూతన సాంప్రదాయమును పాటించేవారికి భగవస్సాన్నిధ్యం చేరుకోవాలంటే సన్యాసము స్వీకరించ వలసిన అవసరము లేదని ఋజువు చేయుట కొరకే. ఆయన అభిప్రాయములో సన్యాస స్వీకారము ఎప్పుడు చేయవలెనంటే సంసారమూ, ఇతర లౌకిక వ్యవహారములు సర్వదా తనను వేధిస్తుంటేనో, లేదా పాంచభౌతికమైన శరీరము భగవత్సాన్నిధ్యము చేరుటకు అవరోధముగా ఉండి, దానిని విసర్జిస్తేనేకానీ, భగవంతునిలో లీనగముట సాధ్యం కాదనే పరిస్థితులు ఏర్పడితేనో తప్పదు. ఆ పరిస్థితులు ఏర్పడనప్పుడు గృహస్థు సన్యసించ నవసరము లేదు. గృహస్థు కూడా ముక్తి పొందుటకు అర్హుడు. సంసారమును త్యజించకుండానే, భగవంతుని సేవలో మనుగడ సాగించవచ్చు. "సన్యాస నిర్ణయ"మనే గ్రంథంలో ఈ విషయమును చర్చించి ఆయన అభిప్రాయమును పైన వివరించిన విధంగా తెలియజేశారు. మూడవ తూరి భగవత్సాన్నిధ్యమును చేరవలెననే సందేశమురాగానే, మధ్వాచార్యుడైన మాధవేంద్ర పూరి అనే సన్యాసిని పిలిపించుకున్నారు. ఈ మాధవేంద్రపూరియే శ్రీ వల్లభునికి గోవర్ధన ధారి దేవాలయ నిర్మాణములో సహాయము చేసినవారు. ఈతడే శ్రీవల్లభునికి భాగవత పురాణపఠనము చేయవలసినదిగా ఆదేశించినవారు. ఆ యతీంద్రుడు రాగానే తనకు సన్యాసాశ్రమ ప్రదానము చేయవలసినదని కోరారు. ఆయన కోర్కెను మన్నించి, మాధవేంద్ర పూరి శ్రీ వల్లభునికి సన్యాస దీక్షనిచ్చి పూర్ణానందుడనే దీక్షా నామమును ప్రసాదించారు. పూర్ణానందుడు తన ఇంటిలోని ఒక గదిలో అన్ని తలుపులనూ మూసివేసి, ఒక వారము దినములు గడిపిన అనంతరం, వారణాశి ప్రయాణమైనారు. వారి, ఇద్దరు పుత్రులూ, ఇతర బంధువులు, శిష్యులుకూడా ఆయన వెంట వారణాశి చేరారు. మౌనవ్రతమును పాటిస్తున్న కారణంగా, రెండు పాదములుగల మూడు శ్లోకములను లోకమునకు తన చివరి సందేశముగా శ్రీ వల్లభులు ఒక రాతిపై వ్రాశారు. ఆ శ్లోకముల తాత్పర్యమేమంటే భగవంతునిచే అనుగ్రహింపబడిన శరీరమును, మనస్సును, ఇతర ఇంద్రియములనూ, ఆయన సేవకు వినియోగించక పోయినచో కాలమే వాటిని మ్రింగి వేయగలదు. ఇది నా విశ్వాసము. శ్రీకృష్ణుడే దేవుడు. అతడు లోకముకాదు. ఈ లోకముతో ఆయనకు ఎటువంటి నిమిత్తమూ

లేదు. కాబట్టి గోపికానాథుడైన శ్రీకృష్ణుని మనము సేవించవలెను. ఆయనొక్కడే మన మానసిక శారీరక ఆత్మపరములైన అన్ని విధముల సేవలకు అర్హుడు. ఆయనే సర్వస్వముగా భావించి సేవించండి. ఆయనొక్కడే మనకు ఇహ, పర లోకముల యందలి సర్వసౌఖ్యములను వొనగూర్చగలిగిన సమర్థుడు. ఈ సందేశము నొసగిన అనంతరము, గంగా నదీతీరమున నున్న హనుమాన్ ఘాట్ నందు మకాంచేసియున్న శ్రీ వల్లభులు, ఒకరోజు అకస్మాత్తుగా గంగానదిలోనికి దుమికి అదృశ్యులైనారు. ఈ సంఘటనపై సాంప్రదాయకంగా చెప్పుకొనేదేమంటే, వల్లభులు దూకిన ప్రదేశ మున గంగలోనుండి ఒక మహాజ్వాల మింటికెగసి, వారికుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, శిష్యులు చూస్తుండగానే మాయమై పోయినదట.

శ్రీ వల్లభుల మరణానంతరము, వారి ద్వితీయ పుత్రుడైన విఠలనాథుడు తండ్రి బాధ్యతలను తాను వహించి, వల్లభ సాంప్రదాయ పీఠాధిపత్యమును అధివసించాడు. తండ్రివలెనే విఠలనాథుడు కూడా జ్ఞాని. తండ్రి స్థాపించిన నూతన సాంప్రదాయ మునూ, ఆధ్యాత్మిక కార్యక్రమములను కొనసాగిస్తూ, వాటి వ్యాప్తికి అన్ని విధములుగా కృషిచేశారు. తన జీవితమును అంకితము చేసినారు. తన తండ్రి అసంపూర్తిగా వదలిన కొన్ని గ్రంథములను పూర్తి చేయుటయే కాక, పుష్టిమార్గమును, బ్రహ్మ సంబంధమును పాటించుచున్న తండ్రి అనుయాయులను సుసంఘటితము చేయు టకు కృషిచేశారు. విఠలనాథుని గురుత్వ కాలములో ఈ సాంప్రదాయము ఎక్కువ వ్యాప్తి చెందుటయేకాక, హవేలీల నిర్మాణము అందు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టలు, ఆయనను రాజోపచారములతో వైభవంగా పూజించటం వంటి భక్తి కార్యక్రమములు వారి శిష్యులకు నిత్యకృత్యములైనవి. అయితే అన్ని హవేలీలు శ్రీ వల్లభుని కుటుంబ సభ్యుల అజమాయిషీలోనే ఉండి, ఈనాటికి కూడా పూజాదికములు, ఇతర ఉత్సవ ములు కూడా ఆయన వారసుల చేతనే జరుపబడుచున్నవి. శ్రీ వల్లభుడు తన జీవిత కాలమంతా గృహస్థాశ్రమములోనే గడిపి, చరమదశలో ఈ లౌకిక జగత్తును త్యజించినట్లు సూచనకుగాను, సన్యాశాశ్రమ స్వీకారం చేసాడుకాబట్టి, ఆయన సాంప్రదాయ ప్రబోధమునకు ప్రచారమునకూ, యతి పరంపర సృష్టింపబడలేదు. అన్ని హవేలీలకు అజమాయిషీదారులు, రక్షకులు ఆయన వారసులు మాత్రమే. ఇతరులకు అట్టి అర్హత ఈయబడలేదు. తమ సాంప్రదాయములో నిర్దేశింపబడిన

కార్యక్రమ నిర్వహణకు గాను, వారి భక్తులు ఘనమైన విరాళములు సమర్పిస్తారు. బ్రహ్మ సంబంధ దీక్షను అనుగ్రహించు తరుణంలో, భక్తులు గురుదక్షిణగా పెద్ద మొత్తములలో ధనము, విలువైన ఆభరణములను సమర్పిస్తారు. కానీ రానురాను హవేలి అర్చకులలో క్రమశిక్షణ, భక్తిభావన, దైవధ్యానము, నామ సంకీర్తన వంటి భక్తి కార్యక్రమములు లోపిస్తున్నై. ఇందుకు చింతిల్లుతున్న ఆ సాంప్రదాయమునందలి పెద్దలు, విద్యాధికులు, జ్ఞానులు, తిరిగి ఆ సంప్రదాయమును పూర్వ పద్ధతిలో వైభవంగా నిర్వహించవలెనని కృషి సల్పుతున్నారు.

శ్రీ వల్లభుడు తన పర్యటనలో ఒక వారంరోజులు అంతకుమించి వసించిన ప్రదేశములను బైఠక్‌లంటారు. బైఠక్ అంటే పీఠమని అర్థం. ఇటువంటి బైఠక్‌లు దేశంలో ఎనుబది నాల్గున్నవి. వాటిలో మూడు ఆంధ్రప్రదేశ్‌లోనూ, తొమ్మిది మిగిలిన దక్షిణ భారతంలోనూ ఉన్నట్లుగా గుర్తించారు. ఆంధ్రలో ఉన్న మూడు బైఠక్‌లలోనూ, శ్రీ వల్లభులు చెప్పినట్లు ఒకటి తిరుపతిలోనూ, రెండవది వాడి, రాయచూర్‌ల మధ్య కృష్ణానదీ తీరాన ఉన్నట్లుగా గుర్తించారు. మూడవదాని ఉనికి చాలాకాలంగా తెలియలేదు. కానీ ఈ మధ్యన అది మంగళగిరి (గుంటూరు జిల్లా) లో ఉన్నట్లు కనుగొనబడినది. ఈ కనుగొనటం చాలా యాదృచ్ఛికంగా జరిగింది. మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దర్శనార్థంవచ్చిన గుజరాతీ దంపతులు, దేవాలయం చుట్టుప్రక్కల, జీర్ణావస్థలోనున్న మందిరములను కూడా పరిశీలిస్తున్న సమయంలో, ఒక చిన్న మండపం గోడలపై ఏవో అక్షరములు కనిపించిన వట. వాటిని గుజరాతీ భాషగా గుర్తించిన ఆ దంపతులు చదవగా అది శ్రీ వల్లభుని బైఠక్ అని గుర్తింప బడినది. అనంతరం దానిని బాగుచేయించి అందు శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ చేసినారట.

శ్రీ వల్లభుల సాంప్రదాయము భాగవత పురాణాధారంగా ప్రతిపాదించబడినది. కావున అది వారికి పరమ ప్రామాణికం. ఆయన సాంప్రదాయము, శ్రీ వైష్ణవ సాంప్రదాయమును పోలి ఉన్నప్పటికినీ, శ్రీ రామానుజులు, మాధవులు, నింబార్కుడు, శ్రీ చైతన్యులు ప్రబోధించిన భక్తి తత్త్వములతో విభేదిస్తుంది. ఆదిశంకరుల అద్వైతమునకు సన్నిహితంగా ఉన్నా, మాయావాదమును తిరస్కరిస్తుంది. శ్రీ వల్లభుని అభిప్రాయము ననుసరించి మాయవాదమును అంగీకరించినట్లయితే, మాయ బ్రహ్మమునందు ఉన్నా, బయట ఉన్నా అది ద్వైతమే అవుతుంది. అద్వైతులు జగత్తుకు

కారణం మాయా శబలిత బ్రహ్మం అని నమ్మితే, వల్లభ సాంప్రదాయమునందు అది మాయారహితమైన "శుద్ధ" బ్రహ్మయే జగత్కారణం అంటారు. ఈ విషయమునే "శుద్ధాద్వైత మార్తాండం" అనే గ్రంథములో ఈ విధంగా తెలియజేశారు.

**శ్లో॥ మాయా సంబంధ రహితం శుద్ధ మిత్యుచ్యతే బ్బుధైః ।**
**కార్యకారణ రూపం హి శుద్ధం బ్రహ్మనమాయికమ్ ॥**

శ్రీ వల్లభులు సగుణ, నిర్గుణ స్థితులు రెండూ బ్రహ్మకు సహజమైనవేననీ విరుద్ధ ధర్మాలకు పరమబ్రహ్మ ఆశ్రయం కావడంలో దోషంగానీ, ఆశ్చర్యంగానీ లేదంటారు. పరబ్రహ్మ రూపరహితుడు అయినప్పటికినీ, భక్తులపైగల కృపచేత, రూపదారి అవుతుంటా డని వారి నిశ్చయం. వారు "తత్త్వదీప నిబంధనం"లో ఈ విషయముపై

**శ్లో॥ నిర్దోషపూర్ణగుణ విగ్రహి ఆత్మతంత్రో ।**
**నిశ్చేతనాత్మక శరీర గుణైశ్చ హీనః ।**
**ఆనందమాత్రికర ముఖోదరాది ।**
**సర్వత్ర చత్రి విధ భేద వివర్జితాత్మా ।**

ఆ కారణంగా శ్రీ వల్లభుడు తన సాంప్రదాయమునకు "శుద్ధాద్వైతమనీ", "కేవలా ద్వైత"మనీ, నిర్విశేషశుద్ధాద్వైత అద్వైతమనీ"పేర్లు పెట్టారు. కొందరు ఇతర వేదాంతులవలె, అవిక్రత పరిణామ వాదమును ప్రచారముచేశారు. ఆ వాదమును అనుసరించి ఒక వస్తువు తన మూల ప్రకృతి యందు ఏ మార్పును పొందకుండా మరో వస్తువుగా రూపధారణ చేయగలదు. అయితే ఈ వాదనను అద్వైతులు పూర్తిగా త్రోసిపుచ్చారు. ఇది హాస్యాస్పదము, స్వీయ ఖండనము అని వర్ణించారు. కారణం అది సాధకుని సాధనను పరిహాసాస్పదంగా చేస్తుంది. కాబట్టి శ్రీ వల్లభుని వాదనను ఆమోదిస్తే, భగవదారాధనలో ఏ దేవుని మనము పూజిస్తామో, ఆ దేవుడు ఆ సమయంలో, కేవలమూ ఉన్నట్లుగా భావించుటయే కానీ వాస్తవమునకు లేడనుకొనవలసి వస్తుంది. ఆ పరిస్థితులలో మనము పూజించే ప్రతిమ ప్రాణములేని రాయిగానో, చెడిపోయిన పాలవలె పరిగణింపవలసి వస్తుంది. బ్రహ్మమనునది ఒక పదార్థము కాదు. సచ్చిదానంద చైతన్యమే బ్రహ్మము. శ్రీ వల్లభుడు జగత్తు, బ్రహ్మ స్వరూపమేననీ ఎటువంటి మార్పులు చేర్పులు లేవని నిర్ధారించారు. కాబట్టి జగత్తు మిధ్య అనే వాదన సరికాదనీ, అది సత్యమేనని తెలియజేశారు. జగత్తు సత్యమను వాదనను

అనుసరించి, అవిద్యచే ఆవరింపబడిన జీవుడు సంసారమను లంపటములోపడి, లౌకిక విషయములచే బంధింపబడతాడు. ఎప్పుడైతే జీవుడు విషయ లోలత్వమును వదలించుకొని భగవంతునిపై చూపు నిలుపుతాడో అప్పుడే అవిద్య లేక అజ్ఞానము నశించి భగవసాన్నిధ్యమును చేరగలడు. ఈ జగత్తు మిధ్యయని చిదాభాస యనెడి భావన నశించి, జీవేశ్వరులవలె నిత్యపదార్థమని తెలుసుకొనగలడు. జగత్తు సత్యమనే అంశముపై శ్రీ వల్లభునికి నిశ్చితమైన అభిప్రాయమున్నది. పరబ్రహ్మ స్వరూపమే ఈ జగత్తు. అది సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మమే కాబట్టి జీవుడు అవిద్యచే కప్పబడి ఉన్నప్పటికీ లేక దానిని తొలగించుకున్నప్పటికీ ఏ నిమిత్తము లేకుండా దాని మనుగడ అది కొనసాగిస్తూనే ఉంటుంది.

శ్రీ వల్లభుడు, బ్రహ్మము ఏ విధమైన మార్పు చెందకుండా, సత్యమైన జగత్తుగా ఎలా మార్పు చెందుతుందో తన తిరోభావ (మరుగుపరచుట) ఆవిర్భావ (విశదీకరణ) సిద్ధాంతము ద్వారా వివరించారు. ఆ సిద్ధాంతమును అనుసరించి, తిరోభావనయందు బ్రహ్మము, ఆనందమును, చైతన్యమును పూర్తిగాకానీ, కొంత భాగమును గానీ, మరుగు పరచుటయో, ఉపసంహరించుకొనుటయో, ఆచరించుటవలన హీన వర్గము లకు చెందిన ప్రాపంచిక వస్తూత్పత్తి జరుగుతుందనీ, ఆ విధంగా కాక పరిపూర్ణమైన సచ్చిదానంద స్వరూపమే బ్రహ్మమనీ, దీనినే ఆవిర్భావము అంటారనీ విశదపరచారు. బ్రహ్మము యొక్క వ్యక్తిత్వమే పురుషోత్తముడు. మానవులలో కెల్ల అత్యుత్తముడు, ఆతడే శ్రీకృష్ణుడు. బ్రహ్మము తన ఆనందమును ఎక్కువ మరుగుపరచుకొనుట (తిరోభావ) వలన, తానేవిధమైన మార్పు చెందకుండానే అక్షర రూపము దాలుస్తాడు. అక్షరము అంటే నాశములేనిది. అక్షరము, రూపరహితమైన పురుషోత్తముడు. అతడు అన్ని జీవులయందు చరిస్తాడు. అందువల్ల "అంతర్యామి" అని పిలవబడుతున్నాడు. ప్రపంచములోని ఇతర జీవుల ఉత్పత్తికి కారణభూతుడు, సర్వాంతర్యామి. భగవం తుడు ఆనందమును పూర్తిగా ఉపసంహరించు కొనినప్పుడు సృష్టిలోని ఇతర జీవుల ఉత్పత్తి జరుగుతుంది. జీవులలో, చైతన్యము అస్థిత్వము ఉంటవికానీ, ఆనందము వాటి స్వభావములో లోపిస్తుంది. అదే విధంగా చైతన్యము (చిత్) ఆనందము రెంటినీ మరుగుపరచినప్పుడు కేవలము అస్థిత్వమొకటే ఉంటుంది. అదే పదార్థము, దానికి

చైతన్యముండదు. ఆనందమూ ఉండదు. అది జడము. ఇవన్నీ బ్రహ్మము యొక్క వివిధ ఆవిర్భూతములే. వీటియందు బ్రహ్మముయొక్క ఉన్నత స్వభావము మరుగుపడుతుందే కానీ, పూర్తిగా నశింపజేయటం కానీ తీసివేయటం కానీ జరుగదు. ఎందుకు ఆ విధంగా మరుగుపరచబడుతున్నదని ప్రశ్నిస్తే అది ఆయన "లీల" క్రీడావిలాసమును, సుసాధ్యము చేసుకొనుటమని జవాబు. ఆయన తన ఉన్నత స్వభావమును మరుగు పరచుకొనుట, ఆయన ఇష్టానుసారంగా, ఆయన ఆనందము కొరకు, ఆచరించుటయే కానీ, మరొక కారణము వలన కానేకాదు. ఆయన ఎప్పుడు సంకల్పిస్తే అప్పుడే మరుగుపరచిన ప్రకృతి జగద్రూపమును దాలుస్తుంది. ఆయనను నుతించుట, ప్రార్థించుట, అర్చించుట స్వార్థచింతన లేకుండా సోదర మానవాళికి, సృష్టిలోని ఇతర జీవులకు సేవచేయుట ద్వారా ఆయనకు ప్రీతికలిగిస్తే, ఆయన మరుగుపరచిన చిదానంద ములు మూర్తీభవిస్తవి. కాబట్టి నైతిక జీవనము, ఆధ్యాత్మిక చింతనల ద్వారా భయో త్పాతమును కలుగచేయు మాయను తొలగించుకొనవచ్చును. ఆ విధంగా శ్రీ వల్లభుడు జీవోత్పత్తినీ, జగదావిర్భావమును, సచ్చిదానంద స్వరూప మైన బ్రహ్మము ద్వారా, మాయా రహితముగా ఏర్పడు సిద్ధాంతమును ప్రతిపాదించుట జరిపారు. అయితే అద్వైతులు ఈ సిద్ధాంతమును ఆక్షేపించారు. కారణమేమనగా బ్రహ్మములోని కొంతభాగమును జీవులను, జగత్తును సృష్టించుటకు వినియోగ పరచుట వలన, బ్రహ్మమునందలి కొంత భాగము తరగిపోయి ఆయన వికలాంగుడు అయినాడు. శ్రీ వల్లభుని అవిక్ర పరిణామవాదము, అద్వైతుల ఆక్షేపణలను, విమర్శ లను ఇతర వేదాంతుల సిద్ధాంతములను ఖండించుట కొరకే ఉద్దేశింపబడినది. అయితే అది వారిని తృప్తిపరచలేకపోయింది. శ్రీ వల్లభుడేగాక, భారతీయ తత్త్వ వేత్తలలో చాలామంది బ్రహ్మమునకూ, సృష్టికీ, మధ్యగల సంబంధమును సంతృప్తి కరంగా వివరించుటకు చేసిన ప్రయత్నములలో కృతకృత్యులు కాలేదు. ఇందువలన గ్రహించవలసినదేమంటే, అన్ని శాఖలకూ, సాంప్రదాయములకూ చెందిన తత్త్వ వేత్తలు వర్ణించిన విధంగా, బ్రహ్మమును కేవలము తర్కబద్ధంగా, ఇదమిత్థంగా వర్ణించుట, వివరించుట సాధ్యంకానిపని. బ్రహ్మమును ఒక కాలమునకూ, ఒక ప్రదేశమునకూ బద్ధుడుగా మార్చివేస్తేనే ఆ పని సాధ్యమౌతుంది.

శ్రీ వల్లభ సంప్రదాయమును “బ్రహ్మవాద”మనికూడా పిలుస్తారు. కారణం ఆ సిద్ధాంతమునకు మూలములైన బ్రహ్మైక్యత బ్రహ్మముయొక్క అస్థిత్వము. ఇది శంకరుని అద్వైత వాదమునకు వ్యతిరిక్తమైనది, భిన్నమైనది. శంకరుని అద్వైతమును మాయా వాదమంటే, వల్లభుని సిద్ధాంతము బ్రహ్మవాదము. శంకరాద్వైతములో మాయబ్రహ్మము నందే పాతుకొనిపోయి ఉండగా, వల్లభ సంప్రదాయమునందు మతమునకు భక్తికి ప్రాధాన్యత కల్పించారు. ఇందు ఏ కొంచెమైన ఆదిభౌతిక ప్రకృతి గోచరిస్తే, అది కేవలము ఉపనిషత్తులలో చెప్పబడినట్లుగా, బ్రహ్మమునకూ, జగత్తునకూ గల సంబంధమును విశదీకరించుటకు మాత్రమే పరిమితము చేయబడినది.

శ్రీ వల్లభ సంప్రదాయమున ప్రామాణికములుగా, ఆధికారికములుగానూ, స్మృతులూ, శ్రుతులే అంగీకరింపబడినవి. శ్రీ వల్లభుడు, విద్యారణ్యుల వలె భగవంతుని అస్థిత్వమును, నాస్తికత్వమును నిర్ణయించుటకు తర్కమును, వాదననూ ఉపయోగించలేదు. శ్రుతి స్మృత్యాదులైన పవిత్ర గ్రంథములలో చెప్పబడిన అన్ని అంశములనూ నిర్దేశించిన విధులనూ, ఎటువంటి ప్రశ్నలు, సందేహములు లేవనెత్తక, విశ్లేషించక, శిరసావహించి, ఆచరించవలసినదేనని ప్రబోధించారు. ఆదిశంకరులు ఇందుకు భిన్నంగా ఉపనిషత్తులలోని, జ్ఞానకాండను మాత్రమే ప్రామాణికంగానూ, అధికారయుతమైనదిగానూ పరిగణించారు. శ్రీ వల్లభుడు వేదములు, ఉపనిషత్తులు, బాదరాయణుని బ్రహ్మసూత్రములు, స్మృతులు మహాభారతము, భగవద్గీత, పాంచరాత్రాగమము, పౌరాణిక సాహిత్యము, ముఖ్యంగా భాగవత పురాణము, ఆదిగాగల, అన్ని పవిత్ర గ్రంథములను, సంపూర్ణంగా, సాధికారములుగా తమ సాంప్రదాయ సిద్ధాంత సూత్రీకరణమునందు పొందుపరచారు. శ్రీకృష్ణుని ఔన్నత్యమును, దివ్యత్వమును విశదీకరించు ప్రముఖ గ్రంథములైన భాగవత పురాణము, భగవద్గీతకు, వారి సాంప్రదాయములో విశిష్ట స్థానమును కల్పించారు. భక్తి వేదాంతము యొక్క ప్రాశస్త్యమును ప్రచారముచేయు, ఇతర సాంప్రదాయములకు చెందిన శ్రీకృష్ణ భక్తులుకూడా పై రెండు గ్రంథములకే విశేషమైన ప్రాధాన్యతను ఇస్తారు.

శ్రీ వల్లభుల సాంప్రదాయము నందు శ్రీ చిదానంద బ్రహ్మమును పురుషోత్తముడని కూడా పిలుస్తారు. ఆయన శ్రీ కృష్ణ పరమాత్మ వ్రజ భూమిలో నున్న బాలకృష్ణుని

రూపంలో ఆయనను అర్చించటం అత్యుత్తమం. గోవులు గోపికలతో పరివేష్టింపబడిన ఆ స్వామి ఆయన బాల్యచేష్టలను, రాక్షసులను హతమార్చుట ఆదిగాగల ఆయన లీలల స్మరణము, మననము, ఆరాధనలే అత్యంత భక్తిదాయకములు ముక్తిప్రదాయ కములు. శ్రీకృష్ణుడు రాజకీయవేత్తగానూ, గీతాచార్యుడుగానూ, తత్త్వవేత్తగా కాక, బాలకృష్ణుడుగానే, వల్లభ సాంప్రదాయమునందు అత్యంత ఆరాధ్యుడు. శ్రీకృష్ణుని ప్రతిమ ప్రక్కన ఒక స్త్రీ విగ్రహమునుకూడా హవేలీల యందు ప్రతిష్ఠించి, ఆరాధిస్తు న్నప్పటికీ, ఆ స్త్రీ మూర్తిని "స్వామిని" అనగా స్వామి భార్య అని పిలుస్తారే గానీ, ఆగమశాస్త్రములలో నిర్దేశించినట్లు ఆమెను ఒక శక్తి స్వరూపిణియైన స్త్రీ దేవతగా ఆరాధించరు. శ్రీ చైతన్యులవారు తమ సాంప్రదాయములో రాధాదేవికి, శ్రీకృష్ణునితో సమానమైన ప్రాముఖ్యతనిచ్చి, ఉభయులను సమానంగా పూజిస్తారు. చైతన్యుల సంప్రదాయములో రాధాదేవి సంకీర్తనలను గానం చేయడం, ఆమెను ఆరాధిం చడంద్వారా, రాధ కృష్ణులమధ్యగల ప్రేమతత్త్వమునూ ఆ మధుర భావన యొక్క పవిత్రతనూ విశేషంగా ప్రదర్శిస్తారు. వల్లభ సంప్రదాయములో ఆ మధుర భావన లేక మధుర భక్తిని, ఆధ్యాత్మికంగా, అత్యున్నత స్థానమును చేరుకొన్నా రనుకునే ముఖ్యులైన కొద్దిమంది అనుయాయులకే పరిమితం చేయబడినది. గోపికలు శ్రీకృష్ణుని యందు ప్రదర్శించిన ప్రేమ, తుచ్ఛమైన శారీరక వాంఛగా భావించరాదు. అది భగవంతునియెడల సాన్నిహిత్యమునకూ, ఉదాత్తమైన సేవానిరతికి చిహ్నంగా భావిం చాలి. అది ఒక అలౌకికమైన స్థితి. ఆధ్యాత్మికంగా పరిగణిస్తే జీవాత్మ పరమాత్మలో లీనమైపోవాలనే ఆకాంక్ష. ఆత్రుతకు నిదర్శనము. వారు దివ్యజీవులు. స్వామివారిపై అత్యంత అనుగ్రహమును వర్షించాడు. దానినే "సుధాపుష్టి" అని సాంప్రదాయంగా పిలుస్తారు. శ్రీకృష్ణునకు ఒక రూపము కల్పించినప్పటికీ, అదొక్కటే ఆయన రూపము కాదు. ఆయన నుండే ఈ సర్వసృష్టీ ఉద్భవించింది. మార్పు చెందిన ఆ సృష్టి స్వరూపుడే శ్రీకృష్ణుడు. సర్వసృష్టికీ ఆయన కేంద్ర బిందువు. సృష్టంతా ఆయన చుట్టూ పరిభ్రమిస్తుంది. దాని అస్తిత్వమునకు కారకుడు ఆ స్వామియే. ఆ కారణంగా ఆయనకు అనేక రూపములు, అనేక నామములు ఏర్పడినవి.

శ్రీ వల్లభుడు పరబ్రహ్మమునే పురుషోత్తముడన్నాడు. అందుండి వెలువడునదే అక్షరము. ఇందు సచ్చిదానందము నందలి ఆనందము మరుగుబడినది. ఆ కారణంగా

అక్షరము పురుషోత్తముడైన శ్రీకృష్ణుని కంటే అల్పమైనది. పరిపూర్ణమైన సచ్చిదానందుడెవరు? అక్షరమనునది వ్యక్తిత్వరహితమైన వస్తువు. శుద్ధాద్వైతులు దీనిని, అద్వైతులు వచించే బ్రహ్మముతో సమానంగా పరిగణిస్తారు. ఇక్కడ తెలుసుకొనదగిన విషయమేమంటే, అద్వైతులు వ్యక్తిత్వముగల బ్రహ్మమును అపరబ్రహ్మముగా (క్రింది తరగతి బ్రహ్మము) నూ, వ్యక్తిత్వములేని దానిని పరబ్రహ్మము (ఉన్నత బ్రహ్మము) గానూ పరిగణిస్తారు. కానీ శుద్ధాద్వైతులు, పై పరిగణనలను, విపర్య దిశగా అంగీకరిస్తారు. వ్యక్తిత్వముగల పురుషోత్తముడు అధికుడుగానూ, సర్వోన్నతుడుగానూ, వ్యక్తిరహితమైన (స్వార్థ రహిత మైన) అక్షరమును అల్పుడుగానూ పరిగణనలోనికి తీసుకుంటారు. ఆ విధంగా అద్వైతము నందు నిర్వచించబడిన వ్యక్తిరహిత (స్వార్థరహిత) బ్రహ్మమును వల్లభ సాంప్రదాయీకులే కాక, అద్వైతులు కాని ఇతర శాఖల వారుకూడ నిమ్న బ్రహ్మము గానే భావిస్తారు. ఈ నిమ్న బ్రహ్మమే సృష్టియందలి సర్వ జీవులకు ఉత్పత్తి స్థానము. అది అంతర్యామిగా ఆ జీవుల యందుంటుంది. అగ్నిజ్వాలనుండి వచ్చు నిప్పు రవ్వవలే, అసంఖ్యాకములుగా జనించు జీవులు అస్థిత్వమును మాత్రమే పొంది, ఆనందరహితములై ఉంటవి. ఆ కారణంగా జీవుడు బ్రహ్మాంశమే కానీ, ఆయన ప్రతిబింబము కాదు. అద్వైతములో పేర్కొనబడే చైతన్యభాస వంటివాడు. ఆభరణ మును తయారుచేయుటకు ఉపయోగించు లోహము వంటివాడు. కుండ చేయుటకు కావలసిన మట్టివంటివాడు. అద్వైతులు బోధించునట్లు మహావాక్యములను (1. ప్రజ్ఞానం బ్రహ్మ; 2. అహం బ్రహ్మాస్మి; 3. తత్త్వమసి; 4. అయమాత్మా బ్రహ్మ) కేవలము అలంకారప్రాయంగా గ్రహించరాదనీ, వాటి అంతరార్థమును అవగాహనము చేసు కొనవలెననీ వల్లభులు చెప్పారు. జీవుని ఆనందము మరుగుబడిన బ్రహ్మముగానే గ్రహించవలెను. ఆత్మను తెలుసుకొనుటకు బాహ్యముగా ఉండునటువంటి మాయ, ఉపాధి వంటివి ఏవియునూ లేవు. కాబట్టి జీవుడు బ్రహ్మము ఒకటే అని గుర్తించ వలెను. వాటి స్వభావములయందు మార్పుండవచ్చును.

శ్రీ వల్లభ సంప్రదాయము నందలి మరొక ప్రత్యేకాంశము జీవులను వివిధ తరగతులుగా విభజించుట. ఈ విభజన ఆయా జీవుల ఆధ్యాత్మిక శక్తిపై ఆధారపడి ఉంటుంది. ప్రధానమైన మూడు వర్గములు మర్యాద, పుష్ఠి, ప్రవాహిని అనేవి.

వాటి పరిణామదశ చివరియందు ఇవి వివిధ స్థితులను పొందగలుగుతవి. జీవుల యందు ఏర్పడిన తారతమ్యత ఒక ప్రత్యేక లక్షణం. ఈ సిద్ధాంతమును అనంతర కాలములో మధ్వాచార్యులవారు తమ ద్వైత సిద్ధాంతమునందు పొందుపరచారు. దీనిని అనుసరించి జీవులకు జన్మతః ఏర్పడిన శక్తి, గమ్యమును బట్టి వాటిలో కొన్ని తేడాలు ఏర్పడతవి. కానీ ఈ విధమైన జీవుల తారతమ్య సిద్ధాంతమును శ్రీ శంకరులుకానీ, శ్రీ రామానుజులు కానీ అంగీకరించలేదు. వారి సిద్ధాంతముల యందు అన్ని జీవులు సమానములే. ఎక్కువ, తక్కువలు ఉండవు. అద్వైతమునందు జీవులు బ్రహ్మాంశ సంభూతులుగా గుర్తింపు పొందితే, విశిష్టాద్వైతమునందు జీవులు తమ కర్మ ఫలములను అనుభవించిన అనంతరం ముక్తి పొందుటకు సమానుల వుతారు. తరువాతి కాలములో ఈ సిద్ధాంతము కొంత మార్పుచెంది జీవులలో కొన్ని ఉత్కృష్టమైనవి ఉంటాయనీ, అవి ఎటువంటి బంధములులేక, సర్వదా స్వయం ప్రకాశములై, వైకుంఠములోనే ఉంటవనీ తెలియజేయబడింది. అటువంటి ఉత్కృష్ట జీవులను మినహాయిస్తే ఇతర జీవులు సర్వమూ సమానులే అని శంకరులు, రామానుజులు తెలియచెప్పారు. శ్రీ వల్లభ సంప్రదాయమును అనుసరించి జీవులలోని మొదటి రెండు వర్గములు అనగా మర్యాద, పుష్టి తరగతులకు చెందిన జీవులు దివ్యాంశ సంభూతులైఉండి, వాటి పరిణామ దశాంతంలో, పురుషోత్తముని చేర గలుగుతారు. మూడవ తరగతికి చెందిన ప్రవాహినీ జీవులు, అల్ప స్థితికల్గి, బలమైన సంసార బంధమునకు కట్టుబడి ఉండటంచేత, వారు ఆ సంసార చక్రమునందు పుట్టుక, చచ్చుట అను స్థితులలో ఎల్లప్పుడూ పరిభ్రమిస్తూ ఉంటారు. ఈ జీవులలో మరికొన్ని గాఢమైన అజ్ఞానాంధ కారములో స్వతః సిద్ధంగా మనుగడ సాగిస్తూ, సంసారబద్ధులై, చెడ్డవారిమధ్యన జీవనం కొనసాగిస్తూ, శాశ్వతంగా అదే స్థితిలో ఉండిపోతారు. అయితే ఎప్పుడైనా వారు చెడు సహవాసములను, చెడు అనుబంధము లను వదలి, సత్ప్రవర్తకుల సాన్నిహిత్యము నైతిక ప్రవర్తనను అలవరచుకుంటారో, అప్పుడు అజ్ఞానము నుండి విముక్తి పొంది ముక్తి పొందుటకు అర్హులవుతారు. చిట్టచివరి వర్గమునకు చెందిన జీవులను దుర్జనులు అంటారు. వారు పాపపూరితమైన జీవనమును కొనసాగిస్తూ, అన్ని జన్మలయందునూ వారు పాపులు గానే జీవిస్తారు. ఆ కారణంగా వారు శాశ్వతంగా అజ్ఞానాంధకారములోనే ఉండిపోతారు.

'మర్యాద' వర్గీయులైన జీవులు తమ స్వయంకృషితో వేదోక్తంగా యోగము, జ్ఞానమును సముపార్జించి, కాలాంతరమునందు అనగా వారి పరిణామదశయందు అక్షర పురుషునితో విలీనము చెందుతారు. పుష్టి లేక పోషణ వర్గమునకు చెందిన జీవులు సర్వోత్కృష్టమైనవి. పుష్టి అంటే భాషాపరంగా, పుష్టికరమైన ఆహారము సేవించటం, ఆరోగ్యకరమైన, దృఢమైన శరీరము కలిగి ఉండటం అని అర్థం. కానీ ఇక్కడ పుష్టి అంటే జీవునకు పోషణ కలిగించటం అని అర్థం. కాలక్రమేణ శ్రీ వల్లభ సంప్రదాయములో అవినీతి, అక్రమములు చోటుచేసుకోవటంతో, ఇతరులు ఆ సాంప్రదాయిలను, అవహేళన చేస్తూ, పుష్టి అంటే మంచి భోజనంచేసి, శారీరక సుఖములు అనుభవించుట అని అపహాస్యం చేస్తారు. వల్లభుని అనంతరం ఆయన వారసులు చెబుతున్నట్లు, పుష్టి అంటే శరీర పోషణకాదు, భగవదనుగ్రహము ద్వారా జీవుడు పొందేటటువంటి ఆధ్యాత్మిక పుష్టి లేక పోషణ. భాగవత పురాణములోనూ, ఉపనిషత్తులలోకూడా, జీవుల పోషణను వివరించు అంశములు చెప్పబడినవి. భాగవతమునందలి ఆరవ స్కందమునకు "పుష్టి స్కంధ"మని పేరు. ఎంత పాపాత్ముడు అయినప్పటికీ భగవదానుగ్రహం వల్ల పాపవిముక్తుడై, పరమ భాగవతోత్తముడుగా పరివర్తన చెందుతాడని తెలియజేస్తూ ఆజామీళుని ఉదహరించుట జరిగింది. పుష్టి జీవులకు సర్వోత్కృష్టమైన స్థానమును కల్పించుటకు కారణం, వారు ముక్తిని కూడా త్రోసి పుచ్చి, శాశ్వతానందమును అనుభవిస్తూ ఉంటారు. వారు ముక్తి కంటే పురాణ పురుషుడైన శ్రీకృష్ణ పరమాత్మను సేవిస్తూ, ఆనందమును పొందుతారు. అది వారికి ముక్తి కంటే ఉన్నతమైనదని భావిస్తారు.

పుష్టి మార్గమును ప్రబోధించిన శ్రీ వల్లభుల సాంప్రదాయము నందు భగవత్సేవ, ఇతర శ్రీ వైష్ణవ సాంప్రదాయము నిర్దేశించినట్లు, శ్రవణము (వినుట), కీర్తనము (పాడుట), స్మరణము (ధ్యానించుట), పాదసేవనము, అర్చనము (పూజించుట), వందనము, దాస్యము, సఖ్యము (స్నేహము), ఆత్మ నివేదనము (శరణు జొచ్చుట) అను నవ విధములుగా కాక, చిట్టచివరి సేవయైన ఆత్మనివేదనముతో ప్రారంభించ బడుతుంది. మిగిలిన సేవలన్నీ, నిమ్న వర్గీయులైన జీవులకే గానీ, పుష్టి వర్గీయులైన జీవులకు అవసరము లేదని తెలియజేశారు.

భగవత్సేవను శ్రీ వల్లభులు మూడు రకములుగా విభజించారు. కాయక (శారీరక సేవ), విత్తజ (ఆర్థికమైన సేవ), మానస (మనస్సుతో సేవ) పై మూడు విధములలో శారీరక ఆర్థిక సేవలతోనే శ్రీకృష్ణుని హవేలీలలో అర్చించవలెననే ప్రాధాన్యత కల్పింప బడింది. హవేలీలు ముందు తెలియజేసినట్లు. ఇతర హైందవ దేవాలయముల వంటివి కావు. అవి శ్రీ వల్లభ సంప్రదాయస్థులు అయిన గురువుల నివాసములు. గురువులు ధనమును స్వీకరించవచ్చును, స్వీకరించకపోనూ వచ్చును. వారు శ్రీ వల్లభాచార్యుల వారసులుగా, హవేలీలను, వాటికి చెందిన ఆస్తిపాస్తుల పైననూ సర్వహక్కులు పొంది వాటిని అనుభవిస్తూ ఉంటారు. హవేలీలలో ప్రతిష్ఠింపబడిన విగ్రహములను 'శ్రీమూర్తి'లేక 'స్వరూప' అని వ్యవహరిస్తారు. ఆ విగ్రహము ఇతర దేవాలయములోని విగ్రహముల వలే భగవంతుని ప్రతిమ కాదు. ఆ విగ్రహమే భగవంతుడు. పూజా విధానము కూడా ఆగమ శాస్త్రముల యందు విధించబడినట్లు కాక, ఒక బాలునిపై తల్లితండ్రులు బంధువులు చూపు ప్రేమ, అనురాగము, అభి మానము, గౌరవమును ప్రదర్శిస్తారు. ఆ పూజా విధానము భగవదార్చన వలే ఉండక, చాలా వ్యక్తిగతమైనదిగా కన్పిస్తుంది.

భక్తివలన పొందు ఫలము లేక ఫలసేవ మూడు విధములుగా ఉంటుంది. మొదటి విధము ద్వారా భక్తుడు అలౌకిక సామర్థ్యమును లేదా భగవంతునితో సమానమైన దివ్య శక్తులను పొందగలుగుతాడు. రెండవదానిద్వారా, భగవంతుని సాయుజ్యమును లేక భగవత్సేవను పొందుతాడు. ఈ మార్పు నెమ్మదిగా క్రమ పద్ధతిలో భక్తుని యొక్క సేవా తత్పరతను బట్టి జరుగుతుంది. అంత్యమున భగ వంతునియందు లీనమగుట భగవత్సేవలో సంభవిస్తుంది.

భక్తునియొక్క వ్యక్తిత్వము గుర్తింపు నశించిపోతవి. చిదాత్మిక స్వరూపము ఏర్పడు తుంది. భగవత్సేవను కొనసాగిస్తూనే పారలౌకిక స్థితియందు ప్రవేశించి తన అస్థిత్వమునే కోల్పోతుంది. ఇదియే జీవుడు ఆశించదగిన సర్వోత్కృష్ట స్థానము.

శ్రీ వల్లభుడు ప్రబోధించిన శుద్ధాద్వైతమనే నూతన సాంప్రదాయము భక్తి, జ్ఞాన మార్గముల మేలుకలయిక. శ్రీ వైష్ణవ సంప్రదాయమునందు నిర్దేశించినట్లు,

దైవ విగ్రహమును దేవుని అర్చామూర్తిగాక, సాక్షాత్తు దేవునిగానే భావించి అర్చిం
చటం. ఈ భావనతో అద్వైత సిద్ధాంతమును అలంకరించటమే శుద్ధాద్వైతము.

**శ్లో॥ తస్మాత్ సర్వాత్మనా నిత్యం శ్రీకృష్ణ శరణంమమ ।**
**పదద్భిరేవ సతతం స్థేయమిత్యేవమే మతి ః ॥**

- శ్రీ వల్లభుల శరణ మంత్రము

■ ■ ■

# శ్రీ అప్పయ్య దీక్షితులు

**శ్లో॥ ఆంధ్రత్వమాంధ్ర భాషాచ । ప్రాభాకర పరిశ్రమా ।**
**త్రతాపి యాజుషీశాఖా । నాల్పస్య తపసః ఫలం ॥**

ఆంధ్రులను గురించీ, తెలుగు భాషను గురించీ అత్యున్నతమైన పై ప్రశంసను చేసిన మహనీయుడు, మహాపండితుడు, అద్వైత శిఖామణీ శ్రీ అప్పయ్య దీక్షితుల వారు. తెలుగువాడుగా పుట్టటం, తెలుగు భాషను మాట్లాడటం సామాన్యమైన విషయ ముగా భావించరాదనీ ఎంతో గొప్ప తపస్సు చేసివుంటే కానీ లభించదనీ, తనకుగల మాతృభూమి, మాతృభాషపట్లగల విశేషాభిమానమును ఆ శ్లోకరూపేణ వ్యక్తం చేశారు. ఆయనకు తెలుగు ప్రజల నమోవాకములు.

అప్పయ్య దీక్షితులవారి పూర్వీకులు, ఆంధ్రదేశము నుండి కొన్ని శతాబ్దముల క్రితం ద్రవిడదేశమైన నేటి తమిళనాడు ప్రాంతమునకు వలసవెళ్ళి పోయారు. ఆ రోజులలో వేదాధ్యయనము, యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించగల సామర్థ్యము, సాహిత్యము, సంగీతము వంటి కళలయందు ప్రావీణ్యత కలిగియున్న బ్రాహ్మణ కుటుంబములు అనేకము ద్రవిడ కర్ణాటక దేశములలో సుఖమయమైన ప్రశాంత జీవనమునకూ, వైదిక ధర్మ ప్రవర్తనకూ వారి పాండిత్యప్రకర్ష గుర్తింపునకూ, వాటిని

ఆదరించి, అక్కున చేర్చుకోగలిగిన రాజులనూ, వదాన్యులనూ వెతుక్కుంటూ వెళ్ళటమో లేక వారిచే ఆహ్వానింపబడి వెళ్ళటమో సర్వసాధారణమైన విషయం. ఆ కోవకు చెందినవారే అప్పయ్య దీక్షితులవారి పూర్వీకులు. నేటి ఉత్తర ఆర్కాటు జిల్లాలోని, అరణికి సమీపమునగల అడయపలం (పాలెం) గ్రామంలో స్థిరపడ్డారు. ఆ రోజులలో అది ఒక అగ్రహారం. అప్పయ్య దీక్షితులవారి పూర్వీకులు అందరూ శ్రోత్రియులు. వేద వేదాంగములలో నిష్ణాతులు. ఆ కారణంగా వారిని విజయనగర ప్రభువులూ, వారి సామంతులు, భూరి విరాళములను ఇచ్చి సత్కరించే వారు. అందువల్ల ఆ కుటుంబము లక్ష్మి, సరస్వతులకు నిలయము అయి ఉండేది. రాజుల ఆదరణ లభించుటవల్ల, వారు అనేక యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించుట, వేదాధ్యయనము, సనాతన ధర్మ వ్యాప్తికి గురుకులములను స్థాపించి, నిర్వహించుట వంటి పవిత్ర కార్యక్రమములను తరచుగా చేస్తూ ఉండేవారు. తద్వారా వారి అగ్రహారమైన అడవపలంలోనే గాక, ఆ చుట్టుపట్ల గ్రామములనుకూడా అధిగమించి దాదాపు తమిళ దేశంలోని ఎక్కువ భాగంలో వారి కీర్తి, వదాన్యత, పాండిత్యము వ్యాపించినవి. వీరు అందరూ శివభక్తులు. సామవేద శాఖకు చెందినవారు. భారద్వాజస గోత్రీకులు. పాలారు నదీ తీరమున ఉన్న విరించిపురములోని మరకతవల్లీ సమేత శ్రీ మార్గసహాయేశ్వర స్వామివారి కులదైవం.

అప్పయ్య దీక్షితులవారి తాతగారు ఆచార్య దీక్షితులు లేక ఆచాన్ దీక్షితులు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఒకరు శైవులు, రెండవ ఆమె వైకుంఠాచార్యుని వంశమునకు చెందిన వైష్ణవ స్త్రీ. అప్పయ్య దీక్షితులవారి తండ్రి రంగరాజ దీక్షితులు. తండ్రి వలెనే, గొప్ప విద్వాంసుడు, యజ్ఞయాగాది క్రతు నిర్వహణయేకాక, అద్వైతముపై అనేక విశిష్ట రచనలు చేశారు. అప్పయ్య దీక్షితుల వారి తమ్ముని పేరు ఆచాన్ దీక్షితులు. తాతగారి నామమే. ఆయన మనుమని పేరు నీలకంఠ దీక్షితులు. తన పెద్దలకు ఎందులోనూ తీసిపోనివారు.

ఆచార్య దీక్షితులవారు ఒక మహాపురుషుడు. ఆయనను శ్రీ వక్షస్థలాచార్య దీక్షితులు అనికూడా పిలిచేవారు. ఆ పేరుతో పిలుచుటకు కారణంగా, ఒక కథ ప్రచారంలో ఉన్నది. ఒకప్పుడు విజయనగర చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయలవారు కాంచీపురములోని శ్రీ వరదరాజస్వామి వారి దర్శనార్థం వెళ్ళినారట. రాజ

పురోహితుడు, ఆస్థాన కవియైన ఆచార్య దీక్షితులుకూడా రాయల వెంట దేవాలయ ప్రవేశం చేశారట. ఆ స్వామి సన్నిధిలో తన దేవేరులతో నిలబడియున్న రాయలవారిని చూచిన ఆచార్య దీక్షితులు, వైభవోపేతమైన ఆ సన్నివేశమునకు ముగ్ధుడై, ఆశువుగా ఈ క్రింది శ్లోకమును పఠించినాడట.

**శ్లో॥ కాఞ్చిత్కాంచన గౌరాంగీం**
**వీక్ష్య సాక్షాదివ శ్రియమ్ ।**
**వరదః సంశయాపన్నో**
**వక్షః స్థల మవేక్ష్యతే ॥**

శ్రీకృష్ణదేవరాయలవారు సర్వాభరణ భూషితుడై, సతుల సమేతంగా తన ఎదుట నిలబడిన దృశ్యమును గాంచిన వరదరాజస్వామి, తన వక్ష స్థలముపై ఉండవలసిన మహాలక్ష్మి ఉన్నదా లేక రాయలవారి వద్దకు వెళ్ళినదా అనే సందేహము కలిగి, తలను వంచుకొని తన వక్షస్థలమును పరిశీలనగా చూసుకున్నాడని ఆ శ్లోక తాత్ప ర్యము. ఆ శ్లోకమును విన్న రాయలవారు చాలా సంతోషించి, ఆచార్య దీక్షితులకు "వక్షస్థల" అనే బిరుదు ప్రదానం చేశారట. తత్కారణంగా ఆయనను శ్రీ వక్షస్థలాచార్య దీక్షితులనే నామము ఏర్పడినదట. మరొక విధంగా ఆయన వక్షస్థల మహాగణపతి ఉపాసకుడు కాబట్టి, ఆయనకు ఆ పేరు వచ్చిందని కూడా అంటారు. వారు వివాహ మాడిన ఇద్దరు స్త్రీలలో శైవ సంప్రదాయమునకు చెందిన భార్యకు నలుగురు పుత్రులు, వైష్ణవమునకు చెందిన భార్యకు ఒక కొడుకు జన్మించారు. ఆమె పేరు తోతాంబి. అప్పయ్య దీక్షితులవారి తండ్రియైన రంగరాజాధ్వరి లేక రంగరాజ దీక్షితులే ఆమె పుత్రుడు. ముందు తెలియజేసినట్లు ఆయన వేదవేదాంగాది, సర్వశాస్త్రాధ్యాయి. పూర్వము రాజులు, చక్రవర్తులు నిర్వహించినట్లు రంగరాజ దీక్షితులు అతిపవిత్రమైన విశ్వజిత్ యాగమును నిర్వహించారు. ఆ యాగకర్త యాగము పూర్తి చేయగానే తన సర్వస్వమును ఇతరులకు దానము చేయవలసిన విధి. రంగరాజ దీక్షితులు తన ధన, కనక, వస్తు, వాహన, అగ్రహారాదులు అన్నిటినీ వేదోక్త విధిగా దానముచేసి, పేదరికమును తాను స్వీకరించారు. ఆయన గొప్ప విద్వాంసుడు అయినప్పటికినీ, ఏనాడూ సంపదలను, బిరుదులను, సన్మానములను, మరేవిధమైన అధికార పదవులను, ఏ రాజువద్ద నుండీ ఆశించలేదు. ఆ విధంగా ఆచార్య దీక్షితుల వంటి

మహానుభావునకు జన్మించిన రంగరాజ దీక్షితులు మరో మహానుభావునకు తండ్రిగా చరిత్రలో ప్రసిద్ధిపొందారు.

రంగరాజ దీక్షితులవారి పుత్రుడే అప్పయ్య దీక్షితులవారు. అప్పయ్య దీక్షితుల వారు, స్వగ్రామమైన అడయఫలంలోనే పుట్టారని కొందరూ, కాదు విరించిపురము లోనని కొందరూ, కాదు కాదు చిదంబరమే ఆయన జన్మస్థానమని మరికొందరూ తెలియజేశారు. నిజమేది అయినప్పటికీ వారు తమ స్వగ్రామమైన అడయఫలంలో జన్మించినట్లుగా నిర్ణయించుకుందాము. జన్మస్థలము వలెనే, ఆయన జన్మదినము కూడా వివాదాస్పదమైనది. అనేకవిధములైన వాదోపవాదముల అనంతరం, సాహిత్యపరమైన సాక్ష్యాధారములను బట్టి వారు క్రీ.శ. 1520లో జన్మించినట్లు నిర్ధారించారు. చిదంబరములోని నటరాజస్వామి, అప్పయ్య దీక్షితుల తల్లితండ్రుల మొరలాలకించి పుత్రుని ప్రసాదించినట్లు చెబుతారు. ఆయనకు వినాయక సుబ్రమణ్య శర్మ అని నామకరణం చేశారు. అయితే తమిళనాడులోని ఉత్తర మండలములలో తాతపేరు మనుమనికి పెట్టడం, పిల్లవానికి ఒక అసలు పేరు మరొక ముద్దుపేరు పెట్టి పిలవడం సర్వసాధారణమైన విషయములు. ఆ విధంగానే వినాయక సుబ్రమణ్య శర్మను ముద్దుగా 'అప్పయ్య' అని పిలిచేవారు. ఆ పేరే అప్పయ్య దీక్షితులుగా స్థిర పడింది. అప్పయ్య అనే ముద్దు పేరుకు కారణంగా, అప్ అంటే నీరు, అయ్య అంటే తండ్రి, నాయకుడనికూడా అర్థం చెబుతారు. అందువలన అప్పయ్య అంటే గంగా ధరుడైన శివుడని వివరిస్తారు. ఆగమ విజ్ఞానుసారం, అప్పయ్య దీక్షితులు సాక్షాత్తూ పరమశివుని అవతారమేనని 'దీక్షిత వంశాభరణం' అనే గ్రంథంలో పేర్కొన బడింది. అప్పయ్య దీక్షితుల వారికి ఆచాన్ దీక్షితులనే తమ్ముడూ, జ్ఞానాంబిక అనే చెల్లెలు ఉండేవారు. తమ్ముడైన ఆచాన్ దీక్షితులు అన్నగారికంటే ముందుగా కాలంచేశారు.

రంగరాజ దీక్షితులవారు, తమ ఇద్దరు కుమారులనూ, ఆధ్యాత్మిక, సాహిత్య గ్రంథములను అభ్యసించుటకుగాను మొదట గురురామకవి వద్దకు పంపారు. అనం తరము తానే స్వయంగా, వేదములు, వేదాంగములు, దర్శనములు, షట్శాస్త్రములు, ఇతర వైదిక ధర్మ గ్రంథములు, సాహిత్యము, తత్సంబంధమైన ఇతర విద్యలయందు పరిపూర్ణమైన శిక్షణనిచ్చి, వారు అధ్యయనము చేసిన ప్రతిశాస్త్రమునందు వారిని, నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. అప్పయ్య దీక్షితులవారు వ్రాసిన అనేక గ్రంథములలో

తమ తండ్రిగారినీ, వారి విద్వత్తును అమితంగా కీర్తించారు. మచ్చుకు 'న్యాయ రక్షామణి' అనే గ్రంథంలో

**శ్లో॥ యం బ్రహ్మ నిశ్చితధియః ప్రవదంతి సాక్షాత్**
**తద్దర్శనాదఖిల దర్శన పారభాజమ్ ।**
**తం సర్వవేద సమశేషబుధాధి రాజం ।**
**శ్రీ రంగరాజ మఖిణం గురుమానతో౽ స్మి**

శ్రీ రంగరాజమణికి ప్రణామములు. ఆయన నా ఆచార్యుడు. జ్ఞాననిధి, అశేష పండిత లోకమునకు స్తుతిపాత్రుడు. దర్శనముచేతనే బ్రహ్మవేత్తయని, ధీమంతులకు స్ఫూర్తి కలిగించిన మహాత్ముడని స్తుతించారు. ఆయనకు 'సర్వవేద' అనే బిరుదున్నదట. మరో శ్లోకములో తన మాతామహులైన ప్రముఖ వైష్ణవాచార్యులు, శ్రీ వైకుంఠా చార్యులను ప్రశంసిస్తూ, ఆయన 'సర్వజిత్' యజ్ఞమాచరించారని వివరించారు. ఆ విధంగా అప్పయ్య దీక్షితులవారి పితామహుల వంశమూ, మాతామహుల వంశము కూడా దిగ్దంతులైన పండిత వంశములు కావటంతో అప్పయ్య దీక్షితులవారు, విద్యా పూర్ణులైనారంటే ఆశ్చర్యపడ నవసరము ఏమున్నది ? సర్వశాస్త్ర పారంగతుడైన తనతండ్రి, అన్ని శాస్త్రములను విసర్జించి కేవలము అద్వైత మతాభివృద్ధిలో ప్రచారము నకే తన జీవితమును అంకితము చేశారని అప్పయ్య దీక్షితులవారు మరో సందర్భ ములో తెలియజేశారు. తను జీవితములో ప్రాముఖ్యత వహించుటకు కారణమైన విద్యావిశేషాలన్నీ, తన తండ్రి ద్వారా తనకు సంక్రమించినవేననీ, తాను వాటిని మరెవ్వరి వద్దా నేర్వలేదని ఘంటాపథంగా ప్రకటించి, తన పితృభక్తిని, గురుభక్తిని వేనోళ్ళ కొనియాడారు.

అప్పయ్య దీక్షితులవారు రచనా వ్యాసంగమును చేపట్టిన తరుణంలోనే, విజయ నగర ప్రభువుల సామంతుడుగా వేలూరు (నేటి రాయవేలూరు) పరిపాలకుడైన చినబొమ్మ నాయకుడు రంగరాజధ్వరి విద్యావివేక సంపదను గురించి విని, వారిని తమ ఆస్థానమునకు ఆహ్వానించారు. రంగరాజధ్వరి ఆహ్వానమును మన్నించి, తామూ, తమ కుటుంబము వేలూరుకు తరలి వచ్చారు. అక్కడే స్థిర నివాసము ఏర్పరచుకున్నారు. అప్పయ్య దీక్షితుల వారు తండ్రితోపాటు నిత్యానుష్ఠానం, వేదా ధ్యయనము ఆచరిస్తూ, తండ్రిగారితో పాటు తరచుగా రాజసభకు వెళ్తూ, సభలోజరుగు

రాజకీయచర్చలు, ఆధ్యాత్మిక సాహిత్య చర్చలలో పాల్గొంటూ తండ్రి అడుగు జాడలలో నడిచేవారు. రాజసభలో జరుగు పండితసదస్సులలో ఆ పిన్న వయసులోనే పాల్గొంటూ హైందవ మతములోని వివిధ శాఖలను గురించీ, సాంప్రదాయములను గురించీ, ఆయా శాఖల అనుయాయిలతోనూ, ఆచార్యులతోను తరచుగా చర్చించుట ద్వారా, తనకుగల వైదిక ధర్మ పరిజ్ఞానము, పండితలోకమునందు బహుళవ్యాప్తి చెంది రాజు, ప్రజలు కూడా ఆయనను వైదిక విద్వాంసుడుగానూ, అధికారిక మైన ప్రామాణ్యతను సంతరించుకొనిన వారుగా గుర్తించారు.

కొంత కాలమునకు రంగరాజ దీక్షితులకు మృత్యువు ఆసన్నము అవుచున్నదని తెలుసుకొని, వేలూరు విడచి, తమ స్వగ్రామమైన అడయఫలం తరలి వెళ్ళారు. సర్వ ధర్మముల సారమును జీర్ణించుకొన్న ఆ మహాపండితుడు, తన కుటుంబ సభ్యులనందరినీ పిల్చి వారిని ఉద్దేశించి ఇలా బోధించారట : విద్యయనే ఈ మహా సముద్రములో మనం నేర్చుకున్నది బహుస్వల్పం. కాబట్టి ఎవరూ తాను విద్వాం సుడని విర్రవీగడం అవివేకం. విద్యవలన వినయము చేకూర్చుకొనవలెనే కానీ గర్వపడరాదు. మన దేహమూ, మనస్సు, ధీశక్తి వంటివి పరోపకారార్థమే కాని, స్వప్రయోజనమునకు కాదు. ఆత్మ పారిశుద్ధ్యము అవసరము. శివార్చన చేయవలెను. శివధ్యానమునకే మనస్సు సృష్టింపబడినది. శివుడే సత్యమూ, నిత్యమూ, యజ్ఞపతి విష్ణువు. వారిని నిత్యం సంతుష్టి పరచాలని ఉపదేశించి, రంగరాజ దీక్షితులవారు పరలోకవాసులైనారు.

తండ్రి మరణానంతరం చినబొమ్మనాయకుడు అప్పయ్య దీక్షితులవారిని, తండ్రి స్థానమును ఆక్రమించవలసినదిగా కోరడంతో, దీక్షితులవారు తిరిగి వేలూరు వచ్చి స్థిరపడినారు. వివాహవయస్సు రాగానే వారికి తంజావూరు ఆస్థాన విద్వాంసులైన రత్నఖేట దీక్షితులవారి కుమార్తె మంగళనాయకితో వివాహం జరిగింది. గృహస్థుడైన తరువాత ఆయన వేదోక్త విధులు నిర్వహించుటకు అర్హత లభించింది.

కాలక్రమేణ అప్పయ్య దీక్షితులవారి విద్వత్తును గురించీ, వారి వాదనా పటిమను గురించీ, అద్వైత ప్రచారమునందు వారికిగల శ్రద్ధాసక్తులను గురించీ, దేశములో విస్తృత వ్యాప్తి జరిగింది. ఉత్తర, దక్షిణ భారతమునందలి అనేక మంది విద్వాంసులు తరచుగా వారి ఇంటికి రావటం, అనేక శాస్త్ర చర్చలు జరపటం పరిపాటైంది.

దీక్షితులవారు అచంచలమైన విశ్వాసమును అద్వైత సిద్ధాంతము పట్ల కలిగి ఉన్నప్పటికీ, వారికి పూర్వ మీమాంసపట్ల కూడా అభిమానము కలిగి ఉండేవారు. ఆ కారణంగా వారు సోమయాగము, వాజపేయము, దర్శనపూర్ణ మాసాది అనేక చిన్న, పెద్ద క్రతువులను నిర్వహించారు. ఖర్చునకు, శారీరక, మానసిక శ్రమకు వారు ఎన్నడూ భయపడేవారు కాదు. శివార్చన, అద్వైత వేదాంత ప్రచారములే వారి జీవిత లక్ష్యములుగా పరిగణించుకుని, వారి జీవితము సర్వమూ ఆ కార్యక్రమ నిర్వహణలోనే గడిపినారు.

క్రీ.శ. 1585లో పదునాలుగు ఏళ్ళ వయసుగల వేంకటపతిరాయలు విజయ నగర గద్దె నెక్కాడు. పిన్నవాడైన రాజుకు సంరక్షకుడుగా అళియరామరాయలు పరిపాలన సాగించేవాడు. అతను అధికార అతిశయంతో, కేవలము వైష్ణవ మతమునే అభిమానించి, తాను వైష్ణవుడై, ఇతర శాఖలవారిని ఇబ్బందులపాలు చేసేవాడు. రాజగురువైన శ్రీ లక్ష్మణ కుమార తాతాచార్యులవారు, నలుబది సంవత్సరముల పాటు రామరాయలవంటి కర్ణాటక పరిపాలకుల ప్రోత్సాహంతో ఎవరి ప్రాతికుల్యాన్ని లక్ష్యపెట్టకుండా తీవ్రంగా వైష్ణవ ప్రచారము చేశారు. ఆ కారణంగా పదహారవ శతాబ్దములో, శైవము దాదాపుగా క్షీణదశకు చేరుకున్నది. దాని ప్రతిష్ట, ప్రాబల్యము కూడా పూర్తిగా బలహీనపడినవి. ఆనాటి సాంప్రదాయ విద్వేష పరిస్థితులను, దీక్షితుల వారు తమ "విగ్రహాష్టకం" అనే గ్రంథములో వివరించారు. శివాంశ సంభూతుడైన అప్పయ దీక్షితులవారు శైవ మతోద్ధరణకు పూనుకున్నారు. తత్ఫలితంగా రాజప్రోత్సా హము గలిగిన తాతాచార్యులవారి ద్వేషానికి గురైనారు. దీక్షితుల వారిని తనగురువుగా స్వీకరించిన వేలూరు పాలకుడు, ఈ కృషిలో దీక్షితులవారికి ప్రోత్సాహమును ఇచ్చి సహాయ సహకారములు అందించాడు. అయినప్పటికినీ దురావేశ పూరితులైన వీర వైష్ణవాభిమానులు, ఇతర శాఖలవారిని, ముఖ్యంగా శివ భక్తులను దూషించటం, అవమానించటం, చేయిచేసుకోవటం, నిత్య కృత్యములుగా ఆచరించేవారు. శివాలయ ములను కలుషితం చేయడం, శివార్చనను అవహేళనం చేయటం పరిపాటిగా మారింది.

పరిపాలకుల ప్రోత్సాహంతో జరుపుతున్న దుశ్చర్యలకు, శైవులేకాక ఇతర సంప్రదాయములకు చెందినవారు కూడా భయభ్రాంతులై, దేవాలయములకు వెళ్ళడం,

అందు జరుగు క్రతువులు, ఉత్సవములవంటి కార్యక్రమములలో పాల్గొనటం మానివేశారు. శైవుడైన తండ్రికి, శ్రీ వైష్ణవురాలైన తల్లికి జన్మించిన అప్పయ్య దీక్షితుల వంటి మహాత్మునకు వైష్ణవం పట్ల ప్రాతికూల్యత ఎందుకుంటుంది ? శైవులను, శైవాన్ని బాధించకుండా తాతా చార్యుల వారు వైష్ణవమును ప్రచారము చేసుకుంటూ ఉంటే వైష్ణవముపట్ల వ్యతిరేకత వారికి ఏర్పడేదే కాదు. శివ, వైష్ణవ మత విద్వేషము అప్పయ్య దీక్షితుల వారికి ఎంత మనః క్లేశము కలిగించిందో ఈ క్రింది శ్లోకము ద్వారా అవగతమౌతుంది.

**శ్లో॥ విష్ణుర్వాశంకరో వాశృతి శిఖరి గిరామస్తు తాత్పర్య భూమిః ।**
**నాస్మాకం తంత్తవాదః ప్రసరతికి మపి స్పష్టమద్వైత భాజామ్ ।**
**కీంత్వీశద్వేషగాఢానలకలి తహృదాం దుర్మతీనాం దురుక్తిః ।**
**భంక్తుం యత్నోమమాయం నహిభవతుతో విష్ణు విద్వేషశంకా ॥**

వేదాలకూ, వేదాంత సారమునకూ కొందరు శివుడు మూలమనీ, మరికొందరు విష్ణువనీ నిర్ణయించుకుంటే వారితో నాకెట్టి వైరమూ ఉండదు. కారణం నేనద్వైతిని. నాకు శివ, విష్ణు బేధం లేదు. కానీ విష్ణువు ఔన్నత్యమును ప్రచారము చేసుకొనుటకై శివుని నిందిస్తే నేను సహించలేను. వేద వేదాంగములలో, పురాణములలో, శివుడే ప్రధాన మని తెల్పేటటువంటి ప్రమాణములు అనేకమున్నవి. ఆ విధంగానే విష్ణు ప్రాధాన్యతను తెలియజేసే ప్రమాణములూ ఉన్నవి. నేను మాత్రం నా ధర్మాన్ని (అద్వైతమును) ప్రచారం చేసుకుంటున్నాను. శివుని ద్వేషించరాదని వాదిస్తున్నాను. నేను శివుని ప్రశంసిస్తున్నా నంటే విష్ణువును దూషిస్తున్నట్లుగా భావించగూడదని తెలియజేస్తున్నాను. అని ఆయన తనకు శివునిపట్ల, విష్ణువుపట్లగల సమాన భక్తి భావనను స్పష్టంగా తెలియ జేశారు. అయినప్పటికీ కొందరు దుర్బుద్ధులు ఆయనను కూడా దూషించటం, అవమానించటం జరిపేవారు. ఆ అవమానాలకు ఎంతో మానసిక క్లేశము చెందారు. నిజంగా దీక్షితుల వారికి ఇతర సాంప్రదాయముల పట్లగల గౌరవము, అభిమానము అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ ఆయనను వ్యక్తిగతంగా అవమానించవలననే పట్టుదల కొందరు వైష్ణవ స్వాములను ప్రేరేపించింది. దీక్షితులవారు రచించిన 'వరదరాజస్తవం' ఆయనకు గల విష్ణుభక్తికి తార్కాణం. 'రత్నత్రయ పరీక్ష' అనే మరో గ్రంథంలో తనకు ఏ దేవుని పట్ల ప్రత్యేక

అభిమానమూ లేదనీ, అందరూ ఒకటేననీ, సమాన శక్తి మంతులనీ చెప్పారు. ఈ వివరణలేవీ సాంప్రదాయ దురభిమానులను శాంతింప జేయలేకపోయినై. వీటినన్నిటినీ గమనించి, దురాగతములను సహించలేని శైవులు, అద్వైతులు అప్పయ్య దీక్షితులవారిని, ఈ వీర వైష్ణోద్యమమును ప్రతిఘటిస్తూ ఉద్యమమును నడుపవలసినదిగా ప్రాథేయపడ్డారు. అయినప్పటికీ అప్పయ్య దీక్షితులవారు ప్రతిఘటన ఉద్యమమును గాక, శివకేశవులు సమానులే అనే అద్వైత సిద్ధాంత ప్రచారమును చేపట్టి, ప్రజలలో పెరుగుతున్న విద్వేష భావనలను రూపుమాపి, అన్ని సంప్రదాయములపట్ల సమ భావనతో ప్రవర్తించ వలెనని, సామాన్య ప్రజలను ఉద్బోధించి ప్రచారము సాగించారు. అన్ని మతములు, శాఖలు, సంప్రదాయములూ, భక్తులను ఒకే గమ్య స్థానమునకు చేర్చగలవనీ, ఆ గమ్యమే సత్యము, నిత్యము, ఆనందమనీ, ఆ సచ్చిదానందమునే వేదాంతులు తల ఒక పేరుతో పిలుస్తారనీ విశదీకరించారు. శైవులపట్ల ఇతర సాంప్రదాయికుల పట్ల జరుపుతున్న దుశ్చర్యలను ఖండించారు. ఈ విధంగా సర్వమత సమానత్వమును ప్రచారము జరిగిన కొంత కాలమునకు సమాజములో విద్వేషాగ్నులు చల్లారినవి.

అనంతరము అప్పయ్య దీక్షితుల వారు అద్వైత వేదాంత వ్యాప్తికి మత, సాహిత్య పరమైన అనేక రచనలను చేపట్టారు. శైవముపై అనేక గ్రంథాలు రచించారు. ఈ రచనాకాలంలో దీక్షితులవారు తీర్థయాత్రలు చేస్తూ, తమిళ దేశమంతా పర్యటించారు. ఆయన తీర్థయాత్రల గురించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నై. ఆయన తీర్థయాత్రను పాలారునది, (క్షీరతరంగిణి) ఒడ్డున వున్న వేలూరు నుండి ప్రారంభించారట. అచట నుండి పినాకిని అని పిలువబడే దక్షిణ పెన్నలో స్నానంచేసి, ఆ మీదట పుండరీకపురం లేక తిల్లై లేక చిదంబర మహాక్షేత్రమును చేరుకున్నారు. ఆ క్షేత్రంలో కొలువైయున్న నటరాజ స్వామిని, గోవిందరాజ స్వాములను దర్శనం చేసుకొని వారికిగల హరి హరాద్వైత భక్తిని చాటుకున్నారు. అచటి నుండి చోళ మండలమునందలి కావేరీనదీ పరీవాహక ప్రాంతమునందునూ, పాండ్య సీమ యందును, మధుర, తిరుచిరపల్లి, శ్రీరంగక్షేత్రమును, తిరుపతి, చెన్నపట్నమునకు సమీపమునగల వడశ్రేణి (వేలచ్చేరి) సందర్శించి, ఆయా క్షేత్రములయందు ప్రతిష్ఠింపబడిన శైవ, వైష్ణవ దేవుళ్ళను, దేవతలను అర్చించారు.

అప్పయ్య దీక్షితులవారు వారణాశి వెళ్ళినట్లూ, అక్కడ జగన్నాథ పండిత రాయలతో, గంగాతీరమున శాస్త్రచర్చ జరిగినట్లు కొందరు పండితులు అభిప్రాయ పడగా, మరి కొందరు వారు సమకాలీనులే కాదన్నారు. ఇంకొందరు ఉభయ తారకంగా వారు సమ కాలీనులు అయినప్పటికీ దీక్షితులవారు, శిష్యులైన భట్టోజి దీక్షితులు జగన్నాథ పండిత రాయల వారికంటే వయస్సులో పెద్దవారై ఉంటారనీ, జగన్నాథుల వారు మొగలాయీల (షాజహాన్) కొలువులో జీవించటం, తురుష్క కన్యలతో సంపర్కము కలిగియుండటం సహించలేక, జగన్నాథులను అభిశంసించి ఉంటారని తెలియజేశారు.

అప్పయ్య దీక్షితులవారు తమ పర్యటనలో అద్వైత సిద్ధాంత ప్రాముఖ్యతను గురించీ, శివార్చనా వైశిష్ట్యమును గురించీ ప్రచారము చేసేవారు. తమ తీర్థ యాత్ర లలో చివరిమజిలీగా, చిదంబరము చేరారు. ఆప్రదేశముయొక్క పవిత్రతకూ, శివుడు నటరాజుగా ప్రతిష్ఠింపబడి, పూజలను అందుకుంటున్న ఆ దేవాలయపు గాంభీర్య తకూ, సౌందర్యమునకు ముగ్ధులై, ఆ పవిత్ర ప్రదేశములోనే కనకసభాపతియనే నామంతో కూడా అర్చింపబడుతున్న శివుని సేవిస్తూ, తన చివరి రోజులను గడప వలెనని నిర్ణయించుకున్నారు. డెబ్బదిఏండ్లు పైబడిన వయస్సు. ఒకరోజున తన తమ్ముడైన ఆచాన్ దీక్షితులవారి మనుమడు నీలకంఠ దీక్షితులు, కొంతమంది శిష్యు లను వెంటబెట్టుకొని, అప్పయ్య దీక్షితుల వారి వద్దకువచ్చి ఆధ్యాత్మిక ప్రవచనము చేయవలసినదిగా కోరినారట. వారి కోరికను మన్నించిన దీక్షితులవారు ప్రసంగిస్తూ ఉండగా, నటరాజస్వామివారి పాదపద్మములు ఆయనకు గోచరించినవట. అప్పయ్య దీక్షితులవారు తాము దర్శించిన దివ్య దృశ్యమును ఈ క్రింది శ్లోక రూపంలో వర్ణించినారు.

**శ్లో॥ ఆభాతిహాటక సభానట పాదపద్మ ।**
**జ్యోతిర్మయో మానసిమే తరుణారుణోఽ యమ్ ॥**

'సూర్యుడు ఉదయిస్తున్నట్లు కనకసభాపతియైన నటరాజస్వామి పాదపద్మములు నాకు సాక్షాత్కరిస్తున్నవి' అని తాత్పర్యం. శ్లోకమునందలి రెండు పాదములను మాత్రమే చదివి అప్పయ్య దీక్షితులవారు శాశ్వత సమాధిగ్రస్తులైనారు. ఈ సన్నివేశ మును గమనిస్తున్న నీలకంఠ దీక్షితులు, మిగిలిన రెండు పాదములను చదివి శ్లోకమును ఈ విధంగా పూర్తిచేశారు.

**శ్లో॥ నూనం జరామరణ ఘోర పిశాచికీర్ణా**
**సంసార మోహరజనీ విరతిం ప్రయాతా ॥**

సూర్యోదయమైనది. జనన, మరణ దుఃఖ రోగాది పైశాచిక శక్తులు ఆవరించిన ఈ చీకటి నశించిపోవడం తథ్యం.

పై సన్నివేశం దీక్షితులవారి గృహంలో జరుగుతుండగా, నటరాజస్వామివారి దేవాలయములోని అర్చకులు ఇతర భక్తులు, మరొక దృశ్యమును చూశారు. అప్పయ్య దీక్షితులవారు ఆలయ ప్రవేశం చేయటం గమనించిన అర్చకులు స్వామి పూజకుగాను, దీక్షితుల వారికి కావలసిన సంభారములు త్వరత్వరగా సమకూర్చసాగారు. అప్పయ్య దీక్షితులవారు అక్కడి పంచాక్షరీ సోపానముల నధిరోహించి, నటరాజస్వామి విగ్రహంలో, అందరూ గమనిస్తూ ఉండగానే లీనమైపోయారు.

శ్రీ దీక్షిత వంశాభరణ రచయిత అప్పయ్య దీక్షితులవారి వంశస్థుడైన శ్రీ మన్నార్గుడి రాజాశాస్త్రి ఈ మహత్తర సన్నివేశమును వర్ణిస్తూ, ఆత్మార్పణ స్తుతిలో అప్పయ్య దీక్షితులవారు నటరాజస్వామికి చేసుకున్న విజ్ఞప్తిని ఈ విధంగా వర్ణించారు.

**శ్లో ॥ సర్వం క్షేప్నం ప్రభవతి జనః సంపృతి ప్రాప్త మార్గః ।**
**చేతః శ్వాస ప్రశమ సమయే త్వత్పదాబ్జే విధాయ**
**అంతస్తే దైరవధి రహితమూర్తి మాపద్యమానోపి**
**అంఘ్రిద్వం దేతపని విశతారం తరాత్మా మమాత్మా ॥**

ప్రాణ ప్రయాణ కాలములో నీ పాదపద్మములను సాన్నిధ్యాన్నిస్తే సర్వపాపములూ నశిస్తవి. నేను చనిపోయేటప్పుడు, ఎంతబాధలో ఉన్నా ఓ పరమేశ్వరా ! నా అంతరాత్మ సదా నీ పాదపద్మ ధ్యానంలోనే నిశ్చలంగా ఉండేటట్లు నన్నునుగ్రహించు.

ఇదే అప్పయ్యదీక్షితులవారి చివరి కోరిక. ఆప్రకారమే ఆ స్వామి అనుగ్రహించాడు.

అప్పయ్య దీక్షితులవారు ఆధ్యాత్మిక చింతనాపరంగా నికార్సైన అద్వైతులు. అయినప్పటికినీ, వారేనాడూ ఇతర మతములపట్ల, శాఖలపట్ల, సంప్రదాయములపట్ల నిరసన భావమును ప్రకటించలేదు. ఇతర ఆచార్యుల వాదనలనుగానీ, వారి భావము

లను గానీ, ఖండించలేదు, త్రోసిపుచ్చలేదు. 'న సూత్రం అర్థాంతర మపి భవద్వర్య ముచితం' అని వారు చతుర్మతసార సంగ్రహములో తెలియజేశారు. అనేక శాఖలకు, సాంప్రదాయములకు చెందిన కల్పసూత్రములు, అనేక విధములైన వ్యాఖ్యలకు స్థానం కల్పిస్తుండగా, వాటిలోని అంతర్విభేదాలను తొలగించి ఏకాభిప్రాయమును వ్యక్తం చేయటం సాధ్యంకాని పని అని ఆయనే చెప్పుకున్నారు. మత విషయములో అత్యంత సహనం పాటించవలెననీ, వివిధ తాత్విక ఆలోచనలను సహనంతో పరిశీ లించి, సమన్వయము చేసుకోవాలనే తన అభిమతమును తెలిపారు.

అప్పయ్య దీక్షితులవారు అద్వైతమును తన తండ్రి తాతలు అనుసరించినారు కాబట్టి తానూ అనుసరించవలెననెడి తలంపుతోకాక, ఆయన త్రికరణశుద్ధిగా ఆ సిద్ధాంతమును విశ్వసించారు. వేదములు, వేదాంగములు, ఆదిగా గల వైదిక, ఆధ్యా త్మిక గ్రంథముల అధ్యయనానంతరం ఆయన అద్వైతసిద్ధాంతమున ప్రక్షిప్తమైయున్న వ్యావహారిక సత్తను పూర్తిగా జీర్ణించుకున్నారు. ఇతర సిద్ధాంతములను కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆదిశంకరులైనా, శ్రీకంఠాచార్యులైనా, ద్వైతవిశిష్టా ద్వైత ఆచార్యులైన మధ్వాచార్యులు, రామానుజుల వారైనా అనుగ్రహించిన మతాలన్నీ కూడా, పరమేశ్వరుని అర్చననూ, ప్రగాఢభక్తినీ అలవరచుకుని, పాటించుట ద్వారా ఆ సగుణ బ్రహ్మయొక్క అనుగ్రహమును పొందగలుగుతారని బోధించారు. మధ్వాచార్యులవారిని ఆనందతీర్థయనీ, రామానుజుల వారిని 'ఆర్య'యనీ, శ్రీకంఠు లను 'ఆచార్య'యనీ, శంకర భగవద్పాదులను పేరు మినహాయించి ఆచార్యులని ఎంతో గౌరవభావంతో, భక్తి ప్రపత్తులతో పేర్కొన్నారు. ఆనంద తీర్థులవలే ఆలోచించి, రామానుజులు చూపిన భక్తి మార్గమునకుచేరి, శ్రీకంఠుడు చూపిన మెట్లెక్కి, చివరకు ఆత్మజ్ఞాన లబ్ధికి, ఆదిశంకరులు వ్రాసిన వ్యాసప్రోక్త బ్రహ్మసూత్ర భాష్యమును అధ్య యనము చేస్తాననీ, ఆదిశంకరుల యొక్క భాష్యమే అద్వైత సిద్ధాంతమనీ అప్పయ దీక్షితులవారి ప్రగాఢ విశ్వాసమును వెలిబుచ్చారు. ఆచార్యులపట్ల, వారి సాంప్ర దాయములపట్ల అత్యంత గౌరవమును వెలిబుచ్చేవారు. ఈ మార్గాలన్నీ 'సరిదివసకలా ఆనందసింధో" అన్నట్లు అన్ని మార్గములూ ఆ ఆనంద సముద్రమునకే చేరుస్తాయి అని నమ్మిన మహాపురుషులు అప్పయ్య దీక్షితుల వారు. తన కాలములో అద్వైత సిద్ధాంతములో అనేక విభేదాలు ఏర్పడినవనీ, వాటి అనుయాయులు, సిద్ధాంతముల

కంటే అందలి విభేదాలకు ప్రాముఖ్యతను ఆపాదించి ప్రచారంచేసేవారని వాపో యారు. పదహారవ శతాబ్ద ప్రారంభంలో ఇటువంటి అనేక వాదములు ప్రచారములో ఉండేవి. అప్పయ్య దీక్షితులవారు అద్వైతములోని అల్ప వ్యత్యాసములకు, వాటిపై జరుపుతున్న రాద్ధాంతములను వివరించి, తెలియజేయుటకుగాను 'సిద్ధాంతలేశ సంగ్రహ'మనే గ్రంథ రచన చేయటం జరిగింది. అద్వైతంలో ప్రధానమైన రెండు విచార వాహినులు కనుపిస్తవి. ఒకటి వాచస్పతి మిశ్ర వ్రాసిన 'భామతీ ప్రస్థానం', రెండవది పద్మపాదుడు, ప్రకాశత్మ ప్రబోధించిన 'వివరణ ప్రస్థానం'. మొదటి ప్రస్థా నంలో ముఖ్యమైనవి రెండువాదములు. 'నానాజీవవాదం' 'అవచ్ఛేద వాదం'. మరో ప్రస్థానంలో ముఖ్యమైనవి 'ఏకజీవవాదం', 'బింబ ప్రతిబింబవాదం' నానాజీవ వాదం ప్రకారం జీవులలోని అవిద్యా వైవిధ్యములను బట్టి వారికి నానాత్వం వస్తుంది. అవచ్ఛేద వాదమంటే జీవుని అజ్ఞానమును బట్టి జీవేశ్వరుల సంబంధం నెల కొంటుంది. ఏక జీవవాద ప్రకారం బ్రహ్మమునందే అవిద్య ఉన్నది. దానికి మూలము బ్రహ్మమే. ఈ ప్రపంచమంతా జీవుని ఊహా స్వప్నమైన చిత్రపటం. బింబ, ప్రతిబింబ వాదం ప్రకారం జీవుడు కానీ, జీవులు కానీ, అన్నీ శుద్ధ చైతన్యమైన బ్రహ్మ పదార్థము నకూ, ఈశ్వరునికీ ప్రతిబింబాలే. శంకరులనుండి, అప్పయ్య దీక్షితుల వారి వరకూ, అద్వైత పరిణామ దశలను వివరిస్తూ, వారు అనేక రచయితల గ్రంథములను పేర్కొంటూ తన 'సిద్ధాంత లేశ సంగ్రహము'లో చక్కగా విశదీకరించారు. అప్పయ్య దీక్షితుల వారు తమ అద్వైత వేదాంత ప్రచారంలో భాగంగా, వివిధ వాదాసక్తుల మధ్య సమన్వయ మార్గం చూపడానికి చాలా కృషి చేశారు. మతం మార్పిడిలు, దేవాలయ విధ్వంసములు, ప్రజల ధన, మాన, ప్రాణాదులకు రక్షణలేని ఆ అంధకార యుగంలో, శైవ, వైష్ణవ బేధములతో సమాజము అట్టుడికిపోవడం మూర్ఖత్వ మని, పరస్పర ద్వేషమూ, సంకుచిత భావములనూ వదలి, సమన్వయంతో, సామరస్యంగా జీవించాలని బోధిస్తూ, వాటి సాధనకు అప్పయ్యదీక్షితులవారు, వార్ధక్యాన్ని కూడా లక్ష్య పెట్టకుండా నిర్విరామ కృషిచేసి చరితార్థులైనారు.

అప్పయ్య దీక్షితులవారికి 'చతురధిక శత ప్రబంధ నిర్వాహక' అనే బిరుదుండేది. అంటే వారు 104 గ్రంథములు రచించిన ప్రజ్ఞాశీలి. ఈ విషయం అడయపళంలో గల ఒక శాసనంలోనూ, నీలకంఠ దీక్షితుల వారి కావ్యంలోనూ, మధ్వాచార్యుడైన

విజయేంద్ర బిక్షు జీవితకథలోనూ ద్యోత్యకమౌతుంది. ఈ గ్రంథములలో కొన్ని ఆలోచనోద్దీపకములు, మరికొన్ని సంప్రదాయ సిద్ధాంతములపై వ్యాఖ్యలు, స్తుతుల వంటి లఘు గ్రంథములు. ముందు తెలియజేసినట్లు సిద్ధాంతమేదైనా గమ్య మొక్క టేనని పదేపదే తన గ్రంథములలోనూ, ప్రసంగములలోనూ ప్రవచించుటవల్ల, ఒక స్థితిలో ఆయన ఏ మతమునకు చెందిన వాడనే శంక పాఠకులకు కలుగవచ్చు. అప్పయ్య దీక్షితులవారు రచించిన పెద్ద గ్రంథములను అధ్యయనంచేసి అవగతము చేసుకోవాలంటే సుదీర్ఘకాలం పడుతుంది. చిన్న రచనలను బాలురు సులభంగా చదువు కొని అర్థం చేసుకొనవచ్చు. ఆయన స్తోత్రములు, నిత్యపారాయణకు యోగ్యములు.

దీక్షితులవారి రచనల సంఖ్య ఎక్కువైనప్పటికీ, చాలాభాగం స్తోత్రములు, వ్యాఖ్యలే కానీ, స్వతంత్ర రచనలు కావని కొందరి విమర్శ. అయితే రచయిత గొప్పదనాన్ని రచనల సంఖ్యను బట్టి తేల్చడం భావ్యంకాదు. వాటియందలి విషయము, భాష, శైలి, భావ గాంభీర్యతలను బట్టి నిర్ణయించవలసి ఉంటుంది. ప్రాచ్య పాశ్చాత్య దేశాలన్నిటిలోనూ చేయబడ్డ రచనలు, పూర్వ గ్రంథముల ఆధారముగా చేయబడినవే, వాటిని స్వతంత్ర రచనలుకావని ఆక్షేపించుట తగనిపని. ముఖ్యంగా భారతీయ రచనలు, శ్రుతులు, స్మృతులు, పురాణములు ఆదిగాగల వైదిక సాహిత్యమును మూలముగా తీసుకొని రచింపబడినవే. కాబట్టి అప్పయ్య దీక్షితులవారి ప్రజ్ఞా పాటవములను పరీక్షచేయదలచుకొన్నవారు, ఈ సత్యమును గుర్తించడం ఉచితం. వాంఛనీయం. వారు వ్రాసిన 104 గ్రంథములలో లభ్యం కానివికూడా కొన్ని ఉన్నవి. పై సంఖ్యలో 60 గ్రంథములు ప్రసిద్ధములు. మిగిలిన 44 రచనలు లఘువులు. వారి ప్రసిద్ధ రచనలను స్థూలంగా పరిశీలిద్దాం.

**1. సిద్ధాంతలేశ సంగ్రహము :**

ఇది పెద్ద గ్రంథము. దీక్షితులవారి స్వతంత్ర రచన. అద్వైతముపై చేసిన విభిన్న భావనలను, నిర్వచనములను, వివరణలను, సంకలనము చేయబడిన గ్రంథము.

**2. న్యాయ రక్షామణి :**

ఇది కూడా స్వతంత్ర గ్రంథమే. బ్రహ్మ సూత్రముల ప్రథమ పాదముపై వివరణ ఇచ్చిన విస్తృత వ్యాఖ్యాన గ్రంథం.

**3. కల్పతరుపరిమళ :**

బాదరాయణ బ్రహ్మ సూత్రములపై ఆదిశంకరులు భాష్యం వ్రాశారు. దానిపై వాచస్పతి మిశ్ర 'భామతి'అనే సుప్రసిద్ధ వ్యాఖ్యానం వ్రాశారు. భామతిపై అమలా నందుడనే అద్వైతాచార్యుడు అతికఠినమైన భాషలో (సులభగ్రాహ్యం కాని) 'కల్పతరు' అనే పేరుగల వ్యాఖ్యానము రచించారు. కల్పతరుపై సుబోధకమైన వ్యాఖ్యను 'పరిమళ' అనే పేరుతో అప్పయ్య దీక్షితులువారు వ్రాయటం జరిగింది.

ఈ గ్రంథముపై అనేకమైన గాథలు, అనేక అద్వైతాచార్యుల ప్రశంసలూ ప్రచార ములో ఉన్నవి. గ్రంథ విస్తరణ భయంతో వాటిని ప్రస్తావించుట లేదు.

**4, 5. మధ్వ తంత్రముఖమర్దనం దానిపై వ్యాఖ్యానం - మధ్వ మత విధ్వంసనం :**

పై రెండు గ్రంథములు మధ్వమతమును ఖండించుటకు వ్రాసిన మూల గ్రంథము దానిపై వ్యాఖ్యానము. అద్వైత విద్యా సదస్సులలో పాల్గొను వారి నైపుణిని పరీక్షించ డానికి ఉపయోగించబడుతున్న గ్రంథములు. ఉత్తర, దక్షిణ భారతములలో ప్రచార ములో నున్న గ్రంథములు.

**6. పూర్వోత్తర మీమాంసవాద నక్షత్రమాల (నక్షత్ర వాదావళి) :**

పూర్వమీమాంస, ఉత్తర మీమాంసలకు చెందిన సమస్యలపై ప్రశ్నోత్తర రూప ములో రచించిన వివరణ గ్రంథము

**7, 8, 9, 10. చతుర్మతసార సంగ్రహము లేక అధికరణ సార సంగ్రహము :**

చిన బొమ్మనాయకుని కాలంలో రచింపబడిన ఈ గ్రంథంలో ద్వైత, విశిష్టాద్వైత, శివాద్వైత, అద్వైత అనే నాలుగు మతముల (శాఖలు లేక సాంప్రదాయములు) యొక్క సారము నిక్షిప్తమై ఉన్నది. బ్రహ్మ సూత్రములపై, అధికరణ క్రమంలో గద్య పద్యాత్మకంగా భాష్యము వ్రాయబడినది. ఆయా మతాచార్యులు వ్రాసిన వ్యాఖ్యాన ములను బట్టి, ఆయా వేదాంతముల యొక్క సరళిని, అప్పయ్య దీక్షితులవారు ఈ గ్రంథములో విశదీకరించారు. ఈ గ్రంథములోని నాలుగు విభాగములకు, ఒక్కొక్క దానికీ ఒక్కొక్క పేరు పెట్టారు. ద్వైతవిభాగము (మధ్వమతము) 'న్యాయముక్తావళి' యనీ; విశిష్టాద్వైతమునకు (శ్రీ వైష్ణవ సిద్ధాంతము) 'నయమయూఖ మౌలిక' యనీ; శివాద్వైతము (శ్రీ కంఠుని ప్రవర్తిత మతము) 'నయన మణిమాల'యనీ;

నాలుగవవిభాగమైన అద్వైతమునకు (ఆదిశంకరాద్వైతం) 'నయ మంజరి' యని పేర్లు పెట్టారు.

**11, 12. రామానుజ శృంగ భంగం, తత్వముద్రా నిద్రావణం :**

ఈ రెండు గ్రంథములు రామానుజ, మాధ్వమతముల ఖండన గ్రంథములు. ఇవి ప్రచురణ పొందిన దాఖలాలు లేవు.

దీక్షితులవారి రచనలుగా ప్రచారములోనున్న ఇతర వేదాంత గ్రంథములు.

13. రామాయణ తాత్పర్య సంగ్రహం; 14. దానిపై వ్యాఖ్య; 15. శ్రీ విద్యాతత్త్వ వివరణం; 16. అధికరణమాల; 17. అధికరణ సారావళి; 18. తత్త్వముక్తావళి; 19.న్యాయ రత్నమాల; 20. దానిపై వ్యాఖ్య; 21. మతసారార్ధ సంగ్రహం; 22. సిద్ధాంత రత్నాకరం; 23. మణిమాలిక; 24. న్యాయముక్తావళి వ్యాఖ్య; 25. అధికరణ పంచిక.

**27. శిఖరిణీ మాల : దానిపై వ్యాఖ్యానం శివతత్త్వ వివేకం :**

ఈ గ్రంథములు, ఇతర శైవసిద్ధాంత గ్రంథములూ శ్రీకంఠుని శివాద్వైత ప్రచారము నకు కూర్చబడినవి.

**28, 29, 30, 31. రామాయణ తాత్పర్య సంగ్రహం భారత తాత్పర్య సంగ్రహము వాటిపై వ్యాఖ్యానములు :**

పై నాలుగు గ్రంథములు రామాయణ, మహాభారతముల యందలి అంతర్గూఢార్థములను విశదీకరిస్తూ వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథములు, పై ఇతిహాసములు రెండూ శివ పరమైనవనీ, శివా ఔన్నత్యమును ప్రతిష్ఠించు రచనలనీ దీక్షితులవారు వ్యాఖ్యానించారు.

**32, 33. బ్రహ్మతర్కస్తవము, దానిపై వ్యాఖ్య :**

శివునీ, శివార్చననూ హేళన చేయువారి వాదనలకు, గ్రంథపరమైన జవాబులను దీక్షితులవారు ఈ గ్రంథములో తెలియజేశారు.

**34. శివధ్యాన పద్ధతి :** శివుని మానసికంగా అర్చించేవిధానమునకు వివరణాత్మక గ్రంథం.

**35. శివ పూజావిధి :** శివపూజను నిర్వర్తించే విధానము తెలియజేయబడినది.

**36. శివార్చన చంద్రిక :** ఇదికూడా శివార్చనకు సంబంధించిన గ్రంథమే, సవాఖ్యానముగా నున్నది.

**37. శివకర్ణామృతం :**

శ్రీకృష్ణ కర్ణామృతంవలే ఈ గ్రంథము శివ ప్రాధాన్యతనూ, ప్రాశస్త్యాన్ని ప్రతిష్ఠించడానికి రచింపబడినది.

**38. శివార్కమణిదీపిక :**

బ్రహ్మ సూత్రములపై శివాద్వైతుడైన శ్రీకంఠుని వ్యాఖ్యానముపై విస్తృతమైన వ్యాఖ్యాన గ్రంథము. అప్పయ్య దీక్షితులవారు తాను అద్వైతినని ప్రచారము చేసుకున్నప్పటికీ, వారు శివా విశిష్టాద్వైతము వైపు మొగ్గచూపారు. ఆ సాంప్రదాయమునకు చెందిన ఆచార్యులు దీక్షితులవారిని తమ ఆచార్యులుగా చెప్పుకుంటారు. దీక్షితులవారికి ఒసంగిన బిరుదులు 'శ్రీకంఠ ప్రతిష్ఠాపనాచార్య'; 'ద్వితీయ శంకర'; 'అద్వైత స్థాపనాచార్య' వారి అసాధారణ వ్యక్తిత్వమును తెలియజేస్తాయి.

**39. శివాద్వైత నిర్ణయం :**

ఈ లఘు రచనలో శివాద్వైతాన్ని సరళంగా వివరించారు.

**40, 41. ఆనంద లహరి చంద్రిక :** శ్రీకంఠ భాష్యానికి సరల వివరణ 'చంద్రిక'. ఆ గ్రంథముపై సుబోధకమైన వ్యాఖ్యానము.

**42. భస్మవాదావళి :** శైవుల విభూతిధారణ యందుగల ప్రాశస్త్యము వివరించబడినది.

**43, 44. రత్నత్రయ పరీక్ష :** లఘు గ్రంథం పురాణ ప్రమాణములతో శివుడే పరబ్రహ్మమనీ, శివుని శక్తియే పార్వతియనీ, ఆమె పురుష రూపమే నారాయణుడనీ, హరిహర అంబికలనే మూడు మూర్తులు బ్రహ్మతత్త్వానికి ప్రతీకలు కాబట్టి, ఎవరు గొప్ప అనే వివాదమునకు ఆస్కారము లేదనీ వివరించారు.

**45. శివ మహిమ కాలికా స్తుతి :** ఇది 24 శ్లోకములతో కూడిన శివ స్తుతి. శ్లేషాలంకారమును ఉపయోగించి, దీక్షితులవారు, దీనికి పూర్వ మీమాంస అర్థమును కూడా సంతరించారు.

**46, 47. పంచరత్న స్తుతి :**

ఇవి లఘు స్తోత్రములు. వాటిపై వ్యాఖ్య. అప్పయ్య దీక్షితులవారి రచనలుగా ప్రచారమందున్న మరికొన్ని శివాద్వైత సంబంధిత గ్రంథములు :

48. వీరశైవం; 49. శివాధ్యాన పద్ధతి, వ్యాఖ్యానం; 50. శివపురాణ తామసత్వ ఖండనం.

**51. శైవకల్పద్రుమం :**

అప్పయ్య దీక్షితులవారు పూర్వ మీమాంసా దర్శనముపై వ్రాసిన గ్రంథములు.

**52, 53. విధి రసాయనం; సుఖోపయోజని :**

మీమాంస శాస్త్రమున పేర్కొనబడు మూడు విధులపై రచించిన గ్రంథమే విధి రసాయనం. దానిపై వ్రాసిన వ్యాఖ్య సుఖోపయోజని. అప్పయ్య దీక్షితులవారు జీవించి ఉండగానే ఉత్తర భారతీయుడూ, మీమాంసశాస్త్ర పండితుడు ఖండదేవ, ఈ గ్రంథములకు విస్తృత ప్రచారము ఇచ్చుటయే గాక అప్పయ్య దీక్షితులవారిని 'మీమాంసక మూర్ధన్య' అని వర్ణించారు.

**54. ఉపక్రమ పరాక్రమం :**

ఉపక్రమము, ఉపసంహారమనే రెండు పదములు వేదాంత శాస్త్రములయందు ఉపయోగించు పారిభాషిక పదములు. ఈ గ్రంథములో మీమాంస శాస్త్రమందలి ఉపక్రమ న్యాయమును వివరించారు.

**55. చిత్రపటం :** ఇది కూడా పూర్వ మీమాంసకు సంబంధించిన గ్రంథమే.

**56. మయూఖావళి :**

పార్థసారథి మిశ్ర వ్రాసిన 'శాస్త్ర దీపిక' పై వ్యాఖ్యానం. ఈ క్రింది గ్రంథములు కూడా దీక్షితులవారి రచనలేయని ప్రతీతి.

57. తాంత్రిక మీమాంస; 58. ధర్మ మీమాంస పరిభాష;

**59. పాణినీయ తంత్రవాద నక్షత్రమాల :**

ఇది వ్యాకరణ గ్రంథం. దీనిలో 27 వ్యాకరణ ప్రశ్నలకు సమాధానములు ఇవ్వబడినవి.

**కావ్యములపై అప్పయ్య దీక్షితుల వారి వ్యాఖ్యాన రచనలు :**

**60. యాదవాభ్యుదయ వ్యాఖ్యానం :**

వైష్ణవాచార్య ప్రముఖులైన వేదాంతదేశికుల వారి యాదవాభ్యుదయ మహా కావ్యమునకు దీక్షితులవారి వ్యాఖ్యానం. ఇది వారి ఖ్యాతిని ఇనుమడింపజేసిన గ్రంథ రాజము.

**అలంకార శాస్త్ర సంబంధిత గ్రంథములు**

**61. కువలయానందం :** అలంకార శాస్త్రంలో అర్థాలంకారములను విశదపరచే ప్రామాణిక గ్రంథం.

**62. చిత్ర మీమాంస :** ముఖ్యమైన అర్థాలంకారముల లక్షణములకు సోదాహరణంగా, సమగ్రమైన వివరణలు ఈయబడిన గ్రంథము. దీనిని ఆధారంగా చేసుకొనే జగన్నాథ పండితరాయలు రసగంగాధరం రచించినట్లు ప్రతీతి.

**63. వృత్తి వార్తికం :**

ఇది లఘు రచన. అలంకార శాస్త్రమునందు వర్ణించిన అభిద, లక్షణ, వ్యంజన, ప్రభృత, వృత్తులపై వివరణ.

**స్తోత్ర కావ్యములు :**

**64, 65. వరదరాజ స్తుతి :** శివకేశవుల భేదమునకు అతీతమైన స్తవము.

**66. ఆత్మార్పణ స్తుతి :** వరదరాజ స్తోత్రంలో దీక్షితుల వారు తమ వర్ణనా చాతుర్య మును ప్రదర్శించి, ఈ స్తుతి కావ్యంలో తమ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రదర్శించారు. హృదయమును ఆర్ద్రీకరింపచేయు స్తోత్రము.

**67. అపీతకుంచా బాస్తవం :** అరుణగిరి నాధుని దర్శనార్థమై తిరువణ్ణామలైకు వెళ్ళిన దీక్షితులవారు జ్వరపీడితులైనారు. ఆ వ్యాధినుండి తన్ను విముక్తుని చేయవలసినదిగా ఆ క్షేత్ర దేవతయైన అపీతకుచాంబను ప్రార్థించారు. ఆ స్తుతియే ఈ గ్రంథం.

**68. మానసోల్లాసం :** ఇది కూడా ఒక లఘు కృతి. తనకు వైరాగ్యప్రాప్తి కలుగజేయ వలసినదని, పశుపతిని సేవించుట ద్వారా జన్మ రాహిత్యమును పొందవలసినదని ప్రబోధించారు.

**70. హరిహర స్తుతి :** చిదంబరమునందలి గోవిందరాజస్వామి వారి దేవాలయమును, తిరిగి తెరచిన సందర్భమును పురస్కరించుకొని, తమకు శివకేశవుల భేదంలేదని ప్రకటించుకుంటూ చేసిన స్తుతి.

**71, 72. దుర్గా చంద్రకళా స్తుతి :**

దానిపై వ్యాఖ్యానం పదిహేను శ్లోకములలో రచింపబడిన దుర్గాస్తుతి. ఒక మంత్రం వంటిది. వర్తమాన, భవిష్యత్ కాలములో కలిగే అన్ని పీడలనుండీ కాపాడి శాంతి, సౌభాగ్యప్రదమైన జీవితమును అనుగ్రహించమని చేయు ప్రార్థన.

**73, 74. ఆదిత్య స్తోత్ర రత్నం-వ్యాఖ్యానం :** ఇది ఆదిత్య స్తుతి. సూర్యోపాసనా పద్ధతి. సూర్య కిరణముల ఉత్కృష్టత, శివాన్నైత్యము వర్ణింపబడినవి.

**75. మార్గబంధు పంచరత్నం :**

విరించి పురాదిష్ఠుడైన మార్గవ సహాయేశ్వరుని, భజించు సంకీర్తన.

**76. శ్రీ మార్గ సహాయ లింగ స్తుతి :** ఇది కూడా శ్రీ మార్గ సహాయేశ్వరుని స్తుతియే.

**77. గంగాధరాష్టకం :** శివస్తుతి. గ్రంథము లభించలేదు. ఇవికాక అప్పయ్య దీక్షితుల వారి రచనలని అనుకునేటటువంటి ఇతర రచనలు ప్రధానంగా సర్వదేవతా స్తోత్రములు మరొక 27 గ్రంథములు ఉన్నవి. వీటన్నిటినీ కలుపుకొని అప్పయ్య దీక్షితుల వారి రచనలు వెరసి 104గా నిర్ణయించారు. అయితే ఈ సంఖ్యపై పండి తులలో ఏకాభిప్రాయంలేదు. కాబట్టి భావిపరిశోధకులు, ఆ గ్రంథములను పరిశీలించి, దీక్షితుల వారి రచనలనూ, వారివి కాని రచనలనూ వేరుచేసి చూపించ వలసి ఉంది.

అప్పయ్య దీక్షితుల వారి వారసులలో ప్రముఖుడు నీలకంఠ దీక్షితులు. అప్పయ్య దీక్షితుల వారి తమ్ములు ఆచాన్ దీక్షితుల వారి మనుమడు అప్పయ్య దీక్షితులవారు చనిపోయేనాటికి పన్నెండు సంవత్సరముల బాలుడు. పెదతాతగారి ప్రేమను, ఆప్యాయతను అనుభవించినవాడు. ఆజన్మ ప్రతిభావంతుడు, సహజ కవి, తత్త్వవేత్త, రాజకీయములలోనూ, పరిపాలనలోనూ దక్షుడు. మహామేధావంతుడు. నీలకంఠ దీక్షితుల మేధా సంపత్తిని గురించి అనేక విశేషములు ప్రచారములో ఉన్నవి. మచ్చుకు ఒకటి మధురానగరమును పాలిస్తున్న తిరుమల నాయకుడు తన దేవేరి శిలా విగ్రహమును మలచవలసినదిగా శిల్పిని ఆజ్ఞాపించాడు. నీలకంఠదీక్షితులు ఆ

కార్యక్రమానికి మార్గదర్శి, పర్యవేక్షకుడు. ఆ విగ్రహపు కుడితొడపై ఒకముక్క పొర పాటున విరిగిపడిపోయింది. లోప మేర్పడింది. దానిని సరిదిద్దే ప్రయత్నంలో శిల్పి కృతకృత్యుడు కాలేకపోయాడు. అది గమనించిన నీలకంఠ దీక్షితులు కొంతసేపు ఆలోచించి, ఆ లోపమును అలాగే వదిలేయమన్నారు. రాజువచ్చి విగ్రహమును పరిశీలించి, జరిగిన విషయము తెలుసుకున్నాడు. తన దేవేరి తొడపైగల లోపాన్ని నీలకంఠ దీక్షితులు గ్రహించాడని తెలుసుకొని, ఆయనను అనుమానించి నిర్బంధిం చమని ఆజ్ఞాపించాడు. తన గృహంలో మీనాక్షి దేవిని పూజించి, హారతి సమర్పిస్తున్న సమయంలో రాజభటులు నీలకంఠ దీక్షితులను బంధించుటకు వచ్చారు. ముందు ఏమి జరుగునున్నదో ఊహించిన దీక్షితులు హారతిలో మరింత కర్పూరంవేసి, తన నేత్రములను ఆ మంటపై ఉంచి శాశ్వతంగా అంధుడై పోయారు. ఈ విషయము విన్న రాజు ఉచితానుచిత జ్ఞానుడై, పశ్చాత్తాపము చెంది నీలకంఠ దీక్షితుల వారి ఇంటికి వచ్చి క్షమాపణ చెప్పుకున్నాడు. దీక్షితుల వారు 105 శ్లోకములలో ఆశువుగా మీనాక్షీ దేవిని స్తుతించి, ఆ దేవి అనుగ్రహంతో తిరిగి దృష్టిని పొందగలిగారు. తాను రాజాస్థానమును విడచి వెళ్ళారు. తమ బంధువులు ఎవ్వరూ రాజుల కొలువులో సేవ చేయరాదని ఆంక్ష విధించారు.

నీలకంఠ దీక్షితులవారు మొత్తం 32 గ్రంథములు రచించారు. అవి పాండిత్య ప్రకర్ష, ఉదాత్తత, గాంభీర్యము మేళవించిన శైలిగలవి. భక్తి, సద్భావన, ప్రతిభ అక్షరము అక్షరంలో గోచరిస్తవి. వృద్ధాప్యంలో సన్యసించి సమాధిగ్రస్తులైన మహనీయుడు.

శ్రీ మన్నార్గుడి రాజాశాస్త్రి వ్రాసిన దీక్షిత వంశావళిలోని మొదటి తరాలవారి పేర్లన్నీ, వారి ఆంధ్ర సాంప్రదాయమును సూచిస్తవి. దీక్షితుల వారి కుటుంబములలో తెలుగువాడటం, తెలుగు సామెతలు, కొన్నింటిని తమిళ భాషలోనికి అనువదించి వాడుతూ ఉండటం వారికి తెలుగు భాషపట్ల, వారి పూర్వీకుల పట్లగల గౌరవము నకూ, భక్తికీ తార్కాణంగా భావించవచ్చు.

అప్పయ్య దీక్షితుల వంశావళికి చెందిన వారిలో ప్రముఖులైన కవులు, ఆధ్యాత్మిక వేత్తలు, యోగాచార్యులు, పండితులు అనేకమంది సాహిత్యమునకు, ఆధ్యాత్మిక చింతనకూ, ఇతర మేధా రంగములలో అవిరళమైన కృషిచేసి లబ్ధ ప్రతిష్ఠులైనారు.

అటువంటివారిలో మహా మహోపధ్యాయ మన్నార్గుడి రాజాశాస్త్రి, స్వామి శివానంద, సర్ సి.పి. రామస్వామి అయ్యరు వంటివారు పూజనీయులు.

అప్పయ్య దీక్షితులవారి యొక్క జీవితమంతా సత్యాన్వేషణలోనే గడచిపోయింది. భక్తి, జ్ఞాన, కర్మ మార్గములను చక్కగా మేళవించి, వారు అద్వైత ప్రచారము నిర్వహించారు. భారతదేశములోని పవిత్ర నదులైన గంగా, యమునా, సరస్వతులవలె, అప్పయదీక్షితుల వారి జీవితముకూడా భక్తి, జ్ఞాన, కర్మ మార్గముల త్రివేణీ సంగమము. వారు చరితార్థులు ప్రాతఃస్మరణీయులు.

**శ్లో॥ అప్పయ్య దీక్షిత కిమిత్య స్తుతిం వర్ణయామి భవతో వదాన్యతామ్ ।**
**సో ఽపి కల్పతరురర్థ విస్సయా త్వ ద్గి రామవసరిం ప్రతీక్షతే ॥**

ఓ అప్పయ దీక్షితా ! స్తుతికి కూడా అతీతమైన నీవదాన్యతను ఏమని వర్ణించను? అన్ని కోర్కెలు తీర్చే కల్పతరువు కూడా నీవిచ్చే అర్థం పైన ఆధారపడి యున్నది.

**– ముల్లంద్రం బాలకవి – పరిమళాపై వ్యాఖ్య.**

■ ■ ■

# బౌద్ధ తాత్త్వికులు

# ఆచార్య నాగార్జునునకు ముందు ఆంధ్రదేశంలో బౌద్ధం

ఆంధ్ర జనపదములో నాగరికత, ఆర్థికాభివృద్ధి మూడు పూవులు ఆరు కాయలుగా పురోగమిస్తుంటే గహపతులు (రైతులు), కమ్మరి, కుమ్మరి, పద్మసాలీలు, సెట్లు, ఇతర చేతివృత్తులవారు, కూలీలు, శ్రామికులు తదనుగుణంగా శ్రమించి ధనవంతులైనారు. సమాజమునందు పలుకుబడిగల వర్గంగా, శాసించగలిగినంతగా శక్తిమంతులైనారు. కానీ ఆర్య సంస్కృతిలో భాగమైన వర్ణాశ్రమ ధర్మమును అనుసరించి విభజించబడిన సమాజములో వారు బ్రాహ్మణులు, క్షత్రియుల కంటె దిగువన గల వర్గముగా పరిగణింప బడేవారు. సమాజములో వారి స్థాయి, వారి సంపదకు, పలుకుబడికి తగినట్లుగా లేక పోవటం, వారిలో వైదిక సంస్కృతిపట్ల, సనాతన ధర్మముపట్ల నిరసన, ఏహ్యాభావమును పెంపొందింపజేసినవి. ధనహీనులు, శ్రమహీనులైన, బ్రాహ్మణులకు ఉత్తమ స్థానమున్నూ, తమకు హీన స్థానమును కల్పించిన వర్ణాశ్రమ ధర్మముపట్ల ద్వేషభావమేర్పడింది. ఆంధ్ర దేశములో క్రీ.పూ. 1, 2 శతాబ్దముల కాలంలో, సామాజిక పరిస్థితులలో ఈ విధమైన అనైక్యత, విద్వేష భావములు పెచ్చుపెరిగి ఉన్నతరుణంలో, బౌద్ధము ఆంధ్రదేశము నందు ప్రవేశించింది.

ఆనాడు భారతదేశంలో పదహారు మహాజనపదములు ఉండేవి. అందులో అస్మక, ములక, అనే జనపదములు రెండు దక్షిణ భారతంలో ఉండేవి. నేటి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వరకూ విస్తరిల్లి ఉండేవని కొందరు చరిత్రకారుల భావన. బౌద్ధ జాతక కథలలోని అస్సక జాతకం ప్రకారం ఆ ప్రాంతాన్ని అస్సకుడు లేక అస్మకుడు అనేరాజు పోతలి (నేటి నిజామాబాద్ జిల్లాలోని బోధన్) రాజధానిగా చేసుకొని పరిపాలించేవాడట. మహాభారతంలో కూడా అస్మకుడు అనే రాజర్షి గోదావరీ తీరాన పోతలి పట్టణమును నిర్మించినట్లు చెప్పబడింది.

బౌద్ధుల ప్రాచీన గ్రంథములలో ఒకటియైన "సుత్తనిపాత"లోని 1019 శ్లోకమును అనుసరించి, బావరి గోత్రమునకు చెందిన బ్రాహ్మణుడొకరు, కోసల దేశము నుండి వలసవచ్చి ఆంధ్రరట్ట అని పిలువబడే అస్మక-ములక ప్రాంతమునందు, గోదావరి మధ్యనగల, కవితావనం (వెలగచెట్ల వనము) అనే ద్వీపంలో ఆశ్రమము నిర్మించుకొని ఐదు వందల మంది విద్యార్థులకు వేద, వేదాంగాది విద్యలలో శిక్షణ ఇచ్చేవాడట. ఆ గురుకుల నిర్వహణకుగాను కళింగము వంటి సుదూర ప్రాంతమును పరిపాలిస్తున్న ప్రభువులు కూడా విరాళములు అందచేశేవారట.

ఒకరోజు శరీరమంతా దుమ్ముతో నిండి, పాదములు, కాళ్లు వాచిపోయి, నోరు, పళ్ళు రోగభూయిష్టములై ఉన్నటువంటి ఒక బ్రాహ్మణుడు బావరివద్దకు వచ్చి తనకు ఐదువందల బంగారునాణెములు ధర్మముచేయమనికోరాడట. పేదరికమును అనుభవిస్తున్న బావరి, తనవద్ద అంత బంగారము లేదని చెప్పాడట. దాంతో కోపోద్రిక్తుడైన ఆ యాచక బ్రాహ్మణుడు, నీతల ఏడుప్రక్కలు అవుతుందని బావరిని శపించి వెళ్లిపోయాడట. శాపగ్రస్తుడైన బావరి దిగులుతో అన్నపానీయాదులను స్వీకరించక భీతిల్లి "అర్థకామిని" అనే పేరుగల తన ఆరాధ్యదేవతను ప్రార్థిస్తూ రోజులు గడిపేవాడట. కొన్ని రోజుల తరువాత ఆ దేవత బావరికి ప్రత్యక్షమై ఆయనకు శాపమిచ్చిన బ్రాహ్మణునకు శిరస్సంటే ఏమిటో అది ఏవిధంగా పగిలిపోతుందో తెలియదని చెప్పిందట. బావరికి ఆ దేవత చెప్పిన విషయము అర్థంకాక, వివరణ కోరినాడట. అంతట ఆ దేవత తాను వివరణ ఈయలేననీ, కోసల జనపదంలో శాక్యవంశంలో జన్మించిన గౌతమ బుద్ధుని దర్శించి తెలుసుకొనవలసినదిగా ఆజ్ఞాపించినదట.

ఆమె ఆజ్ఞానుసారం, తన బావమరదియైన పింగళీయుని మరికొందరు శిష్యులను వెంటబెట్టుకొని గౌతమ బుద్ధుని దర్శనార్థం ప్రయాణమైనాడట. వారందరూ అనేక నదులను పర్వతములను, మహారణ్యములను, దాటుతూ చాలా కాలం సుదూర ప్రయాణం చేశారట. వయోవృద్ధుడు, బలహీనుడైన బావరి ప్రయాణం కొనసాగించ లేక, తన బావమరదియైన పింగళీయుని, ఇతర శిష్యులను పిలిచి తాను పొందిన శాపమును గురించీ, తనకు ఒక మహాజ్ఞానియైన వ్యక్తిని గురించి దేవత తెలియజేసిన వివరములను వారికి చెప్పాడట. అ మహాజ్ఞాని అన్ని ధర్మముల కంటే శ్రేష్ఠుడనీ, సర్వమును దర్శించగలడనీ, సర్వశక్తిమంతుడనీ, శాక్యవంశీకుడనీ, శ్రావస్తి నగరములో నివశిస్తున్నాడనీ ఆ దేవత వివరించినట్లు తెలియజేసి, ఆ మహాజ్ఞానిని దర్శించి, తన శాపమును గురించి తెలియజెప్పి, వివరణను తెలుసుకొని రావలసి నదిగా కోరినాడట. పింగళీయునితోపాటు, శిష్యులలో కొంతమంది ఆయన వెంట వెళ్లటానికి ఉత్సుకత చూపించారట. ఆ విధంగా పింగళీయుని సారథ్యంలో పదహారు మంది సభ్యులుకల ఒక ప్రతినిధి బృందం శ్రావస్తికి ప్రయాణమైంది. వారందరూ వేదాధ్యయనము జరిపిన విద్వాంసులు. శ్రావస్తిలో బుద్ధుడని గౌరవ పూర్వకంగా పిలవబడుతున్న ఆ మహాజ్ఞానిని వారు కలుసుకొని, వైదిక ధర్మమును గురించీ, వైదిక గ్రంథములను గురించీ, వేదోక్తమైన యజ్ఞయాగాది క్రతువులను గురించీ, కూలంకషంగా ఆయనతో చర్చించి ఆయన ప్రబోధిస్తున్న నూతన ధర్మమును గురించి వివరములడిగి తెలుసుకొన్నారట. వారికి ఆ ధర్మము పట్ల గలిగిన అనేక సందేహము లకు, అనుమానములకు ఆయనను ప్రశ్నించి సంతృప్తికరమైన సమాధానములను పొందారట. అనంతరము ఆయన ప్రబోధిస్తున్న నూతన ధర్మముపట్ల తమ విశ్వాసము ఇనుమడింపగా, పాపపంకిలమైన ఈ ప్రపంచము లోని మానవాళిని ఉద్ధరించగలిగిన వాడాయనొక్కడే అనే నిర్ణయమునకు వచ్చినారట. ధర్మపరియాయపై బుద్ధుని ప్రవచనములు, వారి సందేహములను అన్నిటినీ పటాపంచలు చేయగా, వారికి నూతన ధర్మముపట్ల పరిపూర్ణమైన విశ్వాసము నెలకొనిన పిమ్మట, వారందరూ నూతన ధర్మమును స్వీకరించారట. బహుశా బుద్ధభగవానుడే వారికి ధర్మదీక్ష నిచ్చి ఉండవచ్చు. అనంతరము పింగళీయుడొక్కడే తిరిగివచ్చి, బుద్ధదర్శనము వలన తాము పొందిన అనుభవములనూ, ఆ మహాజ్ఞానితో వారు జరిపిన చర్చల

వివరములనూ, చర్చలద్వారా ఆ మహాజ్ఞానిని గురించి తమకేర్పడిన అభిప్రాయమునూ, విశదంగా బావరికి నివేదించినాడట. ఇది విన్న బావరికూడా, ఆ మహాజ్ఞానియే రక్షకుడని గ్రహించి, సంతృప్తి చెందినాడట. తరువాత తన వైదిక ధర్మమును త్యజించి, అర్హతత్త్వము స్వీకరించాడట. సాంప్రదాయకమైన నమ్మకమేమంటే పింగళీయుడే ఆంధ్రదేశంలో మొట్టమొదటి బౌద్ధ ప్రచారకుడని. అతడే అసక లేక అస్మక జనపదంలో బౌద్ధ సిద్ధాంతమైన "పరయాన వగ్గ"ను ప్రచారము చేశాడని నమ్మకము. పరయాన మంటే, మానవుడు జీవితములోని వ్యధలను, బాధలను, ముసలితనమును, మృత్యువును గూడా సుఖంగా అధిగమించగల ధర్మోపదేశమును చేయు విధానము. ఉత్తర భారతంలో బుద్ధభగవానుడు తన ధర్మమును ప్రచారము చేస్తున్న కాలంలోనే, పింగళీయుడు అస్మక జనపదంలో బౌద్ధధర్మము ప్రచారము జరుపుట తటస్థించి ఉంటుంది. పింగళీయుడు, ఆయన శిష్యులు బుద్ధుని దివ్యాంశ సంభూతుడుగా భావించి ఆయనను పూజింపసాగారు. పాళీ గ్రంథములలో వర్ణించినట్లు, బుద్ధుని సాక్షాత్తు భగవంతునిగానే పరిగణించారు. ఈ విధంగా బుద్ధుని భగవంతునిగానూ, అత్యున్నతుడైన దేవునిగానూ భావించి పూజించే విధానమును పెంపొందించి, ఆచరించిన ఆంధ్రబౌద్ధుల సిద్ధాంతమే కాలక్రమంలో, ఆంధ్ర దేశమునందు మహాయాన బౌద్ధ శాఖకు జన్మనిచ్చింది.

ఆవిధంగా పింగళీయుడే, మతపరంగా సమానత్వమును పాటించెడి ఆంధ్ర భూమియందు, మహాయాన బౌద్ధ విత్తనమును చల్లటం వలన అది త్వరగా ఫలీకరించి ప్రథమంగా కృష్ణానదీ తీరములోని ధాన్యకటక–శ్రీపర్వతప్రాంతము లందు మొలకెత్తి మహావృక్షమై బౌద్ధ మతము నందలి ప్రధాన శాఖగా ప్రపంచ వ్యాప్తిని పొందినది. ఈ సందర్భములో గమనించదగ్గ విశేషమేమంటే ప్రపంచవ్యాప్తంగా అనుసరించబడుచున్న, బౌద్ధమతము నందలి పదునెనిమిది శాఖలలో తొమ్మిది శాఖలకు ఆంధ్రదేశమే జన్మభూమి. వీటిలో ఇతర శాఖలకంటే మహాయాన శాఖనే ఆంధ్రులు అతి కొద్ది కాలములోనే ఆమోదించారు.

పింగళీయునితో పాటు శ్రావస్థి వెళ్ళిన బావరి శిష్యులు బౌద్ధమత స్వీకారానంతరము, ఉత్తర భారతంలోనే ఉండి బుద్ధుని వెంట ధర్మ ప్రచారములో పాల్గొంటూ, శ్రావస్థి, రాజగృహ ప్రాంతములలోనే తమ నివాసములను ఏర్పరచుకున్నారు.

క్రమంగా ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా మగధ ప్రాంతములో వారి సంఖ్య బాగా అభివృద్ధి చెందింది. ఆ ప్రాంతపు బౌద్ధులు పాళీ భాషలో ఆంధ్ర బౌద్ధులను అంధకులు అని పిలచేవారు. వారు తమ ఉనికిని, వ్యక్తిత్వమును కాపాడుకుంటూ తమకు ప్రత్యేకంగా విహారములను (నివాస స్థలములు) ఏర్పాటు చేసుకొన్నారు. బౌద్ధుల పవిత్ర గ్రంథము 'మహావగ్గ'లో శ్రావస్థినగర సమీపములో "అంధక వనము" అనీ, రాజగృహ నగర సమీపములో "అంధకవింద" అని పిలువబడే ఆంధ్ర బౌద్ధుల వాడలు ఉండేవని తెలియ జేసింది. "విమాన వత్తు" అనే బౌద్ధగ్రంథం బుద్ధుని ప్రథమ శిష్యుడైన మహాకాత్యాయ నుని ద్వారా అస్మక రాజు బౌద్ధమత స్వీకారము చేసినట్లు తెలియజేసింది. రాజులు, ప్రభువులు, సంపన్నులు, వర్తకులు, భూస్వాములు, చేతివృత్తులవారు, వేల సంఖ్యలో బౌద్ధమత స్వీకారము చేశారు. ఇందుకు ముఖ్య కారణములు బహుశా ఆ మతములోని సులభమైన ఆచరణ పద్ధతులు. అన్ని వర్గములకూ, అన్ని కులములకూ చెందిన వారిని మతపరంగానూ, సమాజ పరంగానూ, సమానంగా పరిగణించటం, వైదిక ధర్మములోని వర్ణాశ్రమ విధానమును పాటించకపోవటం. బుద్ధుడు స్వయంగా ప్రబోధించినట్లు వివిధ నామములతో వివిధ స్థానములలో జన్మించిన నదీనదములు, సముద్రములో కలసిన తరువాత ఏ విధంగా వాటి ఉనికిని, ప్రత్యేకతను కోల్పోతాయో, అదేవిధంగా స్త్రీ పురుషులలో వివిధ కులములకు, వర్గములకు, సాంఘిక, ఆర్థిక హోదాలకు చెందిన వారందరూ పరిపూర్ణుడైన వాని సిద్ధాంతమును స్వీకరించి, ఆ ధర్మమును అనుసరించగానే వారివారి వ్యక్తిత్వములను కోల్పోయి శాక్యవంశజుని అనుయాయులైన శ్రమణులుగా పిలవబడతారు.

కొందరు పండితుల అభిప్రాయం ప్రకారం, ఆంధ్రులకు అవైదికములైన మత ముల పట్లనే మోజు ఎక్కువని. కారణం వారి సామాజిక సమభావనా దృక్పథం అనార్యులలో అటువంటి మతములు శీఘ్రంగా వ్యాప్తిచెందినవి అనే విషయము సత్యము. ధనవంతులైన వ్యాపారులు, చేతివృత్తులవారు, కళాకారులు, ఇతర శ్రామిక జనులు అత్యుత్సాహంతో నూతన మతమైన బౌద్ధమును స్వాగతించారు. ఇందుకు కారణం వారి అంతస్థుకు తగినట్లుగా సమాజములో స్థానము లభించగలదనే ఆకాంక్ష. ఈ అభిప్రాయము కొంతవరకు సత్యమే అనిపిస్తుంది. ఈ నూతన మతము

పట్ల వారికి గలిగిన అవగాహనను మించి, వారికి ప్రకృతి సిద్ధంగా సంక్రమించిన భావోద్రేకత, ఆవేశము, అగ్రకులములతో సమానత్వము పొందవలెననే ఆశ, వారిని అతిస్వల్ప కాలములోనే బౌద్ధమత స్వీకారమునకు ప్రోత్సహించినవి. సామాజిక సమానతా భావముకంటె సమాజములో ఉన్నత స్థానమునూ పలుకుబడిని సంపాదించవచ్చుననే తీవ్రమైన కాంక్ష వారిని నూతన మతాకర్షితులుగా చేసింది. వీటన్నిటికీ మించి బౌద్ధమునకు గలిగిన రాజాదరణ, (రాజకీయ కారణముల వలన గానీ, ఇతర కారణముల వలనగానీ) మరో ముఖ్య, కారణమైంది. “యధారాజా తధా ప్రజా” అనే నానుడిని అనుసరించి రాజు అభిమానించిన మతము వైపే ప్రజలు మొగ్గు చూపటంలో ఆశ్చర్యం లేదుకదా ! ఈ విధమైన అభిప్రాయము కూడా నిజమేనని పిస్తుంది. కారణం రాజులు ఆదరించిన మతమును ఆంధ్రులు ఎంతశీఘ్రంగా స్వీకరించారో అంతకంటె శీఘ్రంగా రాజాదరణ కోల్పోగానే బౌద్ధ, జైన మతములను విడచి, హిందూ మతమును తిరిగి ఆశ్రయించారు. అవైదికములైన ఆ రెండు మతములు, తమ అస్తిత్వమును కాపాడుకొనుటకు గాను వైదిక ధర్మములైన కుల వివక్షతను, షోడశ సంస్కారములను తమ మతములయందు ప్రవేశపెట్టినవి. శైవ, వైష్ణవ సాంప్రదాయములకు చెందిన ఆచార్యులు కులవివక్షత పాటించని భక్తిమార్గ ప్రచారమును తీవ్రతరం చేయటం కూడా మరొక బలమైన కారణంగా భావించవచ్చు. వీటన్నిటికీ మించి, వివిధ శాఖలకు చెందిన బౌద్ధాచార్యుల ఉద్రేక స్వభావము, అసహన చిత్తవృత్తి, అతిశయము, అహంకారము వంటి గుణములు కూడా బౌద్ధమతము చిన్నాభిన్నమై పోవుటకు మరొక బలమైన కారణము. ఆంధ్రదేశములో తమ తమ శాఖలే ప్రాధాన్యత కలిగి ఉండవలెననే దురాశతో, వారిలో వారు కలహించుకొనటం, ఇతర శాఖలను నిందించటం, ఒక ఆనవాయితిగా మారి పోయింది. బౌద్ధ ధర్మములోని నీతి సూత్రములను, క్రమశిక్షణను అతిక్రమించి ప్రవర్తించారు. ఈ కారణములవలన బౌద్ధసంఘమునందు ఐకమత్యము నశించిపోయింది. బౌద్ధాచార్యుల అవినీతి ప్రవర్తన చివరకు బౌద్ధమతమును ఆంధ్ర దేశమునుండి అదృశ్య మయే విధంగా చేసింది. ఆ వివరములను తెలుసుకుందాము.

క్రీ.పూ. 486లో బుద్ధుని మహాపరి నిర్వాణానంతరం, మగధ రాజధానియైన రాజగృహ పట్నంలో బౌద్ధ సంఘ సమావేశం జరిగింది. ఇటువంటి సమావేశములను

బౌద్ధులు "సంగీతి" అని పిలుస్తారు. రాజగృహ సమావేశమునకు బుద్ధుని సవతి సోదరుడు అనుచరుడైన ఆనందునితో పాటు షుమారు 500 మంది బౌద్ధ బిక్షువులు హాజరైనారు. బౌద్ధ పవిత్రగ్రంథమైన "చుల్లవగ్గ"లోని తొమ్మిదవ అధ్యాయము ప్రకారము, ఆ సమావేశము నకు మహాకాశ్యపాచార్యులు అధ్యక్షత వహించారు. సమావేశంలో "సుత్త"", "వినయ పిటకములు" రెండూ పఠించబడినవి.

కాలం గడుస్తున్న కొలదీ, బౌద్ధ సంఘమునందు, ఐక్యతనూ, క్రమశిక్షణనూ పాటించుట కష్టసాధ్యమైనది. దేవదత్తుడనే శాక్య రాజకుమారుడు, బుద్ధుని అనుచరుడైనప్పటికీ బుద్ధునికి ఎదురుతిరిగాడు. సుభద్రుని వంటి కొందరు శిష్యులు బుద్ధుడు బౌద్ధ సంఘమునందు అమలుపరుస్తున్న క్రమశిక్షణను సహించలేక తమ అసహనమును వ్యక్తం చేయసాగారు. ఈ రకముగా అసంతృప్తి చెందిన వారందరూ ఏకమై, తమంతట తామే స్వతంత్రంగా, నియమములనూ, క్రమపద్ధతులనూ రూపొందించసాగారు. ఈ విధమైన క్రమశిక్షణా రాహిత్యమును తొలగించటానికీ, ఒకేరకమైన ప్రవర్తనా విధానమును తయారుచేసి, మతపరమైన కార్యక్రమములను వ్యవస్థీకరణము చేయటానికి గాను క్రీ.పూ. 377లో వైశాలీ నగరములో బౌద్ధ సంఘ సమావేశము రెండవసారి జరిగింది. శిశునాగ వంశజుడైన కాలాశోకుడు మగధను పరిపాలిస్తున్నాడు. పూజనీయుడైన ఆచార్య సబ్బకామి అధ్యక్షతన ఆ సమావేశం జరిగింది. వైశాలికి చెందిన బౌద్ధ శ్రమణులు (వజ్జియనులు) ఆ సమావేశంలో చర్చించడానికి పది అంశాలు (దశవత్థూని) ప్రవేశపెట్టారు. వాటిని ఆమోదించి బౌద్ధసంఘములోని ఎల్లరూ ఆచరించవలసినదిగాకోరారు, ఆ పది అంశములు మత సిద్ధాంతములకు సంబంధించినవికావు. అవి

(1) ఉప్పు నిల్వ చేసుకోవడం (2) మధ్యాహ్నం భోజనం చేయటం (3) గ్రామాంతరము వెళ్లినప్పుడు రెండవసారి భుజించటం (4) ఉపోసత్త పర్వాన్ని భిన్న ప్రాంతములలో నిర్వహించడం (ఉపోసత్తను పూర్ణిమనాడు అమావాస్యనాడు బౌద్ధ భిక్షువులు నిర్వహిస్తారు. ఈ సమావేశంలో బౌద్ధ బిక్షువులు భిక్షుణిలు పాటించవలసిన నియమ నిష్ఠలను పునః పఠిస్తారు. అనంతరం దోషములుచేసినవారు తాముచేసిన దోషములను, పాపములను, సమావేశములో వివరించి పశ్చాత్తాపము ప్రకటిస్తారు.) (5) ఒక కార్యము నిర్వహించిన అనంతరం బౌద్ధసంఘామోదాన్ని పొందటం (6)

సంప్రదాయములను ఆమోదములుగా పరిగణించడం (7) భోజనానంతరం మజ్జిగ త్రాగడం (8) కల్లు మొదలైన తక్కువ హానికరములైన పదార్థములను, పానీయములను సేవించడం (9) అంచులు లేని దుప్పటి వాడుకొనటం (1) వెండి బంగారములను బిక్షగా స్వీకరించడం.

పైన వివరించిన పది అంశములను ఆమోదించటానికీ, ఆచరించుటకూ, కాకండుని పుత్రుడు, పూజనీయుడైన ఆచార్యుడు, యస్కుడు వ్యతిరేకించాడు. అంత టితో ఆగక, దేశములోని పశ్చిమ ప్రాంతానికీ దక్షిణ ప్రాంతానికీ చెందిన భిక్షువులను వైశాలీ భిక్షువుల ప్రతిపాదనలను వ్యతిరేకించమని ప్రోత్సహించాడు. వెంటనే వైశాలి భిక్షువులు తూర్పు ప్రాంతమునకు చెందిన భిక్షువులను, సమావేశములో పాల్గొని, తమ ప్రతిపాదనలు సమర్థించవలసినదిగా కోరారు. ఉభయ పక్షములవారు తమ బలాబలములను సమావేశంలో పరీక్షచేసుకున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరము వైశాలి భిక్షువుల ప్రతిపాదనలు వీగిపోయినవి. అంతేగాక వైశాలి భిక్షువులను సంఘ విద్రోహ శక్తులుగా పరిగణించి వారిని బౌద్ధ సంఘమునుండి వెలివేయటం జరిగింది. ఆ విధంగా వెలివేయ బడిన వారంతా వేరొక సమావేశమును నిర్వహించారు. దానికి షుమారు ఏడువేల మంది భిక్షువులు హాజరైనారు. ఆ సమావేశములో అత్య ధిక సంఖ్యలో భిక్షువులు పాల్గొనటం వల్ల దానిని "మహా సంగీతి"అని పిలిచారు. సమావేశంలో వారందరూ తమ ప్రయోజనము నకై సుత్త – వినయ పిటకములకు వేరుగా ప్రతులు తయారుచేసుకున్నారు. వీరందరూ "మహా సాంఘికుల"నబడే నూతనశాఖకు ప్రారంభకులైనారు. వైశాలి భిక్షువులను వ్యతిరేకించిన వారంతా ఆచార్య భదంత సబ్బకామికి అండగా వ్యవహరించారు. వీరందరికీ స్థవరవాదులు లేక థేరవాదులనే పేరు కలిగింది. వీరు బౌద్ధులలో ప్రాచీన సాంప్ర దాయములకు కట్టుబడి యున్నవారు.

బౌద్ధ సంఘములోని విభేదాలు కొనసాగుతూ తీవ్రరూపము దాలుస్తుంటే క్రీ.పూ. 242లో అశోక చక్రవర్తి పాటలీపుత్రంలో మూడవ సంగీతిని ఏర్పాటు చేశాడు. ఏదో విధంగా బౌద్ధ సంఘములోని విభేదాలను, అనైక్యతను రూపుమాపి సంఘమును పటిష్టము చేయాలని ఆకాంక్షించాడు. షుమారుగా బౌద్ధ సంఘములలోని వేయి మంది పెద్దలు, కొన్ని వందలమంది భిక్షువులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బుద్ధ భగవానుని ప్రథమ శిష్యులలో ఒకడైన మొగ్గలాయనుని పుత్రుడు తిస్స అధ్యక్షత వహించాడు. సమావేశములు తొమ్మిది నెలలపాటు కొనసాగినై. "కథావత్తూ" ప్రకరణంలో దీర్ఘకాలం జరిగిన ఆ సమావేశములోని చర్చలు, గ్రంథస్తం చేయబడినై. అశోకుడు బౌద్ధ సంఘములో ఐక్యతను సాధించటంలో విఫలుడైనాడు. అయితే చక్రవర్తిగా తనకున్న రాజాధికారమును వినియోగించుకుని, సంఘంలో ఏర్పడ్డ చీలికలను నిషేధించాడు. నిషేధాజ్ఞలు శిలలపై చెక్కబడి దేశమంతటా, ఆంధ్రదేశములో కూడా ప్రతిష్ఠింపబడినవి. బౌద్ధ ధర్మమును గురించి యావద్భారత దేశములోనూ, దేశ సరిహద్దులకావల కూడా విస్తృతమైన ప్రచారము చేపట్టిన మొదటి చక్రవర్తి అశోకుడు. బౌద్ధ మతము జన బాహుళ్యములో వ్యాప్తి చెందటానికి, అవిరళ కృషి సల్పినాడు. ఆ ప్రచార కార్యక్రమంలో భాగంగా తన పుత్రుని, పుత్రికను శ్రీలంక వంటి ఇతర రాజ్యములకు కూడా పంపించాడు. బౌద్ధ సంఘమునందు ఐక్యతను సాధించుటలో విఫలుడైనప్పటికీ, బౌద్ధ ధర్మవ్యాప్తిలో ఆయన సఫలీకృతుడైనాడు.

కుషానుల రాజైన కనిష్కుడు కూడా బుద్ధ సంఘములో ఐక్యత సాధించుటకు ప్రయత్నం చేశాడు. పంజాబులోని కుందలవనము (జలంధర్)లో నాలుగవ సంగీతిని ఏర్పాటుచేశాడు. అప్పటికే థేరవాదులు దేశములోని పశ్చిమోత్తర ప్రాంతములలో తమ సిద్ధాంతములను ప్రచారముచేసి. బలపడి ప్రజాభిమానము చూరగొన్నారు. అందువల్ల నాలుగవ సంగీతిలో పాల్గొన్నవారిలో అధికులు ఆ శాఖకు చెందినవారే. వసుమిత్రుడు ఆ సమావేశములకు అధ్యక్షుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి, కనిష్కుని ఆస్థాన విద్వాంసుడు ప్రముఖ కవి బౌద్ధాచార్యుడైన అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడుగా వ్యవహరించాడు. ఎంత ప్రయత్నించినా బౌద్ధ సంఘము నందలి విభేదాలు సమసిపోలేదు. సమావేశంలో త్రిపిట కములను (బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి) రాగి రేకులపై వ్రాసి జాగ్రత్త పరిచారు.

"మంజుశ్రీ పరిపుచ్ఛ" అనే బౌద్ధ గ్రంథమునందు బుద్ధుని నిర్వాణానంతరం రెండు వందల సంవత్సరములకు, మహాదేవుడను బౌద్ధ భిక్షువు మహా సాంఘిక శాఖ విభజనకు కారణభూతుడైనాడు. కారణమేమంటే ఈ మహాదేవుడు ఇతని అనుచరులూ తమంతట తామే స్వయంగా బౌద్ధబిక్షు దీక్షను స్వీకరించారు. వీరి చర్య మహా సాంఘికులలో విభేదమును సృష్టించింది. వివాదాస్పదమైన విషయమేమంటే ఒక

వ్యక్తి తనంతట తానుగా, బౌద్ధ ధర్మదీక్షను గ్రహించవచ్చునా ? లేక బౌద్ధాచార్యులే ఆ వ్యక్తికి దీక్షను అనుగ్రహించ వలెనా? బౌద్ధ భిక్షువులలో అధికులు స్వయంగా దీక్షను స్వీకరించటానికి అభ్యంతరం తెలిపారు. దానితో మహాదేవుని, ఆయన అను చరులను సంఘమునుండి వెలివేశారు. బహుశ ఈ మహాదేవుడూ ఆయన అను చరులు ఆంధ్ర దేశమునందలి పల్లవ భోగము (పల్నాడు–గుంటూరు జిల్లా)కు చెందినవారై, ఉత్తర భారతము నందలి మగధ ప్రాంతము నందుగల బౌద్ధ విహారము లలో నివసిస్తూ ఉండి ఉంటారు. ఎప్పుడైతే వారు సంఘ బహిష్కృతులైనారో అక్కడ నివసించుటకు ఇష్టపడక తమ ప్రాంతమునకు తరలి వచ్చి ఉండవచ్చును. ధాన్య కటకము – శ్రీపర్వత (నాగార్జున కొండ) ప్రాంతములో గల కొండలపై తమ విహా రములను ఏర్పాటుచేసుకొన్నారు. ఆవిధంగా పైనచెప్పబడిన ప్రాంతము మహా సాంఘిక శాఖకు బలీయమైన స్థానమైనది. తదనంతర కాలములో ఇతర మూల శాఖల నుండి అనేక ఉపశాఖలు ఏర్పడి ఆ ప్రాంతములో వ్యాపించినవి. మహాదేవుడు ఆంధ్ర దేశమునకు వలస రావటానికి ముందుగానో, ఆ తరువాతనో మహాసాంఘిక శాఖలో మరో చీలిక ఏర్పడింది. ఆ శాఖలోని కొందరు చైత్యములను (బౌద్ధ ఆరాధనా స్థలము – దేవా లయము వంటి) నిర్మించి చైత్యారాధన ప్రారంభించారు. అట్టివారిని చైత్యవాదులు అని పిలిచేవారు. ఈ చైత్యములను వివిధ పరిమాణములలో నిర్మించ వారు. చైత్యము యొక్క పునాది చక్రమువలె గుండ్రముగా ఉంటుంది. ఇది బౌద్ధుల ధర్మ చక్రమునకు చిహ్నము. దీనిపై పునాది యొక్క వర్తులమును బట్టి అర్ధగోళా కారములో ఒక గుమ్మటము నిర్మించబడి ఉంటుంది. చైత్యముయొక్క మధ్య భాగమునందు బుద్ధుని అవశేషమును, అనగా పంటినో ఎముకనో నిక్షిప్తము చేయ బడిగానీ, చేయకగానీ, ఒక స్తూపము నిర్మించబడి ఉంటుంది. ఆ స్థూపములపై బౌద్ధులు పవిత్రమైనవిగా భావించు, ఆరాధించునటు వంటి అష్ట చిహ్నములు చెక్కబడి వుంటవి. ఆంధ్రదేశంలో అతిప్రాచీనమైన (క్రీ.పూ.200) భట్టిప్రోలు స్తూప శాసనములో "బుద్ధ శరీరాణి మహనీయాని" అనే వాక్యాన్ని బట్టి ఆ స్థూపమునందు బుద్ధ ధాతువును నిక్షిప్తం చేయబడినట్లు తెలుస్తుంది. భట్టిప్రోలు, అమరావతి స్థూప ములను, వాటి పరిమాణమును బట్టి, బుద్ధ ధాతువు నిక్షిప్తమై ఉండుటను బట్టీ, మహాచైత్యములని పిలుస్తారు. కొండశిఖరములపై తమ విహారములను, చైత్యములను

నిర్మించుకున్న బౌద్ధులకు, శైలీయులు అని పేరుపెట్టారు. వీరు చైత్యకవాద శాఖలోని ఉపశాఖీయులు. వారి నివాస స్థానములను బట్టి పూర్వ శైలీయులు (తూర్పు కొండపై నివసించువారు). అపర శైలీయులు (పడమటి కొండవాసులు). ఉత్తర శైలీయులనీ, రాజగిరికలు (పెద్ద కొండలపై నివశించేవారు), చైత్యశైలీలు (భూమిపైనున్న చైత్యవాసులు)గా పిలువబడేవారు. డాక్టరు తారానాథ్ అభిప్రాయమును అనుసరించి వారికి ఆ విధమైనపేర్లు గలుగుటకు కారణము వారు ధాన్యకటక–శ్రీపర్వత ప్రాంత మునకు, నలుదిశలనున్న కొండలపైగల చైత్యములను ఆరాధించుట వలననేనని. అయితే డాక్టరు సచ్చిదానంద మూర్తి పై అభిప్రాయముతో ఏకీభవించలేదు. వారి ఉద్దేశ్యము ప్రకారము పై ప్రాంతమునందు, నాల్గు దిశలగల పర్వతములను పోలినటు వంటి ఉన్నతమైన చైత్యములను ఆరాధించుట వలన, దిశలను బట్టి పేర్లేర్పడినవని. వాటికి ఆ పేర్లు రావటానికి కారణములు ఏవైనప్పటికిన్నీ, యదార్ధ విషయమేమంటే వైశాలిలో జరిగిన రెండవ సంగీతి అనంతరము బౌద్ధమతము అనేక శాఖలుగా చీలిపోయింది. ఇందుకు ప్రధాన కారణములు రెండు. ఒక విధంగా వీటికి కారణ భూతుడు బుద్ధభగవానుడే. మొదటి కారణం బుద్ధుడు తన ప్రవచనములను వ్రాత పూర్వకంగా స్థిరపరచకపోవుట. ఈ లోపంవల్ల ఎవరికి వారు బుద్ధుని అనంతరం వారి ప్రవచనములను తమ ఇష్టానుసారం అన్వయించి ప్రచారము చేయటం. రెండవది గృహసంబంధమైన, కుటుంబమునకు సంబంధించిన, శుభాశుభ కార్య ముల పట్ల నిర్లిప్తత పాటించుట. ఈ లోపముల కారణంగా బౌద్ధ సంఘము నందలి ఆచార్యులు తలకొక విధంగా ప్రవర్తనావళిని నిర్దేశించటం జరిగింది. ఈ ప్రవర్తనా వళిలో ప్రాంతీయములు, స్థానికములైన అలవాట్లను, సంప్రదాయములను మేళ వించుట వలన బౌద్ధములో అనేక శాఖలూ, సంప్రదాయములు ఏర్పాటై అనైక్యతకు, విభేదాలకు దారితీయటం జరిగింది. మరొక విధంగా పరిశీలిస్తే బౌద్ధముయొక్క మూల సిద్ధాంతములకు, ఆచరణలకు తిలోదకాలను ఇచ్చి, బౌద్ధాచార్యులు తమ అతిశయములకు, అహంకారములకు ప్రాధాన్యతను ఇచ్చి, తాము నిర్వహిస్తున్న విహారములలో, తమకు తోచిన విధానములను, ప్రవర్తనావళిని అమలు జరుపుట. ఈ అభిప్రాయము, యదార్థమే అనుటకు సాక్ష్యం, విభిన్నమైన బౌద్ధ శాఖలకు పేర్లు, ఆ శాఖ నిర్వాహకుడైన ఆచార్యుల పేరుతో ముడిపడి ఉండటమే. ఉదాహర

ణకు, కాశ్యపేయ, వాసిష్ఠ పుత్రీయ, బహుశ్రుతీయ వంటి శాఖానామములు. శాఖాధిపతులైన ఆచార్యులు మూలమైన ప్రవర్తనావళిని అతిక్రమించి నూతన శాఖను ప్రారంభించవలసినదిగా తమ అనుయాయిలకు ప్రోత్సాహ మివ్వటము చేశేవారని తెలుస్తుంది. అశోకునికి బౌద్ధ దీక్షనిచ్చిన మొగ్గలాయన పుత్రుడైన తిస్స సంకలనము చేసిన "కథావత్తు" అనే బౌద్ధ గ్రంథమును బట్టి అంధకులు (ఆంధ్రులు) నలుబది యొక్క సాంప్రదాయములనూ, పూర్వశైలీయులు ముప్పైఒక్క సంప్రదాయములను అనుసరించినట్లు తెలుస్తున్నది. బౌద్ధ మతము నందలి ప్రాచీన రచయితలు, ఆ మతములో పదునెనిమిది శాఖలు ఏర్పడినట్లు వ్రాసినప్పటికీ, కాలక్రమేణ అవి ముప్పది మూడు శాఖలుగా వృద్ధిచెందినట్లు విశదము అవుతున్నది. ఈ ముప్పది మూడు శాఖలలో ప్రధాన శాఖలుగా థేరవాదులు, మహాసాంఘికులు, స్థవిరవాదులు, మహీషకులు, బహుశ్రుతీయులు, చైత్యకులు మరియు సమ్మిత్తీయులను పరిగణింప వచ్చును.

బౌద్ధమతములోని అంధక శాఖలకు (ఆంధ్రులు) చెందిన మహాదేవుని అనుచరులు అనేక పేర్లతో నూతన సాంప్రదాయములను స్థాపించి అందు నూతన సిద్ధాంతములను ప్రవేశపెట్టి ప్రచారము చేశారు. కర్మ సిద్ధాంతము, పుట్టుట, చచ్చుట అనే సంసార చక్రమూ, బుద్ధునికి దైవత్వము నాపాదించుట, భోదిసత్వ సంప్రదాయము, నిర్యాణ ధనము, షోడశోపచారములతో చైత్యారాధన, మహాశూన్యత వంటి అంశములు ధాన్యకటక, శ్రీపర్వత, జగ్గయపేట (కృష్ణాజిల్లా)లోని విహారములలో పరిమితంగా మొదట ప్రవేశించి ఆచరణలోనికివచ్చినై. క్రమంగా వృద్ధిచెంది, శక్తివంతమైన సిద్ధాంతములుగా మారి, ప్రాచుర్యములోనికివచ్చి, మహాయానమని, యోగవాదమని, విజ్ఞానవాదమని, తంత్ర వాదమని, గుర్తింపును పొంది మనదేశము నందేకాక తూర్పు పడమరగల ఇతర దేశములలోకూడా బహుళవ్యాప్తిచెంది, ఆయా దేశములలోని స్థానిక మతములను గూడా మరుగు పరచి, బౌద్ధ ధర్మమనే పేరుతో ప్రచారములో ఉండేవి.

ధాన్యకటక–శ్రీపర్వత ప్రాంతము (పల్లవ భోగము) మహాసాంఘికులకు, వారి ఉపశాఖలకే గాక స్థవిరవాదులకు, సర్వాస్తివాదులకు, మహావిహారవాదులకు, బహుశ్రుతీయవాదులకు, ఇంకా ఇతర చిన్న, పెద్ద శాఖల ప్రచారమునకు కూడా ప్రధాన

స్థానమైనది. మహాసాంఘికులు, వారి ఉపశాఖలను మినహాయిస్తే, మిగిలిన శాఖల నన్నిటినీ థేరవాదులని ఒకేపేరుతో వ్యవహరించేవారు. వారి కార్యస్థానములు, విహారములు, పల్లవ భోగమునున్న చుల్లధమ్మ గిరిపై ఉండేవి. వాటిలో రెండు విహారములు శ్రీలంక బౌద్ధులకు చెందినవి. ఆ విహారములలో శ్రీలంకకు చెందిన భిక్షువులు భిక్షుణిలు నివసిస్తూ, పాళీభాషలో నున్న బౌద్ధ గ్రంథములు, త్రిపిటకము లను, అధ్యయనము చేస్తూ, వాటికి మరికొన్ని ప్రతులు వ్రాస్తూ ఉండేవారు. వారు బౌద్ధమత ప్రచారమునకుగాను, గాంధారము, బర్మా, తాయిలాండు, చైనా వంటి సుదూర దేశములకు వెళ్లేవారు. ఆ దేశములలో తీవ్రంగా మత ప్రచారము జరిపే వారు. మహా విహారవాసశాఖవారు "నవాంగశాస్త్రశాసనార్థవ్యంజిన"మందు నిశ్చయ విశారదులు. శాస్త్ర శాసనమంటే బుద్ధ వచనమన్న మాట. అందులోని తొమ్మిది అంగములు (1) సుత్త (2) గెయ్య (3) వైయాకరణ (4) గాధా (5) ఉదాన (6) ఇతి వత్థుక (7) జాతక (8) అద్భుతధమ్మ (9) వేదల్ల. ఈ శాఖవారు భిక్షువుల క్రమశిక్షణను గురించి వివరములు తెలిసిన ప్రవీణులు. బుద్ధ ధర్మములో మంచి పాండి త్యము కలవారు. వీరు యవన పశ్చిమోత్తర భారతంలో కర్ణాటకలోని వనవాసి ప్రాంతము లోనూ బౌద్ధమత ప్రచారము చేశారు. మహాసాంఘికులలోని మరొక శాఖ బహు శ్రుతీయులు. ఈ శాఖ స్థాపకుని పేరు బహుశ్రుతాచార్యుడు. ఈ శాఖవారు కృష్ణానదీ సాగర సంగమ ప్రాంతములో, అనగా షుమారు ఈనాటి దివిసీమ ప్రాంతములో ప్రాచుర్యము పొందినారు. వీరికి క్రీ.శ. 230లో కేశానపల్లి వద్ద చంద్రభాగానదీ తీరమున శ్రీపర్వతమునకు (నాగార్జునకొండ) షుమారు 64 కి.మీ. దూరములో ఒక విహారము ఉండేది. ఆ కాలమునందు మిక్కిలి జనాదరణ పొందిన విహారము లలో అది ఒకటి. ఇక్ష్వాకు వంశజుల రాణులు, స్త్రీలు, ఈ విహారమును ఎక్కువగా ఆదరించేవారు. హరివర్మ రచించిన "సత్యసిద్ధి శాస్త్రము" వీరికి ప్రామాణికమైన పవిత్రగ్రంథము. ఈ గ్రంథములలో సనాతన సిద్ధాంతములైన హీనయాన సూత్ర ములు, అధునాతన సిద్ధాంతములైన మహాయాన సూత్రములకు సమన్వయపరచటం ఈ గ్రంథములోని విశేషము. దీనిని బట్టి ఈ శాఖవారు బౌద్ధ మతములోని ప్రధాన శాఖలైన హీనయాన, మహాయాన శాఖల మధ్యనున్న విభేదాలను తొలగించి, ఆ రెండు శాఖల మధ్య సమకలనమును సాధించవలెననే ప్రయత్నం చేశారు. వీరు

బుద్ధకాయ, ధర్మకాయ సిద్ధాంతములను ఆమోదించారు. బుద్ధుడు దశబలుడు మానవాతీతుడని ఆమోదించారు గానీ, ఆయన దైవాంశ సంభూతు డని, దివ్యపురుషుడని అంగీకరించలేదు. వీరు మొదట్లో విగ్రహారాధనకు వ్యతిరేకులు అయినప్పటికీ, కొంతకాలము గడచిన తరువాత ఆ వ్యతిరేకతను వదలి, బుద్ధ ప్రతిమగల స్తంభమును తమ కేసానపల్లి విహారంలో ప్రతిష్ఠించినారు.

ఆంధ్రదేశములోని బౌద్ధ మతశాఖలలో ముఖ్యమైనది వైతుల్యకులు. వీరిని థేరవాద సైద్ధాంతికుడైన బుద్ధఘోషుడు అంధకులని నిందించాడు. వీరిని విపుల్యులు, లేక మహాయాన శూన్యతావాద ప్రచారకులుగా పిలచేవారు. వీరే ప్రప్రథమంగా మహాయాన శాఖకు అతిముఖ్య సిద్ధాంతమైన శూన్యతావాదమును బౌద్ధమతమునందు ప్రవేశపెట్టిన వారు. అనంతర కాలమునందు ఆ సిద్ధాంతమును మహాయాన శాఖవారు తమదిగా చేసుకొని విస్తృత ప్రచారము చేశారు.

మహాయానం అంటే ఘనమైన వాహనము లేక సాధనము అని అర్థం. ఈ నూతన శాఖ లేక సాంప్రదాయము క్రీ.శ. ఒకటి, రెండవ శతాబ్దములలో బౌద్ధ మతము నందు ప్రారంభింపబడినది. దీని ఆవిర్భావము వలన బౌద్ధ ధర్మమునందు వినూత్నమైన మార్పులు వచ్చినవి. ఈ సంప్రదాయమునకు బుద్ధుని ప్రవచనములే మూలములు. శ్రావస్తిలో బుద్ధ భగవానుడు సులభమైన భాషలో బౌద్ధ ధర్మమును గురించి ప్రవచించేవాడు. సులువుగా అర్థమవుటకుగాను చిన్నచిన్న పిట్టకథలను చెప్పేవాడు. ఈ విధమైన ప్రవచనములను "వ్యక్త" ఉపదేశాలనేవారు. బౌద్ధ ధర్మమునకు ఈ వ్యక్త ఉపదేశములే మూలసిద్ధాంతము లైనవి. చదువుకొన్నవారికి, ఇతర విశిష్ట వ్యక్తులకూ వారు బోధించు తీరు వేరే విధంగా ఉండేది. నిగూఢమై క్లిష్టంగా ఉండే తాత్త్విక ఉపదేశములను వారికి బోధించేవారు. వాటిని "గుహ్య" ఉపదేశములు అనేవారు. ఇవి ఎక్కువగా తాత్త్వికపరమై ఉండేవి. సులభ గ్రాహ్యములు కావు. బుద్ధుని గుహ్యోపదేశములపై బౌద్ధాచార్యులు జరిపిన విశ్లేష ణాత్మకము, విస్తృతమైన చర్చలు, తీర్మానములపై ఆధారపడి ఆవిర్భవించినదే మహాయాన శాఖ. మహాయాన శాఖ అవతరించుటకు చాలాకాలము ముందే ఈ విధమైన పరిణామము అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, చివరకు ఒక నిర్దిష్టమైన సంప్రదాయముగా స్థిరపడింది. ఆచార్య నాగార్జుననితో ప్రారంభమై ఈ సాంప్రదాయ అభివృద్ధికి,

పతిష్టతకూ అనేకమంది బౌద్ధాచార్యులు తమ ప్రజ్ఞాపాటవములను వినియోగించి తీవ్రమైన కృషి సల్పినారు. హీనయాన, మహాయాన సిద్ధాంతములు రెంటికీ బౌద్ధ మతమునకు మూల సిద్ధాంతములై పాళీ గ్రంథములలో నిక్షిప్తమై యున్న ఆర్య సత్యములు, అనిచ్ఛ, అసత్తవంటివి, సమానములు. అయినప్పటికీ, మహాయాన సాంప్రదాయము నందు మూల సిద్ధాంతములకు భిన్నమైన కొన్ని నమ్మకములను, ఆచారములను, అలవాట్లను, ప్రవేశపెట్టి ఒక వినూత్న శాఖగా పెంపొందించుట జరిగినది. మహాయాన సాంప్ర దాయమునకు ప్రమాణ గ్రంథములుగా ప్రజ్ఞా పారమిత, రత్నకూట, సద్ధర్మ పుండరీక, విమల కీర్తి సూత్రములవంటి గ్రంథములను గ్రహించారు. క్రైస్తవ మతములోని ప్రొటెస్టెంటు శాఖవలె ఈ సంప్రదాయ ఆవిర్భా వానికి ముఖ్యకారణం కొందరు బౌద్ధాచార్యులకు ప్రాచీన బౌద్ధ సిద్ధాంతములపై నమ్మకం సడలిపోవటం, ఆ సిద్ధాంతములు కాలానుగుణ్యముగా లేవనే విశ్వాసం, సమకాలీన వాస్తవ మత, సామాజిక పరిస్థితులకూ, ప్రజల మనస్తత్వాలకు అవి అనుగుణంగా లేవనీ, వైదిక మతమును సంస్కరించి హిందూమతముగా మార్చి దాని వ్యాప్తికై, ప్రజారంజకంగా ప్రవేశపెట్టిన, పౌరాణిక భక్తి మార్గమును ప్రతిఘటించ టానికి, కాలానుగుణమైన మార్పులు చేర్పులు అత్యవసరమని భావించి, మహాయాన సాంప్రదాయము ద్వారా, క్షీణిస్తున్న బౌద్ధమత అస్తిత్వమును నిలుపుకొనవలెనని చేసిన ప్రయత్నమే ఈ వినూత్నశాఖ ఆవిర్భవించుటకు ముఖ్యకారణం. ముందు మనవిచేసినట్లు మహాయానము యొక్క మూల సూత్రావళి ప్రజ్ఞాపారమిత అని పిలవబడే బౌద్ధసాహిత్యము నుండి ఉద్భవించినవి. ఈ సాహిత్యమునకు మూల గ్రంథము "అష్ట సహస్రారిక" అనే గ్రంథము. క్రీ.శ. ఒకటవ శతాబ్దములో ప్రథమంగా సంకలనము చేయబడి, క్రీ.శ. 100 శతాబ్దము వరకూ మార్పులు చేర్పులతో వృద్ధి పొందింది. క్రీ.శ. 300 శతాబ్దము వరకూ విస్తృత పరచబడి, క్రీ.శ. 500లో ఆ గ్రంథము సంక్షిప్తీకరించబడి పునః పరిశీలనకు గురియైంది. క్రీ.శ.600–1200 సం॥ల మధ్యకాలంలో, బౌద్ధమునందలి తంత్రవాద శాఖ ప్రాబల్యమున చిక్కుకొని, చివరకు అందులో అంతర్భాగమయి పోయింది. బుద్ధ భగవానుడు ప్రప్రథమంగా ధర్మచక్రప్రవర్తన (ప్రవచనము) సారనాథ్ వద్ద (వారణాశి సమీపమున) చేశారు. రెండవ తూరి రాజగృహకు సమీపమున గల, గృధకూట పర్వతముపై బోధిసత్త్వుల

సమావేశములో చేశారు. పైన ప్రస్తావించిన "అష్టసాహస్రిక" గ్రంథము బుద్ధుని రెండవ ధర్మచక్ర ప్రవర్తనుండి ఉద్భవించింది. బుద్ధుని నిర్వాణానంతరము నాలుగు వందల సంవత్సరములు గడచిన పిమ్మట ఆచార్య నాగార్జునుడు, అష్ట సాహస్రికను తిరిగి వెలుగులోకి తీసుకురావటం జరిగింది. ఈ రకమైన సాహిత్యమునే ప్రజ్ఞా పారమిత అని పిలుస్తారు. అదే విధంగా రత్నకూటమని పిలువబడే సాహిత్యము కూడా ఉన్నది. ఈ సాహిత్యంలో నలభై ఒక్క గ్రంథములున్నవి. "సుఖావతీవ్యూహ", "కాశ్యపస పరివర్త", "రాష్ట్రపాల పరిపుచ్ఛ"వంటి గ్రంథములు ఆ సంఖ్యలో చేర్చ బడినవి. ప్రజ్ఞాపారమిత సాహిత్యము ప్రథమంగా దక్షిణ భారతంలో జన్మించి, తూర్పు దేశముల విస్తరించి, ఉత్తర భారతములో అభివృద్ధి చెందినట్లు అష్టసాహస్రిక వంటి గ్రంథముల ద్వారా తెలుస్తున్నది. మొదటగా అపరశైలీల చేత ప్రాకృత భాషలో రచింపబడి, అనంతరం సంస్కృత భాషలోనికి అనువదింపబడి, ఆ తరువాత కాలము నందు ఇతర భారతీయ, చైనా, ఆగ్నేయ ఆసియా, యూరప్ ఖండమునందలి అనేక భాషలలోనికి తర్జుమా చేయబడినది. ఈ సాహిత్యము ఏ ఒక్క వ్యక్తి యొక్క సృష్టికాదు. ముందు తెలియజేసినట్లు విహారములయందలి బౌద్ధ భిక్షువులు, ఆచార్యులు, సుదీర్ఘ కాలములో జరిపిన విస్తృతమైన చర్చల ఫలితంగా రూపుదిద్దు కున్న సమిష్టి కృషి ఫలితము. అందువల్లనే మహాయానము, బౌద్ధ మతమునందు ఏర్పడిన విప్లవాత్మక పరిణామంగా పరిగణింపబడినది. పైన తెలియజేసిన చర్చలు, ధాన్యకటక–శ్రీపర్వత ప్రాంతములలో నెలకొనియున్న విహారములలో జరిగేవి. మహా సాంఘికులు, చైత్యవాదులు పాల్గొనేవారు. ఆవిధంగా బౌద్ధ భిక్షువులైన ఆంధ్రులచే సమిష్టిగా, రూపుదిద్దుకున్న మహాయాన సూత్ర సాహిత్యము, వారిచే పోషింపబడి, బహుముఖ సాంప్రదాయములుగా వర్ధిల్లి, విశ్వవ్యాప్తి చెందినది. ఈ అంశముపై భారతీయ, పాశ్చాత్య చరిత్రకారులు అందరూ ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. సౌత్రాంతిక శాఖవారి అభిప్రాయమును అనుసరించి, బోధిసత్త్వుడైన మంజుశ్రీ జేతవనము (మగధ) నుండి దక్షిణ దేశములోని ధాన్యకటకమునకు వచ్చి, ఆ పట్నమును కేంద్ర ముగా చేసుకొని, అనేక ప్రాంతములలో ప్రవచనములుచేసి, తీవ్రవాదులైన నాగా జాతివారిని బౌద్ధులుగా మార్చి అనంతరము ఓఢ్ర దేశమునకు వెళ్లి, ఆ దేశపు రాజునకు అష్ట సాహస్రికా, ప్రజ్ఞాపారమితను బోధించినట్లు తెలుస్తున్నది. ఈ సాహి

త్యము మొదట ఉత్తర దేశమునకు వెళ్లి, అనంతరము టిబెట్టు, చైనా, ఆగ్నేయాసియా దేశములకు క్రీ.శ. రెండవ శతాబ్దములో వ్యాప్తిచెందినట్లు తెలుస్తు న్నది. శ్రీలంక బౌద్ధుల గ్రంథము "నికాయ సంగ్రహము"ను బట్టి, ఆంధ్రులే ఈ సాహిత్య సృష్టి కర్తలనీ, అనంతరము మహాయాన శాఖయందు జన్మించిన మాధ్యమిక వాదమునకు కూడా వారే బాధ్యులనీ తెలియజేసింది. "సుఖవాటివ్యూహ సూత్రము" బౌద్ధ మతమునందు భక్తి తత్త్వమును ప్రబోధించింది. బుద్ధునకు దివ్యత్వము నాపాదించి, లోకోత్తర బుద్ధునిగా మార్చి ఆయనను హిందువులవలె షోడశోపచారములతో పూజిం చుట ప్రారంభించారు. ఆయన ప్రవచనములకంటే, ఒక వ్యక్తిగా ఆయన వ్యక్తిత్వ మునూ, స్వయంభువుడు (ఉపపాదుక) దివ్య స్వరూపుడు (సంభోగకాయుడు) సర్వాం తర్యామి (ధర్మకాయుడు) సంకల్ప సిద్ధుడు (నిర్మాణకాయుడు) అని ప్రబోధించే త్రికాయ సిద్ధాంతం ఆధారంగా బహుబుద్ధ సిద్ధాంతమును విశ్వసించి ఆరాధించేవారు. సాధకుడు సల్పు కృషికంటే, నిర్యాణ ప్రాప్తికి బుద్ధుని అనుగ్రహమే ప్రధానమని ప్రబోధించారు.

శాఖోపశాఖలుగా చీలిపోయి, ప్రాంతీయ, స్థానిక సంప్రదాయములను జీర్ణం చేసుకొని, సైద్ధాంతిక, విభేదాలకు, కుమ్ములాటకు ఆటపట్టై, రాజాదరణను కోల్పోయి, అతి క్లిష్ట పరిస్థితులలో అస్తిత్వమే రూపుమాశి పోవునటువంటి ప్రమాదకర పరిస్థి తులలో సనాతన సిద్ధాంతములకు స్వస్తి చెప్పి, సామాన్య ప్రజానీకము యొక్క మనోభావాలకు అనుగుణంగా వారి విశ్వాసములతో, ఆచారములతో సమాధానపడి వారిని ఆకట్టుకొనవలె నని బౌద్ధులు చేసిన ప్రయత్న ఫలితమే మహాయాన శాఖ జన్మకు కారణమని మరొకసారి గుర్తుంచుకోవాలి.

■ ■ ■

# ఆచార్య నాగార్జునుడు

## (మాధ్యమిక - శూన్యవాదము)

మహాయానానికి చక్కని రూపకల్పనచేసి, అందంగా అలంకరించి, జన బాహుళ్యమునకు ఆకర్షణీయంగా మలచిన మహానుభావుడు. ఆచార్య నాగార్జునుడు. కేవలము సూత్రప్రాయంగా ఆవిర్భవించిన మహాయానాన్ని మాధ్యమిక వాదముతో మిళితంచేసి, దానిని నిర్దుష్టమైన తత్త్వంగా రూపొందించిన ఘనత నాగార్జునునిదే. బౌద్ధ సిద్ధాంతములను ప్రభావితం చేసిన నలుగురు మహనీయులలో నాగార్జునుడొకరు. కొందరి అభిప్రాయమును అనుసరించి కేవలం బౌద్ధంలోనే కాక, భారత దేశంలో ఆవిర్భవించిన ఇతర తత్త్వశాస్త్రకారు లలో నాగార్జునునికి సమానులు అయినవారెవరూ లేరని నిశ్చయింపబడినది. ఇది కొంత అతిశయోక్తి అనిపిస్తుంది.

మహాయాన శాఖకు చెందిన బీజములను బౌద్ధ మతమునందు వైతుల్యకులు నాటారు. వీరికి మహాశూన్యతావాదులనీ, వైపుల్యులనే పేర్లుకూడ ఉండేవి. మహాయాన సూత్రములకు వైపుల్య సూత్రములనే పేరు ఉంది. శూన్యతా సిద్ధాంతము, మహాయానమునకు ఆయువు పట్టైన మాధ్యమిక వాదమునకు ఊపిరి. కేవలము కరుణ ప్రధానంగా స్త్రీలతో లైంగిక సంబంధములు కూడా బౌద్ధ భిక్షువులు పెట్టుకొనవచ్చుననే వైతుల్యకుల సూత్రములే, మహాయానము, తదనంతరమావిర్భవించిన,

వజ్రయాన శాఖకు (తంత్ర యాన) పునాదిరాళ్లు. ఆవిధంగా విశ్లేషిస్తే ఆచార్య నాగార్జునుడు మహాయాన సిద్ధాంతముల సృష్టికర్తకాదు. ఆ సిద్ధాంతములను పెంచి, పోషించి, క్రమబద్ధీకరించి విశ్వవ్యాప్తము చేసిన ఆచార్యుడు. క్రీ.శ. రెండవ శతాబ్దమునకే మహాయాన బౌద్ధము, భారతదేశమునందు, పొరుగున ఉన్న భూటాన్, టిబెట్టు, గాంధారము, బర్మా, చైనా, థాయిలాండ్ మరికొన్ని ఆగ్నేయాసియా దేశము లలో వ్యాపించింది. బౌద్ధ సాహిత్యము నాగార్జునుని సిద్ధపురుషుడనీ, రెండవ బుద్ధుడనీ కీర్తించింది. హాడ్సన్ అనే ఒక ఆంగ్లేయాధికారి, నేపాలు దేశమునందు సంగ్రహించిన వ్రాత ప్రతులలో నాగార్జునుని మాధ్యమికవాద మూలగ్రంథమూ, ఆ గ్రంథముపై చంద్రకీర్తి రచించిన "ప్రసన్నపద వ్యాఖ్య" అనే వ్యాఖ్యాన గ్రంథమూ రెండూ ఉన్నవి.

ఆ గ్రంథములను పరిశీలించిన పాశ్చాత్య పండితులు బర్నాఫ్, సెంయిట్ హిల్లరీ, మాక్స్‌ముల్లర్‌లు, అల్పములైన అభిప్రాయములను వెలిబుచ్చారు. కేవలము అది శూన్యవాద గ్రంథమని త్రోసిపుచ్చారు. అయితే ఇరువది ఐదు సంవత్సరముల అనంతరం ప్రఖ్యాత రష్యన్ తత్త్వవేత్త స్టెచర్ బాస్కీ ఆయన రచించిన "The Conception of Buddhist Nirvana" (బౌద్ధుల నిర్వాణ భావన) అనే గ్రంథంలో, పైన పేర్కొన్న పాశ్చాత్య తత్త్వవేత్తల అభిప్రాయములను ఖండించి, నాగార్జునుని, ఆది శంకరుడు, కాంట్, హెగల్ వంటి తత్త్వవేత్తల పంక్తిలో చేర్చాడు. థామస్ వాటర్స్ నాగార్జునుని, బౌద్ధధర్మము నందలి ఉత్తర భాగములో అతడొక దురూహ్యమైన, అత్యద్భుత వ్యక్తియని వర్ణించాడు. నాగార్జునుని ప్రత్యర్థులు కూడా ఆయనను శ్లాఘిస్తూ, భారతీయ తత్త్వశాస్త్ర మేధావులలో నాగార్జునుని మించినవారు లేరంటే అతిశయోక్తి కాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు, నాగార్జునుని బుద్ధుని అవతారమేనని విశ్వసిస్తారు. అయితే నాగార్జునునకు సంబంధించిన అన్ని విషయ ములూ దురావగతములైయున్నవి. జన్మస్థలము, జన్మదినము, తల్లిదండ్రుల పేర్లు వంటి, ఆయన వ్యక్తిగత విషయములన్నీ వివాదాస్పదములైనవి. కొందరు ఆయన విదర్భకు చెందిన బ్రాహ్మణుడన్నారు హూయాన్‌సాంగ్ వ్రాతలను అందుకు ఆధారంగా చూపించారు. మరికొందరు ఆయన జన్మ స్థలము కాంచీపురం అన్నారు. అయితే శ్రీలంకకు చెందిన "లంకావతార సూత్రము" లోని రెండు పాదములు ఈ విధంగా తెలియజేస్తున్నవి "దక్షిణాపథ వేదాలయం భిక్షు శ్రీమాన్ మహాశయ నాగార్జున"

దీనిని బట్టి శ్రీస్థానము (ధాన్యకటకము) నకు పడమటి దిశలోనూ, శ్రీపర్వతము (నాగార్జున కొండ)కు తూర్పు దిశలోను ఉన్న వేదుల గ్రామమే ఆయన జన్మస్థలమని తెలుస్తున్నది. టిబెట్టుకు చెందిన బౌద్ధ గ్రంధాలుకూడా ఈ విషయమును సమర్ధిస్తున్నవి. ఈనాడు వేదుల అనే పేరుతో గ్రామము పల్నాడులో ఉన్నదో లేదో తెలియదు. ఒకవేళ ఉన్నా పేరు మారిపోయి మరో పేరుతో వ్యవహరింపబడుతూ ఉండవచ్చు. ఏది ఏమైనప్పటికీ ఆంధ్రదేశములో వేదుల అనే ఇంటిపేరుగల బ్రాహ్మణులున్నారు. వారిలో చాలామంది ఉన్నత స్థానములలో సమాజము నందు గౌరవప్రదంగా జీవిస్తున్నారు. అదేవిధంగా ఆయన జన్మించిన తేదీ కూడా వివాదంలో చిక్కుకున్నది. కొందరు పండితులు ఆయన కుషానుల రాజైన కనిష్కునికి (క్రీ.శ.124-128) సమకాలీనుడన్నారు. అయితే బౌద్ధాచార్యుల పరంపరలో కనిష్కునికి సమకాలీనుడైన అశ్వఘోషుని అనంతరం, రెండు తరముల తరువాతివాడుగా తెలుస్తున్నది. పైగా ఆనాటికి మహాయాన శాఖావిర్భావం జరుగనేలేదు. కాశ్మీరు రాజవంశావళి రచయితైన కల్హణుడు తన రాజతరంగిణిలో నాగార్జునుడు కుషాను రాజవంశములోని హస్తిక, జుషక మరియు రెండవ కనిష్కునకు సమకాలీనుడని వ్రాశాడు. ఆంధ్ర చరిత్రకారులందరూ ఆచార్య నాగార్జునుడు శాతవాహన వంశీయుల పాలనా కాలంలో జీవించియున్నట్లు ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. కానీ ఏ రాజు కాలంలో నాగార్జునుడు జీవించి ఉన్నాడనే విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. కొందరు ఆయన గౌతమీపుత్ర శాతకర్ణికి సమకాలీనుడు అన్నారు. హూయాన్‌సాంగ్ వ్రాతలలో ఈయన ఇన్‌బింగ్ అనే రాజు ఆదరము పొందినాడని వ్రాశాడు. ఇన్‌బింగ్ అంటే యజ్ఞశ్రీ శాతకర్ణియని కొందరి విశ్వాసం. నాగార్జునుని జీవిత చరిత్రను క్రీ.శ. 400లో తర్జుమా చేసిన కుమార జీవుడు ఆయనను క్రీస్తు తరువాత రెండవ శతాబ్దము నకు చెందిన వాడన్నాడు. అయితే క్రీ.శ. మొదటి శతాబ్దము నందే ఆచార్య నాగార్జునుని సిద్ధాంతములు ప్రచారములో ఉన్నట్లు కొందరు పండితులు విశ్వసిస్తున్నారు. మొదటగా మాధ్యమిక శాస్త్రమును పరిష్కరించి, చంద్రకీర్తి వ్యాఖ్యానంతో పాటు క్రీ.శ. 1897లో ప్రచురించిన శరశ్చంద్ర దాసు వ్రాతలను బట్టి ఆచార్య నాగార్జునుడు ధోరభద్రుడనే టిబెట్టు పండితుని, క్రీ.పూ. 58వ సంవత్సరములో బౌద్ధునిగా మార్చినట్లు తెలుస్తున్నది. డాక్టరు విద్యాభూషన్ పండితుడు, ఆచార్యులవారు క్రీ.శ. మూడవ

శతాబ్దికి చెందినవారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈవిధంగా పండితులందరికీ ఈ విషయమై ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్ని టిబెట్టు బౌద్ధ గ్రంథములు ఆచార్య నాగార్జునుడు 500 సంవత్సరములు జీవించినట్లు, అనేక సిద్ధులను సంపాదించినట్లు, తెలియజేస్తున్నవి. అయితే ఇది నమ్మదగినదిగానూ, హేతుబద్ధముగానూ లేదు. బహుశా వారు మహాయానాచార్యుడైన నాగార్జునుని, వజ్రయాన శాఖ సృష్టికర్తయైన సిద్ధ నాగార్జునునిగా పొరపడి ఉంటారు. సిద్ధ నాగార్జునుడు క్రీ.శ. 7వ శతాబ్దంలో జీవించాడు. ఈ గందరగోళమునకు కారణమేమంటే బౌద్ధమతమునందు క్రీ.శ. రెండవ శతాబ్దము నుండి, పండ్రెండవ శతాబ్దము వరకూ నాగార్జునుడనే పేరుగల భిక్షువులు ఐదుగురున్నారు.

సాంప్రదాయకంగా వస్తున్న నమ్మకమేమంటే, ఆచార్య నాగార్జునుడు శ్రోత్రియ మైన బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడనీ, వేదవేదాంగములతోపాటు ఇతర శాస్త్రములను కూడా క్షుణ్ణంగా అధ్యయనము చేశాడనీ, అయితే ఆయన బౌద్ధుడుగా మారటానికి కారణమూ, ఎప్పుడు మారాడనే విషయమూ, చరిత్ర గర్భంలో కలసి పోయినవి. ఈ విషయములపై అనేక విధములైన కథలూ, గాథలూ ప్రచారములో ఉన్నప్పటికీ, వాస్తవ నిరూపణకు తగిన ఆధారములు వేటికీ లేవు. చైనీయ బౌద్ధులు చెప్పిన దాని ప్రకారం నాగార్జునుడు యౌవనంలో "అంతర్ధాన సిద్ధి" (మాయమై పోవుట)ని దురూపయోగపరచి, తన శారీరక వాంఛలను తీర్చుకొనడానికై రాజుల అంతఃపురములలోనికి ప్రవేశించేవాడనీ, ఒకరోజు పట్టుబడి పోయాడనీ, అయితే భగవంతుని దయవల్ల మరణశిక్ష నుండి తప్పించుకున్నాడనీ, ఆ తరువాత బ్రతుకుపై విరక్తిచెంది బౌద్ధ సంఘములో చేరాడని. టిబెట్టు గ్రంథములు మరో విధంగా తెలియజేస్తున్నవి. నాగార్జునుడు పసిపిల్లవాడుగా ఉండగానే అతని ఆయుర్దాయము ఏడు సంవత్సరములు మాత్రమేనని చెప్పిన జ్యోతిష్యుల మాటను నమ్మిన ఆయన తల్లిదండ్రులు అనాథగా వదలివేశారట. కానీ ఏదో విధంగా బ్రతికి బట్టకట్టిన నాగార్జునుడు, బౌద్ధమునకు కేంద్రమైన నలందా విశ్వవిద్యాలయము చేరి రాహుల భద్రునికి శిష్యుడైనాడట. దీర్ఘాయుష్యును పొందగలిగే మంత్రమును గురువు ఉపదేశిం చాడట. ఇటువంటి కథలలో వాస్తవము ఎంత ఉన్నప్పటికీ ఒక్క విషయము మాత్రము సత్యము. జ్ఞాన సముపార్జనకై, నాగార్జునుడు దేశమంతటా పర్యటించాడు. అనేక

సంఘా రామములలో నివశించాడు. అనేకమంది గురువులకు శుశ్రూష చేశాడు. నలందా విశ్వ విద్యాలయంలో విద్యార్థిగానూ, ఆచార్యునిగానూ నివసించాడు. ఆ కాలములోనే అనేక బౌద్ధమత గ్రంధములతో పాటు ప్రజ్ఞాపారమితా సిద్ధాంత సూత్రములు, రత్నకూట వర్గ సాహిత్యమునకు మూలగ్రంధమైన "అష్టసాహస్రిక", "అవతాంశక", "సద్ధర్మ పుండరీక", "సుఖావతి", "కాశ్యప పరివర్తన సూత్రము", "విమలకీర్తి నిర్దేశిక సూత్రము"లు వంటి మహాయాన శాఖకు సంబంధించిన గ్రంధములుకూడా క్షుణ్ణంగా అధ్యయనము చేయుటవలన ఆయనకు మాధ్యమిక వాద సృష్టికి ప్రేరణ కలిగింది. కొందరు మహాయాన శాఖీయులు, నాగార్జునుడు మహాయాన సిద్ధాంతములను నాగలోకము నుండి తెచ్చినట్లు చెబుతారు. వారా విధంగా చెప్పేవిషయములలో వాస్తవికత లోపించింది. బహుశా వారు నాగలోకము అన్న ప్రాంతము నాగజాతివారు వసించిన కృష్ణానదీ సాగర సంగమ ప్రాంతమయి ఉండవచ్చును. కొంతకాలము తరువాత తీవ్రవాదులు, వైదిక ధర్మ వ్యతిరేకులైన ఈ నాగ జాతివారు బౌద్ధ మతము స్వీకరించి ఆంధ్రజాతిలో కలసిపోయారు.

ఆచార్య నాగార్జునుడు–శ్రీపర్వత ప్రాంతము (నాగార్జునుని కొండ) కేంద్రముగా చేసుకొని మహాయాన సాంప్రదాయమునకు చెందిన గ్రంధరచనతో పాటుగా అనేక మంది ఇతర మతస్థులను, ఇతర బౌద్ధ శాఖీయులను తన మహాయాన శాఖలోనికి మార్చినాడు. తన శాఖను వ్యాప్తి చేయవలెననే దృఢ సంకల్పంతో తన శిష్యులలో అనేక మందికి ప్రత్యేకశిక్షణ ఇచ్చి ప్రచారకులుగా వారిని దేశవ్యాప్తంగా సాగనంపాడు. నాగార్జునుడు గొప్ప తార్కికుడు. శాతవాహన రాజులలో గుర్తు తెలియని చక్రవర్తి, ఆచార్యునికీ ఆయన శిష్యుల ఉపయోగార్ధమై ఒక మహాచైత్యమునూ, మహావిహారము నిర్మించి ఆయనకు దానంచేశాడు. టిబెట్టు గ్రంధములలో, ఆచార్యులు ధాన్య కట కములోని మహాచైత్యము చుట్టూ రాతితో అందమైన ప్రాకారము నిర్మించినట్లు వ్రాసియున్నది.

నాగార్జునుడు రచించినట్లుగా తెలియజేస్తూ, చైనా, టిబెట్టు భాషలలో అనేక వందల గ్రంధములు ఉన్నవి. అయితే వాటిలో చాలాభాగం ఆయన రచనలు కావని పండితుల అభిప్రాయము. ముందు తెలియజేసినట్లు బౌద్ధమతములో నున్న ఐదుగురు నాగార్జున నామము కలవారిలో ఎవరైనా కొన్నిటిని వ్రాసి ఉండవచ్చును.

ఆచార్య నాగార్జునుని రచనలుగా ఆమోదించబడినవి ఇరువది గ్రంథములున్నవి. అయితే ఇవి ఎక్కువగా చైనా, టిబెట్టు భాషలలోనే లభించినవి. బహు కొద్దిగా సంస్కృత భాషలో ఉన్నవి. ఆయన రచనలలో కొన్ని ఆయన సిద్ధాంతములపై ఆయనే వ్రాసిన వివరణలు, మరికొన్ని ఇతర సంప్రదాయములపై వ్రాసిన విమర్శ గ్రంథములు, ఇంకొన్ని ఇతరుల రచనలపై, ఆయన వ్రాసిన వ్యాఖ్యానములు. అధిక భాగం ఆయన బోధనలు శ్రావకులకు నిర్దేశ సూత్రములు. హైందవులు దేవతలను ఆరాధించిన విధంగానే, బుద్ధ భగవానుని కూడా ఆరాధించవలసిన దని చెప్పే భక్తి గ్రంథములు. చక్రవర్తులనూ, సామాన్య ప్రజలనూ ఉద్దేశించి సత్ప్రవర్తనపై వ్రాసిన రచనలు, లిండ్నటర్ అనే ప్రఖ్యాత పరిశోధకుడు, ఆచార్య నాగార్జునుని గ్రంథములపై పరిశోధన జరిపి, పరిశోధనా ఫలితములను తాను రచించిన "నాగార్జున" అనే గ్రంథములో తెలియజేస్తూ, నాగార్జునుని రచనలని గట్టిగా నమ్మిన పదమూడు గ్రంథముల పేర్లు వ్రాసినాడు.

అవి (1) మూలమాధ్యమిక కారిక (2) విగ్రహవ్యావర్తిని (3) శూన్యతా సప్తతి (4) యుక్తి షష్టిక (5) వైదళ్య ప్రకరణ (6) వ్యవహార సిద్ధి (7) చతుస్తవ (8) రత్నా వళి (9) సుహృలేఖ (10) పతీత్యసముత్పాద హృదయకారిక (11) సూత్ర సముచ్ఛయ (12) బోధిచిత్త వివరణ (13) బోధిసంభారక.

పై గ్రంథములలో 1, 2, 7 మరియు 10 సంఖ్యగల గ్రంథములు పూర్తిగా సంస్కృత భాషలో లభిస్తున్నవి. రత్నావళి పాక్షికంగా లభిస్తోంది. మిగిలిన గ్రంథము లన్నీ చైనా టిబెట్టు భాషల నుండి చేసిన అనువాద గ్రంథములు మాత్రమే. బౌద్ధులు నాగార్జునుని ప్రఖ్యాత గ్రంథమైన "మూలమాధ్యమిక  కారిక" ఆచార్య చంద్రకీర్తి వ్రాసిన ప్రసన్న పదపాద వ్యాఖ్యాన సహితంగా సంపూర్ణంగా లభించుట వారి అదృష్టంగా భావిస్తారు. పైన ఉటంకించిన గ్రంథము 447 కారికలతో (వివరణ) 27 అధ్యాయములు కలిగి ఉన్నది. టిబెట్టు భాషలో చంద్రకీర్తి రచన గాక మరో మూడు ఇతర వాఖ్యాన గ్రంథములు కలవు. అవి "అకుతోభయ వ్యాఖ్య" "బుద్ధ పాలిత వృత్తి", భావవివేకుని "ప్రజ్ఞా ప్రదీప". నాగార్జునుని మాధ్యమిక కారికలను "మాధ్యమిక శాస్త్ర", "మాధ్యమిక సూత్ర", "ప్రజ్ఞ" మరియు "మూల ప్రజ్ఞ" అనికూడా వ్యవహరిస్తారు. అధ్యాయముల పేర్లు మూల గ్రంథములో ఉన్నట్లే వ్యాఖ్యానములలో

కూడా ఉన్నవి. కానీ ఎనిమిది అధ్యాయముల పేర్లు మాత్రము చంద్రకీర్తి వ్యాఖ్యానమైన ప్రసన్న పద వ్యాఖ్యలో మార్చబడినవి. ఈ మార్పు ఎందుకు జరిగిందో తెలియదు. లిండట్నర్ చేసిన, ఆంగ్ల అనువాదములో ఇచ్చిన 27 పేర్లను మూల గ్రంథములో ఉన్న విధంగానూ, చంద్రకీర్తి వ్యాఖ్యానంలో ఇచ్చిన పేర్లనూ బ్రాకెట్లలోనూ ఇవ్వటం జరిగింది. ప్రతిపేరు చివరను పరీక్ష అని చేర్చుకుని చదువుకోవాలి. మూల గ్రంథ ములలోనూ, వాటిపై రచించిన వ్యాఖ్యానములలోను ఉపయో గింపబడిన పారిభాషిక పదజాలము యొక్క అర్థం, సులభంగా తెలియడంకోసం, ఆ పదమునకు నిర్వచనం (లక్షణం) చెబుతారు. వారు ఇచ్చిన నిర్వచనం సరియైనదా ? కాదా ? అనే విషయ మును పాఠకులు పరిశీలించుకోవాలి. అట్టి పరిశీలననే పరీక్ష అంటారు.

**ఇరువది ఏడు అధ్యాయముల పేర్లు :**

(1) పత్యయ (2) గతాగత గమ్యమాన (గతాగత) (3) ఆయతన (చక్షురా దింద్రీయ) (4) స్కంధ (సరాసరులు) (5) ధాతు (6) రాగరక్త (7) ఉత్పాతసి స్థితి భంగ (సంస్కృత) (8) కర్మకారిక (9) ఉపాదాతృపాదన (పూర్వాపర) (10) అగ్నింధన (11) సంసార (పూర్వాపర కోటి) (12) దుఃఖ (13) తత్త్వ (సంస్కార) (14) సంసర్గ (15) భావాభావ (స్వభావ) (16) బంధమోక్ష (17) కర్మఫల (18) ఆత్మధర్మ (ఆత్మ) (19) కాల (20)హేతుఫల (సామాగ్రి) (21) సంభవ విభవ (22) తథాగత (23) విపర్యాస (24)ఆర్యపత్య (25) నిర్వాణ (26) ద్వాదశాంగ (27) దృష్టి.

మూల గ్రంథమునందు గల అధ్యాయముల పేర్లు పైన తెలుపబడినవి. బ్రాకెట్ల (కుండలీకరణముల) యందు ఎనిమిది అధ్యాయములకు చంద్రకీర్తి ఇచ్చిన పేర్లీ యబడినవి.

సుహృల్లేఖ పేరుకు తగినట్లుగానే నాగార్జునుడు శక పహ్లవ రాజును ఉద్దేశించి, రాజు, ప్రజలు కూడా నీతిగా ప్రవర్తించుటకు గానూ, రాజనీతి, పరిపాలన, నైతిక విలువలు, మానవత్వము ధ్యాన, ప్రజ్ఞ, నిర్వాణ ఆదిగాగల అనేక లౌకిక, పారలౌకిక విషయములపై బోధించుట జరిగింది. అదేవిధంగా "రత్నావళి"యనే గ్రంథాన్ని గౌతమీపుత్ర శాతకర్ణియనే శాతవాహన రాజు నుద్దేశించి వ్రాయబడినట్లు భావిస్తు న్నారు. అయితే ప్రస్తావించబడిన రాజుల గుర్తింపు విషయములో పండితులకు, చరిత్రకారులకు మధ్య ఏకాభిప్రాయము కొరవడింది.

మహాయాన శాఖకు చెందిన మూల సూత్రములను సంక్షిప్తంగా ఈ క్రింద నీయబడినవి.

**1. బుద్ధుని దివ్యత్వము :** మహాయాన సంప్రదాయము బుద్ధుని దివ్యత్వము, ఆయనకు గల దివ్య శక్తులపై దృఢమైన విశ్వాసము ప్రకటించింది. ఈ విశ్వాసము నాధారము చేసుకొని, మహాయానంలో అనేక సిద్ధాంతములు ఆవిర్భవించినవి. వారుబుద్ధుడు చారిత్రక పురుషుడు కాదనీ స్వయంగా ఉద్భవించిన దివ్యపురుషుడనీ (ఉపపాదుక), దివ్య స్వరూపుడనీ (సంభోగకాయుడు), సర్వాంతర్యామియనీ (ధర్మకాయుడు), సర్వజ్ఞు డనీ (నిర్మాణకారుడు), ఏకాలములో నైనా, ఎక్కడైనా తన సంకల్ప మాత్రముననే అవతరించగలడనీ, దృఢంగా నమ్ముతారు. దీనిని త్రికాయ సిద్ధాంతమని వ్యవహరిస్తారు. ఈ సిద్ధాంతము నుండే బహు బుద్ధసిద్ధాంతము ఆవిర్భవించింది. దుఃఖభరితు లైన మానవాళిని ఉద్ధరించుటకుగాను, ఆదిబుద్ధుడు, తన శరీరములోని ఐదు భాగముల నుండీ, ఐదుగురు బుద్ధులను సృజించాడు. వారు వైరోచన, రత్నసంభవ, అమితాభ, అమోఘసిద్ధి, మరియు అక్షోభ. అంతేకాకుండా భోధిసత్వులనుకూడా లోకశోక నివారణకు పంపుతాడు. బోధిసత్త్వులంటే పరిపూర్ణమైన ప్రజ్ఞను సాధించి బుద్ధత్వ ప్రాప్తికి అర్హులైనవారు. అయితే బోధిసత్త్వ పదానికి అనేకమంది పండితులు పలు రకములుగా అర్థం చెప్పారు. కొందరు పదోత్పత్తి నాధారంగా వివరిస్తే మరి కొందరు సిద్ధాంత పరమైన వివరణ ఇచ్చారు. డాక్టరు హరిదయాళ్ తన గ్రంథమైన "బోధిసత్త్వ సిద్ధాంతము" (Doctrine of Bodhisadvas) లో ఈ పదమునకు అనేకార్థములను తెలియజేశారు. చివరకు వారు పాళీభాషలో ఈ పదమునకుగల ఆదర్శము లేక భావమునే సరియైన అర్థముగా గ్రహించవలెనని తెలియజేశారు. పాళీభాషలోనూ, సంస్కృతము లోనూ "బోధి" పదమునకు ఒకే అర్థమున్నది. అది జ్ఞానవికాసము. అయితే "సత్వ" అనే సంస్కృత పదమునకు రెండు భాషలలోనూ వేరు వేరు అర్థములున్నవి. వేదముల లోని "సత్యము" అనే పదమునకు సంబంధించి దృఢ సంకల్పుడు, సాహసవంతుడు, ఒక నాయకుడు, ఆధ్యాత్మిక వీరుడు అనే అర్థము లేర్పడతవి. బోధిసత్త్వ భావన, ప్రాచీన బౌద్ధమతము నందలి అర్హతునికి ప్రత్యామ్నాయంగా, మహాయాన సంప్రదాయంలో ప్రవేశపెట్టబడింది. నాగార్జునుడు అమితాభ బోధిసత్త్వుని ఆరాధకుడు. దివంగతుడు అగుటకు ముందుగా ఆయన తనముఖమును అమితాభ బుద్ధుని వైపు తిప్పుకొన్నా రట. ఆ విధంగా నిర్వాణమును పొందాడు.

**2. బోధిసత్త్వులపై విశ్వాసము :** మహాయాన బౌద్ధము బోధిసత్త్వులను మానవాతీత శక్తులతో సృజించింది. బోధిసత్త్వులు షట్ పారమితలను కలిగియుంటారు. ఆ విధానము శీలము, క్షమా, వీర్య, ధ్యాన, ప్రజ్ఞలనే ఆరు పరిపూర్ణతలు లేక సమగ్రతలు. ఆ విధమైన ఉన్నత పరిపూర్ణతలను పొంది, బోధిసత్త్వులు బుద్ధత్త్వమునకు అర్హు లౌతారు. హీనయానులు, పది పారమితలను ప్రతిపాదించారు. అయితే మహా యానులు, పదింటిలోనూ ఆరు మాత్రమే ముఖ్యమైనవనీ, మిగిలిన నాలుగు పార మితలు అనుబంధములు మాత్రమేనని చెప్తారు. ఆ మిగిలిన నాలుగు పారమిత లేవంటే ఉపాయ, కౌశల్యము, ప్రణిదానము, బలము, జ్ఞానము. ముందు చెప్పినట్లు ఆరు పారామితలను పొందియుండి బుద్ధత్వమునకు అర్హులైనప్పటికినీ, బోధిసత్త్వులు నిర్వాణమును త్యాగముచేస్తారు. బాధితులైన మానవాళియందు గల కరుణయే ఇందుకు కారణము. లోకమునందలి దుఃఖమును తొలగించువరకూ, సర్వజీవులకు వారు సాయపడి దుఃఖరహితులుగా చేస్తారు. మానవ కళ్యాణమునకు శ్రమిస్తారు. బౌద్ధ గ్రంథములు కొన్ని బుద్ధుని కంటే బోధిసత్త్వులే గొప్పవారని ప్రశంశిస్తాయి. ప్రతి వ్యక్తీ బోధిసత్త్వుడు కాగల అవకాశములున్నవి.

**3. శూన్యతావాదం :** మహాయానశాఖ అనాత్మ (ఆత్మ లేకపోవుట), అనిత్య (అశాశ్వ తము) వాదములకు పరాకాష్టగా శూన్యతా వాదమును ప్రతిపాదించింది. ధేరవాదులు ఆత్మ అస్తిత్వమును తృణీకరించగా, మహాయాన వాదులు, ఆత్మ మరియు జగత్తుల యొక్క అస్తిత్వమును త్రోసిపుచ్చారు. ఏ అంశమైనా సాపేక్ష్యమే అయినప్పుడు అది శూన్యమే అవుతుందిగానీ వాస్తవముకాదు. "ముక్తేషు శూన్యతాదృష్టేః తదార్ధ శేషభావనః" శూన్యతే యదార్ధము, విశిష్టమైన పరమ సత్యము. ప్రజ్ఞద్వారా దానిలోనికి ప్రవేశించుటయే నిర్వాణము. శూన్యతను అంతర్బుద్ధితో అనుభవించవలెనే గానీ అది ప్రత్యయాత్మకము కాదు. చేరగలిగినది కాదు. బహిర్గతములైన, సర్వవస్తువులూ ఊహా జనితములే లేక మాయ. వాటి అస్తిత్వము, అనాస్తిత్త్వములు రెండూ భ్రమ జ్ఞానమువల్ల కలుగునవే. "యధాన సమవిద్యాంతే తథా సంవిద్యతే". ఇదియే మాయ. ప్రజ్ఞను అంత ర్బుద్ధితో మేల్కోల్పినప్పుడు శూన్యతను పొందవచ్చును. అది లభిస్తుంది. సర్వమూ శూన్యమే. శూన్యము కూడా శూన్యమే. సర్వమూ శూన్యమేనని అన్నిటినీ కాదనడం వల్ల, ప్రజ్ఞ మేల్కొంటుంది. జ్ఞానము లభిస్తుంది. ప్రజ్ఞ వినాధ్యానము

లభించదు. ధ్యానము లేక ప్రజ్ఞ లభించదు. ప్రజ్ఞ, ధ్యానములను ఈ రెండు గుణము లను ఎవరు పొంది ఉంటారో, అటువంటివారికి అస్తిత్వమనే ఈ మహాసాగరము గోష్పాదమువలె కనిపిస్తుంది. ప్రజ్ఞ, ధ్యానములను బాగుగా గ్రహించుట ద్వారా నిర్వాణమును చేరవచ్చును. అదియే శూన్యత. నిర్వాణము రెండు విధములు, నిరు పాధి శేష నిర్వాణము, సోపాధి శేష నిర్వాణము. మొదటి విధానము నందు ఎటు వంటి ఆధారములుండవు (నిరుపాధి). పంచ స్కంధములు (ఐదు సగటులు) కరగి పోతవి. నశించును. రెండవ విధానమునందు, ఆధారము (సోపాధి) పంచ స్కంధ ముల అస్తిత్వము నశించదు. కానీ వాటి శూన్యతను గ్రహించవచ్చును. ఆ విధంగా శూన్యతకు నిర్వాణముతో సమానత పాటించబడినది.

**4. అద్వయవాదము :** ఈ సృష్టిలో పుట్టిన ప్రతి జీవికీ జీవించే హక్కు ఉన్నది. ఇది సర్వజీవులకూ సమాన ధర్మం. జీవించుట అద్వయం. అవిభాజ్యం. ఈ విధమైన అద్వయమునకు అనాత్మ సిద్ధాంతమే మూలం. బుద్ధుడు అద్వయవాదని అమరకోశం పేర్కొంటున్నది. అందువల్ల సర్వప్రాణులలోనూ ఏకత్వమే సిద్ధం. సృష్టిలో గోచరమగు వివిధ వస్తువులు ఏకత్వమునుండి ఉద్భవించిన భిన్నత్వములే. పరస్పరాధార భూత ములే. పదార్థముల యొక్క సహజ గుణములను, ఆకారములను, ప్రత్యక్షముగా దర్శించటమే ప్రజ్ఞ. ఇదికూడా అద్వైతమే. ఈ స్థితిలో ప్రజ్ఞ, అస్తిత్వము భావాతీతమై అస్తిత్వమును కూడా అందనిస్థితిని పొంది ఉంటుంది. అనాస్తిత్వము, యదార్థము, భ్రమ, ఆత్మ, అనాత్మ వంటివి ఊహాతీతమై ఉంటవి. మాయచే ఆవరించబడి భిన్న ప్రకృతులుగల ఈ ప్రపంచము నకు పరిమితులను విధించుటగానీ, అద్వయమును విశ్లేషించి, దానియొక్క మూలప్రకృతిని నిర్వచించుటకు ప్రయత్నించుటగానీ వ్యర్థ చర్యలు. చంద్రకీర్తి తన ప్రసన్న పదవ్యాఖ్యలో మాధ్యమిక వాదమును అస్తిత్వ నాస్తిత్వ వాదాల తొలగించి మోక్షపురానికి పోయే అద్వయ మార్గాన్ని ప్రకాశపరచే వాదము అని ప్రకటిస్తూ ఇది నాస్తికత్వము కాదని దృఢంగా తెలియజేశాడు. బుద్ధ భగవానుని ప్రతీత్య–సముత్పాదయ సిద్ధాంతము (ప్రతి వస్తువుకు పూర్వోపాధి ఉంటుం దని)ను విపులీకరిస్తూ నాగార్జునుడు “అష్టాంతీల” లేక ఎనిమిది ప్రతీకూలములను తెలియజేశాడు. అవి పుట్టుకకాదు, చావుకాదు, ఏకత్వము కాదు, భిన్నత్వము కాదు, అది ప్రవేశము కాదు, నిర్గమనము కాదు, అది ఒక్కటీ కాదు, అనేకము  కాదు.

పరస్పరాధారము, ప్రతీత్య సముద్పాదము. పదార్థములయందు వస్తువులయందు గోచరించే భిన్నత్వము కేవలమూ భ్రమ. ఈ సిద్ధాంతమును ఆమోదించినచో సర్వసృష్టి ఏకముగా గోచరిస్తుంది. ఆ ఏకత్వమునందే సర్వసృష్టి తాదాత్మ్యకత చెంది ఉంటుంది. ఉపనిషత్తులో చెప్పినట్లు "ఆత్మవత్ సర్వభూతాని" అనే భావన చరాచర సృష్టిలోని సర్వజీవుల పట్ల కరుణా దృష్టిని ఒనగూరుస్తుంది. ఈ విధంగా జనించిన కరుణకు ప్రజ్ఞ (జ్ఞానము) దోహదము చేస్తుంది. ఆలంబనమౌతుంది. సమధి రాజ సూత్రము ననుసరించి, బోధిసత్త్వుడు తన జ్ఞానము, సర్వమునూ త్యాగముచేసి, దోషరహితుడై, మచ్చలేని శీలము కలిగినవాడు అవుతాడు.

**5. సార్వజనిక నైతిక సూత్రావళి :** మానవులందరూ నీతిగా మనుగడ సాగించుటకు పాటించవలసిన నైతిక నియమములను, మహాయాన సిద్ధాంతములయందు పొందు పరచారు. బోధిసత్త్వభావనకూ, అద్వయ సిద్ధాంతానికి, అనుగుణంగా ఈ సూత్రావళి రూపొందించ బడింది. ఈ  నీతి నియమములు ప్రతివ్యక్తికీ అనువర్తిస్తవి. లోక కళ్యాణార్థమై ప్రతి వ్యక్తీ, ఈ సమ్యక్ ధర్మ కార్యములను ఆచరించి తీరాలి. మహాయాన శాఖలో ఈ విధమైన నియమావళి అమలు పరచుటకు ఒక ముఖ్యమైన కారణ మున్నది. అదేమంటే థేరవాద సిద్ధాంతమును అనుసరించి ప్రతి సాధకుడూ నిర్వాణ స్థితిని పొందుటకు స్వయం కృషి ద్వారా అర్హతుడు కావాలి. అంతేకానీ, ఇతరుల సహాయము వలనగానీ, ఇతరుల పుణ్యఫలమును పొందుటవలన గానీ, అర్హతత్త్వ మును, నిర్వాణ స్థితిని పొందరాదు. థేరవాదుల ఈ నియమమును ఖండించుట కొరకై మహాయానులు నైతిక నియమావళి సమకూర్చుట జరిగినది. ఈ నైతిక సూత్రములను అనుసరించి సాధకుడు తను సంపాదించుకున్న పుణ్యమును స్నేహి తులతోనూ, బంధువులతోనూ ఇతర ఆశ్రిత జనులతోనూ పంచుకొనవచ్చును. తద్వారా పుణ్యసంపాదనకు చేయు కృషినీ, తత్ఫలితముగా వచ్చు పుణ్యమునూ సామూహికంగా అనుభవించవచ్చును. ప్రతి సాధకుడూ ప్రతివ్యక్తీ, ఈ నైతిక నియమావళిని క్రమశిక్షణతో పాటించుట ద్వారా, బుద్ధత్వమును పొందుటకు కృషి సల్పుతున్న ఇతరుల సుగుణ శీలతనూ, ధర్మాచరణమునూ, ఆహ్లాదకరంగా అనుభ వించవచ్చును. నాగార్జునుడు సుహృల్లేఖలో చెప్పినట్లుగా ప్రతివ్యక్తీ, ఈ నియమావళిని పాటిస్తే, త్వరగానో, ఆలస్యంగానో నిర్వాణ స్థితిని పొందుట తథ్యము.

**6. బుద్ధుని దివ్యత్వము – ఆరాధన :** బౌద్ధ సంఘము, హీనయాన (థేరవాదము) మహాయానమనే రెండు శాఖలుగా చీలిపోవుటకు ముఖ్యమైన కారణములలో ఒకటి బుద్ధునికి దివ్యత్వమూ, మానవాతీత శక్తులను ఆపాదించుట మరియు బోధిసత్త్వుల ఆవిర్భావము. మహాయానశాఖ బుద్ధునకు అలౌకిక శక్తులను ఆపాదించి, 'అనేక సంద ర్భములలో అనేక విధములుగా అవి ప్రదర్శింపబడినట్లు ప్రచారము జరపటం. ఆయన అభిధమ్మమును (బుద్ధ ప్రవచన వ్యాఖ్యానములు) ముప్పదిమూడు దేవతలకు స్వర్గమునందు ప్రబోధించినాడనీ, స్వర్గము నుండి మెట్లమీదుగా, భూమికి దిగివచ్చి నాడనీ, ప్రచారం చేయటం, ఆయన ప్రవచనములకు మించి, బోధివృక్షమునకూ, ఆయన నిత్య కృత్యముల యందు వాడుకొన్న వస్తు సముదాయమునకు ప్రాధాన్యత నీయడం. బుద్ధచరిత్ర లేక బుద్ధపురాణము మొదలైనవి బుద్ధుని వ్యక్తిత్వము నాధా రముగా చేయబడిన రచనలు. ఆ రచనలయందు కొద్దిపాటి చారిత్రక వాస్తవములతో పాటు పౌరాణిక కథలను ఎక్కువగా మేళవించి బుద్ధుని దివ్య పురుషునిగా వర్ణించడం. ఆయన స్వర్గము విడచి భూలోకమునకు వస్తున్న సందర్భములో, స్వర్గ వాసులందరూ దుఃఖ పూరితులైనారని అతిశయోక్తులతో పదేపదే ప్రకటించడం. ఆయన దివ్యత్వ మును గోరంతలు, కొండంతలుగా ప్రకటించటానికై మరణానంతరము ఆయన అస్తికలను భక్తి, శ్రద్ధలతో పూజించి వాటిని అనేక ప్రదేశములలో నిక్షిప్తంచేసి వాటిపై మహాస్థూపములను, విహారములను నిర్మించడం. ఇటువంటి పరిణామము నందు బుద్ధుని జీవితము, బుద్ధి, జ్ఞానము, ప్రజ్ఞ, ఆదర్శములు. బుద్ధుని చైతన్యము ఆదిగా గల సమస్త గుణములకూ, రూపమును కల్పించి, దానికి ధ్యానకాయమని పేరు పెట్టారు. ధ్యానకాయము బౌద్ధ ధర్మమునకు సంకేతము. దీనిని ఆధారముగా చేసుకొని అనంతర కాలంలో బౌద్ధమతంలో అనేక పవిత్ర గ్రంథములు రచింప బడినవి. బౌద్ధ ధర్మమును అనుసరించు వారిని సామూహికంగా "సంఘము" అని పిలిచేవారు. ఇది ఒక వ్యాపార సంస్థవలే, బౌద్ధ ధర్మమును రక్షించటం, వృద్ధిపరచటం, ప్రచారము చేయటం వంటి అనే బాధ్యతలను నిర్వర్తించవలసి ఉన్నది. కాలక్రమేణ బుద్ధుడు, ధర్మము, సంఘము అను త్రికరణములు లేక త్రిరత్నములుగా మార్పు చెందినవి. బాధాతప్తులైన మానవాళి నిత్యమూ వీటిని స్మరిస్తూ, ధ్యానిస్తూ, శరణాగతిని ప్రకటించాలి.

**బుద్ధం శరణం గచ్ఛామి**
**ధమ్మం శరణం గచ్ఛామి**
**సంఘం శరణం గచ్ఛామి**

పైన వివరించిన రత్న త్రయమునకు అదనంగా మహాయానము, బోధిసత్త్వ సిద్ధాంతమును సృష్టించింది. మహాయాన సాహిత్యములో బోధిసత్త్వుల పేర్లు తెలియ జేయబడినవి. వారిలో ముఖ్యులు మంజుశ్రీ, అవలోకితేశ్వర, సామంత భద్ర, ఇంద్ర జాలి, రత్నగర్భ మొదలైనవారు.

మాక్సుముల్లర్ బోధిసత్త్వులను శ్లాఘిస్తూ వారు సింహగర్జన వంటి శబ్దముతో బౌద్ధ ధర్మమును ప్రచారముచేస్తూ, సర్వజనావళి పరినిర్వాణమును పొందుటకు సహాయము చేస్తారని చెప్పాడు.

బుద్ధ భక్తికి ఆధారమైన సిద్ధాంతమేమంటే, ప్రజ్ఞావంతుడైన వ్యక్తి తన పుణ్య మును, లభించిన శక్తులను, స్వప్రయోజనమునకుగాక, ఆయనకుగల అధిష్టాన (దివ్యశక్తి)ము ద్వారా ఇతరులపై కూడా ప్రకాశింప జేయాలి. ఆయన యొక్క దివ్య జ్ఞానము, అపారమైన కరుణలను వినియోగించి మానవాళిని బాధలనుండి, దుఃఖము నుండి ఉద్ధరించాలి. ఈ విశ్వమునకు బుద్ధుడే నాధుడు. ఈ విధంగా బౌద్ధము క్రమంగా వ్యక్తిగతమైన మత విధానము నుండి దూరమై భాగవత సంప్రదాయములో వలె సంస్థాగతమైన మతముగా మార్పుచెందినది.

**7. మహాయానములో ఉపాసకుల స్థాయి :** మహాయాన శాఖలోనికి అత్యధిక సంఖ్యలో గృహస్థులను, పరివ్రాజకులను, ఆకర్షించటానికిగాను అవలంబించిన ఉపాయము లలో నొకటి, గృహస్థులకు, పరివ్రాజకులకు మధ్యగల అంతరమును తగ్గించటం. దీనివలన గృహస్థులకూ, విహారజీవితంతో విసిగిపోయిన పరివ్రాజికులకూ ఈ శాఖలో చేరటానికి ఆవకాశములు పెంపొందింప జేయబడినది. క్రమశిక్షణతో, ధర్మబద్ధంగా జీవిస్తున్న, గృహస్థులను, విహారములలో పరివ్రాజకులుగా జీవిస్తున్న వారితో సమానంగా పరిగణించుట, సంసారిగా జీవించటం బౌద్ధునిగా నిర్వాణమును పొందుటకు ఆటంకమూ కాదు, అనర్హత కాదు. ఈ అడ్డు తొలగించటంతో మహా యాన శాఖ బౌద్ధంలోని ఇతర శాఖల కంటె ప్రజాబాహుళ్యమునకు దగ్గరై, అశేష

సంఖ్యలో గృహస్థులైన సామాన్య జనులు, బౌద్ధులుగా మారుటకు అవకాశ మిచ్చింది. తద్వారా హిందూ పౌరాణిక సంప్రదాయము (భక్తి సంప్రదాయం) జనబాహుళ్యంలో ప్రవేశించుటను అడ్డుకున్నది.

**8. బౌద్ధాశయము :** బౌద్ధమతంలో ఆదర్శవంతుడైన వ్యక్తిని, అర్హతుడు లేక అర్హంతుడు అని చెప్పటం గౌరవప్రదమైన బిరుదువంటిది. 'అరి' అనగా శత్రువు, 'హంత్' అనగా అంతము చేయువాడు అని సంస్కృత భాషలో ఆ పదానికి అర్థము. ఆ విధంగా అర్హతుడు లేక అర్హంతుడు అంటే శత్రువును అంతము చేయువాడని అర్థము. ఇందులో శత్రువు లౌకికములైన సుఖములు, కోరికలు. ఆ విధంగా అర్హతుడు అంటే మానసిక, శారీరక దోషములనన్నిటినీ జయించి, నిర్వాణమునకు అర్హత పొందిన వ్యక్తి. తత్కారణంగా ధేరవాద సాంప్రదాయములో పరమోత్కృష్ట స్థాయిని పొందినవాడు అర్హతుడు. అర్హతత్వమును ఆ శాఖలో అందరూ అభిలషించారు. శ్లాఘించారు, ఆకాంక్షించారు. కాలక్రమేణా, అర్హతులు ఆ గౌరవప్రదమైన స్థానము నుండి దిగజారిపోయారు. కారణం బౌద్ధ ధర్మములోని, కొన్ని ముఖ్యమైన ఆచారము లను నిర్లక్ష్యం చేయుట. నైతిక నియమావళిని అతిక్రమించటం. స్వార్థపూరితమైన క్రియాచరణ, సర్వమానవాళికీ సుఖశాంతులను, నిర్వాణమును చేకూర్చగల కార్యా చరణమును వదలి స్వప్రయోజనముకై విశేషకృషి చేయటం. ఈ విషయంలో ధేర వాదులు బహిరంగంగానే అర్హతుని జీవితాశయము, స్వయంకృషిద్వారా, తాను మాత్రమే నిర్వాణమును చెందుట అని ప్రకటించారు. అర్హతుడు ఈ విషయములో మరెవ్వరికీ సహాయము చేయరాదు. ఇతరుల సహాయమును అపేక్షించరాదు. స్వార్థ పూరితమైన ధేరవాదుల సిద్ధాంతము బౌద్ధ బిక్షువులలోనూ, శ్రమణులలో కూడా తీవ్రమైన అసంతృప్తికి దారితీసింది. వారి అసంతృప్తియే మహా యానశాఖ, బోధిసత్వ సంప్రదాయ స్థాపనకు, వృద్ధికీ కారణభూతమైనది. మహాయాన శాఖ అర్హతత్త్వమును స్వార్థపూరితమనీ, వైయుక్తికమనీ ఖండించారు. ధేరవాదుల స్వార్థ పూరితమైన ఆశయములకు భిన్నంగా సర్వమానవాళికి సుఖము, శాంతి, జ్ఞానవికాసము, నిర్వా ణము లభించవలెననీ, అందుకు భోధిసత్త్వులు కృషి చేస్తారని తమ ఆశయంగా ప్రకటించారు. విష్ణుకుండిన రాజైన గోవిందవర్మ ఈఆశయమును తన శిలాశాసనము నందు ఈ విధంగా లిఖింపచేశాడు."సర్వసత్వానం నిఖిల దారిద్ర్యదుఃఖోపశమనం".

ఇదే మహాయానుల మహదాశయం. ఇందుకుగాను మహాయానము బోధిసత్వ సంప్రదాయమును ఆవిర్భ వించింది. ఆవిధంగా ఒక నూతన యాన సృష్టి జరిగింది. ప్రారంభములో దీనిని బోధిసత్త్వ యానమని పిలిచారు. అనంతర కాలములో దీని పేరును మహాయానమని మార్చారు. అర్హతులవలె స్వార్థ ప్రయోజనమును ఆశించక బోధిసత్త్వులు తమ నిర్వాణ ప్రాప్తి కంటే మానవాళి అభ్యున్నతికీ వారి నిర్వాణ ప్రాప్తికీ, అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ఆతృతతో కృషి సల్పుతారు. ఆ విధంగా మహాయానము దయార్ద్ర పూరితమైన, ఆదర్శవంతమైన, సౌభ్రాతృత్త్వమును అందరికీ ప్రబోధించింది.

బౌద్ధమత స్థాపనకు బుద్ధుని భావములే పునాదులు. జ్ఞాన వికాసము పొందిన బుద్ధుడు అశేష గుణ సంపన్నుడు. దశబలుడగుట వలన సర్వశక్తిమంతుడు. బుద్ధునికి చతుర్విధములైన ఆత్మవిశ్వాసములు కలవు. కాబట్టి తన సిద్ధాంతములను నిర్భయ ముగా ప్రబోధించినాడు. బుద్ధునికి బుద్ధ క్షేత్రముకలదు. దానినే "సుఖావతి"యనికూడా పిలుస్తారు. లోకమునందలి సర్వజీవుల యొక్క దుఃఖమును, బాధలను నిర్మూలించిన అనంతరము వారిని సుఖావతి లోనికి ప్రవేశించుటకు మార్గదర్శ కుడౌతాడు.

గౌతమబుద్ధుని నైతిక ప్రవచనములైన "మధ్యమ ప్రతిపత్తి"నాధారముగా చేసు కొని, ఆ సిద్ధాంతమును ఆధ్యాత్మికంగా అన్వయించి, నాగార్జునుడు బౌద్ధ సూత్రము లకు, ఒక విశిష్టమైన మార్పును చేకూర్చాడు. బుద్ధుని నైతిక నియమావళిని, ఆయన ఆధ్యాత్మిక ప్రవచనములతో మేళవించి, మాధ్యమిక వాదంగా పెంపొందించాడు. తను ప్రతిపాదించిన మాధ్యమిక వాదమును సమర్ధించుకుంటూ, తన వాదము, అతి వాదములైన శాశ్వత వాదమునూ, ఉచ్ఛేద వాదమును త్రోసిపుచ్చునదిగా వర్ణించి నాడు. మాధ్యమిక వాదము, శూన్యతావాదము రెంటిని పర్యాయ పదములుగా వ్యవహరించారు. కంటికి కనిపించునటువంటిది "సంవృత్త సత్య" (లౌకికము లేక వ్యావహారిక సత్యము), అగోచరమైనది "పరమార్ధసత్య" (పారమార్థిక సత్య లేక శాశ్వత సత్యము) అని నిర్వచించాడు. పరమార్థ సత్యను తెలుసుకొనుటయే శూన్యత. కాబట్టి మాధ్యమిక వాదమును శూన్యవాదమనికూడా పిలవవచ్చును. మాధ్యమిక వాదమును అభివృద్ధి పరచుటలో నాగార్జునుని ఆశయము నిర్వాణ లబ్ధియే. ఈ వాదముపట్ల విశ్వాసము లేనివారు దీనిని నాస్తికత్వమని ప్రకటించారు. చంద్రకీర్తి తన వ్యాఖ్యానములో ఇటువంటి అపనిందలను ఖండిస్తూ, శూన్యతావాదులు

ఆస్తికులూకాదు నాస్తికులూకాదు, వారు ఇటువంటి అడ్డంకులనన్నిటినీ తొలగించి నిర్వాణమును చేకూర్చు అద్వయ వాదమును ప్రకాశింప జేయువారని ప్రశంసించాడు.

ఆదిశంకరుల అద్వైత వాదము, ముఖ్యంగా మాయావాదము, నాగార్జునుని మాధ్యమిక లేక శూన్యవాదమును పోలి ఉంటుంది. కొందరు పండితులు ఆదిశంకరులు తమ అద్వైత వాదమును, నాగార్జునుని మాధ్యమిక వాదమును ఆధారముగా చేసుకొని అభివృద్ధి చేశారనీ, నాగార్జునుడు వివరించిన శూన్యము యొక్క స్థానములో బ్రహ్మమును ప్రవేశ పెట్టినారనే అభిప్రాయము వ్యక్తం చేశారు. ఆ కారణంగా ఆదిశంకరుల ప్రత్యర్థులు ఆయనను మారు వేషములోనున్న బౌద్ధుడని (ప్రచ్ఛన్న బౌద్ధుడు) విమర్శించారు.

నాగార్జునుని 'విగ్రహ వర్తిని' అనే గ్రంథములో శూన్యత వాదమును విమర్శించిన వారిని ఖండించుట జరిగింది. ముందు తెలియజేసినట్లు సుహృల్లేఖ మరియు రత్నావళి రాజులను ఉద్దేశించి రచించిన గ్రంథములు. డాక్టరు సచ్చిదానందమూర్తి గారు అభిప్రాయ పడినట్లుగా కౌటిల్యుని అర్థశాస్త్రమువలె కాక, నాగార్జునుని పై రెండు గ్రంథములు రాజధర్మమును, నైతిక విలువలపైన, న్యాయబద్ధంగానూ, దయార్ద్ర హృదయముతోనూ అమలు చేయవలెనని రాజులను నిర్దేశించినవి. ఇట్సింగ్ అనే చైనా యాత్రికుడు క్రీ.శ. 700 సంవత్సరంలో ఆంధ్రదేశంలో పర్యటించాడు. ఆయన వ్రాతలననుసరించి, నాగార్జు నుని సుహృల్లేఖను విద్యాలములలో పాఠ్యగ్రంథముగా చదివించేవారట. విద్యార్థులు ఆ గ్రంథమును కంఠస్తము చేస్తుండగా, పెద్దలు అందలి విషయములను చర్చిస్తూ ఉండేవారట.

నాగార్జునుని, టిబెట్టుకు చెందిన గొప్ప సాధువూ, పండితుడైన సాంగ్-క-ప మహాచార్యునిగానూ, నాథుడు (రక్షకుడు)గానూ, ఆర్యపితగానూ, గొప్ప సారథిగానూ, అభివర్ణించాడు. టిబెట్టు దేశపు బౌద్ధాచార్యులు నాగార్జునునీ, ఆర్యదేవునీ, అసంగుణ్ణీ, వసుశుబంధునూ, దిఙ్నాగునీ, ధర్మకీర్తినీ, బౌద్ధమతమునందలి ఆరు రత్నములుగా ప్రశం సించారు. ఈ ఆరుగురిలో అసంగుని, వసుబంధుని మినహాయిస్తే మిగిలిన నలుగురు తెలుగు వారైనందుకు తెలుగు ప్రజలు గర్వపడాలి. పై సత్యమును ఆధారం చేసుకొని మనము అంచనా వేయగలిగితే, బౌద్ధమతం వ్యాప్తికి, దాని అభివృద్ధికి,

భారతీయ అధ్యాత్మిక చింతనలో క్రొత్త పోకడలకూ, ఆంధ్రులు చేసిన కృషి ఎంత ఘనమైనదో తెలిసికొనవచ్చును. శాతవాహనుల కాలములో రచింపబడిన 'కథా సరిత్సాగరమనే' గొప్ప కథా సంపుటిలో నాగార్జునుని ప్రత్యర్థులు ఒక శాతవాహన రాకుమారునిచేత ఆయనను హత్య చేయించినట్లు వ్రాయబడింది.

ఆ విధంగా ఉన్నత కార్యాచరణ ప్రేరకములైన బౌద్ధమత ఆదర్శములు, బుద్ధ భగవానుడు ప్రబోధించిన బహుజన హితము, బహుజన సుఖముకాగా, వాటిని పునర్నిర్వచించి పునరుద్ధరించి, క్రమబద్ధీకరించి విశ్వవ్యాప్తిచేసిన మహనీయుడు ఆచార్య నాగార్జునుడు. ఆయన శిష్యులు మహాయాన సిద్ధాంతమునకు, ఆయువుపట్టైన మాధ్యమిక లేక శూన్యవాదముద్వారా బహుజన సుఖమునూ, బహుజన హితమునూ, సామాజిక సమతా భావమునూ, విశ్వఉదార స్ఫూర్తికై కృషిచేసిన చిరస్మరణీయుడు ఆచార్య నాగార్జునుడు. ఆయన "లోకాతీత సత్త"ను ముగిస్తూ చేసిన ప్రార్ధనతో ఈ విషయమును ముగిద్దాము.

**శ్లో॥ యధావాప్తం మయా పుణ్యం ।**
**స్తుత్వా త్వయం స్తుతిబహుజనం**
**అనిమిత్త బంధనోపేతం**
**భూయాత్ తేనాఖిలం జగత్ ॥**

■ ■ ■

# ఆర్యదేవుడు

## (మాధ్యమిక వాదము)

మహాయాన సాంప్రదాయాభివృద్ధికీ, వ్యాప్తికీ కృషిచేసిన బౌద్ధాచార్యులలో నాగార్జునుని తరువాత చెప్పదగిన వ్యక్తీ, ఆయన శిష్యుడు ఆర్యదేవుడు. నాగార్జునుని శిష్యత్వంలో నిగ్గుతీసిన బంగారమువలె భాసించిన ప్రతిభాశాలి. మహాయాన సంప్రదాయమును బహు సులభముగా అన్వయించి, క్రమపరచి, ప్రచారముచేసిన మహనీయుడు ఆర్యదేవుడు. క్రీ.శ. 8వ శతాబ్ద ప్రాంతములో తాంత్రికాచార్యుడైన మరో ఆర్యదేవుడు ఉండేవాడు.

ఆచార్య నాగార్జునుడే శ్రీపర్వత విహారమునందలి ఆచార్య స్థానమును తన అనంతరం భర్తీ చేయుటకుగాను అన్ని విధములుగా శిక్షణనిచ్చి తీర్చిదిద్దాడు. ఈయనకు చాలా పేర్లు ఉన్నట్లు తెలుస్తున్నది. అవి దేవ, కన్నదేవ, నీలనేత్ర, పింగళ నేత్ర, పింగళాక్ష, కమరిప. ఆయనకు కన్నదేవ అనే పేరు రావటానికి కారణం తెలియజేస్తూ అనేక గాథలు ప్రచారంలో ఉన్నవి. తారానాధుడనే టిబెట్టు పండితుడు తెలియజేసిన దానిని బట్టి, ఆర్యదేవుడు తన కంటిని, బౌద్ధమతస్థురాలు కానటువంటి స్త్రీకి దానం చేశాడట. బూస్టన్ ఆయన తన కంటిని ఒక వృక్షమును ఆశ్రయించి యున్న దేవతకిచ్చాడని చెప్పాడు. "చతురాసితి సిద్ధ ప్రవృత్తి" (ఎనుబది నాలుగు మంది

సిద్ధుల జీవిత చరిత్ర) అనే గ్రంథంలో ఆయన ఒక స్త్రీకి తన కంటిని సమర్పించాడని తెలియజేయబడింది. చైనీయులు చెప్పడం, మహేశ్వరుని బంగారు విగ్రహమును తన కంటితో అలంకరించాడని. కారణమేదైనప్పటికీ ఆయనకు ఒక్కటే కన్ను ఉండేదనేది వాస్తవం. ఆచార్య నాగార్జునుని ముఖ్య శిష్యునిగా 'మాధ్యమిక వాదం' లో రెండవ విశిష్ట వేదాంతిగా ఖ్యాతిగాంచాడు. కేశానపల్లి (గుంటూరు జిల్లా) బహుశ్రుతీయుల విహారమునందు నివసించిన బౌద్ధాచార్యుల పట్టికలో 'దేవ' అనే పేరు ఉన్నది. ఆ పేరు ఆర్యదేవునిదే అయి ఉండుటకు ఆస్కారమున్నది. "మంజుశ్రీ మూలతంత్ర" అనే గ్రంథములో ఆర్యదేవుడు సింహ పురవాసియని, ఈ సమాచారము నాధారముగా చేసుకొని బూస్టన్ మహాశయుడు, ఆర్యదేవుడు సింహళీయుడని చెప్పాడు. చంద్రకీర్తి (క్రీ.శ. 550–600) ఆర్యదేవుడు సింహళ రాకుమారుడని తెలియ జేశాడు. అతడు సింగాగ్లిన్ రాజకుమారుడని టిబెట్టు గ్రంథములు వెల్లడించాయి. యస్.హెచ్.లాడెన్ లా, సింగాగ్లిన్ అనేది ధాన్యకటకమునకు దగ్గరనున్న గ్రామమై ఉండవచ్చునని భావించాడు. కుమారజీవుడు వ్రాసిన ఆర్యదేవుని జీవిత చరిత్రలో, ఆయన దక్షిణాపథమునకు చెందిన వాడన్నాడు. హుయాన్‌సాంగ్ వ్రాతలను అనుస రించి ఆర్యదేవుడు చి–షీ–త–ట్జు–కో, అంటే సింహదారాపుత్ర పురమనే శ్రీకాకుళం (కృష్ణా జిల్లా)లో నివసించేవాడని తెలుస్తున్నది. దీనిని బట్టి శాతవాహనుల చిట్టచివరి రాజధానియైన శ్రీకాకుళం ఆర్యదేవుని జన్మస్థలమని నిర్ణయించుకొనవచ్చును.

ఆర్యదేవుడు తన గురువైన నాగార్జునుని కలుసుకొనటం, ఆయన శిష్యునిగా శ్రీపర్వతమునందలి బౌద్ధ విహారములో చేరటంపైన కూడా ఆసక్తికరమైన ఒక కథ ఉన్నది. ఆర్యదేవుడు ఆచార్యుని కలుసుకొనటానికి శ్రీపర్వత విహారమునకు చేరేటప్పటికి నాగార్జునుడు ఒక చెట్టు క్రింద శిష్యులకుపాఠం చెబుతున్నాడట. ఒక విద్యార్థి ఆర్యదేవుని రాకను నాగార్జుననకు తెలియజేశాడట. అది విన్న ఆచార్యుడు ఒక పాత్ర నిండుగా నీరుపోసి ఆర్యదేవుని వద్దకు పంపినాడట. అంతట ఆర్యదేవుడు ఆ పాత్రలో ఒక సూదినివేసి త్రిప్పి వెనుకకు పంపినాడట. నీటితో నిండుగా ఉన్న పాత్రనూ, అందులోని సూదిని గమనించిన నాగార్జునుడు అమందానంద హృదయుడై తక్షణమే విహారమునందు విద్యార్థిగా ప్రవేశమిచ్చి తన శిష్యునిగా స్వీకరించాడట. ఈ కథలో అంతర్భాగమైన ఆసక్తికరమైన అంశమేమంటే, పాత్రలో నిండుగా నున్న

నీరు జ్ఞానమునకు చిహ్నము, ఆర్యదేవుడు ఆ నీటిలో వదలిన సూది. తాను ఎటువంటి భీతికానీ, అజ్ఞానముగానీ లేక సూదివలె వాడిగా జ్ఞానములోనికి చొచ్చుకు పోగలననే సందేశమునకు సూచన. సూది ఏ విధముగా పాత్రలోని నీరు పొర్లిపోకుండా, నీటిలో పయనించి పాత్ర అడుగు భాగమునకు చేరినదో, అదేవిధంగా జ్ఞానముయొక్క అంత్యము వరకూ తాను పయనించి (అధ్యయనము చేసి) జ్ఞానమును పరిపూర్ణముగా గ్రహించగలనని తన దృఢసంకల్పమునూ, ఆత్మవిశ్వాసమును తెలియజేసిన విధానము. ఈ కథ, ఆర్యదేవుని యొక్క సునిశిత బుద్ధి చాతుర్యమునకు సాంకేతిక ప్రదర్శన.

ఆచార్య నాగార్జునుని హత్యానంతరము, ఆయన స్థానము నాక్రమించినాడు కనుక ఆర్యదేవుడు క్రీ.శ. 3వ శతాబ్ద ప్రారంభములో జీవించి ఉండవచ్చును. కుమారజీవుడు, ఆయన జీవిత చరిత్రను క్రీ.శ.450లో చైనీయుల భాషలోనికి అనువదించాడు.

ఆర్యదేవుడు మాధ్యమిక వాదమును దేశములోని ఉన్నత, బడుగు వర్గములకు చెందిన ప్రజలలో వ్యాప్తి చేయుటకుగాను నాగార్జునుడు చేపట్టిన విధానములను కొనసాగించాడు. తన సునిశితమైన బుద్ధి కుశలతతో పాటు వాదనా పటిమ, నేర్పు, ఓర్పు కల్గి వాదనలలో ప్రత్యర్థులను పరాజితులను చేసేవాడు. ఆయన పాటలీపుత్రము నందున్న కాలములో మాధ్యమిక వాదమును వ్యతిరేకించిన వారు ఏర్పాటుచేసిన అనేక చర్చలలో పాల్గొని, వారిని ఓడించినట్లు తెలుస్తున్నది. మాధ్యమిక వాదమును ప్రచారము చేస్తూ దేశమంతటా పర్యటిస్తున్న సందర్భములో, హిందూ వేదాంతుల తోనూ, బౌద్ధమతములోని ఇతర శాఖలవారితోనూ, వివాదాస్పదమైన అనేక ఆధ్యాత్మిక తత్త్వములపై చర్చలలో పాల్గొనినట్లు తెలుస్తున్నది. మాధ్యమిక వాద ప్రచారమునకు గాను "చతుశ్శతక", "శతశాస్త్ర" మరియు "అక్షరశతక" అనే గ్రంథములను రచించి వాటిద్వారా మాధ్యమిక వాద ఔన్నత్యమును ప్రచారము చేశాడు. పేరుకు తగినట్లుగానే చతుశ్శతక నాలుగు వందల కారికలు (వ్యాఖ్యలు) గలిగిన అత్యుత్తమ రచన. ఈ గ్రంథము నందు శూన్య వాదమును బోధిసత్వుల జీవితములతోనూ, ప్రవర్తనతోనూ సంధించుటయే కాక, ద్వంద్వ సత్యములైన లౌకిక, పరమార్ధ సత్తలను అధికార భేదములను అనుసరించి అన్వర్తింపజేశాడు. సమాజము నందలి బడుగు వర్గముల వారు దానమునూ, మధ్య తరగతివారు శీలమును, ఉన్నత వర్గములవారు శాంతినీ,

పాటించవలెనని ప్రబోధించాడు. ప్రతివ్యక్తీ తన స్వయం సత్త్వద్వారా, శూన్యతా సిద్ధినిపొంది, తద్ద్వారా శాంతిని అనుభవించవచ్చునని ప్రబోధించాడు. ఈ విధానము ఒక విధంగా సులభతరంగా కనిపిస్తుంది. మరొక విధంగా కష్టతరము అనిపిస్తుంది. శూన్యతా జ్ఞానము స్వయంసిద్ధము, అజ్ఞాన నాశకము. సాధకుని నేత్రముల ముందు లోకముయొక్క యదార్థ స్వరూపమును ప్రదర్శిస్తుంది. ఆర్యదేవుడు యోగసాధనను క్రమంగా చేయాలనీ, తద్ద్వారా అంత్య దశలో శూన్యతా సిద్ధి కలుగుతుందనీ తెలియజేశాడు. ఈ కారణంగా చతుశ్శతకమునకు యోగాచార శతకమనే పేరుకూడా వచ్చింది. ఈ గ్రంథంలో పూర్వభాగము ధర్మమును ప్రబోధించగా, ఉత్తర భాగము తార్కికంగా ఇతర సాంప్రదాయములను తిరస్కరిస్తుందనీ, నిరసిస్తుందనీ ధమ్మ పాలుడు వాఖ్యానించాడు. హైందవులకు, బౌద్ధులకు చెందిన ఇతర సిద్ధాంతముల ఖండనమునకుగాను ఆర్యదేవుడు వివిధ రకములైన సాంకేతిక విధానములను పాటించేవాడు. నాగార్జునుని వలె ఒకేరకమైన తార్కిక పద్ధతిని అన్ని చర్చలయందు అనుసరించేవాడు కాదు. మొదట చర్చించుట, అనంతరము విశ్లేషించుట, ఆ తరు వాత ప్రత్యర్థుల వాదనలయందలి లోపములను ఎత్తిచూపుట, అటుతదుపరి వారి వాదనలలోని అప్రతిపాదితముల (పూర్వ పక్షము చేయుట)ని వివరించుట, చివరగా వాటిని పూర్తిగా ఖండించుట (ఉత్తర పక్షము చేయుట) పద్ధతిగా పాటించెడివాడు. ఆయన వ్రాసిన చతుశ్శతకమునందు, ధేర వాదమును, సాంఖ్యము వైశేషికము, న్యాయ ధర్మములననుసరించు వైదిక మతస్థులనూ యజ్ఞ యాగాది క్రతువులను ఆచరించేవారినీ, తీవ్రంగా విమర్శిస్తూ, మాధ్యమిక వాదములోని విశిష్టతనూ, ఔన్నత్య మునూ ప్రశంసించాడు. ఈ గ్రంథము నాగార్జునుని మాధ్యమిక కారికతో పాటు, మాధ్యమిక వాదులకు మూలగ్రంథముగా ఉపయోగపడింది.

అంతటితో తృప్తి చెందక, ఆర్యదేవుడు హిందువుల విశ్వాసములను మూఢ నమ్మకములుగా చిత్రించి అవహేళన చేస్తూ ఖండించాడు.

**శ్లో॥ ధర్మయది భవేత్ స్నానాత్ కైవర్తనాం కృతార్థతా ।**
**నక్తం దీపం ప్రతిష్టానాం మత్స్యా దీనాంతు కాకథా ॥**

దినమును ఉపవాసముతో గడిపి, దీపం వెలిగించి, గంగానదిలో స్నానమాచ

రించిన మాత్రాన పుణ్యం లభిస్తే అనుదినమూ గంగానది జలాలయందు మునిగే బెస్తలకూ, సర్వదా ఆ నీటిలోఉండే చేపలకూ, ఎంత పుణ్యం రావాలని అపహాస్యం చేశాడు. ఈవిధమైన అవహేళన హిందువులకు మానసిక వ్యధను కలుగచేసినప్పటికీ, ఒక విధంగా మతమౌఢ్యములను బహిరంగ పరుస్తుంది. ఇటువంటి అనేక ఆచారము లను బౌద్ధులు, జైనులుకూడా పాటిస్తూ ఉండేవారు. ఎవరి విశ్వాసములు వారివి. ఎవరి నమ్మకములు వారివి. కాబట్టి ఒక మతమువారు, మరొక మతము వారిని విమర్శించటమే మతమౌఢ్య మని భావించి, ఆచరించరాదు.

ధర్మత్రాత అనే మరొక గొప్ప బౌద్ధ రచయితను ఆర్యదేవుని శిష్యుడుగా భావిస్తు న్నారు. వసుబంధువనే మరో బౌద్ధాచార్యుడు రచయిత. ఆర్యదేవుని శతశాస్త్ర గ్రంథ ముపై విశిష్టమైన వ్యాఖ్యానమును రచించాడు.

ఆర్యదేవుడు తన కార్యక్రమములకు ఆంధ్రదేశమును కేంద్రంగా చేసుకొని, చోళ, ఓఢ్ర (ఒరిస్సా), కోశల దేశములలో పర్యటించి అనేక సదస్సులలో పాల్గొని ప్రత్యర్థులను వాదనలో పరాజితులను చేశాడు. ప్రతిఫలంగా ఆయన ఒక అడవిలో ధ్యానం చేసుకుంటూ ఉండగా హత్య చేయబడ్డాడు. ఆయన శిష్యుడైన తీర్థికుడు హంతకుని పట్టుకొని శిక్షించవలెనని ప్రయత్నించగా, ఆర్యదేవుడు ఆతనిని వారించి మరణశయ్యపై నుండి, శిష్యులకు ఈ విధంగా ఉపదేశించినాడట. "ప్రతి వస్తువూ అనిత్యమైనదీ, అసత్యమైనది. సహజముగా మార్పుచెందు ఈ లోకములో, ఆ వస్తువుల యొక్క యదార్థ స్థితిని గ్రహించండి. క్రూరత్వమూ, క్రూర ప్రవర్తన ఎక్కడున్నై ? స్నేహితుడు ఎవరు ? శత్రువు ఎవరు ? హంతకుడు ఎవరు ? హతుడు ఎవరు ? మీరు అన్ని వస్తువుల యొక్క యదార్థ స్థితిని తెలుసుకొనగలిగితే హంతకుడూ ఉండడు, హతుడూ ఉండడు." ఆ విధమైన ప్రవచనము సల్పి తన శిష్యులను శాంతపరచి ఆర్యదేవుడు తుదిశ్వాస విడిచాడు.

వాద ప్రతివాదముల జోలికి పోకుండా ప్రజ్ఞా కరుణలను మనస్సులో ఆవిష్కరింప జేయడమే మాధ్యమికుల ఆదర్శం అని ఆర్య దేవుడు ఈ క్రింది శ్లోకములో వివ రించాడు.

**శ్లో॥ స్వపక్షే విద్యతేరాగం పరపక్షస్తుతే ఉ ప్రియః ।**
**నగమిష్యసి నిర్వాణం నశివం ద్వంద్వ చారిణః ॥**

తాను నమ్మిన ఆదర్శమును తుదిశ్వాస వరకూ పాటించిన మహాత్ముడు ఆర్య దేవుడు.

సుప్రసిద్ధ చరిత్రకారులైన నీలకంఠ శాస్త్రి గారు గుంటూరు జిల్లాలో బయల్పడిన పాత్రలోని అస్తికలు ఆర్యదేవునివని తెలియజేశారు. ఈ విషయము ఆర్యదేవుడు తెలుగువాడనే నమ్మకమును ధృడపరుస్తుంది.

■ ■ ■

# భదంతాచార్య బుద్ధఘోషుడు

## (ధేరవాదము)

మహాయాన వాదమునందు ఆచార్య నాగార్జునుని స్థానమెంత ఉన్నతమైనదో, ధేర వాదములో మరో తెలుగువాడైన బుద్ధఘోషుని స్థానముకూడా అంత ఉన్నతమైనది.

క్రీ.శ. ఐదవ శతాబ్దంలో బౌద్ధ సాహిత్యములో, అత్యుత్తమములు అయిన రెండు గ్రంథములు వెలువడినవి. ఒకటి వసుబంధు సంస్కృతములో రచించిన "అభిదమ్మ కోశము". రెండవది బుద్ధఘోషుడు పాళీభాషలో వ్రాసిన "విశుద్ధిమగ్గ" బౌద్ధులు ముఖ్యంగా ధేరవాదులు (హీనయానము) వసుబంధుని రెండవ బుద్ధునిగా పరిగణించారు. బుద్ధఘోషుని మైత్రేయనాధునిగా భావించారు. ఇద్దరూ సమకాలీనులైనప్పటికీ, ఒక రితో నొకరికి పరిచయమున్నట్లు భావించటానికి అవకాశములు లేవు. కారణం వారి కార్య క్షేత్రములు సుదూరంగా ఉండటంవల్ల. వసుబంధుడు కాశ్మీర దేశస్థుడు. ఆయన కార్యాచరణము ఉత్తర భారతమునకే పరిమితమైనది. ఆనాడు బౌద్ధ మతాధ్యయనమునకు కేంద్రమైన మగధలోని నలందా విశ్వవిద్యాలయము వసుబంధు కార్యక్షేత్రం. బుద్ధఘోషుడు తెలుగువాడు. సాగరములను అధిగమించి, శ్రీలంకలోని మహావిహారమును తన జీవితాశయ సాధనకు, కార్యరంగంగా ఎన్నుకున్నాడు. ఇద్దరూ బౌద్ధమత సాహిత్యంలో దిగ్గంతులు.

అయితే బుద్ధఘోషుని జీవిత వివరములేవీ అధికారికంగా తెలియవు. థేర వాదమును గురించి, పాళీ ధర్మమును గురించీ, ముప్పది భాగములు గల ఉద్గ్రంథ మును రచించినప్పటికీ, ఆయన ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, ఇదమిత్థంగా సమాచారము లేదు. దొరకిన సమాచారము కల్పనా పూరితమై విశ్వసనీయముగా లేదు. ఆయన రచనలుగా చెప్పబడుతున్న గ్రంథములయందలి ఉపోద్ఘాతములనుండి, ఉపసంహారములు లేక ముగింపులనుండి లభ్యమైనది బహుకొద్ది సమాచారము మాత్రమే. ఇవికాక క్రీ.శ. ఐదవ శతాబ్దమునందు సింహళములో సంభవించిన మత, రాజకీయ గందరగోళమును గురించి క్రీ.శ. పదమూడవ శతాబ్దంలో రచింప బడిన మహావంశ గ్రంథములోని ఉత్తర భాగములో కొన్ని వివరములు లభించినవి. ఈ గ్రంథరచయిత మహాయాన తార్కిక ప్రముఖుడైన ధర్మకీర్తి అని చెబుతారు. మూడవఆధారము "బుద్ధఘోష సుప్పత్తి" అనే ప్రాచుర్యము పొందిన నవల. ఇది బర్మా దేశమునందు మహామంగళుడనే ఆచార్యుడు క్రీ.శ. పదిహేనవ శతాబ్దంలో రచించి నట్లు తెలుస్తుంది. పైన తెలియజేసిన ఆధారములే కాకుండా, బర్మాలోని తైలాంగ్ ఇతిహాసములందు బుద్ధఘోషుడనే ఆచార్యుడు, బర్మానుండి సింహళ దేశము నకు వెళ్ళినట్లుగా వ్రాయబడినది. అయితే పాశ్చాత్య పండితులు, ఆ బుద్ధ ఘోషుడు వేరేవాడనీ, అతను అశేష సంఖ్యలో బౌద్ధ పవిత్ర గ్రంథము లను బర్మా దేశములోనికి తెచ్చాడంటారు.

బుద్ధఘోషుని గురించిన మరో ఆసక్తికరమైన విషయమేమంటే, వేంగీ పట్టణ మును రాజధానిగా చేసుకొని, కోస్తా ఆంధ్ర దేశమును క్రీ.శ. 350–440 మధ్య కాలంలో పరిపాలించిన శాలంకాయన వంశపు రాజు ఒకరు. బర్మాలోని ఐరావతీనదీ పరీవాహక ప్రాంతంలో సోన్–లాన్–క్రోమ్ అనే రాజ్యమును స్థాపించి, ఆ రాజ్యము నందు ఒక బౌద్ధ విహారమును నిర్మించాడట. ఆ విహారములో నివసిస్తూ, బుద్ధ ఘోషుడూ మరొక బౌద్ధ పరివ్రాజకుడైన బుద్ధదత్తుడూ, బౌద్ధమత ప్రచారం చేసేవారట. మరో విశేషమేమంటే సింహళ దేశములో కంటే, బర్మా దేశములోనే బుద్ధఘోషుని రచనలన్నీ భద్రపరచ బడినవట. ఆయన జీవిత సర్వస్వమునూ వినియోగించి, త్రిపిటకములను పాళీ భాషలోనికి అనువదించిన గ్రంథముల నకళ్లను థాయ్‌లాండ్, కంబోడియా దేశవాసులైన బౌద్ధులు బర్మానుండే తీసుకు వెళ్లారట. బర్మా, థాయ్‌లాండ్

దేశాలలో బుద్ధఘోషుని విహారములని పిలవబడే శిథిల భవనములు ఇప్పటికీ ఉన్నవట. కానీ, ఆ సమాచారము యదార్థమని చెప్పటానికి తగిన ఆధారములు లేవు.

బుద్ధఘోషుని యొక్క జన్మస్థల విషయమై, ఆయన వ్రాసిన మహా గ్రంథము 'విశుద్ధి మగ్గ' ముగింపు అధ్యాయమునకు జోడించిన సమాచారమును బట్టి తెలుసుకొనే అవకాశమున్నది. బుద్ధఘోషుడే స్వయంగా తన పేరును 'మోరండ ఖేటక' అని గ్రంథాంత ములో చెప్పుకున్నాడు. ప్రఖ్యాత చరిత్రకారుడైన కౌశాంబి బుద్ధఘోషుని విశుద్ధ మగ్గను అట్ట కథలను క్షుణ్ణంగా విశ్లేషించి, ఆ గ్రంథముల యొక్క ప్రాశస్త్యమును తెలియజేస్తూ, సింహళ, బర్మా ఇతిహాసములయందు బుద్ధ ఘోషుని జన్మస్థలమును గురించి తెలియజేసిన వివరములు సరియైనవి కాద న్నాడు. బుద్ధఘోషుడు ఉత్తర భారతమునకు చెందినవాడు కాదనీ, అతను బుద్ధగయలో జన్మించలేదనీ దృఢంగా చెప్పాడు. మహావంశలోని సమాచారము కూడా సరియైనది కాదన్నాడు.

శ్రీ ఆర్. సుబ్రమణ్యంగారు, శ్రీ యస్.వి. నయనార్‌గారు కూడ తమ వ్యాసం 'బుద్ధఘోష–అతని జన్మస్థలము'లో సుదీర్ఘంగా, విశదంగా మోరండఖేటక అనే గ్రామమే బుద్ధఘోషుని జన్మస్థలమని తెలియచేశారు. పాళీభాషలో మోరండమంటే నెమలి, ఖేటక అంటే సంస్కృతంలో గ్రామమనీ అర్థం. కాబట్టి ఈనాడు గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో నాగార్జున సాగరమునకు షుమారు 82 కి.మీ. దూరంలోనూ, అమరావతి నుండి షుమారు 93 కి.మీ. దూరంలోనూ ఉన్న కోట నెమలిపల్లి–గుడ్లూరు గ్రామమే బుద్ధఘోషుని జన్మస్థలమని భావిస్తున్నారు. సాధార ణంగా తెలుగువారిలో చాలా మంది ఊరుపేరును ఇంటిపేరుగా పెట్టుకుంటారు. బహుశా అదేవిధంగా బుద్ధఘోషుడు కూడా తన ఊరిపేరునే ఇంటిపేరుగా పెట్టుకొని ఉండవచ్చును. అయితే తెలుగువారివో ఇంటిపేరు వ్యక్తి పేరుకు ముందు ఉంటుంది. కానీ బుద్ధఘోషుడు తన గ్రంథము యొక్క ఉపసంహారాధ్యాయంలో తన పేరు తరువాత ఇంటిపేరు పెట్టుకున్నాడు. అంతేకాక బుద్ధఘోషుడు తాను సింహళము నకు బయలుదేరుటకు ముందు, మయూరసుత్త పట్టణము (మద్రాసులోని మైలాపూరు)లో ఆచార్య బుద్ధమిత్రుని వద్దనూ, కాంచీపురంలో ఆచార్య జ్యోతిపాలుని వద్దనూ కొంతకాలము గడిపినట్లుగా చెప్పుకున్నాడు. ఈ విధంగా ఆయన

గ్రంథములోని ఉపోద్ఘాతముల నుండీ ఉపసంహారములనుండీ ప్రోగుచేసిన సమాచారమును బట్టి బుద్ధఘోషుడు దాక్షిణ్యాత్యుడనీ, ఆంధ్రదేశములోని శ్రీపర్వత ప్రాంతము (నాగార్జున కొండ) నకు చెందిన వాడనీ విశ్వసింపవచ్చును.

అయితే మహావంశ(చుల్లవంశ)లోని ఉత్తర భాగమునందలి సమాచారమును బట్టి, షుమారు పదహారు వందల సంవత్సరములకు పూర్వం, బుద్ధగయలోని బోధి వృక్షమునకు సమీప గ్రామంలో, ఒక బ్రాహ్మణ కుటుంబంలో బుద్ధఘోషుడు జన్మించాడు. వేద వేదాంగములు, శాస్త్రములు, కళలు, ఆదిగాగల అనేక విషయములకు సంబంధించిన గ్రంథములను అధ్యయనం చేశాడు. కానీ ఆయనకు జ్ఞాన సముపార్జన యందు తృప్తి కలుగలేదు. మరింతగా ప్రజ్ఞ సంపాదించవలయుననే తృష్ణతో పండితులున్నారని విన్న ప్రతి ప్రదేశమునకు వెళ్లేవాడు. వాదమునందు ప్రీతి, పటిమ కలిగి ఉండటంచేత వెళ్ళిన ప్రతిచోట అక్కడి పండితులతో చర్చలు సాగించేవాడు. ఈ విధంగా జంబూ ద్వీపమంతా తిరుగుతూ ఒకరాత్రి దక్షిణాపథంలో ఉన్న ఒక బౌద్ధ విహారమునకు చేరాడు. ఆ రాత్రి విహారములో గడుపదలచాడు. ఆ విహారమునకు ఆచార్య రేవతుడు అధిపతి. బుద్ధఘోషుడు ఆ రాత్రివేళ పతంజలి యోగ సూత్రములను సముద్రఘోష వంటి గంభీర స్వరంతో బిగ్గరగా చదవటం ప్రారంభించాడు. అది విన్న రేవతుడు, బుద్ధఘోషుని కంఠస్వర గంభీ రతకు, వాచిక స్పష్టతకూ, పాండిత్యప్రకర్షకూ ముగ్ధుడై, ఈ వ్యక్తిని సరియైన దారిలో పెట్టి బౌద్ధ ధర్మమును బోధిస్తే రాణిస్తాడనే 'సంకల్పంతో మరునాడు ఉదయం బుద్ధ ఘోషునికి తనవద్దకు రావలసిందని కబురు పంపాడు. బుద్ధఘోషుడు రాగానే రాత్రి గాడిదవలే ఓండ్ర పెట్టింది నీవేనా? యని అడిగాడట. బుద్ధఘోషుడు కోపంగా నాది గాడిద ఓండ్ర అంటున్నావే, నేను చదివినది నీకు అర్థమయినదా? అని ప్రశ్న వేశాడట. రేవతుడు బుద్ధఘోషుడు చదివిన పతంజలి యోగ సూత్రములలోని, ప్రతి సూత్రమును చదివి దానికి చక్కని వివరణ ఇచ్చాడట. అనంతరం వాటి యందుగల వైరుధ్యములను కూడా ఎత్తిచూపినాడట. అది విన్న బుద్ధఘోషుని మనస్సులో తాను నేర్చుకొనవలసినది ఇంకా చాలా ఉన్నదనే భావన మొలకెత్తింది. బుద్ధఘోషుడు రేవతుని ఉద్దేశించి తాము పాటిస్తున్న ధర్మమును గురించి వివరించవలసినదిగా కోరాడు. రేవతుడు అభిధమ్మ పిటకము నుండి కొంతభాగమును చదివి వినిపించగా,

బుద్ధఘోషుడు, లోకంలో వాడుకలో లేని పదాలను, గుదిగ్రుచ్చి చదివితే ఎదుటివారికి ఏమర్థమవుతుంది? కాబట్టి ఆ పదముల అర్థమును వివరిస్తే నేను మీతో వాదించ గలనని చెప్పాడు. అంత రేవతుడు నేను పలికిన వాదమును "సమ్మాసం బుద్ధవాద" మంటారు. దీనిని గురించి తెలుసుకొనదలిస్తే ముందుగా ప్రవజ్యదీక్ష తీసుకొన వలెనన్నాడు.

జ్ఞానతృష్ణతో అల్లాడిపోతున్న బుద్ధఘోషుడు మారుమాటాడకుండా ప్రవజ్యదీక్షను గ్రహించి బౌద్ధభిక్షువైనాడు. రేవతుని శిష్యత్వంలో మూడు పిటకములను క్షుణ్ణంగా అభ్యసించాడు. రేవతుడు బుద్ధఘోషుని కంఠస్వర గాంభీర్యమును 'పురస్కరించుకొని, ఆ యువకునికి బుద్ధఘోషుడని దీక్షానామ మిచ్చాడు. సముద్రమే విధంగా భూమిని చుట్టి ఘోష పెడుతూ ఉంటుందో, అదేవిధంగా బుద్ధ భగవానుని ప్రవచనములను లోకమంతా ఆయన ఘోషించగలడని, రేవతుడు నమ్మి ఆ యువకునికి బుద్ధఘోషుడని నామకరణం చేశాడు. ఘోష అంటే కీర్తి అనే అర్థంకూడా ఉంది. దానినిబట్టి బుద్ధుని వంటి కీర్తిమంతుడు కావాలని కూడా చెప్పవచ్చు.

బుద్ధఘోషుడు రేవతునితో తన సమావేశమునూ, ప్రవజ్య స్వీకారమునూ, త్రిపిట కములను అధ్యయనము చేయడం స్మరించుకుంటూ తాను ఇంతకు పూర్వం చదివిన చదువూ, కాలమూ వ్యర్థమైనదనీ, సారవిహీనమైనదనీ, ఊకవంటిదని భావించి ఆ అజ్ఞానాంధ కారమునుండి బయటపడిన దినమును నిత్యమూ స్మరించేవాడు. అనం తరము "నానోదయ" (జ్ఞానోదయం)అనే గ్రంథాన్ని, పిదప 'ధమ్మసంగాని' (ధర్మ సంగ్రహము) పై 'అట్టశాలిని'అనే వ్యాఖ్యానాన్నీ, అనంతరము మజ్ఝిమ (మధ్యమ) నికాయ అట్ట కథపై "పరిత్తము"లను రచించాడు. ఈ మూడవ గ్రంథమును పరిశీ లించిన అనంతరం, ఆచార్య రేవతుడు బుద్ధఘోషుని ఉద్దేశించి, చివర పేర్కొన్న గ్రంథము, వ్యాఖ్యానరహితమై మూల గ్రంథముగానే ఈ దేశమునందు లభిస్తున్నది కాబట్టి, క్రీ.శ. మూడవ శతాబ్దము నందు అశోకచక్రవర్తి కుమారుడైన, అర్హాంత మహేంద్రుడు కొనిపోయిన వ్యాఖ్యానములు, సింహళ భాషలోనికి అనువదింపబడి ఎటువంటి ప్రక్షిప్తములు లేకుండా భద్రపరచబడినవి. అందువలన నీవు సింహళ మునకు వెళ్లి, వాటిని అధ్యయనముచేసి తిరిగి వాటిని పాళీభాష (మాగధి)లోనికి అనువదించి తీసుకురావలసినదని కోరాడు. రేవతుని మాటను శిరసావ హించి

బుద్ధఘోషుడు సింహళ దేశమునకు ప్రయాణమైనాడు. మహానాముడు (క్రీ.శ. 412-434) అనే రాజు సింహళ దేశమును పరిపాలిస్తున్న కాలంలో, సింహళద్వీపమును చేరి, ఆ ద్వీప రాజధానియైన అనూరాధ పురమందుగల మహావిహారములోని ఆచార్యులను కలిశాడు. వారు ఆయనకు ఒక మహాసౌధంలో విడిది ఏర్పాటుచేశారు. థేరవాదముపై సింహళ భాషయందుగల వ్యాఖ్యానములను, ఆచార్య సంఘపాలుని పర్యవేక్షణలో బుద్ధ ఘోషుడు అధ్యయనంచేశాడు. సింహళ భాషలోని అట్టకథా గ్రంథములను పాళీభాషలోనికి అనువదించుటకుగాను తనకీయవలసినదిగా కోరాడు. అయితే మహావిహార ఆచార్యులు బుద్ధఘోషుని శక్తి, సామర్థ్యములను పరీక్షిం చదలచారు. ఆ విషయం బుద్ధఘోషునికి తెలియజెప్పి, రెండు గాథలను మాత్రమే ఆయనకిచ్చి, వాటి అనువాదములను తమకు చూపిస్తే, తాము సంతృప్తి చెందిన పక్షములో మిగిలిన గ్రంథములను కూడా ఇవ్వగలమని చెప్పి సంయుక్త నియకాయంలోని రెండు గాథలను చదివి, సమావేశం ముగించారు. ఆచార్య సంఘపాలుడు బుద్ధఘోషుణ్ణి ప్రోత్సాహిస్తూ, ఆయనను పరీక్షించుటకు ఇచ్చిన రెండు గాథలలో మొదటిది దేవపుత్రుని ప్రశ్నయనీ అంత ముఖ్యమైనది కాదనీ, రెండవ గాథలో ఆ ప్రశ్నకు బుద్ధ భగవానుని సమాధాన మున్నదని, అది త్రిపిటకముల సారమై నందువల్ల అతి ముఖ్యమైనదనీ, దానిని పరీక్షాధికారులుగా వ్యవహరిస్తున్న బౌద్ధ భిక్షువులు, ఇతర విహారవాసులూ ఆశ్చర్యపడిపోయేవిధంగా అనువాదము చేయమని చెప్పాడు. బుద్ధ ఘోషుడు అద్భుతంగా ఆ రెండు గాథలనూ అనువదించి, అనువాదములను భిక్షువుల పరిశీలనకు సమర్పించాడు. వాటిని పరిశీలించిన భిక్షువులు, అమితమైన ఆశ్చర్యమును పొంది, బుద్ధఘోషుని సామర్థ్యమును మెచ్చుకొని, అనువదించవలసిన గ్రంథములన్నిటినీ బుద్ధఘోషునికి ఇచ్చారు. అపార పాండిత్య సంపన్నుడైన బుద్ధ ఘోషుడు వాటిని పాళీభాష లోనికి అనువదించాడు. అంతేగాక త్రిపిటకములను సంగ్రహపరచి, వాటి సారాంశమును వ్యాఖ్యాన రూపములో జతపరచి, తన ఉద్గ్రంథమైన 'విశుద్ధిమగ్గ' (పవిత్రమార్గము)ను రచించాడు. మహావిహారములోని ఆచార్య బృందం బుద్ధఘోషుని అనువాదములను క్షుణ్ణంగా పరిశీలించి, అవి మాతృకలకు ఏమాత్రమూ తీసిపోవని ప్రకటించారు. తాను సింహళమునకు వచ్చిన కార్యమును పూర్తిచేసుకొని బుద్ధఘోషుడు జంబూద్వీపమునకు తిరిగివచ్చాడని మహావంశలోని కథనం. ఈ కథనంలో కొంత చారిత్రకమూ, కొంత కాల్పనికమూ కలసి ఉన్నై.

జనసామాన్యంలో బహుళ ప్రచారం పొందిన నవల 'బుద్ధఘోష సుపత్తి' పూర్తిగా కాల్పనికమూ, పౌరాణికము బుద్ధఘోషునికి దివ్యత్వమును ఆపాదించింది. ఈ గ్రంథము లోని విషయము సంగ్రహంగా తెలుసుకుందాము.

ఘోష అనేది బోధి వృక్షమునకు సమీపమునగల చిన్నపట్టణం. ఆ పట్టణము పరిపాలించు రాజునకు 'కేశి'అనే పురోహితుడు ఉండేవాడు. ఆతనికి ఒక వృద్ధుడైన బౌద్ధభిక్షువు స్నేహితుడు. ఆ స్నేహితుడు బౌద్ధభిక్షువుల సమావేశములలోనూ పండి తుల సదస్సులలోనూ, బుద్ధ ప్రవచనములను సింహళ భాషలో బోధించుటను విని నిరసించే వాడు. కారణం సదస్స్యులలో అధిక సంఖ్యాకులకు ఆ భాష తెలియదు. కాబట్టి బుద్ధ ప్రవచనములను, ప్రజల భాషయైన మాగధి (పాళీ)లోనికి అనువదించి, ప్రచారము చేస్తే బాగుంటుందని అపేక్షించాడు. ఆ సందర్భములో 'తవతింస' అనే స్వర్గంలో ఉన్న దేవతకొడుకు, తాను కోరుకున్నట్లు అనువదించగలడని తెలుసు కున్నాడు. ఆ దేవతను తన బిడ్డను స్నేహితుడైన కేశికి పుత్రునిగా జన్మించునట్లు అనుగ్రహించవలసినదిగా ప్రార్థించగా ఆ దేవత కరుణించి తన పుత్రుని కేశికి పుత్రునిగా జన్మించునట్లు వరమిచ్చింది. కేశికి పుత్రుడు కలిగినాడు. ఆ పుత్రుడు బాల్యంలోనే సర్వశాస్త్ర కోవిదుడైనాడు. తన పాండిత్యమునకు గర్వపడుతూ ఉండే వాడు. ఒక రోజున కేశి తన మిత్రుని మధ్యాహ్న భిక్షకు ఆహ్వానించాడు. ఆ సందర్భ ములో తన కొడుకు ఉపయోగించుకొనే చాపను భిక్షువుకు ఆసనంగా వేశాడు. అదిచూచిన కేశిపుత్రుడు కోపోద్రిక్తుడై, తన చాపపై కూర్చున్న బౌద్ధ భిక్షువును దుర్భాషలాడాడు. ఆయనకు వేద ధర్మమును గురించే కాక మరే ఇతర ధర్మములను గురించి కూడా తెలియదని నిందించాడు.

అవాక్కయిన బౌద్ధభిక్షువు కొంతసేపటికి తేరుకొని, వేద మంత్రములను, అభి దమ్మములోని మొదటి మూడు సూత్రములను వల్లించాడు. ఈ సూత్రములు ఏ ధర్మములోనివని బాలుడు ప్రశ్నించగా, ఇవి బుద్ధధర్మములోనివనీ, భిక్షువుగా దీక్ష స్వీకరిస్తేనే కానీ వాటిని అభ్యసించరాదనీ తెలియజెప్పాడు. బాలుడు దీక్ష తీసుకొను టకు అంగీకరించాడు. భిక్షువుగా మారిన ఒక నెలలోపుననే బాలుడు త్రిపిటకముల అధ్యయనమూ, నాలుగు విధములైన సూక్ష్మ భేదములను గురించి (అర్థము, చట్టము (ధర్మము) భాష, ప్రజ్ఞ) పరిపూర్ణమైన అవగాహనము పొందగలిగినాడు. ఆ బాలునికి

బుద్ధఘోషుడని నామకరణంచేశారు. ఒకరోజు బుద్ధ ప్రవచనములపై అవగాహనము తనకే ఎక్కువ ఉన్నదా లేక తన గురువు కెక్కువ ఉన్నదా అనే సందేహము కలిగి, సందేహ నివృత్తి కోసం గురువు వద్దకు వెళ్లాడు. బుద్ధఘోషుని మనసులోని సందేహ మును గ్రహించిన గురువు, బుద్ధఘోషుని మందలించి, క్షమాపణ చెప్పవలసినదని నిలదీశాడు. బుద్ధఘోషుడు క్షమాపణ కోరాడు. గురువు క్షమాపణను అంగీకరించి ఆత నిని సింహళ ద్వీపమునకు వెళ్లి, బుద్ధ ప్రవచనములను సింహళ బాషనుండి మాగధి భాషలోనికి అనువదించి, తద్వారా తాను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోమని చెప్పాడు. బుద్ధఘోషుని తండ్రిని కూడా యుక్తితో బౌద్ధునిగా మార్చివేశాడు.

బుద్ధఘోషుడు నావలో సింహళమునకు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో బౌద్ధమతమునందు మరో మహాపండితుడైన మహాతేర బుద్ధదత్తుడు మరో నావలో సింహళమునుండి భారతదేశమునకు తిరిగి వస్తున్నాడు. ఇద్దరి నావలూ సముద్ర మధ్యంలో కలసికొనటం జరిగినది. బుద్ధదత్తుడు బౌద్ధ గ్రంథముల విషయంలో సింహళములో తాను నిర్వర్తించిన కార్యములనూ, ఇంకనూ చేయవలసియున్న పనులనూ, బుద్ధఘోషునికి వివరించాడు. బుద్ధఘోషుడు సింహళము చేరి రేవుపట్టణ మైన దివిజాతనలో బసచేశాడు. ఒకరోజు మహావిహరములోని ఆచార్యులను కలయు టకు వెళ్ళాడు. ఆ సమయంలో విద్యార్థులకు పాఠం చెబుతున్న ఆచార్యుడు, అభి దమ్మంలోని ఒక విషయమై వివరణ ఇచ్చుటకు కష్టపడుతున్నాడు. ఇది గమనించిన బుద్ధుఘోషుడు పాఠమును ముగించి ఆచార్యుడు విద్యార్థులు వెళ్ళిపోయిన అనంతరం, క్లిష్టమైన విషయముపై, సంపూర్ణమైన వివరణను నల్లబల్లపై వ్రాసి వెళ్లిపోయాడు. మర్నాడు ఆచార్యుడు వచ్చి బల్లపై, వ్రాయబడి ఉన్న వివరణను చదివి, ఎవరు వ్రాసినారని ఆరాతీయగా, భారత దేశమునుండి వచ్చిన బుద్ధఘోషుడు వ్రాసినట్లుగా తెలుసుకొన్నాడు. అంతట బుద్ధఘోషుని పిలిపించి తన విద్యార్థులకు పాఠం చెప్ప వలసినదిగా కోరాడు. బుద్ధఘోషుడు పాఠం చెప్పి, పూర్తయిన తరువాత తాను సింహళ ద్వీపమునకు వచ్చిన కారణమును మహావిహారములోని పెద్దలకు మనవి చేసినాడు. వారు బుద్ధఘోషుని మాటలకు సంతసించి, ఆయనకు ఏడు అంతస్థులు కల భవనములో బస ఏర్పాటుచేసి అతిథిమర్యాదలు అన్నిటినీ ఒనగూర్చినారట. బుద్ధ ఘోషుడు బుద్ధ ప్రవచనములనన్నిటినీ మాగధి భాషలోనికి అనువదించి మహా

విహారములోని పెద్దల వద్దనుండి సెలవు తీసుకొని, మాతృదేశమునకు తిరిగివచ్చాడు. స్వదేశమునకు తిరిగి వచ్చిన అనంతరము, తన తల్లిదండ్రులకు గురువులకు ప్రణామములు ఆచరించి, అంత్యకాలము సమీపించుచున్నదని తెలుసుకొని, బోధివృక్ష ఛాయలో భౌతికకాయాన్ని వదలి ధర్మకాయంలో కలసిపోయాడు. తిరిగి తాను వచ్చిన 'తవత్మిస' స్వర్గంలో నివాస మేర్పరచుకున్నాడు. బుద్ధఘోషుడు, బోధిసత్త్వుడై మైత్రేయనాధుని శిష్యుడుగా భూ లోకములో అవతరిస్తాడని బౌద్ధులవిశ్వాసం. ఈ విధంగా పైన పేర్కొనిన నవల ఎనిమిది అధ్యాయములు కలిగియుండి అభూత కల్పనలతోనూ, పౌరాణిక సంఘటనలతో నిండి ఉండి, వాస్తవిక విషయములలో కొరవడింది.

బుద్ధఘోషుని చుట్టూ అల్లుకున్న కథలనూ గాధలనూ తొలగిస్తే, ఆయన సింహళము వెళ్లటానికి చారిత్రాత్మక కారణములు రెండు.

**మొదటి కారణం :** మహాయాన సంప్రదాయము భారతదేశములోనూ సింహళ ద్వీపములోనూ విజృంభించి, ధేరవాదముయొక్క అస్తిత్వమును రూపుమాపి పోయేటటు వంటి పరిస్థితులు ఏర్పడటం. మహాయాన శాఖ, వివిధ శాఖోప శాఖలుగా చీలిపోయి, విస్తృతంగా వ్యాపించసాగింది. మహాయానవాదులు, ఆచార్య నాగార్జునుడి నుండి సంస్కృత భాషలోనే ప్రవచించటం, గ్రంథములు వ్రాయటం ప్రారంభించారు. ధేరవాదమూ దానితోపాటు పాళీభాష అదృశ్యమైపోయే స్థితికి చేరుకొన్నవి. కాబట్టి ఆ రెంటికీ జీవంపోసి బలోపేతముచేసి, పూర్వ వైభవమును చేకూర్చవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

**రెండవ కారణం :** క్రీ.పూ. నాల్గవశతాబ్దంలో అశోకచక్రవర్తి పుత్రుడైన, అర్హంత మహేంద్రుడు అనూరాధపురంలో మహావిహారమును స్థాపించినాడు. అప్పటినుండీ ఆ మహావిహారము రాజుల ఆదరణను అనుభవిస్తున్న ఏకైక విహారముగా ప్రసిద్ధి గాంచింది. జ్ఞాన సముపార్జనకు కేంద్రబిందువుగా మన్ననలను పొందినది. అనంతరం క్రీ.శ. మొదటి శతాబ్దంలో, వత్తగామని అభయ అనేరాజు పరిపాలిస్తున్న కాలంలో వైతుల్యకులు అనే బౌద్ధశాఖవారు ఆంధ్ర దేశమునుండి సింహళమునకు వచ్చి, విహారములను స్థాపించుకొని, బౌద్ధ ధర్మములో రాబోవు మార్పులను సూచిస్తున్నట్లుగా, మాధ్యమిక లేక శూన్యవాదములోగల ముఖ్యాంశములను సంస్కృత

భాషలో ప్రచారం చేయటం ప్రారంభించారు. వీరు ప్రతిపాదించిన మాధ్యమిక, శూన్యవాద అంశములనే, ఆధారముగా చేసుకొని, ఆచార్య నాగార్జునుడు అనంతర కాలములో మహాయాన సంప్రదాయమును స్థాపించి, పెంచి, విశ్వవ్యాప్తము చేశాడు. ఆ విధంగా సింహళద్వీపంలో ఏకైక బౌద్ధసంప్రదాయంగా రాజుల ప్రజల మన్ననలను పొందిన థేరవాదముయొక్క అస్తిత్వమే సందేహాస్పదమైన పరిస్థితులు ఏర్పడినవి. విపత్కర పరిస్థితులను సహించలేని, మహావిహార థేరవాదులు, రాజకీయమైన కల్లోల మును సృష్టించి ప్రోత్సహించసాగారు. వైత్యులవాదుల విహారములను, గ్రంథా లయములను తగులబెట్టి ఆ శాఖకు చెందినవారిని హింసించసాగారు. రాజు కల్పిం చుకొని, వైతుల్యవాదులకు మరో నూతన విహారమును నిర్మించి దానికి అభయగిరి విహారమని తన పేరు పెట్టుకున్నాడు. బౌద్ధ సంఘములో ఏర్పడిన చీలిక, సింహళ ద్వీపమునందు రాజకీయ, మత పరిస్థితులలో పెనుమార్పును కలిగించింది. మహా విహారములో నివసించే వారిలో అభద్రతా భావము పెల్లుబికి వారందరూ విహా రమును వదలిపెట్టి ద్వీపము నందలి దక్షిణ ప్రాంతములకు పారిపోయారు. భద్రతా దృష్టితో వారు త్రిపిటకములను సింహళ భాషా లిపిలో వ్రాసుకొన్నారు. వైతుల్యకుల మరియు ఇతర బౌద్ధ శాఖలవారు తమ తమ సంప్రదాయములను, ద్వీపములో సంస్కృత భాషలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న సమయములో, దక్షిణ ప్రాంత ములకు పారిపోయిన థేరవాదులు భయభ్రాంతులు అవుతున్నారు. వారి ప్రత్యర్థులు అభగిరి విహారమును కేంద్రముగా చేసుకొని, రాజాదరణను పొంది క్రొత్తక్రొత్త సిద్ధాంతములను ప్రచారంచేస్తూ, అనేకమైన అభ్యుదయ కార్యక్రమ ములను నిర్వహిస్తూ ఉంటే, మహావిహార పెద్దలు, ప్రాచీన బౌద్ధ సిద్ధాంతములను సింహళ భాషలో వల్లెవేస్తూ, ప్రచారమును తమ ద్వీపము వరకే పరిమితం చేసుకొని అంత ర్జాతీయ సంస్కృతిని అలవరచుకోకుండా బావిలోని కప్పలవలే కాలం గడుపు తున్నారు. ఆ కారణంగా వారి ప్రాచీన వ్యవస్థలో చీలికలు కుట్రలు తలెత్తసాగినవి. అనేకరకములైన సమస్యలను వారు ఎదుర్కొనసాగినారు. ఇటువంటి భయాందోళన కరమైన పరిస్థితులలో దురదృష్ట వశాత్తూ క్రీ.శ. 277-304 మధ్య రాజ్యాన్నిపాలించిన మహాసేనరాజుతో వారు తలపడవలసి వచ్చింది. దానితో మహావిహారము పూర్తిగా మూతపడి, అందులో నివసిస్తున్న కొద్దిమంది భిక్షులను రాజధానినుండి బహిష్క

రించుట జరిగింది. దానితో అభయగిరి విహారవాసులు ప్రత్యర్థులు లేకుండా తొమ్మిది సంవత్సరములపాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా వ్యవహరించారు. దక్షిణాదికి పారిపోయిన మహావిహార బౌద్ధులు, ఇదే కాలంలో, ఆ ప్రాంతములోని జన బాహుళ్య మును కూడగట్టుకొని, రాజుపై తిరుగుబాటుకు సన్నద్ధు లైనారు. పరిస్థితిని గమనిం చిన రాజు వారిని శాంతపరచుటకుగాను మహావిహార భవన మును తిరిగి థేరవాద పెద్దలకు ఒప్పగించి, వారిపైగల ఆంక్షలను, నిషేధాజ్ఞలను ఎత్తి వేశాడు. దాంతో మహావిహారములోనికి పెద్దలందరూ ప్రవేశించారు కానీ వారి మనసులలో గల భయాందోళనలు తొలగిపోలేదు. వారి ప్రత్యర్థులను, సంస్కృత భాషను సింహాళ ద్వీపము నుండి తరిమివేస్తేనేగానీ, వారి అస్తిత్వమునకు స్థిరత్వము ఏర్పడదని నిర్ణ యించుకున్నారు. ఇందుకుగాను వారందరూ ఎన్నో విధములుగా ఆలోచించి చివరకు ఒక నిర్ణయమును తీసుకున్నారు. తాము తిరిగి తమ పూర్వ వైభవమును అనుభవిం చవలెనంటే వారి నిర్ణయమే ఏకైక మార్గమని దృఢంగా విశ్వసించారు. ఆ నిర్ణయ మును అనుసరించి, పాళీభాషను పునరుద్ధరించి, థేరవాద ప్రచారమునకు అంతర్జాతీ యంగా సంస్కృతమునకు బదులు పాళీభాషను ఉపయోగించుటద్వారా సంస్కృత భాషకున్న ప్రాముఖ్యతను తగ్గించటం. సింహాళ ద్వీపములో కూడా స్థానిక భాషల స్థానే పాళీభాషనే థేరవాద ప్రచారమునకు ఉపయోగించటం. పాళీభాషాభి వృద్ధికి గాను, ఒక విద్యాలయము నెలకొల్పి, బుద్ధ ప్రవచకులు విద్యార్థులకు పాళీభాషలోనే బోధించుట, చర్చలను కూడా ఆ భాషలోనే నిర్వహించుట వంటి, పాళీభాషా పునర్జీ వన కార్యక్రమమునకు ప్రణాళికను సిద్ధంచేశారు. భారతదేశంలో కూడా ఆనాడు థేరవాద సంప్రదాయము పాళీభాషలు, కొడిగట్టి కొండెక్కే స్థితిలోనే ఉన్నై. శాఖోప శాఖలైన మహాయాన సంప్రదాయమును, సంస్కృత భాషలోనే విస్తృతంగా ప్రచారము చేస్తూ ఉండటంతో, ఆ సంప్రదాయములూ, సంస్కృత భాషకూడా అధిక మైన ప్రాబల్యమును పొందినవి. ఈ పరిస్థితుల నుండి పాళీ భాషను, థేర వాదమును పునరుద్ధరించుటకుగాను విదేశీయుల సహాయ సహకారములు అత్యవసరములని మహావిహారము నందలి పెద్దలు నిర్ణయించుకున్నారు. క్రీ.శ. 400 సంవత్సర కాలా నికి, పునర్జీవన కార్యక్రమమునకు అన్ని హంగులు సమకూర్చుకొన్నారు కానీ, అత్యంత కష్టతరమైన ఈ కార్యక్రమమును నిర్వహించగల సమర్థుడు కరువైనాడు. పాళీ,

సింహళ భాషలలోనూ థేరవాద సిద్ధాంతములోనూ, మంచి పాండిత్యము, నిపుణత కలిగిన వ్యక్తి కొరకై భారత దేశములో నున్న అన్ని థేరవాద విహారములలోనూ, ముఖ్యంగా ఆంధ్ర దేశమునందు శ్రీ పర్వత ప్రాంతమునగల విహారములలోనూ గాలించటం ప్రారంభించారు. ఈ సందర్భంలో జ్ఞప్తికి తెచ్చుకొనవలసిన విషయము ఏమంటే, క్రీ.శ. మూడవ శతాబ్దములోనే శ్రీ పర్వత ప్రాంతములో సింహళ ద్వీప బౌద్ధులకు ప్రత్యేకంగా విహారములు ఉండేవి. వాటిలో సింహళ ద్వీపమునకు చెందిన బౌద్ధ భిక్షువులు నివసిస్తూ, భారత దేశములోని వివిధ ప్రాంతములలోనూ, వాయవ్య, ఈశాన్య సరిహద్దుల కావలగల దేశములలోనూ థేరవాద ప్రచారము చేస్తూ ఉండేవారు. బహుశా వారి సహాయంతో మహావిహార నిర్వాహకులు, బుద్ధఘోషుని వ్యక్తిత్వమును గురించి, పైన పేర్కొన్న ఉభయభాషల యందునూ, థేరవాద సిద్ధాంతములయందునూ, ఆయనకుగల పాండిత్య ప్రకర్ష గురించివిని, ఆయనను సింహళ ద్వీపమునకు ఆహ్వానించారు. శ్రీ పర్వత ప్రాంతము నందు వసిస్తున్న సింహళీయులు కూడా, బుద్ధఘోష మోరండ ఖేటకుని సింహళము వెళ్లవలసినదిగా ప్రోత్సహించి ఉంటారు. ఏమైనప్పటికీ బుద్ధఘోషుడు క్రీ.శ. 412-434 సంవత్సర మధ్యకాలంలో మహానాముడనే రాజు సింహళమును పరిపాలింస్తుండగా ఆయన ఆ ద్వీపముపై కాలుమోపాడు. మహావిహార నిర్వాహకులు అనూరాధపురంలో ఆయనకు ఘనమైన స్వాగతమిచ్చారు. విశాలమై, చుట్టూ వృక్షములు, పూలమొక్కలనూ, సమృద్ధిగా కలిగియున్నటువంటి, ఒకపెద్ద భవనంలో ఆయనకు బస ఏర్పాటు చేశారు. మల్ల నిగమ సామియనే ధనవంతునికి చెందిన ఆ భవనమును విడిదిగా చేసుకొని, సర్వ సుఖములను అనుభవిస్తూ, బుద్ధఘోషుడు సింహళ భాషయందు ఉన్న త్రిపిటకములను పాళీభాషలోనికి అనువదించటమే గాక, త్రిపిటకముల యందలి సారమును పిండి స్వతంత్రంగా "విశుద్ధిమగ్గ" అనే వేయి తాళపత్ర పుటలు గలిగిన వివరణాత్మకమైన విశిష్ట గ్రంధమును కూడా రచించాడు. ఆయన ఎంతకాలము సింహళ ద్వీపంలో గడిపాడనే విషయముపై నిర్దుష్టమైన అభిప్రాయము ఎవరికీ లేదు. అయితే బుద్ధఘోషుడు చెప్పిన దానినిబట్టి తాను సింహళ భాషలో నున్న మూడు వాఖ్యానములను ఆచార్య బుద్ధమిత్త ద్వారా అధ్యయనము చేసానన్నాడు. ఆ మూడు గ్రంథముల పేర్లు 'మహా అట్టకథ', 'మహాపక్కరి', 'కురుండి'. ఈ పై సిద్ధాంతముల యందు బుద్ధ మిత్రుడు మహాపండితుడు. అనంతరం ఆచార్య బుద్ధసిరి ఆదేశాను

సారం, వినయ పిటకముపై వ్యాఖ్యాన రచన పూర్తి చేశాడు. ఈ గ్రంథమును అను రాధపుర మహావిహారములోని, మహా మేఘవాన (వాహన) ఉద్యానవనములో కూర్చుని రచించినట్లు తెలియజేశాడు. ఈ గ్రంథ రచన ఒక సంవత్సర కాలములో పూర్తిచేసినట్లు చెప్పాడు.

విశుద్ధి మగ్గను ఆంగ్ల భాషలోనికి అనువదించిన మహాపండితుడు భిక్కునానా మోలి వ్రాతలను అనుసరించి బుద్ధఘోషుడు త్రిపిటకముల అనువాదమును ఏక పర్యాయంగా చేపట్టి, మూడు గ్రంథముల రచననూ, కొద్ది నెలల వ్యవధానంతో పూర్తి చేసినట్లు తెలుస్తున్నది. ఈ విధమైన భావనకు ముఖ్యకారణం మూడు వ్యాఖ్యా నములలోనూ ఒకదానిని గురించి మరొక దానిలో ప్రస్తావించబడుట. అంతేకాక బుద్ధఘోషుడు తన రచనలను ఆనాటి చారిత్రక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కాలక్రమ పద్ధతిలో వ్రాసి యుండవచ్చునన్నాడు. బుద్ధఘోషుని రచనలు అన్నిటి లోనూ ఒకే విధమైన శైలి పొందిక గోచరిస్తాయి. ప్రతి గ్రంథములోనూ వ్రాయవలసిన విషయమునూ, విధానమునూ స్థిరముగా నిర్ణయించుకొనిన అనంతరమే ఆయన రచనను ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఈ రకములైన ఊహలనుబట్టి బుద్ధఘోషుడు ప్రప్రథమంగా విశుద్ధి మగ్గరచనను ప్రారంభించి, అనంతరము మిగిలిన రచనలను కూడా సమకాలీనంగా చేపట్టినట్లుగా భావించవచ్చు. అన్ని గ్రంథములయందలి పీఠికలు, ఉపసంహారములు. ఒకటి రెండు నికాయములను మినహాయిస్తే, ఒకే విధంగా ఉన్నవి. బుద్ధఘోషుడు సింహళ భాషనుండి పాళీభాషలోనికి అనువదింప బడినవిగా ఈ క్రింది గ్రంథాలను పేర్కొంటున్నారు.

**వినయపిటకముపై వ్యాఖ్యానములు :**

1. సామంత పాసాదిక : వినయ అట్టకథ
2. కంఖావితరణీ : పాతిమోక అట్టకథ

**సుత్తపిటకముపై వ్యాఖ్యానములు :**

1. సుమంగళీ విలాసిని : దీఘనికాయ అట్టకథ
2. పాపంచసూదనీ : మజ్జిమనికాయ అట్టకథ
3. సార్థతప్పకాసినీ : సంయుత్తనికాయ అట్టకథ
4. మనోరథ పూరణి : అంగుట్టనికాయ అట్టకథ

| | | |
|---|---|---|
| 5. పరమార్ధ పూరణి | : | ఖుద్దక పాద, సుత్తనిపాత అట్ట కథలు |
| 6. ధర్మపదాట్ట కథా | : | ధమ్మపదాట్ట కథ |
| 7. జాతక కథా | : | జాతక అట్టకథ |

**అభిదమ్మపిటకముపై వ్యాఖ్యానాలు :**

| | | |
|---|---|---|
| 1. అట్టసాలిని | : | ధమ్మ సంగిణి అట్టకథ |
| 2. సామంత వినోదిని | : | విభంగ అట్టకథ |
| 3. పంచ ప్రకరణ అట్టకథ | : | అభిదమ్మ పిటకములో మిగిలిన ఐదు గ్రంథాల అట్ట కథలు |

అర్హంత మహేంద్రుడు తెచ్చిన వ్యాఖ్యానములు సింహళ భాషలోనికి అనువదించ బడగా, వాటిని ఎటువంటి మార్పులు, చేర్పులు, మినహాయింపు లేకుండా యథా తథంగా, సుజనులకు మోదము కలిగించుటకై పాళీభాష(మాగధి)లోనికి అనువదించినానని ప్రకటించుకున్నాడు. అయితే గ్రంథ పరిశోధకులైన కొందరు పండితులు, బుద్ధఘోషు డొక్కడే, అన్ని గ్రంథములను అనువాదముచేసి ఉండడని సందేహము వెలిబుచ్చారు. ఎవరో కొందరు పండితులు, అనువాదముల ముసాయిదాలను రచించి బుద్ధ ఘోషునికి ఇవ్వగా, ఆయన వాటిని పరిశీలించి, పరిష్కరించి ఉంటారని భావిస్తున్నారు. వారి అభిప్రాయములో వాస్తవము ఉండవచ్చును.

బుద్ధఘోషుని ఉత్కృష్ట గ్రంథరాజమైన విశుద్ధిమగ్గను వసుబంధుడు సంస్కృతములో వ్రాసిన అభిధమ్మకోశంతో సమానంగా పరిగణిస్తారు. విశుద్ధి అంటే నిర్వాణమని అర్థం. నిర్వాణమును పొందుటకు వలసిన ఉపాయములను (సాధన పద్ధతులను) తెలియ జేసే గ్రంథంకనుక దీనికి విశుద్ధిమగ్గ అనిపేరు. క్రీ.శ. ఐదవ శతాబ్దమునందు రూపుదిద్దుకున్న పై రెండు గ్రంథముల యెడల బౌద్ధులు అత్యంత భక్తి శ్రద్ధలను చూపుతారు.

డాక్టరు సచ్చిదానందమూర్తిగారు విశుద్ధిమగ్గను ప్రశంసిస్తూ ఆ గ్రంథము ధేరవాదులకు విజ్ఞాన సర్వస్వమన్నారు. అత్యంత వాస్తవికత, ప్రామాణికతలను కలిగి, ఆది భౌతిక, నైతిక విలువలనూ, పాళీ సంప్రదాయములను అనుసరించి బౌద్ధుల ధ్యాన పద్ధతులనూ, సమగ్రంగానూ మరియు సంక్షిప్తంగానూ విశదపరచు విజ్ఞాన

గ్రంథమని వర్ణించారు. విశుద్ధి మగ్గ ప్రధానంగా మూడు భాగములుగా విభజింప బడినది. మొదటి భాగమును 'శీలం' అంటారు. శీలమంటే ఇక్కడ కర్మ అని అర్థం చెప్పుకోవాలి. కాయము (శరీరము), వాచకము(మాట)లద్వారా ఆచరించే కర్మలను "చేతయిత్వా కర్మ" అని అంటారు. వివరంగా చెప్పాలంటే ఏ కర్మలను ఆచరించుట వలన భవిష్యత్తులో పశ్చాత్తాపము చెందవలసిన అవసరముండదో, అట్టి కర్మయే శీలము. రెండవ భాగమును ధ్యానము లేక సమాధి అంటారు. విశుద్ధిమగ్గలోని ఎక్కువ భాగము, ఈ అంశంపైనే వ్రాయబడినది. పాళీ భాషలోగల గ్రంథములోకూడా అధికంగానే వ్రాయబడింది. 'కుశల చిత్త ఏకాగ్రతనే' ధ్యానము లేక సమాధి అంటారు. కుశల చిత్తమంటే విషయ వాంఛలకు అతీతమైన మానసిక స్థితి. మూడవ భాగము ప్రజ్ఞ. ధ్యానముతో మనస్సును పరిశుద్ధము చేసుకొనుట వలన, పరిపూర్ణమైన అవగాహనము లభించి, తద్వారా పారలౌకికమైన ప్రజ్ఞను పొందవచ్చును. విషయ ములను అనుసరించి మూడు విభాగములుగా ఉన్న ఈ గ్రంథములో 23 అధ్యాయ ములున్నవి. ప్రతి అధ్యాయములోనూ ఒక తాత్త్విక అంశము చర్చించబడినది. విమర్శనాత్మకంగా విశ్లేషించబడినది. సుజనులైన వారికి ఎంతో సంతోషమును కలిగించినది. అదే ఆ గ్రంథము యొక్క లక్ష్యము.

మొదటి రెండు అధ్యాయములలో శీలమును గురించీ, బౌద్ధ భిక్షువులు పాటించ వలసిన ప్రాతిమోక్ష నియమములను గురించి వివరించబడినది. మూడవ అధ్యా యము నుండి తొమ్మిదవ అధ్యాయము వరకూ ధ్యానము లేక సమాధి స్థితిని పొందుటకు అవసరమైన సాధన పద్ధతులు విశదపరుచ బడినవి. ఈ పద్ధతులు నలుబది విధములు. పన్నెండు పదమూడవ అధ్యాయములలో, ప్రజ్ఞారహితమైన సమాధి స్థితిని పొందుటవలన లభ్యమగు ప్రయోజనములేవో వివరించబడినవి. పదునాలుగవ అధ్యాయమునుండి పదునారవ అధ్యాయము నందలి కొంత భాగము వరకూ, ప్రజ్ఞను గురించి వివరించుట జరిగింది. ఆ అధ్యాయములలో ప్రస్తావించిన అంశములన్నీ సిద్ధాంతపరమైనవి. అనుభవ మును, చిన్నచిన్న విభాగములనుచేసి, ప్రతి విభాగమును గురించి వివరించుటతో పాటు, వాటిని అనేక రకములైన నమూ నాల సమాహారముగా మారుస్తూ విశదీకరించుట జరిగినది. పదహారవ అధ్యాయ ములో మిగిలిన భాగమునందు బుద్ధభగవానుడు ప్రవచించిన నాలుగు ఆర్య సత్య

ములు దుఃఖము; దుఃఖసముదయము; దుఃఖ నిరోధము; దుఃఖ నిరోధ మార్గమును గురించి బోధించుట జరిగినది. పదిహేడవ అధ్యాయమునందు ప్రజ్ఞకు ఆధార భూతము అజ్ఞానమని వివరిస్తూ అజ్ఞానమునకు ఆధారములైన ఇరువది నాలుగు విధములైన సమాహారములను కూడా తెలియజేయుట జరిగినది. ముప్పది రెండు విధములైన కర్మలనూ, ఫలితముగా ఏర్పడిన చైతన్యమునూ, మనస్తత్త్వమూ, భౌతిక తత్త్వము, స్పర్శ, అనుభూతి, ఆకాంక్ష, అంటిపెట్టుకొనుట, ఉనికి, పుట్టుక వంటి ఆరు విధములైన ఆధారములను గురించి కూడా వివరించుట జరిగినది. పదు నాలుగవ అధ్యాయమునుండి పదిహేడవ అధ్యాయము పర్యంతమూ ముందు చెప్పి నట్లుగా ప్రజ్ఞకు సంబంధించి, సిద్ధాంతపర విషయములే తెలియజేయబడినవి. పదునెనిమిదవ అధ్యాయము నుండి ప్రారంభించి, ఇరువది ఒకటవ అధ్యాయము వరకూ ప్రజ్ఞాచరణ విధానము తెలియజేయబడినది. సాధకుడు బౌద్ధధర్మ గ్రంథము లను అధ్యయనము చేయుట వలన కలిగిన అనుభవమును, ఏ విధముగా ఆచరణలో పెట్టవలెననే అంశములపై నిర్దేశిస్తూ ఆ విధమైన ఆచరణ వలన భవిష్యత్తులో తన అనుభవము అభివృద్ధి చెంది, ఏ విధంగా పరిణితి చెందుతుందో ఊహించగలగాలి. ఇరువది రెండవ అధ్యాయమునందు సిద్ధి పొందుటకు ముందుగా సాధించవలసిన నాలుగు దశలను తెలియజేయబడినవి. మొదటిదశ నిబ్బానము (నిర్వాణము); ఈ దశయందు, ఈనాటి వరకు మానసికముగా అనుభ వించిన రాగద్వేషములు, స్వార్థము, ఆదిగాగల దుర్గుణములు నశించిపోతవి. ఈ స్థితిలో ఆర్య సత్యములలో ఒకటైన దుఃఖము, పరిపూర్ణంగా అవగతమై, లౌకిక సంబంధములు పూర్తిగా విసర్జింప బడుతవి. అప్పుడు దుఃఖ నివృత్తి మార్గము తెలుస్తుంది. అనంతరం దుఃఖ రాహిత్యము లభిస్తుంది. మిగిలిన మూడు దశలూ సాధకునికి మానవ జీవిత అంతిమ లక్ష్యమును సాధించి అవసరమగు ఆచరణా విధానములు వివరిస్తవి.

విశుద్ధిమగ్గ రచనావిధానమూ, శైలీ త్రిపిటకముల వ్యాఖ్యానానువాదములు, బుద్ధ ఘోషునికి ప్రశంసలు, అభిశంసలను కూడా తెచ్చిపెట్టినవి. ఆధునిక పండితులు కొందరు ఆయన రచనలలో సహజత్వము కొరవడిందన్నారు. బుద్ధఘోషుడు ఈ విధములైన విమర్శలనూహించియేకాబోలు ఎటువంటి విమర్శలకు, సందేహాలకు తావివ్వని విస్పష్ట ప్రకటన ఈ విధంగా చేశాడు. త్రిపిటకములను వాటి వ్యాఖ్యాన

ములను, అనువదించుటలో బుద్ధ భగవానుని ప్రవచనములను, బౌద్ధ సంగీతుల యందు పఠించిన విధంగానే, అర్హంత మహేంద్రుడు సింహాళమునకు తెచ్చిన ప్రతులను ఆధారంగా చేసుకొనే, ఎటువంటి మార్పులు, చేర్పులు, మినహాయింపు లేకుండా సింహాళభాషనుండి, తిరిగి మాగధి (పాళీ) లోని అనువదించుట చేశాను. ఆ ప్రజ్ఞాశాలి (బుద్ధుడు) యొక్క ప్రవచనములు, జన సామాన్యమునకు చేరువవుట కొరకే ఈ అనువాదములను చేశాను"

విశుద్ధిమగ్గను ఆంగ్లములోనికి తర్జుమా చేసిన భిక్కు నానా మోలి వ్యాఖ్యానిస్తూ, బుద్ధఘోషుడు అనువాద గ్రంథములందు ఎక్కడా తన స్వాభిప్రాయమును తెలియ జేయలేదన్నాడు. రెండు సందర్భములలో మాత్రము 'మాకు ఈ విధంగా ఉంటే బాగుండేది'అనీ, మరో సందర్భంలో "ఈ అంశముపై పూర్వీకులు తను అభిప్రాయ ములను తెలియజేయలేదు. కానీ నా అభిప్రాయమిది అంటూ తనఅభిప్రాయములను వ్యక్తంచేశాడు." ఆ విధంగా వ్యక్తం చేయుటలోనే బుద్ధఘోషునియొక్క ఆత్మనిగ్రహము, కీర్తి కండూతితో పాండిత్య ప్రకర్షను ప్రదర్శించుట యందు విముఖత వంటి ఉన్నత గుణ సంపద వ్యక్తమౌతవి. అనువాదములను కేవలము మూలగ్రంథములోనున్నట్లే తర్జుమా చేయటంలో అత్యంత శ్రద్ధ జాగ్రత్త ప్రదర్శించారు. తన పాండిత్యమును, అభిప్రాయములను ఉపయోగించి ఎట్టి మార్పులు చేర్పులు చేయలేదు. తాను చేపట్టిన కార్యనిర్వహణలో అంకిత భావమునూ, భక్తి, శ్రద్ధలనూ ప్రదర్శించటమే కాకుండా, ఎవరి ఆదేశానుసారంగా తాను ఈ మహత్కార్యమును చేపట్టాడో ఎవరి ఆదరాభి మానములను అనుభవించి, ఆ కార్యమును పూర్తి చేశాడో, ఆ మహావిహార వాసులైన ఆచార్యులందరికీ వినయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేయుటకై, బుద్ధఘోషుడు తన వ్యక్తిత్వమునూ, మహావిహారమునందలి ఆచార్యుల సుశీల తనూ వర్ణిస్తూ గ్రంథాంతమునందు సుదీర్ఘమైన వివరణను అనుబంధించాడు.

ఆయన స్వంత వాక్యములలో ఈ విధంగా వ్రాశాడు.

విశుద్ధిమగ్గను రచించిన పెద్దమనిషి, పరమ పవిత్ర గుణ సంపన్నుడు, జ్ఞానము, సామర్థ్యము గలవాడు. ధర్మాచరణము ద్వారా న్యాయము, మృదుస్వభావము ఆదిగా గల సుగుణ సంపన్నతను పొందినవాడు, తన అభిప్రాయములను, ఇతర అభిప్రాయములను కూడా లోతుగా పరిశీలించగల సమర్థుడు. విషయగ్రహణము

నందు సునిశిత బుద్ధి కలిగినవాడు. త్రిపిటకములు, వ్యాఖ్యానములుగా విభజింప బడిన గురు ప్రవచనములయందు, దోషరహితమైన జ్ఞానవంతుడు, గళమునగల స్వరపేటిక పారిశుద్ధ్యత వల్ల కమనీయమైన కంఠస్వరమూ, ఉత్తమమైన వాక్పటిమతో ప్రబోధించగల సామర్థ్యం కలిగిన వాడు, అనర్గళముగా ఉపన్యసించ గలిగినవాడు, గొప్పకవి, మహావిహారమునందలి పెద్దల వారసులలో అలంకారమువంటివాడు. దివ్యకాంతులు వెదజల్లు గురుపరంపరయందు, దోషరహితుడైన జ్ఞానసంపన్నుడు. మానవాతీత స్థితియందు విశిష్టమైన షడ్విధ ప్రత్యక్ష జ్ఞానముల నెరిగినవాడు. విశేష జ్ఞానము, అమితమూ, పవిత్రమైన వాక్చాతుర్యవంతుడు. పూజనీయులైన పెద్దలచే బుద్ధఘోషుడని పిలవబడేవాడు. మోరండ ఖేటక అని పిలవబడ వలసినవాడు.

విశుద్ధిమగ్గ, అంత్యమున వ్రాయబడిన పై గద్యమును చదివిన పిమ్మట భదంతా చార్యుడైన బుద్ధ ఘోషుని గురించి అధికంగా చెప్పవలసినదిగానీ, ఆయన వ్యక్తిత్వ వికాసమును గురించి మరింతగా తెలియజేయవలసినదిగానీ ఏమున్నది.

భదంతాచార్య బుద్ధఘోషుడు తెలుగు గడ్డపై జన్మించి అంతర్జాతీయ కీర్తి సంపా దించుట తెలుగు వారందరికీ గర్వకారణము.

■ ■ ■

# బుద్ధపాలితుడు

## (ప్రాసంగికవాదము)

క్రీ.శ. నాల్గవ శతాబ్ది ప్రారంభములో మాధ్యమిక వాదము రెండుగా చీలి పోయినది. ఒకదానిని ప్రాసంగిక వాదమని, రెండవ దానిని స్వాతంత్రిక వాదమని పిలచేవారు. ప్రాసంగిక వాదమునకు సృష్టికర్త బుద్ధపాలితుడు. ఆయన స్వస్థలము దంతపురము (ప్రాచీన కళింగ రాజ్యము నందలి సింహపురము, నేటి శ్రీకాకుళం జిల్లాలో ఉన్నది). ఇంతకుమించి ఆయనను గురించి వివరములు తెలియవు.

బౌద్ధ ధర్మ స్వీకారానంతరము, ఆయన నాగమిత్రుని శిష్యుడైన, సంఘ రక్షితా చార్యుల ద్వారా, ఆచార్య నాగార్జునుని గ్రంధములను గురించి తెలుసుకొని, అధ్యయ నము చేశాడు. ఆ విధంగా ఆయన విశేష జ్ఞానమునుపొంది, ధ్యానమువలన మంజుశ్రీ బోధిసత్త్వుని దర్శించగలిగాడు. దంతిపుర విహారము నందు నివసిస్తూ, బుద్ధధర్మమును గురించి ఆయన అనేక ధర్మోపన్యాసములను చేయుటయేగాక, నాగార్జునుని, ఆర్యదేవుల రచనలపై వ్యాఖ్యానములను కూడా రచించాడు. అనేక సిద్ధులను పొందినాడు. ఆయన జీవిత వివరములు బూస్టన్ వ్రాసిన "ఛోస్ బమ్" (బౌద్ధమత చరిత్ర), టిబెట్టు రచయిత అయిన సమ్‌పంఖాన్ పో యొక్క "దృగ్బ

సామొలియోన్ బ్జాన్" అనే గ్రంథములలోనూ పొందు పరచిన వాటితో సరిపోవు చున్నది. అయితే పైన పేర్కొనిన రెండు గ్రంథములు పూర్తిగా లభించక, ముక్కలుగా దొరకినవి.

నాగార్జునుని ప్రఖ్యాత గ్రంథమైన 'మూలమాధ్యమిక కారిక' పై వ్యాఖ్యానములు వ్రాసిన ప్రసిద్ధ పండితులు ఎనమండుగురిలో బుద్ధపాలితుడు ఒకడు. మిగిలిన ఏడుగురు నాగార్జునుడు, భావవివేకుడు, చంద్రకీర్తి, దేవశర్మ, గుణశ్రీ, గుణమతి మరియు స్థిరమతి అనేవారలు. చివర పేర్కొన్న పండితులు ఇద్దరూ యోగాచార సాంప్ర దాయమునకు చెందిన వారు.

సాంప్రదాయకమైన నమ్మకమేమంటే, ఆయన మాధ్యమిక వాదముపై అనేక రచనలు చేసినప్పటికీ, "మూల మాధ్యమిక వృత్తి" అనే గ్రంథము ఒక్కటే కాల ప్రవాహమును తట్టుకొని నిలవగలిగింది. సంస్కృత భాషలో రచింపబడిన మూల గ్రంథము లభించనప్పటికి, అదృష్టవశాత్తు క్రీ.శ. 9వ శతాబ్దమునకు చెందిన జ్ఞాన గర్భుడు టిబెట్టుభాషలోకి అనువదించిన 'క్లుయిరాగల్ మిట్లాన్' గ్రంథము లభించింది.

బుద్ధపాలితుడు నాగార్జునుని మూల, మాధ్యమిక కారికపై రచించిన వ్యాఖ్యా నము, ఆ గ్రంథముపై ఈనాడు లభిస్తున్న వ్యాఖ్యలలో ఆరవది. మిగిలిన ఐదులో మూడు టిబెటన్ భాషలోనూ, నాల్గవది భావవివేకుని రచన "ప్రజ్ఞాప్రదీప", ఐదవది చంద్రకీర్తి రచనయైన "ప్రసన్నపాద". చివర పేర్కొనబడిన రెండు గ్రంథములు సంస్కృత భాషలోనున్నవి.

బుద్ధపాలితుని వ్యాఖ్యానములోని ఇరువది ఏడు అధ్యాయములు, మూల గ్రంథ మును అనుసరించి యున్నవి. ఈ వ్యాఖ్యానము, త్రిపిటకములపై టిబెట్టు భాషలో రచింపబడిన వ్యాఖ్యానమునకూ, చంద్రకీర్తియొక్క ప్రజ్ఞాప్రదీప రచనా కాలమునకూ, మధ్య కాలములో రచింపబడి యుండవచ్చును. ఈ అభిప్రాయమునకు ఆధార మేమనగా టిబెట్టు భాషలో అనువాదములైన మూడు వ్యాఖ్యానములను, "ధ్యాన గర్భుడు" మరియు "క్లుయి–రాగ–కిమిట్స్షన్"లు అను టిబెట్టు పండితులచే అనువ దింపడి యుండవచ్చును. అయితే అనువదింపబడిన వ్యాఖ్యానములోని విషయ ములు, చంద్రకీర్తి రచించిన "ప్రసన్నపద వ్యాఖ్యానము"లోని విషయములకు కొంత

భిన్నముగాను ఉన్నవి. ముఖ్యముగా అధ్యాయములు 2, 3, 7, 11, 13, 15, 18 మరియు 20లలో ఈ భిన్నత్వము గోచరిస్తున్నది. బుద్ధపాలితుడు తన వ్యాఖ్యానములో అధ్యాయముల పేర్లను మూల గ్రంథమును అనుసరించి నిర్ణయించినాడు. తన వ్యాఖ్యానము నందు నాగార్జునుని "మూల మాధ్యమిక కారిక", ఆర్యదేవుని 'చతుః శతక' రాహుల భద్రుని "ప్రజ్ఞాపారమితా స్తోత్ర" ఆర్యభ్యుని టిబెట్టు భాషా గ్రంథము "ఫాగ్స్ పజిగ్స్ మెడ్" గ్రంథములను ప్రస్తావించుట జరిగింది.

బుద్ధపాలితుడు, నాగార్జునుని సిద్ధాంతములను "ప్రాసంగిక వ్యాఖ్య" అనే పద్ధతిలో వివరించాడు. ఈ పద్ధతిని అనుసరించి స్వకీయమైన ప్రతిపాదన చేయకుండానే, మాధ్యమిక వాదమును త్రోసిపుచ్చితే ఆశించకూడనివి, మీరజాలనివియైన పరిణామములు ఉద్భవిస్తవని ప్రత్యర్థులకు తెలియచెప్పేవాడు. ఈ విధానమును భావవివేకుడు తీవ్రముగా విమర్శించాడు, కానీ చంద్రకీర్తి సమర్థించాడు. ఈ కారణంగా టిబెట్టు బౌద్ధులు బుద్ధ పాలితుని, చంద్రకీర్తిని ప్రాసంగిక సంప్రదాయమునకు చెందిన వారుగానూ, భావవివేకుని స్వాతంత్రిక సంప్రదాయమునకు చెందిన వానిగానూ పరిగణించారు.

ప్రాసంగిక వాదులు తర్కము ప్రధానంగా, ఇతర సంప్రదాయములకూ, శాఖలకూ చెందిన బౌద్ధులనుగానీ, ఇతర మతములవారిని గానీ చర్చలలో ఎదుర్కొనేవారు. ఎదుటివారి వాదనల యందలి లోపములను ఎత్తిచూపుతూ, వాటిని తిరస్కరించి తద్వారా తమ మాధ్యమిక వాద ప్రాశస్త్యాన్ని ప్రకటించేవారు. ఆయన వృద్ధిచేసిన తార్కిక పద్ధతిలో ప్రత్యర్థులను తన వాదన ద్వారా అసంభవ పరిస్థితులలోనికి ప్రవేశపెట్టి, వారి వాదనలోని లోపమునూ, తప్పును ఋజువు చేశేవాడు.

■ ■ ■

# భావవివేకుడు

## (స్వాతంత్రిక మాధ్యమిక వాదము)

భావవివేకుని భవ్య అనికూడ పిలుస్తారు. టిబెట్టు భాషలో ఈయనను "లెగ్స్ ఇడన్ బెడ్ పే" అంటారు. ఈయన బుద్ధపాలితునికి సమకాలీనుడైనప్పటికీ, ఆయన కంటె పెద్దవాడు. బుద్ధపాలితుని ప్రాసంగిక వాదమును తిరస్కరించి తనదైన నూతన సంప్ర దాయమును స్థాపించాడు. దాని పేరు స్వాతంత్రిక మాధ్యమిక వాదము.

హుయాన్‌సాంగ్ వ్రాతలలో భావవివేకుడు. ధాన్యకటకమునకు సమీపములో దక్షిణముగా నున్న కొండకొమ్ముపై నున్న రాజసౌధములో నివశించేవాడు. భవ్య మతపరమైన, తాత్త్వికపరమైన గ్రంథముల యందు ఉద్దండ పండితుడనీ, పేరుమోసిన ద్వంద్వ తార్కికుడనీ వర్ణించాడు. తాను నాగార్జునుని అనుయాయి అయినప్పటికినీ "సాంఖ్యాయన గర్భ" అనే సాంఖ్య ప్రదర్శన గ్రంథమును రచించాడు. మైత్రేయనాధుని దర్శనమునకు ఎదురు తెన్నులు చూస్తున్నానన్నాడు. స్వెల్ భావవివేకుడు నివశించిన కొండ, కృష్ణాతీరమున గుంటూరు జిల్లాలోగల ఉండవల్లిగా గుర్తించాడు. ఈ గుర్తింపు యదార్థమే ననుకొనటానికి ఇప్పటికీ ఆ కొండలో వాసయోగ్యమైన అనేక గుహలు ఉండుటయే. బౌద్ధ గ్రంథములు ఈయనను మలయగిరి వాసియైన క్షత్రియ కుమా రుడని తెలియజేశాయి. మలయగిరియే నేటి మంగళగిరి అయిఉండవచ్చును. పానకాలస్వామి గుడిగా నేడు పరిగణింపబడుచున్న గుహచుట్టూ ఉన్న ఇతర గుహలు,

భావవివేకునికి, అతని శిష్యులకు ఆ రోజులలో నివాసములై యుండవచ్చును. కొన్ని గ్రంథములు, పైన చెప్పినట్లు ఆయనను ఒక రాకుమారుడంటే, చైనీయుల గ్రంథములు ఆయనను మగధకు చెందినవాడని తెలియజేస్తున్నవి. విద్యారంభంలో ఆయన సూత్రములను, శాస్త్రములను అధ్యయనం చేశాడు. చర్చలయందు మంచి నైపుణ్యము సంపాదించి, సాంఖ్యులను పరాజితులను చేశాడు. బౌద్ధ మత స్వీకారానంతరము ఉత్తర భారతమునకు వెళ్లి మధ్య భారతములోని అనేక విహారములలో చాలాకాలము నివసించి, మాధ్యమిక వాదమును క్షుణ్ణంగా అధ్యయనము చేశాడు. అనంతరం ధాన్యకటకమునకు తిరిగివచ్చి, అచ్చటి విహారమునకు భదంతుడై నాడు (కార్యనిర్వహణాధికారి). ఆయన పర్యవేక్షణలో ధాన్యకటకమునకు చుట్టుప్రక్కల ఏబది విహారములు ఉండేవి. నాగార్జునుని మాధ్యమిక వాదము, బౌద్ధ సంప్రదాయమును అనుసరించి, అభివృద్ధి పరచిన తార్కికపద్ధతులు ఆయనను ఎంతగానో ఆకర్షించి, ముగ్ధుణ్ణి చేశాయి. ముఖ్యంగా దిఙ్నాగుని 'న్యాయప్రవేశ'అనే తర్కశాస్త్ర గ్రంథము ఆయనపై ఎంతో ప్రభావమును కనబరచినది. మాధ్యమిక వాదమునందలి ద్వంద్వ తర్క పద్ధతులను సమకాలీన తర్క సంప్రదాయములతో అన్వయించి సంయోగ పరచే ప్రయత్నము చేశాడు. భావవివేకుని గ్రంథములన్నీ సంస్కృత భాషలో వ్రాయబడినవి. అవి అలభ్యములైనవి. టిబెట్టు భాషలోనికి అనువదింపబడినవే నేడు లభ్యమగుచున్నవి. పండిత లోకమునకు భావవివేకుని గురించి తెలియుట, ఆయనకు ప్రతి ద్వందియైన చంద్రకీర్తి రచనల ద్వారానే జరిగింది. చంద్రకీర్తి తన ప్రసన్న పదవ్యాఖ్యానములోని మొదటి అధ్యాయమునందే, మాధ్యమిక వాదముపై భావ వివేకుడు వ్యక్తంచేసిన అభిప్రాయమును తిరస్కరించాడు. భావవివేకుని యొక్క టిబెట్టు భాషలోనికి అనువదింపబడిన గ్రంథము అధ్యయనము చేయని పక్షంలో మనకు మాధ్యమిక వాదముపై పరిపూర్ణమైన అవగాహన కలగదు. ఎందుకంటే ఆ వాదము అర్థము చేసుకొనుటకు మనము ప్రాసంగికవాద దృక్పథంతో, చంద్రకీర్తి వ్రాసిన వ్యాఖ్యానముపైననే ఆధారపడవలసి వచ్చేది. చంద్రకీర్తి, భావవివేకుడు వెలిబుచ్చిన అభిప్రాయములను తన వ్యాఖ్యానములో పూర్తిగా తిరస్కరించాడు. ఏది ఏమైనప్పటికీ సమకాలీన పండితులు టిబెట్టు భాషలోనికి అనువదింపబడిన భావ వివేకుని గ్రంథములను నిర్లక్ష్యము చేయకుండా పరిశోధించి, నాగార్జునుని రచనలను అన్నిటినీ, ప్రాసంగిక, స్వాతంత్రిక సంప్రదాయ పద్ధతుల ప్రకారం అధ్యయనంచేసి,

అనంతరము నాగార్జునుని రచనలపై సమతుల్యమైన అభిప్రాయములను వ్యక్తం చేశారు. నాగార్జునుని సిద్ధాంతములను, బుద్ధపాలితుని వ్యాఖ్యానాలతో అనువర్తించి పఠిస్తే, ఆయన శూన్యతావాదిగా అవగత మౌతాడు. హిందూ, బౌద్ధవేదాంతుల మధ్య జరుగుచర్చలలో ఎటువంటి సిద్ధాంతము (ప్రతిజ్ఞ)లను ప్రతిపాదించుటకు విముఖుడుగా గోచరిస్తాడు. పరమార్థ సత్తవిషయమై మాధ్యమిక వాదము నిర్దుష్టమైన అభిప్రాయమును వెల్లడించలేదు. బుద్ధపాలితుని ప్రాసంగిక వాద సంప్రదాయము విచ్ఛేద వాదము (ఆస్తిక, నాస్తిక వాదములకు మధ్యే మార్గము). అయితే భావవివేకుడు తన స్వతంత్ర ఉపపత్తుల ద్వారా (స్వతంత్ర అనుమాన) స్వీయ సిద్ధాంతమును సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. ఈ విధంగా వ్యావహారిక సత్తను సంశ్లేషణాత్మక అభావము (ప్రసంగ) నుండి కాపాడినాడు. ఆయన మాధ్యమికుల దృక్పథంతో ఏకీభవిస్తూ, అంతిమమునందు (పరమార్థ సత్త) ఏ రూపములోనూ, ఎటువంటి స్థూల వస్తువుగానూ, ఊహించుటకు సాధ్యము కాదన్నాడు. అంటే పరమార్థ సత్తను అంగీకరించి, ప్రపంచమును సంవృత సత్యంగా (సంప్రదాయ సత్త) అంగీకరించాడు. ఈ విధమైన ప్రాగుక్తిక బంధములను, సాంప్రదాయకంగా ఉపయోగించుకొనుటకు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, అట్టి సుముఖతను కేవలము ఆధ్యాత్మిక ఉన్నతి పొందుటకు గాను, బౌద్ధవర్గములు వినియోగించు కొనవచ్చునని పరిమితిని విధించాడు. పై వర్గముల వారు ప్రతిపాదించిన పరమసత్తను తిరస్కరించుటకు గాను, భావవివేకుడు "న్యాయ ప్రయోగ" సిద్ధాంతమును (ప్రతిజ్ఞ) ప్రతిపాదించాడు. ఇటువంటి ఆధ్యాత్మిక ప్రక్రియ మాధ్యమిక వాదులకు కొరకరాని కొయ్యగా అనిపించింది. మాధ్యమిక వాదులకు ఈ సంప్రదాయమును గురించి చంద్రకీర్తి యొక్క ప్రాసంగిక వాదము ద్వారా తెలిసినది. సంప్రదాయబద్ధంగా ఒక సిద్ధాంతమును ధృవీకరిస్తూనే, అంతిమములో దానిని తిరస్కరించుటకుగాను, భావవివేకుడు తెలివిగా మాధ్యమిక వాదమునకు మూలములైన ద్వంద్వ సత్యములను (సత్యద్వయ) పునరన్వ యించినాడు. తన "మధ్యమార్థ సంగ్రహము"నందు అంత్యమును రెండు అంతస్థులుగా విభజించాడు. మొదటిది ఉన్నతమైన అంతిమము. అది ఊహాతీతము. అనిర్దుష్టము (అపర్య పరమార్థ). మాధ్యమిక వాదానుసారము, రెండవ అంతిమము తార్కికంగా అనుమితమైనది. అర్థవంతముగా వివరించగలిగినది (పర్యాపరమార్థ). ఈ రెండవ అంతిమము, మాధ్యమిక భావన లేక చింతనయందు ఒక పరికల్పనగా వర్ణించబడినది.

భావవివేకుని ముఖ్యమైన రెండు విధానములేవనగా మొదటిది సాంప్రదాయిక స్థాయిలో సిద్ధాంత ధృవీకరణము. రెండవది సంప్రదాయము అనుసరించు ద్వంద్వ సత్యములను వ్యాఖ్యానించుట. భావవివేకుని సిద్ధాంతములను కొందరు పండితులు సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. వ్యతిరేకించిన పండితులు దీనిని అసౌకర్య కరమైన అనుకూల్యతగా భావించారు. ఆనాటి తార్కిక సంప్రదాయములకు విరుద్ధమన్నారు. ఈ విధమైన అనుకూల్యతను అంగీకరించుట వలన మాధ్యమిక వాదమునకుగల తార్కిక శక్తి క్షీణించి పోతుందన్నారు. హుయాన్‌సాంగ్, భావవివేకుడు సాంఖ్యమనే ముసుగుధరించి నాగార్జునుని సిద్ధాంతములను ప్రచారము చేశాడన్నాడు. భావవివేకుని సిద్ధాంతము లను శ్లాఘించిన పండితులు, ఆయన ప్రతిపాదనలు స్వతసిద్ధమైన ఉప్పెనవలె ద్వంద్వ తర్క అభావము నుండి బౌద్ధతత్త్వవేత్తలనూ, బుద్ధధర్మము యొక్క ఐక్యత, ఉనికి, నశించకుండా కాపాడినట్లు ప్రశంసించారు. టిబెట్టులో ఉత్పన్నమైన బౌద్ధ సంప్రదాయములలో భావవివేకుడు మరో రెండు సిద్ధాంతముల ద్వారా ప్రసిద్ధి చెందాడు. మొదటిది యోగచార సాంప్రదాయ పునరుద్ధర ణను తిరస్కరించటం. ఆయన రచించిన "తర్కజ్వాల" అనే గ్రంథములో "యోగాచార వినాశకాయ" అని నామకరణము చేసిన ప్రథమా ధ్యాయములో యోగాచార సిద్ధాం తమునకు, బీజములవంటి పరమార్థ సత్తనూ, వ్యవహారిక సత్తనూ రెంటినీ త్రోసి పుచ్చాడు. భావవివేకుడు బౌద్ధమునందు స్వాతంత్రిక వాదమును ప్రవేశ పెట్టడమే కాక సాహిత్యంలో సిద్ధాంత అనే నూతన శైలికి సృష్టికర్తైనాడు. ఈ శైలి టిబెట్టు పండితుల రచనల ద్వారా ప్రాచుర్యము పొందినది. ఈ శైలిననుసరించిన గ్రంథము నందు క్రమపద్ధతిలో అనేక అధ్యాయములుండి, వాటియందు ప్రత్యుర్థులైన బౌద్ధ, హిందూ తాత్త్విక సిద్ధాంతముల యొక్క స్థితిగతులను, విశ్లేషించుట జరిగింది. "తర్క జ్వాల" అనబడే ఆయన గ్రంథమునందు హీనయాన, యోగాచార అనబడే బౌద్ధ శాఖలనేగాక, సాంఖ్య, వైశేషిక, వేదాంత, మీమాంస దర్శన సంప్రదాయములు కూడా క్రమపద్ధతిలో విమర్శించబడినవి. భావవివేకుడు మాధ్యమిక వాదమును సమర్థిస్తూ అనేక గ్రంథములు రచించాడు. వాటిలో ముఖ్యమైనవి "ప్రజ్ఞాప్రదీప". ఇది నాగార్జునుని సిద్ధాంతముపై వ్రాసిన వ్యాఖ్యానము. ఆయన శిష్యులను ఉద్బో దిస్తూ, బుద్ధుని ప్రవచనములన్నీ భావగర్భితములు, స్వయంసమృద్ధములని తలచి తృప్తి చెందక, వాటి యందలి నిజాయితీని, తామే స్వయంగా పరిశోధన చేసుకొని,

స్వతంత్రములైన సాక్ష్యాధారములతో నిరూపణచేసి కొనవల సిందన్నాడు. బుద్ధుని ప్రవచనములు, సప్రమాణములని తెలియజేసి వాటిని తార్కికంగా యుక్తియుక్తంగా నిర్ధారణ చేసుకొనవలసిన అవసరము లేదన్నాడు. మూలగ్రంథములను అర్ధము చేసుకొనుటకు ఆ ప్రవచనములు తోడ్పడతవన్నాడు. బుద్ధ ధర్మప్రచారమనగా కేవలము పరమత ఖండనము. ఇతర సాంప్రదాయములను తిరస్కరించుటగాక, స్వతంత్ర ప్రతిపత్తుల ద్వారా సాక్ష్యాధారములను సంపాదించి మనవాదములకు బలము చేకూర్చు కొనవలెనని తాను విశ్వసించాడు. అదేవిధంగా ప్రబోధించాడు. మత విషయంలో ప్రదర్శించిన స్వాతంత్ర దృక్పథం కారణంగా, భావవివేకుని సిద్ధాంత ములకు, మాధ్యమికశాఖలో స్వతంత్రవాదమని పేరుగణించింది. డాక్టరు సచ్చిదా నందమూర్తిగారి అభిప్రాయము ప్రకారం భావవివేకుడు న్యాయప్రయోగ తార్కిక గమనము లేక హేతువాదము ద్వారా “నిస్వభావత” అంటే పదార్థ రాహిత్యమును, శూన్యతనూ ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. భావవివేకుడు అనుభవిక వాస్తవికతకూ, (త్రైత్య సంవృత్తి) ఊహాజనిత అస్తిత్వము (మిధ్యా సంవృత్తి) నీ వేరుచేయుటయే కాక, పరమార్ధ సత్తను వివరించగలిగినది గానూ, వివరణకు సాధ్యముకానిదిగానూ రెండుగా విభజన చేశాడు.

భవ్యని ఇతర గ్రంథములు “ప్రజ్ఞ లంపశాస్త్ర” “మాధ్యమిక హృదయ” “మహా యాన కరతల రత్నశాస్త్ర”. అయితే ఈ గ్రంథములేవీ మూల గ్రంథములుగా లభిం చుట లేదు. టిబెట్టు, చైనా భాషలలోని అనువాద గ్రంథములే లభ్యములు. భావ వివేకుడు తాత్త్వికుడే గాక చరిత్రకారుడు కూడా. ఆయన రచన “న్యాయభేద విభాగ వ్యాఖ్యాన”మునందు అతిముఖ్యమైన విశ్వసనీయమైన సమాచారమున్నది. బుద్ధ సంఘ ప్రాచీన చరిత్ర, బుద్ధ సంఘమునందు ఏర్పడిన చీలికలపై విస్తృతమైన వివరణలు కలవు.

హుయాన్‌సాంగ్ వ్రాతల ద్వారా భావవివేకుడు తన జీవిత చరమ దశను ధాన్యకటకములో గడపినట్లు, వజ్రపాణి ధరణి అనే మంత్రమును జపిస్తూ ఉండే వాడని, ఆ మంత్రమును దండపాణి దేవుడనే గురువు బోధించాడనీ, ఆ మంత్రమును మూడు సంవత్సరములపాటు జపించిన అనంతరము భావవివేకుడు నిర్వాణము పొందినాడనీ తెలుస్తున్నది. చీనీ యాత్రికుని కథనం ప్రకారం భావవివేకుడు

దండపాణి మంత్రమును జపిస్తూ వేయించిన ఆవగింజలతో ఎదురుగా ఉన్న పెద్ద రాతిపై కొట్టేవాడట. అందువల్ల ఆ రాయి తెరచుకొని ఆయన ప్రవేశించుటకు త్రోవ ఇచ్చేదట. ఈ ప్రక్రియ ధరణి సూత్రములయందు నిర్దేశింపబడినదట. ఆ విధంగా ఆవగింజలు వేయించి, మంత్రించటం వల్ల వాటికి అమోఘమైన శక్తి లభించి, రాతినేగాక, భూమినైనా చీల్చగలవట. వర్షమును కూడా కురిపించ గలవట. వజ్రహస్తుడైన దేవుడే వజ్రపాణి. అనేక ధరణి సూత్రములలో ఈ దేవుని పేరు ప్రస్తావించబడినది. పై వివరములను అనుసరించి ధాన్యకటకము మంత్ర తంత్ర ములకు కేంద్రమై, వజ్రయాన శాఖకు పుట్టినిల్లైనది. భావవివేకుడు బౌద్ధమునందు అద్వయవాదిగా పరిగణింపబడినాడు.

■ ■ ■

# దిఙ్నాగుడు

## (యోగాచార - విజ్ఞాన వాదము)

భారతీయ తర్క శాస్త్రమునకు ముఖ్యంగా బౌద్ధమత తర్కమునకు దిఙ్నాగుడు పితామహునిగా కీర్తింపబడినాడు. మధ్యయుగంలో న్యాయదర్శనము నందు ఆతడు నిష్ణాతుడు. క్లిష్టమైన తత్త్వశాస్త్రమునకు, సమగ్రమైన ప్రక్రియకు నాంది పలికినవాడు. ఇది భారతీయుల ప్రజ్ఞాపాటవములయొక్క అత్యున్నత విశిష్ట సాధన. భారతీయ తాత్త్వికులలో అగ్రస్థానమును అలంకరించినవాడు. దిఙ్నాగుని గురించిన ఇటువంటి ప్రశంసలను, పాశ్చాత్య తత్త్వవేత్తలైన వింటర్‌నిట్జ్, స్టెచర్‌బాస్కీ గుప్పించారు. బౌద్ధ మతమునందు యోగాచార విజ్ఞానవాద సాంప్రదాయములకు శ్రీకారము చుట్టిన మహాతత్త్వవేత్త తార్కికుడు దిఙ్నాగుడు.

ఆయన జీవిత కాలమును గురించి అనేక విధములుగా పండితులు నిర్ణయించి నారు. టిబెట్టు పండితుడైన నకమూర క్రీ.శ. 400-480 మధ్య కాలములో ఆయన జీవించాడన్నాడు. వాటన్ బి క్రీ.శ. 460-530గా నిర్ణయించాడు. కరెన్ క్రీ.శ. 520-600 అని వ్యక్తంచేశాడు. చివరగా లాల్‌మనిజోషి దిఙ్నాగుడు క్రీ.శ. ఆరవ శతాబ్ద ప్రారంభములోని వాడన్నాడు. మహాకవి కాళిదాసు తన మేఘసందేశ కావ్యంలో దిఙ్నాగుని పేరును ప్రస్తావించాడనే జనవాక్యము ఒకటున్నది.

అదే యదార్థమైతే, దిజ్ఞాగుడు కాళిదాసునకు సమకాలీనుడై పైనపేర్కొన్న కాలమునకు ముందువాడై ఉంటాడు. రాధాకృష్ణ పండితుని కాల నిర్ణయమును అనుసరించి ఆయన క్రీ.శ. 520-600 మధ్యకాలపు వాడైనాడు.

దిజ్ఞాగుడు కాంచీపురపు శివార్లలో ఉన్న సింహవక్రత అనే ప్రదేశమునందు ఒక బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడు. హుయాన్‌సాంగ్ వ్రాతలను అనుసరించి ఆయన తెలుగువాడు. కాశ్మీర దేశమునకు చెందిన బౌద్ధ సోదరులు అసంగునకో లేక వసుబంధు నికో ఆయన శిష్యుడు. యోగాచార విజ్ఞాన వాదమును పెంపొందించిన ముగ్గురిలో పై ఇద్దరు సోదరులూ ప్రముఖులు. మూడవవాడు దిజ్ఞాగుడు. ఈ శాఖకు సంబంధించిన ఇతర ప్రముఖులు నందుడు, ధమ్మపాలుడు మరియు శీలభద్రుడు. చివర పేర్కొన్న పండితుడు నలంద విశ్వవిద్యాలయములో హుయాన్ సాంగ్‌కు గురువు. బౌద్ధ ధర్మమును బోధించినవాడు.

పైన పేర్కొన్న కాశ్మీర సోదరులు ఇరువురూ ప్రథమముగా సర్వాస్థివాద (థేరవాద) శాఖకు చెందినవారు. వీరిలో అసంగుడు యోగాచారవాద శాఖను ప్రారంభించాడు. యోగాచార వాదమును వివరిస్తూ "మహాయాన సూత్రాలంకార" అనే గ్రంథము వ్రాయుటయే కాక దానికి వ్యాఖ్యానమును కూడా తానే వ్రాశాడు. తన సోదరుడైన వసుబంధు గొప్ప పండితుడనీ, అతివాదియనీ వర్ణించాడు. హీనయాన శాఖకు చెందిన "అభిదమ్మకోశ" గ్రంథమును కూడా రచించాడు. అనంతరము ఆయన హీనయాన శాఖనుండి విడిపోయి యోగాచార విజ్ఞానవాద శాఖను స్థాపించి, ప్రచారము చేశాడు. దిజ్ఞాగుడు వారిని అనుసరించి, యోగాచార వాదమును సర్వాస్థి వాదము (యదార్థ వాదము)ను విజ్ఞాన వాదముల (భావవాదము)తో మేళవించినాడు. ఆ విధంగా యోగాచార విజ్ఞాన వాదాభివృద్ధికి దిజ్ఞాగుడు పాటుపడ్డాడు. వీరి మూల సిద్ధాంత మేమంటే, పరమార్థ సత్తజ్ఞాన వికాసము రూపములో బుద్ధ భగవానునకు సంక్ర మించిన విధంగా, లభ్యముకావాలంటే యోగముద్వారానే అది సాధ్యమని ప్రభోది స్తుంది. ఆ కారణంగా ఈ సంప్రదాయీకులను యోగాచారులని పిలుస్తారు. యోగా చారమనే పదమునందు యోగము ఒక సంప్రదాయమును సూచిం చగా, విజ్ఞాన వాదము ఆ తత్త్వంయొక్క వైశిష్ట్యమును వివరిస్తుంది. వారు విజ్ఞాన మునకుమించి మరేది లేదని వాదిస్తారు. విజ్ఞానము స్వయంగా జన్మించినదనీ, ఈ లోకమునందు సర్వసృష్టినీ చేయగల శక్తివంతమైనదనీ ఘట్టిగా తెలియచెబుతారు.

హుయాన్‌సాంగ్‌కు బౌద్ధ ధర్మమును దిజ్నాగుడు నలందా విశ్వవిద్యాలయంలో బోధించాడు. తాను దిజ్నాగుడు నిర్వహిస్తున్న కాంచీపురములోని విద్యాలయమును దర్శించి నప్పుడు దాదాపు మూడు వందల మంది శ్రీలంకకు చెందిన విద్యార్థులు యోగదర్శనమును అధ్యయనము చేస్తున్నట్లు హుయాన్‌సాంగ్ తెలియజేశాడు. తన పర్యటన విశేషములు తెలియజేసే గ్రంథములో, హుయాన్‌సాంగ్, దిజ్నాగుడు అమ్–తో–వో (ఆంధ్ర దేశము)కి చెందిన వాడనీ పిమ్–కి–వో అనే నగరమునకు వాయవ్య దిశలో నున్న ఒక విహారములో నివసించేవాడనీ, తెలియజేశాడు. ఫెర్గుసన్ ఆ నగరమును తూర్పుచాళుక్యుల రాజధానియైన వేంగి పట్టణమని గుర్తించాడు. ఈనాటి పెదవేగి (ప.గో. జిల్లా) అనే గ్రామమే, ఆనాటి వేంగిపట్టణము. అయితే జులియన్ మరియు కన్నింగ్, ఫెర్గుసన్‌తో ఏకీభవించలేదు. హుయాన్‌సాంగ్ ప్రస్తావించిన నగరమునకు వాయవ్యదిశగా నున్న విహారము గుంటుపల్లి (నేటి జీలకర్ర గూడెం) గుహలనీ, అవికూడా వేంగీ ప్రాంతములోనే, హుయాన్‌సాంగ్ చెప్పిన దిశలోనే ఉన్నవి కాబట్టి గుంటుపల్లి విహారంలోనే దిజ్నాగుడు నివసించినట్లు అభిప్రాయ పడ్డారు. దిజ్నాగుడు అనేక మహా విహారములను స్థాపించినప్పటికిన్నీ గుంటుపల్లి విహారమునే కేంద్రముగా చేసుకొని తన కార్యక్రమములు నిర్వహించేవాడు. సుగ్రీవు డనే హైందవ తార్కికుడు తన గ్రంథమైన "హైందవ తర్కము"నందు దిజ్నాగుడు తెలుగువాడని దృఢీకరించినాడు.

దిజ్నాగుని కాలంలో మహాయాన శాఖకు చెందిన మాధ్యమిక వాదము అనేక శాఖలుగా చీలిపోయింది. బుద్ధపాలితుని ప్రాసంగికవాదము, భావవివేకుని స్వాతం త్రికవాదము; మైత్రేయనాధుని విజ్ఞాన వాదము వంటివన్నీ ఆచార్య నాగార్జునుని మాధ్యమిక వాద వృక్షమునకు సంబంధించిన కొమ్మలే. విజ్ఞానవాదమును యోగాచార వాదులైన అసంగుడు, వసుబంధు వృద్ధిపరచి, ఆ రెండు వాదములను కలిపి యోగా చార విజ్ఞాన వాదముగా మార్పు చేశారు. మైత్రేయనాధుడు కూడా తెలుగువాడేననీ, సౌందర్యపుర (బోధన్, నిజామాబాద్‌జిల్లా) మునకు చెందినవాడనీ తెలుస్తున్నది.

దిజ్నాగుడు యోగాచార వాదమును తన తార్కిక నైపుణ్యంతో అభివృద్ధిపరచి, దానిని ద్వంద్వ తర్కభావవాదముగా మెరుగుపరచినాడు. ఈ వాదము ప్రబోధించిన సిద్ధాంతమును అనుసరించి, బుద్ధత్వమును పొందగోరువారికి పరమార్థ సత్త జ్ఞాన

వికాసముగా లభిస్తుందనీ, ఆ విధంగా లభించుటకు యోగాచార మొక్కటే సాధనమనీ తెలియజేస్తుంది. ఈ సాంప్రదాయమునందు యోగసూత్రముల యొక్క ప్రాధాన్యత అధికము. అందువల్ల ఆ సంప్రదాయమును యోగాచారమని పేర్కొన్నారు. ముందు వివరించినట్లు యోగాచారము యోగాభ్యస ప్రాధాన్యతను వివరించగా, విజ్ఞానవాదము ఆ విధానమునందలి తత్త్వ స్వభావమును విశదీకరిస్తుంది. ఉన్నదంతయు విజ్ఞానము అనియూ, అది అవిచ్ఛిన్నమనియూ, అదియే సగుణమైన సత్య స్వరూపమనియూ తెలియ జేయును. జీవుని గురించి సృష్టిలో గోచరించు వివిధ వస్తువులను, ఈశాఖ సమగ్రమైన, విశ్లేషణానంతరము, సిద్ధాంత ప్రతిపాదన చేయుటయేకాక, విమర్శ నాత్మక విశ్లేషణ ద్వారా, ఆ సిద్ధాంతమును సమర్థిస్తుంది. పరమార్థసత్త, విజ్ఞానము (చైతన్యము)తో సహసంబంధము కలిగియుంటుందని ధృవీకరిస్తుంది.

ఈ సిద్ధాంతమునకు మూలము సౌత్రాంతికుల దర్శన సిద్ధాంతము. దానినుండి యోగాచారుల విజ్ఞానవాదము సహజముగా జన్మించినది. మన జ్ఞానమునకు ఆలంబ నములైన అన్నివస్తువులూ, క్రమపద్ధతిలేని బాహ్య జగద్వస్తువులనుండి లభించినవే యని సౌత్రాంతికులు తెలియజేశారు. ఆ బాహ్యవస్తువులు మనకు అవగతముకానివి. మనోభావములే, మన జ్ఞానమునకు విషయములైనచో, భావించు ద్రష్టకు గోచర మగునవి, మనకు తెలిసిన వస్తువుల ప్రతిబింబములే కానీ నిజవస్తువులుకావు. వస్తు సంబంధములేని భావముతో నారంభించి, తదనంతరము వాటికి వస్తు సంబంధ మును కల్పించినచో, వాటి వాస్తవికతను నిర్ణయించుట సాధ్యము కాదు. బాహ్య ప్రపంచము యొక్క అస్తిత్వము మిధ్య. అది వాస్తవము అయినప్పటికినీ, వాటియొక్క నిజ ప్రకృతిని మనము ఎరుగజాలము. మన ఇంద్రియములు మనకు కొన్ని భావము లున్నవని తెలియజేయునేగానీ, తగు సాక్ష్యములను ఈయజాలవు. దృఢమైన ఆధారములు లేక నిర్ణయములు చేసినచో అట్టి చర్యలు ఆత్మవంచనకు దారితీయ గలవు. సౌత్రాంతికులు ప్రతిపాదించిన ఇట్టి సిద్ధాంతములను, యోగాచార్యులు వ్యతిరేకించిరి. సౌత్రాంతికుల ఊహాజనిత బాహ్య ప్రపంచమూ, తెలుసుకొనుటకు వీలుగాని బాహ్యవస్తువులూ, అవిలేకున్ననూ, ఉన్నట్లుగా భావించుటకుగల అవకా శములను ఆధార రహితములుగా భావించి త్రోసిపుచ్చవలెనన్నారు. భావములు జనించుటకు ఒక కారణము అవసరమైనచో, అది బాహ్య ప్రపంచమే కానవసరము

లేదు. ఆ విధముగా తెలియని బాహ్య ప్రపంచముండుట, నిరాధార కల్పన యనియూ, ఆత్మ విరుద్ధ సిద్ధాంతమనియూ, త్రోసిపుచ్చి, బాహ్య ప్రపంచ అస్తిత్వమును, తద్భావనలనూ తిరస్కరించుటయే యోగాచార్యుని ప్రథమ కర్తవ్యముగా తెలియజేసి నారు. దీనిని అపోహ వాదమని పిలుస్తారు. ఈ వాదమునకు సృష్టికర్త దిఙ్నాగుడు. బాహ్యావస్తువులు వాస్తవముగా లేనప్పటికినీ, ఉన్నట్లుగా గోచరించుటకు కారణము, మనో వ్యాపారములే. ఆకాశమున తృటి కాలము కనుపించి, అదృశ్యములగు మేఘ ములవలె ఈ బాహ్య వస్తువులు మనస్సునందు ఏర్పడిన భావములకు రూపకల్పనలే. మనసునందు గలుగు అనేకానేక భావములకు పూర్వ సంస్కారములే కారణములని యోగాచార్యులు చెప్పెదరు. యోగాచార్యులు విజ్ఞానవాదమును సమర్థింతురు. కాబట్టి విజ్ఞానము కానిది ఏదియునూ నిజమైన అస్తిత్వమును కలిగియుండదని వారి వాదము. "సర్వం బుద్ధి మయం జగత్". ఈ జగత్తంతయూ మనస్సునందే ఉన్నది. మనస్సునందు తప్ప వేరుగా జగత్తులేదను విజ్ఞానవాదుల సిద్ధాంతమును ఆది శంకరులు అనేక విధములుగా ఖండించిరి. విజ్ఞానమను ఒకే సత్పదార్థమునుండి, సర్వమూ ఆవిర్భవించి యుండునని తత్త్వ నిర్ణయము చేయబడగా, యోగాచార్యులు, జీవుల వేదనవలననేనని వాదింతురు. వేదనాభరితములైన అనుభవములను, ఇంద్రి యములు మనస్సుపై ముద్ర వేయుటయో లేక రాగద్వేషాదులచే ఆవరింపబడిన మనస్సుయొక్క కార్యాచరణముగానో భావించవచ్చును. చైతన్యమునకు సంబం ధించని, బాహ్యవస్తు సముదాయ జ్ఞానముమనకూడదు. ఈ సందర్భముగా యోగా చార్యులు తరుచుగా ప్రశ్నించేదేమంటే బాహ్యావస్తువు నిత్యము నుండి జనించినదా? అనిత్యమునుండి ఉద్భవించినదా? అని. అది నిత్యమునుండి వచ్చినది కాదు. ఎందు వలన అంటే నిత్యము కాని వాటినుండి వచ్చినది ఎన్నటికీ నిత్యముకాదు. మరొక ప్రశ్న బాహ్య ప్రపంచము, ఒకే అణువు నుండి ఉద్భవించినదా లేక అణుసము దాయము నుండి జనించినదా? దీనికి జవాబు అణు సముదాయము నుండి కాదని. ఎందువలననంటే అస్తిత్వమునందలి బాహ్య ప్రపంచము సంపూర్ణమైనదో, లేక ఒక భాగము మాత్రమేనేమో మనకు తెలియదు. పోనీ ఒకే అణువు నుండి జనించి నదనని చెప్పుటకు కూడా వీలులేదు. కారణమేమంటే, మనకు అణువుయొక్క పరి మాణము, ఆకారము తెలియవు కనుక. అణు సముదాయమును వేరుచేయు విధా

నము మనకు తెలియదు. ఒకవేళ వేరుచేయగలిగితే వాటిని సముదాయముగా వ్యవహరించుటకు వీలుకాదు. అవి విడిపోయినవి కాబట్టి, అణువులు అన్నియూ ఒకే విధముగానున్నచో స్థూలరూపములైన వస్తువులను మనో ప్రతిబింబములుగా పరిగణింపరాదు. అవి కదలిక గలిగియున్నచో, వాటి అస్తిత్వము కేవలము ఒక క్షణము మాత్రమే. ఇచట జ్ఞానమే, కారణము కాబట్టి ఫలితము, అదృశ్యమైన అనంతరమే గ్రాహ్యమౌతుంది. కారణమేమంటే దృశ్యమైనది, అదృశ్యమవటం ఎంత శీఘ్రముగా జరుగుందంటే మనము చూచినామనే జ్ఞానము మనస్సుకు కలుగక ముందే జరుగుతుంది. అందువలన మనకు ఆ జ్ఞానమును పొందగలిగే అవకాశమే లభించదు. ఆ విధంగా మనము ఒక వస్తువును చూడవలనంటే ఆ వస్తువు అక్కడ ఉండవలసిన అవసరము లేదు. ఒకవేళ ఉన్నప్పటికీ, అది భావనా దృశ్యమే కాబట్టి భావనలు మరొక విధంగా వస్తువులే అవుతవి. అందువలన బాహ్య వస్తువుల అస్తిత్వమును గురించి మనము ఊహించపనిలేదు. మనకు ఆవశ్యకమైనవి భావనలే, కానీ వస్తువులు కావు. భావనల తత్సంబంధమైన వస్తువుల యొక్క అన్యోన్యతను మనము అనుభవములో తెలుసుకుంటున్నాము. ఆ రెంటియందు ఎట్టి భేదము లేదనీ అవి రెండూ, ఒకటియేయని గ్రహిస్తాము. ప్రకృతిలోని పంచ భూతముల గుణములు లేక స్వభావములు రుచి, రంగు, వాసన, పరిమాణము, పరిణామము, వంటివన్నీ కేవలమూ భావనలు మాత్రమే. మనస్సు వినా, మరొక వస్తువేలేదు. వాటి ఉనికిని గురించి విచారించటము కేవలము వ్యర్థ ప్రయాస. బాహ్య ప్రపంచ ములో వివిధ ఆకారములలో, పరిమాణములలో వివిధ గుణములతో కనుపించెడి వన్నీ మానసిక ఘటనా ప్రపంచమే. వాటి దృశ్యా దృశ్యస్థితి సముద్ర తరంగ ములవలె క్షణికమే. మన మనస్సునందు దేనిని భావిస్తామో, అది బాహ్య ప్రపంచము నందున్నదని ఊహిస్తాము. పతంజలి యోగసూత్రములో చెప్పినట్లు 'యాదృశీ భావానాయస్య సిద్ధిర్భవతి తాదృశీ" ఏది భావిస్తే అదే జరుగుతుంది. ఇది ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతమునకు సమీపముగా నున్నది. ముందు మనవి చేసినట్లు యోగా చార్యులను మన మనస్సులో ఇన్ని భావనలు ఏర్పడుటకు కారణమేమని ప్రశ్నిస్తే జవాబుగా పూర్వజన్మ సంస్కారములని జవాబిస్తాడు. బాహ్య ప్రపంచములో అనేక వస్తువులతో మనకెట్టి సంబంధము లేనప్పటికీ, స్వప్నమునందు మనము ఎన్నిటినో మానసికంగా చూడగలుగుతున్నాము, అనేక భావతరంగాలను అనుభవించ కలుగు

తున్నాము. అందుకు కారణము మనమనస్సులోగల పూర్వజన్మ సంస్కార ఫలితమే. ఇదే విధమైన అనుభవము మానసిక బలహీన స్థితిలోకూడా కలుగుతుంది. బాహ్య ప్రపంచము నందలి అన్ని వస్తువులూ వాటి స్వభావములు, విజ్ఞానము (చైతన్యము) యొక్క నిర్మాణాంశములే. దిజ్నాగుని తర్కమును అనుసరించి స్థితి యనగా క్రియాత్మక సామర్థ్యం కలిగి ఉండటమే. బాహ్య ప్రపంచములోని వస్తువులన్నీ అస్తిత్వము లేనటు వంటివే. శాశ్వతమని వర్గీకరించిన పదార్థమునకు చలనమే లేదు. వర్తమానములో అది చలనమును కలిగి ఉంటే, గతములోనూ దానికి చలనము ఉండి ఉంటుంది, భవిష్యత్తులో కూడా కొనసాగవలెను. అప్పుడే అది అన్ని కార్యములను ఒకే సమ యంలో చేయగల శక్తి సామర్థ్యములను కలిగి ఉన్నట్లు పరిగణించాలి. ఆ విధంగా చేయలేక పోయినట్లైతే, దానిని సామర్థ్యరహితమైన దానినిగా గ్రహించవలెను. ఉదాహరణకు ఒక శిల పక్షికి జన్మనివ్వలేదు. గతంలోనూ అంతే, భవిష్యత్తులో కూడా అంతే. ఒక నిత్యమైన వస్తువు ఏదైనా కార్యమును నితర ధర్మముల సహాయ ముతో చేయగలిగితే, ఆ ధర్మములు బాహ్యములైనచో క్రియాత్మకములు. లేక ఆ ధర్మములు నిత్య వస్తువులకు ఒక నూతన శక్తిని కలిగించినచో ఆ శక్తి నిత్యవస్తువు నందు లోపించినచో ఆవస్తువు నశించి నూతనశక్తిగల మరొక వస్తువు జన్మించవలెను. నిత్యవస్తువులకు ఒకదాని వెనుక మరొకటివచ్చు ప్రకృతి లక్షణములు కలవని చెప్పు టకు వీలులేదు కాబట్టి, నిత్యవస్తువులుగా పరిగణింపబడునవి నిత్యములుకావు, అనిత్యములేనని నిర్ణయించవలెను. అవి చెందుమార్పులుకూడా అసత్యములుగా భావించవలెను. మనచుట్టూ కనిపించు లౌకిక ప్రపంచము కూడా, మనలేని చేతన త్వమువలన ఏర్పడినవి. అట్లు ఏర్పడుటకు వస్తువులయొక్క అభాసకావచ్చును లేక చూచుటవలన ఏర్పడు మనోకల్పితములు కావచ్చును. యోగాచార్యులు చెప్పుటను బట్టి ఆ విధములైన స్వభావములు మన చేతనత్వమునందే ప్రారంభము నుండి నిక్షిప్తమైయున్నవి. వస్తువే లేనప్పుడు దానిని గురించిన జ్ఞానము తెలియుటకు అవ కాశమే కలుగదను మాధ్యమికుల వాదనను యోగాచార్యులు త్రోసిపుచ్చారు. అందు వల్ల విజ్ఞానము కూడా ఒక విధమైన మాయగా పరిగణించవచ్చును. ఇందుకు యోగాచార్యుల ప్రతివాదన ఏమనగా దేనికీ అస్తిత్వము లేనప్పుడు, అస్తిత్వ రహితమైన దొక్కటే పరమ సత్తను గురించి ఎఱుకపరచవలసి ఉంటుందని, అటువంటి సందర్భ

ములయందు పైన వివరించిన నమ్మకములుగల, మాధ్యమికులకు వివిధములైన విశ్వాసములుకల, ఇతర సాంప్రదాయ వాదులతో చర్చించు హక్కు ఉండదు. కారణము వారు తమకున్న నమ్మకములను సమర్థించు కొనజాలరు. ఇతరుల నమ్మకములను ఖండింపజాలరు. అనస్తిత్వము (శూన్యము) యదార్థ మైనచో, అనస్తిత్వ స్వభావముగల మరొకటేదోఉండితీరాలి. దాని అనస్తిత్వమునకు కారణమైన గుణములు ఏవో వాటిని వివరించవలసి ఉంటుంది. పై రెండు అంశములు లేనప్పుడు దానికి అస్తిత్వము లేదని ఎలా ప్రకటించగలము? ఉదాహరణకు ఒక తాడు భ్రాంతివలన పాముగా కన్పించిందనుకుంటే, నిజంగా, అక్కడ త్రాడు మాత్రమే ఉన్నది కానీ పాములేదు కదా ! కాబట్టి తాడు, పాము లేకుండానే ఉన్నది. అందువలన యోగాచార్యులు చెప్పేదేమంటే, వస్తువులు ఆకార రహితములు, గుణరహితములు అయినప్పటికిన్నీ, కనుపించని స్వభావమును కలిగియున్నప్పటికినీ, గుణాత్మకమైన ఆధారభూతము ఉండి తీరుతుంది. అదే విజ్ఞానము. అంతేకాక చూడబడిన దానికీ, చూచినదానికీ, మధ్యగల వైరుధ్యములు మరియు పరస్పరాధారములు. ఈ వాదనను సమర్థించుకొనుటకై, వారు స్వప్నములను ఉదాహరణలుగా చెప్తారు. స్వప్నములో మనము జాగ్రదావస్థలో ఎన్నడూ చూడని వస్తువుల నెన్నిటినో చూడటం తటస్థిస్తుంది. అయితే ఆ వస్తువులన్నీ కూడా మన మనస్సు కల్పించినవే, కానీ స్వప్నావస్థలో మనము వాటిని బహిర్ప్రపంచములో ఉన్నట్లుగా భావిస్తాము. ఇందుకు కారణము సంస్కారములు అనబడే మన పూర్వానుభవములను మనస్సు స్వప్నావస్థయందు దృశ్యములుగా ప్రదర్శిస్తుంది. కాబట్టి దానిని ప్రతయాత్మకమైన భ్రమగా పరిగణించాలి. చూడవలసినది లేనప్పుడు చూచుట అనే జ్ఞానము కూడా ఉండదు. చివరకు అక్కడ చూచుటకు వస్తువే ఉండదు. కాబట్టి విజ్ఞానమునకు మించినది మరేదియునూ లేదు. అయినప్పటికీ, ఈ రకమైన భావనలు అన్నిటికీ, ఒక ఆధారము ఉండితీరాలి. యోగాచార్యులు ఆ ఆధారమే విజ్ఞానము అంటారు. సజాతీయమైన విజ్ఞానము నైరూప్యముకాదు. అది దృఢమైన యదార్థత.

యోగాచార్యులు నిస్సందేహంగా విజ్ఞానవాదులు. విజ్ఞానము (చైతన్యము) యొక్క పరిధికావల యదార్థమైన అస్తిత్వము దేనికీ లేదని వాదిస్తారు. ముందు వివరించినట్లు వారికి సర్వమూ బుద్ధిమయమే కానీ, వేరుకాదు.

దిజ్నాగుని తర్కము విమర్శనాత్మకమైన వాస్తవికతపై ఆధారపడినది కాబట్టే, ఆయనను బౌద్ధ తర్క పితామహుడుగా కీర్తించారు. ఆయన తర్కశాస్త్రమును ఉద్ధరించి, దానికొక విశిష్ట స్థాయిని సమకూర్చినాడు. ముఖ్యంగా బౌద్ధ తర్కమునకు ఆయన అపోహ వాదమునందు ప్రఖ్యాతిగాంచాడు. ఈ వాదమును అనుసరించి, ఒక భావన కానీ, శబ్దముకానీ మిగిలిన అన్నిటినీ అపవర్ణకముచేసి, దేనిని నిర్ణయాత్మకముగా తెలియజేయదు. ఉపనిషత్తుల యందు బ్రహ్మమును తెలియజేయుటకు ప్రయత్నించిన విధంగా అన్నిటినీ కాదంటుంది. అన్నిటికీ అ భావమును వెల్లడిస్తుంది. జితేంద్ర బుద్ధుడు అటువంటి సిద్ధాంతమును వివరిస్తూ, ఒక శబ్దము యొక్క అర్థము, ఆ శబ్దముయొక్క అర్థ భేదమును లేదని చెప్పుటయే అని తెలియచేశాడు. అంటే శబ్దార్థము అది కాదు (నేతి) అది కాదు (నేతి) అని చెప్పటమే కానీ, అది ఏదో చెప్పకపోవటం ఆ సిద్ధాంత లక్షణము. అభావమే దాని ప్రధాన లక్షణము. దిజ్నాగుడు మార్మికవాది. ఆయన పరిపూర్ణజ్ఞానిగా గుర్తింపు పొందినాడు. బుద్ధునివలె అద్వయవాదియని ప్రజ్ఞాపారమిత పిండార్థము నందలి ప్రథమ వాక్యము తెలియజేస్తున్నది.

దిజ్నాగుడు కొంత కాలము కళింగ దేశములో నివసించి, ఒక మంత్రివర్యుని బౌద్ధునిగా మార్చాడుట. యోగచార విజ్ఞానవాద ప్రచారమునకై, ఆయన దక్షిణ భారతదేశములోనే కాక కొంకణము, మహారాష్ట్రములలో కూడా పర్యటించాడు. అనేకమంది ఇతర మతస్తులను బౌద్ధమందలి ఇతర శాఖలకు చెందిన వారిని కూడా తన సంప్రాదీయులుగా మార్చినాడు. నలందయందు సుదుర్జయుడనే వైదిక తార్కికుని ఓడించి తన సంప్రదాయములోనికి తీసుకున్నాడు. ధమ్మపాలుడనే పల్లవ రాజపుత్రుడు దిజ్నాగుని శిష్యుడై బౌద్ధతర్కముపై అనేక గ్రంథములు రచించుట యందు గురువునకు సహాయము చేశాడు.

చైనా యాత్రికుడైన ఇట్సింగ్, దిజ్నాగుడు శతాధిక గ్రంథములు రచించినట్లు చెప్పాడు అంతేకాక వేంగిలో ఉన్న సమయంలో దిజ్నాగుడు సాంఖ్యముపై "సాంఖ్య కారిక" అనే వ్యాఖ్యాన గ్రంథము వ్రాసిన ఈశ్వర కృష్ణునితో, తీవ్రమైన చర్చలో పాల్గొన్నాడట. దిజ్నాగుని రచనలలో ప్రాముఖ్యమైన గ్రంథము "ప్రమాణ సముచ్ఛ యము". ఈ గ్రంథ రచన వేంగీ సమీపములో శిలాస్థూపమున్న ఒక కొండపై గల విహారములో జరిగినట్లు తెలుస్తున్నది. బహుశా అది గుంటుపల్లి విహారమయి

ఉండవచ్చును. ఆయన ఇతర గ్రంథములు "న్యాయప్రవేశ"; "ఆలంబన పరీక్ష"; "హేతుచక్రదమరు". ఆయన మాధ్యమిక వాదమును గురించి ప్రజ్ఞాపారమితా సంగ్రహమనే గ్రంథము కూడా రచించినట్లు తెలుస్తున్నది. ఆ గ్రంథములో మహా యాన సిద్ధాంతమునకు చెందిన "అద్వయ" భావనగురించి సమగ్రముగా వివరించి నాడు. హుయాన్‌సాంగ్ వ్రాతలను అనుసరించి దిజ్నాగుడు బుద్ధుని ప్రవచనములను అన్నిటినీ సంకలనము చేసి ఒక వ్యాఖ్యానమును రచించవలెనని సంకల్పించినాడట. కానీ ఆ పని పూర్తిచేయగలిగినాడో లేదో ఆ చైనా యాత్రికునికి తెలియదట.

విమర్శనాత్మకమైన యదార్థ వాదమునందు ఆయన గొప్ప తార్కికునిగా కీర్తింప బడినప్పటికీ, దిజ్నాగుడు తర్కశాస్త్రమును అనిశ్చయమైనదని నిరసించుటయే గాక దాని ప్రయోజనము, లౌకిక సత్యమునకు మాత్రమే పరిమితమన్నాడు. అలసట కలిగిస్తుంది. బుద్ధిహీనులకు మాత్రమే అభిరుచి కలిగిస్తుందన్నాడు. కేవలము తర్కము పైననే ఆధారపడినవారు, బుద్ధ ప్రవచనములకు దూరమౌతారనీ, ధర్మమెన్నడూ తార్కిక విషయముకాదని తెలియజేశాడు. తర్కమనేది తప్పుగా అన్వయించిన సందర్భములోనూ తెలిసీ తెలియని యదార్థవాదుల తప్పులను సవరించటంలోనూ, ఉపయోగపడుతుందన్నాడు. భౌతికానుభవములను ఒక క్రమపద్ధతిలో విశదీకరించుటకు తోడ్పడుతుందని చెప్పాడు. మత విషయములలో తర్కమును ఉపయోగించుటపై, ఆయన దృఢంగా నిరసనను ప్రకటిస్తూ, పారలౌకిక విషయములలో అది నిరుపయోగమని ప్రకటించాడు.

ఒరిస్సా దేశములో ఒక అడవిలో ప్రయాణిస్తూ ఆయన చనిపోయినట్లు తెలుస్తున్నది.

■ ■ ■

# ధర్మకీర్తి

బౌద్ధ ధర్మమును తార్కికంగా ప్రబోధించిన వారిలో చివరివాడు ధర్మకీర్తి. తిరుమల (చిత్తూరు జిల్లా)లో జన్మించిన తెలుగు బ్రాహ్మణుడు. పూర్వ మీమాంస శాస్త్రంలో భట్ట సాంప్రదాయ స్థాపకుడైన కుమారిలభట్టుకు మేనల్లుడు. ఈ బాంధవ్యమునకు చారిత్రక, సాహిత్యపరమైన ఆధారములు ఏవీ లేవు. కేవలము వినికిడి మాత్రమే.

ధర్మకీర్తిని గురించి జినవిజయమనే గ్రంథంలో ఇలా వ్రాసి ఉంది.

"ఆంధ్రోత్కళానాం, సంయోగ పవిత్ర జయమంగళ గ్రామే, తస్మిన్ మహానద్యా భట్టాచార కుమారక, ఆంధ్రజాతి స్తితిరికో, మాతా చంద్ర గుణాసతీ, యజ్ఞేశ్వర పితా యస్య మహాహవదర్శిమాన్"

అంటే ఆంధ్ర, ఉత్కళ దేశ సరిహద్దులయందు, మహానదీ తీరమున నున్న జయ మంగళమనే గ్రామంలో, చంద్రగుణ, యజ్ఞేశ్వర శర్మ దంపతులకు జన్మించెను.

ఆయన తిరుమల వాసి యనే నమ్మకమును, జినవిజయములోని సమాచారము ఖండిస్తుంది. కుమారిలభట్టుకు మేనల్లుడనే బాంధవ్యమును సమర్థిస్తుంది. లాల్‌మణి జోషి అంచనాలను అనుసరించి ధర్మకీర్తి క్రీ.శ. 580–650 సంవత్సరముల మధ్య కాలమునకు చెందినవాడు. డాక్షరు సుందరరామయ్య క్రీ.శ. 600–675కు చెందిన

వాడు అన్నారు. డా॥ బి.యస్.యల్.హనుమంతరావు క్రీ.శ. ఏడు, ఎనిమిది శతాబ్ద ములలో జీవించి ఉన్నాడన్నారు. వేదవేదాంగములను, వ్యాకరణాది ఇతర సాహిత్య విభాగములలో పాండిత్యమును సంపాదించి, కవిగాకూడా పేరుగాంచాడు. ఈశ్వర సేనుని వద్ద తర్క శాస్త్రమును అధ్యయనము చేస్తూ ఉండగా పండితులకు పామరులకు ఆకర్షణీయమైన బౌద్ధ మతముచే తానూ ఆకర్షితుడైనాడు. అనంతరము నలందా విశ్వవిద్యాలయమునకు వెళ్లి, బౌద్ధ గ్రంథములను క్షుణ్ణంగా అధ్యయనము చేశాడు. అక్కడి మహావిహారమునకు ఆచార్యుడైన ధమ్మపాలుని శిష్యుడైనాడు. విద్యాభ్యాసము ముగించిన అనంతరము బౌద్ధ భిక్షువైనాడు. తన సొంత సాంప్రదాయ స్థాపనకు పూర్వము, దిజ్నాగుని విజ్ఞాన వాదము ఆయనను ఎక్కువగా ప్రభావితం చేసింది.

ప్రఖ్యాత పండితుడు రాహుల్ సాంకృత్యాయన ధర్మకీర్తిని శ్లాఘిస్తూ విమర్శ నాత్మకమైన వాదనా పటిమయందునూ, విస్పష్టమైన విశ్లేషణలోనూ, స్పష్టమైన భావుకత యందునూ ఆయనను మించినవారు ఎవరూలేరన్నాడు. స్టైచర్ బాస్కీ అనే రష్యన్ తత్త్వవేత్త, ఆయనను ఇంగ్లీషు తాత్త్వికుడైన కాంట్‌తో పోల్చాడు. ధర్మకీర్తి యొక్క సాహిత్య ప్రకర్ష, బౌద్ధ గ్రంథముల యందలి పాండిత్యము, ఆయన జీవిత కాలమునందే అపారమైన కీర్తి ప్రతిష్టలను సంపాదించినవి. ఉన్నత వర్గములకు చెందిన వారు ఆయనను ప్రశంసలతో ముంచెత్తగా, ఇతర మతములకు, శాఖలకు చెందిన విద్వాంసులు ఆయనంటే భయపడేవారు. ధర్మకీర్తి పాండిత్య ప్రకర్ష, సునిశిత మైన విషయ గ్రహణ శక్తి, బలమైన వాదనా పటిమ, పండిత సదస్సులలో ఎంతగానో శ్లాఘించబడినవి. బౌద్ధ తర్కమును ఆయన ఉన్నత శిఖరములపై నిలిపినాడు. చర్చల యందునూ, వాదోపవాదముల యందునూ, ఆయన నిపుణుడుగా పరిగణింప బడినాడు. చర్చనీయాంశముపై పరిపూర్ణమైన జ్ఞానమును గలిగి, వాదన ఎల్లప్పుడూ అత్యంత ప్రామాణికమై దోష, లోపరహితమై, త్రోసిపుచ్చుటకు వీలుకానంత పటిష్టత కలిగి ఉండేది. సమ్యక్ జ్ఞానము యొక్క నిర్వచనమును విపులీకరించుటయే గాక, ప్రత్యక్ష ప్రమాణమును నాలుగు విధములుగా వర్గీకరించాడు. అదేవిధముగా పరోక్ష ప్రమాణమును కూడా రెండు విధములుగా విభజించుట జరిగింది. ఈ విధంగా విభజన చేయుట, దిజ్ఞాగుని తార్కిక సిద్ధాంతముపై అభివృద్ధిగా భావించబడింది.

ఆయన అనేక గ్రంథములు వ్రాసినప్పటికీ ఈ దిగువనిచ్చిన ఎనిమిది గ్రంథ ములు ప్రాముఖ్యత గాంచినవి.

(1) ప్రమాణ వార్తిక (2) ప్రమాణ నిశ్చయ (3) న్యాయ బిందు (4) హేతుబిందు (5) సంబంధ పరీక్ష (6) వాద న్యాయము (7) సంతానాంతర సిద్ధి (8) సంబంధ పరీక్షా వృత్తి.

ధర్మకీర్తి గ్రంథములలో అతిప్రాముఖ్యత పొందిన ప్రమాణ వార్తికపై ప్రజ్ఞాకర గుప్త "వార్తికాలంకార"మనే వ్యాఖ్య వ్రాశాడు. రాహుల్ సాంకృత్యాయన్, టిబెట్టు దేశములో ఆ గ్రంథము యొక్క సంస్కృత ప్రతిని సంపాదించి తద్వారా ధర్మకీర్తియొక్క గొప్ప తనమును విశ్వవ్యాప్తము చేశాడు. అప్పటివరకూ కొంతమంది భారతీయ పండితులకు మాత్రమే ధర్మకీర్తియొక్క ఔన్నత్యము తెలిసియున్నది. బౌద్ధ తర్కము నందలి ముఖ్య విషయములపై ధర్మకీర్తి సిద్ధాంతములను సంగ్రహముగా ఈ క్రింద తెలియజేయడ మైనది.

**1. కార్యకారణ సంబంధము :**

ఒక ఫలితమునకు ఒకే కారణముగాక, అనేక కారణములు ఉండవచ్చును. అనేక కారణముల సమాహారము ఒక్క ఫలితమునే ఇవ్వవచ్చును. ధర్మకీర్తి ప్రమాణ కార్తికలో బహుకారణత్వ సిద్ధాంతమును విశదీకరించాడు. ఒకే కారణము నుండి ఒక ఫలితము కానీ, ఒక వస్తువు గానీ ఉత్పన్నమవుటకు వీలుకాదు. భిన్నకారణముల వలననే ఆ ఉత్పన్నత కలుగుతుంది. ఫలితము నందున్న వైరుధ్యములు, స్వభావ స్వరూపముల యందున్నవే గానీ, అర్ధంతరంగా వృద్ధి చెందినవికావు. అవి అనేక కారణముల నుండి ఉత్పన్నమైనవి.

**2. తాత్కాలిక సిద్ధాంతము :**

బౌద్ధమతము నందలి ప్రాథమిక సూత్రములో ముఖ్యమైన సిద్ధాంతమును అనుసరించి ప్రకృతిలో గోచరమగు అన్ని వస్తువులూ కేవలము తాత్కాలికములే. ఈ విధమైన అశాశ్వత తత్త్వమును బుద్ధుడు ప్రవచనము చేయగా అనంతర కాల ములో, బౌద్ధ తాత్త్వికులు దానిని తాత్కాలిక సిద్ధాంతమని పిలిచేవారు. కాల్పనిక భావనల యందు రూపు దాల్చినవన్నీ తాత్కాలిక అస్తిత్వమునే కలిగి ఉంటవి. ఇది

బుద్ధ ప్రవచనము. ఈ సిద్ధాంతమును నిర్ధారణ చేస్తూ, ధర్మకీర్తి ఏదైతే పదార్థమును ముందుగా జనింపచేసి, అనంతరము కోల్పోతుందో అవి అన్నీ అశాశ్వతములు, తాత్కాలికములు మాత్రమే అని చెప్పాడు.

**3. పరమార్ధ సత్త :**

బౌద్ధులు మనోదృష్టికీ, ఇంద్రియ జ్ఞానమునకూ అందని వాటిని గురించి ఆలో చించుట వ్యర్థమని ధృడంగా విశ్వసించారు. ఈ సందర్భములో ధర్మకీర్తి అంతిమ లేక చరమ సత్యము (పరమార్ధ సత్త)ను గురించి వివరిస్తూ, పరమార్ధ సత్త అనేది, ప్రత్యక్ష ప్రమాణము ద్వారా తెలుసుకొనగలిగినది. దాని శాశ్వత పదార్ధ సారము దాని దక్షత. ఇందుకు భిన్నంగా, ఏదైతే ఉత్పత్తి చేయగల సామర్థ్యము లేకుండా ఉంటుందో (అర్థ క్రియాకారిత్వము) అది కేవలము భావనిర్మాణము మాత్రమే. ఒక వ్యాఖ్యానము మాత్రమేనన్నాడు. దానినే సంవృత్త సత్త అన్నారు. అంటే సాంప్ర దాయకంగా అనుమాన ప్రమాణము ద్వారా తెలుసుకొను సత్యము. బౌతికమైన వస్తువులు వాస్తవమైనవిగా భావించుటకు కారణము వాటికిగల ఉత్పత్తి సామర్థ్యము. సాధారణంగా ఒక వర్గమునకు చెందిన వస్తువులయందు సర్వసామాన్యమైన గుణ ములుగా కనిపించునవి వాస్తవములుగా పరిగణింపబడుతవి. ఉదాహరణకు దయాస్వభావము కలిగియుండుట మానవుల యొక్క లక్షణము. మానవుడు చనిపోయినప్పటికిన్నీ ఆ స్వభావము నశించదు. అయితే మానవాళి అని చెప్పినప్పుడు అది కృత్రిమమైన వాస్తవికత. ఒక వ్యక్తికీ, ఒక జాతికీ మధ్య వ్యత్యాసము ఉంటుంది. ఎప్పుడైతే సంవృత్త ఆ వ్యత్యాసమును మరుగుపరుస్తుందో అప్పుడు వ్యక్తులు అందరూ ఒకే స్థూల రూపంగానో లేక ఒక గుంపుగానోకన్పిస్తారు. అదే విధంగా మరణము లేక శిథిలమవటం కూడా వివేచనా రాహిత్యమే. తాత్కాలిక స్వభావత మరియు సమగ్రమైన భావవాదము, ధర్మము యొక్క సహజ స్వభావము యొక్క మూల పదార్థములుగానే భావించాలి. అందువల్ల మరణము, శిథిలము అవటం, పదార్థము నందు అంతర్భాగముగా నున్న గుణమే. కాబట్టి శిథిలమై పోవుటకు నాశనము, అదృశ్యమగుటకు ప్రత్యేకమైన కారణము అవసరము లేదు.

**4. మనస్సు-శరీర సంబంధము :**

మనస్సు, శరీరము పరస్పరము ఆధారపడి ఉంటవా లేక దేనికవి స్వతంత్రముగా

ఉంటవా లేక రెండూ ఒకటేనా అనే విషయములు చర్చనీయాంశములు. బౌద్ధులు సిద్ధాంత రీత్యా అనాత్మవాదులు. ఆత్మయొక్క అస్తిత్వమును వారు తీవ్రంగా ఖండిస్తారు. ఆత్మకు బదులుగా వారు మనస్సు యొక్క అస్తిత్వమును ప్రతిపాదించి, ఆమోదించారు. చిత్తము (చైతన్య పూరితమైన మనస్సు) విజ్ఞానము (తెలివి) యొక్క ఉనికి వారికి ఆమోదయోగ్యములైన అంశములు. వారు మనస్సు, చిత్తము, విజ్ఞానమనే మూడు పదములనూ పర్యాయ పదములుగా ఉపయోగించారు. కాని అవి పర్యాయ పద ములు కావు. మనస్సు, శరీరము కాదు. అయినప్పటికీ దాని అస్తిత్వము శరీరము పైననే ఆధారపడి ఉన్నది. జ్ఞానేంద్రి యములు మనస్సుకావు, వాటి అస్తిత్వము కూడా దేహము పైననే ఆధారపడియున్నది. జ్ఞానేంద్రియములు లేకపోతే మనస్సుకు పని ఉండదు. ఈ తర్కమును ఆధారముగా చేసుకొని ఆలోచిస్తే అవన్నీ పరస్పరమూ ఒకదానిపై ఒకటి ఆధారపడి యున్నవని తెలుస్తున్నది. కాబట్టి మనస్సు, శరీరము, పరస్పర ఆధారములై, ధారాళమైన సంబంధ బాంధవ్యములను నెఱపుతూ ఉంటవి. మనస్సు ఎన్నడూ దేహమునకు చెందని వస్తువుకాదు. సర్వ కాలములయందూ దేహములోని భాగమై ఉంటుంది. కాబట్టి ఆ రెండూ మనో శారీరక పరిణామములుగా పరిగణింపబడుచున్నవి. వాటి మూల గుణములయందు వైవిధ్య ముండదు. శరీరము నుండి ఉత్పన్నమైనదే మనస్సు. శుద్ధ చైతన్యము ప్రకృతి యందలి పంచ భూతముల వలన ఏర్పడినది. కాబట్టి ధర్మకీర్తి చైతన్యము పంచ భూతాత్మకమనీ, ఏ విధముగానూ పంచ భూతములకు వేరుకాదని ఆమోదించాడు.

ఆ తరువాత ఉత్పన్నమైనటువంటి మరో ప్రశ్న ప్రాణము, అపానము, జ్ఞానేంద్రి యములు, మనస్సు ఎట్లు ఉద్భవించినవి అన్నది. ధర్మకీర్తి ఈ ప్రశ్నకు సమాధాన మిస్తూ, అవి ఒకే జాతికి చెంది ఉండి, వాటి ఉత్పత్తికి తగిన పూర్వ కారణము ఉండి ఉంటేనే, అవి ఉద్భవిస్తవి. లేనిచో, కేవలము శరీరమున్నది కాబట్టి అవి జనించవు. ప్రాణాపానములు, జ్ఞానేంద్రియములు, బుద్ధి మూడింటినీ కలిగియున్న శరీరము మాత్రమే మరొక శరీరమునకు జన్మనీయగలదు. రెండు శరీరముల యందు ఉండు గుణములు సమానములే. ఏ కారణమువలననైనా, ఆ గుణములు లోపించి నచో, శరీరమున్నప్పటికినీ, మరొక శరీరోత్పత్తి జరుగుట సాధ్యముకాదు. కాబట్టి శరీరము, ఇతర గుణములు, పరస్పర సంబంధము కలిగి ఉన్నప్పటికినీ, అవి

స్వతంత్రములే. ప్రాణము లేక శరీరము పని చేయజాలదు. శరీరము లేక ప్రాణముండదు. ఈ విధమైన పరస్పర బాంధవ్యము పరస్పర ఆధారమును అంగీక రించని పక్షమున చనిపోయిన శరీరము కూడా మరొక జీవికి జన్మ నీయగలదు. ప్రకృతిలో ఆవిధంగా జరుగుటలేదు. కాబట్టి, ప్రకృతిలో ఏ ఒక్క భూతము కూడా స్వతంత్రంగా మరొక భూతమును సృష్టించలేదని నిర్ణయించవచ్చును.

**5. ఆత్మ అస్తిత్వ ఖండన :**

భగవంతుని గురించిన తర్కము : బౌద్ధ చార్వాక దర్శనములు ఆత్మయొక్క అస్తిత్వమును తిరస్కరించినవి. మిగిలిన భారతీయ తత్త్వశాస్త్రములన్నీ, ఆత్మ ఉనికిని ఆమోదించినవి. నాశనములేని వస్తువుగా నిరపేక్షము, శాశ్వతమైన అస్తిత్వము, జ్ఞానము, ఆనందము గలిగిన చైతన్యముగా ఆత్మను పరిగణిస్తారు. దీనినే వేదాంత ములు బ్రహ్మము అంటారు. అయితే బౌద్ధులు ఆత్మ ఉనికిని నిరాకరించినప్పటికీ కాల ప్రవాహములో అనుక్షణమూ మార్పుచెందుచున్నటు వంటి చైతన్యమొకటి ఉన్నదని అంగీకరించారు. దీనిని చైతన్య సనంతనానంతర సిద్ధియని పేర్కొన్నారు. ప్రవాహశీల చైతన్యమని కూడా పిలుస్తారు. ఈ చైతన్యము ఒక శరీరమునుండి మరొక శరీరమునకు కాంతి కిరణముకంటే వేగంగా, విద్యుత్తు శక్తి కంటే త్వరితంగా ప్రయాణిస్తుంది. ఈ విధమైన ప్రయాణము ఎల్లప్పుడూ శాశ్వతంగా కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి అది తాత్కాలికమూ, శాశ్వతము కూడా అవుతుంది.

హిందువులు బ్రహ్మము యొక్క అస్తిత్వమును, స్వభావమునూ వివరిస్తూ, సర్వశక్తి మంతుడూ, సర్వజ్ఞుడూ, సర్వవ్యాపకుడని వర్ణిస్తే, బౌద్ధులు ఆత్మయొక్క ఉనికిని ఖండిస్తూ, హిందువుల సిద్ధాంతమును తిరస్కరించారు. భగవంతుని అస్తిత్వమును కూడా నిరాకరించారు. అనాత్మవాదము, నిరీశ్వరవాదములే బౌద్ధ మతమునకు పునాదులు. హిందువుల ఆత్మవాదమును, ఈశ్వర వాదమును, కార్యకారణ సంబంధ మునూ, తీవ్రంగా విమర్శించిన ధర్మకీర్తి తన తార్కిక నైపుణ్యంతో కొంతవరకు కృతకృత్యుడైనాడు.

బౌద్ధ తర్కమునగల పరిపూర్ణ జ్ఞానముతోపాటు, సాహిత్యము నందు కూడా ధర్మకీర్తికిగల సామర్థ్యము పలువురి ప్రశంసలనందుకున్నది. ఆయన బహుభాషా కోవిదుడు. తన వాద న్యాయ గ్రంథము నందు ఆసక్తికరమైన వినూత్న సాహిత్య

ప్రక్రియను ప్రదర్శించి నాడు. “యస్తునాక శబ్దం ముక్కు శబ్ద మిమేవ నాసపర్యంవేత్తి, న నాస శబ్దం సకధా మపిశబ్దః”. పై వాక్యములో ఆయన ముక్కును గురించి మూడు భాషలనుపయోగించాడు. ధర్మకీర్తి తన మాతృభాషయైన తెలుగును, ఇతర ద్రవిడ భాషల నుండి వేరుపరచాడు : “తత్ స్వభావశ్య అన్యతో సిద్దేహః ప్రాకృత, అపభ్రంశ, ఆంధ్ర భాషావత్” అనగా ప్రాకృ తము, అపభ్రంశము, ఆంధ్ర భాషా అనబడే మూడు భాషలూ ముక్కు శబ్దమునకు వాడబడినవి, అని చెప్పాడు.

ధర్మకీర్తి దేశము నలుమూలల పర్యటించి, అనేక చర్చలలోనూ, సదస్సులలోనూ పాల్గొని, ఇతర మతములకు చెందిన పండితులతోనూ, బౌద్ధములోని ఇతర శాఖలకు చెందిన ఆచార్యులతోనూ చర్చలు జరిపేవాడు. తన మేనమామయైన కుమారిలభట్టునే చర్చలో ఓడించి ఆయనను బౌద్ధునిగా మార్చినాడని చెపుతారు. ధర్మకీర్తియొక్క ప్రత్యుత్తర చాతుర్యమును గురించి మరొక కథ కూడా ప్రచారంలో ఉంది. ధర్మకీర్తిచే పరాజితులైన ఆయన ప్రత్యర్థులు కొందరు తమ పరాజయమును సౌశీల్యంగా అంగీకరించలేక, ఆయన తాళపత్ర గ్రంధములు కొన్నిటిని, కుక్కతోకకు ముడి వేశారట. భీతిల్లిన ఆ శునకము విచ్చలవిడిగా పరుగెత్తుతుంటే, తోకకు కట్టిన తాళపత్రములు త్రోవ పొడుగునా అన్నివైపులకూ గాలిలో ఎగిరిపోయినవట. ప్రత్యర్థులు ఈ దృశ్యమును చూచి పగలబడి నవ్వుతూ ధర్మకీర్తిని హేళనగా చూచారట. అంతట ధర్మకీర్తి ప్రశాంతంగా ఈ తాళ పత్రములు ఏ విధంగా అన్ని దిక్కులకూ, సుదూరంగా ఎగిరిపోతున్నవో, అదేవిధంగా నా భావములూ, నా కీర్తీ లోకమునందు దశదిశలకూ వ్యాపిస్తుందన్నాడట. ఇతర బౌద్ధ పండితులు విమర్శించినట్లుగానే ధర్మకీర్తికూడా ఇతర మతస్తుల ఆచారములను ముఖ్యంగా హిందువుల ఆచారములను కూడా హేళనచేస్తూ వాటిని మూఢాచారములన్నాడు. వేదములు అధికారికము లనడం, ప్రపంచమునకు ఒక సృష్టికర్త ఉన్నాడని నమ్మటం, చెరువులలోనూ, నదులలోనూ, పుణ్యమని స్నానములు చేయడం, కుల తత్త్వమును పాటించటం, ఉపవాసములు ఉండటం, దేహమునిండా మత చిహ్నములను ధరించటం, అంటే విభూతి, లింగకాయలు, నామములు, శంఖ, చక్రాకితములు వేయించుకోవటం వంటి ఆచారములను బుద్ధిహీనులు పాటించు మూఢాచారములని ప్రకటించాడు. ఈ విధములైన హేళనలను చేసేముందు ధర్మకీర్తి తన మతమునందు ఇతరులు

పరిహాసాస్పదంగా భావించ గలిగిన అనేక ఆచారములను సమర్థించుకొనటమో లేక గమనించకపోవటమో జరిపాడు. ఏమైనప్పటికీ దేశమునందలి బౌద్ధాచార్యుల పరంపరలో తెలుగు గడ్డపై జన్మించిన ధర్మకీర్తి ఒక విశిష్టమైన స్థానమును ఆక్రమించుటయే కాక మతాతీతంగా అందరికీ పూజనీయుడైనాడు.

తర్కశాస్త్రం ద్వారా బౌద్ధ మతానికినీ, భారతీయ ఆధ్యాత్మిక చింతనకూ ఆంధ్రులు చేసిన సేవ సర్వే సర్వత్రా ప్రశంసనీయము.

■ ■ ■

# సిద్ధనాగార్జునుడు

## (వజ్రయానం)

ఆంధ్ర దేశంలో బౌద్ధానికి చరమదశ వజ్రయాన స్థాపన, వ్యాప్తితో ప్రారంభమైనది. చివరకు తన మాతృభూమిలో అస్తిత్వమును కోల్పోయి, దేశాంతరములలో మనుగడ సాగించవలసిన స్థితికి దిగజారిపోయింది. మహాయాన సిద్ధాంతముల యందు రూపొందించిన బుద్ధారాధన, బోధిసత్త్వయాన వంటి సంప్రదాయములు కాలక్రమేణ అనేక మార్పులు చెంది చివరకు వజ్రయానముగా పరిణమించినవి. దీనికి మంత్రయానమనీ, తంత్రయానమనీ, శక్తియానమనీ కూడా పేర్లున్నవి. ఇవి కేవలము పర్యాయపదములే. కాబట్టి వజ్రయానమును, తంత్రయానము లేక తాంత్రిక బౌద్ధమని పిలుస్తారు. క్రీ.శ. పదకొండవ శతాబ్దమునకుచెందిన 'అద్వయ వజ్ర' అనే గ్రంథమును అనుసరించి మహాయానము రెండు విభాగములు. ఒకటి పారమిత యానము, ఆచార్య నాగార్జునునిచే ప్రబోధింపబడినది. రెండవది మంత్రయానము. ఇదికూడా మరో నాగార్జునుడైన సిద్ధనాగార్జునునిచే ప్రబోధింపబడినది. క్రీ.శ. రెండవ శతాబ్దము, పన్నెండవ శతాబ్దము మధ్యకాలంలో, నాగార్జునుల పేరుతో రససిద్ధులైన ఐదుగురు బౌద్ధులుండేవారు. మహాయానమునకు పారమితా సాహిత్యము ఆధార భూతముకాగా, వజ్రయానమునకు మంత్రములు లేక ధరణిలు, తంత్రములు లేక ముద్రలు ఆధారములు. మహాయాన సాంప్రదాయమునకు చెందిన ఆచార్యులు

ఎవ్వరూ పైన తెలియజేసిన వర్గీకరణమును ఆమోదించలేదు. వారికి పవిత్రమైన పారమితా వాఙ్మయమును, క్షుద్రమైన మంత్ర, తంత్రముల స్థాయికి దిగజార్చడంపట్ల అయిష్టత ప్రకటించారు. అయితే టిబెట్టు దేశపు బౌద్ధులు. బుద్ధ భగవానుడు మూడవసారి ధర్మచక్ర ప్రవర్తనను విశ్వసిస్తారు. ధర్మచక్ర ప్రవర్తన అంటే బౌద్ధ ధర్మమునుగురించి బుద్ధుడు ప్రవచించుట. బుద్ధ భగవానుడు శిష్యులను ఉద్దేశించి చేసిన మూడవ ధర్మచక్ర ప్రవర్తనయందు, మరొక నూతనయానమును ప్రవచించి నాడనీ, అదే మంత్రయానమని పిలువబడిందనీ టిబెట్టు బౌద్ధుల నమ్మకం. హుయాన్ సాంగ్ కూడా ఆంధ్రదేశ పర్యటనలో, బుద్ధ భగవానుడు ఆంధ్ర దేశము వచ్చినట్లూ, అశోక వృక్షములతో పరివృతమై యున్న ఒక మహావిహార సమీపములో సమావేశమైన జన బాహుళ్యమునకు ధర్మబోధన చేసినట్లు ప్రచారములో ఉన్న ఓ కథను తన యాత్రాదర్శినిలో వ్రాసియున్నాడు. ఇందుకు తగిన ఆధారములు కొరవడటంవల్ల పండితులెవ్వరూ ఈ విషయమును నమ్మలేదు. ఏమైనప్పటికీ ధాన్యకటకము వజ్ర యానము లేక మంత్రయాన సాంప్రదాయమునకు పుట్టినిల్లని ఋజువుచేసే శాసన ములు సాహిత్యపరమైన సాక్ష్యములు అనేకము లభించినవి. హుయాన్‌సాంగ్, భావవివేకుని గురించి తెలియజేస్తూ, వజ్రపాణి దేవుని ధ్యానించటంద్వారా ఆయనకు అలౌకిక శక్తులు లభించినవని వ్రాశాడు. ఆ విధంగా ధాన్యకటకము లేక ధరణికోట ధరణులకు కేంద్రస్థానమైనదని స్పష్టముగా తెలుస్తున్నది. క్లిష్టతరమైన తంత్ర విధాన ప్రక్రియయందు శరీర అవయవములను వివిధ ఆకృతులుగా మార్చుతూ (ముద్రలు) ధరణు(మంత్రము)లను ఉచ్చరిస్తూ ఉండాలి. కొందరు పండితుల అభిప్రాయములను బట్టి, దేవీ దేవతలను వివిధ ముద్రలతో, మంత్రోచ్చారణతో ఆరాధించటమనేది నూతన ప్రక్రియకాదనీ, బౌద్ధమత ప్రవేశమునకు పూర్వమే ఈ దేశములోని ఆదిమ వాసులు, ముఖ్యంగా ఆంధ్ర జనపదవాసులు నిర్వహిస్తున్న ఆరాధన పద్ధతులేననీ, క్రొత్తవికావని చెప్పారు. ఈ పద్ధతులు హిందువుల పూజా విధానములో భాగముగా ఆచరింప బడుచున్నవేనన్నారు. డాక్టరు హనుమంతరావు అభిప్రాయమును అనుస రించి క్రీ.శ ఏడవ శతాబ్దము నుండి, పదిహేడవ శతాబ్దమువరకూ, భారత దేశపు అన్ని ప్రాంతములవారూ, అన్ని మతములవారూ, ఈ రకమైన ఆరాధనా పద్ధతులను, ప్రాంతీయ మతవిశ్వాసములకు అనుగుణంగా కొద్దో గొప్పో మార్పులతో, చేర్పులతో,

పాటిస్తూనే ఉన్నారు. అందువల్ల పైన వివరించినకాలమును 'తాంత్రిక యుగమని' కొందరు పండితులు వర్ణించారు. అయితే తాంత్రిక విద్యలు బౌద్ధమతము నుండి, హిందూ మతములో ప్రవేశించినవా, లేక హైందవమునుండి బౌద్ధములోనికి వెళ్లినవా, అనే అంశము ఇదమిత్థంగా నిర్ణయించుటకు వీలుకాదు. అకస్మాత్తుగా హిందూ మతములో తాంత్రిక పద్ధతులు ప్రవేశించటాన్నిబట్టి ఇవి ఇంతకుముందే బౌద్ధులు ఆచరిస్తున్నట్లూ, అనంతరము హిందువులు వాటిని గ్రహించినట్లుగా భట్టాచార్య అభిప్రాయమం. అదేవిధంగా వజ్రయాన జన్మ స్థలముకూడా వివాదాంశమే అయి నది. కొందరు అది భారతదేశ సరిహద్దు ప్రాంతము లలో జన్మించి, అనంతరము దేశములోనికి తేబడినదని అభిప్రాయపడుతున్నారు. కొందరు ఇది దేశపు ఈశాన్య రాష్ట్రములైన అస్సాము, బెంగాలు రాష్ట్రములలో జన్మించినట్లు భావిస్తున్నారు. ఇక మూడవ వర్గమునకు చెందిన, లాల్‌ముని జోషీవంటివారు, మరి కొందరు పాశ్చాత్య పండితులు కూడా ప్రాచీన కాలమునుండి బౌద్ధ మతమునకు ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రదేశమే వజ్రయాన జన్మస్థానమన్నారు. భారతీయ, సింహళ, టిబెట్టు దేశములకు చెందిన అనేక బౌద్ధ గ్రంథములు వజ్రయానమునకు ఆంధ్రదేశమే పుట్టిల్లనీ, ముఖ్యంగా శ్రీపర్వత (నాగార్జునకొండ) ప్రాంతమును నిర్దుష్టంగా తెలియజేశారు.

తాంత్రిక బౌద్ధము, మహాయానము యొక్క వేరుమొక్క అనే మాటను సమర్థించు కొనుటకు ముఖ్యమైన ఆధారము, మహాయానులకు పూర్వీకులైన మాధ్యమికవాదులు రచించిన లేక సంకలనము చేసిన "ధరణి పిటక"మనే గ్రంథమే సాక్ష్యము. ధరణి అనేది ఒక మాంత్రిక సూత్రము. అది సత్యమును కొన్ని అక్షరములుగా సంక్షేపిస్తుంది (బీజాక్ష రములు). కోంజ్, లామా, అంగారక గోవింద తెలియచేసిన దానినిబట్టి "ధరణి"లు మార్మికమైన అక్షర సముదాయము. వాటియందు అనేక మంత్రములు నిక్షిప్తమై ఉంటవి. ఈ మార్మికాక్షరములు మనస్సును ఒక భావముపైగానీ, ఒక దృశ్యముపై గానీ, ధ్యానమునందు పొందిన అనుభూతిపైగానీ నిశ్చలముగా (ధారణ) నిలుపగలవు. ధరణులకు జన్మస్థలము కాబట్టి ధాన్యకటకమునకు ధరణికోట అనే పేరువచ్చింది.

మహా సాంఘికులు బుద్ధుని లోకోత్తరునిగానూ(పారలౌకికుడు), అనంతుడు, పురుషుడుగానూ భావించి, ఆయనను చారిత్రక వ్యక్తిగా కాక, ఒక దివ్యస్వరూపునిగా

అభివర్ణించారు. బోధిసత్త్వ సాంప్రదాయమును ప్రవేశపెట్టడం, నిర్వాణమును మహా సుఖమని అన్వయించుట ద్వారా, బౌద్ధములో తాంత్రిక విశ్వాసములను జనింపచేసి పెంచి, అభివృద్ధికి కారకులైనారు. ఈ విధములైన విశ్వాసముల ద్వారా బుద్ధుని పరదేవతగా వర్ణించి, సర్వదా ఆయన ఉపదేవీ, దేవతల చేత పరివృతుడై ఉంటా డన్నారు. లోకమంతా ఆయన యొక్క బహిర్గత ప్రత్యక్ష స్వరూపముగానూ దాని సిద్ధిని పొందుటయే నిజమైన జ్ఞాన వికాసముగానూ భావిస్తారు. ఆ విధమైన సిద్ధి పొందినవారు సుఖావతి యందు బుద్ధునితో పాటు నివసిస్తారు. ఇది హిందువుల నమ్మకమైన స్వర్గప్రాప్తి, వైకుంఠప్రాప్తితో సమానము. సిద్ధిసాధన యోగసాధనలో వలెనే అనేక విధములైన ముద్రలు దాల్చి మంత్రో చ్చారణ చేయుటయే. శైలవాదులు బుద్ధుని, బోధిసత్త్వులను ఆరాధించే విధానమును రూపొందించారు. వైతుల్యకులు, మరో అడుగు ముందుకువేసి, లైంగిక సంబంధములైన క్రియాకలాపములను కరుణా పూరితమైన ఆరాధనా విధానముగా వర్ణించారు. ప్రజ్ఞ కరుణలను పురుషుల, స్త్రీల యొక్క జననేంద్రియములకు సంకేతములుగా భావించి, వాటి కలయిక వలన గలుగు సుఖమును పరమ సత్యము లేక "మహాసుఖము"గా పరిగణిస్తారు. శ్రమ రహితమైన జీవనమును, ప్రకృతి సిద్ధమైన జీవితముగా నిర్వచించారు. వ్యక్తి యొక్క సహజ స్వభావములను, మోహావేశములను, కోరికలను అణచుకోవలసిన అవసరము లేనటువంటి జీవితమని తెలియజేశారు. ఈ విధమైన వారి సిద్ధాంతములను అను సరించి ప్రజ్ఞ లేక శూన్యత భగవతి (స్త్రీ దేవత) కాగా, కరుణ భగవానుడు అవుతాడు. నాశరహిత మైన వారి ఐక్యత (ఏకత్వము)యే తాంత్రిక బౌద్ధములో, అతిముఖ్యమైన అంశము. క్రీ.శ.1156 ప్రాంతమునందు నివశించిన స్థవిర అనుపమ రక్షిత కూర్చిన, సాధనా విధానములను వివరిస్తూ, "సాధారణంగా చెప్పవలెనంటే ఏ సాధకుడు మైధున స్థితి (ముద్ర)ని అనుభవిస్తూ, భగవతిని ధ్యానిస్తాడో అతనికి మానవాతీత శక్తులన్నీ పాదములపై వ్రాలుతవి. ఇతర చిరుశక్తులన్నీ సర్వసామాన్యమైనవిగా లభిస్తవి". ఆ విధమైన, ధ్యాన సాధకునకు భగవతియే స్వయంగా అతికష్టతరమైన బుద్ధత్వమును కరతలామలకంగా లభింపజేస్తుంది. ఉదాహరణకు "గుహ్య సమాజ" మనే తాంత్రిక గ్రంథములో శూన్యతకు కరుణకు భేదములేని అద్వయమే బోధి చిత్తమని తెలియజేయబడింది. "శూన్యతా కరుణాభి నాం బోధిచిత్తం ఇతి స్మృతం".

తంత్ర శాస్త్రములో బోధిచిత్తమంటే శాశ్వతమైన శాంతియుతమైన మరియు వర్ణనాతీత మైన వాస్తవిక స్థితి. ఈ స్థితి విధ్యాత్మక (+), నిషేధాత్మక (–) మైన, పురుష స్త్రీలను ఐక్యపరచుతుంది.

మహాయాన శాఖీయుడైన ఆచార్య నాగార్జునుడు "మహామయూరి విద్య" అనే ఒక తాంత్రిక విద్యను ఆచరించేవాడు. మహామయూరి ఒక దేవత, అమోఘసిద్ధి యనే దివ్యాంశ సంభూతుడైన బుద్ధుని నుండి ఉద్భవించినది. మాధ్యమిక వాదము నందు మహా పండితుడూ ఆర్యదేవుని జీవిత చరిత్రకారుడూ అయిన కుమార జీవుడు "మహా మయూరి విద్యారంజని" అనే గ్రంథమును అనువదించినాడు.

భావవివేకుడు ధాన్యకటకము నందు వజ్రపాణి దేవు నారాధించి సర్వసిద్ధులనూ పొంది తనకుగల సందేహములు అన్నిటినీ నివృత్తి చేసుకొన్నాడు. సౌదన్యపుర నివాసి (బోధన్, నిజామాబాద్ జిల్లా)యైన మైత్రేయనాథుడు యోగచార విజ్ఞానవాద వేత్త. తాంత్రిక సంప్రదాయమును పాటించేవాడు. వజ్రయానము టిబెట్టులో ప్రవేశ పెట్టిన పద్మ సంభవుడు తెలుగువాడే. ఆ విధంగా మాధ్యమిక వాదము, యోగాచార వాదముల ద్వారా వజ్రయాన శాఖ లేక తాంత్రిక బౌద్ధమును స్థాపించి, ప్రచారము చేసిన వారిలో అధికులు తెలుగువారే. బహుకొద్దిమంది మహారాష్ట్రులు కూడా ఉన్నారు.

ఆ కోవకు చెందిన వారిలో ప్రముఖుడూ, తాంత్రిక బౌద్ధము యొక్క అభివృద్ధి, ప్రచారముల యందు అతి ముఖ్యమైన పాత్రను నిర్వహించిన మహనీయుడు సిద్ధ నాగార్జునుడు. క్రీ.శ. 600 ప్రాంతమునకు చెందిన, ఆయనకు సిద్ధనాగార్జునుడని పేరు రావటానికి కారణము ఆయన పొందిన అనేక సిద్ధులు. ప్రకృతి, శారీరక, భౌతిక, రసాయనిక శాస్త్రముల యందునూ, భూగర్భ శాస్త్రము నందునూ, ఆయన నిష్ణాతుడు. వివిధ రకములైన ఖనిజములను, లోహములను గుర్తించుటలోనూ, శాస్త్రీయ పద్ధతులను పాటించి, వాటిని సద్వినియోగ పరచుటలోనూ, ఆయన కాయనే సాటి. వనమూలికా శాస్త్రంలో కూడా ఆయన దిట్ట. ఖనిజములను, లోహములను, వన మూలికలను ఉపయోగించి మందులు తయారు చేసేవాడు. రసవాద శాస్త్ర నిపుణుడు అగుటచేత స్వల్ప విలువగల లోహములను కూడా బంగారముగా మార్చేవాడని ప్రతీతి. రసవాద శాస్త్రముపై, అనేక విధములైన ప్రయోగములను నిర్వహించుటతో పాటు, ఆ శాస్త్రముపై అనేక గ్రంథములు కూడా రచించాడు. "కాకస పూత తంత్ర";

"రసేంద్ర మంగళం" ఆయుర్వేద వైద్య గ్రంథము "సుసృత సంహిత" వంటివి ఆయన రచనలలో కొన్ని శ్రీపర్వత విహారములయందు అనేక రకములైన ప్రయోగములకు కావలసిన పలు ప్రయోగశాలలు నిర్మించి, నిర్వహించేవాడు. మానవులకే కాక, పశుపక్ష్యాదులకు వృక్షములకు కూడ కావలసిన అనేక విధములైన మందులను తయారు చేసేవాడు. ఈ సందర్భములో తెలుసుకొనవలసినది ఏమంటే బౌద్ధుల రసవాదము, హిందువుల రసవాదముతో విభేదిస్తుంది. బౌద్ధుల రసవాదము యోగ సాధనకు ప్రాముఖ్యతనిస్తుంది. శరీరము ఎక్కువ కాలము జీవించుటకుగాను, రసాయనిక, పాదరస మూలములైన మందుల వాడకమునకంటే యోగమునకే ప్రాధాన్యత. రసాయనమని పిలవబడే బౌద్ధుల రసవాదము, రసాయనిక పదార్థములను జీవితములో ఉన్నత లక్ష్యసాధనకు గాను, అనగా నిర్వాణమును పొందుటకుగాను, లైంగిక, యోగ, ధ్యానపద్ధతులతో పాటు వినియోగించేవారు. హిందువులు "ధాతు వాదమని" పిలచే రసవాదము బౌద్ధుల రసవాదము నకు వ్యతిరేకంగా ఉంటుంది. అయితే ఆచరణలో రసాయనిక పదార్థములనువాడుట, యోగాభ్యాసము వంటి పద్ధతులు ఇరుమతముల వారివి ఒకే విధంగా ఉంటవి. హిందూ, బౌద్ధముల ఆచరణపద్ధతులను గురించి "నా సిద్ధ సహజీవ" మరియు "వజ్రయాన తాంత్రిక పద్ధతులు" అనే గ్రంథములలో వివరింపబడినవి. నాగార్జునుడు అనేక తాంత్రిక క్రియలయందు, రసవాదముతోసహా సిద్ధి పొందాడు. అనేక వేలమంది విద్యార్థులు శ్రీ పర్వత విహారములయందు ఆయన శిక్షణలో ఆయా విద్యలను అభ్యసించి విద్వాంసులైనారు. దయా స్వభావమువలన గానీ, ప్రజానీకమును తమ సంప్రదాయములోనికి ఆకర్షించుటకుగానీ, ఆరోజులలో బౌద్ధ, జైన భిక్షువులు, వైద్యము, మాంత్రిక (మంత్రశాస్త్రము) నేర్చుకొని, సామాన్య ప్రజలలో తమ మత ప్రచారముతోపాటు పైవిద్యలనుకూడా ఉపయోగించేవారు. ఈ రోజులలో కూడా మత ప్రచారకులు అదే విధానములను పాటిస్తున్నారు అనేది గమనించదగిన విషయము. మహాయాన స్థాపకుడైన నాగార్జునుడు, వజ్రయాన స్థాపకుడైన నాగార్జునుని వేరువేరుగా గుర్తించుటకుగాను ఈయనను సిద్ధనాగార్జునుడని పిలిచేవారు. అయితే ఈ విషయములో టిబెట్టు దేశపు బౌద్ధులు పొరపడి, మహాయాన శాఖకు చెందిన ఆచార్య నాగార్జునుడు 500 సంవత్సరములు జీవించినట్లు గ్రంథములలో వ్రాసుకొన్నారు. రామిరెడ్డిపల్లి (కృష్ణా

జిల్లా)లో లభించిన శాసనమును అనుసరించి మరొక నాగార్జునుడు ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ నాగార్జునుడు క్రీ.శ. ఏడవ శతాబ్దమునకు చెందిన భదంత నాగార్జునాచార్యుని శిష్యుడుగా గుర్తించారు. ఈ నాగార్జునుడే సిద్ధ నాగార్జునుడు. జగ్గయ్యపేటలో లభించిన శాసనముకూడా,క్రీ.శ. 600 ప్రాంతమునందు నాగార్జునుడు జీవించి ఉన్నట్లు తెలియజేస్తున్నది. ఆయన కనుగొన్న తాంత్రిక బౌద్ధ విధానము వలెనే ఆయన జన్మదినమూ, జన్మస్థలమూ, ఆదిగాగల ఆయన జీవిత విశేషములు కూడా గోప్యమైనవి. అయినప్పటికీ తాంత్రికయాన స్థాపనమందునూ, దానిని క్రమబద్ధీకరించి, ప్రచారము చేయుటలోనూ, సిద్ధనాగార్జునుని పాత్ర విశిష్టమైనది. ఆయన నలంద విశ్వవిద్యాలయమునందు ఆచార్య నరపాదుని శిష్యుడనే వాదనకూడా ఉన్నది. విద్యాభ్యాసము పూర్తిచేసిన అనంతరం ధాన్యకటకమునకు తిరిగివచ్చి తారాదేవినీ, మహాకాళుని ఉపాసించుట ద్వారా “కురుకుళ్ళ తంత్ర” సిద్ధిని పొందాడు. హిందువుల తంత్ర శాస్త్రమునందు కూడా “శక్తి”ని కురుకుళ్ళ, కుళేశ్వరీ, కౌళమార్గ తత్పరసేవితా యని, లలితా సహస్రనామ స్తోత్రంలో వర్ణించినారు. సిద్ధ నాగార్జునుడు కూడా మహామయూరి తంత్రమును అధ్యయనము చేశాడు. తంత్ర శాస్త్రముపై ఆయన ఏబది గ్రంథములకుపైన వ్రాసినట్లు తెలుస్తున్నది. ఆయన జీవితములోని చరమ దశను శ్రీ పర్వత విహారమునందు వజ్రయానమును బోధిస్తూ తగు కార్యకలాపములనుఆచరిస్తూ గడిపినాడు. టిబెట్టు, సింహళ గ్రంథములు శ్రీపర్వతమును, వజ్ర పర్వతమని కూడా పేర్కొన్నవి. ఇందుకు కారణం శ్రీపర్వత విహారవాసులు వజ్ర యానముపై రచనలు చేయుట.

క్రీ.శ. ఏడవ శతాబ్ద ప్రాంతమునకు చెందిన “గుహ్య సమాజ తంత్ర’ మరియు “మంజుశ్రీ మూలకల్ప”ములు రెండూ బౌద్ధములోని తాంత్రిక యానముపై రచించిన తొలి గ్రంథములు. పైన పేర్కొన్న గ్రంథములలో రెండవది, బహుశా ధాన్యకటకములోనో, శ్రీపర్వత విహారములలోనో రచింపబడిఉంటుంది. అందులో మంత్రముల యొక్క ఫలితములను శీఘ్రముగా పొందవలెనంటే, ఇతర ప్రదేశములకంటే ధాన్య కటము శ్రేష్టమని నొక్కి వక్కాణించబడింది. ఇందుకు కారణమును వివరిస్తూ, అమరావతీ చైత్యమునందు మోహా వేశములు అన్నిటినీ జయించిన బుద్ధ భగవానుని ధాతువు నిక్షిప్తమైయుండటమేనని తెలియచేసింది. తంత్రయానము నందలి

ముఖ్యసూత్రములలో "వజ్ర శిఖర" సూత్రమనే దొకటి. ఇది చాలాముఖ్యమైనది. క్రీ.శ. ఏడవశతాబ్దపు ఉత్తరభాగములో ఈసూత్ర రచన జరిగి ఉంటుంది. ఈ సూత్రములో అనేక గుహ్యకర్మలను (రహస్య క్రియలు) విశదీకరించ బడినవి. వీటి ఆచరణ వలన మనస్సు నేరుగా బుద్ధత్వమునందు ప్రవేశిస్తుంది. అంతేకాక, సాధకుడు తనంతట తాను ఐదు సమాధి దశలను అనుభవించుట ద్వారా తానే బుద్ధుడగు మార్గమును వర్ణించింది. ఈ విధమైన కర్మాచరణయొక్క గమ్యము, తాను అర్చించు బుద్ధునిగా తానే పరివర్తనచెందుట. ఈ భావన వైదికులు ఆచరించు రుద్రార్చనను పోలి యున్నది. రుద్రార్చన చేయదలచిన భక్తుడు, తానే ముందు రుద్రునిగా పరివర్తన చెందాలి. "నరుద్రో రుద్ర మర్చ్యతే" అని శాస్త్రము. ఆ కారణముగానే రుద్రార్చనకు ముందుగా బోధాయనుని రచనయైన మహన్యాసమును పఠించుచూ రుద్రార్చకులు, రుద్రుని తమపై ఆహ్వానించుకొని, తామే రుద్రులమనే అనుభూతిని పొందుతారు. పైన పేర్కొన్న తాంత్రికయాన సూత్రము టిబెట్టునందు బహుళ ప్రచారమును పొంది నది. వజ్రయానములో మరో ముఖ్యమైన వ్యవస్థ గురువు. గురుభావన మహాయాన సంప్రదాయము నందలి బోధిసత్త్వారాధన నుండి గ్రహింపబడినది. మోక్షమును ఆకాంక్షించేవారు, ఆరు బీజాక్ష రములను నేర్చుకొని వాటిని మననము చేస్తూ ఉండాలి. అవలోకితేశ్వరుడనే బోధి సత్త్వుడు, బాధలను అనుభవిస్తున్న మానవాళిపై దయతో అనుగ్రహించిన మంత్రము "ఓం మణి పద్మేహం". ఈ మంత్రమును పద్మాసనాసీనుడై సాధకుడు నిత్యమూ జపించాలి. శైవమునందు కూడా "ఓం నమః శివాయ" అనే షడాక్షరీ మంత్రమున్నది. దీనిని బట్టి శైవమునకు, తంత్రయాన బౌద్ధమునకు మధ్య అనుబంధమున్నట్లు భావించవచ్చును. అదేవిధంగా హిందూమత శాఖలైన శైవ, వైష్ణవ, శాక్త సంప్రదాయములకు సంబంధించిన, దేవీ దేవతలు, మంత్రములు కూడా తాంత్రిక బౌద్ధములో దర్శనమిస్తాయి. ఉదాహరణకు పద్మా సనాసీనుడై, ప్రవచనము చేస్తున్నట్లు (బోధిస్తున్నట్లు) ఉండే బుద్ధప్రతిమ, విజ్ఞాన ప్రతిరూపమైన దక్షిణమూర్తివలె కన్పిస్తాడు. పై కారణములను బట్టి తాంత్రిక బౌద్ధులు, వైదిక ధర్మమునందలి దేవతలను, మంత్రములను అనుకరించి, అవసరమైన మార్పులను చేసికొన్నట్లుగా నమ్మవలసి వస్తుంది. "కరండవ్యూహ్య" అనే గ్రంథములో అవలోకితేశ్వర బోధిసత్త్వునకు, అనేక వేల చేతులు, కళ్లు, ఇతర అవయవములు ఉన్నట్లు వర్ణించుట జరిగినది. ఆయన వంటినిండా కోట్లాది రోమ కూపములు, ఆ

రోమ కూపముల నుండి అనేకానేక బుద్ధులు, దేవీ దేవతలు ఇతర సంపదలు ఉద్భవిస్తున్నట్లూ, సూర్య చంద్రాదులు ఆయనే నేత్రములుగానూ, భుజములనుండి నోటినుండి వరుసగా బ్రహ్మ, విష్ణువు, సరస్వతి జన్మించినట్లుగానూ వర్ణన చేయ బడింది. ఈ వర్ణనను గమనిస్తే భగవద్గీతలో అర్జునునకు దర్శన మిచ్చిన, విరాట్స్వ రూపుడైన భగవానుడు తలంపునకు వస్తాడు.

పురాతత్త్వ పరిశోధకులు ఆంధ్ర దేశమునందలి అనేక బౌద్ధ క్షేత్రాలలో జరిపిన తవ్వకాలలో, వజ్రయానమునకు సంబంధించిన ప్రాచీన అవశేషాలెన్నో వెలికి వచ్చినవి. శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం, గుంటూరు జిల్లాలోని నాగార్జునకొండ, కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపేట, మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం ఆదిగాగల పలు ప్రాంతములలో, పద్మాసనాశీనుడైన బుద్ధ ప్రతిమలు, ఆయనను పరివేష్టించి యున్న యక్షులు, బోధిసత్త్వులు, ఇతర అనుచరవర్గమూ, సితార, మంజుశ్రీ, మరీచి, రత్నసంభవ, సింహనాద, అవలోకి తేశ్వర, మంజుఘోష, దండతార, మహశ్రీతార, వంటి దేవతా ప్రతిమలు లభించినవి. హిందూ మతములోని దేవతాగణములను పోలిన దేవతలను సృష్టించటం, హిందువుల వలెనే ఆ దేవతలను షోడశోపచారము లతో పూజించటం, హిందూ దేవతలకు ఆపాదించినట్లుగా మానవాతీతశక్తులను వజ్రయానములోని దేవతలకుకూడా ఆపాదించటం వంటి కార్యములవలన, హిందూ మతములో పౌరాణిక దేవతా సృష్టినీ భక్తి మార్గమును ప్రవేశపెట్టినట్లుగానే, వజ్ర యానులు కూడా హిందూ మత సంప్రదాయములను అనుకరిస్తూ చేపట్టిన కార్యక్రమ ములు, ప్రజాబాహుళ్యములో బౌద్ధము కోల్పోయిన స్థానమును తిరిగి సంపాదించుట కొరకు చేసిన ప్రయత్నమేనను భావము కలుగుతుంది. ఈ పరుగు పందెములో హైందవుల భక్తి మార్గము విజయమును సాధించి, బుద్ధుని, విష్ణువు యొక్క దశావ తారములలో ఒకనిగా చేసుకొని, ఆయన మతమును భారతదేశ సరిహద్దుల ఆవలికి తరిమివేసింది. చావుదెబ్బ తిన్న బౌద్ధము తన జన్మ భూమిని వదలి వలసపోయింది.

సైనిక ధోరణిలో వీరశైవులు, వైష్ణవులు చేపట్టిన భక్తి ప్రచారము, ఆంధ్ర దేశములో జైన, బౌద్ధ మతములకు నిలువనీడ లేకుండా చేసినవి. అనేక బౌద్ధ చైత్యములు, విహారములు, శివాలయములుగానూ, వైష్ణవాలయములుగానూ మార్చ బడినవి. ఆంధ్ర దేశములో పంచారామములుగా ప్రఖ్యాతి చెందిన ఐదు శివాలయ

ములూ, ఒకప్పుడు బౌద్ధారామములే. ఒకవైపు తీవ్రమైన సంక్షోభమును ఎదుర్కొంటూ, బౌద్ధము ఆంధ్రదేశములో తన అస్తిత్వమునే కోల్పోవుచున్న దశలో, ఇతర బౌద్ధా రామముల యందున్న భిక్షువులు భిక్షుణిలు, శ్రమను ఎరుగని విలాస జీవితములకు అలవాటు పడి సాధన నెపముతో అలౌకిక శక్తులు పొందటానికి లైంగిక కార్యములలో నిమగ్నులై ఉండేవారు. వజ్రయానము వ్యాప్తి చెందిన కొద్దీ వారి లైంగిక సుఖాపేక్ష మితిమీరి, బౌద్ధ సంఘమునకు చెందినవారితోనే గాక, బయట వారితోకూడా వారు కామక్రీడలు జరుపుటకు పాల్పడినారు. ఈవిధమైన వ్యభిచారవృత్తిని పాటిస్తూ, ధనార్జనకూడా చేశేవారు. విహారములలో జరుగుతున్న, నీతిబాహ్యామైన కార్య కలాప ములను తెలిసికొన్న సామాన్య ప్రజలు బౌద్ధ భిక్షువులు, భిక్షుణిలనే గాక, బౌద్ధ మతస్థుల నందరినీ, ఏవగించుకొనుటయే కాక, బౌద్ధారామములన్నిటినీ "లంజదిబ్బ" అని నించిందేవారు. బౌద్ధావశేషములుగా మిగిలిన దిబ్బలను ఈనాడు కూడా ఆ ప్రాంత ప్రజలు లంజదిబ్బలనే వ్యవహరిస్తారు. అనైతికమూ, నీతిబాహ్యామైన కార్యము లను బౌద్ధులు ఆచరించుటకుగల కారణములను వివరిస్తూ రాహుల్ సాంకృత్యాయన పండితులు ఈ విధంగా చెప్పారు. బౌద్ధవిహారములూ, చైత్యములూ సంపన్నులు ఇచ్చిన విరాళములతో ధనవంతమైనవి. సామాన్యుని జీవితము కంటె బౌద్ధభిక్షుని జీవితము శ్రమరహితము, సుఖప్రదమైనది. దానితో క్రమశిక్షణా రాహిత్యము పెచ్చు పెరిగినది. అనర్హులైన ఎందరోవ్యక్తులు బౌద్ధసంఘములో ప్రవేశించారు. సుఖమైన జీవితమూ, సాంస్కృతిక కళ అనే ముసుగులో, కామోద్రేకమును కలిగించు, చిత్రములూ, ధ్యాన పద్ధతులూ, దేవీ దేవతా విగ్రహములు, వారి మనసులలో లైంగిక వాంఛలను ప్రకోపింపచేసేవి. బౌద్ధులు తాంత్రిక ప్రక్రియలను చేపట్టుటకు ముఖ్య కారణము, క్షీణిస్తున్న బౌద్ధమతాదరణను అరికట్టి, ఆ మతమునకు పూర్వ వైభవము కల్పించ వలెనని. కానీ వారి ప్రయత్నములు వారి ఆశయములకు పూర్తిగా వ్యతిరేకమైన ఫలితములను ఇచ్చినవి. ఆ కారణముగా బౌద్ధము ద్వేషించబడినది. బౌద్ధులు అస హ్యించు కొనబడినారు.

బౌద్ధ భిక్షువుల నీతిబాహ్యామైన ప్రవర్తన ఫలితంగా, బౌద్ధము ఆంధ్రదేశములో అదృశ్యమై, కాలక్రమేణ జన్మభూమిని విడచివెళ్లవలసి వచ్చింది. బౌద్ధము యొక్క నైతిక పతనమునకూ, దాని అదృశ్యమునకు, ఇతర మతములవారిని ముఖ్యంగా

హిందూ మతస్థులను విమర్శించుట, నిందించుట ఆత్మవంచనగా భావించవలసి ఉంటుంది. వాస్తవముగా ఆలోచిస్తే, తాంత్రిక బౌద్ధము పరోక్షంగా హిందూ మతము నకు లాభము చేకూర్చిందనే చెప్పాలి. ఆ రెండు మతముల మధ్యనున్న వైరుధ్యములు క్షీణించినవి. ఎవియట్ పండితుడు చెప్పినట్లు విదేశములనుండి వచ్చిన శకులు, హూణులు, కుషాణులవంటి వారికి తాంత్రిక బౌద్ధము ఒక వాహనమువలె పనిచేసి, పౌరాణిక యుగములో, వారందరూ హైందవులు అగుటకు దోహదము చేసింది. ఆ విధంగా హిందూమత వ్యాప్తికి కారణభూతమైనది. హైందవుల మరియు తాంత్రిక బౌద్ధుల దేవీ దేవతా ప్రతిమలనూ ఆరాధనా విధానములను విశ్లేషిస్తే పై విషయము స్పష్టంగా అవగతమౌతుంది. దాస్ గుప్త చెప్పిన విధంగా, అతి బౌధిక శాస్త్రపరంగా గానీ, పౌరాణికంగాగానీ, బౌద్ధ, హైందవ తాంత్రిక సంప్రదాయము లలో భేదములు లేవు. తాంత్రిక బౌద్ధములో ఆరాధించిన అనేకమంది దేవతల పేర్లను ముద్రలను మార్చి, హిందూమత దేవతలనుచేశారు. కాబట్టి బుద్ధుని విష్ణువు యొక్క తొమ్మిదవ అవతారముగా మార్చటంలో ఆశ్చర్యపడనవసరములేదు. బోధిసత్త్వుడైన అవలోకితేశ్వ రుడు, ధ్యానబుద్ధులైన, అమితాభుడు, వైరోచనుడు, ఆదిత్యగణములైనారు. వజ్రయాన దేవతలకు శైవ సంప్రదాయములోని దేవతామూర్తులకు మధ్య అనేక విధములైన పోలికలు కనిపిస్తవి. అవలోకితేశ్వర నామమునకు 'దృష్టిగురు' అనే శివుని నామము నకు భాషారీత్యా సమానార్థం స్ఫురిస్తుంది. శివుడు హాలాహలమును మ్రింగి నీలకంఠుడైనాడు. వజ్రయానంలో హాలాహల నాథుడనే పేరుతో ఒక దేవుడున్నాడు. అతనికి కూడా శివునివలె మూడు కన్నులూ, జటాజూటము, నెత్తిపై చంద్రరేఖ, పులిచర్మధారణ వంటి శివుని ఆహార్యము సర్వమూ వజ్రయాన దేవునిక్కూడా ఉన్నవి. మరొక వజ్రయానదేవుడు కపాలమాలాధరుడు, భస్మలేపనుడు. అదేవిధంగా మహా యాన శాఖకు చెందిన 'లలిత విస్తర" అనే గ్రంథములో బుద్ధుని నారాయణుడనీ, మహా నారాయణుడనీ వర్ణించినవి. 'కారండ వ్యూహ' మనే గ్రంథములో అవలోకితేశ్వ రుని వర్ణన, పురుష సూక్తములోని విరాట్పురుషుని వర్ణనతో సరితూగుతుంది. వజ్రయానము నందలి స్త్రీ దేవతా స్వరూపములు, హిందువుల, శాక్త సంప్రదాయము లోని దేవతలు దాదాపుగా ఒకటిగానే కనిపిస్తవి. విగ్రహముల చేతులు, వాటి ముద్రలు, ఆయుధములు, వాహనములు అన్నీ సన్నిహితమైన పోలికలు కలిగి

ఉంటవి. ఇక సాహిత్య విషయానికొస్తే 'తారా అక్షోభ్య సంవాదము'అనే వజ్రయాన గ్రంథమును "శివశక్తి సంగమ తంత్ర"మని కూడా పిలుస్తారు. అంటే శివ అక్షోభ్యు లకు, తారాశక్తులకు భేదము లేదన్నమాట. వాఖ్యాన ముద్రలోని బుద్ధ విగ్రహమునకు, వటవృక్ష ఛాయలో పద్మాసనాశీనుడై, ముద్రావితః పాణియై శిష్యులకు బోధచేస్తున్న మేధాదక్షిణామూర్తి విగ్రహమునకు భేదమే కనుపించదు. ఈ విషయము ముందు తెలియజేయబడింది. ఇక యోగశాస్త్ర విషయంలో, శైవులకు, వైష్ణవులకు, మహాయాన వజ్రయాన సాంప్రదాయకులైన బౌద్ధులకు, మధ్య తేడా కనుపించదు. శివుడు మహా యోగి, నారాయణుడు కూడా యోగి. భగవద్గీత "యోగేశ్వరో కృషిః" అని వర్ణిస్తుంది.

క్రీ.శ. 8వ శతాబ్దమునాటికి పౌరాణిక దేవతలకు, వజ్రయాన దేవతలకు మధ్య కనుపించీ, కనుపించకుండా, కొనసాగుతూ వస్తున్న సరిహద్దు రేఖ పూర్తిగా అదృశ్యమైపోయింది. దానితో బౌద్ధమతము ఆంధ్రదేశములోనే కాక యావత్భారతము లోనూ క్షీణించి, అస్తిత్వమును కోల్పోయి, చివరకు అదృశ్యమై పోయింది. దీనికి కారణము పండితులలోనూ, చరిత్రకారులలోనూ వివాదాస్పదమైనది. కొందరు పండితులు, చరిత్రకారులు తాము హేతువాదులమనీ, సర్వమత సమానత్వమును పాటించేవారమని చెప్పుకుంటూ, బౌద్ధమత అదృశ్యమునకు కారణం హైందవుల అబద్ధ ప్రచారము, హింసాయుత చర్యలని పనిగట్టు కొని ప్రచారం చేయటం ఆధునిక యుగంలో పరిపాటిగా మారింది. కుహనా విమర్శ అభ్యుదయ భావన వారు భ్రమ పడుతున్నారు. కానీ చారిత్రకమైన వాస్తవమేమంటే, రాజుల, సంపన్నుల, వ్యాపారుల, విరాళములతో, సామాన్య ప్రజలను ఆకర్షించి, సంఖ్యా బలమునుపెంచుకొని, షుమారు 600 సంవత్సరముల పైచిలుకు ఆంధ్ర దేశంలో బౌద్ధము ఏకైకమతంగా చెలామణియైనది. విహారములలో శ్రమలేని విలాస జీవితమునకు అలవాటుపడిన బౌద్ధ భిక్షువులు క్రమశిక్షణను కోల్పోయారు. మత ప్రచారమును విడచి అంతః కలహముతలతో కాలక్షేపం చేశారు. శాఖోపశాఖలుగా చీలిపోయారు. ఆధిక్యత కొరకు కుమ్ములాటలకు దిగారు. వజ్రయానము ప్రబలిన తరువాత విహారములను వదలిరాకుండా సాధన నెపముతో లైంగిక సంపర్కమునకు అలవాటుపడ్డారు. ప్రజల విశ్వాసమును కోల్పోయారు. వారిచే అసహ్యించుకొనబడినారు. రాజాదరణ, సంప న్నుల విరాళములు లభించక పోవటం చేత, ఎండిపోయిన చెరువులోని చేపలవలె

అదృశ్యమైనారు. ఇది చారిత్రక సత్యము. దీనిని మరుగు పరచి ఇతర మతములపై విద్వేష ప్రచారము చేయటం సబబుకాదు.

ఇంకొక ముఖ్య విషయం తెలియజేసి ఈ వ్యాసమును ముగిస్తాను. అద్వైత మత స్థాపనకు బీజములు నాటిన గౌడ పాదాచార్యులవారు, మాండ్యూకోపనిషత్తుపై వ్రాసిన కారికలో బుద్ధ భగవానునికి వందన శత సమర్పణ చేశారు.

**శ్లో॥ జ్ఞానాకాశ కల్పేన ధర్మం యోగ గగోపమమ్ ।**
**జ్ఞేయ భిన్నేన సంబుద్ధః శతం వన్దే ద్విపదాం వరమ్ ॥**

■ ■ ■

# జైన తాత్త్వికులు

# ఆంధ్ర దేశంలో జైనమత ప్రవేశము-అభివృద్ధి

"పట్టావళి"అనే జైన ఇతిహాస గ్రంధములో, తెలుగుదేశములో జైన మత ప్రవేశము బౌద్ధముకంటె ముందుగా జరిగినట్లు వ్రాయబడింది. ప్రచారములో నున్న గాధలనుబట్టి ఇరువది నాలుగు తీర్థంకరులలో ఒకడైన ఋషభనాధునికి ఆంధ్ర దేశముతో సంబంధమున్నట్లు తెలుస్తున్నది. ఆయనకు ఇద్దరుపుత్రులు, భరతుడు, బాహుబలి. బాహుబలిని గోమతేశ్వరుడని కూడ పిలిచేవారు. ఆయన పోదన (పౌదన్య పురము–బోధన్, నిజామాబాద్ జిల్లా) రాజధానిగా అస్సక రాజ్యపాలన చేస్తూండే వాడు. అస్సక రాజ్యము అనంతర కాలములో, శాతవాహనుల ఆంధ్ర సామ్రాజ్య ములో కలసిపోయింది. పోదనపురంలో 525 ధనస్సుల ఎత్తు కలిగిన బాహుబలి విగ్రహము ఆకాలములో ఉండేదట. ఆ విగ్రహమును చూచి ముగ్ధుడైన పశ్చిమ గాంగులరాజైన రాచమల్ల సత్యవాక్యుని మంత్రి చాముండరాయడు, క్రీ.శ. 988 సంవత్సరవనందు కర్ణాటకమునందలి శ్రావణ బెళగోలలో గోమతేశ్వరుని విగ్రహ మును ప్రతిష్ఠించాడట. బోధన పట్టణమునందు జరిపిన పురాతత్త్వ పరిశోధనలలో తూర్పు చాళుక్యుల ముసినికొండ శాసనమునకు (క్రీ.శ. 718, 752) పూర్వమువైన జైనావశేషములు లభించుట వలన జైన మతము పై శాసనమునకు పూర్వమే ఆంధ్ర దేశములోఉన్నట్లు ధృడపడుచున్నది. హరిభద్రాచార్యుడు 'ఆవశ్యక సూత్ర' వ్యాఖ్యానములో, వర్ధమానమహావీరుడు జైనమత ప్రచారమునకై శ్రావస్తినుండి

బయలుదేరి హతసిష, తోసలి లేక ధౌళి (ఒరిస్సా) నగరముల గుండా మోసలి (మచిలీపట్నం) చేరి సముద్రము నందు ప్రయాణముచేసి, కళింగ దేశమునందలి రేవు పట్నమునకు తిరిగి చేరినట్లు తెలియజేశాడు. హరిభద్రుని "హరివంశ పురాణము", ఖారవేలుని "హాతిగుంఫ శాసనము"లోని పదునాలుగవ పంక్తి "సినేవసి కరోతి తేర సమేచ వసేసుపవత విజయ చక్రే కుమారీ పవతే అరహితే (హి) పఖిన సం(సి) తేహి" ఆధారంగా మహావీరుడు ఉదయగిరి (కుమారీ) పర్వతము (ఒరిస్సా) పై నివశించి, జైన మత ప్రచారం జరిపినట్లు ధృవీకరించినాడు. నయన సేనుని "ధర్మామృత" మనే కన్నడ గ్రంథములోనూ, హరిసేనుని బృహత్కథా కోశము అనే గ్రంథములలో కూడా, కృష్ణానదీ లోయలో జైనమత వ్యాప్తి జరిగినట్లు వ్రాయబడినది. మౌర్యచంద్ర గుప్తుని ఆస్థానములో గ్రీసు దేశ రాయబారియైన మెగస్తనీసు వ్రాసిన "ఇండికా"అనే గ్రంథమునందు, తుంగభద్రానదీ తీరములో దిగంబరులైన సాధువులు తిరుగుతుండేవారని వ్రాశాడు. వారు జైనమతమునందలి దిగంబర శాఖకు చెందిన సాధువులుగా చరిత్రకారులు భావించారు. పైన వివరించిన, అంశములను ఆధారంగా చేసుకొని, జైన మతము క్రీ.పూ. 4వ శతాబ్దమునకే ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతములలో విస్తరించి ఉన్నట్లు తెలుస్తున్నది. ముందుగా తెలియజేసిన సాహిత్యాధారములనూ, ఖారవేలుని "హాతిగుంఫ" శాసనమూ, గుంటుపల్లి (పశ్చిమ గోదావరి జిల్లా) శాసనములు పై విషయమును ధృడ పరుస్తున్నవి. "హాతిగుంఫ" శాసనము నందు, క్రీ.శ. 400 సంవత్సరములో మగధను పాలించిన నందవంశపురాజు కళింగముపై విజయము సాధించి, స్మృతి చిహ్నంగా తీసుకు వెళ్లిన తీర్ధంకరుని విగ్రహమును ఖారవేలుడు తిరిగి తీసుకు వచ్చినట్లుగా లిఖించబడినది. కళింగము లోని జైనులు, పదవ తీర్ధంకరుడైన శీతలనాధుని ఆరాధించినట్లు తెలుస్తున్నది. శీతలనాధుని జన్మస్థలము భాదలపురి (నేటి భద్రాచలము)గా గుర్తించినారు. ఆ కాలమునందు అది కళింగ రాజ్యములో భాగమై ఉండేది. గుంటుపల్లిలో లభించిన శాసనములు క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందినవి. వాటినిబట్టి వేంగీరాజ్యములో కూడా జైనమత వ్యాప్తి జరిగినట్లు తెలుస్తున్నది. ఈనాడు బౌద్ధుల విహారములుగా పరిగణింప బడుచున్న వడ్డమాను, గుంటుపల్లి (నేటి జీలకర్రగూడెం-ప.గో.జిల్లా)లోని గుహలు మొదట్లో జైనులవనీ, అనంతరము అవి బౌద్ధుల ఆక్రమణకు గురియైనట్లు తెలుస్తు

న్నది. పైన వివరించిన సాక్ష్యాధారములను బట్టి, ఇంతవరకూ భావిస్తున్నట్లుగా జైనమతము ఆంధ్రదేశాక్రమణకు వచ్చిన కర్ణాటక సైన్యముల వెంటగాక, మగధనుండే సరాసరి కళింగ దేశము ద్వారా, క్రీ.పూ. నాలుగు, మూడు శతాబ్దములలో అనగా బౌద్ధ మతమున కంటే కొంచెం ముందుగానే ఆంధ్ర దేశములో ప్రవేశించునట్లు తెలుస్తున్నది. తొలిరోజులలో బౌద్ధులు, జైనులమధ్య ఘర్షణలు జరిగినట్లు గుంటుపల్లి చరిత్రను బట్టి తెలుస్తున్నది. జైన బసదియైన గుంటుపల్లి గుహలను బౌద్ధ మతస్తులు ఆక్రమించారు. భట్టిప్రోలు (ప్రతీపాల పురము) బౌద్ధారామములను జైనుడైన ఖార వేలుడు, గాడిదలు కట్టబడిన నాగళ్లచే నేలమట్టం చేశాడు. అమరావతీ సమీపము లోని వడ్డమానులోని జైనుల నిర్మాణములను, బౌద్ధులు కూల్చి స్థూపములను నిర్మిం చారు. ఈ విధంగా బౌద్ధ, జైనుల మధ్య ఆంధ్ర దేశంలో అనేక ప్రాంతములలో సంఘర్షణలు జరిగి జైన నిర్మాణములను ధ్వంసం జేయటం జరిగింది. ధాన్యకటకము నకు చుట్టుప్రక్కల, శ్రీపర్వత ప్రాంతములలోనూ బౌద్ధము ఉధృతంగా విజృంభించి ఆంధ్ర దేశములో ఏకైక మతంగా వర్ధిల్లుతున్న రోజులలోవారి ధాటికి తట్టుకొనలేక, జైనము నివురుగప్పిన నిప్పులా, పునర్జీవనమునకు అవకాశముల కొరకు ఎదురు చూస్తూ సాత్వికంగా మనుగడ సాగించింది. బౌద్ధమత క్షీణత ప్రారంభించగానే, ఆ స్థానమును తను ఆక్రమించవలయునని తీవ్ర ప్రయత్నములు ప్రారంభించింది. ఆ ప్రయత్నములకు ఆంధ్రదేశమును ఏలిన కొన్ని రాజవంశములు సహాయ సహకార ములు అందజేసినవి. ఆంధ్రదేశపు తీరప్రాంతములో జైనమత వ్యాప్తికి తూర్పు చాళుక్యులు ఎంతో ప్రోత్సాహమిచ్చారు. మూడవ విష్ణువర్ధనుని పట్టపు రాణి బెజ వాడలో నెడుంబది వసది (క్రీ.శ. 624–42) నిర్మించి జైనులకు దానం చేసింది. ఆమె భర్తతో కలసి చేసిన దానములను ముసినికొండ శాసనము పునరుద్ఘాటించింది. పశ్చిమ ఆంధ్రములో రాష్ట్రకూటులు, కళ్యాణి చాళుక్యులు కూడా ఎన్నో విధములైన సహాయములు చేశారు. భక్తి మార్గమును ప్రబోధిస్తూ జన బాహుళ్యములోనికి చొచ్చుకుపోతున్న హిందూ మత వ్యాప్తిని అరికట్టటానికి, పైన వివరించిన రాజ వంశముల సహాయముతో తీవ్ర ప్రయత్నములు సలిపినప్పటికీ, కాకతీయ గణపతి దేవుడు(క్రీ.శ.1199–1261) శైవమత స్వీకారముచేసి దానిని ఆదరించి ప్రోత్స హించటం, జైనమతమును నిర్లక్ష్యము చేయుటవల్ల, వారి ప్రయత్నములు విఫలమైనవి.

అయితే జైనమతము ఉన్నత దశను అనుభవించిన కాలములో, ఆంధ్రదేశ మంతటా విస్తరించింది. తీర్థంకరులకు పెద్ద సంఖ్యలో దేవాలయములు, జైన సాధువులకు బసదులు గ్రామగ్రామమున ఉండేవి. మొదటిలో పురాతత్త్వ పరిశోధకులు ముఖ్యంగా పాశ్చాత్యులు వీటిని 'బౌద్ధ' చైత్యములుగానూ, విహారములుగాను భావించారు. అనంతరము వారు తప్పుతెలుసుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వముల వారు ఆంధ్ర దేశములో జరిపిన కొద్దిపాటి తవ్వకములలోనే వందలాది జైనావశేషములు బయట పడినవి.

రామతీర్థం (విజయనగరం జిల్లా), పిఠాపురం, ఆర్యావతం, తాటిపాక, నెదునూరు, ఆత్రేయపురం, వొల్ల (తూ.గో. జిల్లా), గుంటుపల్లి, పెనుకొండ, భీమవరం, అత్తిలి (ప.గో. జిల్లా), బెజవాడ, గుడివాడ, చల్లపల్లి, కంభంపాడు (కృష్ణా జిల్లా), అమరావతి, వడ్డమాను, చేబ్రోలు, భట్టిప్రోలు, తెనాలి, బాపట్ల, కొల్లూరు, నర్సరావుపేట (గుంటూరుజిల్లా), మార్కాపురం (ప్రకాశం జిల్లా), భద్రాచలం (ఖమ్మం జిల్లా), కొలనుపాక, సైదాపురం (నల్గొండ జిల్లా), హనుమకొండ (వరంగల్లు జిల్లా), ధర్మపురి, వేములవాడ, కూరకాయల (కరీంగనర్ జిల్లా), జెడ్చర్ల, పూరూరు, ఉజ్జిలి, మక్తల్ (మహబూబ్నగర్ జిల్లా), బోధన్ (నిజామాబాద్ జిల్లా), కొనకొండ్ల, అమరాపురం, పాతశివారం (అనంతపురం జిల్లా), రాయదుర్గం, సిద్ధవట్టం, దానవులపాడు (కడప జిల్లా), పట్టాన్ చెరువు (మెదక్ జిల్లా), కర్నూలు, నయకల్లు, ఆదోని (కర్నూలు జిల్లా)ల యందు జరిపిన త్రవ్వకాలలో జైనదేవాలయ బసదుల అవశేషాలు, తీర్థంకరుల విగ్రహాలు, ఇతర ప్రతిమలు, పూజాసామాగ్రి వంటివి అశేషంగా లభించినవి. ఇంకా ఎన్నో దేవాలయములు, విగ్రహములు మతావేశపరుల చేతులలోనూ, సంస్కృతీ, సంప్రదాయముల పట్ల అవగాహనలేని వ్యవసాయదారులు, సామాన్య ప్రజల చేతులలోనూ నాశనమై పోయినవి. ఇవిగాక ఇంకా ఎన్నో ప్రదేశములలో జైనావశేషములు ఉన్నట్లు చారిత్రక ఆధారములు లభించినవి. కానీ ఇంకా త్రవ్వకములు చేపట్టలేదు.

నయన సేనుని 'ధర్మామృత' గ్రంథం ద్వారా, ఆంధ్ర దేశమునగల జైన దేవాలయములు, బసదులను గురించిన వివరములు, తెలుస్తున్నవి. ఆధిక్యత కొరకు, బౌద్ధ, జైన మతములు పోటీపడటం, పెక్కు సంఘర్షణలకు దారితీయటం, రాజుల ప్రోత్సా

హము, ఆర్థిక పుష్టి, జనాదరణ ఎక్కువగా కలిగియున్న బౌద్ధము, జైనమతమును అణగద్రొక్కటం, అనేక మంది జైనులను బౌద్ధులుగా మార్చటంవంటి అనేక సంఘటనలు పై గ్రంథములో వివరింపబడినవి. అశోకుని అనంతరం ఆయన మనుమడైన సంప్రతి మగధ రాజై తాతగారు బౌద్ధమును అభిమానించినట్లుగా తాను జైనమును ఆదరించి, ప్రోత్సహించి కొనూపిరితో కొట్టుమిట్టాడుతున్న జైనమతమును పునర్జీవింప చేశాడు. శ్వేతాంబరులు, దిగంబరులు, యాపనీయులు అనుమూడు శాఖలుగా చీలిన జైనమతము ఆంధ్రదేశములో క్రీ.శ. 7వ శతాబ్దమునుండి 13వ శతాబ్దము వరకు వర్ధిల్లినది. దురదృష్టకరమైన విషయము ఏమంటే సుమారు ఒక సహస్రాబ్దము ఆంధ్రదేశములో అస్తిత్వము కలిగిన జైన మతమును గురించి తెలుగులో వ్రాసిన ఒక్క గ్రంథము కూడా లభించక పోవుట ఆశ్చర్య కరము. ఈ విషయముపై భావరాజు వేంకట కృష్ణారావుగారు వెలిబుచ్చిన అభిప్రాయ మేమంటే మతావేశంతో మూఢులై ఒకరి మత గ్రంథములను మరొకరు నాశనము చేయటం వల్ల ఆంధ్రభాష, సాహిత్యము, విలువైన గ్రంథములను కోల్పోవుటయే గాక, మన తమిళ సోదరులతో పోల్చుకుంటే, సాహిత్యపరంగా వేయి సంవత్సరములు వెనుకబడినాము. ఆదికవియని కీర్తి పొందిన నన్నయ ఆంధ్ర మహాభారతమును తెనుగున అనువదించువరకూ, తెలుగు సాహిత్యమునందు చెప్పుకొనదగిన గ్రంథమే లేకపోయింది. అదికూడా అనువాద గ్రంథమే కానీ స్వతంత్ర రచన కాదు. సంస్కృత పద భూయిష్టము.

**జైన సంఘము :**

జైన మతగ్రంథములు, వర్ధమాన మహావీరుడే జైన సంఘమును స్థాపించినట్లు తెలియజేస్తున్నవి. దీనిని మూల సంఘమని పిలుస్తారు. మహావీరుని జీవిత కాలములోనే స్థాపింపబడిన సంఘమునందు 14,000మంది సాధువులు ఉండేవారు. వారికి ఇంద్రభూతి గౌతముడు అధిపతి. 33,000 సాధ్వీణులు ఉండేవారు. వారికి చందన పెద్ద. 1,59,000 మంది శ్రావకులుండేవారు–శంకశతకుడు వారి అధిపతి. 3,18,000 మంది శ్రావికలు (స్త్రీలు) ఉండేవారు. సులక–దేవతలు వారి అధిపతులు. మునులు 1,300 మంది, సాధువులు 700 మంది, ముక్తులు 700, మేధావులు 500 మంది, ఆచార్యులు 400, శ్రమణికలు 1400 మంది, సిద్ధులు 500 మంది ఉండేవారట. ప్రధానంగా ఈ సంఘము నాలుగు తరగతులుగా విభజింపబడినది

(1) యతులు, లేక మునులు లేక సాధువులు. వీరు జిన ధర్మమును అనుసరించి దీక్షను గ్రహించినవారు; (2) అజికలు లేక సాధ్విలు. వీరు స్త్రీలు, సన్యాసదీక్షను స్వీకరించినవారు; (3) శ్రావకులు–వీరు సన్యాసమును స్వీకరించని సామాన్య భక్తులు; (4) శ్రావికలు–వీరుకూడా సన్యసించని సామాన్య భక్తులు. జైన సంఘముకూడా విస్తృతంగా క్రమబద్ధీకరించబడి, బౌద్ధ సంఘమువలెనే స్థానిక, ప్రాంతీయ ఆచారములు సంప్రదాయములు అలవాట్లను ఆధారముగా చేసుకొని విభజింపబడినది.

బౌద్ధ సంఘములో వలెనే కాలక్రమములో జైన మతములో కూడా అనేక చీలికలు తలెత్తినవి. శ్రావణ బెలగోలాలోగల శాసనములో వీటి వివరములు ఈయబడినవి. అయితే పండితుల అభిప్రాయం ప్రకారం ఈరకమైన విభజన కేవలము నామమాత్రమే.

జైన సంఘమును తొమ్మిది గణములుగా విభజించి పదకొండుమంది గణధరులను నియమించారు. ఇంద్రభూతి, అగ్నిభూతి, వాయుభూతి, ఆర్యవ్యక్త స్థవిరుడు, ఆర్యసుధర్మ స్థవిరుడు, మండిక పుత్రస్థవిరుడు, మౌర్య పుత్రస్థవిరుడు, అకంపిత స్థవిరుడు, అచలభార్తృ స్థవిరుడు, మేతార్య స్థవిరుడు, ప్రభాస్థవిరుడు గణధరులు. వీరిలో కొంతమంది ఒక గణమునకు మించి గణధరులుగా ఉన్నారు. ఈ గణధరులందరూ పవిత్ర జీవనమును గడుపుతూ, కేవలులు (బౌద్ధుల నిర్వాణము) గావటమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నవారు.

ఆంధ్రదేశములోని శాసనములందు తరచుగా కనిపించే గణముల పేర్లు:

1. కావూరి; 2. వాహోరి; 3. కోవిమాయవ; 4. కలులూప; 5. బాలార్క; 6. దేశి; 7. కానూరి; 8. సేన; 9. సింహ. పై తొమ్మిది గణములే కాక యాపనీయ, గౌలి, ద్రవిడ సంఘములు కూడా ఆంధ్ర దేశములో ప్రాచుర్యత పొందినవి. గణధరులు ముఖ్యమైన ఐదు గుణములను కలిగియుండాలి. 1. జ్ఞానము; 2. దర్శన (విశ్వాసము); 3. చరిత్ర (మంచి నడత); 4. తపస్సు; 5. వీర్య (శక్తి). వారు దీక్షాసమయము నందు ఏ గణమునకు చెందియున్నారో జీవితాంతము ఆ గణమునకే విధేయులై యుండాలి కానీ గణములను మార్చకూడదు. ఆ విధంగా మారినవారిని చిన్నచూపు చూడటం జరుగుతుంది.

గణములు, గచ్ఛలుగా విభజింపబడినవి. కొందరు పండితుల అభిప్రాయము ప్రకారము కాలం గడుస్తున్నకొద్దీ గచ్ఛయే గణమునకు పర్యాయ పదముగా వాడబడి నట్లు తెలుస్తున్నది. గచ్ఛపదము గణమునకు పర్యాయ పదముగా వాడబడి, ఏకాచార్య పరివరహ అని పిలవబడినది. బౌద్ధమతమునందు ఆచార్యులపేర్లతో శాఖలు ఏర్పడి నట్లుగా జైనములో కూడా గచ్ఛ లేక గణ శాఖలు, ఆయా ఆచార్యుల పేర్లతో కలిపి పిలవబడేవి. శ్వేతాంబరశాఖలో కూడా చాలామంది ఆచార్యులు గచ్ఛలను రూపొం దించారు. ఉదాహరణకు ఒక గణధరుడైన సుధర్మ శిష్యుడు ఉద్యోతనసూరి, ఎనుబది నలుగురు శిష్యులతో స్వతంత్రంగా ఒక నూతన గచ్ఛను స్థాపించాడు. గచ్ఛలోని సభ్యుల సంఖ్యకు పరిమితులు లేనప్పటికినీ, తక్కువ సభ్యులు కలిగి ఉంటే దేశా టనము చేయుటకూ, కార్య నిర్వహణకూ సులువుగా ఉంటుందని భావించేవారు. మహావీరుని కాలంలో ఒక్క గచ్ఛలోనే మూడు వందలమంది సభ్యులు కూడా ఉండేవారట.

ఆంధ్ర దేశంలో 85 గచ్ఛలున్నట్లు తెలుస్తుంది. అయితే శాసనములలో నాలుగు పేర్లే కనిపిస్తుంటై. అవి 1. అడ్డకలి గచ్ఛ; 2. నంది గచ్ఛ; 3. పుస్తక గచ్ఛ; 4. సర స్వతీ గచ్ఛ. కొందరు పండితులు చెప్పేదానిని బట్టి చివర తెలిపిన రెండు గచ్ఛలు ఒకటేనని.

గచ్ఛ తరువాతి విభజన పేరు కుల. ఒక్కొక్క గచ్ఛలో అనేక కులములు ఉండేవి. అయితే ఆంధ్ర దేశములోని శాసనములలో కుల పదమునకు బదులుగా అన్వయ పదము వాడేవారు. బహుశా కుల పదము, అన్వయ పదము పర్యాయ పదములై ఉండవచ్చును. “సంఖాన్వయ” మరియు “కొండకుందాన్వయ”అనే పదములను ఉదాహరణలుగా తీసుకొన వచ్చును. గణములు, గచ్ఛలకు అధిపతులుగా అను భవము కలిగిన ఆచార్యులు ఉండేవారు. కులమునకు ఆచార్య పరంపరలోని చిన్న వారిని పర్యవేక్షకులుగా నియమించేవారు. ప్రతి శ్రమణుడూ తన కులమునకు విధిగా సేవ చేయవలసినదే. అతడు సల్లేఖనము (నిరాహారియై ప్రాణములు విడచుట) చేయదలిస్తే ముందుగా అనుమతి పొందాలి. కులము తిరిగి ‘బలి’ యనే వర్గముగా విభజింపబడినది. ఇంగలేశ్వర బలి, పాండురంగ బలి వంటి కొన్ని పేర్లు ఆంధ్ర దేశపు శాసనములలో గోచరిస్తవి.

జైన సంఘములోని సన్యాసులు, సామాన్య జనుల మధ్య తిరుగుతూ జిన ధర్మ ప్రచారం చేసేవారు. వర్ష ఋతువు నందు వారు తమ వసదులలోనో, లేక కాండగు హిలవంటి ఏకాంత ప్రదేశములలో తమ మతాచారములను పాటిస్తూ గడిపేవారు. అయితే జైన శ్రావకులు ఏకాంతముగా ఉండటానికి ఇష్టపడే వారు కాదు. వారు, ఇతర మతస్థులు, కులస్థుల మధ్యనే జీవనం కొనసాగించేవారనీ, ఆ కారణంగా ఒకరి మతాచారముల ప్రభావము మరొక మతము వారిపై పడుతుం దేదట. ఈ కారణంగా గృహస్థులైన జైన శ్రావకునకు, విశ్వసమ భావన ఆదర్శముగా గల సమాజములో ద్విపాత్రాభి నయము చేయవలసివచ్చేది. ఒకవైపు గృహస్థుగా, లౌకిక కార్యములు నిర్వహించుట, మరోవైపు జైన శ్రావకునిగా పారమార్థిక చింతన ప్రభోదించుట. పరిస్థితులను బట్టి పాత్ర నిర్వహణ జరుపవలసి వచ్చేది. మధ్య యుగంలో సామాజిక అలవాట్లు, కట్టుబాట్లు, మతాచారములు కూడా జైనులకు హిందువులకు దాదాపు ఒకే విధంగా ఉండేవి. సామాన్య ప్రజానీకము రెండు మతములను సమభావంతో పరిగణించేవి. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దపు మధ్యకాలము నుండి, వేంగీ చాళ్యుకులు, కాలాముఖ శైవమును పోషించుట వల్ల మత, సామాజిక పరిస్థితులలో మార్పు వచ్చింది. కాలాముఖ శాఖకు చెందిన శైవులు హింసాయుత మార్గములను అనుసరించైనా సరే, జైనమును నాశనము చేయవలెనని కంకణం కట్టుకున్నారు. శైవ సాహిత్యములోని పాల్కురికి సోమనాధుని రచనలైన బసవ పురాణము, పండితారాధ్య చరిత్ర వంటి గ్రంథములలోనూ, గ్రామ ఇతిహాసములు (క్రైఫీయత్)లోనూ, జైనులపై జరిపిన ఘాతక చర్యలు చిత్రీకరించబడినవి.

ఆ విధమైన భయంకర దమన కాండకు గురియైనప్పటికీ, జైనమతము ఆంధ్ర దేశములో క్రీ.శ. 3వ శతాబ్ధమునుండి పదమూడవ శతాబ్దమువరకూ మనుగడ సాగించినది. ముస్లిము సుల్తానులు దానిని తుడిచిపెట్టే వరకూ, పెనుగొండ, ఆదోని వంటి నగరములను అంటిపెట్టుకొని జీవించింది.

ముందు మనవి చేసినట్లు, ఇంత సుదీర్ఘ కాలము ఆంధ్ర దేశము నందు వ్యాపించి ఉన్నప్పటికీ, ఆ మతమునకు సంబంధించి ఒక్క గ్రంథముకూడా తెలుగుభాషలో లభించ లేదు. జైన మతమున ప్రముఖ పండితులు, ఆచార్య వర్యులైన తెలుగువారి జీవిత చరిత్ర వివరములు లభించలేదు. అయినప్పటికీ శాసనముల

యందునూ, సాహిత్య, మత గ్రంథముల యందునూ లభించిన సమాచారమును బట్టీ, సమకాలీన జైన రచయితలూ, ఇతర రచయితలు కూడా తమ తమ గ్రంథముల యందు తెలియజేసిన విషయములను బట్టీ, దొరకినంత వరకూ జైన పండితులైన, తెలుగు వారి జీవిత చరిత్రలను రేఖామాత్రంగా రాబోవు వ్యాసములలో తెలియ జేయబడినవి.

జైనులకు పరిపూర్ణమైన మానవుని మించిన దేవుడు లేడని ధృఢమైన విశ్వాసము. అటువంటి మానవులే తీర్థంకరులు. కాబట్టి వారి ప్రబోధములను నిత్యమూ స్మరిస్తూ, ఆచరిస్తూ, సంసారసాగరమును అధిగమించటమే జైనుల ధ్యేయం. పరలోకములు ఉన్నవని విశ్వసించటం, వాటిలో ప్రవేశించుటకు వివిధ రకములైె కర్మకాండలను ఆచరించటం, వారభిలషించరు. తీర్థంకరుల అడుగుజాడలలో నడచి, వారివలెనే సిద్ధత్వమును పొందటమే వారి లక్ష్యము, గమ్యము.

**నమో అరిహంతానమ్**
**నమో సిద్ధానామ్**
**నమో ఆయారియానమ్**
**నమో ఉపజ్ఝానమ్**
**నమో వోయేసవ్వసాహునమ్ ॥**

■ ■ ■

# కొండ కుందాచార్యులు

దక్షిణ భారతదేశంలో జిన ధర్మమును ప్రబోధించిన, అనేకమంది మహనీయులలో ఉన్నత పీఠమును అధిరోహించిన జైనాచార్యుడు కొండ కుందాచార్యులు. మగధనుండి దక్షిణ భారత దేశమునకు తరలివచ్చిన 12,000 మంది జైన శ్రమణులలో భద్రబాహు డొకడు. ఈయన నాయకత్వంలోనే జైనము మొట్టమొదటసారి దక్షిణ దేశమున ప్రవేసిం చింది. భద్రబాహుని నుండి నాలుగవ తరమునకు చెందినవాడు కొండ కుందాచార్యులు. ఈతనికి ముందు ఉన్న ముగ్గురు ఆచార్యుల పేర్లు గుప్తిగుప్తుడు, మేఘనంది మరియు జినచంద్రుడు. కొండ కుందాచార్యులవారు మూల సంఘము నకు నాయకుడు, బలాత్కరణ గణ, సరస్వతీ గచ్ఛ లేక వక్రగచ్ఛల స్థాపకుడు. జైనములోని దిగంబర శాఖకు చెందినవాడు. ఆయన జైన సంఘమునందు, ముఖ్యంగా దక్షిణ భారతంలో అత్యంత పూజనీయమైన స్థానముపై ఆసీనులైనారు. ఎంత గౌరవనీ యులుగా పరిగణింపబడినారంటే, జైన బోధకులలో చాలామంది కొండ కుందా చార్యుల వారి వారసులుగా చెప్పుకునేవారు. ఆచార్యులవారి ఔన్నత్యము అంతగొప్పది.

శాసనపరంగానూ, సాహిత్యపరంగాను లభించిన సాక్ష్యములను బట్టి, ఆయన అనంతపురం జిల్లా, ఉరవకొండ మండలములోని కొనకొండ్ల గ్రామ సమీపములోని కొండపై నివసించేవారట. ఈ కొండ గుంతకల్లు రైల్వేస్టేషనుకు షుమారు 6 కి.మీ. దూరంలో ఉన్నది. ఇంద్రనంది అనే జైనాచార్యుడు తన 'శ్రుతవాతర' అనే గ్రంథ

ములో, ఆచార్య పద్మనంది కుంద పురములో నివశించేవారు అన్నారు. కొనకొండ్లలో లభించిన శాసనమును బట్టి, ఆ గ్రామము ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆచార్య పద్మనంది జన్మ స్థలముగా గుర్తింపు పొందినది. బస్తిహళ్లి (కర్ణాటక)లో లభించిన మరో శాసనము, ఆ ప్రముఖాచార్యుని కొండ కుంద నుండి ప్రవహించు శాంతరసము (శాంతరస ప్రవాహ)గా వర్ణించినది. పద్మనంది భట్టారకుల వారిని బాధితలైన మానవాళిని సంసార సాగరమును తరింపచేయు నావగా అభివర్ణించారు. మరొక శాసనము కొనకొండ్లను కొండకుంద తీర్థమని వర్ణించింది. పై వివరములను పరిశీలించుటవలన, ప్రముఖ జైనాచార్యులైన పద్మనంది భట్టారకులు కొనకొండ్ల లేక కొండకుంద అనే కొండపై నివశించుటచేత వారిని కొండ కుందాచార్యులనే గౌరవ ప్రదమైన నామముతో పిలచేవారనీ, చివరకు వారి అసలు నామము మరుగునపడి, వారి గౌరవనామమే స్థిరపడిపోయిందనీ తెలుస్తున్నది.

బి.ఎ. శాలటోర్, పి.బి. దేశాయివంటి పండితులు కొండ కుందాచార్యుల వారు జన్మతః నికార్సైన కన్నడిగుడని అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయమునకు ఆధారము 'కొండ' అను పదమునకు, భాషరీత్యాగల అర్థము. “కొండ” అంటే కన్నడ భాషలోనూ కొండ అని అర్థము. ఆయన నివసించిన ఆ కొండ కర్ణాటక దేశములో ఉన్నదని తెలియ జేశారు. సూక్ష్మంగా విశ్లేషిస్తే వారి వాదనకు ఆధారము లైన రెండు అంశములూ బలహీనమైనవి. కొండకు కన్నడ భాషలోని అర్థమే తెలుగులో కూడా ఉన్నది.

ఆంధ్రదేశములో కొండ అనే పదము, చివరనగల అనేక గ్రామములు, పట్టణము లున్నవి. ఉదాహరణకు వినుకొండ, పెనుకొండ, దొనకొండ మొదలైనవి. కాబట్టి కొండ అనే పదమునకు కేవలము కన్నడ భాషలోని అర్థమును, ఆధారముగా లేక సాక్ష్యముగా గ్రహించి, ఆచార్యుల వారు కన్నడిగులని నిర్ణయించుట సరికాదు. వారు ప్రస్తావించిన రెండవ అంశము ఆ కాలములో కొనకొండ్ల గ్రామము కర్ణాటక దేశములో ఉన్నట్లు వాదించటం కూడా లోపభూయిష్టమైనదే, ఎందుకంటే ఆ రోజు లలో రాజ్యములు, భాషా ప్రయుక్తంగా ఏర్పడలేదు. వాటి సరిహద్దులు కూడా ఆవిధానముపై నిర్ణయింపబడలేదు. ఒకప్పుడు కళింగ రాజ్యపు దక్షిణ సరిహద్దు గోదావరి నది ఆవలి ఒడ్డువరకూ ఉండేది. కృష్ణానది వరకు కూడ విస్తరించిన

రోజులు లేకపోలేదు. శాతవాహనుల పరిపాలనా కాలంలో, మహారాష్ట్ర కర్ణాటక దేశములోని కొన్ని భాగములు వారి సామ్రాజ్యములుచేరి ఉండేవి. చరిత్రను పరిశీలిస్తే ఈ విధమైన సందర్భములు ఎన్నో కనిపిస్తై. వీటినిబట్టి భాష, ఏనాడూ రాజ్య సరిహద్దుల నిర్ణయము చేయటంలో ఒక అంశంగా ఉపయోగించబడ లేదని స్పష్ట మవుతుంది. ఈ పరిస్థితులలో కొండ కుందాచార్యులవారు, కన్నడిగుడని నిర్ణయిం చుట తొందరపాటు అనిపిస్తుంది. ఆయన మాతృభాష ఏదైనప్పటికీ ఆయన కొన కొండ్ల నుండి ఏబది రెండు సంవత్సరముల సుదీర్ఘ కాలము జిన ధర్మమును ప్రచారము చేసినారనే మాట వాస్తవం. వారి జీవితకాలముకూడా వివాదాస్పదమైనది. క్రీ.పూ. నాల్గవ శతాబ్దమునుండి క్రీ.శ. ఆరవ శతాబ్దములమధ్య వారు జీవించినట్లుగా పలువురు పలు రకములైన కాలనిర్ణయము చేశారు. సాంప్రదాయకంగా ప్రచారములో ఉన్న సమాచార మును బట్టి, ఆచార్యులవారు తన ముప్పైమూడవ ఏట ఆచార్య పీఠమును అధిరోహించి ఏబది రెండు సంవత్సరములు ఆచార్యత్వమును నిర్వహించి, పండు ముసలి వయసులో, తన ఎనుబది ఐదవ ఏట కన్ను మూశారు. ఆయన ఆచార్య పీఠము నలంకరించింది. క్రీ.పూ. 58 ప్రాంతముగానూ, తనువు చాలిం చినది. క్రీ.శ.44 గానూ నిర్ణయించారు. అంటే వారు క్రీ.పూ.40 క్రీ.శ. 44 మధ్య కాలములో జీవించి ఉన్నట్లుగా భావించ వచ్చును. పండితులు అందరూ ఆయన క్రీ.శ. మొదటి శతాబ్దంలో జీవించారన్న విషయమును అంగీకరించారు. శ్రావణ బెళగొలలోని శాసనము, కొండ కుందాచార్యులవారు జైన మత ఔన్నత్య మును భారతదేశమంతటా చాటిచెప్పడంలో కృతకృత్యులైనట్లు తెలియజేస్తుంది. అటువంటి శాసనములలో అతిశయోక్తులు ఉన్నప్పటికీ ఆయన భారతదేశ మంతటా పర్యటించి, పెక్కు సభలలో పాల్గొని, ఇతర మతముల వారితోనూ ఇతర సంప్రదాయముల వారితో చర్చించి, జైనమతము యొక్క ఔన్నత్యమును చాటి, పునర్జీవనము కల్పిం చారు. ఆంధ్ర, కర్ణాటక, ద్రవిడ దేశములలో అనేకమంది పండితులు, పామరులు ఆయన శిష్యులైనారు. వారు నివసించిన కసారియా (రససిద్ధుల) గుట్టపైన తెల్పిన మూడు ప్రాంతములు కలిసేటటువంటి చోటన ఉన్నది. అందువల్ల ఆ మూడు ప్రాంతములనుండి అశేష ప్రజానీకమును ఆకర్షించారు. వారిలో వేలాదిమంది శిష్యులైనారు. ఆ ప్రదేశము జైనులకు ముఖ్యంగా దక్షిణ భారతములోని జైనులకు

తీర్థ స్థలముగా మారినది. రస సిద్ధుల గుట్టపైన ఉన్న చిన్నగుహలో ఆయన నివసించి నట్లు, అదొక విజ్ఞాన కేంద్రముగా విలసిల్లినట్లు, అచ్చటనే 'జంబూ ద్వీప చక్రమ' 'ని పిలువబడే అపూర్వమైన, భూగోళ, ఖగోళ శాస్త్రములకు సంబంధించిన యంత్రము లభించినట్లు తెలిసినది. జైన పవిత్ర గ్రంథములను విద్యార్థులు కంఠస్థము చేస్తూ ఉంటే, ఆ శబ్దముతో గుహ దద్దరిల్లేది. అసంఖ్యాకులైన పరివ్రాజకులు అక్కడ సమావేశమయ్యేవారు. ఆచార్యుల వారి శిష్యులలో, బాలకపించ, కుందకీర్తి, మరియు సామంత భద్రుడు ప్రముఖులు. కుమారకీర్తి జినధర్మముపై వ్యాఖ్యానము వ్రాయగా, గొప్పతార్కికుడు, మంచివక్త అయిన సామంత భద్రుడు, ద్రవిడ దేశంలో జైన మత విస్తృత ప్రచారమునకు బాధ్యుడు.

కొండ కుందాచార్యుల వారు ప్రాకృత భాషలో 84 "పాహుదాలు" రచించినట్లు పారంపర్యంగా ఏర్పడిన నమ్మకం. ఆయన తన గ్రంథములలో పూర్వరచయిత పేర్లను ప్రస్తావించక పోవటంవల్ల, దిగంబర సాంప్రదాయమునకు ఆయన రచనలే ప్రామాణికములైనవి. అయితే తన గ్రంథములలో, ఆయన యాదృచ్ఛికంగా జైన మతమునకు సంబంధించని ప్రాచీన విషయములుకూడా ప్రస్తావించటం జరిగింది. వాటిని బట్టి ఆయన ఎంతటి పూర్వీకుడో, అంచనావేయవచ్చును. తన మత ప్రచార కార్యక్రమములో భాగంగా, తీవ్రవాద చర్యలనుకూడా ప్రవేశపెట్టినట్లు తెలుస్తున్నది. శ్రీ ఎ.చక్రపాణి తమిళంలో వ్రాసిన "తమిళం లోని జైనసాహిత్య"మనే గ్రంథంలో, కొండ కుందాచార్యులవారు తమిళనాడులోని కడలూరు జిల్లాలోగల తిరుప్పా పులి యార్" లేక దక్షిణ భారతములో పాటలీ పుత్రముగా పేరుగాంచిన గ్రామములో నెలకొన్న ద్రమిళ (ద్రవిడ) సంఘమునకు ప్రధానాచార్యుడుగా కూడా వ్యవహ రించినట్లు తెలియజేశారు. తమిళ సాహిత్యములో అత్యంత నీతి 'బోధకమైన తిరుక్కురళ్'గ్రంథ రచయిత ఎల్లయాచార్యయే కొండకుందాచార్యులనీ, ఆయనకు ఎల్లయాచార్య అనే పేరుండేదని తెలుస్తున్నది. ఈ విషయములో వాస్తవము ఏమై నప్పటికీ, ఆశ్చర్యపడ వలసినది ఏమీ లేదు. ఎందుకంటే కొండ కుందాచార్యుల వారు బహుభాషా కోవిదుడూ, జైన ఆచార్యులలో ప్రముఖుడు. జైనమతము నీతి సూత్రములకు, నైతిక ప్రవర్తనకు అత్యంత ప్రాధాన్యతను ఆపాదించింది. కొండ కుందాచార్యులవారి బహుళ ప్రచారమును పొంది లభిస్తున్న గ్రంథములు :

1. సమయసార; 2. ప్రవచన సార; 3. పంచాస్థితికాయ సార; 4. నియమసార; 5. అష్టపాహుద; 6. రయన సార; 7. బరసానువేక; 8. దాస భక్తి; 9. మూలాచార.

పైన పేర్కొన్న పుస్తకములలో మొదటి మూడింటిని కల్పి "ప్రభారత్రయ" లేక "ఆర్యత్రయ" అంటారు. అవి హిందూ వేదాంతము నందలి ప్రస్థాన త్రయ (బ్రహ్మ సూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత)ము వంటి పవిత్ర గ్రంథములుగా, జైనులు పరిగణిస్తారు. నాల్గవ పుస్తకమైన "నయనసారము" అచ్చుటచ్చుట చారిత్రక సంఘటనలు, విషయములు తెలియజేస్తూ రచింపబడిన గ్రంథము. దీనిలో ఎనిమిది గ్రంథములు సంకలనము చేయబడినవి. చివర పేర్కొన్న గ్రంథమైన "మూలాచార" ప్రాకృత భాషా గ్రంథములలో ప్రాచీనమైనది. జైనతత్త్వము, మతములపై సిద్ధాంత పరము గాను, ఆచరణపరంగా కూడా ప్రామాణికమైన మూల గ్రంథము. సమయసార గ్రంథము సారత్రయ గ్రంథములలో ఒకటి యైనప్పటికీ, ఆచార్యుల వారి గ్రంథము లలో బహుళ ప్రచారమును పొందినది. కొండ కుందాచార్యుల వారి రచనలన్నీ, శాఖా విభేదాలకూ, సంకుచిత తత్త్వమునకూ అతీతమై ఉండుటచేత జైన మతము లోని, శ్వేతాంబరులు, దిగంబరశాఖ వారు భక్తి, శ్రద్ధలతో అధ్యయనము చేస్తారు. ఆచార్యుల వారు తమ రచనలు అన్నిటిలోనూ, ఆత్మతత్త్వమునకు తెలుసుకొనవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణిస్తూ, వీతరాగ భావన ద్వారా మానసికోన్నతి సాధించి, కైవల్యము చేరగల అర్హతను సంపాదించవలెనని ప్రబోధించేవారు.

కొండ కుందాచార్యులవారు విగ్రహారాధనకు వ్యతిరేకులు. అర్హతులైన జైన మునులను కూడా పూజించరాదనీ, పూజించుట పవిత్ర కార్యమైనప్పటికినీ, అటువంటి కార్యాచరణములు వ్యక్తిని, రాగబంధితునిగా మారుస్తుందని చెప్పేవారు. ఆహ్లాదకరమైన కార్య నిర్వహణకు ప్రోత్సాహము ఇస్తుందన్నారు. జైన మత ముఖ్య లక్ష్యము, ప్రాపంచిక జీవనమును త్యజించుట. అందువలన సాధకుడు ఏవిధమైన భవబంధముల యందు చిక్కుకొనరాదు. కొండ కుందాచార్యులవారు జైన మతానుయాయుల హృదయములలో ఎంత ఉన్నత స్థానము అలంకరించారంటే, అనేక జైన శాసనములు, వారికి ప్రణామములు అర్పించి ప్రారంభించబడుతవి.

**మంగళం భగవాన్ వీరో మంగళం గౌతమోగుణీ**
**మంగళం కుందకుందాఖ్యః జైన ధర్మోస్థు మంగళం**

# సింహ నంది

ఆర్యదేవుడు ఏ విధంగా ఆచార్య నాగార్జునునకు తగిన శిష్యుడు అనిపించు కున్నాడో, సింహనంది కూడా కొండ కుందాచార్యుల వారికి తగిన శిష్యుడు అనిపించు కున్నాడు. ఆచార్యులవారు స్థాపించిన వక్రగచ్ఛ లేక సరస్వతీ గచ్ఛకు వీరే నాయకులు. ఈయన కొండ కుందాచార్యుల వారి ప్రత్యక్ష శిష్యుడు కాదు. వీరిద్దరి మధ్య ప్రముఖ తార్కికుడైన ఉమాస్వాతి, గృధపింఛ, బాలక పింఛ, సామంత భద్ర ఆచార్యత్వమును వహించారు. సింహనంది ఆంధ్రదేశ రాజకీయములలోనూ, జైన మతవ్యాప్తి యందును ప్రముఖమైన పాత్రను పోషించారు.

కడపజిల్లాలోని సిద్ధవట్టం సమీపములో గల పేరూరు గ్రామము వీరి కార్యకలాప ములకు కేంద్రము. ఈ ప్రాంతములోనూ, చుట్టుప్రక్కల, అనేక జైనావశేషములు లభించినవి. ఆంధ్రదేశములో, జైన మతాచార్యులు రాజకీయములలో జోక్యం చేసుకొని, కొన్ని కొన్ని సందర్భములలో ప్రముఖ పాత్ర వహించేవారు. తద్వారా జైన దేవాలయ ములకు, వసుదులకు అంగ బలమును, అర్థ బలమును సమకూర్చుకొనటమే కాక, జైనమత వ్యాప్తికి కూడా ప్రయోజనం చేకూర్చునేవారు. ఆంధ్రదేశచరిత్రను నిశితంగా పరిశీలిస్తే వారు రాజులను, సంపన్నులను ఆశ్రయించి, అనేక దేవాలయములను, బసదు లను నిర్మించుకొనటయేగాక, ఆంధ్రదేశ రాజకీయములలో వారు నిర్వహిం చిన పాత్రలు, సామాజిక మత విషయములపై వారి ప్రభావమూ వ్యక్తమౌతవి. అటు వంటి జైనాచార్యులలో సింహనంది ఒకరు. సమకాలీన రాజకీయములలో ఆయన కల్పించుకొని, పేరూరులో "తలకాడు గంగరాజ్య" స్థాపకుడైనాడు. ఈ రాజ్యమును పశ్చిమ గంగ రాజ్యమని కూడా పిలిచేవారు. కళింగమును కూడా గంగ వంశస్థులు

రాజ్యమేలారు. వారిని తూర్పు గంగ రాజులనేవారు. పేరూరు గ్రామము పేరును కూడా రాజ్య స్థాపనానంతరము గంగ పేరూరని మార్చారు. సాంప్రదాయకంగా వినవస్తున్న కథ ఏమిటంటే, ధడిగ, మాధవ అనే ఇద్దరు సోదరులు, విజయపురి (నాగార్జున కొండ) నేలిన ఇక్ష్వాకు రాజ పుత్రులుగా చెప్పుకుంటూ, ఆంధ్రదేశపు పశ్చిమ ప్రాంతమునకు అనగా నేటి కడప ప్రాంతమునకు తరలివచ్చారు. ప్రజా బాహుళ్యములోనూ, రాజులవద్ద మంచి పలుకుబడిగల జైనాచార్యుడైన సింహనందిని కలిశారు. ఇక్ష్వాకు వంశ రాజపుత్రులమనీ, తమ రాజ్యమును పల్లవులు ఆక్రమించు కొనటంవల్ల రాజ్య భ్రష్టులమైనామనీ, తమగోడును సింహనంది వద్ద వెళ్లబోసు కున్నారు. ఆయన సోదరుల దీనగాథకు జాలిపడ్డారు. అదే సమయంలో, ఈ సోదరుల సహాయంతో ఒక నూతన రాజ్య స్థాపన చేసినట్లయితే తనకూ, తన మతమునకు లభ్యమగు అధికారము, పలుకుబడి ఆదిగాగల అనేక ప్రయోజనములు మనసునందు ఉంచుకొని, సోదరులు ఇద్దరికీ, రాజకీయముల లోనూ, పరిపాలన యందు మంచి శిక్షణను ఇచ్చినాడు. అనంతరము వారికి రాజ్యస్థాపనకు అడ్డుగా నిలచిన ఒకశిలను ఛేదించమని ఆజ్ఞాపించాడు. ఆ కార్యమును సోదరులు, దిగ్విజయంగా నిర్వ హించిన అనంతరం క్రీ.శ. 350లో పేరూరువద్ద పశ్చిమ గాంగ రాజ్యము స్థాపించబడినది. ఇక్ష్వాకుల రాజ్య పతనముకూడా అదే సంవత్సరములో జరిగినట్లు చారిత్రక ఆధారములు ఉన్నవి. కాబట్టి పై కథలో కొంత వాస్తవము ఉన్నట్లు తెలుస్తున్నది. కథలో ప్రస్తావించబడినశిల వారు అనుసరిస్తున్న మతమునకు సంకేతము. సింహ నంది జైనాచార్యుడు. ఆయన సహాయము చేయుటకుగానీ, ఆ సహాయమునువారు పొందుటకుగానీవారి మతము శిలవలె అడ్డుగా నిలచినది. బహుశా సింహ నంది ఆదేశానుసారము సోదరులు ఇద్దరూ తమ మతమైన వైదికమతమునో బౌద్ధమతమునో విడచి జైనమత స్వీకారముచేసి, తద్వారా సింహనంది సహాయమును పొంది పశ్చిమ గాంగ రాజ్యస్థాపనచేసి ఉంటారు.

కొందరు చరిత్రకారులు ఈ అభిప్రాయముతో ఏకీభవించలేదు. అయితే ఫ్లీట్ పండితుడు, ఆ సోదరులు బౌద్ధులై ఉండరనీ వారు వైదిక మతస్థులై ఉంటారనీ, చెప్పాడు. ఇందుకు సాక్ష్యంగా ఇక్ష్వాకులు మహాసేనుని (కుమారస్వామి) ఆరాధించే వారని తెలియజేశాడు. ఏది ఏమైనప్పటికీ ఆ సోదరులు తమ మతమును విసర్జించి, జైన మతమును స్వీకరించటం, అధిక సంఖ్యాలుగా ఉన్న జైన మతస్థులు, ఆచార్యుల యొక్క విశ్వాసమును చూరగొనటం, రాజ్యస్థాపన చేయటం వాస్తవములు.

# ఉగ్రాదిత్య

ఉగ్రాదిత్యుడు కొండ కుందాచార్యులవారి గురుపరంపరలో మూల సంఘము లోని దేశిగణము, పుస్తకగచ్ఛ, పనసోగవల్లిశాఖకు చెందినవాడు. ఈయన గురువు శ్రీనంది. జైనమత గ్రంథములతోపాటు ఉగ్రాదిత్యుడు ఆయుర్వేదమును కూడా అభ్యసించాడు. ఆయన ప్రస్తుత విజయనగరం జిల్లాలోని రామతీర్థం వద్దగల రామ గిరిపై నివసించేవాడు. ఆ ప్రాంతములో ఇప్పటికీ జైనసన్యాసులు నివసించిన అనేక గుహలు, శిథిలమైన అనేక జైన దేవాలయములు ఉన్నవి. ఇక్కడ గురుభక్త కొండ, దుర్గకొండ అని రెండు కొండలు ఉన్నవి. ఈ రెండు కొండలమీద అనేక తీర్థంకరుల విగ్రహాలు శిలా శాసనములు కనిపిస్తవి. రాష్ట్రకూటుల పరిపాలనా కాలంలో రామతీర్థం ప్రసిద్ధ జైన క్షేత్రం.

జైనమతములోని ఇతర ఆచార్యులవలెనే, ఉగ్రాదిత్యుడుకూడా జైనమత గ్రంథములలోనూ, ఆయుర్వేద వైద్యమునందును నిష్ణాతుడు. క్రీ.శ. 800 సంవత్సర ప్రాంతమున ఆయుర్వేద వైద్యశాస్త్రముపై "కళ్యాణ కారిక" అనే గ్రంథ రచన చేశాడు. ఆ గ్రంథములో రామతీర్థమును గురించిన అనేక విశేషములతోపాటు, తూర్పు చాళుక్య వంశజుడైన శ్రీ విష్ణురాజపరమేశ్వరుడు (నాల్గవ విష్ణువర్ధన మహారాజు), ఎవరి పాదములను అనునిత్యమూ అర్చిస్తాడో, అట్టి పరమ పూజ్యుడైన తన గురువు శ్రీనంది ఆదేశానుసారం సర్వమానవాళికి సుఖము శాంతి శుభములను కోరి, త్రికళింగ దేశమునందలి వేంగీ మండలమునందుగల రామగిరి (దుర్గకొండ) పైనకూర్చుని కళ్యాణ కారికనే గ్రంథమును రచించినట్లు చెప్పుకున్నాడు. మాల్ఖేడ్ (మాన్యఖేటం) రాజధానిగా పరిపాలించిన రాష్ట్రకూట ప్రభువు, అమోఘవర్షుని (క్రీ.శ. 814-880) కొలువులో ఆ గ్రంథమును చదివి వినిపించి రాజు మన్ననలకు పాత్రుడైనాడు. అమోఘవర్షుడు

ప్రజల శ్రేయస్సును కోరి జైన మతానుసారం 'సల్లేఖన'వ్రతమాచరించి అసువులు బాశాడు. ఆ గ్రంథములో తెలియజేసిన విషయములను బట్టి ఉగ్రాదిత్యుడు ప్రాచీన జినధర్మము నందేగాక, ఇతర మత గ్రంథములయందు కూడా మంచి పాండిత్యము కలవాడు. కళ్యాణకారిక యందలి "హితాహితాధ్యాయ" అనే ప్రకరణమునందు తాను శ్రీనృపతుంగ మహారాజు ఆస్థానమునందు ఉద్దండ పండితులు మతాచార్యులు వైద్యశాస్త్ర నిపుణుల సమక్షమునందు మాంసాహార భక్షణము నిష్ప్రయో జనమనే అంశముపై సుదీర్ఘ ప్రసంగముచేసినట్లు వ్రాశాడు. నృపతుంగ మహారాజే అమోఘ వర్షుడు (క్రీ.శ.815-877) జైనులకు పవిత్రక్షేత్రమైన రామతీర్థమును గురించిన అనేక వివరములను ఆ గ్రంథమునందు తెలియజేశాడు. ఆ ప్రదేశము త్రిలింగదేశము లోని వేంగీ రాజ్యమునందు, అనేకమైన కొండలమధ్య చక్కని గుహలు, జైన దేవాలయ ములతో విరాజిల్లు చున్నదని చెప్పాడు. సమకాలీన రాజుల పరిపాలనా కాలములను ఆధారముగా చేసుకొని ఉగ్రాదిత్యుడు క్రీ.శ.770-840 మధ్య కాలము నందు జీవించి ఉండవచ్చునని అంచనా వేయుట జరిగినది. ఆయన వైద్యశాస్త్ర ప్రావీణ్యత, మాంసాహార విసర్జన వంటి, అహింసాయుతమైన విషయములపై ఆవేశపూరితమైన ప్రసంగములూ, ప్రభువు లనూ, ప్రజలనూ జైనమతము వైపు ఆకర్షితులను చేసినవి.

క్రీ.శ. 1034వ సంవత్సరమునకు చెందిన సైదా పురము (నల్గొండ జిల్లా)లో లభించిన శిలాశాసనములో వైద్యరత్నాకర జినాలయ మరియు అగ్గాలయములను ప్రస్తావించి ఉగ్రాదిత్యునకు నరవిద్యా రత్నాకర అనే బిరుదముతో పాటు 'ప్రాణాచార్య' అనే బిరుదు కూడా ఉన్నట్లు తెలియజేసింది. అంటే ఆయన కేవలమూ వైద్యుడేగాక, శస్త్ర చికిత్సా నిపుణుడని కూడా తెలుస్తున్నది. ఉగ్రాదిత్యుని వలెనే అనేకమంది జైనాచార్యులు మత విషయములందే కాక, వైద్యము, రసవాదము వంటి అనేక శాస్త్రములయందునూ, కళలయందునూ నిపుణులై ఉండేవారు. ఈ కారణంగా అనేకమంది ప్రభువులు, ప్రజలు కూడా వీరిచే ఆకర్షితులయ్యేవారు. అందువలన ఆచార్యులు ప్రభువుల వద్దకూ, ప్రజల వద్దకూ మత ప్రచారమునకు వెళ్లవలసిన అవసరం లేకుండా వారే ఆచార్యుల వద్దకు వచ్చేవారు.

జైన, బౌద్ధాచార్యులలో ఎక్కువమంది, ఈ విధమైన జనాకర్షణ విద్యలను ఉపయో గించి మత ప్రచారము చేయుట ఆ రోజులలో పరిపాటిగా ఉండేది.

# పంపకవి

భారతీయ సాహిత్య మహాకాశమునందు, కన్నడ సాహిత్యము ఒక పాలపుంత. అందు తారలవలే వెలుగు కవుల సముదాయములో, పంపకవి, ఒక మహోజ్వల తార. ప్రాచీన కన్నడ సాహిత్యమునందు ఆయన ఆదికవి. సహస్రాబ్దకాలము, తన ప్రభావమును కన్నడ సాహిత్యముపై ప్రసరింపజేసి ప్రభావితముచేసిన మహోన్నత కవి. కావ్యరచనలో వినూత్న పద్ధతులను, బహు సుందరమైన ప్రకృతి రామణీయ కతనూ, నిత్య చైతన్యవంతమైన ఆదర్శములనూ, ప్రధానంగా స్వీకరించి, సాహిత్య సంప్రదాయములందు, శాశ్వత విలువలను స్థాపించిన, విశిష్ట గౌరవనీయుడు పంప కవి. అట్టి మహనీయుడు తెలుగువాడవటం తెలుగువారికి గర్వకారణం.

పంపకవి స్వగ్రామం గుంటూరు జిల్లా, నర్సారావుపేట తాలూకాలోని వంగి పఱ్రు. జినవల్లభుడు ఆయన తమ్ముడు. వారి పూర్వీకులు వేంగీమండలము నందలి కర్మ రాష్ట్రము (కృష్ణా–గుంటూరు జిల్లాలు) నకు చెందినవారు అవటం చేత వారిని కర్మ బ్రాహ్మణులు అనేవారు. శ్రీవత్స గోత్రికులు, జమదగ్ని ఆదిగాగల పంచా ఋషీయులు. పంప పితామహుడు మాధవ సోమయాజి. యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణలో పేరుమోసిన దిట్ట. పంప, జినవల్లభుడు అభినవ చంద్రునికి కూడా మనుమలని తెలుస్తున్నది. బహుశా మాధవ సోమాయాజి పితామహుడు కాగా, అభినవ చంద్రుడు మాతామహుడై ఉండవచ్చును. వారి తండ్రిపేరు భీమప్పయ్య,

తల్లి వాచినబ్బి. భీమప్పయ్యకూడా, తండ్రివలె వేద వేదాంగములను అభ్యసించి నప్పటికీ, ఏ కారణమువలననో వయసు మళ్లిన తరువాత వైదిక మతమును వదలి జైనుడైనాడు. వారు పండరంగవల్లికి చెందిన జయనగొండ సిద్ధాంత భట్టారకులవారి శిష్యులు. కొండకుందాన్వయ సంప్రదాయమునకు చెందిన పొత్తిగ బలి, దేశి గణము నకు చెందినవారు. పంప క్రీ.శ. 902 లేక 903వ సంవత్సరము నందు అనగా చాంద్ర మానమును అనుసరించు, తెలుగు పంచాంగం ప్రకారం, దుందుభి నామ సంవత్సరములో జన్మించి ఉండవచ్చును. వారి కుటుంబము ఏ పరిస్థితులలో సుదూ రమైన సబ్బి మండలము నందలి వేములవాడ (కరీంనగర్ జిల్లా)కు వలస వెళ్ళిందో తెలియదు. కానీ సమకాలీన రచనయైన కేతన, ఆంధ్ర దశకుమార చరిత్రలో వర్ణించ బడిన ఆనాటి మతపరిస్థితులనుబట్టి, తీరాంధ్రములో జైనులను అనేక బాధలకు గురి చేసినట్లుగా తెలుస్తున్నది. జైనులపట్లగల ద్వేష భావమును ఒక పద్యంలో ఈ విధంగా వ్యక్తం చేశాడు :

**ప॥ మిండాట మాడి పొలసిన**
**మిండలకు జైన వృత్తి మేలని మదిలో**
**వొండు తలపుడిగి జినముని**
**మండలి కృప వడసి యొక్క మాంత్రికు చేతన్**

వ్యభిచారులకూ, సర్వమూ కోల్పోయిన వారికీ చిట్టచివరి బ్రతుకుతెరువు, జైన మతములో చేరటమే అని అవహేళన చేశాడు.

అదే విధంగా 'హస్తినా తాడ్యమానోపి నగచ్ఛేత్ జైన మందిరం' అంటే ప్రాణ భయము ఉన్నప్పటికీ, జైన మందిరమునందు శరణు పొందరాదు. ఈ విధంగా జైనుల పట్ల ద్వేష భావము పెచ్చుపెరిగి ఉండేది. బహుశా అటువంటి కారణముల వలననే, పంపకవి తండ్రి, భీమప్పయ్య కుటుంబంతో సహా వలసవెళ్ళి ఉండవచ్చును. అయిన ప్పటికీ పంపకవితాను, బ్రాహ్మణునిగా జన్మించినందుకు గర్వపడేవాడు. అదే సమ యంలో, తన తండ్రి జైనుడుగా మారినందుకు, ఆయనపట్ల అత్యధిక గౌరవ భావమును ప్రకటించేవాడు. అహింసా వాదమునునకు అత్యంత ప్రాధాన్యతను కల్పిం చిన జైన మతమును కీర్తించేవాడు. ఆ విధంగా వైదిక, జైన సంస్కృతులు మేళవించిన, ఆయన వ్యక్తిత్వము సద్గుణవంతమై, సర్వమత సమానత్వమును పాటించే విధంగా వృద్ధి చెందింది.

పంపకవి చారిత్రకంగా చిరకాలము నుండి, ప్రాచుర్యమును పొందినవాడు. గొప్ప కవిగా, యోధుడుగా, రాజ్యకార్య దురంధరుడుగా ఆయన ప్రఖ్యాతి గాంచినాడు.

పంపకవి రాష్ట్రకూట రాజైన మూడవ కృష్ణుని సామంతుడైన వేములవాడ చాళుక్య వంశస్థుడు రెండవ అరికేసరి ఆస్థానమునందు ఉండేవాడు. ఆయనకు "ఆదిపంప" అనే మరో నామము కూడా ఉండేది. ఆ పేరు వచ్చుటకు కారణము, బహుశా ఆయన కన్నడ బాషలోవ్రాసిన, సుప్రసిద్ధ జైనమతగ్రంథము "ఆదిపురాణము' 'వలన కావచ్చును. వాస్తవము నకు కన్నడ సాహిత్యము నందు, పంప ఆదికవి కాదు. కన్నడభాష యందలి "కవిరాజ మార్గము" (క్రీ.శ. 850), అనంతర కాలము నందు రచించబడిన ఇతర గ్రంథములను పరిశీలించినచో ఆయనకు పూర్వమే ఆ భాషలో అనేకమంది కవులు ఉన్నట్లు తెలుస్తున్నది. కానీ వారి గ్రంథములు లభ్యము కాలేదు. అయినప్పటికీ చందస్సు వ్యాకరణముపై ఇతరులు రచించిన గ్రంథములలో, పంప పూర్వీకుల రచనల నుండి, కొన్ని పద్యములు ఉదాహరణ లుగా ఇవ్వబడినవి. కాబట్టి పంప కన్నడభాషలో ఆదికవి కాదు. కానీ సాహిత్యపరంగా ఆయన రచనల ఉత్కృష్టతను బట్టి ఆయనకు ఆదికవి యనే బిరుదు తగినదేనని భావించవచ్చు.

ఆయన మొదటి తీర్థంకరుడైన ఋషభ నాధుని జీవితమును గురించి, వ్రాసిన గ్రంథమే "ఆది పురాణము" అయితే ఆయనకు చిరస్థాయియైన కీర్తిని తెచ్చిపెట్టిన గ్రంథము "విక్రమార్జున విజయము" పై రెండు గ్రంథములను ఆయన అతి తక్కువ వ్యవధిలో షుమారు మూడు నెలలు, ఆరునెలల కాలములోనే రచించినట్లు తెలియు చున్నది. విక్రమార్జున విజయమనే గ్రంథము, వేదవ్యాసుని మహాభారత కథను ఆధారముగా చేసుకొని వ్రాయబడ్డ గ్రంథము. ఆ కథను, జైన మత దృక్పథంలో చంపూ చందస్సును ఉపయోగించి వ్రాయుట జరిగినది. అందువలన జన సామాన్యము గ్రంథము అనుపేరుతో కాకుండా 'పంపభారతమ'ని పిలుస్తారు. ఈ గ్రంథములో అర్జునుడొక్కడే ఏకైక వీరుడు. రెండవ అరికేసరిని తన పోషకుడైన రాజుగానే గాక వీరునిగానూ, సాహసము, స్నేహము వంటి సద్గుణములు మేళవించిన, మూర్తిగా ప్రదర్శించాడు. అర్జునుని పాత్రయందు తన పోషకుడైన రెండవ అరికేసరి వ్యక్తిత్వము నిమిడ్చి, ఆయనను చిరంజీవిగా చేసినాడు. తన్నాదరించిన రాజుయొక్క సాహసమూ, ధైర్యమూ, ఆయన వీరోచిత కార్యములు, దిగ్విజయములు వంటి అనేక రాజకీయ

సంఘటనలు విక్రమార్జున విజయములో వర్ణించబడినవి. పంప పై గ్రంథమునందు ప్రవేశపెట్టిన పాత్ర స్వరూప, స్వభావములను తెలియజేసిన తీరు తెన్నులూ, తమ రాజ్యములో జరిగిన అనేక సంఘటనలను, మహాభారతము నందలి సంఘటనలతో అన్వయించిన విధమూ, అనర్గళంగా మధురమైన శైలిలో పద్యములను రచించి కథనడిపించిన పద్ధతి, అనేక విమర్శకుల ప్రశంసలకు పాత్రమైనది. పైన పేర్కొన్న గ్రంథముల రచనలో, పంప ప్రదర్శించిన కల్పనా చాతుర్యము, భావనయందు నవ్యత్వము, భావగర్భితమైన అత్యున్నతశైలి ఎంతో కీర్తిగడించినవి. ఆ కాలమునందలి ప్రజల మత విశ్వాసములనూ, కవితా సాంప్రదాయములను, అధిగమించి పంపకవి కావ్య సృష్టిని గావించి, ప్రపంచమందలి గొప్ప కవులలో ఒకడైనాడు. ఆదిపురాణము నందు ఆయన చందస్సు, వ్యాకరణము ఆదిగాగల సాహితీ నియమ, నిబంధనలను పాటించాడు. బహుశా అది మత గ్రంథము కాబట్టి సంప్రదాయబద్ధంగా రచించినట్లు గోచరిస్తుంది. కానీ, విక్రమార్జునీయము, భారతమునకు సంబంధించిన సర్వజనీన మైన వృత్తాంత గ్రంథము  కాబట్టి, కవితా నిబంధనలను, సాంప్రదాయములను ప్రక్కనుంచి జనరంజకమైన కావ్యసృష్టి జరిపినట్లు తోస్తుంది.

ఆదిపురాణము తీర్థంకరులలో మొదటి వాడైన ఋషభనాధుని జీవిత వివర ములు తెలియచేయబడిన గ్రంథము. దీనిలో పదునారు ఆశ్వాసములుండి, చంపూ చందస్సు నందు వ్రాయబడినది. ప్రజలకు మతసిద్ధాంతములపైన, రచనా చమ త్కృతులయందునూ, శిక్షణ ఇచ్చుటకు తగినట్లుగా రచింపబడినది.

కన్నడ భాషలో జైన మతమునకు సంబంధించిన విషయములపై సమగ్రంగా రచింపబడిన మొట్టమొదటి గ్రంథము ఆదిపురాణము. రచనా విధానము నందు, పంపకవి తనకు పూర్వీకుడైన, జనసేనుని పూర్వ పురాణశైలిని అనుకరించి, అనువాద పద్ధతియందు నైపుణ్యము ప్రదర్శించాడు. దండాన్వయము చేయుటలోనూ, సంక్షిప్తీక రించటంలోనూ, తన విచక్షణా జ్ఞానమును ఉపయోగించి, కవితారీతిని, శిల్పమును తీర్చిదిద్దాడు. ఆదిపురాణ మందలికథ, ఆదిబ్రహ్మను ప్రార్థించుటతో ప్రారంభమై, తన గురువైన దేవేంద్రమునితో సహా, జైనాచార్యులందరికీ ప్రణామములు అర్పించి, అనంతరం మహాబలుని వృత్తాంతము, ఆయన లలితాంగుడుగానూ, వజ్రనాథుడు గాను, తిరిగి జన్మించటం, చివరిజన్మగా పురుదేవుడు లేక ఋషభనాథునిగా పుట్టటం,

ఆయన పుత్రులైన భరతుడు, బాహుబలుల యొక్క వృత్తాంతమూ తెలియజేసిన అనంతరము ఋషభనాథుడు, భరతుని విడచి ఇతర పుత్రులు అందరితో కైవల్యమును పొందటం, భరతుడు చిరకాలము, ఈ భూమిని పరిపాలించి, ఆయన చెక్కిళ్లపై నున్న వెంట్రుకలు తెల్లబడగానే, రాజరికమును త్యజించి, తప మాచరించి శాశ్వతా నందమును పొందటంతో ఆదిపురాణము సమాప్తి చెందుతుంది. ఈ గ్రంథ రచనలోని ముఖ్యోద్దేశము ఆధ్యాత్మిక తత్త్వముయొక్క పరమోత్కృష్టతను ప్రతిపా దించుట మరియు సాధించుట. లౌకిక జీవితము నందలి విషయ వాంఛలను అనుభవిస్తూ, జీవిత కాలమును వృథాచేయక, పరమ క్రియాశీలతనుపాటించి, జీవిత పరమార్థ మును పొందుట. ఈ విధమైన ఆధ్యాత్మిక సందేశమును తెలియజేయుటలో పంపకవి ఘనంగా కృతకృత్యుడైనాడు.

పంపకవి తన రెండవ గ్రంథమైన విక్రమార్జునీయ రచనకు మహాభారత కథను ఎన్నుకొనుటలో ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యము ఉన్నట్లు అవగతమౌతున్నది. హిందువుల ఇతిహాసములలోనూ, పురాణములలోనూగల శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అనేక దేవీ దేవతలపైన, వారు ఆచరించినకార్యకలాపములైన, ప్రాచీన జైన సాహిత్యములో, జైనమత పరంగా, అనేకములైన వివరణలు, విమర్శలు చోటుచేసుకున్నవి. వాటన్ని టినీ విడచి, పంప మహాభారత కథనే ఎన్నుకొనుటలోగల ఆంతర్యము ఏమంటే హిందువులు మహా భారతములోని కొన్ని పాత్రలను ధర్మనిరతికీ, సౌశీల్యమునకు, శౌర్యమునకు, ఆదర్శ మైనవిగా భావించి, వారిని ఆరాధిస్తారు. కాబట్టి అటువంటి పాత్రలను తనదైన ధోరణిలో జైనుడుగా విమర్శించి, ఆ పాత్రల అధర్మప్రవర్తనలనూ, బలహీనతలనూ, పిరికి తనమునూ, ఎత్తిచూపటం ద్వారా, హిందూమత గ్రంథముల అసత్య ప్రచారమును, లోకమునకు చాటిచెప్పవచ్చు ననేటటువంటి దురుద్దేశముతోనే, ఆయన మహాభారత కథను తన విక్రమార్జునీయ గ్రంథమునకు ఆధారముగా తీసు కొన్నట్లు తలంపు కలుగక మానదు. వైదిక ధర్మోద్ధరణకై వేదవ్యాసుడు రచించిన పవిత్రమైన ఇతిహాసమును హిందువులు పంచమ వేదముగా పరిగణిస్తారు. కాబట్టి హిందువుల మనోభావములను విశ్వాసములను చిన్నాభిన్నము చేయుటయే ప్రధాన లక్ష్యంగా పంపకవి విక్రమార్జునీయ రచన చేపట్టినట్లు భావించవచ్చు. ఈ సందర్భ ములో జవరిగౌడగారి అభిప్రాయమును అనుసరించి కవి (పంప) ఇంతటిభారమైన,

బహుముఖ విషయ సంపన్నమైన రచనను చేపట్టుటలో ఒకటిగాక అనేకమైన ప్రయోజనముల నాశించి ఉండవచ్చును. కథ అందరికీ సుపరిచిత మైనప్పటికీ, విషయమునందలి రాజసము అనన్యసామాన్యమైనది. అందలి పాత్రలు మానవుల జీవిత విలువలకు సంకేతములు, ఆ విలువలను పాటించుట వలన, మానవాళియొక్క విధియే మార్పు చెందవచ్చును. పంపయొక్క జీవిత ధృక్పథమూ, తానాశించిన నైతిక విలువలూ, ఆదర్శములూ, శీలసంపదపట్ల తనకున్న విశ్వాసమూ, తన ఆకాంక్ష లనూ ఆ కాలములోని సామాజిక మతములయందలి ప్రత్యేక లక్షణములనూ, ఆదర్శములనూ వాస్తవముగానూ, ఆమోదయోగ్యముగానూ తన గ్రంథము ప్రతిబిం బించ గలదని విశ్వసించాడు. మూల కథ యందలి తనువును పులకరింపజేయు ఉపాఖ్యానములు, సాహసిక చర్యలు భయంకరమైన యుద్ధఘట్టములు, సమకాలీన మైన వీరోచితయుగమునకు సరిపోతవని భావించాడు. అన్నిటికీమించి, తన్నాద రించిన రాజును అర్జునునితో సమానునిగా పెంచి, ఆయన వీరోచిత కార్యములను దారములుగాచేసి మూలకథా వస్త్రము నందు కలిపి నేసినాడు. ఈ విధంగా రచించు టలో ఆయనయొక్క ముఖ్యోద్దేశము తనయొక్క తన ప్రభువు యొక్క మనస్తత్వములను రెంటినీ కలిపి ఏకధారగా, తన ఇతిహాసము యొక్క రక్తనాళములలో ప్రవహింపచేసి, శాశ్వతత్వమును పొందవలెననే ఆకాంక్ష. ఇందుకుగాను పాత్రల యొక్క స్వభావము లను మార్చటం, సంఘటనలను వర్ణించుటలో వైవిధ్యమును పాటించటం, కొన్ని సంఘటనలను తొలగించటం, కొన్ని నూతనసన్నివేశములను ప్రవేశపెట్టడం వంటి అనేక మార్పులు చేయటం జరిగింది. తన గ్రంథ నామమునకు సరిపడునట్లుగా తన కావ్యమునందు అర్జునునే కథానాయకుడుగా చేయుట తన ప్రభువు వ్యక్తిత్వ మును ఆ పాత్రలో ఇముడ్చుట. వాస్తవపరిశీలనకు అరికేసరి, అర్జునుని పాత్రలు రెంటినీ పరివర్తనము చేయుట జరిగింది. అయితే అనేక సందర్భములయందు వ్యాసభారతములోని బోధనలను ఆమోదించుటకు పంపకు, జినధర్మము అడ్డుపడింది. ఆ విధమైన ఇబ్బందులు ఏర్పడినప్పుడు వాటిని తన కథలో ప్రస్తావించక పోవటమో, మెలికలు త్రిప్పటమో, తన భావములకు అనుకూలంగా అన్వయించటమో జరిపాడు. ఉదాహరణకు ద్రౌపదియొక్క బహుభర్తృత్వము ఆయనకు నచ్చలేదు కానీ, పాండవుల బహుభార్యాత్వమును నిరసించలేదు. కారణము తాను ప్రస్తుతము జైనుడగుట వలనగానీ, తమ పూర్వసంస్కృతీ ప్రభావమును కాదనలేక పోవుటవలనగానీ అయి

ఉండవచ్చును. అందువలన తన కావ్యమునందు ద్రౌపది అర్జునున కొక్కనికీ, భార్యగా మార్పు చేశాడు. ఆ విధంగా లక్ష్య సాధనకై పంప మూల కథకు వేరుగా అనేక మార్పులు చేశాడు. అందులో కొన్నిటిని పరిశీలించుదుము :

వ్యాస భారతములోని ఆదిపర్వమునందు, అర్జునుడు తనవంతుకాని కాలము నందు, ద్రౌపదియున్న ధర్మరాజు మందిరములో ప్రవేశిస్తాడు. ప్రాయశ్చిత్తంగా తీర్థయాత్రలకు వెళ్తాడు. పంప ఆ సందర్భమును మార్చి, అర్జునుడు స్థిరంగాఒకచోట ఉండలేక తీర్థయాత్రలకు వెళ్లినట్లు తన గ్రంథంలో వ్రాశాడు.

అర్జునుడు సుభద్రను ద్వారక నుండి లేవదీసుకొని వెళ్లాడుకానీ, వ్యాస భారతము నందు చెప్పినట్లు శ్రీకృష్ణుని కోరికపై వివాహమాడలేదు.

పాండవులు జూదమునందు ఓడిపోయిన అనంతరం, దుశ్శాసనుడు ద్రౌపది కొంగుపట్టుకొని నిండు సభలోనికి ఈడ్చుకొని వచ్చి, ఆమె వలువలను ఊడదీయటకు ప్రయత్నించుచుండగా దుర్యోధనుడు బిగ్గరగా నవ్వుతూ ఆమెను కూర్చోవలసినదిగా కోరుతూ తన తొడను చూపించినాడు. కానీ పంప తన భారతమునందు, అటువంటి సంఘటన జరుగలేదన్నాడు.

విరాటరాజు కొలువులో ధర్మజుడు కంకుభట్టు అనే పేరుతో అజ్ఞాత వాసము చేస్తున్న తరుణంలో, ఒకనాడు విరాటుడు, కంకుభట్టు పాచికలాడుతుండగా, కోపము వచ్చిన రాజు, కంకుభట్టుపై పాచికనువిసరి ఆయన నుదురుపై గాయపరచినట్లు మూలకథ. పంప అది తప్పు, విరాటుడు ఆ విధంగా కొట్టలేదని ఖండించాడు.

ఈ విధంగా వ్యాస భారతమునందలి పాత్రల గుణగుణములు, సన్నివేశములు, సంభాషణలు పంప తన భారతమునందు పూర్తిగా మార్పుచేశాడు. వీటన్నిటిలోనూ అత్యాశ్చర్యకరమైన విషయమేమంటే, యుద్ధానంతరము సింహాసనమును అధిష్టించినది అర్జునుడేగాని ధర్మజుడు కాదు. ఇందుకు పంపకవి చెప్పిన కారణము ఏమనగా అర్జునుడు కుంతీదేవికి ఇంద్రుని వలన జన్మించాడు. జైన ఇతిహాసమును అనుసరించి, ఇంద్రునకు జైన మతమునందు విశిష్ట స్థానముకలదు. కాబట్టి ఆ మతాను సారము అర్జునుడే సింహాసనముపై కూర్చుండుటకు అర్హుడు. అన్నగారైన ధర్మరాజు కాదు. వ్యాస భారతమును అనుసరించి ద్రౌపది పాండవులతోపాటు, అరణ్య వాసము

లోనూ, అజ్ఞాత వాసములోను, పలు కష్టములను అనుభవించినది. పంప తన భారతమునందు ఆ విషయమును త్రోసిపుచ్చి, సుభద్రనే అర్జునునితోపాటు సింహాసనమును అధిష్టింపజేశాడు. ద్రౌపదికి చేసిన ఈ అన్యాయమునకు కారణము పంప తన గ్రంథములో ఎక్కడా వివరణను ఈయలేదు. మరొక అత్యంత ఆశ్చర్యకర విషయమేమనగా, పంప తన భారతము నందు ఎనిమిదిమందిని వీరులుగా వర్ణించి ఒక పట్టిక నిచ్చినాడు. ఆ ఎనిమిది మందిలో శ్రీకృష్ణుని పేరులేదు. పంప తయారు చేసిన పట్టికలో శల్యుని పేరున్నది. పంపకు కురు, పాండవుల మధ్య చెలరేగిన రాజకీయ స్పర్థలు, యుద్ధమునందు శ్రీకృష్ణుడు నిర్వహించిన ముఖ్యపాత్ర మొదలైన విషయములన్నీ తెలియనివికావు. శ్రీకృష్ణుడు మానవాతీత శక్తులుగలవాడనీ, సాక్షాత్తు నారాయణుడేనని కూడా పంపకు తెలుసును. ఇన్ని తెలిసినప్పటికీ, శ్రీకృష్ణుని పేరును వీరుల జాబితానుండి తొలగించుటలోగల ఆంతర్యము ఏమిటో తెలియరాకున్నది. శ్రీకంఠయ్యగారు ఈ విషయముపై ఇచ్చిన వివరణ సమంజసముగా ఉన్నది. శ్రీకృష్ణుని హిందువులు ఆరాధించున్నట్లు, జైనులు ఆరాధించరు. వారికి ఆదితీర్థంకరుడే పరమ దైవము. ఇతర వైదికమత దేవతలను వారు అంగీకరించరు. ఆమోదించరు. అయితే పంప జన్మతః బ్రాహ్మణుడు కాబట్టి శ్రీకృష్ణుని సాధారణ మానవుడేనని ఆయనను విమర్శించక వదలినాడు. దైవత్వమును ఆపాదించనూ లేదు. అందుచేత ఈ విషయములో ఆయన మౌనము పాటించుటే శ్రేయస్కరమని భావించి యుండవచ్చును. అంతేకాక ఇతర జైన భారతములోవలె శ్రీకృష్ణుని తూలనాడలేదు. పంప భారతములోని మరికొన్ని విశేషాంశములు ఏమనగా ఆయన దుర్యోధనుని, కర్ణుని పూజనీయులుగా భావించారు. దుర్యోధనుడు నిర్వహించిన పాత్రను అతిశయోక్తులతో ముంచెత్తుతూ, ఈ మానవుడు (దుర్యోధనుడు) ఆడిన మాటను తన చివరి క్షణము వరకూ తప్పలేదు, తన నిర్ణయముపై, చివరవరకూ నిశ్చలుడుగా నుండి రాబోవు దుష్ఫలితములను గురించి భయపడలేదు. నిర్ణయము తీసుకున్న తదుపరి వెనుదిరిగి చూడలేదు. దానికి చివరి వరకూ కట్టుబడి యున్నాడు. ఆత్మగౌరవమును నిలబెట్టుకుంటూ, ఎంత దూరమైనా ఎంతకాలమైనా సాహసంతో పురోగమించాడు. తనకు బాల్యమునుండీ పరమ శత్రువైన వానితో (భీమునితో) వీరోచితంగా యుద్ధము చేసి, ఆయుద్ధము నందే తనువు చాలించాడు. శ్రీకృష్ణుడూ, తల్లి కుంతీదేవి, కర్ణుని

పాండవ పక్షమున చేర్చవలెనని తీవ్రంగా ప్రయత్నించి నప్పటికిన్నీ, ఆ ఒత్తిడులకు తలవొగ్గక, తన విధేయతను, స్నేహమును దుర్యోధనుని పట్ల ప్రదర్శించిన కర్ణునకు అభినందనలు తెలియజేశాడు. వివిధ, విధములైన మానవ స్వభావములను తన గ్రంథము నందు చిత్రీకరించినప్పటికినీ, స్నేహగుణమునకే పంప అత్యంత ప్రాధాన్య తను ప్రదర్శించాడు. తనకూ, తన ప్రభువునకూ, మధ్యగల స్నేహబంధమును, దుర్యోధన, కర్ణ పాత్రలలో ప్రతిబింబింపచేసి, కన్నడ సాహిత్యములో, ఇంతకు ముందెన్నడూ లేనటువంటి విధముగా, తన విక్రమార్జున విజయమునందు చిత్రీక రించినాడు. స్నేహ స్వభావమునకు పరమ పవిత్ర తనొనగూర్చి, తనకూ, తన ప్రభువుకూ, మధ్యగల స్నేహమును భూమిమీద నున్న ఏ శక్తి నాశనము చేయలేదనీ, తమ మధ్య స్నేహము, కర్ణునికీ, దుర్యోధనునకు మధ్యగల స్నేహము వంటిదని చాటి చెప్పాడు. ఇంతకు ముందు మనవిచేసినట్లు విక్రమార్జున విజయము వ్యాస భారతమునకు అనువాదముకాదు. స్వతంత్ర కావ్యమన వచ్చును. వ్యాస భారతము నందలి పాత్రలనూ, కథను మాత్రమే, పంప తన కావ్యమునందు గ్రహించుట జరిగినది. వ్యాసుడు, మహాభారతమును పదునెనిమిది పర్వములలో చెప్పగా పంప పదునాలుగు ఆశ్వాసములకు దానిని కుదించి, పదునారు వందల శ్లోకములలో వ్రాసినాడు. వ్యాస భారతము నందలి పాత్రలను సన్నివేశములను, తను చెప్పదలచు కున్న విధానమునకు అనుకూలంగా మార్పు చేశాడు. తను వివరణ ఇచ్చుటకూ, అన్వయించుటకూ, ఇబ్బంది కలుగజేయునటువంటి సన్నివేశములను, వృత్తాంత ములను, పూర్తిగా ఎత్తివేశాడు. అయినప్పటికినీ, పంప భారతము, భావ వ్యక్తీకరణము నందుగానీ, శైలియందుగానీ, వ్యాస భారతమునకు తీసిపోదు. ఆయన ఉపయో గించిన ప్రతి పదమూ, అర్థనిక్షిప్తమూ, కర్తవ్య స్ఫూర్తిని, కలుగజేయునవిగా ఉన్నవి. ఎక్కడా పునరుక్తి దోషము కానరాదు. అనావశ్యకమైన పదములను ఉపయోగించ లేదు. తరువాతి కాలమునందలి అనేక కవులు పంపను కాళిదాసునితో సమానుడని ప్రశంసించి ఆయనను అనుకరించసాగారు. దురదృష్ట కరమైన విషయమేమంటే, జైన, బౌద్ధ మతములకుచెందిన రచయితలు, కవులు, హిందువుల ఇతిహాసముల లోనూ, పురాణముల యందలి పాత్రలకు, సన్నివేశములకు, తప్పుగా అర్థము చెప్పటం. వాటియొక్క స్వరూప, స్వభావములను, మార్చి, వారి మతదృక్పథములకు

అనుకూలంగా చిత్రించుట పరిపాటిగా మారింది. ఆ విధమైన అనైతిక చర్యల ద్వారా, వారు ఆనాటి సామాన్య ప్రజానీకములో, చదువురాని వారినీ, కొద్దిగా చదివిన వారిని, తప్పుదోవపట్టించి, నమ్మించి, హిందూమతమును కించపరుస్తూ వారి మత ఔన్నత్య మును చాటుకొనేవారు. ఈ విధమైన పారిభాషికా పద్ధతిని ప్రత్యర్థులపై ప్రయోగించి తద్వారా ప్రత్యర్థుల (హిందువులు, బౌద్ధులు) ప్రభావము సామాన్యులపై పడకుండా వారిని ఇతర మతములకు దూరముగా నుంచి తమ మతమునందు సంఖ్యా బలమును పెంచుకొనేవారు.

పంపకవి "జినేంద్ర కళ్యాణ అభ్యుదయ"మనే కావ్యమును వ్రాసినట్లు తెలుస్తున్నది. ఆ కావ్యము తన గురువైన జినేంద్ర వల్లభుని గురించి తెలుగులో వ్రాయబడినది. దీని రచనా కాలము, నన్నయ్య ఆంధ్ర మహాభారత రచన కంటె పూర్వమే. వాస్తవమునకు పంప, నన్నయ్యకంటే ముందుగానే తెలుగులో రచనలు చేయుట జరిగినది. కాబట్టి కాలమానమును అనుసరించి పరిశీలిస్తే, నన్నయ్యకు బదులు, తెలుగులో ఆదికవి బిరుదునకు అర్హుడు పంపకవియే. అయితే ఆయనకు బిరుదు దక్కక పోవుటకు కారణము, జైనుడగుటయే యని భావించవచ్చు. కవిత్రయములో చివరివాడైన ఎఱ్ఱాప్రగడ, పంపకవి వంటివారు వ్రాసిన కవిత్వమును హేళనచేస్తూ, గీసట బాసటలతో కూడినది కవిత్వమే కాదని త్రోసిపుచ్చాడు. తాను జైనుడయినప్పటికినీ, తన రచనలలో పరమత సహనము పాటించినాడు. వైదిక సంస్కృతిపట్ల, మరియే ఇతర సంస్కృతుల పట్లగానీ అయిష్టతను ప్రదర్శించలేదు. సాధ్యమైనంత వరకు తన ప్రజ్ఞా పాటవములను కవితా నైపుణ్యముతోనూ, ఆ రెండు సంస్కృతులనూ సమానంగా మేళవించే ప్రయత్నములనే కొనసాగించాడు. పంప భావన యందు కవిత్వ మెల్లప్పుడూ నవ్యతను కలిగి, సముద్రములోని అలలవలె నిత్యనూతనముగా ఉండవలెనని. జీవితసారమే కవిత్వమై ఉండాలి. మత సాంప్రదాయములను, సంస్కృతులను వ్యాపింపజేయగల సందేశములను ఇవ్వగలగాలి. పాఠకుల మనస్సుల యందు, శాంతిని, ప్రసన్నతనూ, స్వస్థతనూ కలుగ జేయగలగాలి. పంప భారతము పండితులలోను పామరులలోనూ మంచి ప్రచారమును పొంది, కన్నడ సాహిత్యము నందు ప్రథమ గ్రంథంగా ఆవిర్భవించింది. సాహిత్య ప్రపంచమునందు ఆ గ్రంథము యొక్క స్థాయి, ప్రాచుర్యము ఎంత ఘనకీర్తిని సంపాదించినదంటే ఆ గ్రంథములోని

పెక్కు పద్యములు, సూక్తులుగా శిలలపై లిఖింపబడినవి, అంతేకాక కరీంగనరు జిల్లాలో లిఖించిన శాసనము విక్రమార్జు నీయమునుండి గ్రహించిన ఐదు పద్య ములతో ప్రారంభింపబడినది.

ఆచార్య నిడదవోలు వేంకటరావుగారు ఇచ్చిన వివరణను బట్టి పంప అనే పదము పద్మకు అపభ్రంశరూపమనీ, కావున ఆయన అసలు పేరు పద్మకవి లేక పద్మప్ప అయి ఉంటుందన్నారు. పంప జినేంద్ర పురాణమనే మరొక ఉద్గ్రంధమును కూడా వ్రాసినట్లు తెలియజేశారు. ప్రముఖ చరిత్రకారులైన నీలకంఠశాస్త్రిగారు పంపకవి జైనమత సాంప్రదాయానుసారంగా రామాయణమును గూడ రచించినారని తెలియజేస్తూ ఆ గ్రంథము క్రీ.శ. 1275లో మరోజైనకవి రామాయణమును షట్పది చందస్సులో వ్రాయుటకు స్ఫూర్తి నిచ్చిందని చెప్పారు.

ఆ విధంగా కన్నడ సాహిత్యంలో, ఆదికవిగా ప్రఖ్యాతిగాంచిన, ఆస్థాన విద్వాం సుడు తెలుగువాడైన పంపకవి తన పార్థివ దేహమును పోదన (బోధన్, నిజామాబాద్ జిల్లా) లో వదలివేశారు. ఇటీవలి కాలంలో ఆయన సమాధిని గుర్తించుట జరిగినది. స్థానికులు దానిని పంప సమాధిఅని పిలుస్తారు. పంపకవిపేరు సమాధి పై లేకపోవుట వల్ల పండితుల అనుమానములకు తావిచ్చింది. అయితే పంపకు శుభనంది అనే పేరుగూడా ఉన్నట్లు, ఆ పేరే సమాధిపై చెక్కబడి యున్నది, కాబట్టి ఈ విషయములో అనుమానించ వలసినది లేదనీ, అది పంప సమాధియేనని పండితులు నిర్ధారణ చేశారు.

■ ■ ■

# జినవల్లభుడు

జినవల్లభుడు పంప కవి తమ్ముడు. ఇటీవలి కాలం వరకూ ఈయన అజ్ఞాతం లోనే ఉన్నాడు. ఈయన ఉనికి మొట్టమొదటిసారిగా కూరకాయల (కరీంనగర్ జిల్లా) గ్రామములో లభించిన ఒక శిలాశాసనము ద్వారా ప్రపంచమునకు తెలిసింది. ఆ శాసనమును గంగాధరం(కూరకాయల) శాసన మని పత్రికలు ప్రకటించినవి. ఆ శాసనము ద్వారానే, జినవల్లభుడు పంపకు తమ్ముడనే, సమాచారము తెలిసింది. ఈ శిలాశాసనము నందలి మరో విశిష్టత ఏమంటే, అది మూడు భాషలలో రచింప బడింది. సాంప్రదాయానుసారంగా శాసన ప్రారంభము “ఓం నమో సిద్ధేభ్యః” అని సంస్కృత భాషలో సిద్ధులకు నమస్కరించుటతో ప్రారంభమై, తరువాత కన్నడ భాషలో సుదీర్ఘమైన గద్యము వ్రాయబడినది. గద్యము ముగియగానే, తిరిగి సంస్కృత భాష యందు మూడు వృత్తములూ, కన్నడ భాషయందు ఆరు, తెలుగు భాషలో మూడు పద్యములు వ్రాయబడి, చివరగా కన్నడ భాషలో చిన్న గద్యము వ్రాయుటతో ముగిసింది. ఈ శాసనములోని అక్షరముల రూపము, చాళుక్య వంశజుడైన మహా సామంతాధిపతి రెండవ అరికేసరి వేయించిన ఇతర శాసనములలోని లిపితో సమా నముగా నున్నది. ఈ శాసనమును వేయించుటలోగల ఉద్దేశ్యము, జినవల్లభునియొక్క

జ్ఞానమును ప్రశంసించుటకూ, ఆయన కవితాశక్తినీ, ఆచరించిన ధర్మకార్యములనూ తెలియబరుస్తూ, ఆయన కీర్తిని పలువురకు చాటిచెప్పుటయే లక్ష్యమనిపిస్తుంది.

జినవల్లభుడు గొప్ప కవియే గాక, సంగీత విద్వాంసుడు కూడా. ఆ కారణంగా ఆయన వ్రాసిన కవిత్వమును స్వరబద్ధముచేసి, మధురమైన కంఠముతో రాజా స్థానములలోనూ, మత సంబంధమైన మహాసభలలోనూ పాడేవాడట. ఆయనకు అనేక, గౌరవనీయమైన బిరుదులుండేవి. సకల కళాప్రవీణ, భవ్యరత్నాకర, గుణపక్షపాతి వంటివి కొన్ని. ఆయన ఏ చందస్సు తోనైనా, సరళమైన శైలిలో పద్యరచనా విధానములను సక్రమమైన పద్ధతిలో వివరిస్తూ, అద్భుతంగా కావ్యరచన చేయగలడనే ఖ్యాతి నార్జించాడు. విద్యా విహీనుడైన వానికి కూడా, మనసులో జ్ఞానార్జన చేయవలెననే కోరికను కల్పించి, వానికి జ్ఞానబోధ చేయగల సమర్థుడుగా కీర్తింపబడినాడు. ఆ కారణంగా ఆయనను "వాగ్వధూ వల్లభు" నిగా పరిగణించారు. సాహిత్యమునందు లలిత కళలయందు ఆయన కాయనే సాటి. సాహితీవేత్త సంగీత విద్వాంసుడు, జైన మత ప్రచారకునిగానేగాక, జినవల్లభుడు, జైన దేవాలయ నిర్మాణములందు దిట్ట. సిద్ధశైలపై మొదటి నుండి చివర వరకూ, తన కులదేవతలైన జిన దేవుడు, చక్రేశ్వరి వంటి, అందరు జిన దేవీ, దేవతల విగ్రహములను చెక్కినాడు. ఆ సిద్ధుల కొండనే ఈనాడు బొమ్మల గుట్ట (కరీంనగరు జిల్లా) అని పిలుస్తున్నారు. కూరకాయల గ్రామంలోపైన పేర్కొన్న శిలాశాసనము కనుగొనిన ప్రదేశంలో మలుచ బడిన ఆ దేవీ, దేవతా మూర్తులను ఈనాడు కూడచూడవచ్చును. ధర్మపురి (కరీం నగరు జిల్లా) లో ఆయన జినాలయమును నిర్మించి, ప్రశంసలను పొందినారు. తీర్థంకరులలో ఒకరైన వృషభనాధుడు ప్రతిష్టింపబడిన వృషభాద్రిపై అనేక ఉత్సవ ములు, పండుగలు, నిర్వర్తించేవాడని ప్రఖ్యాతి గాంచాడు. ఆ విగ్రహమును పాల తోనూ, పంచామృతములతోనూ అభిషేకించేవారట. ఈ ఉత్సవమును ప్రతి సంవత్స రమూ ఎంతో వేడుకగా జరిపించేవాడు. జినవల్లభుడు భవ్య జనులందరినీ ఆరాధించేవాడు. జైన యాత్రికులు అశేష సంఖ్యలో ఆ వేడుకలను దర్శించుటకు పోగయ్యే వారు. వారికి కావలసిన ఆహారము, ఇతర సౌకర్యములు అందజేయబడేవి. దురదృష్టవశాత్తు పైన పేర్కొనిన శిలాశాసనములోని విషయములను మించి, జిన వల్లభుని రచనలేవీ లభించలేదు. లభించక పోవటంవల్ల ఆయన పాండిత్యమును

గానీ, ఆయనకు లలిత కళలయందుగల సామర్థ్యమునుగానీ శంకించ పనిలేదు. డాక్టరు నేలటూరి వేంకట రమణయ్యగారు పైన పేర్కొనిన శిలాశాసనమును పరిష్క రించినారు. ఆ సందర్భమున వారు తమ అభిప్రాయమును వెలిబుచ్చుతూ, సరళ శైలిలో మూడు భాషలలో వ్రాయబడిన ఆ శాసనము, జినవల్లభుని రచనయేనని నిర్ధారించారు. జినవల్లభుని వంటి బహుభాషా కోవిదుడూ, సంగీత విద్వాంసుడూ, స్వరకర్తా, మధుర గాయకుడు, గొప్పశిల్పిగాక, ఇతరులు ఎవ్వరూ ఆ విధమైన శాసనమును రూపొందించలేరని నొక్కివక్కాణించారు.

అత్యంత వైభవోపేతమైన ఆ శాసనములో, రచనా కాలము లిఖింపబడలేదు. అయినప్పటికీ ఆ శాసనమందు తన పోషక ప్రభువైన రెండవ అరికేసరి పేరు, అన్నగారైన పంపకవి పేరును వ్రాయుటనుబట్టి, జినవల్లభుడుక్రీ.శ. 938–958 మధ్య కాలంలో వర్ధిల్లిఉంటారనీ, ఆ కాలమునందే పై శాసనము రూపుదాల్చినదనీ ఊహించుకొన వచ్చును. పంప తన ప్రఖ్యాత కావ్యమైన విక్రమార్జున విజయమును బహుశా క్రీ.శ.941 ప్రాంతములో రచించి ఉండవచ్చును.

■ ■ ■

# పొన్న-రన్న-నాగవర్మ

**పొన్న :** కన్నడ సాహిత్యమునందు త్రిరత్నములుగా కీర్తింపబడిన తెలుగువారిలో పొన్న ఒకడు. మిగిలిన ఇద్దరూ పంపకవి, రన్న. పొన్న, పంప కవికి సమకాలీనుడేగానీ వయస్సులో చిన్నవాడు. వీరి కుటుంబముకూడా, పంపకవి కుటుంబము వలెనే వేంగీ మండలము నందలి కర్మ రాష్ట్రమునుండి పంప కవి కుటుంబముతో కలసియో, లేక వేరుగానో రాష్ట్ర కూట వంశజుడైన మూడవ కృష్ణుని (క్రీ.శ.940-949) ఆస్థానమునకు తరలివచ్చారు. ఈయన కూడా పంపకవి వలెనే ఒక జైనమత గ్రంథమునూ, ఒక పౌరాణిక గ్రంథమును రచించినాడు. జైనమత గ్రంథము పేరు "శాంతి పురాణము". హిందూ పురాణముల వలెనే జినధర్మముపై వ్రాసిన గ్రంథము. రెండవ గ్రంథము 'భువనైక రామాభ్యుదయము", రామాయణ మహాకావ్యము నాధారముగా చేసుకొని రచింపబడినది. ఇవిగాక "జినాక్షరమాల" అనే పద్యకావ్యముకూడా జైనులనూ, జిన ధర్మమునూ కీర్తిస్తూ వ్రాయబడింది. ఆయనకు ఉభయ కవిచక్రవర్తి, సర్వదేవుడనే బిరుదుల నిచ్చి మూడవ కృష్ణుడు సత్కరించాడు.

**రన్న:** త్రిరత్నములలో మూడవవాడు రన్న. ఈయన కళ్యాణి చాళుక్య చక్రవర్తియైన రెండవ తైలపుని (క్రీ.శ.993-997) ఆస్థానమును, ఆయన వారసుడైన అకలంక చరిత ఆహమల్లుని ఆస్థానమును అలంకరించినాడు. రన్న క్రీ.శ. 949లో ముదులోల అనే గ్రామములో గాజుల వ్యాపారం చేసేవారి కుటుంబములో జన్మించినాడు. ఈయన కూడా పంప, పొన్నలవలె తీరాంధ్రము నుండి వలస వచ్చినవాడే. చాళుక్యుల ఆస్థానమునందు కవి చక్రవర్తి బిరుదాంకితుడై, రాజలాంఛనములైన, బంగారు

బెత్తము, ఏనుగు, శ్వేత ఛత్రము, ఆదిగాగల వస్తువులు బహుమతిగా బడసినాడు. పొన్నవలెనే ఈయనకూడా రెండవ జైన తీర్థంకరుడైన, అజితనాధునిపై క్రీ.శ. 993లో, పది ఆశ్వాసములు గలిగి, చంపూ వృత్తమునందు పురాణమును రచించి నాడు. దాని పేరు "అజిత పురాణము". చాళుక్య సేనాపతియైన నాగవర్మ భార్య అతిమబ్బి కోరికపై రచించినట్లు తెలియజేశాడు. ఆయన వ్రాసిన మరో కావ్యము "సాహస భీమ విజయము". ఇది కూడా చంపూ వృత్తము నందే రచింపబడిన పది ఆశ్వాసములుగల గ్రంథము. మహాభారతమునందు భీమునకు దుర్యోధనునకు మధ్య జరిగిన గదాయుద్ధమును వర్ణించుటచేత, ఈ గ్రంథమునకు గదా యుద్ధమనే పేరుకూడా కలిగింది. అంతేకాక కల్యాణి చాళుక్యుల రాజైన ఇరివిబేడంగ సత్యాశ్ర యుడు (క్రీ.శ. 997-1008) సాధించిన విజయములను కూడా ఈ గ్రంథములో వర్ణించుట జరిగినది. రన్న సత్యాశ్రయునికి సాహస భీముడనే బిరుదును ఇచ్చాడు. రన్న వ్రాసిన మరో రెండు గ్రంథములు "పరశురామ చరిత్ర" మరియు"చక్రేశ్వర చరిత్ర" నేడు లభించుటలేదు. "రన్న కాండ" అనే పేరుతో ఆయన వ్రాసిన పద్య నిఘంటువు లోని చివరి పాదము "కవిరత్న" అనే మకుటంతో ముగుస్తుంది.

రన్న కవిని మొదట్లో ఆదరించిన నాల్గవ గంగరాచ మల్లుని సామంతుడైన, చాముండ (చావుండ) రాయునిపై క్రీ.శ. 978లో "చావుండ-పురాణ లేక "త్రిషష్టి లక్షణ మహాపురాణ" అనే కన్నడ సాహిత్యలోని, ప్రాచీన గద్య రచన చేసినాడు. ఈ గ్రంథమునందు ఇరువది నాలుగు తీర్థంకరుల, పన్నెండు మంది చక్రవర్తుల, తొమ్మిది మంది బలభద్రుల, తొమ్మిది మంది నారాయణుల, తొమ్మిది మంది ప్రతినారాయణుల మొత్తం అరువది ముగ్గురు వృత్తాంతములను వ్రాసినాడు.

**నాగవర్మ :** నాగవర్మ కూడా పంపకవి స్వగ్రామమైన వంగిపఱ్ఱు (వంగిపురం)కు చెందినవాడే. రన్నవలెనే చాముండరాయని ఆదరణ పొందిన వాడు. ఆయన వలెనే అజితసేనుని శిష్యుడు. "చందోమ బుద్ధి" అనే గ్రంథము కన్నడ భాషలో ఛందస్సు పై వ్రాసిన ప్రప్రథమ గ్రంథము. దానిని నాగవర్మ చాముండరాయని భార్యకు అంకిత మిచ్చాడు. ఆయన మరో ముఖ్యగ్రంథము "కర్ణాటకాదంబరి". భట్టబాణుడు సంస్కృత భాషలో వ్రాసిన కాదంబరీ కావ్యమునకు అనుసరణ గ్రంథము. మృదుమధురమైన చక్కని శైలిలో రచింపబడిన ఈ గ్రంథము అనేక విమర్శకుల ప్రశంసల నందుకున్నది.

# సోమదేవసూరి

వేములవాడ చాళుక్య రాకుమారుడు, రాష్ట్రకూట రాజైన నాల్గవ గోవిందుని సామంతుడైన, మహా సామంతాధిపతి రెండవ అరికేసరి (క్రీ.శ.930–955) ఆస్థానమందు పంప కవితో పాటున్న, రెండవ మహాకవి సోమదేవసూరి. ఈయన జైనమత శాస్త్రములయందునూ, కవిగానూ ప్రసిద్ధికెక్కిన వాడు. కొందరు పండితుల అభిప్రాయమును అనుసరించి, సోమదేవ సూరి ఉత్తర భారతమునకు చెందిన వాడనీ, జైనమతమును, రెండు వందల సంవత్సరముల కాలము క్రీ.శ. 750–958, ఆదరించి పోషించిన, వేములవాడ చాళుక్యుల ఆస్థానమునందు ఉండేవాడని చెబుతారు. సూరి అనేది ఆయన బిరుదము. యాసదేవుడను గొప్ప పండితుడు, జైనముని, అనేక సంవత్సరములు తపస్సుచేసి, శాసన దేవతలను మెప్పించి, వారితో సంబంధం ఏర్పాటు చేసుకున్నాడట. ఆయన శిష్యుడు నెమిదేవుడు, ప్రఖ్యాతి గాంచిన జిన ధర్మ ప్రచారకుడు. ఆయనను ప్రత్యర్థి మతస్థులపట్ల గొడ్డలిగా వర్ణించారు. ఆయనకు గల అనేక మంది ప్రముఖ శిష్యులలో సోమదేవసూరి, ప్రసిద్ధుడు. ఆయన జ్ఞాన స్వరూపుడనీ, కీర్తియొక్క పీఠమనీ, అందమునకు తగిన సద్గుణవంతుడనీ, కీర్తించబడినాడు. రాష్ట్రకూట రాజు, రెండవ అరికేసరికి ప్రభువైన ఒడ్డెగ దేవుడు (మూడవ

అమోఘవర్షుడు) క్రీ.శ. 934-950 నిర్మించిన శుభదమ్మ జినాలయమునకు నిర్వాహకుడుగా ఉండేవాడు. ఆయన రచించిన "నీతికావ్యామృత"మనే గ్రంథము నందు గల ఉపసంహార వాక్యములలో, తనను నేమిదేవ భగవానుని ప్రియశిష్యుడుగా చెప్పుకున్నాడు. సోమదేవ సూరికి గౌడ సంఘముతోగల అనుబంధమును, బుద్ధ గయలోనున్న రాష్ట్రకూట రాజైన ధర్మావలోకుని గురించి తెలియజేయునప్పుడు, ప్రస్తావించుట జరిగినది.

ఆయన గ్రంథములలో కెల్ల ముఖ్యమైనది "యశస్తిలకము". ఇది క్రీ.శ. 959 ప్రాంతమునందు మూడవ కృష్ణుడు, తన దక్షిణదేశ దండయాత్ర లను ముగించుకొని నేటి చిత్తూరు జిల్లాలోని మేల్పాడి వద్ద సైన్యముతో విడిదిచేసి యుండగా ఈ గ్రంథము రచింపబడినట్లు తెలుస్తున్నది. ఆ కాలములో రెండవ అరికేసరి పెద్ద కుమారుడు, మూడవ కృష్ణుని సామంతుడైన బడ్డెగ, గంగాధరము (కూరకాయల-కరీంనగర్ జిల్లా)ను, రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్నాడు. 'ఆ పట్టణము సంపదలతో పొంగి పొరలుచున్నదట. సోమదేవసూరి రెండవ గ్రంథము "యశోధన మహారాజ చరిత్ర". ఇది రాకుమారుడైన యశోధనుని దీనావస్థను వర్ణించుతుంది. "నీతి వాక్యామృత" ఆయన రచనలలో ముఖ్యమైనది. రాజకీయము, నైతిక విలువల పై రచింపబడిన గ్రంథము. ఈ గ్రంథరచనలో ఆయన లక్ష్యము తనకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలపై గల అవగాహనను వ్యక్తపరచుటయే. ఇది కౌటిల్యుని అర్థ శాస్త్రమును జైనుల దృక్పథంతో పునః పరిశీలించటమే. అందమైన శబ్ద, అర్థాలంకారములతో, ఆయన రచనాశైలి ఎంతో సుందరముగా ఉంటుంది. గ్రంథాంతములో రచించిన గద్యమును బట్టి సోమదేవసూరి, మహేంద్ర దేవుని సోదరుడనీ, మహేంద్రునకు "సయదావాదాచల సింహ", "తార్కిక చక్రవర్తి"; "వాదీభపంచానన"; "వాకల్లోల పయోనిధి"; "కవికులరాజ" ఆదిగాగల బిరుదులుండేవనీ తెలుస్తున్నది. పై గ్రంథములే కాక "సన్నావతి ప్రకరణ"; "మహేంద్ర మాలతి"; "సంజిల్వ"; "యుక్తి చింతామణి సూత్ర" అనే గ్రంథములు రచింపబడినవి. "సైదోవాదోపనిషద్" అనే పద్య గ్రంథమును, అనేక పద్యములను కూడా రచించినట్లు తెలుస్తున్నది. ఆ గ్రంథములయందు, ఆనాటి ఆంధ్ర దేశమందలి సాంఘిక, మతపరిస్థితులను, వివరించుట జరిగినది. ముఖ్యముగా జైన మతస్థితి వివరించబడినది. యశస్తిలకము నందలి ఒక వాక్యమును

బట్టి, జైనులలో కులవివక్షతను పరిగణిస్తున్నట్లు అర్థమగుచున్నది. కులవ్యవస్థలోని మొదటి మూడు కులములకు చెందినవారు ఉపనయన సంస్కారమునుకూడా జరుపు కొనేవారని తెలియబడు చున్నది. ఆనాటి ప్రభువులు, పుష్పదంతుడు, మూంజార్య, వేదిఘనగల భట్ట వంటి విద్వాంసులు సోమదేవసూరి పట్ల అత్యంత గౌరవమూ, భక్తిని ప్రదర్శించేవారు. మూడవ అరికేసరికి చెందిన పర్భని తామ్ర శాసనములను అనుసరించి, సోమదేవసూరి తన్నాదరించిన ప్రభువు గతించిన పిదప గూడా జీవించి ఉన్నట్లు తెలియుచున్నది. రెండవ అరికేసరి తమ్ముని పుత్రుడు, వారసుడైన మూడవ అరికేసరి, సోమదేవసూరికి సబ్బి మండలములోని "కుంటుంవృత్తి; "వనికాటువులు" అనే గ్రామములను, ఇచ్చి సత్కరించి నట్లు తెలియుచున్నది. దానము చేసిన వారికంటే దానము పుచ్చుకొన్నవారి కీర్తివలన, దానమునకు, దాన శాసనమునకు కూడా ప్రాశస్తము లభించినది. ఆనాటి రాజ వంశజులకు, జిన ధర్మమును బోధించి, జైన మత దీక్ష నిచ్చిన కారణంగా, ఆయన రాజగురువుగా పరిగణింపబడి, ఆపదవి నాధారముగా చేసుకొని, జైనమత వ్యాప్తికి కృషిచేశాడు. ఆయన యశస్తిలక గ్రంథము ద్వారా ఆసక్తికరమైన అనేక సంఘటనలూ విషయములూ, ముఖ్యంగా మధ్య యుగమునందు జరిగిన రాజకీయ పరిణామములు వంటి అంశములు చరిత్ర కారులకు ఉపయుక్తములు.

"నీతి వాక్యామృతము"లోని ఒక పద్యములో, లౌకికమైన చట్టములపై హక్కు సమాజమునకు చెందియున్నది. అవి సంఘమునందు ఆచరణలో నున్న, కట్టుబాట్లకు, సంప్రదాయములకు అనుకూలముగా ఉండాలి. అయితే శాంతియుత సహజీవనము పరమోత్కృష్టమైన ధర్మము. అదే సమాజమును పాలించవలెను, అని ప్రబోధించ బడినది. జైనులను ఉద్దేశించి చేసిన ప్రసంగములో, క్రొత్తగా జైన మత స్వీకారము చేసిన వారిపట్ల దయతో, ఉదారంగా వ్యవహరించాలనీ, వారు తమ పూర్వమతము లోని ఆచారములను, సాంప్రదాయములనూ, అంత త్వరగా వదలివేయలేరనీ, హెచ్చరించాడు. కైవల్యమనేది ప్రతి జైనునియొక్క ఆతిబౌధిక లక్ష్యము. జైనాగ మముల యందు నిక్షిప్తమై యున్నది. సర్వమత సమానత్వమును పాటించవలెననీ, ముఖ్యంగా హిందూ మతస్థులపట్ల, సమభావన అధికముగా నుండవలెననీ చెప్పాడు. ఇందుకు కారణము క్రీ.శ. 10వ శతాబ్దము నందు జైనుల, వీరశైవుల మధ్య మత

సంఘర్షణలు పెచ్చుపెరుగుట. సౌభ్రాతృత్వ భావనను వెలిబుచ్చినప్పటికీ, సోమదేవ సూరి హిందువులనూ, వారి ఆచారములనూ హేళన చేయకుండా విడువలేదు. వారి ఆచారములలో కొన్నిటిని, మూఢ నమ్మకములని నిందించాడు. కానీ తన మతమువారు ఆచరించు అనేక ఆచారములను పట్టించుకొనలేదు. సూర్య చంద్ర గ్రహణముల ప్రారంభ అంత్య కాలముల అనంతరం స్నానములు ఆచరించటం, సంక్రాంతి మొదలైన పర్వదినములలో, బ్రాహ్మణులకు దాన ధర్మములు చేయటం, సంధ్యా వందన మాచరించటం, ఇండ్లలో అగ్నిహోత్రమును పూజించటం, పర్వ దినములలోనూ, పుణ్య కాలములోనూ, నదులలోనూ సముద్రములలోనూ స్నానాలు చేయటం, గోవు పృష్ఠ భాగమును దర్శించి, నమస్కరించి, గో మూత్రమును శిరమున చల్లుకోవటం, నవరత్నములవంటి విలువైన రాళ్లను పూజించటం, ధరించటం, వాహనములను, యక్షులను, భూమిని, కాలమును ఆరాధించటం వంటి, ఆచారము లను పాటించు హిందువులను మూర్ఖులని దూషించాడు. అయితే ఇదే విధములైన ఆచారములను జైనులు పాటిస్తున్నప్పటికీ నోరు విప్పలేదు. జైన గృహస్థులు, హిందు వులవలెనే పంచ యజ్ఞములను ఆచరించేవారు. శకునములు, దిష్టి తగులుట, మాయలు, మంత్రాలు, తాయత్తులు, దయ్యముల వంటి, అలౌకిక, తాంత్రిక శక్తులను నమ్మేవారు. వీరశైవులు శివుని కటాక్షమునుపొంది కైలాసము చేరగలమనే నమ్మకంతో, ఎత్తైన ప్రదేశమునుండి భూమిపై పాతిన త్రిశూలము పైనబడి ప్రాణములు విడచే వారు. దీనికి "భృగుపాతదీక్ష" అని పేరు. ఈ ఆచారము ముఖ్యంగా ఉజ్జయిని, మహాకాళుని దేవాలయములోనూ, ఇతరత్రా కూడ ఆచరింపబడేది. ఈ ఆచారమును సోమదేవసూరి నిశితంగా విమర్శించినాడు. కానీ ఇంతకంటే ఘోరమైన, జైనులా చరించే "సల్లేఖన" వ్రతమును (చనిపోయే వరకు నిరాహారిగా ఉండుట) విస్మరిం చాడు. జైనులు వెంట్రుకలను, క్షుర కత్తితో క్షౌరము చేయించు కోకుండా రోమములపై బూడిదను పులిమి ఒక్కొక్క వెంట్రుకను పీకేవారు. ఇది ఎంతో బాధాకరము, అశుభ్రత కార్యమైనప్పటికీ, వారు మతమౌఢ్యముతో ఇటువంటి ఆచారములను పాటించేవారు. భట్టబాణ కవి వీరిని "కేశలుంచకులు" జుట్టు పీక్కొనే వారని హేళన చేశాడు. అదే విధంగా తెలుగులో దశకుమార చరిత్ర వ్రాసిన కేతనకూడా ఒక పద్యంలో వారిని అవహేళన చేశాడు.

దాదాపు క్రీ.శ. 10, 13వ శతాబ్దముల కల్లా, సోమదేవసూరి అవహేళనచేసిన, అన్ని ఆచారములను హిందువులవలె జైనులూ పాటించసాగారు. అంతేకాక హిందువుల, పౌరాణిక దేవతలైన వినాయకుడు, సరస్వతి, అంబిక, పద్మావతి, చక్రేశ్వరి వంటి అనేక దేవీ, దేవతలను కూడా వారు ఆరాధించేవారు. సామాన్య ప్రజలు జైనమతమును వదలి పూజలు, తిరునాళ్లు, జాతరలు జరుపుతూ పామరులను ఆకర్షించే హిందూ మతములో కలియకుండా వారిని ఆపుటకై అనేక రకములైన ప్రయత్నములలో ఇదొక భాగము. మత, సాంఘిక, సాంస్కృతిక ఆచారములు పాటించుటలో హిందువులకు అతి సమీపస్థులైనప్పటికినీ, జైన వసదులు, దేవాలయములు, వారి మత గ్రంథములు ప్రత్యర్థుల చేతులలో క్రమబద్ధంగా నాశనము చేయబడినవి. ముస్లింల పరిపాలనా కాలమునందు, దిగంబరశాఖకు చెందిన జైన మునులను, ఆ శాఖకుచెందిన ఇతర సన్యాసులను, వేటాడి అధిక సంఖ్యలో చంపి వేయటం జరిగినది. వారి ముఖము చూడటమే మహాపాపంగా భావించి హతమార్చారు.

■ ■ ■

# పద్మ ప్రభామల ధరి దేవ

కరీంనగర్ జిల్లాలోని గంగాధరము (కూరకాయల) గ్రామమునందు లభించిన శాసనము క్రీ.శ. పదవ శతాబ్దిలో నివసించిన జినవల్లభుని జీవిత వృత్తాంతమును ఏవిధంగా విశదపరచిందో, అదేవిధంగా అనంతపురం జిల్లా మడకశిర తాలూకా పాత శివారం గ్రామమునందు లభించిన మరో శాసనము, ప్రఖ్యాత జైనమత ప్రబోధకుడు, జైనమత శాస్త్రములయందు నిష్ణాతయయిన పద్మ ప్రభామలధరి దేవుని గురించి ఆ విధంగా తెలియజేసినది. పశ్చిమ చాళుక్యరాజైన మూడవ త్రిభువనమల్లుని (క్రీ.శ.1183-1190) కాలమునకు చెందిన ఆ శాసనమును అనుసరించి, త్రిభువనమల్ల భోగ దేవచోళ మహారాజు, చాళుక్యుల సామంతుడుగా హింజేరు(నేటి హేమవతి, అనంతపురం జిల్లా) రాజధానిగా పరిపాలిస్తూండేవాడు. ఆయన నోలంబ పల్లవ వంశస్థుడు. ఆయన పరిపాలనా కాలంలో, శక సంవత్సరం 1107 విశ్వావసు నామ సంవత్సరం, ఫాల్గుణమాసం, శుద్ధ చతుర్థి (క్రీ.శ. 24 ఫిబ్రవరి, 1185) పద్మ ప్రభామలధరి దేవులు కైవల్య ప్రాప్తి చెందినట్లు వ్రాయబడి యున్నది.

పాత శివారం, క్రొత్త శివారం, తొగరం, కొండ గ్రామములు, ఆ రోజులలో జైన మత కేంద్రములుగా భాసిల్లినవి. నోలంబ పల్లవ రాజులు, వారి స్త్రీలు కఠోరమైన జైన మతావలంబకులు. వారందరూ కానూరు గణ ఆచార్యుడైన కొండ కుందాచార్య సాంప్ర దాయికులు. అదే గ్రామంలో లభించిన మరో రెండు శాసనములలో జైన మతాచార్యులైన ఇద్దరి పేర్లు తెలియజేయబడినవి. వారిలో ఒకరు దేవనంది. పుష్క నంది మలధరి దేవుని శిష్యుడు. మరొకరు పద్మనంది సిద్ధాంత దేవుడు. ఈయన కానూరి గణమునకు అధిపతి.

పాత శివారములోని జైన బసదియే పద్మ ప్రభామలధరి దేవుని నివాసము. ప్రఖ్యాతి గాంచిన ఈ జైనాచార్యుడు, వీరనంది సిద్ధాంత చక్రవర్తికి శిష్యుడు. మూల సంఘమునకు చెందిన పుస్తక గచ్ఛ, దేశి గణమునకు చెందినవాడు. పద్మ ప్రభామల ధరి దేవునకు సంబంధించిన పై శాసనములలో, ఆయన మూర్తీభవించిన కరుణ, సత్యము, అహింసా గుణములుగా వర్ణించబడినాడు. జైనమత సిద్ధాంతములకూ, సాంప్రదాయములకు చెందిన ఇతిహాసములను బట్టి, ఆయన పూజనీయమైన స్థాన మును అలంకరించి యున్నాడనీ సర్వదా స్వతసిద్ధము, అనంతము, అపరివర్తనీయ మైన, పరమ సత్యమును గురించి చింతనచేస్తూ ఉండేవాడని తెలియజేసినవి. ఆయన వాదోపవాదముల యందును చర్చలయందును పాల్గొనేవాడుకాదు. వాటియందు పాల్గొనుటవల్ల ఎదుటివారి మనస్సును ఖేదపరచే అవకాశములు ఎక్కువ. జైనాచార్యు లందరికన్నా పద్మా ప్రభమలధరి దేవులు అత్యధికంగా గౌరవింపబడేవాడు.

కొండ కుందాచార్యులవారి నియమ సారముపై "తృత్పర్యాయ వృతి" అనే వ్యాఖ్యానమును రచించిరి. ఆ గ్రంథములో తనని తాను సుఖ విజ్ఞాన ప్రయోజి మిత్రుడనీ (సత్కవులకు మిత్రుడు) పంచేంద్రియ ప్రసార వర్జితుడనీ, (పంచేంద్రి యముల జ్ఞానమును వర్జించినవాడు); గాత్ర మాత్ర పరిగ్రహుడనీ (తన శరీర మొక్కటే తన ఆస్తిగా కలవాడు) వర్ణించుకున్నాడు.

ఆంధ్ర, కర్ణాటక దేశములలోని వివిధ ప్రాంతములయందు లభించిన అనేక శాసనములను బట్టి, మలధరిదేవునకు సమాజము నందలి అన్ని వర్గములకూ చెందిన అసంఖ్యాక శిష్యగణముండేది. కర్నూలు జిల్లాలోని కమ్మరచేడు గ్రామములోని

రాయశెట్టి భార్య మలధరిదేవుని శిష్యురాలైన చందవ్వ వర్ధమాన మహావీరుని విగ్రహమును ప్రతిష్ఠించినట్లు తెలుస్తున్నది. కర్ణాటక రాష్ట్రములోని, గుల్బర్గా జిల్లాలో గల నిట్టూరు గ్రామములో క్రీ.శ. 1213 ప్రాంతమునకు చెందిన శాసనమునందు జైనకాంబిక ఆయన శిష్యురాలనని తెలియజేసుకున్నది. నిడుగల్లులో లభించిన శాసనము ప్రకారము, మలధరి దేవుని ప్రత్యక్ష శిష్యుడైన నెమి పండితుని శిష్యుడు గంగేని మారయ్య ఆ ఊరి కొండపై జైన దేవాలయము నిర్మించినట్లు తెలుస్తున్నది.

సాత్త్విక గుణ ప్రధానంగా జిన ధర్మమును ఆచరించి, ప్రబోధించిన పద్మప్రభా మలధరి దేవుడు క్రీ.శ. ఇరువది నాలుగు ఫిబ్రవరి 1185వ సంవత్సరములో కైవల్యము పొందినాడు.

■ ■ ■